# తమసోమా జ్యోతిర్గమయ

డా. త్రిపురనేని హనుమాన్ చౌదరి

CTMS వారి ప్రచురణ

# తమసోమా జ్యోతిర్గమయ

## డా. త్రిపురనేని హనుమాన్ చౌదరి

మొదటి ముద్రణ : నవంబరు 2008
ప్రతులు : 1000
సర్వ స్వామ్యములు సి.టి.ఎమ్.ఎస్ వారివి.

వెల : రూ. 100/-

ప్రచురణ కర్త : డా. త్రిపురనేని హనుమాన్ చౌదరి
సెంటర్ ఫర్ టెలికాం మేనేజ్‌మెంట్ & స్టడీస్ (CTMS)
పి & టి కాలనీ, కార్ఖానా (సికింద్రాబాద్) హైదరాబాద్ - 500 009
ఫోన్ నెం: +91 (40)2784-6137 & 6667- 1191
ఫాక్స్ : +91 (40) 6667 1111

ముద్రణ : గౌతమ్ ప్రింటర్స్, హైదరాబాద్,

# తొలిపలుకులు

విద్యావృత్తిరీత్యా నేను టెలికాం ఇంజనీరును. గత పద్దెనిమిది సంవత్సరాలుగా భారత టెలికాం వ్యవస్థను ప్రైవేటీకరించి, పోటీ ద్వారా అధునాతన సాంకేతికతను ప్రవేశపెట్టి టెలికాం సేవలను అధికాధిక జనులకు అందుబాటులోనికి తీసుకురావడానికి ఉద్యమించి చాలా వరకు కృతకృత్యుడనయ్యాను. ఈ కాలంలోనే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT) ను పరిపాలనలో, వ్యాపార నిర్వహణలో వివిధ సంస్థల నుండి ప్రజలకు పలురకాలైన సేవలందించడంలో, ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజల యొక్క ప్రతి వ్యవహారంలో ఉపయోగించబడడానికి ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలు సూచిస్తూ ఒక ఉద్యమం మొదలుపెట్టి, అందులో గణనీయంగా ప్రజల మేలు కోసం పాటు పడుతూ వస్తున్నాను.

మానవుడు కేవలం సంపత్తితోనే ఏ విధంగా తృప్తి పడకూడదో, వృత్తిద్వారా సాధించిన వాటితోనే తృప్తి పడకూడదు. భారతీయ పౌరునిగా మన దేశానికి సంబంధించిన ఐతిహాసిక స్పృహ, సామాజిక భద్రతకు ప్రజల ఆర్థిక సంపత్తిని, మేధోశక్తిని, దేశంలో, సమాజంలో వివిధ రకాలుగా ఉన్న అసమానత్వాన్ని తగ్గించడం వంటి విషయాలను గూర్చి తను నేర్చుకున్నంత, తెలియవచ్చినంత, విన్నంత, కన్నంత అనుభవాల ద్వారా ప్రజల్లో అవగాహనను పెంచే భాధ్యత ప్రతి భారతీయునిపై ఉంది. ఈ భాధ్యత నిర్వహణలో మనదేశం ఎదుర్కొంటున్న పలు సమస్యల పూర్వాపరాలను అధ్యయనం చేసి, విశ్లేషించి, పరిష్కారాలను సూచించటం ఈ పుస్తకంలోని వ్యాసాల ఉద్దేశ్యం. 1998-99 మధ్య కాలంలోని పరిస్థితులు పరిశీలించి ఈ వ్యాసాలు వ్రాయబడినవి. కాల దోషానికి కొంత అవకాశం ఉన్నప్పటికీ, ఈ వ్యాసాల్లోని విశ్లేషణ నేటికీ ఉపయోగపడుతుంది. తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి సహృదయంతో కోరినంతనే ముందుమాట వ్రాసిచ్చిన ఐ.వెంకటరావు గారికి వేనవేల కృతజ్ఞతలు.

ఈ వ్యాస సంకలనకూ, ప్రథమ ప్రతుల శుద్ధికి ఎంతో కృషి చేస్తూ, నా ప్రతి వ్యాసంగానికి చోదకురాలయిన శ్రీమతి పైళ్ళ పారిజాత గారికి, శ్రద్ధతో ఈ పుస్తకము ముద్రణ చేసిన గౌతమ్ ప్రింటర్స్ వారికి కృతజ్ఞతలు.

17 సెప్టెంబరు 2008 — డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి

## “ముఖచిత్రం ఏమి సూచిస్తుంది?”

భరత ఖండం అనే పదాన్ని ప్రతి హిందువు ప్రతి శుభకార్యము / పూజా ప్రారంభంలో సంకల్పం చెబుతూ భారత భూభాగాన్ని తన మనసులో చిత్రించుకుంటాడు. ఆ భరతఖండంలోని ఎన్నో భాగాలు అన్యాక్రాంతమై అచట నుండి భారతీయ సంతతి తరిమి కొట్టబడి, భారతీయ సంస్కృతి అదృశ్యమై పోయింది. మధ్య ఆసియా, గాంధార దేశాల్లో సనాతన ధర్మం తర్వాత బౌద్ధం విలసిల్లింది. ఆయా ప్రాంతాలు మహ్మదీయుల ఆధీనంలోనికి వచ్చిన తర్వాత సనాతన ధర్మంతో పాటు బౌద్ధం కూడా అంతమొందించబడింది. ప్రపంచ విఖ్యాతమైన అత్యంత ఎత్తైన బామియన్ (అఫ్ఘనిస్తాన్)లోని బుద్ధ విగ్రహాలు గత పది సంవత్సరాల్లో ఫిరంగులతో ముస్లింలు ధ్వంసం చేశారు.

పాకిస్తాన్ - భారత్ - బంగ్లాదేశ్ కలిసియున్న అవిభాజ్య భారతంపైకి ఎంతోమంది విదేశీయులు దండయాత్రలు చేసి కాలక్రమంలో ఇక్కడే స్థిరపడి, సనాతన ధర్మాన్ని స్వీకరించి మనజీవన ప్రవంతిలో కలిసిపోయారు. కాని మహ్మదీయులైన అరబ్బులు, పారశీకులు, తురుష్కులు, మొగలులు మన దేశంమీద కేవలం రాజ్యకాంక్షతోనే కాక, మన దేశంలోని మతాన్ని అంతమొందించి, తమ మతాన్ని మనపై రుద్దటానికి శతాబ్దాల తరబడి దుష్ట, వికృష్ట పాలన సాగించారు. వీరికి పూర్వం వచ్చి మనదేశంలో స్థిరపడి, భారతీయులతో మమేకం పొందిన విదేశీయులవలె కాక, మత దురహంకారంతో వేలాది దేవాలయాలను ధ్వంసం చేసి, యుద్ధాలలో చనిపోయిన హిందూ సైనికుల భార్యలను బలవంతంగా తమ హోరెమ్‌లలోకి కొనిపోయి, వారి పిల్లలను, ఇతరులను బాగ్దాద్ మొదలగు పట్టణాలలోని బానిస విఫణులలో అమ్మారు. మతం మార్చుకోని హిందువుల మీద ‘జిజియా’ అనే పన్నును విధించి, వారి ధన, మానాలను హరించారు. అదృష్టవశాత్తు ఛత్రపతి శివాజీ నాయకత్వంలో మరాఠాలు విజృంభించి ఔరంగజేబును మట్టి కరిపించి, మొగలు సామ్రాజ్యాన్ని బ్రద్దలుకొట్టి దాదాపు యావద్భారతంలో హిందూపదపదషాహిని స్థాపించి మహ్మదీయ ప్రభువుల ఆధిపత్యాన్ని అంతమొందించి వారుకూడా భారతీయులుగా వ్యవహరించే విధంగా మనదేశాన్ని తీర్చిదిద్దారు.

సనాతన ధర్మోద్భవమైన సిఖ్ఖు పంథీయులు మొదట్లో మహ్మదీయులు హిందువుల మధ్య సహజీవన స్థాపనకు ప్రయత్నించారు. దీన్ని సహించక వారిని అణచివేతకు గురిచేసే ఔరంగజేబు మీద, తరువాతి మొగలాయిల మీద ఎదురు



తిరిగి విజయం సాధించి, పంజాబ్ నుంచి అఫ్ఘనిస్తాన్ వరకు మహ్మదీయుల ఆధిపత్యాన్ని అంతమొందించి, తిరిగి భారతీయ సార్వభౌమత్వాన్ని పాలనను సాధించారు.

దురదృష్టవశాత్తు తొలుత ‘వ్యాపారానికై’ వచ్చి, కాలక్రమేణా మనదేశంలోని అంతర్గత కలహాలను ఉపయోగించుకొని బ్రిటీష్‌వారు మరాఠాలను, సిఖ్ఖులను కూడా ఓడించి, మన స్వాతంత్ర్యాన్ని హరించి మనలను పాలించడం ప్రారంభించారు. కాలక్రమేణా భారతీయులు, (హిందువులు) తమ జాతీయతను, తమ చారిత్రక సంస్కృతిని, వారసత్వాన్ని గుర్తిస్తూ బ్రిటీష్ వారినుండి స్వాతంత్ర్యం పొందటానికి ఉద్యమించారు. స్వామి దయానంద సరస్వతి, వివేకానందులు ఆధ్యాత్మిక పరంగా, లాలా లజపతిరాయ్, లోకమాన్య బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్‌లు (లాల్, బాల్, పాల్) రాజకీయపరంగా భారతీయులను ఉత్తేజపరిచి స్వాతంత్ర్య ఉద్యమాన్ని విజృంబింప చేశారు. ఈ ఉద్యమాన్ని నీరు కార్చటం కోసం బ్రిటీష్ పాలకులు మన దేశవాసులైన ముస్లింలను హిందువులకు మరింత వ్యతిరేకంగా ఉసిగొలిపారు. తమ ఉద్యమాల ద్వారా, తమ త్యాగాలతో పోరాడి (హిందువులు) పోరాడి తెచ్చుకుంటున్న స్వపరిపాలనాధికారాల్లో, ప్రతినిధి సభల్లో జనాభాలోని తమ నిష్పత్తికి మించిన ప్రాతినిధ్యాన్ని బ్రిటీష్ వారి దయాదాక్షిణ్యాలతో మహ్మదీయులు సంపాదించుకున్నారు. స్వాతంత్ర్యము, ప్రజాస్వామ్యం తప్పక వచ్చే పరిస్థితులు ఏర్పడేసరికి 1940వ దశకం నుంచీ, దేశంలో నివసిస్తున్న ముస్లింలు మేం భారతీయులం కాము, హిందువులు అధిక సంఖ్యాకులుగా ఉన్న ప్రజాస్వామ్య దేశంలో, వారిచే పరిపాలించ బడడాన్ని మేము సహించము. కాబట్టి భారతదేశాన్ని విభజించి, భరతఖండంలోని ముస్లింలకు తమదే అయిన ‘పాకిస్తాన్’ అనే ఇస్లామిక్ రాష్ట్రాన్ని కోరుతూ, ఉధృతమైన మత కలహాల ద్వారా (ఉదా॥ 1946 ఆగస్టు 16న ప్రారంభమైన పాకిస్తాన్ కాదన్న వారిపై ప్రత్యక్ష హింసాత్మక పోరాటం) భారత విభజన సాధించి పాకిస్తాన్‌ను సృష్టించారు. తాము సృష్టించిన (ముస్లింల కోసమే ఏర్పడ్డ) పాకిస్తాన్‌కు వెళ్ళకుండా స్వాతంత్ర్యానంతరం ఇచటనే ఉండిపోయి, కొంతకాలం వరకు తమ విభాజక చర్యలను ఆపేసి, 1960వ దశకం నుంచి స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న అభారతీయ, విభాజక పంథాను తిరిగి ప్రారంభించారు. భారత జాతీయ కాంగ్రెస్ బలహీనమౌతూ ఎన్నెన్నో ప్రాంతీయ, కులతత్వ పార్టీలకు జన్మనిస్తూ వస్తుంది. ఈ పార్టీలన్నీ ఓట్లకై ముస్లింల పట్ల బుజ్జగింపు చర్యల్లో, సంతుష్టీకరణ చర్యల్లో పోటీపడుతూ, వారి అభారతీయతను, విభాజకతను పెంచి పోషిస్తున్నారు.

✧ హజ్ యాత్రకై 1956లో నెహ్రూ ప్రవేశపెట్టిన రాయితీ పెరుగుతూ, 2008 నాటికి 350 కోట్ల రూపాయలను అధిగమించింది.

✧ ప్రపంచదేశాల్లో ఎక్కడాలేని మైనారిటీ కమిషన్‌లు, మైనారిటీ కాలేజీలు, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్లు, మైనారిటీలకై (అంటే ముస్లింలకై) ఉర్దూ ఘర్, ....... అకాడమీ, షాదీఖానాలు, స్వాతంత్ర్యానంతరం రద్దు చేయబడిన రిజర్వేషన్లు తిరిగి ముస్లింలకివ్వాలని 'సెక్యులర్' పార్టీలు పోటీపడటం, ప్రతి జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల్లో వీరి కోసమై ప్రార్థనా స్థలాల నిర్మాణం, ప్రభుత్వ స్థలాల్లో హజ్ హౌజ్‌ల నిర్మాణం మరే మతస్థులకు లేని వందల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ముస్లింలకివ్వడం జరిగింది.

✧ ముస్లింలకు ప్రభుత్వ ధనంతో వివాహాలు జరపడం.

✧ ఎస్.సి/ఎస్.టి విద్యార్థులతో సమానంగా ముస్లిం విద్యార్థులకు ఫీజులను, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం చెల్లించడం.

✧ ముస్లింలు మైనారిటీ కార్పోరేషన్ల ద్వారా తీసుకున్న రుణాల మాఫీ.

✧ ముస్లిం విద్యార్థులకై ఉచిత హాస్టల్స్, (ఆవాస గృహాలు), ఉచిత ఇంగ్లీష్ మీడియం ఆవాస విద్యాలయాలు, ఉన్నత సాంకేతిక విద్యనభ్యసిస్తున్న ముస్లింలందరికీ ప్రభుత్వమే ఫీజులు చెల్లించడం; పరిమితిలేని ముస్లిం మైనారిటీ కాలేజీలున్నా, వాటిల్లోని సీట్లను హిందువులకు అమ్ముకునే స్వాతంత్ర్యానిచ్చి, ప్రభుత్వం చేత, హిందువుల చేత స్థాపించబడ్డ వృత్తివిద్యా కళాశాలల్లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం ...... ఇత్యాదులు.

✧ ముస్లిం, క్రిస్టియన్‌లకు ప్రభుత్వ ధనంతో పెండ్లిండ్లు చేయించడం.

✧ మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా క్రిస్టియన్ల జెరూసలం తీర్థయాత్రకు తలకు రూ.25 వేలు ధారాదత్తం జేయటం.

హిందువులు కులాలవారీగా, ప్రాంతాలవారీగా విభజించబడి పార్టీలు పెట్టుకుంటూ, ప్రతిపార్టీ ముస్లింల ఓట్లకోసం ఎగబడుతూ, చేతులు చాపుతూ, ముస్లింలకై వాగ్దానాల వర్షం కురిపిస్తూ, చివరకు తమ వేషాన్ని, భాషా భూషణాలను మార్చుకుంటూ, వారి ముందు హాజరై వారి పద్ధతిలో చేతులూ, కళ్ళు ముఖం పెట్టుకుని ప్రార్థిస్తున్నారు. ఏ హిందువుల పండగకు కూడా ముస్లింలు విందులివ్వకపోయినా దాదాపు ఏడు వందల సంవత్సరాలపాటు హిందువులను అణచివేసి, వారి ప్రాణాలను నాశనం చేసి, తమకై ఏర్పరుచుకున్న పాకిస్తాన్/బంగ్లాదేశ్‌ల నుండి హిందువులు తరిమి వేయబడ్డా, ఇక్కడ (భారత్‌లో) తమ జనసంఖ్యను తీవ్రగతిలో పెంచుకుంటూ, ఓట్లకై పోటీబడి, పొట్లుబడే 'సెక్యులర్' పార్టీలచే సచార్ కమిటీని వేయించుకుని కుదించుకుపోయిన భారత్‌లో 90 జిల్లాలను తమవిగా చేసుకోవడానికై, కేంద్రప్రభుత్వంలో కేవలం తమ



ప్రయోజనం కోసం ఒక మంత్రిత్వ శాఖను సృష్టించుకొని 11వ పంచవర్ష ప్రణాళికలో 15% నిధులను వీరు భుజించబోతున్నారు. రాష్ట్రపతులై; హైకోర్టు, సుప్రీమ్ కోర్టు ముఖ్య న్యాయాధీశులై; వాయుసేనకు అధిపతులై; ముఖ్యమంత్రులు, గవర్నర్లు, రాయబారులు అయి అన్నీ అనుభవిస్తూనే, "మేం వివక్షతకు గురి అవుతున్నాం," "మాకు అన్యాయం జరుగుతోంది", "మేం దుర్భర జీవితం గడుపుతున్నాం" అంటున్నారు. నిజమేనని 'సెక్యులర్'లు ముస్లింల ఓట్లకోసం అడిగినవన్నీ ఇస్తామని, అడగనివి కూడా ప్రసాదిస్తామని 'ప్రాధేయపడి' సవినయంగా ఆత్మగౌరవహీనంగా ప్రవర్తిస్తున్నారు.

హిందూ రాజకీయ నాయకులు పోటీపడి, వివిధ రకాలైన, రుచికరమైన వంటకాలతో, మిఠాయిలతో ఇఫ్తార్ విందులిస్తున్నారు. వారి ప్రార్థనాలయాల దగ్గర అతి వినయంగా, దీనంగా పైకి 'అల్లా'కై లోన 'ఓట్ల'కై ప్రార్థనలు చేస్తున్నారు.

|| వాలము ద్రిప్పు నేలఁబడి వక్త్రముఁగుక్షియుఁజూపుఁగ్రిందటన్
గాలిడి త్రవ్వుఁబిండదుని కొట్టెదుటన్ శునకంబు..... ||

అనగా, కుక్క అన్నం ముద్ద (ఓటు) వేసే వాడిముందు ఆ ముద్ద కోసమై, తోకను తిప్పుతూ, నేలపై వీపుమీద పడి, నోటినీ, పొట్టనూ చూపుతుంది. కాలితో నేలను త్రవ్వుతుంది....!

శునకము బదులు 'సెక్యులర్' నాయకులు, 'పిండం' బదులు ఓటు, పిండదుని బదులు ముస్లిం సముదాయము అని అన్వయించుకుంటే, ఆ వేషాలు మార్చి నటించే, దేవురించే వ్యక్తులకు ఈ పుస్తక ముఖచిత్రాలు ప్రతీకలు.

శతాబ్దాలపాటు తమను బాధించి, శోషించి, దోచి ఆధిపత్యం చెలాయించిన; దేశాన్ని ముక్కలుగా చీల్చిన 'అభారతీయుల'మని గర్వించిన వారి ప్రీత్యర్థం తమ దేశ సంపదనూ, ఆత్మగౌరవాన్ని ఫణంగా పెడుతున్న మన నాయకుల నేమనాలి?

అలా పెట్టిన వారిని భారతీయులు (హిందువులు) గుర్తించలేరా? గుర్తించి తమకు జరుగుతున్న ఘోర విపత్తునుంచి ఐకమత్యంతో ఎదుర్కొనలేరా? ఈ దుస్థితి వల్ల చివరికి స్వాతంత్ర్యానికే ముప్పు వస్తే, (పాపము శమించుగాక!) తిరిగి పొందగలమా? ఆ స్థాయిలో పోరాడే పటిమ నేడు ఉందా మనకు? ఆ స్థితి రాకుండానే భారతీయులంతా ఏకమైతే, మన ఓట్ల కోసం (అన్నపు ముద్దల కోసం) వీరంతా మన వద్దకే వస్తారేమో ప్రయత్నిద్దామా!

నవంబర్ 2008 **పైళ్ళ పారిజాత**

# బహుముఖ ప్రజ్ఞాశాలి

డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి గారిని నేను మొదటిసారి కలుసుకున్నది 1988లో. చైనా రాజధాని బీజింగ్‌లో! అప్పట్లో ఆయన విదేశీ సంచార నిగమ్‌కు అధిపతిగా ఉండేవారు. ఆ హోదాలో ఆయన అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ చైనా పర్యటనకు కమ్యూనికేషన్ సదుపాయాల పర్యవేక్షణ నిమిత్తం బీజింగ్ చేరుకున్నారు. రాజీవ్‌గాంధీ వెంట చాలా పెద్ద పాత్రికేయ బృందమే చైనా వెళ్లింది. ఆ బృందంలో నేనూ వున్నాను. ప్రెస్ రూమ్‌లో హనుమాన్ చౌదరి గారు తరచూ తారసపడేవారు. అప్పటి ఆ పరిచయం ఆ తరువాత ఆయన భారతీయ విద్యాభవన్ హైదరాబాద్ పాలక మండలి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు మరింత పెరిగింది. ఆ తరువాత అడపాదడపా ఆయన ఆంధ్రజ్యోతికి వ్యాసాలు వ్రాయడం, సభలు, సమావేశాలు, టీవీ షోలలో కలుసుకోవడం వంటి సందర్భాలతో మరింత పెరిగింది. హనుమాన్ చౌదరి గారిది విలక్షణ వ్యక్తిత్వం, విశిష్ట పాండిత్యం. సంప్రదాయం, సైన్స్ కలగలిసిన విజ్ఞాన సమ్మేళనం. నిర్భీతికి ఆయన మారు పేరు. ఏ చర్చలో ఉన్నా, ఏ సమావేశంలో ఉన్నా ఆయన వల్ల అది రక్తికట్టేది. అందుకు కారణం మెరమెచ్చులు లేని ఆయన సూటిదనం, అభిప్రాయాలలో భిన్నత్వం, విభేదించడానికి వెనుకాడని మనస్తత్వం.

హనుమాన్ చౌదరి గారు మామూలుగా అయితే టెలికమ్యూనికేషన్ రంగంలో సుప్రసిద్ధులు. ఆ విషయంలో ఆయనది అంతర్జాతీయ ఖ్యాతి. స్వదేశీ అగ్రగామి సంస్థలకే కాక, కొన్ని విదేశీ ప్రభుత్వాలకు సయితం టెలికమ్యూనికేషన్స్ సలహాదారుగా ఆయన వ్యవహరించారు. హనుమాన్ చౌదరి వంటి పలువురు ప్రతిభావంతుల కృషి ఫలితమే కావచ్చు, కమ్యూనికేషన్స్ రంగంలో ఈనాటి మన ముందడుగు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆలోచనా పరిధి, దైనందిన కార్యకలాపాలు మరిన్ని రంగాలకు విస్తరించాయి. ఆయన ప్రజ్ఞాపాటవాలు మరింత వన్నెతేలాయి. టెలికమ్యూనికేషన్స్ మీద ఒక అధ్యయన సంస్థను ఏర్పాటు చేయడమే కాకుండా ఒక పత్రికను కూడా నిర్వహించడం విశేషం. అదేవిధంగా ప్రజ్ఞాభారతి. మెదడుకు మేతవేసే సుప్రసిద్ధ సంస్థ. ఆయనలోని ప్రతిభా విశేషాలకు అద్దంపట్టే విధంగా ప్రజ్ఞాభారతి



అనేక అంశాలపై కొత్త వెలుగులు ప్రసరింపజేయడానికి ప్రయత్నిస్తున్నది. హనుమాన్ చౌదరి గారు శుద్ధ జాతీయవాది. భారతీయత ఆయన మతం. అందుకు భిన్నమని భావించిన దానిని తెగనాడడానికి వెనుకాడరు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిఖారసుగా నిలబడే పట్టుదల, పంతం ఆయన సొంతం.

చౌదరి గారి కార్యరంగం బహుముఖం. సమకాలీన విషయాలపైన - అవి స్వదేశీ కానివ్వండి, విదేశీ కానివ్వండి అన్నిటిపైనా సాధికారికంగా తనదైన శైలిలో సూటిగా, ధాటిగా వివరించగల, విశ్లేషించగల నేర్పు ఆయనకు అబ్బింది. అదే ఆయనను ఆంధ్రదేశంలో పేరెన్నికగన్న మేధావులలో ఒకరిగా నిలబెట్టింది. రాజకీయ, సామాజిక, మతపరమైన అంశాలు అన్నిటిపైనా ఆయన భావాలు ఏమిటో అందరికీ సుపరిచితాలు. అవి కొన్నిసార్లు వివాదాస్పదం అయ్యాయంటే, అందుకు కారణం- వాటిలోని సూటిదనం. సంక్లిష్టత. మన దేశ సామాజిక వ్యవస్థలో ఒకానొక ప్రత్యేకత. దానిని ఎంత సంకుచితంగా, ఎంత స్వార్థపూరితంగా రాజకీయం వాడుకుంటున్నదో ఆయన సోదాహరణంగా చెబుతారు. దేశంలో ప్రస్తుతం సంఘర్షిస్తున్న రెండు విచారధారలలో ఒకదానికి ఆయన భావాలు సన్నిహితం. అందువల్ల ఆయన అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరికొందరు ఏకీభవించలేకపోవచ్చు. కానీ చెవులు రిక్కించి వినవలసినంత విషయ స్పష్టత. కొన్నిటిలో దాగివున్న కఠోర వాస్తవికత. ఆయన వాదాలన్నిటిలో భారతీయత ప్రస్ఫుటం. వాదం కోసం వాదం కాక తాను చెప్పే అంశాల పట్ల నిబద్ధత.

చౌదరిగారు పేరుమోసిన వక్త మాత్రమే కాదు, సుపరిచిత రచయిత కూడా. అనేక అంశాలపై ఆయన వ్యాసాలు వ్రాశారు. వాటిలో ఎక్కువ భాగం జాగృతిలో ప్రచురితమయ్యాయి. వాటిని ఏరి కూర్చి ఒక సంకలనంగా వేశారు. దానిని ఇప్పుడు ఆంధ్రదేశం ముందు ఉంచారు. ఆయన వ్యాసాలలో చాలా భాగం జాగృతిలో ప్రచురితం. అవన్నీ ఇప్పుడు ఈ పుస్తక రూపంలో పునర్ముద్రితం. చౌదరి గారి అభిప్రాయాలు తాత్కాలిక రాజకీయ వ్యాఖ్యానాల వంటివి కావు. వాటిలో చాలాభాగం ఏ కాలానికయినా అనువర్తించేవే! వన్నె తరగనివే. చౌదరి గారి విషయ వైవిధ్యం విస్మయం కలిగిస్తుంది. దేశ రాజకీయాలు, ప్రభుత్వాల విధానాలు, మతపరమైన

అంశాలు, విదేశీ వ్యవహారాలు, కమ్యూనిస్టు రాజకీయాలు, అగ్రరాజ్యంగా అమెరికా ఆధిపత్య ధోరణులు, చారిత్రక సందర్భాలలోని కొన్ని కొత్త కోణాలు. నెహ్రూ కుటుంబ రాజకీయాలు, వారసత్వాలు- ఇవన్నీ ఆయన వ్యాసాలలో చర్చనీయాంశాలే. కొన్నిచోట్ల సునిశిత విమర్శలు, మరికొన్నిచోట్ల విసుర్లు. వీటన్నిటికి తోడు భావి భారతం, భావి ఆంధ్రప్రదేశ్ వంటి అంశాలపై కూడ ఆయన తన సునిశిత దృష్టిని సారించారు.

చౌదరి గారి వ్యాసాలలోని ప్రత్యేకతలు ప్రధానంగా రెండు. ఒకటి- లోతయిన అధ్యయనం, రెండవది సూటిదనం. ఇజ్రాయిల్ దేశ పరిస్థితులు, అరబ్ రాజ్యాలతో అది సాగిస్తున్న పోరు పట్ల ఆయనకు ఆసక్తి. సానుకూలమైన భారత్‌ను దానితో పోల్చి చూడడంలో అనురక్తి! ఇజ్రాయిల్ నుంచి మనం నేర్చుకోవలసింది చాలా ఉందని హనుమాన్ చౌదరి అంటారు. ఇలా అనడం చాలామందికి నచ్చకపోవచ్చు. కమ్యూనిస్టులకు అసలే నచ్చకపోవచ్చు. కమ్యూనిస్టులకు మింగుడు పడని అంశాలు ఈ వ్యాసాలలో ఇంకా చాలా ఉన్నాయి. సెక్యులరిజంపై ఆయన సిద్ధాంతీకరణలు కూడా! అభారతీయతే సెక్యులరిజమా? అని ఒక వ్యాసంలో ఆయన సూటిగా ప్రశ్నిస్తారు. అలాగని ఆయన అమెరికా అనుకూలవాదిగా ఎవరైనా ముద్రవేయాలనుకుంటే పప్పులో కాలేసినట్టే! ఆ విషయంలో కమ్యూనిస్టులకు ఏమాత్రం తీసిపోని వ్యతిరేకి ఆయన. అమెరికా ఆధిపత్య ధోరణులను తమ వ్యాసాలలో ఆయన నిర్ద్వంద్వంగా ఖండించారు. ఇరాక్‌పై దాడులను తీవ్రంగా నిరసించారు. అమెరికాలో నైతిక విలువల పతనాన్ని క్లింటన్ ఉదంతం నేపథ్యంలో ఆసక్తిదాయకంగా చర్చించారు. మైనారిటీ విద్యా సంస్థలు, మత ప్రచార హక్కు తదితర అంశాలపై మన దేశంలో జరుగుతున్న వాడి, వేడి చర్చ గురించి అందరికీ తెలిసిందే. ఈ అంశాలపై ఆయన అభిప్రాయాలను చూసి ఆయనను మత ఛాందసవాదిగా కొందరు పరిగణించవచ్చు. అయితే మత ఛాందసవాదాన్ని తనదైన కోణంలో చీల్చి చెండాడడంలో కూడ ఆయన వెనుకడుగు వేయలేదు. శంకరాచార్య పట్ల జయలలిత అనుచిత ధోరణిని నిరసించినట్టే, చంద్రబాబు ఓట్ల రాజకీయాలను కూడా ఆయన తమ వ్యాసాలలో తప్పుపట్టారు. రచయితగా తనను తాను నిరూపించుకోవడానికి వ్రాసినవిగా ఆయన వ్యాసాలు అనిపించవు. మన దేశానికి,



సమాజానికి మంచివి అని తాను నమ్మిన విషయాలపై అప్పటికప్పుడు స్పందించి వ్రాశారు. కొన్నిసార్లు అవి ప్రధాన పత్రికలలో వెలువడే పాపులర్ అభిప్రాయాలకు భిన్నమైనవి, సమాంతరమైనవి. కాంగ్రెసు పార్టీలో - నెహ్రూ కుటుంబ ఆనువంశిక పాలనపై ఆయన నిప్పులు చెరిగారు. కార్గిల్‌లో పాకిస్థాన్ చొరబాట్లపై దేశభక్తియుతంగా స్పందించారు.

హనుమాన్ చౌదరి గారు కేవలం రాజకీయ, మతపరమైన అంశాలకే కాక కొన్ని ఇతరేతర అంశాలపై కూడా వ్యాసాలు వ్రాశారు. దూరదర్శన్ ఏకఛత్రాధిపత్యం వల్ల అరిష్టాలు, టెలికామ్ అథారిటీ, సమాచార సాంకేతిక విజ్ఞానం - పేదరికం వంటి అంశాలపై స్పందించి రాసిన వ్యాసాలు కొన్ని ఈ పుస్తకంలో వున్నాయి. రాజ్యాంగపరమైన, ఆర్థికపరమైన మౌలిక చర్చ కూడా కొన్నిటిలో వుంది. ఆ విధంగా చూస్తే అనేకానేకాంశాలతో కూడిన విశాల వేదికగా చౌదరిగారి పుస్తకాన్ని పరిగణించవచ్చు. సమాజంలో నెలకొన్న భిన్న అభిప్రాయాలు, సంక్లిష్టతలు చౌదరిగారి వ్యాసాలలో సాక్షాత్కరిస్తాయి. చౌదరి గారి అభిప్రాయాలతో విభేదించేవారు చాలామంది ఉండవచ్చు. కానీ, ఆయన వెలిబుచ్చే ఆలోచనలు, అభిప్రాయాలలోని చిత్తశుద్ధిని, నమ్మకాన్ని మాత్రం ఎవరూ శంకించలేరు. తాను నమ్మినదానిని నిర్మొహమాటంగా, నిస్సంకోచంగా ఆయన వెలిబుచ్చిన తీరు కొన్నిసార్లు చేదు గుళికలుగా అనిపించినా నిమ్మళంగా ఆలోచిస్తే కఠోర సత్యాలుగా గోచరించక మానవు. కాకపోతే కొందరికి వాటిని బాహాటంగా చెప్పుకునే, ఒప్పుకునే ధైర్యం లేదు. ఈ పుస్తకం పుటలు తిప్పేకొద్దీ పాఠకుడిలో ఉత్సుకత, ఉత్కంఠ పోటీపడి పెరుగుతాయి. మేధావిగా, రచయితగా హనుమాన్ చౌదరి గారి ప్రతిబింబం ఈ పుస్తకం.

**ఇనగంటి వెంకట్రావు**
మాజీ ఎడిటర్, ఆంధ్రజ్యోతి
మాజీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ

హైదరాబాదు,
మే 15, 2008

# విషయసూచిక


| విషయం | పేజీ నెం |
|---|---|
| 1. నాయకత్వం కొరత | 01 |
| 2. సెక్యులరిజం విచిత్రాలు | 09 |
| 3. మోసకారి, విచ్ఛిన్నకర కమ్యూనిస్టులు | 14 |
| 4. ఆర్థిక సంక్షోభంలో తూర్పు ఆసియా దేశాలు | 19 |
| 5. రాజకీయ మతతత్వం | 22 |
| 6. 12వ లోక్‌సభ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ అనుసరించవలసిన మార్గం | 33 |
| 7. సోనియా భజన ప్రమాదకరం | 36 |
| 8. లోక్‌సభ ఎన్నికల తరువాత....... | 39 |
| 9. రాష్ట్ర ప్రభుత్వాల రద్దు | 42 |
| 10.ఇజ్రాయిల్, భారత్‌ల స్వర్ణోత్సవాలు | 44 |
| 11.నిరక్షరాస్యతే సమస్యలన్నింటికీ మూలం | 49 |
| 12.ఇజ్రాయిల్ నేర్పే పాఠాలు | 52 |
| 13.ఆరవ అణ్వస్త్ర దేశం భారత్ | 56 |
| 14 అణు పరీక్షలు ఎందుకు? | 60 |
| 15.మిత్రపక్షాల బెదిరింపులు | 64 |
| 16.సమస్యల వలయంలో స్వతంత్ర్య భారతం | 68 |
| 17.జయలలిత అనుచిత ధోరణి | 72 |
| 18.అమెరికా దురభిమానం | 75 |
| 19. కమ్యూనిస్టుల దేశవ్యతిరేక ధోరణి | 79 |
| 20. 2020 నాటికి ఆంధ్రప్రదేశ్ | 81 |
| 21. హైదరాబాద్ పోలీస్ చర్య మనం మరిచిన నిజాలు | 84 |
| 22. హైదరాబాద్‌పై చారిత్రాత్మక పోలీసు చర్య | 87 |
| 23 'మైనారిటీ' విద్యాసంస్థలు, మత ప్రచార హక్కు | 92 |
| 24. కొసావాలో అమెరికా పరిస్థితి | 95 |
| 25. విహెచ్‌పిపై కన్నెర్ర చేసిన క్రైస్తవులు | 97 |
| 26. అభారతీయతే సెక్యులరిజమా? | 99 |
| 27. కమ్యూనిస్టుల వినాశకర ధోరణి | 101 |
| 28. ఫిరాయింపుల ప్రహసనం | 108 |
| 29. ఛాందసవాద ప్రమాదాలు | 113 |
| 30. నిజాన్ని కప్పిపుచ్చే ధోరణి | 115 |
| 31. సమాచార సాంకేతిక విజ్ఞానం - పేదరికం | 118 |
| 32. టెలికం అథారిటీ - టెలికం ధరలు | 123 |
| 33. చైనీయుల ఆత్మాభిమాన గర్వం | 126 |
| 34. మహిళలకెప్పుడూ ప్రాధాన్యతే | 130 |
| 35. జనాభా పెరుగుదల - మత మౌఢ్యం | 136 |
| 36. టీచర్ల నియామకాలు - చంద్రబాబు వోట్ల రాజకీయాలు | 139 |
| 37. విభజన శక్తుల పట్ల జాగరూకత అవసరం | 142 |
| 38. ఆరవ దశకంలోకి స్వతంత్ర్య ఇజ్రాయిల్ | 147 |
| 39. వైరుధ్యాల సుడిగుండంలో కాంగ్రెస్ | 152 |
| 40. భారత ఇజ్రాయిలీలకు మైనార్టీల ముప్పు | 158 |
| 41. భారత్‌లో పాకిస్తాన్ చొరబాటు కుయుక్తులు | 162 |
| 42. విజృంభిస్తున్న 1947 నాటి ముస్లిం లీగ్ మనస్తత్వం | 171 |
| 43. కార్గిల్ ముందు - అటు తర్వాత... | 177 |
| 44. "ట్రూత్ అండ్ రికన్సెలియేషన్" గతంలో జరిగిన వాటిని మన్నించు; కాని మరిచిపోకు | 185 |
| 45. డైరక్ట్ టు హోమ్ బ్రాడ్ కాస్టింగ్‌పై దూరదర్శన్ ఆధిపత్యం ఎందుకు? | 191 |
| 46. పరువు తగ్గి పతనమైన కమ్యూనిజం | 194 |
| 47. బలపడుతున్న భారతంలో కాంగ్రెస్ వెకిలి చేష్టలు | 199 |
| 48. అనువంశిక పాలనలో అవినీతి అవతారాలు | |
| ఒకటవ భాగం - నెహ్రూకాలం | 206 |
| రెండవ భాగం - ఇందిరాగాంధీ హయాం | 213 |
| మూడవ భాగం - రాజీవ్‌గాంధీ, సోనియా హయాం | 222 |
| 49. పదమూడో లోక్‌సభ ఎన్నికలు - ఎన్నికల సంఘం | 229 |
| 50. సోనియాగాంధీ కొత్త వ్యూహాలు | 236 |
| 51. ప్రథమ ప్రధానిగా నెహ్రూ | 240 |
| 52. జవహర్‌లాల్ నెహ్రూ రోయేగా | 249 |
| 53. అమెరికాలో నైతిక విలువల పతనం | 257 |

# నాయకత్వం కొరత

**డిసెంబరు 29 , 1997- జనవరి 4, 1998**

**జనవరి 5 - 11, 1998**

నిరుద్యోగం, నిరక్షరాస్యత, శాంతి భద్రతలు క్షీణించడం, కుల సంఘర్షణలు వంటి అనేక సమస్యలకి కారణం ప్రజా జీవనంలో నీతి నిజాయితీలు తగ్గిపోవడమేనని, నైతిక విలువల పతనమేనని నాయకులు అంటారు. ప్రజలు అవినీతి మార్గాలను అవలంభించినప్పుడు నాయకులం మేం ఏం చేయగలం? అని వాళ్ళు ప్రశ్నిస్తుంటారు. 'మేము రాజకీయాల్లో ఉన్నాం. ప్రజలకు సేవ చేయడానికై అధికారాన్ని పొందాలనుకోవడం రాజకీయాల్లో సహజం' అంటారు. అధికారం చేజిక్కించుకోవాలంటే ఎన్నికల్లో గెలవాలి. ఎన్నికల్లో గెలవడానికి ప్రత్యర్థులపై వీలైన ఎక్కువ బురద జల్లాలి. గతంలో అసెంబ్లీలకి, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరిగేవి. కనుక నాలుగైదేళ్ళపాటు ఓట్లు కోసం కుమ్ములాట ఉండేది కాదు. కాని ఇప్పుడు అసెంబ్లీకి, పార్లమెంటుకు విడివిడిగా ఎన్నికలు జరపించడమే కాక మధ్యంతర ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. వీటికి తోడు జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ ఎన్నికలు ఉండడంతో నాయకులు అనేక హామీలు, వాగ్దానాలు గుప్పిస్తూనే ఉంటారు. ప్రత్యర్థుల్ని దూషించడానికి, విమర్శించడానికి కొత్త పద్దతుల్ని కనిపెడుతూనే ఉంటారు. కనుక గాలివాటు ఎటుంటే అటువైపు మాట్లాడితే సరిపోతుందనే భావన బలపడిపోయింది. నాయకులలో తాము స్వయంగా అభివృద్ధి చెందాలనే ఆలోచన కొరవడింది. పదేపదే ఎన్నికలు రావడంతో ప్రభుత్వాలు ఓట్ల వేటలో అనేక ప్రజాకర్షక పథకాలను ప్రకటిస్తున్నాయి. దీనివలన ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతున్నది. ఖజానా నింపడానికి కొత్త పన్నులు విధించడం జరుగుతోంది. ప్రభుత్వం చేపట్టిన ఏ పథకంలోనైనా ప్రజాధనం మధ్యదళారుల జేబుల్లోకి చేరుతోంది. ఈ దళారీలు అధికార పార్టీ కొమ్ము కాస్తూ ఉండడం వల్ల వారికి ప్రభుత్వం నుండి మద్దతు పుష్కలంగా ఉంటుంది. అవినీతిని అరికట్టేందుకు సరికొత్త చట్టాలు, విచారణ సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ ఇంకా ఇప్పటికీ అవినీతి 'విలసిల్లుతూనే' ఉంది.

"ప్రభుత్వాధికారుల ఆధిపత్యం చెల్లుబాటు అవుతోంది. నాయకులు కష్టపడి ఎన్నికల్లో నెగ్గినా పూర్తి అధికారం వారికి దక్కదు. అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు





వ్యవహరిస్తారు. కనుక అధికారులంతా నాయకులకంటే తెలివైన వారమని అనుకుంటే వారెందుకు ఎన్నికల్లో పోటీ చేయరు?"

"మీరెవరూ మాకు టికెట్టు ఇవ్వరు. మీకు గెలిచే అభ్యర్థి మాత్రమే కావాలి. బాగా డబ్బు ఉన్నవాడే కావాలి. నియోజకవర్గంలో అత్యధికులు ఏ కులానికి చెందినవారో అదే కులానికి చెందినవాడు కావాలి. కనుక మాకు ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఎక్కడుంది? రాజ్యసభకి మమ్మల్ని పంపవచ్చని అంటే అందుకు మీరు ఒప్పుకోరు. మీకు సినిమా తారలు, పార్టీకి నిధులు ఇచ్చినవారు, ఎమ్మెల్యే, ఎంపి టిక్కెట్లు దొరకనివారు ఉన్నారు. వారికే రాజ్యసభ టిక్కెట్లు ఇస్తారు."

'50 సంవత్సరాల తరువాత భారతదేశం – నాయకత్వం కొరత' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో పాల్గొని వస్తున్న మాతో పాటు ఉన్న ఒక మంత్రి ఒక మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు మాతో జరిపిన సంభాషణల సారాంశం పైన వివరించాను. గాంధీజీ సత్యాగ్రహానికై పిలుపునిచ్చినప్పుడు ప్రజలు సత్యాగ్రహాలు చేస్తూ అనేక కష్టాలు అనుభవించారు. లక్ష్యాన్ని సాధించడానికి అవి తప్పనిసరి అయ్యాయి. అలాగే మోజెస్ ఈజిప్ట్ ఆధిపత్యం నుండి విముక్తి పొందిన ఇజ్రాయిలీలను 28 సంవత్సరాల నెగెవ్ ఎడారి గుండా తీసుకుని వచ్చాడు. ఎడారిలో వారికి నీరు, ఆహారం లభ్యం కాకపోయినా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం వారు అతి కష్టమైన ప్రయాణాన్ని చేయడానికి సిద్ధపడ్డారు. కృష్ణుడు, జరాసంధుడికి, కంసుడికి వ్యతిరేకంగా పోరాడినప్పుడు యాదవులంతా ఆయనతోపాటు అనేక కష్టాలు అనుభవించారు. ఇళ్ళువాకిళ్ళు వదలి మధుర నుండి ద్వారకకు, అక్కడ నుండి గోమంత్‌కు వెళ్ళవలసి వచ్చింది. అయినా అధర్మాన్ని ఎదిరించేందుకు యాదవులు కృష్ణునితోపాటు ఉన్నారు.మావో అమెరికాను ఎదిరించి స్వతంత్ర్య చైనా నిర్మాణాన్ని చేపట్టినప్పుడు చైనీయులకు అనేక విపత్కర పరిస్థితులు ఎదురయ్యాయి. అయినా వారంతా వాటిని ఎదుర్కొని నిలబడ్డారు. ఈ ఉదాహరణలన్నీ చూస్తే నాయకుడు ప్రజలకు కేవలం సుఖసౌకర్యాలు కలిగిస్తానని వాగ్దానాలు చేస్తేనే అతని నాయకత్వాన్ని వాళ్ళు అంగీకరిస్తారనేది సరియైనది కాదని తెలుస్తుంది. ఉన్నతమైన లక్ష్యం ప్రజల ముందు పెడితే వారు ఎటువంటి త్యాగాలకైనా సిద్ధతపడతారు. పైన మనం చూసిన నాయకుల నీతి నిజాయితీలపై ఎప్పుడూ సందేహం వ్యక్తం కాలేదు. నాయకుడి ప్రవర్తన దోషరహితంగా ఉన్నప్పుడు, ప్రజలకు ఆదర్శవంతమైనప్పుడు ప్రజలు

తమంత తాముగా అతడి నాయకత్వాన్ని అంగీకరిస్తారు. ఇదే నాయకుడికి ఉండవలసిన ప్రథమ లక్షణం.

మన దేశంలో సహకార వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని జవహర్‌లాల్ నెహ్రూ ప్రయత్నించారు. ఇది స్టాలిన్ రష్యాలో అమలుచేసిన ఉమ్మడి వ్యవసాయ విధానం వంటిది. దానికోసం పార్లమెంటులో ఒక బిల్లు ప్రవేశపెట్టారు. రాజాజీ, కె.ఎం.మున్షీ వంటివారు దానిని వ్యతిరేకించారు. వ్యతిరేకించినవారు చాలా తక్కువ మంది కావచ్చును. కాని వారు మిగిలిన కాంగ్రెస్ ఎంపీలకందరికి నచ్చజెప్పగలిగారు. సహకార వ్యవసాయం అంటే భారత్‌లో సోవియట్ తరహా సోషలిజాన్ని ప్రవేశపెట్టడమేనని వారికి తెలియజేశారు. దీనితో బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు నెహ్రూ పార్లమెంటులో ఉన్నా కాంగ్రెస్ ఎంపిలు ఓటింగ్‌లో పాల్గొనకుండా తప్పించుకోవడంతో బిల్లు వీగిపోవడం జరిగింది. బిల్లును తిరిగి ప్రవేశపెట్టే ప్రయత్నం చేయలేదు నెహ్రూ. ఎందుకంటే ఆయనకి తన అభిప్రాయాలు, సిద్ధాంతాలకంటే అధికారం, నాయకత్వం నిలబెట్టుకోవడం ముఖ్యం. ఆ విధంగా అప్పటి నుండి నాయకత్వంలో లోపం ఏర్పడింది. నెహ్రూ తన అధికారానికై ప్రాకులాడాడు గాని తన సహచరుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. గాంధీజీ ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించేవారు. ఆయన తాను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలైనా అర్పించడానికి సిద్ధపడేవారు. ఆమరణ నిరాహారదీక్ష చేసేవారు లోకమాన్య తిలక్, సుభాష్ చంద్రబోస్, ఆచార్య కృపలానీ, కె.ఎం.మున్షీ వంటి వారు తమ అభిప్రాయాలకు, సిద్ధాంతాలకి కట్టుబడి కాంగ్రెస్ నుండి బయటకి వచ్చేశారు. ఇటువంటి నాయకులు దేశ ప్రయోజనాలను కాంక్షించి ప్రజలకు నాయకత్వం వహించేవారు. కాని ఆ తరువాత నెహ్రూ వంశం నాయకత్వపు స్థాయిని దిగజార్చింది. తన స్వార్థం కోసం ఇందిరాగాంధీ 1969లో కాంగ్రెస్‌ని చీల్చింది. తాను ఎంపిక చేసిన అభ్యర్థి తన మాట వినడని సందేహించి రాష్ట్రపతి ఎన్నికల్లో ఆ అభ్యర్థికి వ్యతిరేకంగా ప్రచారం చేయించిన ఘనత ఆమెకే దక్కింది. ఆమె 1977లో మరోసారి పార్టీని చీల్చింది. ఈ నాటకంలో ఆమె లాభపడింది. ఆమె కుమారుడు రాజీవ్‌గాంధీ కూడా ఇలాగే వ్యవహరించాలనుకున్నాడు. షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పుని సమర్థించాడు. కానీ ముస్లిములకు ఆగ్రహం కలుగుతుందనే భయంతో సుప్రీంకోర్టు తీర్పుని అమలు చేయకుండా ఉండేందుకు





రాజ్యాంగాన్ని సైతం సవరించాడు. ఇలా కాంగ్రెస్ నాయకులు నాయకత్వాన్ని భ్రష్టు పట్టించారు.

నిరక్షరాస్యత, పేదరికం, అధిక జనాభా అనేవి అనేక సమస్యలకు మూలమని అందరికీ తెలుసు. గత 50 సంవత్సరాలలో ఈ సమస్యలను పరిష్కరించడానికి తగిన శ్రద్ధ తీసుకోలేదని కూడా అంగీకరిస్తారు. పేదరికంలో మ్రగ్గుతున్న వారిలో నిరక్షరాస్యత ప్రబలితే, పేదరికం, నిరక్షరాస్యతల వల్ల జనాభా నియంత్రణ సాధ్యపడదు. రాజకీయ నాయకులు తమ ఓట్ల వేటలో పేదరికాన్ని పూర్తిగా రూపుమాపేందుకు శ్రద్ధ చూపరు. పేదవారికి హామీలు, వాగ్దానాలు గుప్పించి తమ పని పూర్తి చేసుకోవడమే వారి లక్ష్యం.

దేశంలో వివిధ ఉత్పత్తులు, సేవలు పెరిగినా ప్రజలందరికీ అవి అందుబాటులోకి రావటం లేదు. విద్యావంతుల ఆర్థికస్థాయి క్రమంగా మెరుగుపడుతున్నా పేదవారి పరిస్థితిలో మాత్రం మార్పు రావటం లేదు. నెహ్రూ వంశస్థులు (ఇందిరా, రాజీవ్) పదేపదే పేదరికాన్ని నిర్మూలిస్తామని చెపుతూ వచ్చారు. పంచవర్ష ప్రణాళికల్లో పేదరిక నిర్మూలనకి నిధులు కేటాయించడం కూడా జరిగింది. తద్వారా పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్పుకుంటుండేవారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, తమిళనాడులో డి.ఎం.కె.లు కూడా ఇదే నాటకం ప్రారంభించాయి. సినిమా తారల వల్ల కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. ఈ సినీతారలు సంపద ఉత్పత్తి చేయడం కంటే వేగంగా ఉన్నదానిని పంచిపెట్టి, రాష్ట్రాన్ని దివాళా తీసే స్థితికి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాకర్షక పథకాల కోసం నిధులు ఖర్చు చేసి మరోవైపు పన్నులను పెంచారు.

ముస్లిములను కూడా 'సెక్యులర్ పార్టీలు', ముస్లింనాయకులు తమ స్వార్థ ప్రయోజనాలకే వాడుకున్నారు. ముస్లిములలో అక్షరాస్యత 5 శాతం ఉంటే, విద్యావంతుల సంఖ్య కేవలం 3 శాతం మాత్రమే ఉందని జస్టిస్ మహ్మద్ సర్దార్ ఆలీఖాన్ అన్నారు. ఈ 50 సంవత్సరాల కాలంలో అనేక రాష్ట్రాల్లో 'సెక్యులర్ పార్టీలు' అధికారం చెలాయిస్తూ వచ్చాయి. హజ్ యాత్రలకి సబ్సిడీలు ప్రకటించడం, మైనారిటీ విద్యాసంస్థలకి నిధులు కేటాయించడం వంటివి తప్ప సాధారణ ముస్లిముల జీవన స్థాయిని పెంచే చర్యలు ఏవీ ఈ ప్రభుత్వాలు చేపట్టలేదు. అరబ్ దేశాల నుండి ఇబ్బడి ముబ్బడిగా వచ్చి పడుతున్న నిధులను కూడా ముస్లిం మత నాయకులు,

మారుమూల ప్రాంతాలలో సైతం మసీదులు కట్టడానికి, మదర్సాలు ఏర్పాటుచేసి ముస్లిములు మిగతా సమాజం కంటే ప్రత్యేకతలు కలిగినవారని వేర్పాటువాద ధోరణిని కలిగించేందుకు ఉపయోగిస్తున్నారు. అంతేకాని ముస్లిములలో విద్యని పెంపొందించడానికి, పేదరికాన్ని రూపుమాపడానికి ఖర్చుచేయడం లేదు.

ఇలా పేదరికం, నిరక్షరాస్యతలు పెరిగిపోవటం వల్ల ప్రజలు నాయకులు ఇచ్చే వాగ్దానాలు విని మోసపోతున్నారు. వీరిని 'వెనుకబడిన, బలహీన వర్గాలు, మైనారిటీలు' అని విభజించి నాయకులు తమ పబ్బం గడుపుకుంటున్నారు. పేదరిక నిర్మూలన అని గొంతు చించుకునే నాయకులెవరూ ఆయా వర్గాల్లో విద్య, ఆర్థిక స్థాయిలు పెంపొందించేందుకు కావలసిన మానసిక సంసిద్ధతని కలిగించే ప్రయత్నం చేయరు. నాయకులు ప్రజాకర్షక విధానాల ద్వారా తమ ప్రయోజనాలు నెరవేర్చుకుంటూ సమాజానికి ఎంతో నష్టం చేస్తూనే ఉన్నారు.

ఓట్లకోసం కులతత్వాన్ని పెంచి పోషించారు నాయకులు. కొత్త కొత్త కులాలను సృష్టించారు. ఈ కులాల విభజన ఎంత వరకు వెళ్ళిందంటే ఒకప్పుడు 3500 (కాకా కేల్కర్ కమీషన్) కులాలు ఉన్నాయని గుర్తిస్తే ఆ తరువాత వాటి సంఖ్య 4700 (మండల్ కమీషన్) కు పెరిగిపోయింది. కులాల పేరిట పార్టీలు ఏర్పడ్డాయి. ఆయా కులాలలో విద్యా, సాంస్కృతిక పురోభివృద్ధుల కోసం ప్రయత్నించకుండా ఈ పార్టీలు ప్రత్యేక సౌకర్యాలు, రిజర్వేషన్ల కోసం పోరాటం సాగించాయి. కుల విభేదాలను రూపుమాపి సమజంలో సమైక్యతని పెంపొందించేందుకు కృషి చేయవలసిన నాయకులు అందుకు విరుద్ధంగా భేదభావాలను కలిగించి సంఘర్షణకు దారితీశారు. వర్గపోరాటమనే రంగు పులిమారు. సమాజంలోని అన్ని కలతలకు, భేదాభిప్రాయాలకు కారణం 'ప్రభుత్వం నిరంకుశ విధానాలే'నని వీరు ప్రచారం చేశారు. స్వాతంత్ర్యం రాకముందు కమ్యూనిస్టులు ముస్లిములు ఒక ప్రత్యేకమైన జాతి అని, వారికి ప్రత్యేక దేశం కోరుకునే అధికారం ఉన్నదని వాదించారు. ఆ తరువాత వారే ఈ దేశంలో అనేక జాతులు ఉన్నాయని అనేక జాతుల సమ్మేళనమని ప్రకటించారు. ఇలా ద్విజాతి సిద్ధాంతం నుండి అనేక 'జాతుల సమ్మేళనం' వరకు సాగింది. కమ్యూనిస్టుల మహాప్రస్థానం. అందుచేత కులం పేరునగాని, మతం పేరునగాని ప్రారంభమైన వేర్పాటువాద ఉద్యమాలన్నింటికి కమ్యూనిస్టుల మద్ధతు ఉంటుంది. కాంగ్రెస్ రానురాను అంతర్గత కలహాలతో, అవినీతి పోటులతో





బలహీనపడుతుండటంతో 10% ఓట్లు కూడా సంపాదించలేని, లోక్‌సభలో 10% సభ్యులు కూడా లేని కమ్యూనిస్టులు మాత్రం కేంద్రంలో అధికారం చెలాయించగలుగుతున్నారు. ఇందిరాగాంధీకి పార్టీని చీల్చిన తరువాత లోక్‌సభలో తగినంత బలం లేకపోవటంతో కమ్యూనిస్టులు ఆమెకు సహాయం చేశారు. వాళ్ళు వేలాదిమంది పేదప్రజానీకాన్ని, నిరుద్యోగులను కూడదీసి ర్యాలీలు, సభలు నిర్వహించి ఇందిరాగాంధీకి ప్రజామద్దతు ఉందని ఆమె ప్రత్యర్థులు భ్రమించేటట్లు చేయగలిగారు. కొందరైతే కాంగ్రెస్‌లో చేరారు. తద్వారా ఆ పార్టీని తమ గుప్పెట్లోకి తీసుకుని కమ్యూనిస్టు లక్ష్యాలకు తగినట్లు దానిని మలచడం వారి ఉద్దేశ్యం. ఇలా అధికారంలో ఉన్నవారి అసహాయతని, బలహీనతని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంలో కీలకమైన పదవులను, ప్రభుత్వోద్యోగాలను, విశ్వవిద్యాలయాల్లో కీలక పదవుల్ని స్వంతం చేసుకున్నారు. 1996 ఎన్నికల తరువాత ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి వీరి ప్రభావం మరింత పెరిగిపోయింది. కాంగ్రెస్ ఫ్రంట్ ప్రభుత్వానికి మద్దతునివ్వడం ద్వారా అనేకమంది తమ నాయకులపై జరుగుతున్న విచారణలను అడ్డుకోగలిగింది. ఫ్రంట్‌లోని అనేక పార్టీల నాయకులు కూడా ఇలాగే తమపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరగకుండా చూసుకునేందుకు ప్రభుత్వాన్ని ఉపయోగించుకున్నారు.

రాజకీయాలలో నేరప్రవృత్తి పెరిగిపోతోందని గగ్గోలు పెట్టే పార్టీలే నిజానికి నేరస్థులకు రాజకీయ రంగం ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఉదాహరణకి పూలన్‌దేవికి సమాజ్‌వాది పార్టీ టిక్కెట్ ఇవ్వకపోతే ఆమె లోక్‌సభకి ఎన్నికయ్యే అవకాశం ఉందా? ఎందరో నేరస్థులు ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేస్తారు. కాని వారిలో కొద్దిమంది మాత్రమే ఎన్నికవుతారు. కనుక పార్టీ సహాయ సహకారాలు లేనిదే ఎవరూ ఎన్నికల్లో నెగ్గడం సాధ్యపడదు. రాజకీయాలలో నేరప్రవృత్తి పెరిగిపోవడానికి పార్టీలే కారణం.

రాజకీయ రంగాన్ని పరిశుభ్రంగా ఉంచాలనుకుంటే నేరచరిత్ర గలవారికి టిక్కెట్ ఇవ్వకూడదని అన్ని పార్టీలు నిశ్చయించుకోవాలి. కాని అలా జరగదు. మన నాయకుల చిత్తశుద్ధి రాహిత్యం మహిళలకి చట్టసభలలో స్థానాల కేటాయింపు విషయంలో కనబడుతుంది. మహిళలకి 33% సీట్లు కేటాయించాలని అన్ని పార్టీలు ఘోషించాయి. కాని యునైటెడ్ ఫ్రంట్‌లోని కొందరు నాయకులే దానిని వ్యతిరేకించడం

వల్ల అందుకు సంబంధించిన బిల్లు వీగిపోయింది. నిజానికి నాయకులలో చిత్తశుద్ధి ఉంటే బిల్లు అవసరం ఉండదు. అన్ని పార్టీలు మహిళలకు 1/3 వంతు స్థానాలు ఎందుకు కేటాయించకూడదు? అవినీతి విషయం కూడా ఇంతే, అవినీతిని అరికట్టేందుకు సత్యాగ్రహాలు చేయాలని ప్రజలకి పిలుపునిచ్చే మన ప్రధాని ఐ.కె.గుజ్రాల్ తన మంత్రివర్గంలో మాత్రం అవినీతిపరులకు స్థానం ఇచ్చారు. తనకు మద్ధతునిచ్చిన అవినీతి పరులపై విచారణ జరగకుండా అడ్డుకుంటున్నారు. బోఫర్స్, హెచ్‌డి డబ్ల్యూ, ఎయిర్ బస్ వంటి అనేక కుంభకోణాలలో ఆరోపణలకు గురైన రాజీవ్‌గాంధీ పేరిట విమానాశ్రయాల ఏర్పాటు జరుగుతూనే ఉంది.

నాయకత్వపు ప్రాధాన్యత ఎంత ఉంటుందో మన దేశ ప్రగతిలో విద్యావ్యవస్థ పాత్ర కూడా అంతే ప్రధానమైనది. సెక్యులరిజాన్ని 'ధర్మనిరపేక్షత' (ధర్మాన్ని పరిహరించడం) అని చెప్పినందువల్ల విద్యాలయాల్లో నైతిక విలువల బోధన పూర్తిగా మాయమై పోయింది. పాఠ్యపుస్తకాలలో పురాణ పురుషుల గాథలు, ప్రాచీన సాహిత్యం మచ్చుకైనా కనబడకుండా పోయాయి.

ఇలా చెపుతూ పోతే దోషాలు చాలా కనిపిస్తాయి. కాని ఈ దోషాలను సరిచేయాలంటే ఏం చేయాలన్నది ఆలోచించాలి. అటువంటి సంస్కరణ చాలా నిదానంగా సాగుతుంది. అయితే సంస్కరణ కోసం ప్రయత్నించాలి. అందుకు మనం అనుసరించదగిన కొన్ని మార్గాలను చూద్దాం:

★కుటుంబం సమాజ జీవనంలో ప్రాథమికమైనది. పిల్లలకి కుటుంబం ద్వారానే సచ్ఛీలం అలవరచాలి. పిల్లల పెంపకంలో శ్రద్ధ వహించాలి. ఏది మంచి, ఏది చెడు అనేది వివరించాలి.

★మన ప్రవర్తన ద్వారా పిల్లలకి విషయాలు బోధించగలగాలి.

★పాఠశాలలో ఏం బోధిస్తున్నారన్నది తల్లిదండ్రులు గమనించాలి. అధ్యాపకులు పిల్లలకు సత్ప్రవర్తనని అలవరచడానికి ప్రయత్నిస్తున్నారా అన్నది గమనించుకోవాలి.

★రాజకీయ నాయకులు చదువుకున్న వారై ఉండాలి. దాదాభాయినౌరోజీ, లోకమాన్యతిలక్, మహాత్మాగాంధీ, లాలాలజపతిరాయ్, మదన్‌మోహన్ మాలవ్య, గోపాలకృష్ణ గోఖలే మొదలైన వారంతా ఉన్నత విద్యావంతులే. బ్రిటీష్ పాలకులు కూడా వీరి విద్వత్తును గౌరవించేవారు. విషయ పరిజ్ఞానం, ఉన్నత విద్యల వల్లనే లక్ష్యశుద్ధి కలిగిన సామాజిక కార్యం చేయగలుగుతారు.





★అధికారమే రాజకీయాల పరమావధి అయినా, ఆ అధికారం స్వార్థ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజా ప్రయోజనాలకి ఉపయోగపడాలి. గత 50 సంవత్సరాల సోషలిజం విధానాల వల్ల 70 ఏళ్ళ సోవియట్ విధానాల వల్ల ప్రభుత్వం ప్రజా జీవనానికి సంబంధించి ఎక్కువగా జోక్యం చేసుకోవడం వల్ల ప్రజలలో బాధ్యత వహించే భావన తగ్గిపోతుందని, నైతికంగా, ఆర్థికంగా పతనం చెందుతారని తేలింది. నాయకులు తమ విధానాల రూపకల్పనలో ప్రజాకర్షణ కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యతలివ్వాలి.

★అసెంబ్లీలు, పార్లమెంటులకి ఒకసారి, పంచాయితీ, మండల్, జిల్లా పరిషత్‌లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాలి. దానివలన ప్రతి సంవత్సరం ఏదో ఒక ఎన్నికల మూలంగా ప్రజా జీవనంలో అంతరాయం, అలజడి కలగకుండా ఉంటాయి.

దేశ రాజకీయ రంగంలో అనేక దోషాలు చోటు చేసుకున్నాయి. కాని మనం తిరిగి 1920 ముందు నాటి నాయకత్వానికి స్ఫూర్తినందించిన ఉన్నత లక్ష్యాలను, విలువలను ఉద్ధరించుకోవాలి.

భగవద్భక్తి ఎలా ఉండాలో పోతన తెలుపుతూ

**తే. చేతులారంగ శివునిఁ బూజింపఁడేని,**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని**
**దయయు సత్యంబులోను గాఁదలఁపఁడేని,**
**గలుగనేటికిఁ దల్లులకడుపుచేటు**

భగవంతుడిచ్చిన చేతులతో కృతజ్ఞతగా పూజ చేయనివాడు, నోటితో హరికీర్తన చేయనివాడు కృతఘ్నుడు. దయ, సత్యం లేనివాడు పశుప్రాయుడైనవాడు తల్లి కడుపున పుట్టడం వృధా!

# సెక్యులరిజం విచిత్రాలు

**జనవరి 19 - 25, 1998**

సెక్యులరిజం ప్రధానంగా మైనారిటీలకు (ముస్లిములకు) సంబంధించినది. వీళ్ళు మిగిలిన ప్రజలకంటే భిన్నంగా ఉంటారు. వారిని 'ముస్లిం భారతీయులు' (సయ్యద్ షహాబుద్దీన్ అన్నట్లుగా) అనవచ్చును. వారిని 'భారతీయ ముస్లిములు' అనడం వారికి ఇష్టం ఉండకపోవచ్చు. అందుకనే ఎటువంటి సందేహాలకి తావు ఇవ్వకుండా వారిని మైనారిటీలు అనేస్తారు. మన దేశంలో జోరాస్ట్రియన్ల సంఖ్య 100,000; సిఖ్ఖులు, క్రైస్తవులు 25 మిలయన్ మంది ఉంటారు. వీరెవరూ రాజకీయ పార్టీలను ప్రభావితం చేయలేరు. వీరిలో విద్యావంతుల సంఖ్య తగినంత ఉంటుంది కాబట్టి అందరూ మూకుమ్మడిగా, గుడ్డిగా ఒక్క పార్టీకో, వ్యక్తికో ఓటు వేయరు. కాని ముస్లిములు 100 మిలియన్ నుండి 250 మిలయిన్ వరకు ఉంటారు.. వీరిలో ఎక్కువ మంది తమ మతాధికారుల ఉమ్మా ప్రకారం ఓటు వేస్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరికీ ఓటు హక్కు ఉంటుంది. కనుక మూకుమ్మడి ఓట్లు ఏ వర్గం నుండి వస్తాయో ఆ వర్గాన్ని 'సంతృప్తి' పరచేందుకు సెక్యులర్ పార్టీలు తాపత్రయపడుతూ ఉంటాయి.

ముస్లిములు మతపరంగా ప్రత్యేక జాతి అని, కనుక వారికి ప్రత్యేక దేశం అవసరమని సెక్యులర్ పార్టీలన్నీ విశ్వసిస్తాయి. ఈ వాదన 1947కి ముందే ప్రారంభమైంది. ఈ సిద్ధాంతం ప్రకారమే పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల ఏర్పాటును ఈ పార్టీలు సమర్థించాయి. భారత్‌లో నివసించే ముస్లిములు తాము ప్రత్యేకమైన జాతి అని భావించే అవకాశం ఉంది. ఎందుకంటే తాము అత్యధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వాలని ముస్లిములు అడిగినప్పుడు జమ్మూ కాశ్మీర్‌కి 370 అధికరణం ఇప్పటికే అమలులో ఉన్నది. అది తాత్కాలికమైన సౌకర్యమని అన్నవారిని మతతత్వ వాదులు, మతమౌఢ్యులు, ఫాసిస్టులు అని నిందించడం జరుగుతోంది.

కేరళలో పూర్తి సెక్యులర్ పార్టీలు (సిపిఎం, సిపిఐ, ముస్లింలీగ్) ఒక జిల్లాని (కాంగ్రెస్ పూర్తి సెక్యులర్ కాదు, అందుకనే కేవలం దేశాన్ని మాత్రమే విభజించింది) విభజించి ప్రత్యేక ముస్లిం జిల్లా మల్లపురాన్ని ఏర్పరచాయి. ఇలా దేశమంతటా





అనేక మల్లపురాలను ఏర్పరచగలగడమే 'నిజమైన సెక్యులరిజం'. ఇలా పూర్తి సెక్యులర్ పార్టీ కాకపోయినా, ఓట్ల కోసం ముస్లిములను సంతుష్టులను చేయడంలో నిరంతరం తాపత్రయపడే కాంగ్రెస్ హైదరాబాద్‌లో ముస్లిం ఆధిక్యత కలిగిన ప్రాంతం కోసం ప్రత్యేకంగా కులీకుతుబ్‌షా అభివృద్ధి సంస్థని ఏర్పాటు చేసింది. సెక్యులర్ పార్టీలన్నీ ముస్లిముల కోసం ప్రత్యేక రాష్ట్రాలు, జిల్లాలు, నగరాలు ఏర్పరచడానికి శాయశక్తులా కృషి చేస్తూనే ఉంటాయి. అలాగే అటువంటి విభజనని వ్యతిరేకించే వారిని మతతత్వవాదులని నిందిస్తూనే ఉంటాయి.

తమ ప్రత్యేక అస్తిత్వాన్ని నిలుపుకునే విధంగా ముస్లిములకి అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించాలన్నది సెక్యులరిజం మూల సిద్ధాంతం. అందుకనే ఉర్దూ విశ్వవిద్యాలయాల ఏర్పాటు; ఉర్దూని అధికార భాషగా ప్రకటించడం; దూరదర్శన్‌లో, ఆకాశవాణిలో ఉర్దూ కార్యక్రమాల ప్రసారం; వృత్తి విద్యాకోర్సుల్లో ఉర్దూని మాధ్యమంగా చేయడం వంటివి జరుగుతున్నాయి. 1947కి ముందు నిజాం ఉర్దూని మాత్రమే విద్యాబోధనకి మాధ్యమంగా నిర్ణయించినపుడు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అదే పని తాము ఎందుకు చేయకూడదని సెక్యులర్ పార్టీలు భావించాయి. ఉర్దూ ముస్లిముల (మైనారిటీల) భాష కనుక సెక్యులరిజం దానిని అంగీకరిస్తుంది.

ఉమ్మడి పౌరచట్టాన్ని అమలు చేయాలని రాజ్యాంగంలో సూచించబడిన ఆదేశిక సూత్రాన్ని సెక్యులరిస్టులు అంగీకరించారు. అటువంటి పౌరచట్టం అమలుకు ముస్లిములు అంగీకరించనంత వరకు అందుకు ప్రయత్నించకూడదని వాళ్ళు తేల్చి చెపుతూ ఉంటారు. మత, లింగ వివక్షత రాజ్యాంగ వ్యతిరేకమని అందుకని ఉమ్మడి పౌరచట్టం ఉండాలని అంటే మైనారిటీల వ్యక్తిగత చట్టాలలో జోక్యం చేసుకోరాదని, అవి పవిత్రమైనవని సెక్యులరిస్టులు వాదిస్తారు. ఇటువంటి రాజ్యాంగ సూత్రాలను సవరించాలని, లేదా అవి మైనారిటీలకు వర్తించకుండా మినహాయింపు ప్రకటించాలని తద్వారా ముస్లిముల షరియత్‌ని పరిరక్షించాలని సెక్యులరిస్టులు భావిస్తారు. ఈ విషయంలో తమ శ్రద్ధాభక్తుల్ని నిరూపించుకునేందుకు కాంగ్రెస్, ముస్లింలీగ్, కమ్యూనిస్ట్ పార్టీ షాబాను కేసులో సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించి రాజ్యాంగాన్ని సవరించాయి.

మైనారిటీ మత, భాషా సంస్కృతుల పరిరక్షణకై ప్రత్యేక మైనారిటీ విద్యాలయాలను ఏర్పరచేందుకు ఉద్దేశించిన 20వ అధికరణానికి సెక్యులరిస్టులు

తమ స్వంత భాష్యం ఇస్తూ ఉంటారు. మైనారిటీ విద్యాసంస్థ పేరున ఇంజనీరింగ్ కాలేజీలు, బిఇడి కాలేజీలు స్థాపించి వాటిలో – డొనేషన్లు తీసుకొని హిందువులను కూడా చేర్చుకోవడం, తద్వారా డబ్బు గడించడం వంటివి సెక్యులరిస్టులు చూసి చూడనట్లు ఊరుకుంటారు. పైగా ఇంజనీరింగ్, బిఇడి విద్యలకి మతంతో సంబంధం ఏమిటని వాదిస్తారు. అలాగే 2.5% జన సంఖ్య కూడాలేని మైనారిటీల పేరున మొత్తం టీచర్ ట్రైనింగ్ కళాశాలల్లో 30% వరకు మంజూరు చేయడాన్ని ప్రశ్నించే 'హిందూ మతతత్వ వాదుల్ని' సెక్యులరిస్టులు ఖండిస్తారు. ఒకప్రక్క ప్రత్యేక రిజర్వేషన్ల కోసం పోరాడుతూ, మరోప్రక్క ఇన్ని కళాశాలలను కలిగి ఉండటం ఏమిటి అని ప్రశ్నించేవారిని ఖండిస్తారు. మైనారిటీల విద్యాసంస్థలు డబ్బు గడించడానికి అడ్డదారులు తొక్కుతున్నాయనేది కేవలం ఫాసిస్టులు చేసే అసత్య ప్రచారమని సెకులరిస్టులు ప్రకటిస్తారు.

మైనారిటీలు పరిమిత సంతానాన్ని కలిగి ఉండనవసరం లేదని, ఆడ పిల్లలను పాఠశాలకి పంపే అవసరం లేదని, ఆర్థిక ప్రగతికి, ప్రభుత్వోద్యోగాలు సంపాదించడానికి అవసరమైన విద్యని ప్రక్కకు పెట్టి మదర్సాలలో ఉర్దూని, ఖురాన్‌ని, అరబిక్ భాషని నేర్చుకోవడమే వారి మత కర్తవ్యమని సెక్యులరిస్టులు విశ్వసిస్తారు. ఇక వారి విద్యాస్థాయి, వారి అర్హతలు బట్టి కాకుండా వారి సంఖ్యను బట్టి మైనారిటీలకి రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని వీరు వాదిస్తారు. వారికి అన్నిరకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలి. వారిని వెనుకబడిన వర్గంగా ప్రకటించాలి.

మైనారిటీలు తాము ఉపయోగించే కరెంటుకు, నీటికి తగిన బిల్లులు ఎందుకు చెల్లించరని, కరెంటు చౌర్యం ఎందుకు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందని ఎవరైనా అడిగితే సెక్యులరిస్టులు విరుచుకుపడతారు. మైనారిటీలలో బీదవారు ఎక్కువ కనుక వారికి ఉచితంగానే విద్యుత్ ఇవ్వాలని వీరి వాదన.

ప్రభుత్వ సబ్సిడీతో మైనారిటీలు (ముస్లిములు) మక్కా పవిత్ర యాత్రకి వెళ్ళవచ్చును. ప్రభుత్వం సబ్సిడీని పెంచుతూ పోవచ్చును, అలాగే హజ్‌యాత్రకి వెళ్ళేవారి సంఖ్యను పెంచవచ్చును. ప్రతి రాష్ట్రం రాజధానిలో హజ్‌యాత్రికుల కోసం అతిథిగృహాలను నిర్మించవచ్చును. కాని హిందువులు తమ తీర్థయాత్రలకై సౌకర్యాలు కల్పించమని అడిగితే మటుకు అది మతతత్వం.





ఏ ఏ పాఠశాలల్లో ముస్లిం విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే వాటిలో ఆదివారానికి బదులు శుక్రవారం, శనివారం సెలవు ఇవ్వవచ్చును. వాళ్ళు స్కూలు యూనిఫాం వేసుకోనవసరం లేదు. వారి మత సూత్రాల ప్రకారం ప్రత్యేకమైన దుస్తుల్ని ధరించవచ్చు.

ముస్లిముల మనోభావాల్ని అందరూ గౌరవించాలి. మాతృభూమిని స్తుతిస్తూ వందేమాతర గీతాన్ని ఆలపించడం వారి మత విశ్వాసాలకు విరుద్ధం కనుక అందుకు ముస్లిములు అంగీకరించకపోతే వందేమాతర గీతాలాపన తొలగించాలి.

అలాగే ముస్లిములలో పేదవారు ఎక్కువ కనుక వారు ఏ ప్రభుత్వ స్థలాన్నైనా ఆక్రమించవచ్చును, అందుకు వారిని ఏమీ అనకూడదు. హిందువులు మాత్రం అలాంటి ఆక్రమణకి పాల్పడకూడదు. ఎందుకంటే హిందూ సమాజం పేదరికాన్ని దూరం చేసుకోగలిగి కూడా వివిధ రకాల వివక్షతతో విభేదాలతో సతమతమవుతోంది. అది హిందుత్వపు దోషం.

ముస్లిములకి లోక్‌సభ, అసెంబ్లీలు, జిల్లాపరిషత్ వంటి వాటిలో 20 నుండి 25 శాతం స్థానాలు కేటాయించాలని సెక్యులరిస్టులు కోరుతూ ఉంటారు. వారికై ప్రత్యేక నియోజక వర్గాలు కూడా ఏర్పాటు చేయాలి. భారత్‌లో ముస్లిములకు 1947కు ముందు ఉన్న హోదాని తిరిగి కల్పించాలని తీర్మానించిన ముస్లిం మిల్లీ పార్లమెంట్ నిర్ణయాన్ని సెక్యులరిస్టులు ఆమోదిస్తారు.

కాశ్మీర్ నుండి తరిమి వేయబడిన పండిట్‌లు మనువాదులు కాబట్టి, వారు మైనారిటీలతో సహజీవనం సాగించలేక పోయారు. కనుక వారిని అలా చేయడం సెక్యులరిస్టుల ప్రకారం తప్పుకాదు. జమ్మూ, లేహ్ ప్రాంతాలకి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలన్నది హిందూ మతతత్వ వాదుల కోరిక అని సెక్యులరిస్టులు భావిస్తారు.

ముస్లిముల సంక్షేమానికి అవసరమైనన్ని నిధులు కేంద్రప్రభుత్వం కేటాయించడం లేదని సెక్యులరిస్టుల ఫిర్యాదు. హిందువులు అధిక సంఖ్యలో ఉన్న రాష్ట్రాలకి అంతకంటే తక్కువ నిధులు కేటాయించబడుతున్నాయనే వాదనలో నిజం లేదని, ఇది మైనారిటీ వ్యతిరేకులు చేసేవాదనని వారు అంటారు.

ఇలా అనేక అంశాలలో ముస్లిములను సంతుష్టపరచే ప్రయత్నం చేయాలన్నది సెక్యులరిస్టుల తాపత్రయం. సెక్యులరిస్టులకి సోషలిజం, అవినీతి మొదలైన విషయాలు

ఏవీ పట్టవు. ఇందుకు వారు ఇచ్చే సమాధానం తాము యదార్థవాదులమని హిందూ మతతత్వ వాదం అన్నిటికంటే ప్రమాదకరమైనదని, అందుచేత దానిని ఎదుర్కొనేందుకు మైనారిటీలను సంరక్షించేందుకు తాము ప్రాధాన్యతనిస్తున్నామని చెపుతారు.

మైనారిటీల (ముస్లిముల) మతం అత్యంత పవిత్రమైనది కనుక ప్రతి ముస్లిము అనుసరించవలసిన జీవన విధానం నిర్ణయించబడింది కనుక ముస్లింల విద్య, మానవహక్కులు, స్త్రీ హక్కుల విషయంలో ఎవరూ కల్పించుకోరాదని సెక్యులరిస్టుల విశ్వాసం. కాని వీరే హిందూ దేవాలయాలు, సిఖ్ఖు గురుద్వారాలకు సంబంధించిన ఆస్తులను తమ ఇష్టం వచ్చినట్లు ఉపయోగిస్తారు. వక్ఫ్ బోర్డులకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన నియమనిబంధనలను వీరు వ్యతిరేకిస్తారు.

ముస్లిములు ముస్లింలీగ్, రజాకర్ ఉద్యమం నుండి పుట్టిన ఎంఐఎం, సయ్యద్ షాబుద్దీన్, అబ్దుల్లా బుఖారీ నాయకత్వాన్ని అంగీకరిస్తారు కానీ, అబుల్ కలాం ఆజాద్, రఫీ అహ్మద్ కిద్వాయ్, ఎం.సి.చాగ్లా వంటి వారిని కాదని కనుక తాము ముస్లిముల భావాలను గౌరవించి వారినే నాయకులుగా గుర్తిస్తామని సెక్యులరిస్టులు అంటారు. సెక్యులరిజం సంకీర్ణ సంస్కృతిపై నిర్మించబడింది. ఇది పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో సాధ్యపడదు. హిందుత్వం వామపక్ష వ్యతిరేకమైనది, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనది; తిరోగమన విధానం, సామ్రాజ్యవాద మద్ధతుదారు అని సెక్యులరిస్టుల నమ్మకం! అటువంటి మతాన్ని మైనారిటీ మతంతో పోల్చరాదని వారి దృఢవిశ్వాసం!

**క. పలికెడిది భాగవతమఁట**
**పలికించువిభుండు రామభద్రుండఁట నేఁ**
**పలికిన భవహరమగునఁట**
**పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా**

శ్రీమదాంధ్ర మహాభాగవతం ప్ర.స్క.

పలుకుతున్నది భాగవతం. పలికించేవాడు శ్రీరామచంద్రుడు. నేను పలికిన పాప పరిహారమౌతుందట. ఇక వేరువారి గురించెందుకు పలకాలి? అని ప్రశ్నించాడు బమ్మెర పోతన.





# మోసకారి, విచ్ఛిన్నకర కమ్యూనిస్టులు

**జనవరి 26 - ఫిబ్రవరి 1, 1998**

ఒకప్పటి సోవియట్ రష్యా ఆశీస్సులతో మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. 70 ఏళ్ళ తరువాత ప్రస్తుతం దేశంలో 10 రకాల కమ్యూనిస్టు పార్టీలు వెలిశాయి. ఇవన్నీ కలిపి లోక్‌సభ ఎన్నికల్లో 10 శాతానికి మించి ఓట్లు సంపాదించలేకపోయాయి. ఇవి కేవలం పశ్చిమబెంగాల్, త్రిపుర , కేరళ రాష్ట్రాలకు పరిమితమయ్యాయి. ఐతే కమ్యూనిస్టు భావాలు కలిగిన వారు మాత్రం పత్రికారంగంలోనూ, విశ్వవిద్యాలయాలలోను చొరబడ్డారు. వాళ్ళు కాంగ్రెస్ పార్టీలోకి కూడా చొరబడ్డారు. వారి ద్వారా ఇందిరా గాంధీ పార్టీపై తన పట్టును మరింత పెంచుకున్నారు. హెచ్.ఆర్, గోఖలే వంటి సిపిఐ నాయకులు కాంగ్రెస్‌లో చేరి తద్వారా ఆ పార్టీని కమ్యూనిస్టు ప్రయోజనాలకు తగినట్లు మలచాలని ప్రయత్నించారు. వీళ్ళు ఇందిరాగాంధీ మంత్రివర్గంలో స్థానాలు కూడా సంపాదించారు. పౌరహక్కుల సంఘం, ప్రజా ప్రతిఘటన, జన విజ్ఞానం, ప్రజా నాట్యమండలి వంటివి కమ్యూనిస్టులు ఏర్పరచుకున్న సంస్థలు. ప్రజా మద్దతు, సమర్దన ఏమాత్రం లేకపోయినా కమ్యూనిస్టు పార్టీలు జాతీయ పార్టీలుగా పేరు పొందాయి. కాంగ్రెస్ పార్టీ పరాజయం పాలు కావడంతో కమ్యూనిస్టులు 11వ లోక్‌సభలో యునైటెడ్ ఫ్రంట్‌లోని పార్టీలన్నింటిపైన ఆధిపత్యం చెలాయించగలిగారు. కలలో కూడా కేంద్రమంత్రిత్వ పదవులను ఊహించలేని జిల్లాస్థాయి, ప్రాంత స్థాయి పార్టీలు అన్నీ ఒక చోట కూడి అతుకుల బొంత ప్రభుత్వాన్ని ఏర్పరచాయి. ఈ కూటమికి సారథ్యం వహించింది ఎటువంటి ప్రజాసమర్థన లేని సిపిఎం హరికిషన్ సింగ్ సుర్జిత్. కాంగ్రెస్ మాదిరిగానే ప్రభుత్వం బయటనే ఉండి అధికారం చెలాయించాలని ప్రయత్నించింది సిపిఎం. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఎలా పని చేయాలన్నది నిర్ణయిస్తూ వచ్చింది. సిపిఐ మాత్రం అధికారాన్ని చేజిక్కించికునేందుకు కేబినెట్‌లోనే చేరింది. కమ్యూనిస్టులు తమ సిద్ధాంతపు 'నిజరూపాన్ని' కప్పిపుచ్చుకునేందుకు 'సెక్యులరిజం' అనే ముసుగు తొడుక్కున్నారు. సెక్యులరిజం, సోషలిజం మాదిరిగానే నిర్వచించలేని 'బ్రహ్మపదార్థం'. కమ్యూనిస్టులు ప్రజలను మభ్యపెట్టేందుకు, మోసగించేందుకు అనేక కొత్తకొత్త విషయాలు మాట్లాడుతూ ఉంటారు.

మొదట వాళ్ళు బిజెపి ఫాసిస్టు సంస్థ అని, తాము మాత్రమే ప్రజాస్వామ్య పరిరక్షకులమని అంటారు. కాని ఏ కమ్యూనిస్టు రాజ్యంలోనూ రెండు పార్టీలు లేవన్నది చారిత్రక సత్యం. అలాగే కమ్యూనిస్టులు తప్ప ఏ పార్టీ కార్మిక సంఘాల్ని ఏర్పరచలేదు. కమ్యూనిస్టు పార్టీయే అధికారంలో ఉండేది. పత్రికలు, ప్రసార సాధనాలు కమ్యూనిస్టుల చేతిలోనే ఉండేవి. సోవియట్ రష్యా పతనం కావడంతో అనేక పార్టీలు తలెత్తాయి. దీనిని బట్టి ఓటర్లలో తమకి 99 శాతం సమర్థన ఉన్నదని కమ్యూనిస్టులు చెప్పుకున్నా నిరంకుశపాలన మూలంగా ఇతర పార్టీల ప్రభావం, సమర్థన బయటపడలేదని తెలుసుంది. ప్రస్తుతం ప్రపంచంలో క్యూబా, ఉత్తర కొరియా, వియత్నాం, చైనాలు మాత్రమే కమ్యూనిస్టు రాజ్యాలుగా మిగిలాయి. ఈ దేశాలలో వేటిలోనూ రెండు పార్టీలు లేవు. కనీసం భారత్‌లో మాదిరిగా వేరువేరు కమ్యూనిస్టు పార్టీలు కూడా లేవు. మరి ఇటువంటి కమ్యూనిస్టులు ఏ 'ప్రజాస్వామ్యన్ని' పరిరక్షించాలనుకుంటున్నారు? వీరు కనుక అధికారం చేపడితే సోవియట్ రష్యా, తూర్పు యూరప్ దేశాలు, లేదా ప్రస్తుత కమ్యూనిస్టు రాజ్యాలలో మాదిరిగా ఏక పార్టీ పాలన, కమ్యూనిస్టేతర భావాల అణచివేతకి పాల్పడతారు. ఎన్నికల కమీషన్ కోసం వారు ప్రకటించే ప్రజాస్వామ్యబద్ధతని నిజమేనని నమ్మి వారికి అధికారం కట్టబెట్టాలని ఆశిస్తున్నారు. అలాగే బిజెపి సెక్యులరిజం గురించి మాట్లాడకూడదని, దానిని మనం నమ్మరాదని భావిస్తున్నారు. ముస్లింలీగ్ ఎంఐఎంలతో పొత్తు సెక్యులరిజమేనని వీరు నమ్మించాలని చూస్తున్నారు. నిజానికి కమ్యూనిస్టుల ఏకపార్టీ పాలన మాదిరిగానే ముస్లిం పార్టీలు ముస్లిం రాజ్యాలను ఏర్పరచాలని ప్రయత్నిస్తున్నాయి. పాకిస్తాన్ , బంగ్లాదేశ్‌ల వంటి ముస్లిం రాజ్యాలలో సెక్యులరిజం మచ్చుకైనా కనిపించదు.

అధికారం చేజిక్కించుకున్న దేశాలన్నింటిలో కమ్యూనిస్టులు హింసావాదాన్ని, వేర్పాటువాదాన్ని పెంచి పోషించారు. కానీ మన కమ్యూనిస్టులు మాత్రం తాము అహింసా విధానానికి కట్టుబడి ఉన్నామని నమ్మించాలని ప్రయత్నిస్తున్నారు. బిజెపి హింసని ప్రోత్సహించే ఫాసిస్టు పార్టీ అని విమర్శిస్తారు.

తాము అవినీతిని అంతం చేస్తామని కూడా చెపుతూ ఉంటారు కమ్యూనిస్టులు. కాని సోవియట్ రష్యాలో, ప్రస్తుతపు చైనా, వియత్నాంలలో అనేకమంది కమ్యూనిస్టు నాయకులు ప్రభుత్వ అధికారులు అవినీతి పరులని స్వయంగా కమ్యూనిస్టులే





అంగీకరించారు. తమ పాలనా వ్యవస్థ నైతిక విలువలను పెంపొందిస్తుందని వారు ప్రకటిస్తుంటారు. కాని 70 సంవత్సరాల కమ్యూనిస్టు పాలనలో సోవియట్ రష్యాలో నీతిమంతులైన నాయకులు రూపొందలేదు. ప్రజలలో కూడా మద్యపానం, బద్ధకం, ప్రభుత్వ ఆస్తుల దోపిడీ, అవినీతి, హింస, దొంగవ్యాపారం వంటివి వ్యాపించాయి. భారతీయ కమ్యూనిస్టులకి కూడా లాలూప్రసాద్ యాదవ్, ములాయం సింగ్, సుల్తాన్ సలాఉద్దీన్ ఓవైసీ వంటి నేరస్థులు, అవినీతిపరుల సహచర్యం చాలా సంతోషంగా ఉంటుంది. ఇక అనేక అవినీతి కేసుల్లో విచారణ సాగుతున్న కాంగ్రెస్ నాయకుల సమర్థన తీసుకునేందుకు వారికి ఏమాత్రం సందేహం ఉండదు. వారికి అవినీతి అంతం కంటే సెక్యులరిజమ్ ముఖ్యమా? కమ్యూనిస్టులు కులతత్వ నిర్మూలన గురించి కూడా మాట్లాడుతూ ఉంటారు. వీరు కులాన్ని 'వర్గం'గా భావించే వర్గపోరాటాన్ని సమర్థిస్తున్నట్లుగా కులతత్వనేతలైన ములాయం సింగ్, లాలూప్రసాద్ యాదవ్‌లను సమర్థిస్తారు. స్త్రీలకు సమాన హక్కులు అని ఘోషించే వీరు సోవియట్ రష్యాలోగాని, భారత్‌లో వీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోగాని, చివరికి పార్టీలోగాని స్త్రీలకు స్థానం కల్పించకపోవడం విచిత్రం. మరి స్త్రీలకి చట్టసభల్లో 33 శాతం స్థానాల కేటాయింపుని తాము సమర్థిస్తామనే వీరి మాటల్ని నమ్మడం ఎలా?

పేదరిక నిర్మూలనకు, అక్షరాస్యత, విద్యలను పెంపొందడంలో విఫలమయ్యారని కాంగ్రెస్ ప్రభుత్వాలను విమర్శిస్తుంటారు కమ్యూనిస్టులు. కాని వారు 1978 నుండి పశ్చిమ బెంగాల్‌ని పరిపాలిస్తున్నారు. ఈ రాష్ట్రంలో అక్షరాస్యత, విద్యాస్థాయిలు మిగిలిన రాష్ట్రాలకంటే ఎక్కువగా లేవు. గ్రామాలలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వీటికి వేటికీ విదేశీ ఋణాలు అవసరం లేదు. కనుక పేదరిక నిర్మూలన అనేది వట్టి నినాదమేనని తేలిపోయింది.

ఇక సెక్యులరిజం అంటే కమ్యూనిస్టుల దృష్టిలో ఏమిటోచూద్దాం. భారత్‌లో మైనారిటీలు అంటే ముస్లిములు అనే అర్థం బలపడిపోయింది. కమ్యూనిస్టులు మైనారిటీలకి అందిస్తున్న ఏకైక సహాయం బంగ్లాదేశ్ నుండి వచ్చే అక్రమ చొరబాటుదారులకి పశ్చిమ బెంగాల్‌లో ఆశ్రయం ఇచ్చి, ఈ తరువాత వారిని మిగిలిన రాష్ట్రాల్లోకి ప్రవేశపెట్టడం, బహుభార్యత్వం, అధికసంతానం, ఉర్దూ విద్య మొదలైనవి తమ ప్రగతికి అవరోధాలవుతున్నాయని ఎప్పుడైనా కమ్యూనిస్టులు ముస్లిములకి తెలియజెప్పే ప్రయత్నం చేశారా? అస్పృశ్యత, వరకట్నం వంటి

దురాచారాలను తీవ్రంగా విమర్శించే కమ్యూనిస్టులు బహుభార్యత్వాన్ని, మహిళలకు జరుగుతున్న అన్యాయాలను (తలాక్, ఆస్తిహక్కు లేకపోవడం) వంటి వాటి గురించి మాత్రం మాట్లాడరు. మైనారిటీలను సంతృప్తిపరచడమే వీరి సెక్యులరిజం. ఖురాన్ అతి పవిత్రమైనదని, భగవంతుడే స్వయంగా దానిని ఆఖరు ప్రవక్త అయిన మహ్మద్‌కు అందించాడని, కనుక అందులోని జిహాద్, మతమార్పిడులు, కాఫిర్లను హతమార్చడం వంటి విషయాలపై వ్యక్తులు ఎవరూ తీర్పులు ఇవ్వడానికి వీలు లేదని కలకత్తా హైకోర్టులో వాదించడానికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం స్వయంగా అడ్వకేట్ జనరల్‌ని నియమించింది. కానీ సోవియట్ రష్యా ఉన్నప్పుడు మధ్య ఆసియా ప్రాంతాలలోని ముస్లిం ఆధిక్యత కలిగిన ప్రదేశాలలో బహు భార్యత్వాన్ని, తలాక్‌ని నిషేధించింది కమ్యూనిస్టులే. చైనాలో వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడిన ముస్లిములను ప్రభుత్వం కఠినంగా అణచివేయడమేగాక, మసీదులను మూయించి, సరిహద్దుల నుండి చొరబాటుదారులు, తీవ్రవాదులు లోపలికి రాకుండా కట్టుదిట్టం చేసింది. భారత్‌లో మాత్రం కమ్యూనిస్టులు ముస్లింలపై ప్రత్యేకమైన శ్రద్ధ, అభిమానం చూపడానికి కారణం వారిని ఓటు బ్యాంకులుగా ఉపయోగించుకోవడానికే.

దేశసమైక్యతలో తమకెంతో శ్రద్ధ ఉన్నదని కమ్యూనిస్టులు నమ్మించ చూస్తారు. సాధారణ ప్రజానీకం అమాయకులని వీరు భావిస్తారు కాబోలు. కాని ముస్లిములు ప్రత్యేకమైన జాతి అని; ముస్లిం రాజ్యం ఏర్పరుచుకునేందుకు వారికి స్వయం నిర్ణయాధికారం ఉన్నదని సిద్ధాంతీకరించినది కమ్యూనిస్టులే. వారు అంతటితో ఆగలేదు. కేరళలో ముస్లిం ఆధిక్యత కలిగిన ప్రాంతాలతో ప్రత్యేక ముస్లిం జిల్లాని ఏర్పరచారు. అలాగే జమ్మూకాశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తి ఉండాలని అంటున్నారు. కాని హిందువుల ఆధిక్యత కలిగిన జమ్మూకాశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తి ఉండాలని ప్రత్యేక ప్రతిపత్తినివ్వాలని వీరు అనరు. ముస్లిముల కోరికలను తీర్చడానికై ప్రయత్నం చేస్తారని దీనిని బట్టి తెలుస్తుంది. కాశ్మీర్ నుండి తరిమివేయబడిన హిందూ పండితుల పట్ల, బంగ్లాదేశ్ నుండి తరిమి వేయబడిన చక్మాల పట్ల వీరికి సానుభూతి ఏ మాత్రం ఉండదు. విదేశీ దోపిడీదారు నిర్మించిన పురాతన కట్టడం కూల్చివేయబడితే గగ్గోలు పెట్టే వీరు జమ్మూ కాశ్మీర్‌లో, బంగ్లాదేశ్‌లో కూల్చివేయబడిన అనేక దేవాలయాల గురించి పల్లెత్తుమాట మాట్లాడరు. దీనిని బట్టి వీరికి హిందువుల మత విశ్వాసాల పట్ల, దేశ సమైక్యత పట్ల ఎంతటి శ్రద్ధాభక్తులు ఉన్నాయో తెలుస్తుంది.





భారతీయ కమ్యూనిస్టుల చరిత్ర మోసం, అవినీతి, హింసలకు పెట్టింది పేరు. అధికార వ్యామోహంతో కాంగ్రెస్ పార్టీ, జనతాదళ్, ఇతర 'జగడా'దళ్‌లు కమ్యూనిస్టుల పంచన చేరడం దురదృష్టకరం. 1940వ దశకంలో ఆస్ట్రేలియా లేబర్ పార్టీకి చెందిన ఆర్థర్ కాల్డ్‌వెల్ కమ్యూనిస్టులు "రేయి పగలు అబద్ధాలు చెపుతూనే ఉంటారు. ఇలాంటి వారి వల్ల స్టాలిన్‌కి ఏ మాత్రం ప్రయోజనం లేదు. వీరికి ఆవుపేడకి ఉన్న ప్రయోజనం కూడా లేదు" అని అన్నాడు. ఈ మాటలు ఇప్పటికీ నిజమని స్పష్టమైంది. ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టులకి స్వంత బలంతో ఒక్క లోక్‌సభ, శాసనసభస్థానం కూడా దక్కదు. అందుకనే తెలివిగా తెలుగుదేశం పార్టీని పట్టుకు వేళ్ళాడుతున్నారు. వీరితో విసిగి వేసారిపోయిన స్వర్గీయ ఎన్టీఆర్ ఒక సందర్భంలో సహనం కోల్పోయి "మీరు ఎంగిలి ఆకులు నాకి, తిరిగి మా పైనే మొరిగే కుక్కల వంటివారు.." అని అన్నారు. తన వద్దకు పదేపదే వచ్చే కమ్యూనిస్టులను హెచ్చరిస్తూ "అల్లుళ్ళు అత్తవారింటికి పిలిస్తేనే వెళ్ళాలి. అంతేకాని పిలవకుండా వెళితే వారికి విలువ ఉండదు..." అని అన్నారట.

తెలుగుదేశం పార్టీతో ఎన్ని సైద్ధాంతిక విభేదాలున్నా వారు ఆ పార్టీని పట్టుకు వేళ్ళాడి, వారి దయాభిక్షానికై ఎదురు చూస్తూనే ఉంటారు. కమ్యూనిస్టులకి జాతీయ భావనగాని, దేశ చరిత్ర సంస్కృతుల పట్ల భక్తిశ్రద్ధలుగాని ఏ మాత్రం లేవు. తాము ఒకదాని తరువాత ఒకటి తప్పులు చేస్తూ వచ్చామని, కాని చేసిన తప్పుని దశాబ్దాల తరువాతగాని ఒప్పుకోలేకపోతున్నామని వారే అంగీకరించారు. పాకిస్తాన్ ఏర్పాటును సమర్థించడం, 1942 క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించడం, గాంధీజీని బూర్జువా నాయకుడని నిందించడం, సుభాష్ చంద్రబోస్‌ని ఫాసిస్టు శక్తుల తొత్తని, జపాన్ చేతిలో కీలుబొమ్మ అని నిందించడం, 1962లో చైనా భారత్‌పై జరిపిన దాడిని సమర్థించడం, 1976లో ఎమర్జెన్సీ విధించి శ్రీమతి ఇందిరాగాంధీ ప్రతిపక్ష నాయకులందరినీ జైళ్ళలో బంధించడాన్ని సమర్థించడం వంటి దేశ వ్యతిరేక కార్యకలాపాలను భారత ప్రజానీకం మరచిపోలేదు, క్షమించలేదు. జాతీయ భావన పట్ల వీరికి ఉన్న అసహనం ఎంతటిదంటే బిజెపి అధికారంలోకి వస్తే పశ్చిమబెంగాల్ దేశం నుండి విడిపోతుందని వీరి నాయకుడు జ్యోతిబసు ప్రకటించాడు. దేశంలో నివసించే ఇటువంటి విదేశీయులకు, కమ్యూనిస్టు అనాధలకు రాబోయే 12వ లోక్‌సభ ఎన్నికల్లో దేశభక్త ప్రజానీకం మరచిపోలేని గుణపాఠం చెప్పాలి.

# ఆర్థిక సంక్షోభంలో తూర్పు ఆసియా దేశాలు

**ఫిబ్రవరి 2 - 8 , 1998**

తూర్పు ఆసియా దేశాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఆయా దేశాల ఆర్థికస్థితి క్రమంగా దిగజారుతోంది. కరెన్సీ విలువ రోజురోజుకీ పడిపోతుంది. ఒకప్పుడు ఒక అమెరికన్ డాలర్‌కి 2 మలేసియా రింజిట్ సమానంగా ఉండేది. కాని ఇప్పుడు ఒక అమెరికన్ డాలర్‌కి 4 రింజిట్‌లు సమానం అయ్యే స్థితి ఏర్పడింది. ఫిలిప్పిన్స్ పిసో విలువ సగానికి పడిపోయింది. ఇండోనేషియా రుపయ్య విలువ నాలుగవ వంతు తగ్గింది. 6 నెలల క్రితం 25 బాంకాక్ బక్త్‌లు ఒక అమెరికా డాలర్‌కి సమానమైతే ఇప్పుడు 48 బక్త్‌లు డాలర్‌కి సమానం. కొరియా మారక ద్రవ్యం వోన్‌కి కూడా ఇదే గతి పట్టింది. అయినా ఈ దేశాలన్నీ ఆర్థిక సంక్షోభాన్ని ధైర్యంగా ఎదుర్కొంటున్నాయి. ఈ దేశాలన్నీ (మలేషియా తప్పించి) ఈ సంక్షోభం నుండి బయటపడటానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్) సహాయాన్ని అర్థించాయి. ఈ దేశాల ఆర్థిక సంక్షోభానికి ప్రధాన కారణం ఆ దేశాలు అవసరానికి మించి డబ్బు ఖర్చు చేసి దాని కోసం అప్పులు చేయడమే. ఆ దేశాల్లోని కేంద్ర బ్యాంకు (మన రిజర్వ్‌బ్యాంకు లాంటిది) లు విదేశీ ధనం ఎటు వెళుతున్నదీ పసిగట్టలేకపోయాయి. స్థానిక బ్యాంకులు విదేశీ ఋణాలను స్థానిక కంపెనీలకు అందజేసి చేతులు దులుపుకున్నాయి. ఏ కంపెనీకి ఎంత ఋణం అందిందన్నది కేంద్రబ్యాంకుకి తెలియలేదు. కొరియాలో, బాంకాక్‌లో ఆర్థిక నిపుణులు, రాజకీయ నాయకులు తమ ప్రజానీకానికి సంక్షోభం ఏర్పడటానికి గల కారణాలను వివరిస్తున్నారు. అంతేకాదు సంక్షోభం నుండి బయటపడటానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నదీ, వాటివల్ల ఎటువంటి పరిస్థితులు ఎదురయ్యేది దాచకుండా చెపుతున్నారు.

ఈ మధ్య నేను ఈ దేశాల్లో పర్యటించినప్పుడు అక్కడి పత్రికలు, టీవిలలో వెలువడిన అంశాలను ఇక్కడ ప్రస్తావిస్తాను: 'ది నేషన్' బాంకాక్‌లోని ఇంగ్లీషు వార్తాపత్రిక. ఆ పత్రిక తన సంపాదకీయంలో ప్రజలు ఆదాయపు పన్ను ఎగవేయకూడదని పిలుపునిచ్చింది. ఆ పత్రిక ప్రకారం 60 మిలియన్ థాయిలాండ్ జనాభాలో కేవలం 6 మిలియన్ ప్రజలు మాత్రమే పన్ను చెల్లిస్తున్నారు. భారత్‌లో





15 మిలియన్ మంది ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారు. ప్రజలకి రాజకీయ నాయకులపై నమ్మకం లేకపోవడం వల్లనే తక్కువ మంది పన్ను చెల్లిస్తున్నారని పత్రిక వివరించింది. భారత్‌లో నాయకుల స్థితి ఏమిటి? అవినీతి రారాజు పి.వి.నరసింహారావు ఐదేళ్ళ పాలనలో కోట్లాది ప్రజాధనం నాయకుల జేబుల్లోకి చేరింది. అవినీతికి పాల్పడిన నాయకుడిని విచారించడానికి వీలు ఉండదు. విచారణ జరుగుతుంటే సాక్ష్యాధారాలు లభించవు. విచారణ పూర్తికాకుండానే ప్రభుత్వాలు మారిపోతాయి. థాయిలాండ్‌లో పన్ను ఎగవేత తీవ్రంగా ఉందని పత్రిక పేర్కొంది. భారత్‌లో కూడా అంతే.

బాంకాక్‌లో దొంగ వ్యాపారం తీవ్రంగా సాగుతుంది. కేవలం 5% కంపెనీలు మాత్రమే పన్నులు కడుతున్నాయని, ఆదాయపు పన్ను శాఖ దాడులను తప్పించుకోవడానికై వ్యాపారవేత్తలు ప్రభుత్వంతో 'సామరస్య' పూర్వకంగా వ్యవహరిస్తుంటారని స్పష్టమైంది. భారత్‌లో కూడా పాలకపార్టీకి మద్దతునివ్వని వారిపై ఆదాయపు పన్నుశాఖ దాడులు జరుపుతుందనే భయం ఏర్పడిపోయింది. ఎమర్జెన్సీ తరువాత ఏర్పడిన జనతా ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన మధుదండావతేని కలిసినప్పుడు నేను (రచయిత) "ఆదాయపు పన్ను వసూలు వల్ల ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం స్వల్పమైనది కనుక కొన్ని రాష్ట్రాల్లో భూమి పన్నును రద్దు చేయకూడదు" అని అడిగాను. అందుకు మధుదండావతే "మీరు అన్నట్లుగా వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూలు వల్ల ప్రభుత్వానికి పెద్ద ఆదాయం సమకూరదు. కానీ ఆదాయపు పన్ను శాఖను ఉపయోగించి రాజకీయ వేత్తలం మా పార్టీకి నిధులు సమకూర్చని వ్యాపారులను వేధిస్తూ ఉంటాం. అందుకే ఆదాయపు పన్నుని రద్దుచేయం" అని అన్నారు. ఆసియాలోని అన్ని దేశాల్లో రాజకీయ నాయకులు ఒకలాగే ఉన్నారని తెలుస్తోంది. ఒకప్రక్క దేశ ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పే ప్రభుత్వం ప్రజలను పన్ను ఎగవేతకి ప్రోత్సహించడం విచారకరమని 'ది నేషన్' పత్రిక పేర్కొంది. మన ప్రభుత్వం పార్లమెంటులో ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను కట్టని ప్రముఖుల జాబితాను సమర్పిస్తుంటుంది. ఎంత మొత్తం వసూలు కావాలన్నది కూడా పేర్కొంటుంది. ఇలా పన్ను ఎగవేసేవారిలో సినీతారలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు మొదలైన వారు ఉంటారు.వీరికి తోడు అనేక మంది మాజీ మంత్రులు టెలిఫోన్ బిల్లులు, కరెంటు బిల్లులు, అధికార

నివాసాల అద్దెలు ఎగవేతకి పాల్పడుతుంటారు. కాని విచిత్రమైన విషయం ఏమంటే ఇలా పన్నులు ఎగవేసేవారే పేద ప్రజానీకం గురించి, సోషలిజం గురించి ఉపన్యాసాలు ఇస్తుంటారు. అంతకంటే చిత్రంగా వారినే ప్రజలు ఎన్నుకుంటుంటారు. పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పి ప్రజల నుండి ఓట్లను, వ్యాపార ప్రయోజనాలను రక్షిస్తామని వ్యాపారుల నుండి డబ్బుని పొందడమే రాజకీయమనే అభిప్రాయం బలపడిపోయింది.

నూతనంగా ఎన్నికైన కొరియా అధ్యక్షుడు పదవీస్వీకారం చేయకుండానే టీవిలో ప్రజల ప్రశ్నలకి సమాధానం చెప్పడానికి, వారి సందేహాలు తీర్చడానికి ప్రయత్నించాడు. చాలామంది ఐఎంఎఫ్‌కి ఎందుకు తలవంచుతున్నారని ప్రశ్నించారు. అందుకు ఆయన ప్రస్తుత సంక్షోభానికి ప్రజలే కారణమని నిర్మొహమాటంగా తేల్చి చెప్పాడు. ఐఎంఎఫ్ దగ్గరకి వెళ్ళకుండా ఉండవచ్చును కానీ పన్నులు కట్టకుండా ఉండకూడదని అన్నాడు. ప్రస్తుత సంక్షోభం నుండి బయటపడటానికి ప్రభుత్వం తీసుకునే చర్యల వల్ల ప్రజల జీవనస్థాయి తగ్గవచ్చని, కొందరు ఉద్యోగాలు కోల్పోతారని, ఐనా తప్పని పరిస్థితి కనుక ప్రజలు కష్టాలను సహించాలని పేర్కొన్నాడు. కొరియా అధ్యక్షుడి మాదిరిగా మన పాలకులు కూడా సరళీకృత విధానాలు, వైశ్వీకరణ విధానాల గురించి ప్రజలకి వివరించి ఉంటే బాగుండేది. కాని వారు అలా చెప్పలేక పోవడానికి కారణం గత 50 ఏళ్ళుగా సెక్యులరిజం, సోషలిజం, కమ్యూనిజం పేరున వారు అనుసరిస్తూ వచ్చిన అస్తవ్యస్త విధానాలు. మన దగ్గర ఉన్న డబ్బుని దురుపయోగం చేసి ఇతరుల నుండి అప్పు తెచ్చుకోవడం ఎప్పుడూ మంచిది కాదు. ఇది అందరూ గ్రహించవలసిన విషయం

**క. ఎ ట్టాడిన నట్టాడుదు,**
**రిట్టి ట్టని పలుక నెఱుఁగ రితరుల శిశువుల్**
**దట్టించి యెవ్వ రేనియుఁ బట్టించిరొ?**
**బాలకునకు పరపక్షంబుల్**

శ్రీమదాంధ్ర మహాభాగవతం స.స్క

“చిన్న పిల్లలకేం తెలుస్తుంది. ఎవ్వరేం చెప్తే అదే నమ్ముతారు. శత్రువులెవరైనా నా కొడుక్కు దుర్నీతులు నూరిపోసారేమో” అని విచారించాడు హిరణ్యకశిపుడు.





# రాజకీయ మతతత్వం

**ఫిబ్రవరి 23 - మార్చి 1 , 1998**

**మార్చి 2 - 8 , 1998**

బ్రిటీష్ వాళ్ళు మన దేశాన్ని పాలిస్తున్న రోజులనుండి మన దేశంలో ముస్లిం సమస్య ఉంది. సయ్యద్ అహ్మద్‌ఖాన్ భారత్‌కి స్వాతంత్ర్యం వస్తే ఇక్కడ ప్రజాస్వామ్యం ఏర్పడుతుందని, ప్రజాస్వామ్యంలో మెజారిటీ వర్గాల మాటే చెల్లుతుందని భావించాడు. ముస్లిములంతా మూకుమ్మడిగా ఓట్లు వేసినట్లే హిందువులు కూడా వేస్తారని కనుక హిందువుల పాలనే ఏర్పడుతుందని అనుకున్నాడు. బ్రిటీష్ వాళ్ళు ప్రజాస్వామ్య వ్యవస్థ పట్లనే మొగ్గు చూపుతారని కనుక భారత్‌లో ప్రజాస్వామ్యమే ఏర్పడుతుందని గ్రహించాడు. దానితో జనాభాతో నిమిత్తం లేకుండా ముస్లిములకి ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పరచాలని కొత్త వాదన మొదలుపెట్టాడు. ఇటువంటి వేర్పాటువాద ధోరణిని బ్రిటీష్ వాళ్ళు ప్రోత్సహించారు. తత్ఫలితంగానే ముస్లింలీగ్ ఏర్పడింది. ముస్లిములలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించడం ద్వారా తమ అధికారాన్ని కాపాడుకోవాలని బ్రిటీష్‌వారు ప్రయత్నించారు. ఐతే వేర్పాటు వాద ధోరణిని బ్రిటీష్ పాలకులే కలిగించారన్నది నిజం కాదు. ముస్లిములలోని ఇటువంటి ధోరణికి వాళ్ళు ఆజ్యం పోసి తమకు అనుకూలంగా వాడుకున్నారు. కనుక ముస్లిం సమస్య కొత్తగా పుట్టుకొచ్చినది కాదని స్పష్టమౌతుంది. ముస్లిం దండయాత్రలను అడ్డుకునేందుకు విజయనగర సామ్రాజ్యం, మరాఠా సామ్రాజ్యం ఏర్పడ్డాయి. 17 శతాబ్దాంతానికి ముస్లిం పాలకులు హిందువులతో సామరస్య పూర్వకంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. కాఫిర్లని మతం మార్చాలనే తీవ్రమైన ధోరణి తాత్కాలికంగా తగ్గుముఖం పట్టింది.

మహ్మద్ ప్రవక్త మరణించిన తరువాత అతని అనుచరులు ఉత్తర ఆఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాలు, మధ్య ఆసియా దేశాలను 50 ఏళ్ళలో పూర్తిగా ఆక్రమించుకోగలిగారు. కానీ భారత్ ఈ దేశాలన్నింటికంటే భిన్నమైనది. ఇక్కడ 500 సంవత్సరాలపాటు తీవ్రంగా ప్రయత్నించిన తరువాత కూడా ముస్లిం పాలకులు ప్రజలందరినీ ఇస్లాంలోకి మార్చలేకపోయారు. వేరే దేశాల్లో 50 సంవత్సరాలలో చేసిన పని ఇక్కడ 500 సంవత్సరాలైనా చేయలేకపోయారు. ఈ తేడాని గుర్తించడం చాలా అవసరం.

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏనాడూ హిందూ రాజ్యాన్ని కోరుకోలేదు. హిందువులు కూడా బ్రిటీష్ పాలనకంటే ముస్లిం పాలనే భయంకరమైనదని భావించారు. ఎక్కువ మంది హిందువులు ఇంగ్లీషు విద్యని ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో ఎక్కువమంది హిందూ నాయకులు ఉన్నా అది పూర్తిగా హిందుత్వానికి కట్టుబడి లేదు.

బెంగాల్ విభజన విఫలం అయిన తరువాత ముస్లింలీగ్ ఏర్పడింది. అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంలోని బ్రిటీష్ ప్రొఫెసర్‌లు ముస్లింలలో తాము ప్రత్యేక జాతి అనే వేర్పాటు భావాన్ని రెచ్చగొట్టారు. బెంగాల్ విభజనని వ్యతిరేకించడంతో కాంగ్రెస్ సాధించిన విజయం బ్రిటీష్ పాలకులను ఆలోచనలో పడేసింది. అందుకనే వాళ్ళు ముస్లిములలో వేర్పాటువాదాన్ని రెచ్చగొట్టడం మొదలుపెట్టారు. అలహాబాద్, లక్నో చట్టాల్లో ముస్లిములకి ప్రత్యేక నియోజకవర్గాలు కల్పించడానికి సిద్ధమైంది. ఇది పూర్తిగా మతం ఆధారంగానే జరిగింది. కనుక హిందూ–ముస్లిం సమస్య స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తలెత్తిందని అనుకోకూడదు. స్వాతంత్ర్యోద్యమం ప్రధానంగా రాజకీయపరంగానే సాగింది. జాతీయ జాగరణ తమకి ప్రమాదకారి అని ముస్లిములు భావించారు. అందుకు ప్రతిక్రియగా మతాన్ని ఆధారం చేసుకుని రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు ప్రయత్నించారు. ఇలా మతం, రాజకీయాలు ముస్లిం పార్టీలలో, ముస్లిం సంస్థల్లో ఒక్కటిగానే కనబడతాయి. ఈ ధోరణిని సమర్థించుకునేందుకు ఇస్లాంలో ఆధ్యాత్మిక, ప్రాపంచిక విషయాలు విడివిడిగా లేవని, మత విషయాలకి, రాజకీయ విషయాలకి తేడా లేదని వాదించారు.

ఖిలాఫత్ ఉద్యమం తరువాత ముస్లిం సమస్య తీవ్రతరం అయింది. ఖిలాఫత్ ఉద్యమానికి ముందు ముస్లింలీగ్ ఇంగ్లీషు విద్యని అభ్యసించిన, ధనవంతులైన ముస్లిం నాయకుల చేతిలో ఉండేది. ఆ తరువాత మతనాయకులైన ముల్లాలు విద్యావంతులకంటే మౌల్వీలు, ఇమామ్‌ల చేతిలోకి పోయింది. మహ్మద్ ఆలీ జిన్నా వంటి ఇంగ్లీషు విద్యావంతులకంటే మౌల్వీలు, ముల్లాల మాట ఎక్కువ చెల్లుబడి అయింది. ఒకప్పుడు జిన్నా ప్రఖర జాతీయవాది, కాంగ్రెస్ వాదిగా ఉండేవాడు. ఆయనకి ఖిలాఫత్ ఉద్యమం, ముస్లిములు మతాన్ని, రాజకీయాలను ముడిపెట్టాలనుకోవడం ఏ మాత్రం నచ్చలేదు. కాని తరువాత కాలం అతడే ఇస్లాంని ఉపయోగించుకొని ప్రత్యేక రాజ్యాన్ని ఏర్పరచడానికి పూనుకున్నాడు.





మతపరంగా ముస్లిములు ప్రత్యేక జాతి అనే సిద్ధాంతం మీదనే దేశవిభజన జరిగింది. భారత్‌లో మైనారిటీ సమస్య లేదని రెండు జాతులకు సంబంధించిన సమస్య ఉన్నదని కనుక రెండు రాజ్యాలను ఏర్పరచాలని, ఆ రెండు రాజ్యాలకి సమాన ప్రతిపత్తి కలిగించాలని జిన్నా వాదించాడు. అందుకనే మధ్యంతర ప్రభుత్వంలో హిందువులు, ముస్లిముల సంఖ్య సమానంగా ఉండాలని పట్టుబట్టాడు.

ఇక భారత్‌లో పరిపాలన సాగించడం సాధ్యం కాదని నిశ్చయించుకుని బ్రిటీష్ వాళ్ళు ఇక్కడ నుండి వెళ్ళి పోవడానికి తట్టాబుట్టా సర్దుకున్నారు. సాధ్యమైనంత త్వరగా ఇక్కడ నుండి వైదొలగాలని మౌంట్‌బాటన్ కూడా భావించాడు. ఈ పరిణామాలకు కాంగ్రెస్ సంతోషించినా ముస్లింలీగ్ మాత్రం 'విభజించి, వైదొలగండి' అని బ్రిటీష్ పాలకులను కోరింది. 1946 స్థానిక ఎన్నికల్లో ముస్లింలీగ్ ముస్లిముల కోసం కేటాయించబడిన స్థానాల్లో దాదాపు అన్నింటిలో విజయాన్ని సాధించింది. ఐతే ఇవన్నీ ప్రస్తుత భారత్‌లో ఉన్నవే. ప్రస్తుతపు పాకిస్థాన్ ఉన్న ప్రదేశాల్లో ముస్లింలీగ్ పూర్తిగా పరాజయంపాలు అయింది. బెంగాల్‌లో ముస్లింలీగ్ బలంగా ఉండేది. బ్రిటీష్ వాళ్ళు దేశాన్ని విభజించకుండానే వెళ్ళిపోతారని భయపడి అప్పటి బెంగాల్ ముఖ్యమంత్రి ముస్లింలీగ్ నాయకుడు హెచ్.ఎస్.సుహ్రావర్ది 1946, ఆగస్టు 15న ప్రత్యక్ష చర్యకి పిలుపునిచ్చాడు. దానివల్ల పెద్ద ఎత్తున మారణకాండ జరిగింది. వేలాదిమంది హిందువులు చంపబడ్డారు. అనేకచోట్ల మతకల్లోలాలు చెలరేగాయి. అటువంటి పరిస్థితుల్లో నెహ్రూ, పటేల్ దేశ విభజన తప్పనిసరి అనే నిర్ణయానికి వచ్చారు. ఆ విధంగా మతపరమైన రాజకీయాల మూలంగా దేశ విభజన జరిగింది.

పాకిస్తాన్ ఏర్పాటుని ఎక్కువగా సమర్థించినది ప్రస్తుతపు భారత్ భూభాగంలోని ముస్లిములే. అంతేకాని పాకిస్తాన్‌లోని ముస్లిములు కాదు. దీనికి ఒకటే కారణం. పాకిస్తాన్‌లోని ముస్లిములకి హిందువులు అధిక సంఖ్యలో ఉంటే తమకి ప్రమాదం అనే ఆందోళన లేదు. కానీ భారత్‌లో ముస్లిములు హిందూ ఆధిక్యత వల్ల తమకి ప్రమాదం అని ఆందోళన చెంది పాకిస్తాన్ ఏర్పాటుకు మద్దతు పలికారు. వారి ఆలోచన ప్రకారం దేశవిభజన తర్వాత భారత్ పూర్తిగా హిందూ ఆధిక్యత కలిగిన రాజ్యంగా మారిపోతుంది. డా॥ అంబేడ్కర్, రాజాజీ కూడా దేశ విభజనకి ముందే శాంతియుతంగా జనాభా మార్పిడి జరగాలని సూచించారు కూడా. కానీ మత ప్రాతిపదికపై దేశవిభజనని అంగీకరించిన కాంగ్రెస్ జనాభా

మార్పుడిని మాత్రం అంగీకిరించలేదు. కాంగ్రెస్ అన్ని మతాలకు చెందిన సంస్థ అని, భారత్ హిందూ రాజ్యం కాబోదని, అందరికీ ఇందులో స్థానం ఉంటుందని చెప్పడానికే కాంగ్రెస్ నాయకులు తాపత్రయపడ్డారు. అది కాంగ్రెస్ తరహా సెక్యులర్ రాజ్యం. కాని దేశ విభజన జరిగిన కొన్ని నెలల్లోగా పశ్చిమ పాకిస్తాన్‌లో ఒక్క హిందువు కూడా మిగలలేదు. భారత్‌లోని కొన్ని ప్రాంతాల నుండి ముస్లిములు పాకిస్తాన్‌కు తరలిపోయినా గాంధీజీ నిరాహారదీక్ష చేసి భారత ప్రభుత్వం ముస్లిములకి రక్షణ కల్పించేటట్లు చేశారు. దానితో అక్కడి ముస్లిములు ఇక్కడే ఉండిపోయారు. తూర్పు పాకిస్తాన్‌లో హిందువుల తరిమివేత పశ్చిమ పాకిస్తాన్‌లో మాదిరిగా తీవ్రస్థాయిలో జరగకపోయినా ఈనాటికీ అది జరుగుతూనే ఉంది. తూర్పు పాకిస్తాన్‌లోని 30 శాతం హిందూ జనాభా క్రమంగా 12 శాతానికి తగ్గిపోయింది. ముస్లిములు భయపడ్డట్లుగా భారత్ హిందూ రాజ్యంగా ప్రకటించబడలేదు. మత ప్రాతిపదికపై దేశవిభజన జరిగినప్పుడు భారత్ హిందూ రాజ్యంగా ప్రకటించబడి ఉండవచ్చును. కాని అలా జరగలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థని అనుసరించి భారత్‌లో అన్ని మతాల వారికి రక్షణ కల్పించబడింది. మెజారిటీ వర్గానికి సైతం లేని సౌకర్యాలను మైనారిటీలకి కల్పించింది రాజ్యాంగం.

దేశవిభజన జరిగితే తమ సమస్యలు తీరిపోతాయని ముస్లిములు అనుకున్నారుగాని హిందువులు ఎప్పుడూ అలా అనుకోలేదు. తాము మత ప్రాతిపదికపై ప్రత్యేకమైన జాతి అని ముస్లిములు భావించకపోతే అసలు ముస్లిం సమస్య ఏర్పడేది కాదు. అలా భావించడం వల్ల వారు మిగతా ప్రజానీకం నుండి సాంస్కృతికంగా, ఆచరణాత్మకంగా కూడా వేరుగా ఉండిపోయారు. వారు అలాగే ఉండిపోదలుచుకున్నారా లేదా అనేది వారు తేల్చుకోవాలి. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు ముస్లిం రాజ్యాలుగా ప్రకటించబడ్డాయి. ఈ దేశాల్లో ముస్లిమేతరుల హక్కులు, సౌకర్యాలు అంతంత మాత్రమే. భారత్ మాత్రం సెక్యులర్ రాజ్యంగా ఏర్పడింది. ప్రభుత్వం ఏ మతవర్గం పట్ల వివక్షత చూపదని రాజ్యాంగంలో పేర్కొనబడింది. ఐనా పాకిస్తాన్ ఏర్పాటును సమర్థించిన ముస్లిముల ధోరణిలో మార్పు ఏమైనా వచ్చిందా? ఇంతకుముందు అనుకున్నట్లుగా ముస్లిములు మతపరంగా తాము ప్రత్యేక జాతి అనుకున్నంత కాలం ముస్లిం సమస్యకు పరిష్కారం లభించదు. ఇప్పటికీ ముస్లిం మిల్లీ పార్లమెంటు వంటివి ముస్లిములకు ప్రత్యేక నియోజకవర్గాలు ఉండాలని,



తమసోమా జ్యోతిర్గమయ

కొన్ని స్థానాలను ముస్లిములకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇవన్నీ స్వాతంత్ర్యానికి ముందు ముస్లింలీగ్ కోరిన కోరికలే. అలాగే కాశ్మీర్ సమస్య ఉంది. కాశ్మీర్‌ని భారత్‌లో విలీనం చేస్తూ కాశ్మీర్ రాజు సంతకం చేశాడు. అలాగే కాశ్మీర్‌లో ప్రజల పార్టీగా పేరుపొందిన నేషనల్ కాన్ఫరెన్స్ కూడా విలీనాన్ని అంగీకరించింది. విలీనానికి ఎటువంటి షరతులూ లేవు. కానీ అప్పటి భారత ప్రధాని మాత్రం విలీనానికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరిపించాలని అన్నారు. ఐతే ప్రజాభిప్రాయ సేకరణ కూడా పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ని వదలి వేస్తేనే వీలవుతుందని ఆయన చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌లో ముస్లిములు అధిక సంఖ్యాకులు కాబట్టి దానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలన్నది కూడా సబబు కాదు. ఎందుకంటే జమ్మూలో హిందువులు అధిక సంఖ్యలో ఉన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో సగానికి పైగా ఉన్న లెహ్ ప్రాంతంలో బౌద్ధులు ఎక్కువ. జమ్మూకాశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలనేవారు మరి జమ్మూ ప్రాంతానికి, లెహ్‌కి కూడా ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలా? లేక అవి భారత్‌లో విలీనం అయ్యేందుకు స్వేచ్ఛనివ్వాలా అన్న ప్రశ్నలకి సమాధానం ఇవ్వరు. ఇటువంటి అసంబద్ధ వైఖరిని ఏమంటాము? మతతత్వం అనవచ్చా? లేక సెక్యులరిజం అనాలా? ఇది సోషలిజమా లేక పచ్చి ఇస్లామీకరణా?

భారత్‌లో నివసించే ముస్లిముల సమస్యలు ఏమిటి? వారి ఆలోచనలు, అభిప్రాయాలు ప్రక్కనపెడితే వారి ఆర్థిక, సామాజిక స్థితిగతుల సంగతి ఏమిటి? ముస్లిములలో అక్షరాస్యత చాలా తక్కువ. ముస్లిం స్త్రీలలో ఇది ఇంకా తక్కువ. ముస్లిం కుటుంబాలు ఇతర వర్గాల వారికంటే చాలా పెద్దగా ఉంటాయి. కుటుంబపు ఆదాయం మాత్రం తక్కువగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితులకి ఎవరు బాధ్యులు? సంఖ్యాబలంతోనే పదవులు సంపాదించు కోవాలనుకునే ముస్లిం మత నాయకుల ఆశలు నెరవేరే అవకాశం ఉందా? విద్య, విజ్ఞానాలు అవసరం లేదా? క్రైస్తవుల మాదిరిగానే ముస్లిములకి కూడా విదేశాల నుండి నిధులు వస్తున్నాయి. క్రైస్తవులు విద్యాసంస్థలు విద్యాసంస్థలు, ఆస్పత్రులు స్థాపిస్తూ ఉంటే ముస్లిములు మాత్రం మసీదులు బాగుచేసుకోవడానికి, కొత్త మసీదులు కట్టుకోవడానికి నిధులు ఉపయోగిస్తున్నారు. మత బోధ కాకుండా ఆధునిక విద్యని సంపాదించేందుకు ముస్లిములు ప్రయత్నిస్తున్నారా? వారిలో ఎవరు ఈ సమస్యల గురించి ఆలోచించారు? ఏ సెక్యులర్ పార్టీలు ఈ సమస్యల్ని పట్టించుకున్నాయి.

తమని తాము సెక్యులర్ వాదులుగా చెప్పుకునే వారు ఈ సమస్యల గురించి ఏం పట్టించుకుంటున్నారు? హాజ్‌యాత్రకి ఎక్కువ మందిని పంపడానికి సబ్సిడీలను పెంచితే ముస్లింల ఆర్థికస్థితిగతులు చక్కబడతాయా? ఉర్దూ స్కూళ్ళు, విశ్వవిద్యాలయాల వల్ల వారి విద్యాస్థాయి మెరుగుపడుతుందా? ఏ రాష్ట్రంలోనూ 10 నుండి 15 శాతానికి మించి ఉర్దూ ఉపయోగించేవారు లేరు. స్థానిక భాషల వల్లనే ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది. ఉర్దూ భాషని నేర్చుకోవడం తప్పుకాదు కానీ ఆధునిక విద్య అవసరం లేదనుకోవడం పొరపాటు. కాని సెక్యులరిస్టులు సమర్థిస్తున్న ముస్లిం మత నాయకుల అభిప్రాయాలు మాత్రం ఇలాగే ఉంటున్నాయి.

ఇంతకీ సెక్యులరిస్టులు ఎవరు? కాంగ్రెస్ వాళ్ళు, కమ్యూనిస్టులు, జనతాదళ్ వారు, ఇతర అనేక ప్రాంతీయ పార్టీలు తాము సిసలైన సెక్యులరిస్టులమని చెప్పుకుంటున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 50 సంవత్సరాలలో ఎక్కువ కాలం వీరే దేశాన్ని ఏలారు. ఇలాంటి సెక్యులరిస్టులు ఏం చెపుతున్నారు? భారతీయ జనతా పార్టీ, సంఘపరివార్ మతతత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయని, కనుక ముస్లిములు బిజెపిని అధికార పీఠం నుంచి దూరంగా ఉంచడానికి సెక్యులర్ పార్టీలైన తమకే ఓటు వేయమని అడుగుతున్నారు. అలాగే గత 50 సంవత్సరాలుగా ఓట్లు సంపాదించుకున్నారు కూడా. కాని గత 50 సంవత్సరాల సెక్యులర్ పాలనలో ముస్లిముల ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగుపడ్డాయా! వారు అభివృద్ధి సాధించారా? సెక్యులర్ పాలన వారికి చేసినది ఏమిటి? కేవలం కొత్త కొత్త నినాదాలు సృష్టించడం తప్ప? మైనారిటీ కమీషన్, మైనారిటీల ఆర్థిక సంస్థలను స్థాపించారు. కాని ముస్లిములు కూడా మనుషులే కదా? వారికి మానవహక్కుల కమీషన్‌కి బదులు మైనారిటీ కమీషన్ ఎందుకు? బ్యాంకులన్నీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నప్పుడువారికి ప్రత్యేకంగా బ్యాంకులు ఎందుకు? ఇవన్నీ వేర్పాటువాదాన్ని ప్రోత్సహించడం లేదా? నిజానికి భారత్‌లో మైనారిటీ అంటే ముస్లిములు అనే అభిప్రాయం బలపడిపోయింది. సిఖ్ఖులు, జైనులు, పార్శీల సంఖ్య ముస్లిముల కంటే తక్కువ. ఐనా ఇక్కడ జైన్ సమస్య, పార్శీ సమస్య వంటివి లేవు. కేవలం ముస్లిం సమస్య మాత్రమే పుట్టింది. ఎందువల్ల?

తథాకథిత సెక్యులర్ పార్టీలు ముస్లిములని కేవలం ఓటు బ్యాంకుగా పరిగణిస్తూ వచ్చాయి తప్ప వారిని మానవ సమూహంగా ఎప్పుడూ పరిగణించలేదు.





వారి సంఖ్య ఎంత ఎక్కువైతే అంత మంచిదని భావించాయి. ఎందుకంటే ఎక్కువ మందికి బిజెపి బూచి చూపి భయపెట్టడానికి వీలవుతుంది, ఎక్కువ ఓట్లు సంపాదించుకోవడానికి వీలవుతుంది.

సెక్యులర్ పార్టీల ద్వంద్వ వైఖరి గమనించండి. స్త్రీలలో ముస్లిం స్త్రీలు, హిందూ స్త్రీలు, దళిత స్త్రీలు అని విడివిడిగా ఉండరు. స్త్రీ హక్కులు అందరికీ సమానంగా ఉండాలి. కానీ షాబానో కేసు తీసుకోండి. షాబానోకి ఆమె భర్త మనోవర్తి ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కానీ ఈ సెక్యులర్ పార్టీలు ఏం చేశాయి? రాజ్యాంగాన్ని ధిక్కరించి షరియత్ సూత్రాల ప్రకారం చట్టాన్ని సవరించాయి. దీనిని సెక్యులరిజం అంటారా? లేక 'రాజకీయ మతతత్వం' అంటారా?

సెక్యులరిస్టులు ఆందోళనపడి పోయే మరొక 'అత్యంత తీవ్రమైన' సమస్య బాబ్రీ సమస్య. బాబరు ఎవరు? అతడు భారతీయుడు కాదు. ఒక దోపిడీదారు. భారత్‌లోని కొన్ని ప్రాంతాలపై దండెత్తి ఆక్రమించుకున్నాడు. అతని సేనాని అయోధ్యలో హిందువులకు అతి పవిత్రమైన స్థలంలో మసీదును నిర్మించాడు. హిందువులు అవతార పురుషునిగా భావించే శ్రీరామచంద్రుని జన్మస్థలంలోనే మసీదు ఎందుకు నిర్మించాడు? అలా నిర్మించడం ద్వారా తన ఆధిపత్యాన్ని, విజయాన్ని తెలుపుకోవాలనుకున్నాడు. ఆ కట్టడం పరాజితులకు అవమాన చిహ్నంగా మిగిలింది. సెక్యులరిస్టులు, ముస్లిములు అయోధ్యలో రామమందిరం ఉండేదని, రాముడు అక్కడే జన్మించాడని ఋజువుచేసే ఆధారాలు హిందువులు చూపాలని పునర్నిర్మాణపు డిమాండ్‌ను తాము వదులుకుంటామని వారు అంటున్నారు. కాని ఈ వాదన ఎంత వరకు సమంజసం? మేరి కన్యగానే క్రీస్తుకి జన్మనిచ్చిందని చెప్పడానికి, క్రీస్తు చనిపోయిన తరువాత తిరిగి సమాధి నుండి లేచి వచ్చాడనడానికి ఆధారాలు చూపమని క్రైస్తవుల్ని అడిగారనుకోండి. క్రైస్తవులు అటువంటి ఆధారాలు ఇవ్వగలరా? ఇచ్చేందుకు ఇష్టపడతారా? అలాగే మహ్మద్ తెల్లగుర్రంపై అల్లా వద్దకు ప్రయాణమై పోయాడని, ప్రస్తుతం ఉన్న అల్–అస్కా మసీదు స్థలంలోనే దిగాడని, అక్కడ ఉన్నవి గుర్రం డెక్కల గుర్తులు కావని, సాక్షాత్తు మహ్మద్ ప్రవక్త కాలి గుర్తులని చెప్పేందుకు ఋజువులు చూపమని ముస్లిములను అడిగితే వారు చూపుతారా? ఇలాంటి విషయాలు ఋజువులపై ఆధారపడవు. అవి నిజమని నమ్మడమే వాటి ఋజువు.

అలాగే శ్రీరాముడు అయోధ్యలోనే జన్మించాడన్నది హిందువుల నమ్మకం. దానికి ఋజువులు అవసరం లేదు. అటువంటి నమ్మకం వల్ల సామాజిక, ఆర్థిక వినాశనం జరుగుతుందనుకుంటే దానిని వదలిపెట్టవచ్చును. కాని హిందువుల నమ్మకం వల్ల అలాంటిదేమీ జరగడం లేదు. ముస్లిములు, క్రైస్తవుల మత విశ్వాసాల మాదిరిగానే హిందువులకి కొన్ని విశ్వాసాలు ఉన్నాయి. వాటివల్ల ఎవరికీ నష్టం లేదు. హిందువులు తరతరాలుగా పవిత్రంగా భావిస్తున్న ప్రదేశంలో ఒక దురాక్రమణదారుడు మసీదు నిర్మించాడు. ఇలాంటి మసీదు మక్కా, మదీనాల వంటి పవిత్రమైనదా? అంత పవిత్రమైనది కానప్పుడు ఆ స్థలాన్ని హిందువులకి అప్పగించడానికి అడ్డు ఏమిటి? అలా అప్పగించకూడదనే మొండి పట్టుదల ఎందుకు? 1949 నుండి హిందువులు అక్కడ పూజలు తిరిగి ప్రారంభించారు కదా? ఆ స్థలంలోనే శిలాన్యాస్‌కి అనుమతినిచ్చింది ఎవరు? షాబానో కేసులో ముస్లిములను సంతుష్టపరచాం కాబట్టి అయోధ్య విషయంలో హిందువుల్ని సంతోషపెడదామనే ఆలోచనతోనే కదా సెక్యులర్ పార్టీలు శిలాన్యాస్‌కి అనుమతినిచ్చిందా? ఇలా రాజకీయ మతతత్వాన్ని పెంచిపోషిస్తున్నది ఎవరు? అది బిజెపి, సంఘపరివారా? లేక కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రులా?

క్రైస్తవులకి జెరూసలెం వెళ్ళేందుకు ప్రత్యేక సౌకర్యాలు, సబ్సిడీలు కలిగించడం లేదు ఎందుకు? కేవలం ముస్లిములకు మాత్రమే అలాంటి సదుపాయాలు కల్పిస్తోంది సెక్యులర్ ప్రభుత్వం. దీనికి కారణం ఏమిటి? యాత్రికుల సంఖ్య, సబ్సిడీ పెంచారు ఎందుచేత? ఇది రాజకీయ మతతత్వం కాదా?

రాజ్యాంగ సభలో జనసంఘ్, సంఘపరివార్ సభ్యుడెవరైనా ఉన్నారా? అందులో అందరూ సెక్యులర్ కాంగ్రెస్ వాదులే. వారిలో ఒక కమ్యూనిస్టు (సోమనాథ్ లాహిరి) కూడా ఉన్నాడు. వీరంతా ఎటువంటి రాజ్యాంగాన్ని రూపొందించారు? వారు రూపొందించిన రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉమ్మడి పౌరచట్టం అమలు చేయాలి. కానీ ఈనాడు అదే రాజ్యాంగాన్ని ధిక్కరించింది ఎవరు? ఉమ్మడి పౌరచట్టం అవసరం లేదని చెపుతున్న సెక్యులర్ పార్టీలే కదా? ముస్లిములకి, క్రైస్తవులకి కూడా హిందూ కోడ్‌నే వర్తింపజేయాలని సంఘపరివార్ అడగడం లేదు. కాని ఉమ్మడి పౌరచట్టం అంటే హిందూ కోడ్ అమలేనని ముస్లిములను తప్పుదారి పట్టిస్తున్నది మాత్రం సెక్యులర్ పార్టీలే.





గోవధ నిషేదం. ఇది సెక్యులరిస్టులు రూపొందించిన రాజ్యాంగంలో ఉన్నది కదా? మరి గోవధ నిషేధాన్ని అమలు చేశారా? మరి గోవధ నిషేధాన్ని అమలు చేయాలని కోరుతున్నవారిని మతతత్వవాదులని అంటున్నారు. గోవధ నిషేధాన్ని అమలుచేయాలని రాజ్యాంగంలో వ్రాసినవారు మతతత్వవాదులు కాకుండా దానిని అమలు చేయాలని అడిగినవారు మతతత్వవాదులు ఎలా అయిపోయారు? ః

భారత్ నిరంతరంగా సాగుతున్న జనాభా పెరుగుదలని తట్టుకోగలదా? ఏ వర్గాలలో పెరుగుదల ఎక్కువగా ఉంది? కుటుంబనియంత్రణ అమలు చేయడానికి వివిధ వర్గాల మధ్య వివక్ష ఎందుకు చూపాలి? జనాభా, అక్షరాస్యత, పేదరికం వంటివి మత విషయాలు కాదు. చాలా మటుకు ముస్లిం దేశాల్లో కూడా జనాభా నియంత్రణని అమలు చేస్తున్నాయి. అది ఆర్థిక పరమైన అవసరం. ఏ రాజకీయ పార్టీ జనాభా నియంత్రణ గురించి పట్టించుకోదు. కొన్ని పార్టీలు ఈ విషయాన్ని ప్రస్తావిస్తే వెంటనే మిగతా పార్టీలు దానికి మతపురంగు పులిమి, అది ముస్లిములకు వ్యతరేకం అని ఆరోపిస్తాయి. ముస్లిములు మతపరంగా కుటుంబ నియంత్రణని పాటించరాదని అంటారు.కాని అలా ఎక్కడా నిబంధన లేదు. కేరళ వంటి రాష్ట్రాలలో రాష్ట్ర జనాభాలో 40% ఉండే ముస్లిములు కూడా కుటుంబ నియంత్రణని పాటించకపోతే అక్కడ అతి తక్కువ జనాభా పెరుగుదల రేటు సాధ్యంకాదు. కుటుంబ నియంత్రణని మత సమస్యగా చేస్తున్నది రాజకీయ మతతత్వమే.

పాకిస్తాన్ షియా తెగకి చెందిన 746 మసీదులు ధ్వంసం చేయబడ్డాయి. అహ్మదీయులు ముస్లిములే కాదని వెలివేయబడ్డారు. ప్రస్తుతం షియాలు అదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కాని మన సెక్యులరిస్టులు మాత్రం పెదవి విప్పరు. కానీ వీరే రాత్రి పగలు తేడా లేకుండా బ్రాహ్మణులు ఇతర కులాలను పీడిస్తున్నారని ప్రచారం సాగిస్తుంటారు.

పాకిస్తాన్ క్రికెట్ జట్టు ముంబయ్‌లో ఆడటానికి వీలులేదని బాల్‌థాకరే ప్రకటిస్తే సెక్యులరిస్టులు గగ్గోలు పెట్టారు. కాని కొద్ది రోజుల క్రితం భారత్ కాశ్మీర్‌లో అనుసరిస్తున్న విధానానికి నిరసనగా భారత జట్టు ఆడటానికి వీలులేదని పాకిస్తాన్ ప్రకటిస్తే మాత్రం ఈ సెక్యులరిస్టుల నోరు పెగలదు. వీరికి పాకిస్తాన్‌లోని మతతత్వం కనబడదు. ఎందువల్ల?

పాశ్వాన్ వంటి 'వీర' సెక్యులరిస్టులు 3 కోట్ల దేవతలను పాకిస్తాన్ సరిహద్దులో నిలబెట్టాలని అప్పుడు వారు ఏం చేయగలరో తెలుతుందని ప్రకటిస్తే అలా మాట్లాడటం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఒక్క సెక్యులరిస్టు కూడా అనలేకపోయాడు. కాని ముస్లిం స్త్రీ హిందువుని వివాహమాడినట్లు చిత్రించడం గాని, ముస్లిం మతానికి చెందిన ఏ పేరునైనా ఉపయోగించడం కాని చేస్తే హిందూ మతతత్వవాదులు, ఫాసిస్టులు ముస్లిం మనోభావాలను గాయపరుస్తున్నారని గగ్గోలు పెడతారు. ఈ ద్వంద్వ వైఖరి దేనికోసం?

పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు ముస్లిం దేశాలుగా ప్రకటించినప్పుడు భారత్ హిందూ రాష్ట్రం ఎందుకు కాకూడదో ఈ సెక్యులరిస్టులు చెప్పగలరా?

ఇస్లాం, హిందుత్వం వందలాది సంవత్సరాలు సహజీవనం సాగించడం వల్ల 'మిశ్రమ సంస్కృతి' ఏర్పడిందని అంటుంటారు. కాని మరి ఒకప్పటి భారత్ భూభాగాలు, నేటి పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో కూడా వందలాది సంవత్సరాలుగా హిందూ, ముస్లిములు కలిసి జీవించినా అక్కడ ఈ 'మిశ్రమ సంస్కృతి' ఏర్పడలేదు ఎందువల్ల? బంగ్లాదేశ్‌లో 1947 నాటికి 30 శాతం ఉన్న హిందూ జనాభా నేడు 12%నికి తగ్గిపోయింది. ఎందువల్ల ఇలా జరిగిందో సెక్యులరిస్టులు చెప్పగలరా?

చొరబాటుదారుల సమస్య తీసుకోండి. హోం మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం హైదరాబాద్‌లో అనేకమంది ఐఎస్ఐ ఏజెంట్లు ఉన్నారని, దేశం మొత్తంలో 18 మిలియన్ బంగ్లాదేశీ ముస్లింలు ఉన్నారని స్పష్టమయింది.

బిజెపి, ఇతరులు ఇటువంటి చొరబాటుదారులను వెనక్కి తిప్పిపంపాలని అంటే మాత్రం సెక్యులరిస్టులు వారిని మతతత్వవాదులని దూషిస్తారు. సౌదీ అరేబియా చట్టవిరుద్ధంగా తమదేశంలో నివసిస్తున్న పాకీస్తానీ ముస్లిములను నిర్దాక్షిణ్యంగా వెనక్కి పంపివేసింది. ఈ విషయం వీరికి తెలియదా? మలేషియా కూడా అదే పని చేసింది.

జర్మనీలో గత నాలుగు దశాబ్దాలుగా క్రిస్టియన్ డెమోక్రాటిక్ పార్టీ పాలన సాగిస్తోంది. రెండవ ప్రపంచ యుద్ధం నాటి నుండి ఇటలీని క్రిస్టియన్ డెమోక్రాట్‌లు పాలిస్తున్నారు. అక్కడ క్రిస్టియన్ సైన్స్ రేడియో ఉంది. ఇంగ్లండ్‌కి చెందిన రాజు చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కి చెందినవాడై ఉండాలి. అమెరికాలో ప్రొటెస్టెంట్ కాని వ్యక్తి అధ్యక్షుడు కావడం చాలా అరుదు. కాథలిక్ అయిన కెనడీ కూడా అధ్యక్షుడైన





తరువాత కాథలిక్ మతం చేత ప్రభావితుడిని కాకుండా తన పదవీ బాధ్యతలు నిర్వహిస్తానని ప్రతిజ్ఞ చేయవలసి వచ్చింది. మరి అమెరికాను గాని, ఇతర దేశాలను గాని మత రాజ్యాలు అని పిలవడం లేదు ఎందుకని? కేవలం హిందూరాష్ట్రం, హిందూ డెమోక్రాటి పార్టీ మాత్రమే మతతత్వం, ఫాసిజం ఎందుకవుతాయి?

సెక్యులరిస్టు, నెహ్రూ మార్కు సెక్యులరిజం ప్రజాస్వామ్యం, సోషలిజాల పరిరక్షకుడైన రాజీవ్‌గాంధీ నాగాలాండ్‌లో క్రైస్తవ ప్రభుత్వాన్ని ఏర్పరుస్తానని హామీ ఇచ్చాడు. ఇది రాజకీయ మతతత్వం కాక మరేమిటి?

గత 50 సంవత్సరాలుగా సెక్యులరిస్టులు ముస్లిములలో వేర్పాటువాదాన్ని పెంచి పోషిస్తూ వచ్చారు. హిందూ మత మౌఢ్యపు బూచిని చూపి భయపెట్టారు. నిజానికి హిందుత్వం అత్యంత సహనశీలమైనది. వేదాలు, ఉపనిషత్తులు ఒక సత్యానికి వివిధ పేర్లు ఉన్నాయని పేర్కొన్నాయి. ఏ రూపంలో పూజించినా భగవంతుడు ఒక్కడే అని తెలిపాయి. ఇంతకంటే సహన శీలి అయిన మతం మరొకటి ఉంటుందా? హిందువులు కాని వారిని పాపులు, కాఫిర్లని, వారిని హిందువులుగా మార్చివేయాలని ఎవరూ ఎన్నడూ చెప్పలేదు. హిందుత్వం ఒక జీవన విధానం. సర్వ జీవులలో భగవంతుని దర్శిస్తుంది. భగవంతుడు ఒక్కడేనని, తాము పూజించేవాడే భగవంతుడని మొండివాదన చేసే మతాల వల్లనే నష్టం వాటిల్లింది. భారత్‌లోనే అన్ని మతాలవారు సుఖశాంతులతో జీవించగలుగుతున్నారు. ఇటువంటి హిందుత్వాన్ని అసహనశీలి అని ప్రచారం చేయడం సెక్యులరిస్టులకే తగింది.

హిరణ్య కశిపుడు ప్రహ్లాదునికి విద్య యొక్క విశిష్టతను తెలుపుతూ–

క. చదవనివాడజ్ఞుడగు
జదివిన స దస ద్వివేక చతురత గలుగుం
జదువంగ వలయును జనులకు
జదివించెద నార్యులొద్ద౦ జదువుము తండ్రీ!

శ్రీమదాంధ్ర మహాభాగవతం స.స్క.

చదువుకోని వాణ్ణి లోకం అజ్ఞానుడంటుంది. చదువుకోవడం వల్ల మంచేదో, చెడేదో గ్రహిస్తారు. కనుక జనులు చదువుకుంటారు. నిన్ను గురువుల వద్ద చదివిస్తాను చక్కగా చదువుకో నాయనా !

## 12వ లోక్‌సభ ఎన్నికలు

# ఆంధ్రప్రదేశ్ అనుసరించవలసిన మార్గం

**మార్చి 9- 15 , 1998**

ఈ మధ్య ముగిసిన 12వ లోక్‌సభ ఎన్నికల్లో రెండు కూటములు ప్రజల ముందుకు వచ్చాయి. ఒకటి కాంగ్రెస్ (ఐ) (ఐ అంటే ఇప్పుడు ఇందిర కాదు, ఇటలీ), యునైటెడ్ ఫ్రంట్ అనబడే మరొక కూటమి. ఇందులో కూడా కమ్యూనిస్టులు, జనతాదళ్ ఒక కూటమి, తెలుగుదేశం, ఎజిపి, డిఎంకె, టిఎంసిలు కలిపి మరొక కూటమి. ఈ కూటములన్నింటి మధ్య అనేక విభేదాలు ఉన్నా 'సెక్యులరిజం' పేరుతో బిజెపికి అధికారం దక్కనీయకూడదని ఇవన్నీ కలుస్తున్నాయి. గత యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని 'బయటనుండి మద్దతు' నివ్వడంలో ప్రావీణ్యం సంపాదించిన కాంగ్రెస్ పార్టీ కుంటిసాకు చూపి పడగొట్టింది. తమ అవినీతి చిట్టాలు బయటపడకుండా ఉండటానికి ఫ్రంట్ ప్రభుత్వాన్ని బలపరిచిన కాంగ్రెస్ నాయకులు తమ ఇటలీ నాయకురాలు ఆదేశంతో కూల్చి వేశారు. రాజీవ్‌గాంధీ హత్యకు డిఎంకె కి సంబంధం ఉందని ఆరోపించారు. దానితో 22 నెలలు గడవకుండానే ప్రభుత్వం పతనమై ఎన్నికలు నిర్వహించవలసిన పరిస్థితి ఏర్పడింది. అథమపక్షం 4000 కోట్ల రూ.ల ఖర్చు దేశంపై రుద్దబడింది. కాని 1998 ఎన్నికలు కూడా కాంగ్రెస్‌కిగాని, యునైటెడ్ ఫ్రంట్‌కి కాని సంతోషజనకంగా సాగలేదు. సోనియా గాంధీ నెహ్రూ- ఇందిర- రాజీవ్‌గాంధీల 'త్యాగపరంపర'ని గుర్తుచేసినా, తన కుమార్తె, కుమారులతో పాటు ప్రజల మధ్యకి వెళ్ళినా, బోఫర్స్ కుంభకోణంలో రహస్యాలు బయటపెట్టమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినా (నిజానికి సోనియాకి బోఫర్స్ రహస్యాలు ఏముంటాయి? ఆమె వాటిని బయటపెట్టనప్పుడు ఇతరులు ఎలా బయటపెడతారు?), బిజెపిని మతతత్వ పార్టీ అని దుమ్మెత్తి పోసినా, గాంధీ హత్యపై 'కన్నీళ్ళు' కార్చినా, కాంగ్రెస్‌కి మాత్రం ఎక్కువ సీట్లు రాలేదు. ఇక యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం చెప్పిన పచ్చి అబద్దాలకి, బిజెపి వ్యతిరేక ధోరణికి, అసమర్థ పాలనకి ప్రజలు మంచి గుణపాఠం చెప్పారు. జనతాదళ్ పూర్తిగా తుడిచి పెట్టుకుపోతే, డిఎంకె, టిఎంసిలు మట్టికరిచాయి. తెలుగుదేశం బలం గణనీయంగా తగ్గిపోయింది. బిఎస్‌పి ఇంతకుముందు స్థానాలను కూడా నిలుపుకోలేకపోయింది. బిజెపి కూటమి మాత్రవే ఇంతకుముందు కంటే ఎక్కువ స్థానాలు సంపాదించుకోగలిగింది. దురదృష్టవశాత్తు ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి బిజెపి కూటమికి కొన్ని సీట్లు తక్కువ అవుతున్నాయి.





ఇటువంటి పరిస్థితిలో తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీ నాయకుడు అనుసరించవలసిన బాధ్యతాయుతమైన పాత్ర గురించి ఆలోచిద్దాం. గత 20 నెలల్లో మన ముఖ్యమంత్రి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడడానికి, మనుగడ సాగించడానికి ప్రధాన పాత్ర వహించినా అందువల్ల రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. కృష్ణానదిపై ఆల్మట్టిడామ్ ఎత్తు పెంచుతున్నా దేవెగౌడ చూసిచూడనట్లు ఊరుకున్నాడు. పంజాబ్‌కి చెందిన రూ. 700 కోట్ల ఋణాలను మాఫీ చేసి గుజ్రాల్ పంజాబీలను సంతుష్టపరచాడు. కాని మన రాష్ట్రానికి మాత్రం వరద సహాయనిధులుగానీ, కరువు సహాయనిధులుగాని అందలేదు. కేంద్రంలో అస్థిర ప్రభుత్వం మూలంగా ప్రజలు విసిగిపోయారు. కాంగ్రెస్ మాదిరిగా 'బయటినుండి మద్దతు' నివ్వడంలో సౌలభ్యాన్ని గుర్తించిన కమ్యూనిస్టులు బాధ్యత లేని అధికారాన్ని అనుభవిస్తూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని ప్రయత్నించారు. కాంగ్రెస్ పార్టీ వంశ పారంపర్యతకి వ్యతిరేకంగా, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతుందని భావించి ప్రజలు ఇప్పటి వరకు తెలుగుదేశానికి ఓట్లు ఇచ్చారు. కాని ఆ పార్టీ కాంగ్రెస్, కమ్యూనిస్టుల కీలు బొమ్మ ప్రభుత్వానికి మద్దతు నిస్తుండడంతో ప్రజలు బిజెపి వైపు మొగ్గు చూపారు. అటల్‌బిహారీ వాజ్‌పాయ్ నేతృత్వంలో సుస్థిరమైన, పటిష్టమైన ప్రభుత్వం ఏర్పడాలని భావించారు.

బిజెపి కూటమికి ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పరచడానికి మరికొన్ని సీట్ల అవసరం ఏర్పడింది. ఇటువంటి పరిస్థితిలో తెలుగుదేశం పార్టీ దేశహితం కోసం, రాష్ట్ర హితం కోసం, తెలుగుదేశం పార్టీ హితం కోసం సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలు ఆశిస్తారు. తెలుగుదేశం పార్టీ కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి మద్దతును ప్రకటిస్తే ఈ ప్రయోజనాలన్నీ నెరవేరుతాయి. కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీకి ప్రధాన శత్రువుగా మారింది. ముందుముందు కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశాన్ని రూపుమాపేందుకే ప్రయత్నిస్తుంది. 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా, అక్రమంగా బర్తరఫ్ చేసిందనే విషయాన్ని గుర్తు చేసుకోవాలి. అలాగే ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పున:స్థాపించడానికి బిజెపి నిస్వార్థంగా చేసిన పోరాటాన్ని కూడా మరచిపోకూడదు.

అంతేకాదు బిజెపి తెలుగుదేశం అసెంబ్లీ ఎన్నికల్లో సమైక్యంగా పోరాడితే కాంగ్రెస్ పరాజయం పాలవుతుంది. కనుక టిడిపిఇప్పుడు బిజెపికి స్నేహ హస్తం అందిస్తే 1999లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన విజయావకాశాల్ని మరింత మెరుగుపరుచుకున్నట్లవుతుంది.

టిడిపి యునైటెడ్ ఫ్రంట్ నుండి వైదొలగితే కమ్యూనిస్టుల నుండి వ్యతిరేకత ఎదుర్కొనవలసి వస్తుంది. నిజానికి కమ్యూనిస్టులకి రాష్ట్రంలో ఉన్న బలం తక్కువే. వారికి పేదరికాన్ని సర్వత్రా వ్యాప్తి చేయడంలో ఉన్న శ్రద్ధ సంపదని సృష్టించడంలో లేదు. ఇప్పటివరకు అన్ని ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీచలవతో కొన్ని సీట్లు సంపాదించుకుంటూ వస్తున్నారు. ఒక ప్రక్క టిడిపి దయతో కాలం వెళ్ళదీస్తూనే మరో ప్రక్క అదే పార్టీని, ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. వారికి సంఘర్షణనే ముఖ్యం. వారిది అభివృద్ధి వ్యతిరేక ధోరణి. కనుక వారిని వదలించుకుంటేనే మంచిది.

ఇక ముస్లిం ఓట్లు కోల్పోవలసి వస్తుందేమోననే భయం కూడా అర్థరహితమైనది. హైదరాబాద్‌లోని పాతబస్తీలో ఉండే సెక్యులర్ ముస్లిములు కూడా టిడిపికి ఓటు వేయరు. ఇస్లాంని రక్షించడంలో, వ్యాప్తి చేయడంలో మజ్లిస్ పార్టీ కంటే టిడిపి ముందు ఉంటుందని వాళ్ళు అనుకోరు.అదే అనుకుంటే మెదక్, గుంటూరు, కర్నూల్‌లలో ముస్లిములు టిడిపికే ఓట్లు వేసేవారు. ముస్లిములను సంతుష్ట పరచడంలో కాంగ్రెస్ ప్రావీణ్యం సంపాదించింది. పాకిస్తాన్ ఏర్పాటు, షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించడం, బంగ్లాదేశీ ముస్లిముల అక్రమ ప్రవేశాన్ని అంగీకరించడం, ఐఎస్ఐ ఏజంట్లు దేశంలో విచ్ఛిన్నకర కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిసినా 'టాడా' చట్టాన్ని రద్దుచేయడం వంటి 'ఘనకార్యాల' ద్వారా కాంగ్రెస్ ముస్లిములకి దగ్గరయింది. కనుక ఇప్పుడు టిడిపి ఎంత ప్రయత్నించినా కాంగ్రెస్‌ని అధిగమించలేదు. కనుక టిడిపి ముస్లిం సంతుష్టీకరణకు ప్రయత్నించడం వ్యర్థం.

టిడిపి బూటకపు సెక్యులరిస్టులు, కులతత్వం మూర్తీభవించిన 'సామాజిక న్యాయవాదులు' అనుసరిస్తున్న బిజెపి వ్యతిరేక ధోరణికి మద్దతునివ్వకూడదు. బూటకపు సెక్యులరిస్టులు, కమ్యూనిస్టుల దుష్ప్రచారాన్ని లెక్కచేయకుండా బిజెపికి మద్దతునివ్వడం వల్ల పంజాబ్‌లో అకాలీలు లాభం పొందారు. టిడిపి కూడా బలమైన కేంద్రం, పటిష్టమైన రాష్ట్రాలు ఏర్పడాలంటే బిజెపికి మద్దతునివ్వాలి. భవ్యమైన భారతాన్ని నిర్మించడంలో టిడిపి బిజెపితో కలిసి పనిచేయాలి. తద్వారా దేశాన్ని వంశపారంపర్య పాలన నుండి, భజనపరుల నుండి, దోపిడీదారుల నుండి, విచ్ఛిన్నకరవాదుల నుండి కాపాడాలి.





# సోనియా భజన ప్రమాధకరం

**మార్చి 16- 22 , 1998**

కొన్ని వారాల క్రితం ఇటలీలో పుట్టి, చాలా ఆలస్యంగా భారతీయ పౌరసత్వం స్వీకరించిన రాజీవ్‌గాంధీ భార్య సోనియా తన సౌకర్యవంతమైన, విలాసవంతమైన భవనాన్ని వదలి కాంగ్రెస్ (ఐ) తరఫున ప్రచారం చేయడానికి బయటికి వచ్చింది. హెలీకాప్టర్‌లో ఒకచోట నుండి మరొక చోటికి వెళుతూ తన కుమార్తెని, కుమారుడిని ఆఖరుకి అల్లుడిని కూడా చూపి కాంగ్రెస్‌కి ఓటు వేయమని అడిగింది. ఆమె ఉపన్యాస సారాంశం ఇది:

నేను భర్తను కోల్పోయాను. రాజీవ్‌గాంధీ నాకు అత్యంత ప్రియమైన వ్యక్తి. ఆయన ఎంతో గొప్పవాడు. ఆయనకి ఒక గొప్ప లక్ష్యం ఉండేది. ఐతే ఆ లక్ష్యం నెరవేర్చలేకపోయారు. ఇప్పుడు నేను ఆ లక్ష్యాన్ని నెరవేర్చాలనుకుంటున్నాను. నేను నెహ్రూ, ఇందిర, రాజీవ్‌ల పరంపరని కొనసాగిస్తాను. నేను భారతమాత సుపుత్రిని. నేను రాజీవ్ కలలను సాకారం చేయాలనుకుంటున్నాను. నేను బోఫర్స్ గురించి ఏమీ చెప్పను కానీ ప్రభుత్వం బోఫర్స్ విచారణకు సంబంధించిన రహస్యాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తాను. నిజానికి కాంగ్రెస్, రాజీవ్‌గాంధీ రామరాజ్యాన్ని స్థాపించాలని ప్రయత్నించారు. కాని ఒక మతతత్వ పార్టీ ఆ నినాదాన్ని తస్కరించింది. (ఇంకా నయం రామరాజ్యం పోయింది కాబట్టి రోమురాజ్యం స్థాపిస్తానని అనలేదు!) తమిళనాడులోని ఒక పార్టీకి చెందిన ప్రభుత్వం తగిన రక్షణ కల్పించకపోవడం వల్లనే రాజీవ్‌గాంధీ హత్యకి గురి అయ్యారు. అంతేకాదు నా భర్తని హత్య చేసిన ఎల్.టి.టి.ఈ.తో సన్నిహితంగా మెలిగింది. రాజీవ్‌గాంధీ హత్యకి కారణమైన పార్టీ ఉండడం వల్లనే కాంగ్రెస్ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. ప్రస్తుతపు ఎన్నికల్లో అది ప్రధానాంశం కాదు. కాంగ్రెస్‌ని గెలిపించండి. కాంగ్రెస్ నా భర్త కలల్ని నిజం చేస్తుందని నేను హామీ ఇస్తున్నాను. నేను ఏడు సంవత్సరాల క్రితం నా భర్తని కోల్పోయాను.నేను అప్పటి నుండి ఏకాకిగానే బ్రతుకుతున్నాను.(అదే రాజీవ్‌గాంధీ ప్రధాని అయినప్పుడు ఢిల్లీలో ప్రాణాలు కోల్పోయిన సిక్కుల గురించి గాని, వారి భార్యల గురించి గాని ఆమె ఒక్క సానుభూతి వాక్యం పలకలేదు. కేవలం తన వైధవ్యం గురించే ప్రజలు బాధపడిపోవాలని తన భర్తనే అందరూ గుర్తు పెట్టుకోవాలని ఆమె ఉద్దేశ్యం కాబోలు) ప్రియాంక, రాహుల్‌లు

రాజీవ్ వారసులు, గొప్ప నెహ్రూ పరంపరకి వారసులు (సంజయ్ గాంధీ భార్య మేనకాగాంధీ, ఆమె కుమారుడు వరుణ్ భారతీయులు, నెహ్రూ కుటుంబానికి చెందినవారు. అయినా వారిని మరచిపోండి. నేను ఇటలీ దేశస్థురాలిని, నా పిల్లలు క్రైస్తవులు రాజీవ్‌గాంధీ తన వివాహ సమయంలో రాబర్ట్గో గాంధీ అని సంతకం చేశాడు). ఈ పట్టణానికి మా అత్తగారు అనేకసార్లు వచ్చింది. ఇదే స్థలంలో నా భర్త హత్యకి గురయ్యాడు. ఈ పట్టణంలో నా భర్త 21వ శతాబ్దంలో భారత్ ఎలా ఉండాలన్న విషయంపై చర్చించాడు. ఈ రాష్ట్రం నెహ్రూ కుటుంబానికి ఎంతో ప్రియమైనది. ఈ నియోజకవర్గం ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే నా భర్త ఇక్కడ నుండే ఎన్నికయ్యారు. మళ్ళీ ఈ సారి ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుండి నా భర్త స్నేహితుడిని నిలబెట్టాను. మీరంతా ఆయనకి ఓటు వేయండి” అని తనని చూడటానికి వచ్చిన వందలాది మంది పేద, సామాన్య ప్రజానీకానికి ఆమె చెప్పింది. ఇందిరాగాంధీ మాదిరిగా చేతులు రెండూ ఊపుతూ (చేతులు ఊపడాన్ని మేనకాగాంధీ వర్షం నీళ్ళు తుడిచే కారు వైపర్స్‌తో పోల్చారు) ప్రజల అభినందనలు అందుకుంది. ఈ దెబ్బతో మతతత్వ వాదులు కొట్టుకుపోతారని అనుకొన్నది. వందలాది మంది ఆమెను చూసి ఆకర్షితులయ్యారని, బిజెపి అధ:పాతాళానికి పోతున్నదని, కాంగ్రెస్ విజయపరంపరలను దక్కించుకుంటుందని అన్నారు. ఆమె చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందన్నారు. సోనియా ప్రచారం గురించి అభిప్రాయం అడిగినప్పుడు మేనకాగాంధీ తనకి ఒక కుటుంబపు ‘పేరు ప్రతిష్ట’ల మీద ఆధారపడవలసిన అవసరంలేదని, ఒకరిని గుర్తుచేసి ఓట్లు అడిగే అవసరం లేదని, తన భర్త పేరున ఎలాంటి ఫౌండేషన్ సంస్థలు తనకు లేవని అన్నారు. ఆమె ఇప్పటివరకు అనేక ప్రజోపయోగ అంశాలపై ఉద్యమాలు నిర్వహించారు. తద్వారా ప్రజలకి దగ్గరయ్యారు.

ఎన్నికలు పూర్తయ్యాయి, ఫలితాలు కూడా రావడం ప్రారంభమైంది. అప్పుడుగాని తెలియలేదు సోనియా ప్రచారం వల్ల కాంగ్రెస్‌కి ఒరిగిందేమి లేదని. ఇప్పుడు ఎవరూ ఆమె గురించి మాట్లాడటం లేదు. ఆమె అభిప్రాయాలు తెలుసుకోవడం లేదు. ప్రస్తుతం అందరికళ్ళూ సీతారాం కేసరి మీద ఉన్నాయి. దేశాన్ని రక్షించాలని తాపత్రయపడిపోయిన ఆమె గురించి ఇప్పుడు ఎవరూ పట్టించుకునే వారే లేరు. తనకి, తన సంతానానికి ప్రజల్లో ఏమాత్రం పేరు ఉందో పరీక్షించుకునేందుకే ఈ ప్రచారం ఉపయోగపడి ఉంటుంది. భారతీయులు దేశాన్ని ‘రక్షించాలన్న’ ప్రయత్నాల్ని





గుర్తించలేదు పాపం! మరి ఇప్పుడు ఆమె చెప్పింది ఏంచేస్తారు? తిరిగి ప్రశాంతమైన ఏకాంత జీవనాన్ని గడుపుతారా?

ఇలా అనేక ప్రశ్నలు తలెత్తుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీలో మళ్ళీ ఒకసారి నాయకత్వపు సంక్షోభం ఏర్పడింది. బిజెపి వ్యతిరేకతే ఏకైక లక్ష్యంగా కలిగిన హరికిషన్ సింగ్ సూర్జిత్, ములాయం సింగ్ యాదవ్, లల్లూ ప్రసాద్ యాదవ్ వంటి వారంతా యునైటెడ్ ఫ్రంట్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పరిస్తే మద్దతునివ్వాలని ప్రకటించడంతో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. నెహ్రూ కుటుంబానికి విశ్వాసపాత్రులైన అర్జునసింగ్, తివారీ వంటివారు ఎన్నికల్లో ఓడిపోవడంతో నాయకత్వ పదవికి జరిగే పోటీలో లేకుండాపోయారు. అయినా ప్రధాని పదవికి పోటీ తక్కువగా ఉండదు. అత్యంత మూర్ఖుడు, వివాదాస్పదుడైన సీతారాంకేసరి కూడా పోటీలో ఉన్నాడు. వీరిలో ఏకాభిప్రాయం ఏర్పడబోదు. అందుచేత మళ్ళీ ఇటలీ మహిళ ముందు సాగిలపడాలని వీళ్ళు నిశ్చయించుకున్నట్లున్నారు. 18వ శతాబ్దిలో తమలో తాము కలహించుకుంటూ నవాబులు, రాజులు యూరప్ నుండి వచ్చిన కంపెనీల సహాయాన్ని అర్థించారు. కాని ప్రస్తుతం కాంగ్రెస్ రాజులు కూడా విదేశీయులనే ఆశ్రయించాలనే ప్రయత్నిస్తున్నారు. లోకమాన్యతిలక్, సర్దార్ పటేల్, సుభాష్ చంద్రబోస్, లజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్, వంటి మహామహులు నాయకత్వం వహించిన కాంగ్రెస్ పార్టీకి నేడు భారతదేశం గురించి ఏమీ తెలియని, ఒక్క భారతీయ భాష కూడా రాని, రాజకీయ పరిజ్ఞానం ఏమాత్రం లేని విదేశీ వనిత నాయకత్వం వహించాలని కోరుకుంటున్నారు. ఈ దేశ సంస్కృతి, సభ్యతల పట్ల అవగాహన, గౌరవం కలిగిన నాయకులు ప్రస్తుతపు కాంగ్రెస్‌లో లేనేలేరనే అనుమానం వస్తోంది. ఒకవేళ అలాంటివారు ఎవరైనా ఉంటే వారు ఆ పార్టీని వదలి బయటికి వచ్చి జాతీయవాదులకు మద్దతునిచ్చి ‘పురోగమన సోషలిస్ట్, సెక్యులర్, మార్క్సిస్టు’ పార్టీల బండారాన్ని బయటపెట్టాలి. అలా చేయకపోతే దేశం మరోసారి 18వ శతాబ్దంలో మాదిరిగా ప్రమాదంలో పడుతుంది. అప్పుడు విదేశీయులు మళ్ళీ ఒకసారి దేశాన్ని దోచుకుంటారు.

## లోక్‌సభ ఎన్నికల తరువాత.......

**ఏప్రిల్ 6- 12 , 1998**

మన దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలు 12వ లోక్‌సభ ఎన్నికల తరువాత కూడా అలాగే ఉండి పోయాయి. అంతేకాదు మరికొన్ని కొత్త సమస్యలు పుట్టుకు వచ్చాయి. వీటిలో మొదటిది అధికారంలో ఉన్న నాయకులలో పెరిగిపోయిన అవినీతి. స్వాతంత్ర్యం వచ్చి 50 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు అవినీతి ఆరోపణలకు గురైన ఒక్క రాజకీయ నాయకుడిని కూడా శిక్షించడం జరగలేదు. అలాగే తమ అధికారాన్ని దుర్వినియోగం చేసిన నాయకులు కూడా ఎలాంటి శిక్ష పొందకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. నెహ్రూ కాలం నాటి ప్రతాప్‌సింగ్‌కైరన్, భక్షీ గులాం మహ్మద్, వి.కె.కృష్ణమీనన్, కె.డి.మాలవ్య (చివరి ఇద్దరు పురోగమన వాదులు, సోషలిస్టులు, సెక్యులరిస్టులుగా పేరు పడ్డారు); ఇందిర కాలం నాటి సంజయ్‌గాంధీ, అబ్దుల్ రహమన్ అంతులే, జగన్నాథమిశ్రా, చిమన్‌భాయి పటేల్, చెన్నారెడ్డి, కరుణానిధి, భజన్‌లాల్; రాజీవ్‌కాలం నాటి స్వయంగా రాజీవ్ (భోఫర్స్, హెచ్‌డిడబ్ల్యూ, ఎయిర్‌బస్....) ; నరసింహారావు కాలం నాటి ఆయన కుమారులు, బంధువులు, జాఫర్‌షరీఫ్, షీలాకౌల్, సతీష్‌శర్మ, లాలూప్రసాద్‌యాదవ్, మాలాయంసింగ్, బలరాం జాఖర్ మొదలైన వారంతా ఇలాంటి అవినీతి చరిత్ర కలిగిన నాయకులే. పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు ప్రభుత్వంలో జరిగిన ప్రభుత్వ నిధుల తరలింపు కుంభకోణానికి సంబంధించిన విచారణ ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. ఎన్నికల సమయంలో అవినీతిపరులకి శిక్షపడుతుందని ఆశించారు. కాని అలాంటిదేదీ జరగలేదు. లాలూప్రసాద్ యాదవ్ రాష్ట్రీయ జనతాదళ్, సుఖ్‌రాం వికాస్‌మంచ్, జయలలిత ఎఐడిఎంకె పార్టీలు ఎన్నికల్లో గెలిచి సీట్లు సంపాదించుకున్నాయి. నేరమయ, కులతత్వ పార్టీ అయిన ములాయంసింగ్ సమాజ్‌వాది పార్టీ ఎన్నికల్లో విజయం సాధించినా కన్షీరాం కులతత్వపార్టీ బిఎస్‌పి మాత్రం పరాజయం పాలైంది.

కాంగ్రెస్ (ఇందిర) పూర్తిగా తుడిచిపెట్టుకు పోతుందని అనుకున్నా అది జరగలేదు. దీనికి కారణం ఎన్నికల ప్రచారంలో రాజీవ్ భార్య సోనియా రంగంలో దిగి ప్రచారం చేయడం, తాను రాజీవ్ భార్యనని, నెహ్రూ కుటుంబానికి చెందిన వ్యక్తినని ఓట్లు అడగడం. దానికి తోడు తన కుమార్తె, అల్లుడు, కొడుకు (ఇతనికి





కొలంబియాకి చెందిన ఒక క్రైస్తవ మతస్థురాలితో వివాహం నిశ్చయమైంది) లను చూపి వీరు దేశాన్ని ఏలడానికి సిద్ధంగా ఉన్నారని ప్రచారం చేసింది. ఆమె ప్రచారం పార్టీకి కొత్తగా సీట్లు సంపాదించి పెట్టకపోయినా పూర్తిగా పరాజయం పాలుకాకుండా కాపాడింది. దేశం మొత్తంలో ప్రజల్ని ఆకర్షించగలిగిన కాంగ్రెస్ నాయకుడు ఒక్కరు కూడా లేకపోవడంతో సోనియా కాంగ్రెస్ పార్టీ పగ్గాల్ని చేజిక్కించుకుంది. ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీని తన సొంత పార్టీగా మార్చినట్లుగా, ప్రభుత్వ నిధులతో ఏర్పాటైన రాజీవ్‌ఫౌండేషన్‌కు సోనియా తనని తాను శాశ్వత అధ్యక్షురాలిగా నియమించుకున్నట్లుగా సోనియా కాంగ్రెస్‌ని చేజిక్కించుకుంది. ఇప్పుడు మన దేశానికి కొత్త సమస్య ఎదురైంది. విదేశాలలో పుట్టి, చాలాకాలం తరువాత ఈ దేశ పౌరసత్వం స్వీకరించిన వ్యక్తి ఇక్కడి ఒక ప్రధాన పార్టీకి నాయకత్వం వహించబోతున్నది. భారతీయ కంపెనీలను కొకొకోలా, బాట్ వంటి విదేశీ కంపెనీలు హస్తగతం చేసుకోవడానికీ ఒక ప్రధానమైన రాజకీయ పార్టీని విదేశీయురాలు చేజిక్కించుకోవడానికి తేడా ఏదీ కనబడడం లేదు. తన దేశస్థుడైన పృథ్వీ రాజ్‌ని కాదని, అతనిపై కక్షకట్టి జయచంద్రుడు విదేశస్థుల్ని ఆశ్రయించడం గుర్తుకు వస్తోంది.

ఈ ఎన్నికల్లో ఆహ్వానించదగిన ఫలితం యునైటెడ్ ఫ్రంట్ పరాజయం. ఎటువంటి నీతి నియమాలు లేని కొన్ని పార్టీలు ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి. సుర్జిత్‌సింగ్ వంటి తాడు బొంగరం లేని నాయకుల నేతృత్వంలోని సిపిఐ (ఎం) ఫ్రంట్ ప్రభుత్వాన్ని తెరవెనుక ఉండి ఆడించింది. ఇటువంటి సిపిఐ (ఎం) కులతత్వ, ముస్లిం మతతత్వ పార్టీలను, తీవ్ర కాంగ్రెస్ వ్యతిరేకి అయిన తెలుగుదేశం వంటి పార్టీలను కలిపి కాంగ్రెస్ సమర్థనతో ప్రభుత్వాన్ని నడపాలని చూసింది. ఈ పార్టీలన్నీ 'సెక్యులరిజం' అనే పేరున చెలామణీ అవుతున్న హిందూ వ్యతిరేక, ముస్లిం సంతుష్టీకరణ విధానాన్ని ఆధారంగా చేసుకుని ఒకచోట కలిశాయి. జనతా (జగడా) దళ్ బలం గత లోక్‌సభలో 56 ఉంటే ఇప్పుడది ఆరుకి తగ్గిపోయింది. ఫ్రంట్ మతతత్వ పార్టీగా ముద్రవేసిన శిరోమణి అకాలీదళ్ దయతో ఐ.కె.గుజ్రాల్ లోక్‌సభకి ఎన్నిక కావలసి వచ్చింది. ఎజిపి తుడిచిపెట్టుకు పోయింది. డిఎంకె, టిఎంసిలు పరాభవం పొందాయి. టిడిపి 28 శాతం ఓట్లును కోల్పోయింది. సిపిఐ పరిస్థితి కూడా అలాగే ఉంది. డమ్‌డమ్‌లో మొట్టమొదటిసారి సిపిఐ (ఎం) బిజెపి చేతిలో పరాజయం పాలైంది. ఫ్రంట్ బలం 170 నుండి 100కి తగ్గిపోయింది. ఐనా కామ్రేడ్ హరికిషన్‌సింగ్

సుర్జిత్ వంటి విచ్ఛిన్నవాద, విఘటనవాద నాయకుల ప్రాబల్యం నశించలేదు. ఈసారి కూడా హరికిషన్ బిజెపి వ్యతిరేక సెక్యులర్ ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి, అందుకు కాంగ్రెస్ (ఇటలీ) మద్దతు పొందేందుకు ప్రయత్నించాడు. కమ్యూనిస్టులు తమ బలానికి మించి అధికారాన్ని, అదుపుని సంపాదించాలని ప్రయత్నిస్తారు. దానివల్ల మిగతా పార్టీలన్నీ నష్టపోతాయి. ఇది కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న అన్ని దేశాల్లో స్పష్టమయింది. కనుక టిడిపి, ఎజిపి, డిఎంకె వంటి పార్టీలు కమ్యూనిస్టులతో ఎంత త్వరగా తెగతెంపులు చేసుకుంటే వాటికి అంత మంచిది.

'సెక్యులర్, సోషలిస్ట్, పురోగమన' పార్టీలు వేసిన 'అంటరాని పార్టీ' ముద్రని చెరుపుకునేందుకు బిజెపి ప్రయత్నించి విజయం సాధించింది. ఈ ప్రయత్నంలో అనేక పార్టీలతో పొత్తు కుదుర్చుకుంది.

వివిధ పార్టీలను కలుపుకుని పని చేయడంలో బిజెపి కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనవచ్చును. స్వార్థ ప్రయోజనాల కోసం, తమ అవినీతి చర్యలు బయటపడకుండా ఉండడం కోసం అసెంబ్లీలలో గొడవ సృష్టించే ఎమ్మెల్యేలు, దేశ విభజనకి కారణమైన మతతత్వ ధోరణులు ప్రజాస్వామ్యానికి సమస్యలుగా నిలుస్తున్నాయి. జనాభా పెరుగుదల, నిరక్షరాస్యత, నైతిక విలువల పతనం, బాధ్యతలను విస్మరించటం, నేరప్రవృత్తి పెరగడం వంటివి దేశం ఎదుర్కొంటున్న కఠినమైన సమస్యలు.

శ్రీ అటల్‌బిహారీ వాజ్‌పాయ్ తన అపారమైన అనుభవం, శక్తిసామర్థ్యాల ద్వారా సమస్యల్ని పరిష్కరించి దేశంలో సుహృద్భావ పూర్వమైన వాతావరణాన్ని ఏర్పరుస్తారని ఆశించవచ్చును.

మన్నెందుకు తింటున్నావని యశోద -

**క.** **మన్నేటికి భక్షించెదు,**
**మ న్నియమము లేల నీవు మన్నింపవు నీ**
**యన్నయు సఖులును జెప్పెద**
**రన్నా మ న్నేల మఱి పదార్థము లేదే**

శ్రీమదాంధ్ర మహాభాగవతం ద.స్క

నీ అన్న బలరాముడు, స్నేహితులు నీవు మన్ను తింటున్నావంటున్నారు. మన్నెందుకు తింటున్నావు. నీకై పదార్థాలు తినడానికింట్లో లేవా? అని గద్దించి అడిగింది.





# రాష్ట్ర ప్రభుత్వాల రద్దు

**ఏప్రిల్ 13- 19 , 1998**

ఆర్టికల్ 356 ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయడం అన్యాయమని తమ వ్యతిరేకత వ్యక్తం చేసిన పార్టీలే ఈనాడు కేంద్ర ప్రభుత్వంలో పాలు పంచుకుంటున్నప్పుడు రాష్ట్రంలో తమకు ప్రత్యర్థులైన పార్టీల ప్రభుత్వాల్ని రద్దు చేయమని కోరుతున్నాయి. తమిళనాడులో డిఎంకె ప్రభుత్వాన్ని రద్దు చేయాలని, బీహార్‌లో రబ్రీదేవిని గద్దె దింపాలని ఎఐడిఎంకె, సమతాపార్టీలు కోరడం ఇలాంటిదే. మొదట మనం గుర్తు పెట్టుకోవలసింది అసెంబ్లీలకి, పార్లమెంటుకి ఎన్నికలు వేరువేరు సమయాల్లో జరిగాయి. అప్పటి ఎన్నికల అంశాలు కూడా వేరవేరు. కనుక రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పొందితే దానర్థం ప్రజలు రాష్ట్రంలో అధికార పక్షాన్ని వ్యతిరేకిస్తున్నారని కాదు. అలాగే ఆ రాష్ట్రంలో ఎక్కువ లోక్‌సభ సీట్లు గెలుచుకున్న పార్టీ రాష్ట్ర ప్రభుత్వాల్ని రద్దు చేయమనడం కూడా సమంజసం కాదు. దురదృష్టవశాత్తూ 1977 జనతా ప్రభుత్వం, 1980లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి తప్పును చేశాయి. రాజకీయ రంగంలో ఉన్నతమైన విలువలు, ప్రమాణాలను నెలకొల్పడానికి కంకణం కట్టుకున్న బిజెపి మిత్రపక్షాల వత్తిడికి లోనై అటువంటి తప్పిదం చేయకూడదు. ఆర్టికల్ 356ని దుర్వినియోగం చేయబోమని ప్రధాని ప్రకటించడం ఆహ్వానించదగిన పరిణామం.

కాని ఏదైనా రాష్ట్రంలో శాంతి భద్రతలకి భంగం ఏర్పడినప్పుడు, విచ్ఛిన్నకర శక్తులు విజృంభించినప్పుడు, బాంబు ప్రేలుళ్ళు మొదలైన మారణకాండ పెచ్చు పెరిగినప్పుడు కేంద్రం జోక్యం చేసుకోవచ్చును. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరాలని, రాష్ట్ర ప్రభుత్వం పంపిన నివేదికని నిష్పక్షపాత ధోరణితో పరిశీలించాలని సర్కారియా కమీషన్ పేర్కొంది. అవసరమైతే కేంద్ర హోంమంత్రి ప్రతిపక్ష సభ్యులతో చర్చించవచ్చును. అప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయవలసిందని హోంమంత్రి, ఇతర కేబినెట్ సభ్యులు నిర్ణయిస్తే లోక్‌సభలో తీర్మానం ప్రవేశపెట్టాలి. తీర్మానం ఆమోదం పొందిన తరువాతే రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలి. ఇటువంటి నిష్పక్షపాత విధానం మూలంగా ప్రభుత్వం పట్ల ప్రజలలో నమ్మకం ఏర్పడుతుంది.

మన సరిహద్దు రాష్ట్రాలు కొన్నింటిలో మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి విచ్ఛిన్నకర కార్యకపాలను అదుపు చేయడానికి త్వరితంగా నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. అలాంటప్పుడు రాష్ట్రపతి ఆర్టికల్ 356ని ఉపయోగించ వలసిందని ప్రభుత్వాన్ని కోరవచ్చును. ఇది కూడా రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించిన మీదట మాత్రమే రాష్ట్రపతి కేంద్రానికి సిఫార్సు చేయాలి. ఇందుకోసం రాష్ట్రపతి ప్రతిపక్ష సభ్యుల్ని కూడా సంప్రదించవచ్చును.

దేన్ని ఇష్టపడే మనస్సు దాన్నే కోరుకుంటుంది లోక సహజం ఎలా అంటే

**సీ. మందార మకరంద మాధుర్యమునఁ దేలు**
**మధుపంబు వోవునే మదనములకు**
**నిర్మల మందాకిని వీచికలఁ దూఁగు**
**రాయంచ సనునె తరంగిణులకు**
**లలిత రసాలవల్లన ఖాది యై చొక్కు**
**కోయిల సేరునే కుటజములకు**
**పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక**
**మరుగునే సాంద్ర నీహారములకు**

**తే. అంబుజోదర దివ్య పాదారవింద**
**చింతనామృత పానవిశేష మత్త**
**చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు**
**వినుతగుణశీల! మాటలు వేయునేల?**

శ్రీమదాంధ్ర మహాభాగవతం స.స్క.

మందారపూవులోని తేనె నాస్వాదించే తుమ్మెద, ముళ్ళ చెట్ల మీద వాలుతుందా? పవిత్రమైన ఆకాశగంగలో ఈదులాడే రాజహంస, పిల్లకాలువల్లోకి వెళ్తుందా? తీయమామిడి చిగుళ్ళను తినే కోయిల కొడిసె ఆకులు తింటుందా? తినదు. పున్నమి చంద్రుని వెన్నెల గ్రోలే చకోరం మంచును కోరుకుంటుందా? భగవంతుని పాదపద్మాలను నిరంతరం తలిచే నా మనస్సు మరో విషయం మీదికి పోదు. బుద్ధిమంతుడైన వానికి వేయి మాటలు చెప్పాల్సిన పని లేదు అని పురోహితుని వైపు చూస్తూ ప్రహ్లాదుడంటాడు.





# ఇజ్రాయిల్, భారత్‌ల స్వర్ణోత్సవాలు

**ఏప్రిల్ 27 - మే 3 , 1998**

50 సం.ల క్రితం (మే 14, 1994) యూదులు తమ రాజ్యాన్ని స్థాపించుకున్నారు. యూదులకి ఆరువేల సంవత్సరాల పురాతన చరిత్ర ఉంది. యూదుల రాజ్యాలైన ఇజ్రాయిల్, జుదేవలను క్రీ.శ. 70లో రోమన్‌లు ఆక్రమించుకుని వారిని అనేక దేశాలకి తరిమివేశారు. 7వ శతాబ్దంలో అరబ్‌లు ఇజ్రాయిల్‌ని ఆక్రమించుకున్నారు. యూరప్ మొత్తంలో చెల్లా చెదురైన యూదులు ఎప్పటికైనా తమ మాతృభూమిని తిరిగి చేరుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. టర్కీ సామ్రాజ్యం ఏర్పడటంతో పాలస్తీనాగా పిలవబడిన ఇజ్రాయిల్‌లోకి పరిమిత సంఖ్యలో యూదుల్ని అంగీకరిస్తామని టర్కీ పేర్కొంది. 19వ శతాబ్దంలో థియోడోర్ హెర్జెల్ నేతృత్వంలో ఏర్పడిన ప్రపంచ జియోనిస్ట్ కాంగ్రెస్ ప్రపంచంలో చెల్లాచెదురైన యూదులంతా తమ మాతృదేశమైన ఇజ్రాయిల్ చేరుకోవాలని పిలుపునిచ్చింది. జియోనిస్ట్ కాంగ్రెస్ అరబ్‌ల నుండి బీడు భూములను కొని వాటిని సామూహిక వ్యవసాయ క్షేత్రాలుగా మార్చింది. మొదటి ప్రపంచ యుద్ధంలో (1914–1918) టర్కీ ఓటమి పాలైనప్పుడు లీగ్ ఆఫ్ నేషన్స్ ప్రకారం పాలస్తీనా బ్రిటీష్ అధికారంలోకి పోయింది. జర్మనీలో హిట్లర్ నాజీ పార్టీ పాలన ప్రారంభమైనప్పటి నుండి హిట్లర్ ఆక్రమించుకున్న అనేక యూరప్ దేశాలలో యూదులను వెతికి, వెంటాడి గ్యాస్ ఛాంబర్లలో హతమార్చడం జరిగింది.

అలా ఆరు మిలియన్‌ల యూదులు చంపబడ్డారు. ఈ మారణకాండ నుండి తప్పించుకోగలిగిన వారు మాత్రం ఇజ్రాయిల్‌కి తరలిపోయారు. 1900 సంవత్సరాల తరువాత యూదులు ఇజ్రాయిల్‌కి తిరిగి రావడాన్ని అరబ్ దేశాలు సహించలేకపోయాయి. ఇది ఇస్లాం, జుడాయిజాల మధ్య మత యుద్ధంగా భావించాయి. నిజానికి అరబ్‌లు, యూదులు అబ్రహం సంతతికి చెందినవారు కాబట్టి జాతిపరమైన విభేదాలు ఉండకూడదు. పాలస్తీనాలో యూదులు, అరబ్‌లు పరస్పరం కలహించుకుంటూ అక్కడ అధికారంలో ఉన్న బ్రిటీష్ వారితో కూడా ఘర్షణ పడుతూ ఉండేవారు. సరిగ్గా ఇదే సమయంలో (1945 నుండి 1948) భారత్‌లో కూడా హిందువులు, ముస్లిములు ఒకరినొకరు విభేదించుకుంటూ బ్రిటీష్ పాలకులతో ఘర్షణ పడుతుండేవారు. బ్రిటన్ ఐక్యరాజ్యసమితి ఆదేశం ప్రకారం

పాలస్తీనాని యూదు, అరబ్ రాజ్యాలుగా రెండుగా విభజించాలని భావించింది. యూదులు తమ ప్రత్యేక ఇజ్రాయిల్ రాజ్యాన్ని ఏర్పరచుకుంటే అరబ్‌లు మాత్రం ఈ ఏర్పాటును అంగీకరించలేదు. యూదుల్ని పూర్తిగా తరిమి వేయాలని వాళ్ళు నిశ్చయించుకున్నారు. ఈజిప్ట్ నాయకత్వంలో ఏడు అరబ్ దేశాలు స్థానిక అరబ్ ముస్లిముల సహాయంతో ఇజ్రాయిల్‌పై దాడి చేశాయి. తగినంత సైన్యం, వైమానిక శక్తి లేకపోయినా ఇజ్రాయిల్ అరబ్ దేశాల్ని తరిమికొట్టింది. ఇజ్రాయిల్‌లో ఉన్న అరబ్‌లు వెంటనే ఆ దేశాన్ని వదలి వచ్చేయాలని అరబ్ దేశాలు ప్రకటించాయి. అనేకమంది ముస్లిములు అలాగే తరలిపోయారు. కాని వారంతా ఈ 50 సంవత్సరాలు ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న శరణార్థి శిబిరాలలోనే మగ్గుతున్నారు. ఆ తరువాత అరబ్ దేశాలన్నీ కలిసికట్టుగా 1967, 1973లలో రెండుసార్లు ఇజ్రాయిల్‌పై దాడి చేశాయి. రెండుసార్లు చిత్తుగా ఓడిపోయాయి.

గత 50 సంవత్సరాల స్వతంత్ర్య జీవనంలో ఇజ్రాయిల్ నిరంతరం పొరుగు దేశాల వల్ల యుద్ధ భయాన్ని ఎదుర్కొంటూనే ఉంది. ఇజ్రాయిలీ పౌరవిమానాలు హైజాక్‌కి గురయ్యాయి. గ్రామాలు, పట్టణాలపై బాంబు దాడులు జరిగాయి; అనేకమంది ఇజ్రాయిలీలని కిడ్నాప్ చేసి హతమార్చారు. (బెర్లిన్ ఒలెంపిక్ క్రీడల్లో ఇజ్రాయిల్ ఆటగాళ్లని పాలస్తీనియన్లు కాల్చి చంపారు); అరబ్‌లు అక్రమంగా ఇజ్రాయిలీ భూభాగాలలో ప్రవేశించేవారు; మానవ బాంబుల దాడిలో అనేకమంది మరణించారు. ఇటువంటి విపత్తులన్నింటిని తట్టుకుని ఇజ్రాయిల్ నిలబడింది. ఇజ్రాయిల్‌తో యుద్ధం చేసి ప్రయోజనం లేదని గ్రహించి ఈజిప్ట్ ఇజ్రాయిల్‌ని గుర్తించి దానితో సంధి చేసుకుంది. కొన్ని సంవత్సరాల క్రితం పిఎల్‌ఓకి, ఇజ్రాయిల్‌కి మధ్య శాంతి సంభాషణలు ప్రారంభమయ్యాయి. దీనివల్ల మరొక ఇజ్రాయిల్ వ్యతిరేక దేశం జోర్డాన్ కూడా ఒప్పందం కుదుర్చుకుంది. సిరియా, లెబనాన్‌లు మాత్రమే ఇజ్రాయిల్‌తో సఖ్యత ఏర్పరచుకోవలసి వుంది.

50 సంవత్సరాలలో ఇజ్రాయిల్ సాధించిన ప్రగతి జాతీయభావనతో ఆత్మవిశ్వాసంతో, స్వాభిమానంతో వ్యవహరించే పార్టీలు పరిపాలిస్తే ఎలాంటి ప్రగతి సాధించవచ్చన్న దానికి ఉదాహరణగా నిలుస్తుంది. 1948లో ఇజ్రాయిల్‌లో ఆరుమిలియన్‌ల జనాభా ఉండేది. ఆ తరువాత ప్రపంచం మొత్తం నుండి 2.5 మిలియన్ ప్రజలు ఇజ్రాయిల్ చేరుకున్నారు. వీరంతా అత్యంత బీదస్థితిలో తమ





మాతృభూమిని చేరారు. వీరందరికీ ప్రభుత్వం ఆశ్రయం కల్పించింది. హిబ్రూ భాషని పునరుద్ధరించి ఆ భాష మాధ్యమంగానే విద్యని అందించింది.

ఎడారి ప్రదేశాలను సస్యశ్యామలంగా మార్చి వేశారు. ప్రతి నీటిబొట్టు వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా నీటిపారుదల వ్యవస్థని రూపొందించుకున్నారు. కూరగాయలు, పండ్లు, గుడ్లు మొదలైనవి ఇతర దేశాలకి ఎగుమతి చేస్తున్నారు.

ఇజ్రాయిల్ గూఢచారి వ్యవస్థ, సైన్యం, వైమానిక, నౌకాదళాలు ప్రపంచ దేశాలకే అసూయ కలిగించే విధంగా రూపొందాయి. సూపర్ పవర్ దేశాలతో ధీటుగా నిలబడే మిస్సైల్ వ్యవస్థని, ఆయుధ వ్యవస్థని రూపొందించుకున్నారు. ఇదేకాక ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్, సమాచార సాంకేతిక రంగాలలో ఇజ్రాయిల్ గణనీయమైన ప్రగతి సాధించింది.

అక్కడ పిల్లలకి అత్యుత్తమమైన విద్యా, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు ప్రాణంతో సమానమని వారు భావిస్తారు. అక్కడ కమ్యూనిస్టులు, యూదు మతతత్వవాదులు, ఉదారవాదులు, సోషలిస్టులు ఇలా అనేక ఆలోచనా విధానాలను అనుసరించేవారు ఉంటారు. దాదాపు ఒక డజను రాజకీయ పార్టీలు ఉన్నాయి. ఇజ్రాయిల్‌కి చుట్టు ప్రక్కల ఉన్న అరబ్ దేశాల్లో ఏనాడూ ఎన్నికలు జరగలేదు కానీ ఇజ్రాయిల్‌లో ఇప్పటికి అనేకసార్లు పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

నిరంతరం యుద్ధాలను ఎదుర్కొంటున్న ఇజ్రాయిల్‌లో తలసరి ఆదాయం 1950–1996 మధ్య కాలంలో 23 రెట్లు పెరిగింది. ఇజ్రాయిల్‌కి సంబంధించిన గణాంక వివరాలు క్రింద చూడండి.

భూభాగపు విస్తీర్ణం : 27, 800 చ.కి.మీ.

వెస్ట్ బ్యాంక్, గాజాల విస్తీర్ణం : 5,900 చ.కి.మీ.

ఇజ్రాయిల్ జనాభా : 5.5.మిలియన్‌లు.

దీనిలో యూదులు కాని వారి జనాభా : 1.07 మిలియన్

(ముస్లిములు 8,15,000, క్రైస్తవులు 1,60,000, డ్రూజ్ 95,000)

ఇజ్రాయిల్‌కి వచ్చిన శరణార్థులు : 2.5 మిలియన్.
(మొత్తం జనాభాలో సగం)

అరబ్ దేశాల నుండి వచ్చిన యూదులు: 6,00,000

ఇజ్రాయిల్, భారత్ ఎదుర్కొంటున్న అనేక సమస్యల్లో రెండు ప్రధానమైన సమస్యలు చూద్దాం. మొదటిది, కొత్తగా ఏర్పడే పాలస్తీనా రాజ్యంలో 136 ఇజ్రాయిల్ స్థావరాలు ఉన్నాయి. వీటిలో జనాభా 1,40,000 ఉంటుంది. ఐతే పాలస్తీనియన్లు ఈ ఇజ్రాయిలీలను తిప్పి పంపాలని పట్టుపట్టినప్పుడు ఇజ్రాయిల్ ప్రభుత్వం "ఇజ్రాయిల్‌లో 8,15,000 అరబ్‌లు పాలస్తీనాలోని యూదుల కంటే ఆరు రెట్లు ఎక్కువ అంటున్నారు. వారిని పాలస్తీనాకు తరిమివేయాలని మేము అనుకోవడం లేదు. వారికి పౌరసత్వం ఇచ్చాం. పార్లమెంటులో స్థానం కల్పించాం. వీరితోపాటు అరబ్ దేశాలనుండి వచ్చిన 6,00,000 యూదులకు ఆశ్రయం కల్పించాం కూడా. కనుక కొద్ది మంది యూదులు మీ భూభాగంలో ఉంటే మీకు అభ్యంతరం ఉండకూడదు" అని పాలస్తీనాకు సూటిగా సమాధానం చెపుతోంది. ఈ విషయాన్ని భారత్‌కి పోల్చి చూడండి. భారత్ మతం ఆధారంగా రెండుగా విభజించబడింది. పాకిస్తాన్‌లోని హిందువులనందరినీ తరిమివేశారు. కాని భారత్‌లో మాత్రం 100 మిలియన్ ముస్లిములు ఇప్పటికీ నివసిస్తున్నారు. ముస్లిములు అధికంగా ఉన్న జమ్మూ కాశ్మీర్ నుండి హిందువులను తరిమి వేస్తున్నారు. తమ దేశంలోనే శరణార్థులుగా మారుతున్నారు. ఈ విషయంలో ఇజ్రాయిల్ ప్రవర్తించిన తీరు సరైనదా? లేక భారత్ వ్యవహారం సరైనదా?

జెరూసెలం యూదుల ఏకైక పుణ్యస్థలం. ముస్లిములకి మక్కా, మదీనాలు పుణ్యస్థలాలు. 1948 యుద్ధం తరువాత జెరూసలెంలోని తూర్పు భాగం జోర్డాన్ ఆధీనమయింది. అప్పటి నుండి ముస్లిములు యూదుల్ని ఆ ప్రాంతంలోకి ప్రవేశించనివ్వకుండా అడ్డుకున్నారు. కానీ 1976లో ఆరు రోజుల యుద్ధంలో ఇజ్రాయిల్ వెస్ట్ బ్యాంక్‌ని, తూర్పు జెరూసెలంని గెలుచుకుంది. 1948 మాదిరిగా జెరూసెలం మొత్తాన్ని ఏకం చేసింది. జెరూసెలంలో డేవిడ్ నిర్మించిన దేవాలయపు స్థలంలో నేడు శిథిలాలు మాత్రమే ఉన్నాయి. ఒక పెద్ద గోడ మాత్రం ఉంది. జెరూసెలంను తిరిగి విభజించాలని పాలస్తీనియన్లు కోరుతున్నారు. కాని అందుకు ఇజ్రాయిల్ అంగీకరించడంలేదు. జర్మనీలోని బెర్లిన్‌ని కూడా ఇలాగే విభజించారు.





స్టాలిన్ ఆ నగరంలో ఒక పెద్ద గోడని నిర్మించాడు కూడా. కానీ జర్మనీలో జాతీయ భావన పెల్లుబికి దేశం ఏకమైనప్పుడు బెర్లిన్ గోడని కూల్చివేశారు. అలాగే జెరూసెలంని ఎందుకు ఏకం చేయకూడదు? దానిలో కొంత భాగాన్ని మరొక దేశానికి ఎందుకు ఇవ్వాలి? తూర్పు జెరూసలెంలో ఇజ్రాయిల్ ప్రభుత్వం నివాస భవనాలను నిర్మిస్తోంది. దీనిని పాలస్తీనియన్లు వ్యతిరేకించారు. అయినా ఇజ్రాయిల్ పట్టించుకోలేదు. శ్రీనగర్‌లో భారత ప్రభుత్వం భవనాలను నిర్మిస్తే పాకిస్తాన్ అందుకు అభ్యంతరం తెలిపితే మన ప్రభుత్వం ఆ అభ్యంతరాల్ని పట్టించుకోవాలా?

ఇజ్రాయిల్‌ని, దక్షిణ లెబనాన్‌ని సిరియాను వేరుచేసే గోలన్ కొండల నుండి అరబ్ తీవ్రవాదులు, ముస్లిం వేర్పాటువాదులు ఇజ్రాయిల్‌లోని జనావాసాల పైకి రాకెట్ దాడులు చేసి అనేకమంది ప్రజల్ని హతమారుస్తూ ఉంటారు. సిరియా, లెబనాన్ తీవ్రవాదులకి సహాయం అందించడం మానుకొనంతవరకు, శాంతి ఒప్పందం కుదుర్చుకొనంత వరకు ఈ కొండ ప్రాంతాన్ని తన ఆధీనంలో ఉంచుకుంటానని ఇజ్రాయిల్ స్పష్టం చేసింది. ఇందుకు ఇజ్రాయిల్‌ని తప్పుపట్టగలమా? కాశ్మీర్ సరిహద్దుల్లో ఉన్న తీవ్రవాదుల మూలంగా భారత్ ఇదే సమస్యని ఎదుర్కొంటున్నది.

స్వతంత్ర్య భారతాన్ని ఒక కుటుంబమే పరిపాలిస్తూ వచ్చింది. తాను పొరపాటున హిందువుగా జన్మించానని, విద్య ద్వారా తాను పాశ్చాత్యుడనని, సంస్కృతి ద్వారా ముస్లిమునని చెప్పుకున్న వ్యక్తి కుటుంబమే ఎక్కువ కాలం పరిపాలించింది. వీరి అభారతీయ పాలనలో మన స్నేహితులెవరు? శత్రువులెవరనే విషయాన్ని కూడా గ్రహించలేని స్థితిలో పడ్డాం. మన దేశంలోని ముస్లిములకి కోపం వస్తుందని ఆఖరుకు ఇరాన్, ఈజిప్టులు గుర్తించిన ఇజ్రాయిల్‌ని మనం గుర్తించడానికి వెనుకాడాం. కేవలం కొన్ని సంవత్సరాల క్రితమే మనం ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు ఏర్పరచుకున్నాం. ఇజ్రాయిల్ భారత్ ఆధ్యాత్మిక సోదరి. రెండు దేశాలు అనేక దురాక్రమణలకు గురయ్యాయి. ఇజ్రాయిల్ తన పూర్వ జీవన విధానాన్ని, లక్ష్యాన్ని పునరుద్ధరించుకుంది. అదే పని మనం చేయవలసి ఉంది.

# నిరక్షరాస్యతే సమస్యలన్నింటకీ మూలం

**మే 4 - 10 , 1998**

వాయిస్ ఆఫ్ అమెరికా ఏప్రిల్ 26న ఒక కార్యక్రమం ప్రసారం చేసింది. అందులో పాకిస్తాన్‌లోని మత పాఠశాలల నుండి విద్యార్థుల్ని ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలీబన్లు సైనికులుగా మారుస్తున్నారని, వారిని యుద్ధభూమికి కూడా పంపుతున్నారని తెలిపింది. ఇది బాలల హక్కులను అతిక్రమించడమే కాక మానవహక్కుల ఉల్లంఘన కూడా అవుతుంది. కాని పాకిస్తాన్‌లోని మత పాఠశాలల్లో బోధించే మత విషయాల దృష్ట్యా ఇవేవీ ప్రధానమైనవి కాకపోవచ్చును. అమెరికా ఈ విషయమై పాకిస్తాన్‌ని నిలదీసిందా? లేదు.

ఆఫ్ఘనిస్థాన్‌లో నిరాఘాటంగా సాగుతున్న పోరాటాన్ని ఆపేందుకు అమెరికాగాని, దాని నేతృత్వంలోని ఐక్యరాజ్యసమితిగాని ప్రయత్నించడం లేదు ఎందుకని? తాలీబన్లు స్త్రీలకి ఏ మాత్రం గౌరవం ఇచ్చారు. వారి దృష్టిలో స్త్రీలు ఆనందాన్ని ఇవ్వడానికి, పిల్లల్ని కనడానికి మాత్రమే పనికి వస్తారు. స్త్రీలు బురఖా ధరించాలని నిబంధన విధించడమే కాక స్కూళ్ళలో, కాలేజీల్లో మహిళలకి స్థానం లేదని నిషేధం కూడా విధించారు. తండ్రిగాని, భర్తగాని లేని ఏ మహిళకి ఎటువంటి సహాయం అందించే అవసరం లేదని తాలీబన్లు ప్రకటించారు. అయినా అమెరికా, ఐక్యరాజ్యసమితి తాలీబన్లకి మద్దతునిస్తున్నాయి ఎందుకని? మానవహక్కులను ఏ మాత్రం ఖాతరు చేయని వీరిని మందలించవెందుకని?

ఆఫ్ఘనిస్తాన్‌లో గత 50 సంవత్సరాలుగా సాగుతున్న అంతర్యుద్ధంలో ఒక మిలియన్ ప్రజలు మరణించి ఉంటారని అంచనా. ప్రస్తుతం చిన్నపిల్లల్ని కూడా యుద్ధభూమిలోకి తోస్తున్నారు. యుద్ధంలో మరణిస్తే తిన్నగా స్వర్గానికి పోతారని, అక్కడ అన్ని రకాల సుఖాలు అనుభవించవచ్చని ఈ పిల్లలకి మత పాఠశాలల్లో నూరిపోస్తున్నారు. సరైన కూడు, గుడ్డ కూడా లభించని పిల్లలకి యుద్ధం అంటే ఒక ఆకర్షణ ఏర్పడుతుంది. పుట్టుకతోనే పేదరికపు కష్టాల్ని చవి చూసే వీరికి ఇస్లాం పేరున యుద్ధంలో మరణిస్తే స్వర్గసుఖాలు పొందవచ్చనే ఆశ కలుగుతుంది. ఇరాన్-ఇరాక్‌ల మధ్య 10 సంవత్సరాల పాటు సాగిన యుద్ధంలో కూడా రెండు దేశాలు అనేకమంది బాలసైనికుల్ని రంగంలో దింపాయి. రెండు దేశాలు 'తాము చేసే యుద్ధం పవిత్రమైనదని కాఫిర్‌లను నాశనం చేసే జిహాద్' అని భావించాయి.





ఇక్కడ యమన్‌లో నాకు ఎదురైన ఒక అనుభవం పేర్కొంటాను. 1990లో నేను అంతర్జాతీయ టెలికాం యూనియన్‌లో పనిచేస్తున్నాను. ఇరాన్ కువైట్ పై దాడి చేసి ఆక్రమించుకుంది. ఐక్యరాజ్యసమితి కువైట్ నుండి ఇరాక్ వైదొలగాలని ప్రకటించబోతున్నది. యమన్ ఇరాక్‌కి మద్దతు తెలిపింది. దీనితో యమన్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రతినిధి మమ్మల్ని అక్కడ నుండి వెళ్ళిపోతే మంచిదని సలహా ఇచ్చారు. సైప్రస్‌కి వెళ్ళే ఏర్పాటు చేస్తామని అన్నారు. నా సహోద్యోగులు చాలామంది అలాగే చేశారు. నేను మాత్రం యమన్‌లోనే ఉండిపోతానని చెప్పాను. ఆ సమావేశం అయిపోయిన తరువాత యమన్ దేశస్థురాలు ఒకావిడ నా దగ్గరికి వచ్చి నన్ను అభినందించింది. "ఈ అమెరికన్లకి మృత్యుభయం ఎక్కువ. మాకు, అరబ్‌లకి, ఆసియావాసులకి యుద్ధమంటే, చావంటే భయం ఉండదు. అమెరికన్లు వియత్నాం నుంచి అందుకే పారి పోయారు. వీళ్ళు కువైట్‌లో గుణపాఠం నేర్చుకుంటారు. నేను మీ ధైర్యానికి అభినందిస్తున్నాను" అని అన్నది ఆవిడ. అందుకు నేను ఇలా సమాధానం ఇచ్చాను- "చూడండి అమెరికన్లు చాలా డబ్బు ఉన్నవారు, వారికి ఒకరిద్దరు పిల్లలు మాత్రమే ఉంటారు. అందుకనే వారికి తమ సంపదని అనుభవించాలనే కోరిక ఉంటుంది. అందుకోసం ఎక్కువ కాలం బ్రతకాలని ఉంటుంది. చావు తర్వాత ఎక్కడో లభిస్తుందనుకునే స్వర్గం కన్నా ఇక్కడి సుఖమే వారికి ముఖ్యం. అరబ్‌లు, దక్షిణ ఆసియన్లని చూడండి. వారిలో అధిక సంతానం కలిగినవారే ఎక్కువ. ఒక్కొక్క కుటుంబంలో పది నుండి ఇరవై మంది పిల్లలు ఉంటారు. దీనికి తోడు పేదరికం. కనుక చావు అనేది కష్టాల నుండి బయటపడేందుకు ఒక మార్గంలా కనిపిస్తుంది. "నా సమాధానానికి ఆమె ఆశ్చర్యపోలేదు. పైగా "మీరు చెప్పింది నిజమే కావచ్చును. పేదరికం, నిరక్షరాస్యత, అజ్ఞానాలలో కొట్టుమిట్టాడే వారికి చావు భయం ఉండకపోవచ్చును" అని అంగీకరించింది.

ఈ కారణం మూలంగానే ఇస్లామిక్ దేశాల్లో బాల సైనికుల సంఖ్య బాగా పెరిగిపోయింది.

ఇప్పుడు బాలకార్మికుల గురించి చూద్దాం. తల్లిదండ్రుల నిరక్షరాస్యత, అజ్ఞానాల మూలంగా అనేక మంది పిల్లలు సరైన పోషణ లేక బాధపడుతున్నారు. అలాంటి పిల్లలు చిన్న వయసులోనే ఏదో ఒక పనిలో చేరతారు. నగరాలలో ప్రతి ఇంటిలో ఒక పనిపిల్ల ఉంటుంది. ప్రతి పిల్ల సంవత్సరానికి 5వేల రూపాయలు

సంపాదిస్తుంది. ఒక కుటుంబంలో ఇలా సంపాదించే వాళ్ళు ఎంతమంది ఉంటే ఆ తల్లిదండ్రులకి అంత సంపాదన. బాల కార్మికుల సమస్యని పరిష్కరించడం ఎలా? ప్రజల్లో అక్షరాస్యత పెరగాలి. కానీ ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, భారత్, భూటాన్, బంగ్లాదేశ్‌లలో అక్షరాస్యత చాలా తక్కువ. సామాజిక సంక్షేమం అని నినాదాలు చాటే పార్టీలేవి ఈ విషయాన్ని పట్టించుకోవు. బాల వ్యభిచారులు కూడా ఒక మతపు విశ్వాసాల మూలంగా ఏర్పడుతోంది. ఆ ప్రవక్త 10 సంవత్సరాలు కూడా లేని పిల్లని పెళ్ళాడాడు. ఇదే విషయాన్ని బాహాటంగా చర్చిస్తే వారికి శిక్ష విధిస్తారు మతాధికారులు. బంగ్లాదేశ్, నేపాల్‌ల నుండి అనేకమంది ఆడపిల్లల్ని ఈ వృత్తిలో దింపుతున్నారు. ఈ దురాచారానికి కూడా కారణం నిరక్షరాస్యతే.

అమెరికా వీరికి ప్రత్యేక సహాయం ఏదీ అందించనవసరం లేదు. కేవలం ఆయా దేశాలలో విద్య, ఆరోగ్యం మొదలైన రంగాల మెరుగుదల కోసం నిధులు అందించవచ్చును.

పోతన తాను చేస్తున్న ప్రతి పనిని భగవదర్పణగా భావిస్తూ-

**శా. పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ హాస లీ**
**లా నిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షింపుచున్ సంతత**
**శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం**
**ధానుం డై మఱచెన్ సురారిసుతుఁ డేతద్విశ్వమున్ భూవరా!**

శ్రీమదాంధ్ర మహాభాగవతం స.స్క.

ఓ రాజా! ఆ ప్రహ్లాదుడు నీళ్ళు తాగుతున్నా, భుజిస్తున్నా, నవ్వుతున్నా (జాగృత్ స్వప్న సుషుప్తావస్థలందు) పడుకున్నా, తిరుగుతున్నా, శ్రీమన్నారాయణుని పాదాపద్మాల మీదే అతని ధ్యాసంతా ఆ సమయంలో చుట్టూ ఉన్న లోకాన్నే మరిచిపోతాడు.





# ఇజ్రాయిల్ నేర్పే పాఠాలు

**మే 11 - 17 , 1998**

ఇజ్రాయిల్ అతి చిన్న దేశం. ఆ దేశ జనాభా 5.5 మిలియన్ (దాదాపు హైదరాబాద్ నగర జనాభా). అయినా ఈ దేశం పేరు తరుచు వార్తల్లో వినిపిస్తూ ఉంటుంది. దానికి కారణం ఇజ్రాయిలీ దేశస్థులు తమ మాతృభూమిని, సంస్కృతీ సభ్యతల్ని కాపాడుకోవడంలో చూపే శ్రద్ధ. యూదులకి 6000 సంవత్సరాల చరిత్ర ఉంది. మూడుసార్లు విదేశీ ఆక్రమణల మూలంగా యూదులు తమ మాతృభూమిని వదలి పారిపోవలసి వచ్చింది. బాబిలోనియన్లు, ఈజిప్ట్, రోమ్ దురాక్రమణ దారుల వల్ల యూదులు కష్టాలపాలయ్యారు. మొదటి రెండుసార్లు వాళ్ళు తేలికగానే తమ దేశానికి తిరిగి రాగలిగారు. కాని మూడవసారి మాత్రం వారి అజ్ఞాతవాసం క్రీ.శ. 70 నుండి 1948 వరకు సాగింది. ఈ కాలంలోనే ఇజ్రాయిల్‌ని అరబ్‌లు ఆక్రమించుకుని అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఒట్టమాన్ టర్క్‌ల పాలనలో ఇజ్రాయిల్ భూభాగం పాలస్తీనా రాజ్యంలో ఒక భాగం అయిపోయింది. స్విట్జర్లాండ్‌లోని బాస్లేలో ఏర్పడిన ప్రపంచ జియోనిస్ట్ కాంగ్రెస్ అరబ్‌ల నుండి బీడుపడిన భూముల్ని కొని వాటిని తమ మాతృభూమికి చేరుకున్న యూదులకి అప్పగించింది. టర్కీ సామ్రాజ్యంమొదటి ప్రపంచ యుద్ధం తరువాత నశించిపోయింది. పాలస్తీనా బ్రిటీష్ పాలన క్రిందకి వచ్చింది. హిట్లర్ తాను గెలిచిన దేశాల్లో, జర్మనీలో యూదులు, జిప్సీలపై మారణకాండ సాగించాడు. హిట్లర్ చేతుల నుండి తప్పించుకున్న యూదులు పాలస్తీనాకు వచ్చారు. యూధులు, బ్రిటీష్ పాలకులు, అరబ్‌ల మధ్య నిరంతర పోరాటం జరిగింది. చివరికి విసిగిపోయిన బ్రిటీష్ పాలకులు పాలస్తీనాను వదలి వెళ్ళిపోయారు. ఐక్యరాజ్యసమితి పాలస్తీనాను రెండుగా విభజించి యూదుల్ని, అరబ్‌లను ప్రత్యేక రాజ్యాలు ఏర్పరుచుకోవలసిందిగా ఆదేశించింది. దాని ఫలితంగానే 14మే, 1948లో యూదులు స్వతంత్ర ఇజ్రాయిల్ రాజ్యాన్ని స్థాపించుకున్నారు. అరబ్‌లు మాత్రం ఈ ఆదేశాన్ని తిరస్కరించారు. యూదులు పాలస్తీనా వదలి వెళ్లిపోవాలని వాళ్ళు పట్టుబట్టారు. ఏడు అరబ్ దేశాల సైన్యం ఈజిప్ట్ నేతృత్వంలో ఇజ్రాయిల్‌ని నాశనం చేయాలని సంకల్పించింది. కాని వారినందరనీ ఇజ్రాయిల్ తరిమివేసింది. ఇజ్రాయిల్ పాలస్తీనాను మొత్తాన్ని విముక్తం చేయబోతున్న సమయంలో ఐక్యరాజ్యసమితి కాల్పుల

విరమణను ప్రకటించింది. (సరిగ్గా 1948లో భారత సైన్యం కాశ్మీర్ నుండి పూర్తిగా పాకిస్తాన్‌ని తరిమివేసే స్థితిలో ఉన్నప్పుడు ఇదే జరిగింది). 1967లో తిరిగి 1973లో అరబ్ దేశాలన్నీ రష్యా నుండి పొందిన ఆయుధాలతో ఇజ్రాయిల్‌పై మూకుమ్మడిగా దాడి చేశాయి. కాని రెండుసార్లు ఇజ్రాయిల్ వాటిని చిత్తు చేసింది (భారత్‌లో 1965, 1971 లో రెండుసార్లు పాకిస్తాన్‌ని చిత్తు చేసినట్లు). ఆ తరువాత కమ్యూనిస్టు రాజ్యం కూలిపోవడంతో పాలస్తీనియన్లు, అరబ్‌లు ఇజ్రాయిల్‌తో యుద్ధంలో గెలవడం అసాధ్యమని తెలుసుకుని సంధి ఒప్పందాలకి సిద్ధపడ్డారు.

అలా ఇజ్రాయిల్ యుద్ధాల మధ్య ఊపిరి పోసుకుంది. ఆవిర్భవించిన దగ్గర నుండి గత 50 సంవత్సరాల పాటు ఇజ్రాయిల్ అనేక ఒడుదుడుకుల్ని ఎదుర్కొంది. 46 సభ్యులు కల ఒఐసి (ఇస్లాం దేశాల సంస్థ) ఇజ్రాయిల్‌ని ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంది. ఇజ్రాయిల్ తప్ప మరే దేశమైనా ఇంతటి యుద్ధ వాతావరణానికి, వత్తిడికి లొంగిపోయేది. 4.7 మిలియన్ యూదులు 700 మిలియన్ అరబ్‌లను ఎదుర్కొంటూ మనుగడ సాగిస్తున్నారు. మాతృభూమి పట్ల అచంచలమైన శ్రద్ధాభక్తులు, అభివృద్ధి సాధించాలన్న కోరిక వీటన్నింటినీ మించి ధర్మం వారి వైపు ఉండడం వల్ల యూదులు విజయాలు సాధిస్తూ వచ్చారు.

నిరంతర యుద్ధాల మధ్య జాతీయ ఉత్పత్తిలో 15 నుండి 25 శాతం యుద్ధాలను ఎదుర్కొనేందుకే ఖర్చు పెడుతూ ఇజ్రాయిల్ సాధించిన ప్రగతిని, అపారమైన ప్రకృతి వనరులతో భారత్ సాధించిన అభివృద్ధులను సరిపోలిస్తే అనేక ఆసక్తి కరమైన విషయాలు తెలుస్తాయి.

❖దేశసమైక్యతకి, జాతీయ స్ఫూర్తికి ప్రతీకగా నిలచే సంస్కృత భాషని భారత్ నిర్లక్ష్యం చేస్తే, ఇజ్రాయిల్ మాత్రం 6000 సంవత్సరాల నాటి హిబ్రూ భాషని పునరుద్ధరించుకుని జాతీయ భాషగా గుర్తించింది. యూదులు ప్రపంచంలోని వివిధ దేశాల నుండి తిరిగి తమ దేశానికి చేరుకుంటున్నారు. వారంతా వేరువేరు భాషలు మాట్లాడేవారైనా హిబ్రూని నేర్చుకుంటున్నారు. హిబ్రూ వారి జాతీయ భావనని, వారసత్వ సంపదని సుసంపన్నం చేస్తోంది. ఇందుకు పూర్తి వ్యతిరేకంగా మనం సంస్కృత భాషని కించపరచి, వేర్పాటువాదులు, విచ్ఛిన్నకారుల భాషని స్వంతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాం.





❖1948లో ఇజ్రాయిల్ జనాభా కేవలం అరమిలియన్ మాత్రమే. ఆ తరువాత అనేక అరబ్ దేశాల నుండి, ఇతర దేశాల నుండి 6 మిలియన్ యూదులు ఇజ్రాయిల్ చేరుకున్నారు. వారినందరినీ ఇజ్రాయిల్ అక్కున చేర్చుకుంది. వారికి విద్య, వైద్య సౌకర్యాలు అందిస్తోంది. మన దేశానికి 10 మిలియన్ హిందువులు బయటి నుండి వచ్చారు. మన దేశంలో వీరుగాక 18 మిలియన్ చొరబాటుదారులు 'అతిథి' మర్యాదలు పొందుతున్నారు.

❖ఇజ్రాయిల్ ఎడారి భూముల్ని, బీడుపడిన భూముల్ని సస్యశ్యామలంగా మార్చుకుంది. నెగెవ్ ఎడారిని శాస్త్ర సాంకేతిక పద్ధతుల ద్వారా జనావాసంగా, పంట భూమిగా మార్చింది. కాయగూరలు మొదలైనవి పండించి ఎగుమతి చేస్తోంది. ఏ అరబ్ దేశం ఈ పని చేయలేకపోయింది. భారత్‌లో ఉన్న అడవులే క్రమంగా నశించిపోతున్నాయి. కాలుష్యం పెరిగిపోతోంది.

❖ఇజ్రాయిల్ ప్రతి నీటిబొట్టుని ఉపయోగించుకునే విధంగా నీటి పారుదల వ్యవస్థని రూపొందించుకుంది. పౌరులందరికి పుష్కలంగా నీరు లభ్యమయ్యేటట్లు ఏర్పాట్లు చేయగలిగింది. భారత్‌లో అనేక జీవనదులు ఉన్నా ఆ నీటిని సక్రమంగా ఉపయోగించుకునే వ్యవస్థ రూపొందలేదు. నదుల నీళ్ళన్నీ సముద్రం పాలు అవుతుంటే మరో ప్రక్క ప్రజలు దాహం తీర్చుకోవడానికి కూడా నీళ్ళు లేక తహతహలాడుతున్నారు.

❖ఇజ్రాయిల్‌లో తలసరి ఆదాయం 1950లో 500 డాలర్లు ఉంటే ఇప్పుడు 18,000 అమెరికా డాలర్లకి పెరిగింది. అదే కాలంలో భారత్‌లో తలసరి ఆదాయం 50 డాలర్ల నుండి 300 డాలర్లకు మాత్రమే పెరిగింది. మన దేశంలో 30 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. ఇజ్రాయిల్‌లో ఎవరూ దారిద్ర్యరేఖకు దిగువన లేరు.

❖ఇజ్రాయిల్‌లో 20 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. అంటే 3 లక్షల మందికి ఒక విశ్వవిద్యాలయం మన దేశంలో 50 లక్షల మందికి ఒక విశ్వవిద్యాలయం ఉంది. అక్కడ వెయ్యిమందికి 300 మంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ఉంటే మన దేశంలో ఆ సంఖ్య పదికి మించదు.

❖ఇజ్రాయిల్ విదేశీ వాణిజ్యం జాతీయ ఉత్పత్తిలో 50 శాతం ఉంటుంది. మన దేశపు విదేశీ వాణిజ్యం జాతీయ ఉత్పత్తిలో 15 శాతం మాత్రమే. జాతీయ పొదుపు శాతం 24 నుండి 38 శాతం వరకు ఉంటుంది.

ఇటువంటి అద్భుతాలను సాధించినా ఇజ్రాయిల్‌కి భారత్ మాదిరిగానే ఇరుగు పొరుగు దేశాలతో సమస్యలు ఉంటాయి. సిరియా, ఇరాన్, ఇరాక్, లిబియా, సూడాన్ మొదలైన దేశాలు ఇజ్రాయిల్‌ని ప్రపంచ పటం నుండి తుడిచివేయాలని నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఈ దేశాలకి ప్రపంచదేశాల సమాఖ్య అండదండలు ఉంటాయి. ఇలాంటి సమస్యే మనం ఎదుర్కొంటున్నాం. ఇజ్రాయిల్ జనాభా కేవలం ఇతర దేశాల నుండి తరలి వచ్చే వారి వల్లనే పెరుగుతుంది.

ఇజ్రాయిల్‌లో పౌరులందరికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభిస్తాయి. ఆ దేశంలో 20 రాజకీయ పార్టీలు ఉన్నాయి. 1948 నుండి అక్కడ మిశ్రమ ప్రభుత్వాలే పరిపాలన చేస్తున్నాయి. ఎన్ని సిద్ధాంత పరమైన విభేదాలున్నా ఆ పార్టీలన్నీ దేశ రక్షణలో ఒకే తాటిపై నిలుస్తాయి. అందుకనే తమపై జరిగిన మూడు దాడుల్ని విజయవంతంగా తిప్పికొట్టాయి. ఇజ్రాయిల్ దేశస్థులకి విజయం, లేదా మరణం ఈ రెండు మాత్రమే ఉన్నాయని అపజయం పొందినా జీవించవచ్చనే ఆశ ఉండదని తెలుసు.

ఇజ్రాయిల్ తన శత్రువుల్ని ఎదుర్కొనేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఇజ్రాయిల్‌ని నాశనం చేయడానికి రసాయనిక ఆయుధాలను సైతం ఉపయోగిస్తామని ఇరాక్ బెదిరిస్తోంది. కాని అలా జరిగితే ఇజ్రాయిల్ కూడా పెద్ద ఎత్తున రసాయనికి ఆయుధాలు ఉపయోగిస్తుంది. అప్పుడు మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడుతుంది. కనుక ఇరాక్ వంటి దేశాలు ఇజ్రాయిల్‌పై కాలు దువ్వడం ప్రపంచానికే చేటు తెస్తుంది.

ఇజ్రాయిల్ అచంచలమైన విశ్వాసానికి, పరాక్రమానికి, ప్రగతికి ప్రతీకగా నిలిచింది. తమకంటే తక్కువ స్థాయికి చెందినవారి దాడులకు గురైె ఇజ్రాయిల్, భారత్‌లు ఎంతో నష్టపోయాయి. కాని సత్యమే జయిస్తుంది. అనడానికి ఈ రెండు దేశాల విజయమే ఉదాహరణ. అతి ప్రాచీన నాగరికత కలిగిన ఈ రెండు దేశాలు (పశ్చిమంలో ఇజ్రాయిల్, తూర్పున భారత్) ప్రపంచానికి జ్ఞానబిక్ష పెట్టగలవు.





# ఆరవ అణ్వస్త్ర దేశం భారత్

**మే 25 - 31 , 1998**

మే 11, 13 తేదీలలో ఐదు అణు పరీక్షలు జరపడం ద్వారా భారత్ తన అణ్వస్త్ర తయారీ సామర్థ్యాన్ని నిరూపించుకొంది. పోఖరన్‌లో మొదటిసారి పరీక్షలు జరిపిన 24 సంవత్సరాల తరువాత ఇప్పుడీ పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయం ముందుగానే తీసుకున్నదా? లేక పాకిస్తాన్ ఘోరీ క్షిపణిని పరీక్షించిన తరువాత తీసుకున్నదా? ఇప్పటికే అనేక అణ్వాయుధాలను కలిగిన దేశాలు మిగతా దేశాలు మాత్రం అటువంటి ఆయుధాలు తయారు చేయరాదని భావిస్తున్నాయి. ప్రపంచంలోని దేశాలన్నీ సిటిబిటిపై సంతకం చేయాలని, సిటిబిటి ప్రకారం కేవలం ఐదు (అమెరికా, చైనా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్) దేశాలకే అణుపరీక్షలు జరుపుకునేందుకు, అణ్వాయుధాలు తయారు చేసేందుకు అధికారం ఉండాలని అంటున్నారు. ఐతే ఉత్తర కొరియా, క్యూబా, ఇరాక్, లిబియా వంటి దేశాలు ఈ ఒప్పందం పరిధిలోకి రావు. ఇజ్రాయిల్ భారత్ పాకిస్థాన్‌లకు అణ్వస్త్రాలను తయారు చేయగలిగిన సామర్థ్యం ఉందని ఈ దేశాలు భావిస్తున్నాయి. ఇజ్రాయిల్ సిటిబిటిపై సంతకం చేసింది. భారత్, పాకిస్తాన్‌లు ఇంకా ఒప్పందాన్ని అంగీకరించలేదు. ఈ రెండు దేశాల మధ్య ఎప్పుడూ అపనమ్మకం, అనుమానం ఉంటూ వచ్చాయి. వీటిని తొలగించడానికి జరిగిన ప్రయత్నాలు కూడా పూర్తిగా ఫలవంతం కాలేదు. భారత్ తన స్వంత శక్తి సామర్థ్యాలతో అణ్వస్త్రాలను మిస్సైళ్ళను రూపొందించుకుంటే, పాకిస్తాన్‌కి ఇతర దేశాలు రహస్యంగా తమ సహాయ సహకారాల్ని అందిస్తున్నాయి. భారత్ తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నందువల్ల పాకిస్తాన్‌న కూడా తన వద్ద అణుబాంబు ఉందని నిరూపించుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. ఐతే పాకిస్తాన్ అణుబాంబు ఆ దేశపు శక్తి సామర్థ్యాలతో తయారు చేసినదా? లేక ఇతర దేశాల నుండి తెచ్చుకున్నదా అనేది కొద్ది రోజుల్లోనే తేలిపోతుంది.

ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలనుకునే ఏకైక సూపర్ పవర్ అమెరికా భారత్ నిర్వహించిన పరీక్షల్ని తీవ్రంగా విమర్శించింది. భారత్‌పై ఆర్థిక ఆంక్షలు కూడా విధించింది. అనేక ఇతర దేశాలు పరీక్షలను ఖండించడమో లేక విమర్శించడమో చేశాయి. కానీ ఏ దేశం అమెరికా అంత తీవ్రంగా ప్రతిస్పందించ లేదు.

అమెరికా ప్రతిస్పందన వల్ల కలిగే పరిణామాలు ఏమిటి? వాటిని ఎలా ఎదుర్కోవాలి అనేది ప్రతి భారతీయుడు ఆలోచించదగిన విషయాలు. ప్రచ్ఛన్న యుద్ధం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో వివిధ దేశాల మధ్య సైనికపరమైన ఒప్పందాలు, కూటములు ఉండేవి. అమెరికా, బ్రిటన్‌లు అణుబాంబుని, హైడ్రోజన్ బాంబుని తయారు చేశాయి. ఈ బాంబులను ప్రయోగించేందుకు మిస్సైళ్ళను రూపొందించాయి. నాటోలోని మిత్రదేశాలు, అమెరికా, బ్రిటన్‌లు సమకూర్చే అణు ఛత్రంతో ఫ్రాన్స్ సంతృప్తి చెంది నిశ్చింతగా ఉండాలి కదా? కాని అలా జరగలేదు. జనరల్ డిగాలే ఫ్రాన్స్ అధ్యక్షుడు అయిన వెంటనే తాము తమకి అత్యంత సన్నిహిత దేశాల్ని కూడా నమ్మి ఊరకే కూర్చోలేమని, అణ్వస్త్ర రంగంలో ఏ ఒక్కరి ఆధిపత్యం మంచిది కాదని ప్రకటించింది. సోవియట్ రష్యా జర్మనీ లేదా ఫ్రాన్స్‌లపై అణ్వస్త్ర దాడికి పూనుకుంటే అమెరికా అడ్డుపడే అవకాశం ఉన్నదా? అని ఆయన ప్రశ్నించాడు. శక్తిలేని ఫ్రాన్స్‌ని రక్షించడం కోసం అమెరికా ప్రజలు రష్యా బాంబులకు బలవడానికి సిద్ధపడతారా? కనుక అమెరికా, బ్రిటన్‌లు ఫ్రాన్స్‌కోసం రష్యాతో తలపడటానికి సిద్ధంగా లేవు అని తేల్చి చెప్పాడు. అందుచేత ఫ్రాన్స్ స్వయంగా అణ్వస్త్రాలను, హైడ్రోజన్ బాంబుని తయారు చేసుకోవాలని ప్రకటించాడు. దీని కోసం నాటో నుండి వైదొలగడానికి సిద్ధపడింది ఫ్రాన్స్. అప్పటి నుండి ఫ్రాన్స్ అనేకసార్లు అమెరికా, ఇతర దేశాల మాటని లక్ష్య పెట్టకుండా అణపరీక్షలు జరిపింది. అలాంటి ఫ్రాన్స్ భారత్ జరిపిన పరీక్షలకి విచారం వ్యక్తం చేసింది. కాని అమెరికా మొదలైన దేశాల మాదిరిగా భారత్‌పై ఆర్థిక ఆంక్షలు విధించలేదు.

ఇజ్రాయిల్‌ని తీసుకోండి. తన చుట్టూ ఉన్న శత్రుదేశాలు ఎప్పుడూ దాడికి సిద్ధంగా ఉంటాయని ఆ దేశానికి తెలుసు. 1991 గల్ఫ్ యుద్ధంలో సద్దాం హుస్సేన్ తన స్కడ్ మిస్సైళ్ళని ఇజ్రాయిల్ పైకి గురిపెట్టాడు. ఒకవేళ ఆ మిస్సైళ్ళు రసాయన బాంబుల్ని మోసుకువస్తే అప్పుడు అమెరికా ఇజ్రాయిల్‌ని కాపాడేందుకు ముందుకు వచ్చేదా? 50 సంవత్సరాల పాటు స్వతంత్ర దేశంగా అనేక అనుభవాలను చవి చూసిన ఇజ్రాయిల్ ఏ దేశం తమని ఎలాంటి ప్రమాదం నుండి కాపాడటానికి ముందుకు రాదని తెలుసుకుంది. ఇతర దేశాలు సహాయం చేయవచ్చును గాని తమని పూర్తిగా కాపాడలేవని ఇజ్రాయిల్ గ్రహించింది. కనుక అమెరికాకి ఇష్టం ఉన్నా, లేకపోయినా తమ రక్షణ వ్యవస్థని పటిష్టంగా రూపొందించుకోవాలని భావించింది. ఈ నిశ్చయమే ఇజ్రాయిల్‌ని కాపాడుతూ వచ్చింది.





చైనాని అనేక దేశాలు, అనేక సందర్భాలలో విమర్శించాయి. చైనాకి అత్యంత సన్నిహిత దేశం సోవియట్ రష్యా సైతం చైనా తన రక్షణ అవసరాలకై చేపట్టిన చర్యల్ని ఆమోదించ లేకపోయింది. ఆ దేశంలో పేదరికం ఉన్నా అది ఏనాడూ అగ్రరాజ్యాల ముందు తలవంచలేదు. ఒకసారి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ చైనా సందర్శించాడు. అప్పుడు మావో సోవియట్ రష్యాని నమ్మలేమని, రష్యాని నమ్మడం అమెరికా చేస్తున్న తప్పిదమని అన్నాడు. ఈ మాటలకి నిక్సన్ ఆశ్చర్యపోయాడు. 'సోవియట్ రష్యాని అధిగమించడానికి, రష్యాతో శత్రుత్వం వహించడానికి చైనాకి ఎంత కాలం పడుతుంది' అని నిక్సన్ అడిగాడు. అందుకు మావో 'వెయ్యి సంవత్సరాలు' అని సమాధానం చెప్పాడు. సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంలో ఒక దేశానికి ఉండవలసిన నిశ్చయం మావో మాటల్లో స్పష్టమవుతుంది. ఏకైక సూపర్ పవర్‌గా మిగిలిన అమెరికా సైతం చైనాని ఏమీ అనలేదు.

జర్మనీ, జపాన్‌లు అమెరికా ఛత్రం క్రింద సురక్షితంగా ఉన్నాయి. అణుబాంబులు సృష్టించే విధ్వంసాన్ని జపాన్ ప్రత్యక్షంగా చవి చూసింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైపోయింది. ప్రస్తుతం రష్యా అమెరికాతో పోటీ పడే స్థితిలో లేదు. కనుక జర్మనీ మొదలైన దేశాలకి అణ్వస్త్ర భయం అంతగా లేదు. భారత్ పరిస్థితి వేరు. పొరుగున ఉన్న పాకిస్తాన్ ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వుతుంటుంది. అరబ్‌లు, వారి వారసులు ఇస్లాం పేరుతో అనేక దేశాల్ని ఆక్రమించుకుని అక్కడ ఇస్లాంని వ్యాప్తి చేశారు. కాని భారత్‌లో మాత్రం 800 సంవత్సరాల పాటు పాలన చేసిన తరువాత కూడా ప్రజలందరినీ ఇస్లాంలోకి మార్చడంలో విఫలమయ్యారు. కానీ భారత్‌లోనే వారి సంస్కృతి , భాష మిగిలాయి. ఈ విషయం దురాక్రమణ దారులను ఆశ్చర్యపరచింది. ఒకే జాతిగా, ఒకే భాష కలిగి ఉండి, ఒకే జీవన విధానాన్ని అవలంభించిన ముస్లింలు మహ్మద్ ఆలీ జిన్నా నాయకత్వంలో తాము హిందువుల కంటే ప్రత్యేకమైన వారమని, తమకి ప్రత్యేక రాజ్యం కావాలని కోరుకున్నారు. దానివలన దేశాన్ని విభజించి పాకిస్తాన్‌ని ఏర్పరిచారు. ముస్లిములు ఎక్కువగా ఉన్న జమ్మూ కాశ్మీర్ పాకిస్తాన్‌లో కలవకపోవడం పాకిస్తానీయులకి నచ్చలేదు. ఒకవేళ కాశ్మీర్ పాకిస్తాన్‌లో విలీనం అయితే ఆ తరువాత ఇక భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలే చోటు చేసుకోవని చెప్పగలమా? భారత్ ఎలాంటి కూటమిని ఏర్పరచుకోలేదు. కానీ పాకిస్తాన్ ఇస్లామిక్ దేశాల కూటమిలో సభ్యత్వం పొంది ఆ దేశాల సహాయం పొందుతోంది. నాటో దేశాలు మిగిలిన సభ్య దేశాల నుండి సహాయం పొందినట్లే పాకిస్తాన్ ఇస్లామిక్ దేశాల సహాయం పొందే అవకాశం

ఉంది. అమెరికాను, యూరప్ దేశాల్ని వ్యతిరేకించే ముస్లిం దేశాల నుండి పాకిస్తాన్‌కి ఆర్థిక సహాయం అందుతోంది. చైనా, భారత్‌ల మధ్య సంబంధాలు సరిగా లేవనేది సత్యం. కానీ పాకిస్తాన్ భారత్‌ల మధ్య గల వైరం మరొకరకమైనది.

వివిధ దేశాల మధ్య ఉన్న అపారమైన ఆయుధాలే ఆయా దేశాలు పరస్పరం దాడి చేసుకోకుండా ఉండడానికి కారణం అవుతున్నాయి. అలాంటి దాడి చేస్తే రెండు దేశాలూ దెబ్బతింటాయి. ఒక దేశాన్ని ఓడించవచ్చు అనే నమ్మకం ఉంటే ఏ దేశమైనా దాడి చేయడానికి సిద్ధపడుతుంది. అందుచేతనే భారత్ ఆ ప్రమాదాన్ని నివారించేందుకు అణ్వస్త్రాలను రూపొందించుకోవడానికి సిద్ధపడింది. పాకిస్తాన్ ఇతర దేశాల సహాయంతో ఆ పని చేయగలదు. రెండు దేశాల వద్ద ఆయుధాలు ఉండడం అమెరికా, రష్యాల మధ్య యుద్ధం జరగకుండా ఉండడానికి ఎలా కారణమైందో అలాగే భారత్, పాకిస్తాన్‌లు ఆయుధాలను సమకూర్చుకోవడం వల్ల ఆ రెండు దేశాల మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడే అవకాశం తగ్గుతుంది.

ఐతే పేద దేశాలు అణ్వస్త్ర పోటీలో అపారమైన ధనాన్ని ఖర్చు చేయడం సరైనదేనా అనే ప్రశ్న వస్తుంది. అలా ఉన్న ధనాన్ని ఖర్చు చేయడం అవివేకం. అయినా చుట్టూ ఉన్న పరిస్థితుల దృష్ట్యా అది తప్పనిసరి కావచ్చును. అణ్వస్త్ర దేశాలు భారత్‌కి నీతులు చెప్పడం అర్థం లేదు. అనేక అణుపరీక్షలు జరిపి, ప్రపంచం మొత్తాన్ని అణ్వస్త్ర పోటీకి గురిచేసిన దేశాలకు భారత్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు.

చైనా అణ్వాయుధాల్ని సమకూర్చుకోలేదా? ఇజ్రాయిల్ అనేక ఐక్యరాజ్యసమితి ఆదేశాలను కూడా బేఖాతరు చేయలేదా? ఫ్రాన్స్ అమెరికా అభ్యంతరాల్ని ప్రక్కకు పెట్టలేదా? భారత్ చైనా మాదిరిగా అణ్వస్త్రాల్ని రూపొందించు కోకుండా చాలాకాలం సంయమనాన్ని పాటించింది. ఆర్థిక ఆంక్షల వల్ల మన సామర్థ్యం మరింత పెరుగుతుంది. పరిశోధన వల్ల అనేక రంగాలలో ప్రగతి సాధ్యపడుతుంది. రష్యా క్రయోజనిక్ ఇంజన్లు ఇవ్వకుండా అమెరికా అడ్డుపడింది. కానీ దానివల్ల మనం స్వయంగా క్రయోజనిక్ ఇంజన్లని రూపొందించుకున్నాం. అమెరికా అవరోధాల వల్ల మన నిశ్చయం, పట్టుదల పెరిగాయి. కనుక అణుపరీక్షలు జరపడం అనేక కారణాల వల్ల సరైనదేనని స్పష్టమవుతోంది. అణ్వస్త్రాల తయారీ తప్పనిసరిగా వాటి ప్రయోగానికి దారి తీస్తుందని భయపడనవసరం లేదు.





# అణు పరీక్షలు ఎందుకు?

**జూన్ 1 - 7 , 1998**

వివిధ దేశాలు తమ అణ్వస్త్ర సామర్థ్యాన్ని ఎలా పెంచుకున్నదీ, ఎన్నిసార్లు పరీక్షలు చేసినదీ గమనించవలసని విషయం. 1945లో అమెరికా జపాన్‌లోని హిరోషిమాపై ఆటంబాంబుని ప్రయోగించిన తరువాత ఇప్పటివరకు వివిధ దేశాలు 2, 041 అణుపరీక్షలు జరపాయి. వివిధ దేశాలు మొట్టమొదటిసారిగా అణుపరీక్షలు జరిపిన వివరాలు క్రింద పట్టికలో స్పష్టమవుతాయి.

| దేశం | అణు పరీక్షలు జరిపిన సంవత్సరం |
|---|---|
| అమెరికా | 1945 |
| రష్యా | 1949 |
| బ్రిటన్ | 1952 |
| ఫ్రాన్స్ | 1960 |
| చైనా | 1964 |
| భారత్ | 1974 |

భారత్ తప్ప మిగిలిన దేశాలన్నీ అణుపరీక్షలు భూమి మీదనే జరిపాయి. భారత్ భూగర్భంలో పరీక్షలు జరపింది.

| దేశం | అణు పరీక్షలు సంఖ్య |
|---|---|
| అమెరికా | 1030 |
| రష్యా | 717 |
| బ్రిటన్ | 45 |
| ఫ్రాన్స్ | 192 |
| చైనా | 41 |
| భారత్ | 6 |
| మొత్తం | 2041 |

| వివిధ దేశాలు వాతావరణంలో, భూగర్భంలో జరిపిన పరీక్షల వివరాలు: | | | |
|---|---|---|---|
| దేశం | వాతావరణంలో | భూగర్భంలో | మొత్తం |
| అమెరికా | 215 | 815 | 1030 |
| రష్యా | 207 | 508 | 715 |
| బ్రిటన్ | 21 | 24 | 45 |
| ఫ్రాన్స్ | 45 | 147 | 192 |
| చైనా | 23 | 18 | 41 |
| భారత్ | – | 6 | 6 |
| మొత్తం | 511 | 1518 | 2029 |

ఈ మొత్తం పరీక్షల్లో 511 పరీక్షలు భూమి మీది వాతావరణంలో జరగడం వల్ల వాతావరణ కాలుష్యం జరిగింది.

ఫ్రాన్స్ 1996లో కూడా అణుపరీక్షలు జరపింది. చైనా 1995లో జరిపింది. దీనినిబట్టి ఫ్రాన్స్, చైనాలు సిటిబిటి (అణ్వస్త్ర నిరాయుధీకరణ ఒప్పందం)ని ఖాతరు చేయకుండా పరీక్షలు జరిపాయని తెలుస్తోంది. కనుక ఏ దేశం తన జాతీయ భద్రతని పట్టించుకోకుండా, కేవలం 'నీతి సూక్తులు' వల్లిస్తూ కూర్చోలేదు.

ఫ్రాన్స్ అధ్యక్షుడు డిగాలే నాటోలోని సభ్యదేశాల మాటను కూడా ఖాతరు చేయకుండా అణుపరీక్షలు జరిపించాడు. కాని ఇప్పుడు భారత్ అణుపరీక్షలు నిర్వహిస్తే మాత్రం కొన్ని దేశాలు గగ్గోలు పెట్టేసి భారత్‌పై ఆంక్షలు విధిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్ ఏం చేయాలి? అన్న విషయంపై ప్రజ్ఞాభారతి 1998, మే 17న ఒక చర్చాగోష్టి ఏర్పాటు చేసింది. చర్చలో అనేకమంది మాజీ సైనికాధికారులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, జడ్జీలు, ఉపాధ్యాయులు, పత్రికా రచయితలు, ప్రభుత్వోద్యోగులు పాల్గొన్నారు. వారంతా ఏకగ్రీవంగా అంగీకరించిన విషయాలు క్రింద ఇస్తున్నాను.

❖అణు పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించినందుకు అటల్‌బిహారీ వాజ్‌పాయ్ ప్రభుత్వాన్ని అభినందించాలి.





❖భారత్ 1974 పరీక్షల తరువాత 24 సంవత్సరాలు వేచి చూడకుండా ఉండాల్సింది. ఇంతకాలం ఆగడం విచారించదగిన విషయం.

❖పరీక్షలతో సరిపెట్టుకోకూడదు. కనీసం 200 బాంబులను తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలి.

❖పాకిస్తాన్ మన దేశంలోకి తీవ్రవాదుల్ని, విచ్ఛిన్నకర శక్తుల్ని ప్రవేశపెడుతోంది. వాళ్ళు కాశ్మీర్ లోయలోనే కాక జమ్మూలో కూడా అమాయకులైన హిందువుల్ని చంపుతున్నారు. వారి కార్యకలాపాలు రానురాను దేశంలోని అనేక ఇతర ప్రాంతాలకి కూడా వ్యాపిస్తున్నాయి. జమ్మూకాశ్మీర్‌లో పాకిస్తాన్ సృష్టిస్తున్న అరాచక పరిస్థితులను చూసి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి షేక్ అబ్దుల్లా పాకిస్తాన్‌పై దాడి చేసి అక్కడి తీవ్రవాదుల శిక్షణా శిబిరాలను సమూలంగా నాశనం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. కనుక భారత్ ఇటువంటి విచ్ఛిన్నకర శక్తుల్ని కఠినంగా అణచివేసి హెచ్చరించవలసిన సమయం ఆసన్నమైంది.

❖అణు పరీక్షల వల్ల దేశంలో సర్వత్రా వెల్లివిరిసిన ఉత్సాహాన్ని వృధాగా పోనీయకూడదు. ప్రస్తుత పరీక్షల వల్ల ఎదురయ్యే పరిస్థితుల్ని ప్రజలకి వివరించి వాటిని తట్టుకునేందుకు సిద్ధం చేయాలి. శాస్త్ర సాంకేతిక రంగాలలో స్వయంకృషితో ప్రగతిని సాధించాలి. దేశ రక్షణ విషయంలో రాజీ పడకూడదు.

❖దేశ రక్షణ కోసమైన ప్రత్యేక పన్నులు విధించవచ్చును. దానివలన ప్రతి ఏటా 14 వేల కోట్ల రూపాయలు సమకూరుతాయి. ఈ డబ్బుని రక్షణావసరాలకు ఖర్చు చేయవచ్చును.

❖అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షల గురించి ఆందోళన చెందనవసరం లేదు. రాబోయే శతాబ్దపు ద్వితీయార్థానికల్లా భారత్ ప్రపంచంలో నాలుగవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ, మార్కెట్లను కలిగి ఉంటుంది. ఇంత పెద్ద మార్కెట్టును కాదనుకుంటే ఆంక్షల్ని విధించిన వారికే మనకంటే ఎక్కువ హాని కలుగుతుంది. చైనా కూడా అమెరికా, రష్యాలను పట్టించుకోలేదు. ఐనా అమెరికా చైనా మార్కెట్టును వదులుకోవడానికి సిద్ధపడలేదు. అమెరికాలోని కంపెనీలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, అణుపరీక్షలు మొదలైన వాటిపై పట్టును సడలించవలసిందని ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నాయి. అమెరికా ప్రభుత్వం అరవగలదు కానీ కరిచే స్థితిలో లేదు.

❖భారత్ మరిన్ని సరళీకరణ విధానాలను అవలంభించి ఫ్రాన్స్, బ్రిటన్ వంటి దేశాలతో వ్యాపారాన్ని పెంచుకోవాలి. దానివలన అమెరికా మరింత నష్టపోతుంది. ఫ్రాన్స్ ఎప్పుడూ అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బతీయడానికే ఎదురు చూస్తూ ఉంటుంది కనుక ఫ్రాన్స్ భారత్‌లో వ్యాపార సంబంధాలు పెంచుకునేందుకు తప్పక ముందుకు వస్తుంది.

❖ప్రవాస భారతీయులు భారత్‌లో పెట్టుబడులు పెట్టేట్లు ప్రోత్సహించడం ద్వారా విదేశీ మారక ద్రవ్యపు లోటును భర్తీ చేసుకోవచ్చును.

❖సమాచార సాంకేతిక రంగంలో (సాఫ్ట్‌వేర్) భారతీయుల అవసరం అమెరికా, ఐరోపా దేశాలకు ఎంతైనా ఉంది. దీనిని మన ప్రయోజనాల సాధనకై ఉపయోగించాలి.

❖దేశ ప్రజానీకంలో స్వాభిమానాన్ని, దేశభక్తిని జాగృతం చేయాలి. ప్రజల్ని అర్థం లేని నినాదాలతో తప్పుదారి పట్టిస్తూ, పేద ప్రజల సంరక్షకులుగా చెలామణీ అవుతున్న 'పురోగమన వాదులు' కమ్యూనిస్టులు, విదేశీ శక్తుల ఆటలు కట్టించాలి.

❖తగిన శక్తిలేని, రక్షణ సామర్థ్యం లేని దేశాన్ని ప్రపంచం సహించదు. అలాంటి దేశం ఎన్ని నీతి సూత్రాలు వల్లించినా లాభం లేదు. సరిహద్దులను కాపాడుకోవడం, విచ్ఛిన్నకర శక్తుల్ని ఏరిపారవేయడం అనేవి ఏ ప్రభుత్వమైన చేయవలసిన మొదటి పనులు. దేశ ప్రజలకి ఆహారంతో పాటు దేశాన్ని రక్షించుకునేందుకు ఆయుధాలు కూడా కావాలి. రక్షణ లేకపోతే స్వేచ్ఛా జీవనం లేదు, అభివృద్ధి లేదు.

❖గత 50 సంవత్సరాలుగా శాస్త్ర సాంకేతిక రంగాలలో మన దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేసిన శాస్త్రజ్ఞుల్ని, ఇంజనీర్లని అభినందించాలి. మన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి ఇంతకు ముందుగానే శత్రువును హెచ్చరించి ఉండవలసింది.

చివరగా గోష్ఠిలో పాల్గొన్న వారంతా ఇలాంటి సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకున్నందుకు శ్రీ అటల్‌బిహారీ వాజ్‌పాయ్‌ని అభినందిస్తూ సందేశాన్ని పంపాలని తీర్మానించారు.





# మిత్రపక్షాల బెదిరింపులు

**జూన్ 15 - 21 , 1998**

11, 12 లోక్‌సభ ఎన్నికల్లో అనేక చిన్న చిన్న పార్టీలు పుట్టుకువచ్చాయి. జాతీయ పార్టీలు కనీసం ఒకటి రెండు మిత్రపక్షాలతో ప్రభుత్వాన్ని ఏర్పరచేంత మెజారిటీ కూడా పొందలేకపోయాయి. ఈ సమస్య 9వ లోక్‌సభలోనే ప్రారంభమయింది. 10వ లోక్‌సభలో కాంగ్రెస్‌కి పూర్తి మెజారిటీ లభించలేదు. అయినా కొన్ని పార్టీలను చీల్చి, పార్టీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించి మెజారిటీ సాధించి ఐదేళ్ళ పాటు పాలనలో ఉంది. 11వ లోక్‌సభలో కాంగ్రెస్‌కి గానీ, బిజెపికి గాని మెజారిటీకి తగినన్ని స్థానాలు రాకపోగా రెండు, మూడు స్థానాలు కలుపుకున్నా తగిన బలం చేకూరని స్థితి ఏర్పడింది. అప్పుడు కేవలం 47 స్థానాలు మాత్రమే గెలుచుకున్న పార్టీ నేతృత్వంలో 15 పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పరచాయి. అధికారపక్షపు బలం మొత్తం లోక్‌సభలో మూడవ వంతు కూడా లేకపోవడం విచిత్రం. యునైటెడ్ ఫ్రంట్ (ఈ ఫ్రంట్‌లోని పార్టీలు ఎన్నికల్లో ఒకటికి వ్యతిరేకంగా ఒకటి పోటీపడినవే) కాంగ్రెస్ మద్దతుపై ఆధారపడవలసి వచ్చింది. అంతర్గత కుమ్ములాటలు, కాంగ్రెస్‌తో అభిప్రాయ భేదాలతో సతమతమయిన ఫ్రంట్ ప్రభుత్వం ఎక్కువ కాలం మనుగడ సాగించలేకపోయింది. పదవీకాంక్ష నిలువెల్లా నిండిన కాంగ్రెస్ మూలంగా ఫ్రంట్ ప్రభుత్వానికి దినదినగండం ఏర్పడింది. 12వ లోకసభలో ప్రవేశించిన పార్టీల సంఖ్య మరింత పెరిగింది. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరప్రదేశ్‌లలో తప్ప మిగిలిన రాష్ట్రాల్లో బిజెపి ప్రాంతీయ పార్టీలతో పొత్తు కుదుర్చుకోవడం ద్వారా రాజకీయరంగంలో అంటరాని పార్టీగా తనపై పడిన ముద్రని చెరిపివేసుకుంది. దీనివలన కాంగ్రెస్ కేవలం 140 స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగితే, జనతాదళ్ తుడిచిపెట్టుకుపోయింది. జనతాదళ్ కేవలం నాలుగు స్థానాలు గెలుచుకుంటే అందులో రెండు బిజెపి – అకాలీదళ్‌ల సహాయంతో గెలుచుకున్నవి. 11వ లోక్‌సభలో ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్‌ని వ్యతిరేకించిన బిజెపికి 19 పార్టీలతో స్వయంగా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచవలసిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలముందు పొత్తు కుదుర్చుకున్న పార్టీలనే ప్రభుత్వ భాగస్వాములుగా చేసినా ఎన్నికల తరువాత కూడా కొందరిని చేర్చుకోవలసి వచ్చింది. 15 పార్టీల కూటమితో ఏర్పడినా ఫ్రంట్ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ లభించకపోయినా 19 పార్టీలతో ఏర్పడిన బిజెపి ప్రభుత్వానికి మెజారిటీ లభించింది.

ఫ్రంట్ పాలనలో ప్రధాన మంత్రులు ఏ రాష్ట్రంలో పర్యటిస్తే ఆ రాష్ట్రానికి 'అభివృద్ధి నిధులు' కేటాయించడం ఆనవాయితీగా చేశారు. కొన్ని రాష్ట్రాలకి 6,000 కోట్లు, ఒక రాష్ట్రానికి 1,000 కోట్లు ఇలా నిధులు ప్రకటించారు. ఎలాంటి కోరికలు కోరని రాష్ట్రానికి మొండి చేయి చూపారు. అలాంటి రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఆంధ్రప్రదేశ్‌కి ఏదీ దక్కకపోవడానికి కారణం ముఖ్యమంత్రి యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఫ్రంట్‌ని చీలకుండా కాపాడాలని తాపత్రయపడడం, కేంద్రంపై ఎలాంటి వత్తిడి తీసుకురాలేకపోవడం. ఇలా ప్రాంతీయ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు కేంద్రప్రభుత్వం పై వత్తిడి తేవడం తప్పనిసరి అని వివిధ పార్టీలు భావిస్తున్నాయి.

ప్రస్తుతం బిజెపి తప్ప మిగిలిన పార్టీలన్నీ తమ స్వంత డిమాండ్లని ప్రభుత్వం ముందు పెడుతున్నాయి. తమిళనాడు ఇందుకు నాంది పలికింది. తను ఫెరా చట్టం ఉల్లంఘన కేసునుండి, అవినీతి కేసుల నుండి బయటపడేందుకు తమిళనాడు నాయకురాలు తన రాష్ట్రానికి 'సౌకర్యాలు' కల్పించాలని కోరుతోంది. వాటిలో ఒకటి తమిళ భాషని జాతీయ భాష చేయాలి. వీటన్నింటికంటే ముఖ్యమైన కోరిక కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దు చేయాలి. లేకపోతే ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటామని బెదిరింపు. బీహార్‌లో రబ్రీదేవి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలననది సమతా పార్టీ కోరిక. ఇప్పుడు కొత్తగా మమతా బెనర్జీ పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరుతోంది. మిత్రపక్షాలు మాత్రమే కాక కాంగ్రెస్ కూడా అనేక రాష్ట్ర ప్రభుత్వాల్ని రద్దు చేయాలని కోరుతోంది. ఈ కోరికలతోపాటు ఆర్థికపరమైన కోరికలు కూడా ఎక్కువవుతున్నాయి. రైల్వే బడ్జెట్‌లో ఒరిస్సాకి తగినంత ప్రాధాన్యతని ఇవ్వలేదని బిజూ జనతాదళ్ అలకవహించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇదే ఆరోపణ చేసింది. అకాలీదళ్ ఒక్కటే ఇలాంటి కోరికలు కోరలేదు. కానీ కేంద్రంలో తమకి తగినంత ప్రాధాన్యం లభించలేదని ఆ పార్టీ అసంతృప్తిని వ్యక్తం చేసింది. తమ పార్టీ వారిని గవర్నర్లుగా నియమించాలని అనేక పార్టీలు కోరుతున్నాయి. కొందరు రాయబారులను వెనుకకు పిలిపించడంలోనూ, కొత్త వారిని నియమించడంలో ప్రభుత్వం సమస్యల్ని ఎదుర్కొంటుంది. ఎలాంటి అసంతృప్తిని చేయని మిత్రపక్షం ఒక్క శివసేన మాత్రమే. కానీ మహారాష్ట్రలో ఆ పార్టీతో సంయుక్తంగా నడుపుతున్న ప్రభుత్వాన్ని చూసి బిజెపి గర్వపడే పరిస్థితి లేదు.





ఇలా తలుచుకుంటే ప్రభుత్వాన్ని ఎప్పుడైనా కూల్చివేయగలిగిన 17 పార్టీలు కూడిన ప్రభుత్వం ఉంది. ఇలా ఇన్ని రకాల పార్టీలు వ్యక్తిగత ఎజెండాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వాన్ని నడపవలసిన పరిస్థితి బహుశా ప్రపంచంలో మరే ప్రధానమంత్రికి వచ్చి ఉండదు. ఎవరికీ సంతృప్తి లేదు. ప్రభుత్వాన్ని పడిపోకుండా నిలబెడుతూనే సమర్థవంతమైన పాలనని కూడా అందించవలసిన బాధ్యత ప్రధాన పక్షంపై పడింది. కఠినమైన, ఖచ్చితమైన నిర్ణయం తీసుకున్న వెంటనే మిత్రపక్షాల బెదిరింపులను ఎదుర్కొనవలసి వస్తోంది.

దేశం ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం. అంతర్గత భద్రత పూర్తిగా క్షీణించిపోయింది. ఐఎస్ఐ ఏజెంట్లు దేశంలో స్వేచ్ఛగా తిరిగుతూ విచ్ఛిన్నకర కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. సరిహద్దుల నుండి వేలాదిమంది విదేశీయులు దేశంలోకి చొరబడుతున్నారు. వీటన్నింటికి తోడు నిరంతరంగా పెరిగిపోతున్న జనాభా వల్ల అభివృద్ధి కుంటుపడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి తగిన ప్రయత్నం కూడా చేయడానికి వీలులేని పరిస్థితి నెలకొని ఉంది. అనేక సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన రక్షణ విషయాల పట్ల దృష్టి కేంద్రీకరించవలసి ఉంది. ఈ లోపున వివిధ దేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాలి. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించడానికి సమర్థవంతమైన, త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవలసి వస్తుంది. ఎక్కడ తప్పటడుగు వేసినా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. చైనా అనేక సందర్భాలలో అమెరికా మాటని ఖాతరు చేయలేదు. కాని ఆ దేశంలో ఒకే పార్టీపాలన సాగుతుండడంతో ప్రభుత్వాన్ని కాపాడుకోవలసిన అగత్యం లేదు. అలాగే భారత్ లాగా చైనా ఎప్పుడూ నైతిక సూత్రాలకి కట్టుబడి లేదు. తన అపారమైన మార్కెట్‌ను అమెరికాకు ఎరగా చూపింది. అమెరికా కాకపోతే ఫ్రాన్స్‌ని ఆహ్వానించేది. కనుక ఒక దేశానికి ఎదురుగా మరొక దేశాన్ని ఉంచి తన ప్రయోజనాలను కాపాడుకోవడంలో ప్రావీణ్యత సంపాదించింది. చైనా అనేక సంవత్సరాలుగా ప్రపంచ వాణిజ్య సంస్థలో స్థానం సంపాదించాలని ప్రయత్నిస్తోంది. అమెరికా ఆ ప్రయత్నాల్ని అడ్డుకుంది. కానీ ఇప్పుడు అదే అమెరికా చైనాని 'అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశం'గా గుర్తించవలసి వచ్చింది. అలాగే అనేక విచ్ఛిన్నవాద దేశాలకి ఆయుధాలు, అణ్వస్త్ర పరిజ్ఞానం రహస్యంగా చేరవేయడంలో కూడా చైనా ప్రావీణ్యత సాధించింది. సిద్ధాంతాలు, న్యాయాలు ఈ విధానాలను అంగీకరించకపోవచ్చును. కానీ వీటి

మూలంగా చైనా ప్రపంచంలో తన బలాన్ని పెంచుకుంది. భారత్ కూడా స్వప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించడం నేర్చుకోవాలి. చాణక్యుడు ఈ పద్ధతిని ఎప్పుడో వివరించాడు.

వ్యక్తిగత ప్రయోజనాలను రాష్ట్ర ప్రయోజనాలుగా చూపి వాటిని నెరవేర్చుకోవాలనుకునే కొద్ది మంది నాయకుల ప్రాంతీయ పార్టీల మూలంగా ఏర్పడుతున్న నష్టాల గురించి మేధావులు ఆలోచించాలి. ప్రాంతీయ అభివృద్ధి కోరదగినదే అయినా ప్రాంతీయ పార్టీలు కోరినవన్నీ తీర్చడానికి తగిన నిధులు కేంద్రప్రభుత్వం వద్ద ఉండాలి. కనుక దేశంలో ఒక బలమైన పార్టీ ఉంటే అప్పుడు రాష్ట్రాలను కూడా అదుపుచేయడానికి, రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తకుండా చూడడానికి అవకాశం ఏర్పడుతుంది. దేశంలో ఎన్ని రాష్ట్రాలు ఉంటే అన్ని ప్రాంతీయ పార్టీలతో ఏర్పడిన ప్రభుత్వం స్వార్థప్రయోజనాలకు బలయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రాంతీయ పార్టీలు కూడా దేశం ఎదుర్కొంటున్న సమస్యల్ని గుర్తించి వాటి పరిష్కారానికి పాటుపడితే మంచిది. ప్రాంతీయ పార్టీలు గత చరిత్రని గుర్తు చేసుకోవాలి. వివిధ రాష్ట్రాల మధ్య వైషమ్యాలు చెలరేగినప్పుడు విదేశస్థులు వాటిని ఆసరాగా తీసుకుని దేశాన్ని ఆక్రమించారు. స్వాతంత్ర్య ఉద్యమం వలన దేశ ప్రజల్లో జాతీయ భావన పెల్లుబికింది. ఉక్కు మనిషి సర్దార్ పటేల్ అనేక సంస్థానాలను భారత రాజ్యంలో విలీనం చేశారు. నేటి బిజెపిలో సర్దార్ పటేల్ సామర్థ్యం, వ్యక్తిత్వం ఉన్న నాయకులు ఉన్నారు. వారు దేశ ప్రయోజనాలను పరిరక్షించడంలో సర్దార్ పటేల్ చూపిన దృఢత్వాన్ని చూపుతారని ఆశిద్దాం. ఆ పార్టీ ఏర్పరుచుకున్న లక్ష్యాల ప్రాధాన్యతని అందరూ గుర్తించాలని ఆశిద్దాం. ఎవరైనా ఎప్పుడైనా ప్రభుత్వాన్ని బెదిరించడం వలన కలిగే నష్టాల్ని ప్రజలకి వివరించడం ద్వారా అటువంటి బెదిరింపుల్ని నివారించగలగాలి.





# సమస్యల వలయంలో స్వతంత్ర్య భారతం

**జూన్ 29 - జులై 5 , 1998**

50 సంవత్సరాల క్రితం స్వాతంత్ర్యం వచినప్పుడు తమ జీవన పరిస్థితులు ఎంతో మారతాయని ప్రజలు ఆశించారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే అనేక అభివృద్ధి కార్యక్రమాల ద్వారా, పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని నాయకులు హామీ ఇచ్చారు. మొదటి రెండు మూడు సంవత్సరాలు దేశానికి బహిర్గతంగా వాటిల్లిన ప్రమాదాలను ఎదుర్కొనేందుకు, సరిహద్దుల్ని కాపాడుకునేందుకు సరిపోయింది. సోవియట్ యూనియన్ తరహా పంచవర్ష ప్రణాళికలను ప్రవేశపెడతూ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రజలు 5-10 సంవత్సరాల పాటు కష్టించి పనిచేస్తే తరావాతి తరం ఎంతో సుఖంగా జీవించగలిగిన భారతాన్ని నిర్మించగలుగుతారని అన్నారు. ప్రస్తుతపు తరం త్యాగాలు చేస్తే రాబోయే తరం సుఖంగా జీవించగలుగుతుందని ఆయన నమ్మకం కలిగించారు. ప్రస్తుతం స్వాతంత్ర్యం వచ్చి 50 సంవత్సరాలు పూర్తవుతున్నాయి. మూడవ తరం కూడా ప్రారంభమయింది. ఈ కాలంలో నెహ్రూ వంశానికి చెందిన వారే ప్రధానులయ్యారు, కాంగ్రెస్ పార్టీ ఎక్కువకాలం అధికారంలో ఉంది. జనాభా పెరుగుదలని అరికట్టడంలోనూ, పేదరికం, నిరక్షరాస్యతలను నిర్మూలించడంలోనూ, ఆరోగ్యం, ఉపాధి సౌకర్యాలు పెంచడంలో అన్నిరకాల పథకాలు పూర్తిగా విఫలమయ్యాయని ఒప్పుకుంటున్నారు.

కాని వీరే ఈనాడు పేదదేశం అణుబాంబులు తయారుచేయడాన్ని విమర్శిస్తున్నారు. 50 సంవత్సరాల పాటు అధికారంలో ఉండి తాము పేదరికాన్ని నిర్మూలించడానికి ఏమీ చేయలేదనే విషయాన్ని విషయాన్ని వీళ్ళు విస్మరిస్తున్నారు.

దేశ ప్రజానీకం ఇంతకు ముందు అనేక త్యాగాలు చేశారు, ఎప్పుడూ అందుకు సిద్దంగా ఉంటారు కూడా. పెరిగిపోతున్న ఋణభారం మూలంగా అభివృద్ధి కుంటుపడింది. 1997-98 బడ్జెట్ ముందు జరిపిన ఆర్థిక సర్వేలో దేశపు ఋణభారానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

| సంవత్సరం | మొత్తం | వడ్డీ |
|---|---|---|
| 1980–81 | 59,749 | 2,604 |
| 1990–91 | 3,14,558 | 21,498 |
| 1991–92 | 3,54,662 | 29,596 |
| 1994–95 | 5,38,611 | 44,060 |
| 1995–96 | 6,06,233 | 50,045 |
| 1996–97 | 6,75,676 | 59,478 |
| 1997–98 | 7,73,541 | 65,700 |
| దీనికి తోడు విదేశీ ఋణం 93 బిలియన్ డాలర్లు (372,000 కోట్లు) ఉంది. | | |

దీని ప్రకారం మనదేశంలో పుట్టిన పిల్లవాడి నుండి కాటికి కాళ్ళు చాచుకున్న ముసలివారి దాకా ప్రతి ఒక్కరి నెత్తిమీద 10,000 రూ.ల అప్పు ఉందని తేలింది. ఈ అప్పు ప్రతి సంవత్సరం పెరుగుతూ పోతోంది కూడా. అంతర్గత ఋణాలు చాలక బయటి నుంచి కూడా అప్పు చేసి సంపాదించిన విదేశీ మారక ద్రవ్యాన్ని దేశంలో పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి, మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి కాకుండా మురికి వాడల నిర్మూలనానికి, రోడ్లు వేయడానికి ఖర్చు పెడుతున్నాం. ఈ పనులన్నీ మన ప్రభుత్వం మన డబ్బుతోనే చేయవచ్చును.

మన దేశంలో సాంకేతిక పరిజ్ఞానం లేని, జీవనోపాధికి నోచుకోని వారు ఎందరో ఉన్నారు. అధికారం పరమావధిగా, ఆ అధికారాన్ని నిలుపుకునేందుకు ప్రజా సంక్షేమాన్ని సాధనంగా వాడుకునే పార్టీలు, ప్రభుత్వాలు కాకుండా కృషికి, అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చే ప్రభుత్వం ఏర్పడితే దేశంలో చక్కని రోడ్లు వేయించడం, గంగా, కావేరి నదులకు కాలువలు ఏర్పాటు చేయడం వంటి పనులు ఎన్నో చేపట్టి ఉండేది.

పేదరిక నిర్మూలనకి, ప్రజాజీవనాన్ని అభివృద్ధి చేయడానికి తగిన పథకాలు, ప్రణాళికలు రూపొందించడంలో విఫలమయ్యాం. ప్రజాకర్షక విధానాలు కుత్సిత రాజకీయాలకు బదులు ప్రజలలో కష్టించి పనిచేసే తత్వాన్ని, విద్య ద్వారా తమ సామర్థ్యాన్ని పెంచుకునే ప్రవృత్తిని పెంపొందించాలి. కానీ ఇందుకు పూర్తి విరుద్ధంగా





ప్రభుత్వమే అన్నీ చేస్తుందని, ప్రజలు ఏమీ చేయవలసిన అవసరం లేదనే భావన కలిగించారు. ఇలా అన్ని పనులు ప్రభుత్వమే చేయడానికి ప్రభుత్వం దగ్గర నిధులు ఉండాలి. నిధుల కోసం పన్నులు విధిస్తుంది. కానీ ఈ నిధుల్లో 80 శాతం ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలకే ఖర్చవుతున్నాయని మన నాయకులు అంగీకరిస్తున్నారు. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపై ఖర్చు చేస్తున్న నిధులు క్రమంగా తగ్గిపోతున్నాయని, ఋణాలపై వడ్డీలు చెల్లించడానికే నిధులు ఖర్చు చేయడం జరుగుతోందని కంట్రోలర్అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక పేర్కొంటోంది. ప్రభుత్వ చేతుల మీదుగా నిధులు ఖర్చు చేస్తున్నప్పుడు సహజంగానే అవినీతికి తావు ఉంటుంది. నిధులు కొందరి జేబుల్లోకి చేరతాయి. అందుకనే ప్రభుత్వ కాంట్రాక్టుల విషయంలో ఎప్పుడూ అవకతవకలు జరుగుతుంటాయి. అవినీతి, అనైతికత వంటివి సర్వసాధారణ చర్చనీయాంశాలు అయ్యాయి. అనేక కుంభకోణాల విచారణకై విచారణ సంఘాలు ఏర్పాటు చేయటం, ఆ సంఘాలు సమర్పించిన నివేదికల్ని బుట్టదాఖలు చేయడం మామూలు విషయం అయిపోయింది. హంతకులు, నేరస్థులు, అవినీతిపరులు, మంత్రులు, ఎంపిలు అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశాభివృద్ధి ఎలా సాధ్యపడుతుంది.

ఐతే మొట్టమొదటిసారిగా నేడు కేంద్రంలో జాతీయ దృక్పథం కలిగిన పార్టీ ప్రభుత్వాల్ని ఏర్పరచింది. దేశ సమస్యల్ని పరిష్కరించడానికి విదేశీ పరిష్కారాలు అవసరం లేదని విశ్వసించే ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వపు ఆలోచనా విధానం సరైనదే కానీ ప్రజలలో ఇలాంటి జాతీయ భావనని కలిగించడానికి ఏం చేయాలన్నది ఆలోచించాలి. దీనికి ముందుగా ప్రజల దృష్టిని రాజకీయాలు, ఎన్నికల వైపు నుండి అభివృద్ధి, స్వయంకృషి వైపు మరల్చాలి.

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో మన నాయకులు కష్టించి పనిచేయడం, నిస్వార్థ సేవ వంటి విలువలను ప్రజల ముందు ఉంచేవారు. ప్రజాసేవ కోసం అనేకమంది నాయకులు తమ వృత్తి, ఉద్యోగాలను సైతం వదలిపెట్టారు. కాని క్రమేణా ఈ ఉన్నత విలువలు, ఆదర్శాలు మరచిపోయాం. అధికార సముపార్జన, అధికారాన్ని ఉపయోగించుకుని తనవారు, తన బంధువులకి ప్రయోజనం చేకూర్చడమే పరమావధిగా మారింది. ఎందుకూ కొరగాని వారు డబ్బు సంపాదించడానికి రాజకీయరంగం ఒక సాధనం అయింది. రాజకీయ రంగంలో

ప్రవేశించిన నేరస్థులకి రక్షణ కల్పించడానికి ప్రజా ధనం ఖర్చు చేస్తున్నారు. అనేకమందిని అకారణంగా చంపివేసిన తీవ్రవాదులు ఆ తరువాత లొంగిపోయి తమకి పోలీసు రక్షణ కావాలని కోరుతున్నారు. వీరప్పన్ వంటి నేరస్థుడిని పట్టుకోవడం రెండు రాష్ట్ర ప్రభుత్వాల వల్ల కావడం లేదు. ఇది ప్రభుత్వాల అసమర్థతని నిరూపిస్తుంది. ఇటువంటి అసమర్థ పాలనలో అభివృద్ధి ఎలా సాధ్యపడుతుంది? తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో, మన రాష్ట్రంలో హైదరాబాద్ వంటి నగరాల్లో విదేశీ ఏజెంట్లు తమ కార్యకలాపాలను యధేచ్ఛగా సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ఒక్క రోజులో ఏర్పడినది కాదు. ఓట్ల వేటలో ఉన్న పార్టీలు ఈ విషయాలను ఏ మాత్రం పట్టించుకోలేదు. దేశ విభజన ఎందుకు జరిగింది? ఎవరి మత మౌఢ్యం వల్ల ఇంతటి ఘోరం జరిగిందనేది పాత తరం మరిచిపోతే యువతరానికి తెలియనే తెలియదు.

ఎలాంటి విదేశీ 'ఇజాల' నుండి పుట్టని ఒక జాతీయ పార్టీ నేడు ప్రభుత్వాన్ని ఏర్పరచింది. యువతరానికి మన దేశపు చరిత్రని, గొప్పదనాన్ని తెలియజేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రాచీన విలువలను వదిలిపెట్టకుండా ఆధునిక విధానాలను అనుసరించాలనే ఆలోచనని ప్రజలలో కలిగించాలి. ఇందుకు విద్యావంతులు, మేధావులు తమ వంతు సహాయాన్ని అందించాలి.

**క. భూషణములు వాణికి నఘు,**
**పేషణములు మృత్యుచిత్త భీషణములు హృ**
**త్తోషణములు గల్యాణ వి,**
**శేషణములు హరిగుణోపచితభాషణముల్**

శ్రీమదాంధ్ర మహాభాగవతం ప్ర.స్క

భాగవతంలోని పద్య, గద్యాలన్నీ సరస్వతీదేవి కలంకరించిన నగలు, పారాయణ చేస్తే మృత్యుభయం తొలగుతుంది. (పరీక్షిత్మహారాజుకు – విన్పించింది.) హృదయంలోని బాధలను తొలగించి హాయిని గొల్పేది, శ్రీమహావిష్ణువు గుణగణాలను విన్పించే ఈ గ్రంథం శుభాలను చేకూర్చేదని ఫలశృతి ముందే చెప్తున్నారు పోతన.





# జయలలిత అనుచిత ధోరణి

**జులై 13 - 19, 1998**

ఎఐడిఎంకె నాయకురాలు జయలలిత గొంతెమ్మ కోరికలు, తీవ్రమైన కోరికలు, తీవ్రమైన ఆరోపణలు చూసి వివిధ రాజకీయ పార్టీలవారు, సామాన్య ప్రజానీకం ఆశ్చర్యపోతున్నారు. జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాల్పడిన అవినీతి ప్రజలందరికి తెలుసు. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పార్టీ పరాజయం పాలుకావడంతో ఆమె గతంలో చేసిన పాపాలు ఆమెను పీడించడం మొదలయింది. ఆమెపై అనేక కేసులపై కోర్టుల్లో విచారణ సాగుతోంది. విచారణ సజావుగా సాగితే కొన్ని నేరాలకి ఆమెకు శిక్షపడటం ఖాయం. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం, మింగివేయడం వంటివి ఆమె మాత్రమే చేయలేదు. ఇలాంటి అవినీతి నాయకత్వపు జాబితా చాలా పెద్దది. అది స్వయంగా జవహర్‌లాల్ నెహ్రూతో మొదలవుతుంది. ఇతర పార్టీలు అనుసరిస్తున్న రాజకీయ అస్పృశ్యతని తిప్పికొట్టడానికి బిజెపి 12వ లోక్‌సభ ఎన్నికల సమయంలో అనేక ప్రాంతీయ పార్టీలతో ఎన్నికల ఒప్పందం కుదుర్చుకోవలసి వచ్చింది. అటువంటి పార్టీల చరిత్ర ఏమిటి? వాటిపై అవినీతి ముద్ర ఉన్నదా లేదా అన్నది ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రాధాన్యత వహించలేదు. ఆ పార్టీలు బూటకపు సెక్యులరిజాన్ని అనుసరిస్తున్నాయా లేదా? బూటకపు పార్టీలతో పోరాడటానికి బిజెపితో కలవడానికి సిద్దపడుతున్నాయా లేదా అన్న విషయాలకే బిజెపి నాయకులు ప్రాధాన్యతనిచ్చారు. నిజానికి కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టులు కూడా జయలలితతో ఒప్పందం చేసుకోవడానికి ప్రయత్నించారు. కనుక జయలలిత వంటి నాయకురాలి మద్దతుని కోరింది కేవలం బిజెపి మాత్రమే కాదు. నిజానికి బిజెపి అవినీతి ఆరోపణలలో కూరుకుపోయిన పార్టీకి ప్రజలలో కొంత గౌరవ ప్రదమైన స్థానాన్ని కల్పించింది. ఇందుకు కృతజ్ఞతలు చెప్పుకోవలసింది పోయి జయలలిత తన చిరకాల శత్రువుని సాధించడానికి బిజెపిని ఇబ్బందుల పాలు చేస్తోంది. తనపై సాగుతున్న అవినీతి కేసు విచారణ వేగం తగ్గించాలని ఆమె ప్రభుత్వంపై తెస్తున్న వత్తిడి చూస్తే ఆమె కూడా కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, సమాజ్‌వాదీ పార్టీ, పశ్చిమ బెంగాల్‌లోని సిపిఎం పార్టీ నాయకులకు తీసిపోదని స్పష్టమవుతుంది. వీరంతా అనేక అవినీతి ఆరోపణలకు గురైనవారే. దీనికి తోడు కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేయడానికి

ఆమె సిద్ధపడుతోంది. అవినీతి చరిత్రని పరిశీలిస్తే ఈ నాయకులంతా ఒకరిని మించినవారు మరొకరు. కేవలం జయలలితకి నచ్చదు కాబట్టి కరుణానిధి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడం రాజ్యాంగ దుర్వినియోగమే అవుతుంది. మొట్టమొదటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ ప్రభుత్వ బర్తరఫ్‌ని అంగీకరించక పోవచ్చును. ఎందుకంటే ఆయన కేంద్ర ప్రభుత్వపు రబ్బర్ స్టాంపులా పనిచేసేందుకు ఇష్టపడరు. పైగా జయలలిత వ్యక్తిగత కోపాన్ని తీర్చుకునేందుకు కరుణానిధి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయమని కోరుతున్నదని అందరిలాగానే ఆయనకి కూడా తెలుసు. రెండవది, ఒకవేళ రాష్ట్రపతి అంగీకరించినా లోక్‌సభలో బిజెపి, దాని మిత్రపక్షాలు రెండవ స్థానంలోనే ఉన్నాయి. అలాంటప్పుడు బిజెపి ప్రభుత్వం తొందరపడి కరుణానిధి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేస్తే పార్లమెంటులో ఎదురయ్యే వ్యతిరేకత వల్ల తిరగి కరుణానిధి ప్రభుత్వానికే అధికారం అప్పజెప్పవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. తన గొంతెమ్మ కోరికల మూలంగా ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని జయలలిత గ్రహించకపోవడం విచారకరం. ప్రభుత్వాన్ని నడపడం అంటే ఆట కాదు, అలాగే రాజ్యాంగాన్ని వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు ఉపయోగించకూడదు. తాము అధికారంలోకి వస్తే డిఎంకె పభుత్వాన్ని బర్తరఫ్ చేస్తామని బిజెపి నాయకులు తనకి హామీ ఇచ్చారని జయలలిత చెప్పడం చాలా పొరపాటు. ఎందుకంటే ఇదే విషయంపై కోర్టులో విచారణ జరిగితే శాంతి భద్రతలు క్షీణించడం వల్ల కాకుండా కేవలం ఎన్నికల ఒప్పందం కోసం ఒక ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసినందుకు కోర్టు బిజెపి (జయలలితని కూడా) అభిశంసించే అవకాశం ఉంది.

మద్రాస్ రాష్ట్రంగా ఉన్నప్పుడు తమిళనాడు ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు ఉండేవి. రాజాజీ, ప్రకాశం పంతులు వంటి నిస్వార్థ నాయకులు ఆ రాష్ట్రంలో ఉండేవారు. 1967లో కాంగ్రెస్ ఆధిపత్యం అంతమయిన తరువాత ఆ రాష్ట్రాన్ని ద్రవిడ పార్టీలుగా పేరు పడిన ఎఐడిఎంకె, డిఎంకెలు పాలిస్తూ వచ్చాయి. ఈ పార్టీలను సినిమా నటులు, నాటక, సినిమా రచయితలు నడిపించారు. వాళ్ళు ప్రజాదరణని పొందారు కానీ ప్రజలకి మంచి చేయడంలో విఫలమయ్యారు. గతంలో డిఎంకె, ఎఐడిఎంకె ప్రభుత్వాల్ని కాంగ్రెస్, ఇతర పార్టీ ప్రభుత్వాలు బర్తరఫ్ చేశాయి. ఈ బర్తరఫ్‌లు అనేకసార్లు జరిగాయి. కాంగ్రెస్ తమిళనాడులో పూర్తిగా తుడిచి పెట్టుకుపోయినా ఒకసారి డిఎంకెని, మరోసారి ఎఐడిఎంకెని





పట్టుకుని వేళ్ళాడుతూ వస్తోంది. తమిళనాడులో సీట్లు సంపాదించుకునేందుకు కాంగ్రెస్ ఎప్పుడూ ఏదో ఒక పార్టీని అంగీకరించవలసి వస్తోంది. బిజెపి కూడా కాంగ్రెస్ మాదిరిగానే వ్యవహరిస్తే బర్తరఫ్‌ల పర్వం కొనసాగుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో ఏ పార్టీకి పొత్తు ఉంటుందో ఆ పార్టీ మిగిలిన మరొక పార్టీ ప్రభుత్వాన్ని రద్దు చేయమని తప్పక కోరుతుంది. ఇది తమిళనాడు రాజకీయాలలో సాగుతున్న దుస్సాంప్రదాయం. కేవలం కొన్ని పార్లమెంటు సీట్లు గెలుచుకున్నంత మాత్రాన ఒక పార్టీ నాయకురాలు కేంద్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలనుకోవడం విచారించదగిన విషయం. కనుక బిజెపి ప్రస్తుత పరిస్థితుల్లో ఖచ్చితంగా, నిర్మొహమాటంగా వ్యవహరించాలి. జయలలిత గొంతెమ్మ కోరికలు తీర్చడానికి నిరాకరించడం వల్ల బిజెపి ప్రభుత్వాన్ని కోల్పోతే అందుకు ఎవరూ ఆ పార్టీని నిందించరు.

ఐతే ముస్లిం ఓట్ల కోసం ఉత్తరప్రదేశ్‌లో ములాయంసింగ్ ముస్లింలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లుగానే తమిళనాడు ప్రభుత్వం ముస్లిం తీవ్రవాద సంస్థల కార్యకలాపాలను చూసీ చూడనట్లు వ్యవహరించింది. ఈ తీవ్రవాద సంస్థలు ఎల్.టి.టి.ఇకి తమిళ ప్రజలలో, ద్రవిడ పార్టీలలో సానుభూతి ఉంది. ఎల్.టి.టి.ఇ కార్యకలాపాల మాదిరిగానే ముస్లిం తీవ్రవాద సంస్థల కార్యకలాపాల్ని కూడా ప్రజలు పట్టించుకోలేదు. ముస్లిం సంస్థలకి, ఐ.ఎస్.ఐ, కొన్ని పశ్చిమ ఆసియా దేశాల సహాయ సహకారాలు అందుతున్నాయి. కరుణానిధి ప్రభుత్వ కాలంలో తీవ్రవాద సంస్థల కార్యకలాపాలు పెచ్చు పెరిగిపోయాయి. 20 సంవత్సరాల క్రితం దక్షిణ భారతంలో తీవ్రవాద సంస్థలు లేవు. కానీ ఈనాడు ఇక్కడ నిత్యం మారణకాండ సాగుతోంది. కోయంబత్తూరు ప్రేలుళ్ళ తరువాత శాంతి భద్రతల పరిరక్షణలో డిఎంకె ప్రభుత్వం విఫలమయింది. కనుక ఆ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని పదే పదే జయలలిత డిమాండ్ చేస్తుండడంతో డిఎంకె ప్రభుత్వం జాగ్రత్తపడి తీవ్రవాద సంస్థల్ని అదుపులో పెట్టే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ప్రయత్నాలు ఎంతవరకూ సాగుతాయన్నది వేచి చూడాల్సిందే. కరుణానిధి ప్రభుత్వమే కాక, కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూడా తమ రాష్ట్రాల్లో ఐ.ఎస్.ఐ కార్యకలాపాల్ని అరికట్టడంలో విఫలమయ్యాయి. ఈ జాతి వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టే చర్యలు ఏ రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునేలా కేంద్ర హోంమంత్రి ఆ ప్రభుత్వాలను హెచ్చరించాలి.

# అమెరికా దురభిమానం

**జులై 20 - 26, 1998**

సోవియట్ యూనియన్ అనేక చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోవడంతో ప్రపంచ దేశాల మధ్య సంబంధాలలో పెనుమార్పులు వచ్చాయి. ఆర్థికంగా బలహీనపడిన రష్యా అంతర్గత సమస్యలతో సతమతమవుతోంది. ఇతర దేశాలను శాసించే స్థితిలో అది ఇప్పుడు లేదు. ఇస్లాం తీవ్రవాదం నుండి తమను కాపాడమని స్లావిక్ (ఇంతకు ముందు యుగోస్లావియా) ప్రజలు మొరపెట్టుకున్నా వారిని రక్షించే స్థితిలో కూడా లేదు రష్యా. ప్రస్తుతం అమెరికా ఒక్కటే ఏకైక సూపర్ పవర్. మిలటరీ పరంగా అమెరికాకి ఎలాంటి ఇబ్బందులు లేవు, ఇప్పటివరకు ఆర్థిక రంగంలో అమెరికాతో పోటీపడిన జపాన్, కొరియా, తైవాన్లు కష్టాల్లో పడటంతో ఈ రంగంలో కూడా అమెరికాదే పై చేయి అయింది. తూర్పు జర్మనీ ప్రాంతాన్ని పశ్చిమ జర్మనీ స్థాయికి తీసుకు రావడానికి ప్రస్తుతపు జర్మనీ ప్రభుత్వం నానాతంటాలు పడాల్సి వస్తోంది. తూర్పు జర్మనీ ప్రాంతంలో పరిశ్రమలను ఆధునీకరించడానికి బిలియన్‌ల మార్క్ (జర్మనీ మారక ద్రవ్యం) లు ఖర్చు పెడుతోంది. తూర్పు ఆసియా దేశాలైన మలేషియా, థాయిలాండ్, ఇండోనేషియా, కొరియా మొదలైన దేశాలు ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు అమెరికా సహాయాన్ని అర్థిస్తున్నాయి. కనుక మిలటరీ పరంగా, ఆర్థికంగా, వ్యాపార పరంగా అమెరికా ప్రపంచంలో పోటీలేని రాజ్యంగా వెలుగొందుతోంది. ఈ ఆధిపత్యం ఎంతకాలం కొనసాగుతుందన్నది సందేహాస్పదమే అయినా ప్రస్తుతానికి ప్రస్తుతానికి ఈ ఆధిపత్యం మూలంగా ప్రపంచంలో అనేక విపరీత పరిణామాలు కలుగుతున్నాయి. అమెరికా దేశాల తలరాతలను తిరగి వ్రాయాలని ప్రయత్నిస్తోంది. అమెరికా ప్రయోజనాలే ప్రపంచంలో అతి ముఖ్యం అనే రీతిలో ప్రవర్తిస్తోంది.

పనామా అధ్యక్షుడిని అమెరికా నిర్బంధించింది. అతడికి మాదక ద్రవ్యాల వ్యాపారంతో సంబంధం ఉన్నప్పటికీ ఒక దేశాధ్యక్షుడిని నిర్బంధించడం అంతర్జాతీయ సూత్రాలకి విరుద్ధమైనా ఐక్యరాజ్యసమితిలో అమెరికాకు ఉన్న పరపతి మూలంగా ఎటువంటి విమర్శలు తలెత్తలేదు. అమెరికా చర్య వలన మంచి జరిగినా, అసలు అటువంటి చర్య ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని ధిక్కరిస్తున్నదనే మాట నిజం. కనుక అటువంటి చర్య మంచిది కాదు.





NATO (North Atlantic Treaty Organisation) లోని దేశాలను కూడగట్టుకొని ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని అడ్డుపెట్టుకుని అమెరికా బోస్నియాలోని అంతర్గత సంక్షోభంలో తలదూర్చింది. ఇది ఇతర దేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోవడమే. బోస్నియాని పూర్తి ఇస్లాం రాజ్యంగా మార్చాలని స్థానిక ముస్లిములు (వీరంతా నాలుగు శతాబ్దాల క్రితం మతం మారినవారే) సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లు ప్రయత్నిస్తున్నాయి. బోస్నియా ముస్లిముల తరపున అమెరికా జోక్యం చేసుకోవడం సౌదీ అరేబియా వంటి దేశాల్ని సంతోషపరచేందుకేనని స్పష్టమవుతుంది.

అమెరికా యుగోస్లావియాలోని సంక్షోభంలో కూడా తలదూర్చుతోంది. యుగోస్లావియాలోని కొసావో రాష్ట్రంలో ముస్లిముల సంఖ్య ఎక్కువ. ఈ రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి కల్పించబడింది కూడా. ఇక్కడ పరిస్థితి భారత్‌లోని జమ్మూకాశ్మీర్ పరిస్థితి మాదిరిగానే ఉంటుంది. వివిధ దేశాల్లో పెరుగుతున్న ఇస్లాం తీవ్రవాదాన్ని మద్దతుగా భావించి, వివిధ ముస్లిం దేశాల నుండి అందుతున్న ఆయుధాలతో కొసావో ముస్లిములు యుగోస్లావియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. తాము ఇస్లాం మతాన్ని అనుసరిస్తాం కనుక క్రైస్తవ యుగోస్లావియాలో ఉండబోమని వాళ్ళంటున్నారు. వీరి వాదన కాశ్మీర్‌లోని ముస్లింల వాదనలాగనే ఉంది. నిన్నటి వరకు అమెరికా కొసావో వేర్పాటు ధోరణిని ముస్లిం వేర్పాటు ధోరణిగా పేర్కొనేది. కాని ఇప్పుడు మాట మార్చి అది అల్బేనియన్ వేర్పాటు వాదమని అంటోంది. నిజానికి అల్బేనియన్‌లు, కొసావోలు జాతిపరంగా స్లావ్ జాతీయులే. అల్బేనియా కమ్యూనిస్టు రాజ్యం. కానీ కమ్యూనిజం నాశనం అవడంలో అది తిరిగి ఇస్లాం రంగును పూసుకుంది. కొసావోలకు అల్బేనియా రక్షణ స్థావరంగా మారింది. కొసావోలోని ముస్లిం తిరుగుబాటుని, వేర్పాటువాదాన్ని జాతిపరమైన ఘర్షణ అనడంలో అమెరికా ద్వంద్వవైఖరి బయటపడుతోంది. ఇదే రకంగా కాశ్మీర్ కూడా జాతులకు సంబంధించిన సమస్య అని అమెరికా ప్రకటించినా ఆశ్చర్యపోనవసరం లేదు. నిజానికి కాశ్మీర్‌లో జాతిపరమైన విభేదం ఎంత మాత్రం లేదు. ఇజ్రాయిల్‌ను సమర్థించడం ద్వారా ముస్లిం దేశాల విమర్శలకి గురవుతున్నందువల్ల ఆ దేశాలను ప్రసన్నం చేసుకోవడానికి అమెరికా ఇలా వ్యవహరిస్తోంది. కొసావో ముస్లిములకు మద్దతునివ్వడంలో అమెరికా స్వార్థ ప్రయోజనాలు స్పష్టమవుతున్నాయి.

సైప్రస్‌లో 80 శాతం క్రైస్తవులు 20 శాతం ముస్లిములు. కానీ టర్కీ సహాయంతో ముస్లిములు క్రైస్తవులనందరిని తరిమివేశారు. 20 శాతం ముస్లిములు 40 శాతం భూభాగాల్ని ఆక్రమించుకున్నారు. అమెరికా క్రైస్తవులకి మద్దతు తెలుపలేదు. ఇక్కడ కూడా ముస్లిం దేశాల్ని సంతోషపెట్టడానికి, ఇజ్రాయిల్‌కి ఇస్తున్న మద్దతును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది.

ప్రస్తుతం చైనాకి దగ్గర కావాలని అమెరికా ప్రయత్నిస్తోంది. ఇప్పటివరకు కమ్యూనిస్టు చైనాని గుర్తించడానికి సైతం అమెరికా ఇష్టపడలేదు. చైనాలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన గురించి తీవ్రంగా విమర్శిస్తూ వచ్చింది. 1989లో తైనన్‌మన్ స్క్వేర్‌లో జరిగిన సంఘటనలను ఖండించింది కూడా. ఆ దేశంలో ప్రజాస్వామ్య విలువలు అసలే లేవని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, అంతర్జాతీయ వ్యాపారానికి తగిన పరిస్థితులు లేనేలేవని గగ్గోలు పెట్టింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో చైనా ప్రవేశాన్ని వ్యతరేకించింది కూడా. అలాంటి అమెరికా ఇప్పుడు చైనాలో వ్యాపారాన్ని పెంపొందించుకునేందుకై కమ్యూనిస్టు నేతలను మంచి చేసుకోవాలని తాపత్రయపడుతోంది. మనవ హక్కుల ఉల్లంఘన వంటి ఆరోపణలన్నీ మరిచిపోయి బిల్‌క్లింటన్ చైనాలో అధికార హోదాలో పర్యటించాడు. రష్యాని ఎదుర్కొనేందుకు చైనా పనికి వస్తుందని భావించి అమెరికా చైనాకి కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సైతం సిద్ధపడుతోంది.

నిన్నమొన్నటి వరకు ఇరాన్ అంటే అమెరికాకి సుతరామూ ఇష్టం ఉండేది కాదు. కాని ఇప్పుడు హఠాత్తుగా ఇరాన్ పట్ల స్నేహభావం పెరిగిపోతోంది. చైనా పాకిస్తాన్ తో పాటు ఇరాన్‌కి కూడా మిస్సైల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోందని అమెరికాకి తెలుసు. అయినా చైనా, ఇరాన్, పాకిస్తాన్‌ల వంటి దేశాల్లో వ్యాపారం పెంపొందించుకోవడానికే అమెరికా ప్రాధాన్యత నిస్తుంది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యపు విలువలు, మానవహక్కులు జాతీయ ప్రయోజనాల ముందు నిలబడవు. ఇప్పటివరకు శతృత్వం పూనిన దేశాలతోనే మిత్రత్వానికి ప్రయత్నిస్తోంది అమెరికా.

అమెరికా ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నదనేది చెప్పడం కష్టమే. భారత్‌కి ప్రజస్వామ్యం, మానవహక్కుల పట్ల ఉన్న గౌరవాన్ని ఏ మాత్రం పట్టించుకోని అమెరికా వీటిని ఖాతరు చేయని దేశాలతో స్నేహం చేస్తోంది. చైనా, పాకిస్తాన్, ఇరాన్ వంటి అప్రజాస్వామిక, అణ్వాయుధాలు కలిగిన దేశాలతో చెలిమి చేయడానికి తాపత్రయపడే అమెరికా భారత్ పట్ల మొండి వైఖరిని, అయిష్టతని ప్రదర్శిస్తోంది.





దీనిని బట్టి అమెరికాకి అధికార దాహం, స్వప్రయోజనాలు ఎక్కువ అయ్యాయని తెలుసుంది. చైనా, సోవియట్ యూనియన్‌లు అమెరికా ఆధిపత్యానికి అడ్డుగా ఉండేవి. సోవియట్ యూనియన్, కమ్యూనిజాన్ని ఆ దేశ ప్రజానీకమే కాక ఆ దేశపు ఆధిపత్యంలో ఉన్న దేశాల ప్రజలు కూడా వ్యతిరేకించారు. కమ్యూనిజం నశించడం వల్ల మంచి జరిగినా, రష్యా సైనికపరంగా బలహీనమవడం వల్ల అమెరికా ఆధిపత్యం ఎక్కువైంది. ఇది అనేక దేశాలకి నష్టం చేస్తోంది. మధ్యప్రాచ్య దేశాల్లో ముస్లిం ప్రయోజనాలను అమెరికా సమర్థించడానికి కారణం అరబ్ దేశాల నుండి చమురు పొందడానికే. రష్యాలో ఆర్థిక సంక్షోభం ఇలాగే కలకాలం కొనసాగదు. ఆ దేశంలో అపారమైన వనరులు ఉన్నాయి. కనుక అనతికాలంలోనే రష్యా తిరిగి సూపర్ పవర్‌గా రూపొందుతుంది.

భారత్ పట్ల వ్యతిరేకతను చూపే దేశాలను అమెరికా ప్రోత్సహించడం దురదృష్టకరం. అమెరికా అధ్యక్షులైన వాషింగ్టన్, అబ్రహంలింకన్, రూజ్‌వెల్ట్‌ల పట్ల భారతీయులకు అపారమైన గౌరవాభిమానాలు ఉన్నాయి. రాబోయే కాలంలో అమెరికా నేతృత్వంలోని క్రైస్తవ దేశాలకి, ఇస్లాం దేశాలకి మధ్య సంఘర్షణ జరుగుతుందని, అదే అంతిమ యుద్ధమని పేర్కొన్నాడు. ప్రస్తుతం భారత్ క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఇటువంటి పరిస్థితులు మన సామర్థ్యాన్ని పెంచుతాయి. దేశంలోని విచ్ఛిన్నకర శక్తుల్ని అరికడితే జాతీయ భావన పెంపొందుతుంది. ఇదే ఈనాడు భారత్ ముందున్న కష్టసాధ్యమైన పని. మన దేశం ఫ్రాన్స్, జర్మనీలతో సత్సంబంధాన్ని ఏర్పరచుకోవడం ద్వారా అమెరికా ప్రభావాన్ని తగ్గించవచ్చును. ఫ్రాన్స్ అనేకసార్లు అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసింది. దీనితో పాటు ఇజ్రాయిల్‌తో సత్సంబంధాలను ఏర్పరచుకోవడం కూడా ఎంతైనా అవసరం.

**దండమయా! విశ్వంభర!**
**దండమయా! పుండరీకదళనేత్ర!హరీ!**
**దండమయా! కరుణానిధి!**
**దండమయా! నీకు నెపుడు దండము కృష్ణా!**

# కమ్యూనిస్టుల దేశవ్యతిరేక ధోరణి

**ఆగస్టు 24 - 30, 1998**

జమ్మూకాశ్మీర్ సమస్యని అంతర్జాతీయ చేయడం పోఖరన్ తరువాతనే కాదు ఇంతకు ముందు కూడా చాలాసార్లు జరిగింది. పాకిస్తాన్ దాడిని, కాశ్మీర్ లోకి పాక్ సైనికులు రహస్యంగా ప్రవేశించడాన్ని జవహర్‌లాల్‌నెహ్రూ 1948లో ఐక్యరాజ్యసమితి ముందు పెట్టడంతో మొట్టమొదటిసారి కాశ్మీర్ విషయం అంతర్జాతీయ సమస్యగా మారింది. అప్పటి నుండి అనేకసార్లు అది అంతర్జాతీయ సమస్యగా పేర్కొనబడింది. సోవియట్ రష్యా వీటో అధికారంతో ఐక్యరాజ్యసమితి తీర్మానాలన్నీ వీగిపోతూ వచ్చాయి. పాకిస్తాన్, బ్రిటన్, అమెరికాలు ప్రతిసారి ఐక్యరాజ్యసమితిలో ఈ విషయాన్ని ప్రస్తావించడానికి ప్రయత్నించాయి. 1965, 1971 యుద్ధాలను అవకాశంగా తీసుకుని అమెరికా, ఇతర దేశాలు జమ్మూ కాశ్మీర్ సమస్యని అంతర్జాతీయ సమస్యగా చిత్రించడానికి ప్రయత్నించాయి. అలాగే మానవ హక్కుల సంఘాలు, మైనారిటీ పరిరక్షణ సంస్థల ద్వారా ఈ దేశాలు పదేపదే కాశ్మీర్ సమస్యని అంతర్జాతీయ వేదికలపై లేవనెత్తాయి. జవహర్‌లాల్ నెహ్రూ జమ్మూ కాశ్మీర్ సమస్యని అంతర్జాతీయం చేస్తే సర్దార్ వల్లభాయ్ పటేల్ ముస్లిం రాజ్యాన్ని ఏర్పరచాలనుకున్న హైదరాబాద్ నిజాం ప్రయత్నాల్ని వమ్ము చేసి ఆ సంస్థానాన్ని భారత రాజ్యంలో విలీనం చేశారు. బ్రిటన్ ప్రోత్సాహంతో నిజాం ఐక్యరాజ్యసమితికి వెళ్ళాలని ప్రయత్నించాడు. కానీ సర్దార్ పటేల్ పోలీస్ చర్య ద్వారా నైజాం పరిపాలనకి చరమగీతం పాడారు. ఐదు రోజులలో సమస్యని పరిష్కరించారు. ట్రావన్‌కోర్, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాలను పటేల్ మొక్కవోని ధైర్యంతో భారత రాజ్యంలో విలీనం చేశారు. 1948 నుండి 1951 వరకు పోలీస్ చర్య తరువాత భారత కమ్యూనిస్టులు రజాకార్లతో చేతులు కలిపారు. వాళ్ళు రజాకార్ల నుండి దెబ్బతిన్న నైజాం సైన్యం నుండి ఆయుధాలు తీసుకొని భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేశారు. ఇలాంటి కమ్యూనిస్టులు ప్రస్తుతం భారత్ అణుపరీక్షలు నిర్వహించడం తప్పని విమర్శిస్తున్నారు.

1960లో చైనా అణుపరీక్షల్ని నిర్వహించినప్పుడు అవి అమెరికా సామ్రాజ్యవాదాన్ని, దుందుడుకుతనాన్ని సవాలు చేశాయని భారత కమ్యూనిస్టులు అభివర్ణించారు. కాని ఇదే కమ్యూనిస్టులు భారత్ అణ్వస్త్రాలను కలిగి ఉండడం మాత్రం ప్రపంచ శాంతికి భంగకరమని గగ్గోలు పెడుతున్నారు. కమ్యూనిస్టు దేశాల





అణుపరీక్షల్ని సమర్థించడం, తమ దేశపు అణుపరీక్షల్ని వ్యతిరేకించడం ద్వారా కమ్యూనిస్టులు తమ నిజాయితీ భావాల్ని బయటపెట్టుకున్నారు.

భారత్ అమూల్యమైన వనరులను అణ్వస్త్రాల– తయారీకై వ్యర్థం చేస్తోందని, మరో ప్రక్క దేశంలో అవిద్య, నిరుద్యోగం, పేదరికం పెరిగిపోతున్నాయని కమ్యూనిస్టులు విమర్శిస్తున్నారు. కాని చైనా మొదటిసారి అణుపరీక్షల్ని నిర్వహించినప్పుడు ఆ దేశపు తలసరి ఆదాయం భారత్ కంటే ఎక్కువేమీ లేదు. చైనాలో కూడా పేదరికం ఉంది. ఐతే అది అణు ప్రయోగాలు జరపడానికి అడ్డురాలేదు. కమ్యూనిస్టులు మరొక విషయం మరచిపోతూ ఉంటారు. గత 50 సంవత్సరాలుగా దేశాన్ని పాలించినది వారి మిత్రులైన కాంగ్రెస్, జనతాదళ్ నేతలే. 50 సంవత్సరాల తరువాత భారత్ పేదరికంలో మ్రగ్గడానికి కారణం వీరేనని వేరే చెప్పాలా?

అసలు విషయం ఏమిటంటే కమ్యూనిస్టులు, సెక్యులరిస్టులు హిందూ వ్యతిరేక, భారతవ్యతిరేక ధోరణిని అవలంబిస్తున్నారు. ముస్లిములను సంతోష పెట్టడానికి ఏమైనా చేయడానికి వీరు సిద్ధం. భారత్ శక్తివంతంగా రూపొందడం వీరికి ఇష్టం ఉండదు. 1920లో కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడిన నాటినుండి ఇప్పటివరకు కమ్యూనిస్టులు జాతి వ్యతిరేక ధోరణినే అవలంబించారు. సుభాష్ చంద్రబోస్‌ని సామ్రాజ్య శక్తుల ఏజెంట్ అని, జర్మనీ, జపాన్ చేతిలో కీలుబొమ్మ అని దూషించారు. మతపరంగా ముస్లిములు ప్రత్యేక జాతి అని జిన్నా ద్విజాతి సిద్ధాంతానికి మద్దతునిచ్చి దేశవిభజనని సమర్థించారు. భారత్‌కి స్వాతంత్ర్యం అర్థరహితమని, నెహ్రూ బ్రిటన్ చేతిలో కీలుబొమ్మ అని అన్నారు. ఆంధ్ర, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగించారు. 1962లో చైనా భారత్‌పై దాడి చేయడానికి కారణం భారత్ అని చైనా తప్పులేదని ప్రకటించారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని కమ్యూనిస్టులలో ఒక వర్గం బలపరిచింది. 1969, 1971 లలో ఇందిరాగాంధీ మైనారిటీ ప్రభుత్వానికి కమ్యూనిస్టులు మద్దతు తెలిపారు. ఇప్పుడు బంగ్లాదేశీ చొరబాటుదారుల ప్రవేశాన్ని సమర్థిస్తున్నారు. వారిని తిప్పిపంపడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రపంచంలో మరే దేశంలో ఇంత ఘనమైన దేశ వ్యతిరేక చరిత్ర కలిగిన పార్టీ మరొకటి ఉండదంటే అతిశయోక్తి కాదు.

# 2020 నాటికి ఆంధ్రప్రదేశ్

**సెప్టెంబరు 1 - 7 , 1997**

రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులు రానురాను పెరిగిపోతున్నాయన్నది స్పష్టమైపోయింది. (1981 నుండి 1998 వరకు ఖర్చు 12 రెట్లు పెరిగింది.) ప్రభుత్వ ఆదాయంలో 83% ప్రభుత్వోద్యోగుల జీతాల చెల్లింపుకే ఖర్చవుతోంది. అభివృద్ధి కార్యక్రమాలకి తగినన్ని నిధులు మిగలడం లేదు. 75 మిలియన్ ప్రజానీకానికి అరమిలియన్ ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. మరోలా చెప్పాలంటే 150 మందికి ఒక అధికారి ఉన్నాడు. ఇక మునిసిపల్ సంస్థల్లోని అధికారులను కూడా కలుపుకుంటే అప్పుడు రాష్ట్రం మొత్తంలో ప్రభుత్వాధికారుల సంఖ్య 775,000కి చేరుతుంది. అంటే 99 మందికి ఒక అధికారి అన్నమాట. కేంద్ర ప్రభుత్వాన్ని తీసుకుంటే 186 మందికి ఒక కేంద్ర ప్రభుత్వ అధికారి మాత్రమే ఉన్నాడు. రాష్ట్రంలో అధికారుల సంఖ్యకి ఎ.పి.ఎస్.ఆర్.టి.సి, ఎ.పి.ఎస్.ఇ.బి వంటి సేవాసంస్థల ఉద్యోగుల్ని కూడా కలిపితే రాష్ట్రంలో అధికారుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. అప్పుడు 975,000 అధికారులు లేదా 78 మందికి ఒక అధికారి ఉన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 186 మందికి ఒక అధికారి ఉన్నారు.

మునిసిపల్ సంస్థల్లోనే 274,000 అధికారులు పని చేస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం అధికారుల సంఖ్య 500,000 కాగా పట్టణ జనాభా 27% మాత్రమే. ఈ అంకెలను బట్టి మన రాష్ట్రంలో అధికారులు ఎక్కువైపోయారని, ప్రజాసేవ తగ్గిపోయిందని స్పష్టమవుతోంది. రాష్ట్ర సగటు ఉత్పత్తిలో 21.5% ప్రభుత్వ ఖజానాలోకి చేరుతోంది. ఈ సొమ్ము ఎక్కువ శాతం ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలకే ఖర్చు చేయబడుతోంది. అంటే రాష్ట్ర సగటు ఉత్పత్తిలో 18% 0.5 మిలియన్ అధికారులపై ఖర్చు చేయడం జరుగుతోంది.

దేశం మొత్తంలో 1981 నుండి 1995 వరకూ తలసరి ఆదాయం 3.0% చొప్పున పెరిగితే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 2.2% మాత్రమే పెరిగింది. తలసరి ఆదాయంలో గణనీయమైన పెరుగుదల సాధించిన రాష్ట్రాల్లో పెరుగుదల రేటు 3.5% ఉంది. మరోవైపు ఆంధ్రరాష్ట్ర సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాలపై ఉదారంగా ఖర్చు చేస్తోంది. దేశం మొత్తంలో సబ్సిడీలపై 0.8% ఖర్చు చేయగా ఆంధ్రలో





మాత్రం 1.2 % ఖర్చు చేయడం జరిగింది. ప్రజా సంక్షేమ పథకాలకి మన రాష్ట్రం బడ్జెట్టులో 0.8% నిధులు కేటాయిస్తే కేంద్ర స్థాయిలో కేవలం 0.5% మాత్రమే కేటాయించడం జరిగింది. రాష్ట్ర జనాభాలో 73% మంది సబ్సిడీ బియ్యం, చక్కెర, కిరసనాయిలు మొదలైనవి పొందుతున్నారు. ఇలా సంక్షేమ పథకాలపై, సబ్సిడీలపై అవసరానికి మించి ఖర్చుచేయడం వల్ల రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది. మానవవనరుల అభివృద్ధి సాగడం లేదు. దేశం మొత్తంలో అక్షరాస్యుల సంఖ్య 55% కాగా రాష్ట్రంలో మాత్రం 44% మాత్రమే. అదే కేరళలో అక్షరాస్యత నూటికి నూరు శాతం ఉండడం విశేషం.

రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులు క్రింది పట్టికలో చూడండి.

**రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులు**

| మొత్తం ఖర్చు | 1975 -79 | 1980-85 | 1986-91 |
|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 16.4 | 19.5 | 21.5 |
| 14 పెద్ద రాష్ట్రాలు | 14.4 | 17.9 | 20.0 |
| 6 వేగంగా అభివృద్ధి | | | |
| చెందుతున్న రాష్ట్రాలు | 14.6 | 18.7 | 19.8 |
| నిధుల ఖర్చు | | | |
| ఆంధ్రప్రదేశ్ | 4.5 | 3.9 | 3.4 |
| 14 పెద్ద రాష్ట్రాలు | 3.8 | 4.5 | 4.3 |
| 6 వేగంగా అభివృద్ధి | | | |
| చెందుతున్న రాష్ట్రాలు | 3.9 | 5.0 | 4.0 |
| పాలనా యంత్రాంగంపై ఖర్చు | | | |
| ఆంధ్రప్రదేశ్ | 1.2 | 2.6 | 3.8 |
| 14 పెద్ద రాష్టాలు | 2.4 | 3.1 | 2.6 |
| 6 వేగంగా అభివృద్ధి | | | |
| చెందుతున్న రాష్ట్రాలు | 2.5 | 3.5 | 3.2 |

ప్రభుత్వం ఖర్చును అదుపు చేయడానికి క్రింది చర్యలు చేపట్టవచ్చు.

❖రాష్ట్ర సగటు ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఖర్చుకు ఒక పరిమితి నిశ్చయించాలి. ప్రస్తుత 20% ఉన్న పరిమితిని 2020 నాటికి 12 1/2% తగ్గించాలి. ప్రజల వద్ద మిగిలిన నిధుల్ని సంక్షేమ పథకాలపై వాడవచ్చు.

❖ప్రస్తుతం ఆదాయంలో 150 మందికి ఒక అధికారి చొప్పున ఉన్నారు. ఈ సంఖ్యని 2020 నాటికి 500 మందికి ఒక అధికారి స్థాయికి తగ్గించాలి.

❖ప్రభుత్వ ఆదాయంలో 50% ప్రజలకి విద్య, శిక్షణ, ఆరోగ్యం, రోడ్లు, టెలికమ్యూనికేషన్ సౌకర్యాలు అందించడానికి వెచ్చించాలి.

❖దారిద్ర రేఖకు దిగువన ఉన్నవారికే సబ్సిడీలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువమంది ఉంటే ఆ కుటుంబానికి సబ్సిడీ సౌకర్యం ఆపు చేయాలి.

❖బడ్జెట్ లో సమతుల్యత సాధించాలి. ఎంత ఆదాయం ఉందో అంతే ఖర్చు ఉండాలి.

❖ప్రజల ఋణాలను 15 సంవత్సరాల లోగా తీర్చివేయాలి.

సుధాముని భక్తికి మెచ్చి నీకేమి వరం కావాలంటాడు శ్రీకృష్ణుడు. అప్పుడా భక్తుడు ఇలా అడిగాడు –

**క. నీ పాదకమల సేవయు,**
**నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం**
**తాపార భూతదయయును**
**తాపసమందార! నాకు దయసేయఁగదే!**

శ్రీమదాంధ్ర మహాభాగవతం ద.స్క

"స్వామీ! నీ పాదకమలాలను సేవించుకునే భాగ్యాన్ని, నీ పాదాలనే భక్తితో పూజించేవారితో స్నేహం, నిరంతరం అపారమైన భూతదయ తాపసమందారా! నాకు దయ సేయి"మని కోరాడు.





## హైదరాబాద్ పోలీస్ చర్య

# మనం మరిచిన నిజాలు

**సెప్టెంబరు 14 - 20 , 1998**

అప్పుడే స్వాతంత్ర్యం పొందిన భారత్‌లో దేశపు హోంమంత్రి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదేశించిన పోలీస్ చర్య 13 సెప్టెంబర్ 1948న ప్రారంభమై 17 సెప్టెంబర్ 1948న హైదరాబాద్ నిజాం సేనలు తలవంచడంతో పూర్తయింది. జూన్ 1947లో తాము భారత్‌ని వదలి వెళ్ళిపోతామని బ్రిటీష్‌పాలకులు ప్రకటించిన తరువాత 90 రోజుల్లో 500 సంస్థానాలను భారత రాజ్యంలో విలీనం చేశారు. కానీ ఒక్క హైదరాబాద్ నిజాం మాత్రం ఆగస్టు15, 1947 తర్వాత కూడా స్వతంత్ర్యంగానే ఉండడానికి, తన సంస్థానాన్ని స్వతంత్ర్య రాజ్యంగా ప్రకటించుకోవడానికి ప్రయత్నించాడు. మొగలుల పాలనలో కానీ, బ్రిటీష్ పాలనలో కానీ హైదరాబాద్ స్వతంత్ర్య రాజ్యంగా ఎప్పుడూగుర్తింపబడలేదు. 200,000 చదరపు కి.మీ. విస్తీర్ణం కలిగిన ప్రదేశంలో ఉన్న 16 మిలియన్ జనాభాలో 10 శాతం కూడా లేని ముస్లిములు రాజ్యం ఏలారు. 1940లో మొత్తం 1021 మంది అధికారుల్లో హిందువులు కేవలం 125 మంది. ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయివరకు ఉర్దూ మాధ్యమంగానే విద్యాబోధన జరిగేది. అక్షరాస్యత శాతం 3.3 ఉండగా ప్రక్కనే ఉన్న ట్రావెన్‌కోర్ సంస్థానంలో 9.76 శాతం ఉండేది. 1920 నుండి ముస్లిం మతోన్మాద శక్తుల విజృంభణ ప్రారంభమైంది. మతోన్మాద ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సంస్థకి కాసింరజ్వీ నేతృత్వంలోని రజాకర్ ముష్కర మూకల అండదండలు ఉండేవి. ఇస్లాం సామ్రాజ్యాన్ని ఏర్పరుస్తామని రజాకర్లు ప్రతిజ్ఞలు చేశారు. హిందువుల ప్రాథమిక హక్కులన్నీ నేలరాయబడ్డాయి. మత మార్పిడులు, లూటీలు, అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యాలయ్యాయి. రజాకర్ల ఆగడాలను నిజాం ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరించేది. ఈ అత్యాచారాలను ఆర్యసమాజ్ కార్యకర్తలు ధైర్యంగా ఎదిరించారు. ఆర్యసమాజ్ ఆధ్వర్యంలోనే సామూహిక సత్యాగ్రహాలు సాగాయి. అప్పుడే స్థాపింపబడిన ఆంధ్ర జనసంఘం (1921) ఆ తరువాత ఇరవై ఐదేళ్ళ పాటు తెలుగు ప్రజలకి పోరాటవేదిక అయింది. అదే ఆ తరువాత ఆంధ్ర మహాసభ అయింది. ఈ ప్రజా ఉద్యమాలతో పాటు నిజాం రాష్ట్ర కాంగ్రెస్ కూడా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ధ్వజమెత్తింది.

భారత్‌కి స్వాతంత్ర్యం లభించినప్పుడే దేశ విభజన కూడా జరిగింది. ముస్లిముల కోసం పాకిస్తాన్ ఏర్పడింది. దానితో నిజాం, అతని అనుచరులు పాకిస్తాన్, జిన్నా సహాయాన్ని అర్థించారు. నిజాం ఇటు భారత్‌లోకానీ, అటు పాకిస్తాన్‌లోకానీ కలవడానికి ఇష్టపడలేదు. స్వతంత్ర్య ముస్లిం రాజ్యాన్ని ఏర్పరుచుకోవాలని కలలుకన్నాడు. మౌంట్‌బాటన్, నెహ్రూల ప్రయత్నాలు, సంస్థానంలోని 88శాతం ప్రజల అభిప్రాయాలను ఖాతరు చేయకుండా నిజాం భారత్‌లో విలీనం కావడానికి అంగీకరించ లేదు. ఈలోపు జమ్మూకాశ్మీర్‌పై సాధారణ పౌరుల వేషంలో ఉన్న పాకిస్తాన్ సైనికులు, ఆఫ్ఘనిస్తాన్ కిరాయి సైనికులు దాడి చేశారు. భారత సైనిక దళాలకి పాకిస్తాన్ సైన్యానికి మధ్య యుద్ధం ప్రారంభమయింది. ముస్లిం రాజ్యాన్ని ఏర్పరుచుకోవాలనుకున్న నిజాంకి ఇది మరింత ప్రోత్సాహాన్ని కలిగించింది. నిజాం ప్రభుత్వం, రజాకర్లు ఇతర దేశాల నుండి ఆయుధాలను తెప్పించుకుని వాటితో హిందువులపై దాడి చేసి వారిని భయభ్రాంతుల్ని చేయసాగారు.

1940 నుండి ఆంధ్రమహాసభలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువైంది. నిజాం ప్రభుత్వ అండదండలతో సామాన్య రైతులను పీడిస్తున్న భూస్వాములకు వ్యతిరేకంగా, రజాకార్లకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవదీసినందువల్ల ప్రజలలో కమ్యూనిస్టుల పట్ల సదభిప్రాయం ఏర్పడింది. కానీ 1941 లో హిట్లర్ సోవియట్ యూనియన్‌పై దాడి చేయడంతో కమ్యూనిస్టులు ప్రపంచ యుద్ధాన్ని ప్రజాపోరాటమని వర్ణించడం మొదలు పెట్టారు. కాంగ్రెస్ సాగిస్తున్న క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించి, నిజాంతోపాటు బ్రిటీష్ వారికి తమ మద్దతు తెలిపారు.

ఇలా రజాకార్లకి, కమ్యూనిస్టులకి మధ్య ఒకసారి స్నేహం, ఒకసారి విరోధం కొనసాగుతూ ఉండేది. 1948లో జరిగిన సమావేశాల్లో కమ్యూనిస్టు పార్టీ భారత స్వాతంత్ర్యం ఒక ప్రహసనమని, నెహ్రూ బ్రిటీష్– అమెరికా సామ్రాజ్యవాదానికి ఒక పావు అనే స్టాలిన్ సిద్ధాంతానికి ఆమోదం తెలిపింది. అందుకనే ఆంధ్ర, కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని నిశ్చయించింది. నిజాం సంస్థానాన్ని భారత్‌లో విలీన చేయడం కమ్యూనిస్టులకి ఎంత మాత్రం ఇష్టం లేదు. ఎందుకంటే దాని వలన భారత్ మరింత బలపడుతుంది. తాము సాగిస్తున్న భారత్ వ్యతిరేక పోరాటం బలహీనపడుతుంది. నిజాం ప్రభుత్వంలో ప్రధానిగా ఉన్న మీర్‌లాయక్ ఆలీ కమ్యూనిస్టులతో ఒప్పందం చేసుకున్నాడు. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇరువురు కలసి పోరాడాలని అంగీకరించారు. దీనితో 5





జూన్ 1948న నిజాం ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని రద్దు చేసింది. అప్పటి నుండి కమ్యూనిస్టులు నిజాంకి మిత్రులయ్యారు. 'బూర్జువా– భూస్వామ్య' భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పత్రికా ప్రకటనలు విడుదల చేస్తూ భారత సైన్యం హైదరాబాద్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 'ఆజాద్ హైదరాబాద్' అని నినాదాలు ఇచ్చారు. అలా హైదరాబాద్ ముస్లిములకి, కమ్యూనిస్టులకి స్నేహం ఏర్పడింది. 17 సెప్టెంబరు 1948లో నిజాం సేనలు తలవంచినప్పుడు, రజాకర్లు కకావికలై పారిపోతున్నప్పుడు రజాకర్లు అందించిన ఆయుధాలతో కమ్యూనిస్టులు తమ దేశ వ్యతిరేక పోరాటాన్ని కొనసాగించారు. వీరి దేశ వ్యతిరేక పోరాటం 1951 దాకా కొనసాగింది. అప్పుడు కూడా స్టాలిన్ సలహామేరకే వారు 'పోరాటాన్ని' ఉపసంహరించుకున్నారు. ఇలా కమ్యూనిస్టులు సోవియట్ ప్రయోజనాలకే ప్రాధాన్యత నిచ్చేవారని, స్టాలిన్ ఆదేశాలనే శిరోధార్యంగా భావించేవారని, హైదరాబాద్ సంస్థానపు విలీనానికి వ్యతిరేకంగా రజాకర్లతో కలిసి పనిచేశారన్న సత్యాలు మరుగున పడిపోయాయి. ఆనాటి సత్యాలను మరోసారి గుర్తుచేసుకుంటే అప్పుడు కమ్యూనిస్టులు కాంగ్రెస్, ముస్లింలీగ్, టిడిపి, ములాయంసింగ్, సోనియాగాంధీ, లాలూప్రసాద్ యాదవ్, బంగ్లాదేశీ చొరబాటుదారులకి మద్దతు ఎందుకు ఇస్తారో, చైనా అణ్వస్త్రాల్ని తయారు చేసుకోవడాన్ని ఎందుకు సమర్థిస్తారో అర్థమవుతుంది.

నిజాం పాలనలో, రజాకారుల, మజ్లిస్ ఇత్తెహదుల్ ముస్లిమీన్ నేతృత్వంలో స్థానిక ముస్లిముల వ్యవహారాన్ని ఒకసారి గుర్తు చేసుకుందాం. టర్కీలో ఖలీఫా పదవి రద్దు అయినప్పుడు నిజాం ఆ పదవిని పొందే ఆశతో బ్రిటీష్‌వారిని ఆశ్రయించాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీకి వ్యతిరేకంగా నిజాం బ్రిటీష్‌వారికి సహాయం చేశాడు. మరాఠాల నుండి రక్షణ కోసమై గతంలో బ్రిటీష్‌వారికి అప్పగించిన బెరార్‌ని తిరిగి తీసుకోవాలని ప్రయత్నించాడు. ఉత్తర ప్రాంతాలను, సీడెడ్ జిల్లాలను కూడా కలుపుకుని ముస్లిం రాజ్యాన్ని ఏర్పరచాలని కలలుకన్నాడు. "రాతిని, కోతిని పూజించే హిందూ కాఫిర్, ఆవు మూత్రాన్ని, పేడని పవిత్రంగా భావించే అనాగరిక హిందువు మమ్మల్ని పాలించడం అసంభవం" అని కాసింరజ్వీ గర్జించాడు. పెద్ద ఎత్తున హిందువులను మతం మార్చడానికి ప్రయత్నించిన హజరత్ మౌలానా సిద్దిక్ దిన్‌దార్ 'ఓ నా ముస్లిం సోదరులారా! మీరు నివసించే దేశాన్ని పాకిస్తాన్‌గా మార్చమని, మరో మాటల్లో చెప్పాలంటే ఇతర మతస్థులు ఖారాన్–ఇ–మజిద్ నీళ్ళు

తాగేట్లు చేయమని ఖురాన్ మీకు చెపుతోంది. పేడ కలిసిన పాలని స్వచ్ఛమైనవని అనలేము" అని ముస్లిములకి పిలుపునిచ్చేవాడు. నిజాం నిరంకుశ పాలనలో హిందువులు ఈ దుర్భాషలన్నీ వింటూ సహించవలసి వచ్చేది.

కొన్ని సంవత్సరాల క్రితం మజ్లిస్ పార్టీ తరపున ఒక హిందువు మేయర్‌గా ఎన్నికయ్యాడు. 1947కి ముందు బి.ఎస్.వెంకటరావు అనే నిమ్నకులస్థుడు నిజాం పాలక కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉండేవాడు. ఆయన మంత్రిగా పనిచేశాడు కూడా. అతడే హరిజనులు లింగాయత్‌లను సమూలంగా నాశనం చేయాలని పిలుపునిచ్చాడు. అతని అనుచరులు రజాకర్లతో కలిసి బీదర్ జిల్లాలోని 129 గ్రామాలలో మారణకాండ జరిపారు. 1000కి పైగా ఇళ్ళు తగలబడ్డాయి, అనేక వందలమంది గ్రామస్థులు హత్యకు గురయ్యారు. అనేక మంది స్త్రీలు చెరచబడ్డారు. ఇలాగే మహ్మదాలీ జిన్నా కూడా తూర్పు బెంగాల్ మధ్యంతర ప్రభుత్వంలో ముస్లింలీగ్ బృందంలో ఒక హరిజనుడిని మంత్రిగా నియమించాడు. అతడే పాకిస్థాన్‌లో కూడామంత్రిగా పదవీబాధ్యతలు నిర్వహించాడు. కానీ ఆ తరువాత అదే మంత్రి, అతని అనుచరులు పాకిస్తాన్‌లో అష్టకష్టాలకు గురై చివరికి భారత్‌కి పారిపోయి వచ్చి ఇక్కడే కాలం వెళ్ళదీశారు. ఆగస్టు 26, 1948న నిజాం ఐక్యరాజ్యసమితిలో భారత్‌కి వ్యతిరేకంగా ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్ సంస్థానం ఒక ప్రత్యేక దేశమని భావించాడు. జమ్మూకాశ్మీర్ విషయమై మౌంట్ బాటన్ సలహా మేరకు నెహ్రూ పాకిస్తాన్‌పై ఐక్యరాజ్యసమితిలో ఫిర్యాదు చేశాడు. కానీ సర్దార్ పటేల్ నిజాం విషయంలో అలా వ్యవహరించలేదు. ఇంటి విషయాన్ని రచ్చకీడ్చడం ఆయనకి ఇష్టం లేకపోయింది. 10 సెప్టెంబరు 1948 పారిస్‌లో జరిగే భద్రతా మండలి సమావేశాలకి మోయిన్ నవాజ్ జంగ్‌ని పంపాడు నిజాం. 13 సెప్టెంబరు భారత సైన్యాలు నలువైపుల నుండి హైదరాబాద్‌ను చుట్టుముట్టాయి. 16 సెప్టెంబరు భద్రతా మండలిలో సిరియా ప్రత్యేక హైదరాబాద్ రాజ్యానికి మద్దతు ప్రకటించింది. చైనా అభ్యర్థన మేరకు సెప్టెంబరు 20 వరకు భద్రతా మండలి తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. కానీ సెప్టెంబరు 17 నాటికే పోలీసు చర్య పూర్తయింది. నిజాం సైన్యాలు, వీర రజాకర్లు తలవంచారు. ఆ రాత్రి నిజాం రేడియోలో ప్రసంగించాడు. భద్రతామండలిలో భారత్‌కి వ్యతిరేకంగా చేసిన ఫిర్యాదుని విలీనం కాకుండా హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర్య రాజ్యంగా ప్రకటించాలని కాసిం రజ్వీ వత్తిడి చేశాడని సంజాయిషీ ఇచ్చుకున్నాడు. కాశ్మీర్ సమస్యని హైదరాబాద్ సమస్యతో పోల్చి చూడాలి. కాశ్మీర్





సమస్యని నెహ్రూ తన చేతిలోకి తీసుకున్నారు. కాశ్మీర్ రాజు తన సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసినట్లు ప్రకటించారు. ఐనా నెహ్రూ ఏక పక్షంగా ప్రజాభిప్రాయ సేకరణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఐక్యరాజ్యసమితిలో కాశ్మీర్ సమస్యని ప్రస్తావించినది పాకిస్తాన్ కాదు, సాక్షాత్తూ నెహ్రూ! యుద్ధంలో పాకిస్తాన్ పరాజయం పాలవుతున్నప్పుడు కాల్పుల విరమణకి ఆదేశాలు జారీ చేసినది కూడా నెహ్రూయే! దీని ఫలితం ఏమిటి? కాశ్మీర్ సమస్య గత 50 ఏళ్ళుగా నలుగుతూనే ఉంది. అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. ఎంతో ప్రభుత్వ ధనం వ్యర్థమయింది. ఇందుకు పూర్తి విరుద్ధంగా పటేల్ హైదరాబాద్ సమస్యని పరిష్కరించారు. హైదరాబాద్‌పై సైనిక చర్య తీసుకుంటే అంతర్జాతీయ స్థాయిలో నిరసన ఎదుర్కొనవలసి వస్తుందని నెహ్రూ పటేల్‌ని హెచ్చరించాడు. జిన్నా చనిపోయిన మరునాడే పోలీసు చర్యకి ఆదేశించడం వల్ల దుష్ఫలితాలు కలుగుతాయని పటేల్‌కి అనేకమంది చెప్పారు. భారతీయ ముస్లిములు సహించరని హెచ్చరించారు. ఐనా మొక్కవోని సర్దార్ పటేల్ ఈ హెచ్చరికల్ని, సలహాల్ని పట్టించుకోలేదు. నిరంకుశమైన, పాకిస్తాన్, అరబ్ దేశాలతో స్నేహం చేసే ముస్లిం రాజ్యం దేశపు మధ్య భాగంలో ఉండటం శరీరంలో కాన్సర్ వ్యాధి వంటిదని తేల్చి చెప్పారు. అనేక సంస్థానాలను భారత రాజ్యంలో విలీనం చేసిన పటేల్ హైదరాబాద్‌ని ప్రత్యేక రాజ్యంగా ఎలా అంగీకరించగలరు? నెహ్రూ తన చేతిలోకి తీసుకుని ఉంటే హైదరాబాద్ సమస్య కూడా కాశ్మీర్ మాదిరిగానే ముదిరిపోయి ఉండేది. విచ్ఛిన్నకర కమ్యూనిస్టులు, ముస్లిం వేర్పాటువాదులు భారత్‌ని ముక్కలు చెక్కలు చేసి ఉండేవారు. కానీ పటేల్ ఆ ప్రమాదం నుండి దేశాన్ని కాపాడి సమైక్యపరచారు. అటువంటి పటేల్ విశేష ప్రజ్ఞని మనం మరిచిపోవడానికి కారణం ఏమిటి? మత నిరంకుశత్వాన్ని పెంచి పోషించినవారు, విచ్ఛిన్నకర వర్గ పోరాటాన్ని ప్రేరేపించినవారు ఈనాడు సెక్యులరిజం, మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడుతున్నారని, వీరివలన బాధలు అనుభవించినవారే ఫాసిస్టులని, మతతత్వవాదులని ప్రచారం సాగుతుడడం విచారకరం. ఆర్యసమాజ్, ఆంధ్ర మహిళాసభల కార్యకర్తల త్యాగాలు, జాతీయ భావన మనం మరువగలమా? నిజమైన చరిత్రని మరచిపోవడం వారికి అన్యాయం చేయడమే అవుతుంది. మత నిరంకుశత్వపు వికృత రూపాన్ని చూడని నేటితరం నిజాం చరిత్రని, ముఖ్యంగా 1911 నుండి 1952 మధ్యకాలపు చరిత్రని అధ్యయనం చేయడం ఎంతో అవసరం.

# హైదరాబాద్‌పై చారిత్రాత్మక పోలీసు చర్య

**అక్టోబరు 5 - 11 , 1998**

ఆగస్టు 15, 1947 నుండి భారత్ స్వతంత్ర్యం అవుతుందని, దేశాన్ని రెండుగా విభజించి పాకిస్తాన్ ఏర్పాటు జరిగిందని బ్రిటీష్ ప్రభుత్వం జూన్ 6, 1947న ప్రకటించింది. అలాగే ఇప్పటివరకు తమ అధికారం క్రింద ఉన్న 560 సంస్థానాలు స్వతంత్ర్యం అవుతాయని, అవి భారత్‌లోగానీ, పాకిస్తాన్‌లోగానీ విలీనం అవుతాయని కావచ్చును లేదా స్వతంత్ర్యంగా ఉండవచ్చని బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించింది. వైస్రాయ్ మౌంట్‌బాటన్ సంస్థానాలు భారత్‌లోనో, పాకిస్తాన్‌లోనో కలిసేటట్లుగా సంస్థానాధీశుల్ని ఒప్పించే ప్రయత్నం చేశాడు.సంస్థానాధీశుల్ని ఒప్పించే పని సర్దార్ పటేల్‌కి అప్పగించారు. ట్రావేన్‌కోర్, జునాగఢ్ సంస్థానాధీశులు స్వతంత్ర్యంగా ఉండడానికి, పాకిస్తాన్‌లో కలవడానికి చేసిన ప్రయత్నాల్ని వమ్ము చేసి ఆ రెండింటిని భారత రాజ్యంలో విలీనం చేశారు. హైదరాబాద్ సంస్థానం దేశం మధ్యలో ఉన్న పెద్ద సంస్థానం. హైదరాబాద్ నిజాం పాకిస్థాన్‌తో, ముస్లిం దేశాలతో సంబంధాలు పెట్టుకుని తన సంస్థానాన్ని ముస్లిం రాజ్యంగా మార్చాలని భావించాడు. ఈ సంస్థానంలో 88 శాతం మంది హిందువులు. కానీ ప్రభుత్వ ఉద్యోగాలలో, పరిపాలనా వ్యవస్థలో హిందువులకు ఏ మాత్రం స్థానం లభించేది కాదు. ప్రాథమిక పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు ఉర్దూ బోధనా భాషగా చెలామణీ అయ్యేది. ముస్లిములు తాము పాలకులమని, హిందువులు పాలితులని భావించేట్లుగా ప్రభుత్వం వ్యవహరించేది. ముస్లిం ప్రపంచానికంతటికీ నాయకత్వం వహించాలని నిజాం కలలు కన్నాడు. పాకిస్తాన్ నుండి సైనిక సహాయాన్ని పొందడానికి ప్రయత్నించాడు. భారత రాజ్యంలో చేరాలనుకునే హిందువులను భయపెట్టడానికి రజాకర్లను ప్రోత్సహించాడు. నిజాం సాయుధ బలగాల మద్దతుతో ముస్లిం దుండగులు మారణకాండ సృష్టించారు. భారత ప్రభుత్వం హైదరాబాద్ విలీనానికి సంబంధించి ప్రజాభిప్రాయానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తే తాను కత్తి ద్వారా సమస్యని పరిష్కరిస్తామని కాసిం రజ్వీ హెచ్చరించాడు. హిందువులు తమ ఆధిక్యత కలిగిన ప్రభుత్వాన్ని ఏర్పరచాలనుకోరాదని బెదిరించాడు. నిజాం సంస్థానం ముస్లిం రాజ్యాంగానే ఉంటుందని తేల్చి చెప్పాడు. కె.ఎం.మున్షీని భారత ప్రభుత్వ ప్రతినిధిగా పటేల్





హైదరాబాద్‌కి పంపారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా హైదరాబాద్‌ని భారత్‌లో విలీనం చేయాలనే ధృఢనిశ్చయం వారిద్దరిలో ఉంది. నిజాం విదేశాల నుండి ఆయుధాలు తెప్పించుకున్నాడు. ఈ లోపు రజాకర్ల ఆగడాలు పెచ్చు పెరిగిపోయాయి. స్టాలిన్ ఆదేశాల మేరకు భారత కమ్యూనిస్టులు నెహ్రూ ప్రభుత్వం బ్రిటీష్‌వారి చేతిలో కీలుబొమ్మ అని ప్రకటించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాపోరాటాన్ని లేవదీయాలని ప్రయత్నించారు. ఆజాద్ హైదరాబాద్‌ని ఏర్పరచాలని ప్రకటించారు. దీనితో నిజాం కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేశాడు. కమ్యూనిస్టులకి రజాకార్ల నుండి ఆయుధాలు సైతం అందేవి. ప్రజలు ఎన్ని కష్టాలు అనుభవిస్తున్నా వారంతా హిందువులవడం వల్ల కమ్యూనిస్టులు వారి కష్టాల్ని ఏ మాత్రం పట్టించుకోలేదు.

ఆ విధంగా నిజాం రాజ్యం భారత్‌లో ఒక విచ్ఛిన్నకర, విద్రోహక భాగంగా మారింది. మౌంట్‌బాటన్ సలహా సంప్రదింపులు పనిచేయలేదు. రజాకర్లు, కమ్యూనిస్టులు తమ బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించారు. ఇదిలా ఉండగా జమ్మూ కాశ్మీర్ సంస్థానపు విలీనానికి ఒప్పుకుంటే తప్ప ఆ సంస్థానంపై పాకిస్తాన్ కిరాయి సైనికులు చేసిన దాడిని తిప్పికొట్టడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. జమ్మూకాశ్మీర్ విషయాన్ని మౌంట్‌బాటన్ తప్పుడు సలహామేరకు నెహ్రూ ఐక్యరాజ్యసమితిలో ప్రస్తావించాడు. తద్వారా ఇంటి సమస్యని రచ్చకీడ్చాడు. అంతేకాదు జమ్మూకాశ్మీర్‌లో శాంతి ఏర్పడిన తరువాత విలీనానికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరిపిస్తానని హామీ ఇచ్చాడు కూడా. అలా పటేల్ తదితరుల సలహాని లెక్కచేయకుండా తన ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరించాడు. జమ్మూ కాశ్మీర్‌లో సైనిక చర్యతో తలమునకలై ఉన్న భారత ప్రభుత్వం హైదరాబాద్‌పై సైనిక చర్య తీసుకోలేదని నిజాం భావించాడు. కానీ ఉక్కుమనిషి సర్దార్‌పటేల్ 88 శాతం ప్రజల అభీష్టాన్ని కాదని ముస్లిం రాజ్యాన్ని ఏర్పరచాలన్న నిజాం కలల్ని కల్లలు చేశారు. నిజాం, రజాకర్, కమ్యూనిస్టుల ఆగడాలు హద్దు మీరడంతో చర్య తీసుకున్నారు. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిజాం ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేశాడు. అప్పుడే జిన్నా మరణించాడు. జిన్నా మరణించిన వెంటనే సైనిక చర్య తీసుకోవడం వల్ల విమర్శలు తలెత్తవచ్చని సైన్యాధ్యక్షుడు అనుమానం వ్యక్తం చేశాడు. అయినా సర్దార్ పటేల్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. జమ్మూకాశ్మీర్‌లో నెహ్రూ అనుసరించిన విధానానికి పూర్తి విరుద్ధంగా పటేల్ ఐదురోజుల్లో హైదరాబాద్ విలీనాన్ని పూర్తి

చేశారు. నిజాం 'వీర సైనికులు' 'ఎదురులేని' రజాకర్ యోధులు భారత సైన్యం ముందు తలవంచారు. పారిపోయినవారు పారిపోగా మిగిలినవారు లొంగిపోయారు. ఆ విధంగా ముస్లిం రాజ్యాన్ని ఏర్పరచాలనుకున్న నిజాం కోరిక నెరవేరలేదు.

ఈ సంఘటనల నుండి మనకి బోధపడే అంశాలు ఏమిటి? మొదటిది భారత కమ్యూనిస్టుల దేశ వ్యతిరేక ధోరణి. వాళ్ళు స్టాలిన్ మాటని శిరసావహించారు, కానీ దేశ ప్రయోజనాలను ఖాతరు చేయలేదు. పోలీస్ చర్య తరువాత రజాకర్ల నుండి ఆయుధాలు తీసుకుని భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధపడ్డారు. అప్పటి నుండి వారి దేశ వ్యతిరేక ధోరణి అనేకసార్లు బయటపడింది. 1962లో చైనా మన దేశంపై దండెత్తినప్పుడు వాళ్ళు భారత్‌దే దోషమన్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం సంక్షోభంలో పడ్డప్పుడు వాళ్ళు ఆమెకి మద్ధతునిచ్చారు. ఆమె ఎమర్జెన్సీ ప్రకటించినప్పుడు కమ్యూనిస్టులు బాహాటంగా సమర్థించడమేగాక, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలోపేతం చేయడానికి అనేకమంది కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం ఇదే కమ్యూనిస్టుల రజాకర్ల మనస్తత్వాన్ని పుణికి పుచ్చుకున్న మజ్లీస్ ఇత్తెహదుల్ ముస్లిమీన్ పార్టీని చేర్చుకుని కాంగ్రెస్‌తో ఒక 'సెక్యులర్' ఫ్రంట్‌ని ఏర్పరచాలని తాపత్రయపడుతున్నారు. ఇలా కమ్యూనిస్టుల హిందూ వ్యతిరేక, ముస్లిం సమర్థన ధోరణి అనేకసార్లు బయటపడింది.

రెండవ అంశం: ముస్లిం జనాభా నానాటికీ పెరిగిన ఏర్పాటువాద మనస్తత్వం. రాజాకర్ల తరువాత ఏర్పడిన పార్టీ తనని తాను సెక్యులర్ పార్టీగా ప్రకటించుకోవడమేకాక బిజెపిని మతతత్వపార్టీ అని దూషిస్తోంది. దీని నుండి ముస్లిములు తమ సహచరులైన కమ్యూనిస్టుల నుండి పాఠాలు నేర్చుకున్నారని స్పష్టమవుతుంది.

మూడవ అంశం: సెక్యులర్ పార్టీలేవీ ఏనాడూ తమ అభ్యర్థిని ఎంఐఎం అభ్యర్థికి వ్యతిరేకంగా నిలబెట్టలేదు. ఆ విధంగా ముస్లిమేతరుల ఓట్లను చీల్చి ఎంఐఎంని గట్టెక్కిస్తూ ఉంటాయి.

నాలుగవ పాఠం ఏమిటంటే సర్దార్ పటేల్ నిశ్చయం మాత్రమే దేశాన్ని సమైక్యపరచింది. కానీ మేధావుల వ్యర్థ సిద్ధాంతాలు, వాదనలు కావు. సర్దార్‌పటేల్ ధృఢవైఖరికి భిన్నంగా వ్యవహరించిన నెహ్రూ వలన కాశ్మీర్ సమస్య తలెత్తితే ఇందిరాగాంధీ మూలంగా పంజాబ్‌లో తీవ్రవాదం పెచ్చు పెరిగింది. బింద్రన్





వాలాని పెంచి పోషించి ఇందిర పంజాబ్‌ని రావణకాష్టం చేసింది. నెహ్రూ మనవడు శ్రీలంక ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకున్నందువల్ల దక్షిణ భారత దేశంలో ఎల్‌టిటిఐ విషపు క్రీనీడ వ్యాపించింది.

ఈ సంఘటనలను, చరిత్రను తెలుసుకోకపోతే ఎవరైనా ఈ ప్రజాస్వామ్య, వామపక్ష, పురోగమన, సెక్యులర్, సోషలిస్టు, మార్క్సిస్టు, సామాజిక న్యాయవాదుల ఓటు బ్యాంకు రాజకీయాలకు, కుతంత్రాలకు లోనై వారికే పట్టం కట్టబెడుతూ ఉంటారు. అందుకే జాగ్రత్త వహించాలి.

**సీ. కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే?**
**పవన గుంభిత చర్మభస్త్రి గాక**
**వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే?**
**ఢమఢమ ధ్వనితోడి ఢక్క గాక**
**హరిపూజనము లేని హస్తంబు హస్తమే?**
**తరుశాఖ నిర్మిత దర్వి గాక**
**కమలేశుఁ జూడని కన్నులు కన్నులే?**
**తను కుడ్య జాల రంధ్రములు గాక**
**ఆ. చక్రిచింత లేని జన్మంబు జన్మమే?**
**తరళ సలిల బుద్బుదంబు గక**
**విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుడే?**
**పాదయుగము తోడి పశువు గాక**

శ్రీమదాంధ్ర మహాభాగవతం స.స్క.

"భగవంతుని సేవించని శరీరం శరీరం కాదు ఉత్తి గాలితిత్తి. భగవన్నామ స్మరణం చేయని కంఠం కంఠం కాదు ఢమఢమ ధ్వనిచేసి ఢక్కలాంటిది. హరిపూజ చేయని చేయి చేయికాదు. కర్రతెడ్డులాంటిది. ఇంకా మహావిష్ణువుని చూడని కన్నులు కన్నులేనా? శరీరమనే ఇంటి కిటికీల లాంటివి. చక్రిని చింతించని జన్మము జన్మమేనా? కాదు. నీటిబుడగ లాంటిది. విష్ణుభక్తిలేని మనిషి ఒక మనిషేనా? రెండు పాదాలున్న పశువు" అని ప్రహ్లాదుడు తీవ్రంగా విమర్శించాడు.

# 'మైనారిటీ' విద్యాసంస్థలు, మత ప్రచార హక్కు

**అక్టోబరు 19 - 25 , 1998**

29, 30 అధికరణాలు ఇలా పేర్కొంటున్నాయి.

**మైనారిటీ ప్రయోజనాల పరిరక్షణ**

1. భారత్‌లో ఏ ప్రదేశంలో నివసించే వర్గానికైనా తమ ప్రత్యేక భాష, లిపి, సంస్కృతులను పరిరక్షించుకునే హక్కు ఉంటుంది.
2. ప్రభుత్వంచే నడుపబడుతున్న, ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న విద్యా సంస్థలలో మతం, జాతి, కులం, భాష ఇతర ఏ అంశాల ఆధారంగా ఏ పౌరుడికి ప్రవేశం నిరాకరించడం జరుగదు.

**విద్యాసంస్థల్ని ఏర్పరుచు కోవడానికి మైనారిటీలకి ఉన్న హక్కులు**

1. మతం, భాషపరమైన మైనారిటీ వర్గానికి చెందినవారు విద్యా సంస్థల్ని స్థాపించుకోవచ్చును.

మత పరమైన, భాషా, సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించుకోవడానికే ఇటువంటి ప్రత్యేకహక్కులు కల్పించబడ్డాయి. కానీ ఇంజనీరింగ్, వైద్యవిద్య, లా, కంప్యూటర్‌లు, శాస్త్ర సాంకేతిక విద్య మొదలైనవి మత, సాంస్కృతిక అంశాలు కావు. అవి పూర్తి 'సెక్యులర్' అంశాలు. క్రైస్తవ మైనారిటీలు బైబిల్ బోధన కోసం గానీ, క్రైస్తవ మతచరిత్రని బోధించడానికిగాని సంస్థల్ని ఏర్పరిస్తే ఒక అర్థం ఉంది. అలాగే ముస్లిములు కూడా. అలాగే మహారాష్ట్ర ప్రాంతంవారు మరాఠీ సాహిత్యం, మరాఠీ సంస్కృతులకు సంబంధించిన సంస్థల్ని ఏర్పాటు చేస్తే ఫరవాలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో భాషా ప్రాతిపదికపై మైనారిటీలుగా పరిగణింపబడే వారెవ్వరూ ఇంజనీరింగ్, వైద్య, లా. కంప్యూటర్ విద్యాసంస్థల్ని స్థాపించడం లేదని అందరికీ తెలుసు. మన రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉంది కానీ ఆ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఇతర రాష్ట్రాల్లో కాలేజీలు ఏవీ లేవు. అలాగే విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ తదితర విద్యాకోర్సులను వేటినీ నడపటం లేదు. కేవలం ముస్లిములు, క్రైస్తవులు మాత్రమే ఇలాంటి కోర్సులను ఆంగ్ల భాషా మాధ్యమంగా అందజేస్తున్న సంస్థల్ని స్థాపిస్తున్నారు. ఇలాంటి 'మైనారిటీ' విద్యా





సంస్థల్ని వీరు తప్ప బౌద్ధులుగాని, సిక్కులుగాని, జైన్‌లుగాని మరెవరూ స్థాపించడం లేదు. ఇలాంటి మైనారిటీ సంస్థల సంఖ్యకి ఆయా వర్గాలలో అక్షరాస్యుల సంఖ్యకి పొంతన లేదు. ఈ సంస్థలో విద్యకోసం మెజారిటీ వర్గానికి చెందినవారే ఎక్కువగా చేరతారుగాని మైనారిటీ విద్యార్థుల సంఖ్య తక్కువగానే ఉంటుంది. మెజారిటీ వర్గానికి చెందిన విద్యార్థుల నుండి పెద్ద మొత్తంలో డొనేషన్లు వసూలు చేస్తాయి. ఈ సంస్థలు. 'మైనారిటీ' విద్యాసంస్థలు దేశానికి ఎంతో 'మేలు' చేస్తున్నాయి కనుక మైనారిటీ వర్గానికి చెందినవారు పాల్పడే మత మార్పిడులను హిందువులు వ్యతిరేకించకూడదని కొందరు అంటున్నారు. (ఎ.జె.ఫిలిప్ వ్యాసం ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 2-10-98లో). ఇక ఇంకొక మైనారిటీ వర్గం స్థాపించిన విద్యాలయాలు 'ఆధునిక విద్య'ని ఏ మాత్రం వ్యాప్తి చేయడం లేదు. 'మైనారిటీ' సంస్థలు మెజారిటీ వర్గం నుండి డబ్బు సంపాదించుకునేందుకు ఉపయోగిస్తున్నాయి. అక్రమ పద్ధతులలో సంపాదించిన డబ్బుని మత మార్పిడులకు ఉపయోగిస్తున్నారన్న సందేహం ఉంది. రాజ్యాంగంలోని ఏ అధికరణం మత మార్పిడులకు హక్కును ప్రసాదించలేదు.

మైనారిటీ వర్గానికి కల్పించిన హక్కులు మెజారిటీ వర్గానికి కూడా కల్పించని దేశం ప్రపంచంలో ఎక్కడా ఉండదు. కాని భారత్‌లో మాత్రం మైనారిటీ వర్గాల వారు తమ ఇష్టానుసారం విద్యా సంస్థల్ని స్థాపించుకునేందుకు ప్రత్యేక హక్కులు పొందితే మెజారిటీ వర్గానికి అలాంటి హక్కు ఏదీ లేదు. అందువల్ల మెజారిటీ వర్గం వివక్షతకి గురయ్యామని భావిస్తున్నారు.

మైనారిటీ ఆర్థిక సంస్థలు కూడా ఇలాంటివే. ప్రభుత్వం సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉంటుంది. అలాగే ప్రభుత్వ ఆధీనంలోని బ్యాంకులు కూడా మతపరమైన వివక్షత చూపకుండా అందరినా సమానంగా పరిగణిస్తాయి. అలాంటప్పుడు మైనారిటీ కోసం ప్రత్యేకంగా ఆర్థిక సంస్థలు ఎందుకు? నాగాలాండ్, మిజోరాం, జమ్మూకాశ్మీర్‌లలో హిందువులు మైనారిటీలు. కాని అక్కడ హిందువుల కోసం ఎలాంటి ఆర్థిక సంస్థలుగానీ, విద్యా సంస్థలుగానీ లేవు.

ముస్లిముల కోసం ఏర్పాటైన మదర్సాలలో ఉర్దూ, అరబ్ భాషల్లో బోధన జరుగుతుంది. అక్కడ పాఠ్యాంశాలు కూడా మతానికి, మత విషయాలకి సంబంధించినవే కాని ఆధునిక విద్యా విషయాలు ఏవీ ఉండవు. అలాంటి పాఠశాలల్లో చదువుకున్నవారు ఇతర విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులతో సమానంగా పోటీ

చేయలేకపోతున్నారు. దానితో మళ్ళీ ఉద్యోగాల విషయంలో మైనారిటీల పట్ల వివక్షత చూపుతున్నారని గగ్గోలు పెడుతున్నారు.

### మత మార్పిడుల ద్వారా మత ప్రచారానికై హక్కు

రాజ్యాంగపు 25వ అధికరణం ఇలా పేర్కొంటోంది.

**మతస్వేచ్ఛ హక్కు:** ప్రజా ప్రయోజనాలు, నైతికత, ఆరోగ్యం మొదలైన విషయాలకు భంగకరం కాని రీతిలో ఎవరైనా తమ మతాన్ని అనుసరించవచ్చును, ప్రచారం చేయవచ్చును.

2. ప్రస్తుతం ఉన్న చట్టాలను వేటినీ ఈ అధికరణం ప్రభావితం చేయదు, అలాగే ఇక ముందు ప్రభుత్వం ఎలాంటి చట్టాలనైనా అమలు చేయడాన్ని నిరోధించదు-

(అ)మతాచారాలకు సంబంధించిన ఎలాంటి ఆర్థిక, సామాజిక, రాజకీయ కార్యకలాపాలనైనా ప్రభుత్వం నియంత్రించవచ్చును

(ఆ)సామాజిక సంక్షేమాన్ని అందించడానికి, వర్ణవివక్షత లేకుండా హిందువులందరకీ హిందూ మత సంస్థల్లో ప్రవేశం కల్పించడానికి ప్రభుత్వం అధికారాన్ని కలిగి ఉంటుంది.

మొదట్లో రాజ్యాంగంలోని ఈ అధికరణలో 'మతప్రచారం' అనే మాట లేనేలేదు. కానీ కొందరు క్రైస్తవ, ముస్లిం సభ్యులు మత ప్రచారం తమ ప్రాథమిక మత కర్తవ్యమని వాదించారు. గతంలో ఇతర మతాలకు చెందిన రాజుల పాలనలో బలవంతపు మత మార్పిడులు, మతపరమైన వివక్షతకి గురైన హిందువులు మత మార్పిడులను అంగీకరించలేరు.

### సమాన వ్యవహారం

ముస్లిములు, క్రైస్తవులు విద్యాసంస్థల్ని స్థాపించే హక్కు కలిగి ఉంటే హిందువులకు కూడా ఆ అవకాశం కల్పించాలి. హిందువుల పట్ల వారి భూమిలోనే మత వివక్షత చూపడం సబబు కాదు. వక్ఫ్‌లు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు ఆయా మతస్థుల అజమాయిషీలోనే ఉంటే దేవాలయాలు కూడా హిందువుల అజామాయిషీలోనే ఉండాలి గాని ప్రభుత్వపు ఆధీనంలో కాదు.





## కొసావాలో అమెరికా పరిస్థితి

**అక్టోబరు 26 - నవంబరు 1 , 1998**

కొసావా రాష్ట్రంలో అల్బీనియా మైనారిటీ జాతీయులపై యుగోస్లావియా ప్రభుత్వం హత్యాకాండకి తలపడిందని అమెరికా ఆరోపిస్తోంది. యుగోస్లావియాపై దాడికై తమ మద్దతు తెలుపవలసిందిగా నాటోలోని మిత్రదేశాలపై వత్తిడి తెస్తోంది. అమెరికా చర్య పక్షపాత పూరితమైనది, స్వార్థపూరితమైనదని స్పష్టమవుతోంది.

కొసావా వద్దనే టర్కీ నియంతృత్వ పాలనకి వ్యతిరేకంగా స్లావిక్ ప్రజానీకం తిరుగుబాటు చేసి విజయం సాధించారు. కొసావా విజయంతో ఒట్టమాన్ నిరంకుశ, ఇస్లాం పాలన నుండి స్లావిక్ ప్రజలకి స్వాతంత్ర్యం లభించింది. కాశ్మీర్‌లో మాదిరిగానే కొసావా రాష్ట్రంలో ముస్లిములు సంఖ్య ఎక్కువ. కాశ్మీర్‌లోని ముస్లిములను మత ప్రాతిపదికపై వేర్పాటువాద ధోరణిని అవలంబించేట్లుగా ప్రోత్సహించినట్లే కొసావా ముస్లిములను కూడా ముస్లిం దేశాలు ప్రోత్సహించాయి. నిజానికి యుగోస్లావియా క్రైస్తవులు ఎక్కువగా ఉన్న దేశం. భారత ప్రభుత్వం కాశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ఎదుర్కొంటున్నట్లే యుగోస్లావియా ప్రభుత్వం కొసావాలో వేర్పాటువాదాన్ని ఎదుర్కొంటోంది.

కొసావాలో చెలరేగుతున్న వేర్పాటువాదానికి ముస్లిములే కారణమని అమెరికా ఈ మధ్యవరకు అంగీకరిస్తూ వచ్చింది. కాని గత కొద్ది కాలంగా ముస్లిములను అల్బీనియా జాతీయులని వర్ణించడం ప్రారంభమయింది. ఇది కాశ్మీర్‌లో అల్ల కల్లోలం సృష్టిస్తున్న ముస్లిం తీవ్రవాదుల్ని పాకిస్తానీ జాతీయులని వర్ణించడం లాగానే ఉంటుంది. అలా వారిని ప్రత్యేకమైన జాతిగా వర్ణించడం సరైన విషయమేనా?

వేర్పాటువాదాన్ని అణచివేయాలని యుగోస్లావియా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్ని అమెరికా మారణకాండ అని వర్ణిస్తోంది. కాశ్మీర్‌లో మాదిరిగానే, మానవహక్కుల సంఘాలు కొసావాలో కూడా మానవ హక్కుల ఉల్లంఘన జరిగిపోతోందని గగ్గోలు పెడుతున్నాయి. అల్బీనియా ముస్లిం వేర్పాటువాదాన్ని త మతతత్వ అస్తిత్వం కోసం పోరాడుతున్న అల్బీనియా జాతిగా పేర్కొనడం ద్వారా

అమెరికా ఇరాక్, సూడాన్, తాలిబాన్‌లకు వ్యతిరేకంగా ముస్లిం దేశాల మద్దతును పొందాలని ప్రయత్నిస్తోంది.

అమెరికా ప్రపంచాన్ని తప్పుదారి పట్టించడమే కాక ఒక దేశపు అంతర్గత విషయాలలో జోక్యం చేసుకుంటోది. అమెరికా మానవ హక్కులు, శాంతి భద్రతల పట్ల అంత ఆందోళన చెందుతున్నట్లైతే కొసావాలో, బోస్నియాలో, సైప్రెస్, కాశ్మీర్, సూడాన్‌లలో చెలరేగుతున్న మతపరమైన వేర్పాటువాద ధోరణులను అంతం చేయడానికి తన సహాయాన్ని ఎందుకు అందించడం లేదు? అలా చేయకపోగా వేర్పాటువాదుల్ని, విచ్ఛిన్నకర శక్తుల్ని, తీవ్రవాదుల్ని ఫలానా జాతీయులని, అస్తిత్వానికై పోరాడుతున్నారని వర్ణిస్తోంది. మతపరమైన వేర్పాటువాదం వల్ల ఎంతో నష్టపోయిన భారత్ వంటి దేశాలు అమెరికా వైఖరిని వ్యతిరేకించాలి. తమ దేశంలోనే నల్ల జాతీయుల ద్వారా వేర్పాటువాదాన్ని రెచ్చగొడుతున్న ముస్లిం దేశాల కుతంత్రాన్ని ప్రత్యేకంగా ఎదుర్కొన్నప్పుడు గాని అమెరికా ప్రభుత్వానికి వేర్పాటువాదం ఎంత భయంకరమైనదో తెలియదు. అప్పుడు వేర్పాటువాదాన్ని అణచివేయడానికి ప్రయత్నించే అమెరికా ప్రభుత్వాన్ని ఆఫ్రికా నల్ల జాతీయుల పట్ల హత్యాకాండకి పాల్పడుతోందని విమర్శిస్తే ఎలా ఉంటుంది?

**క. కొందరికి తెనుగు గుణమగు**
**కొందరికి సంస్కృతంబు గుణమగు రెండున్**
**కొందరికి గుణములగు నే నందరి మెప్పింతు**
**కృతుల నయ్యె యెడలన్ అన్నాడా సహజకవి.**

శ్రీమదాంధ్ర మహాభాగవతం ప్ర.స్క

సాహిత్యాభిమానులు కొందరు తెలుగిష్టపడతారు. మరికొందరు సంస్కృతాన్నిష్టపడతారు. రెండు భాషలనిష్ట పడేవారు మరికొందరుంటారు. అందరి అభిరుచుల కనుగుణంగా భాగవత రచన చేస్తానని కంకణం కట్టుకొని కలం పట్టాడా మహాకవి.





## విహెచ్‌పిపై కన్నెర్ర చేసిన క్రైస్తవులు

**అక్టోబరు 26 - నవంబరు 1 , 1998**

విశ్వహిందూ పరిషత్ హిందువులను ఇస్లాం, క్రైస్తవాలలోకి మతం మార్చడం పట్ల అభ్యంతరాన్ని తెలుపడం సరైనది కాదంటూ ఎ.జె.ఫిలిప్ (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2, 1998) ఒక వ్యాసంలో క్రైస్తవ విద్యా సంస్థలు చేస్తున్న సేవని వివరించారు. అంతేకాదు హిందువుల జనాభా క్రమంగా పెరుగుతోందని పేర్కొన్నాడు. కనుక కొన్ని నిజానిజాలను పరిశీలిద్దాం.

హిందూ జనాభా 2 శాతం పెరిగితే హిందువుల సంఖ్య 17 మిలియన్లు అవుతుందని క్రైస్తవుల, ముస్లిముల జనాభా 10 శాతం పెరిగినా వారి సంఖ్య 3 మిలియన్‌లు, 12 మిలియన్‌లకు మించదని ఆ విధంగా హిందువుల సంఖ్యే ఎక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దీన ప్రకారం హిందువుల జనసంఖ్యలోనే ఎక్కువ పెరుగుదల ఉన్నదని ఎలా చెప్పగలం?

ఇక హిందువులలో ఎవరిని మతం మారుస్తున్నారని ప్రశ్నించారు. నిజమే హిందువులలో మతం మార్చబడుతున్న వారు విద్యావంతులు కాదు. పేదవారు నిరక్షరాస్యులు మత మార్పిడులకు గురవుతున్నారు. వారిని డబ్బు, ఇతర ఆశలు చూపి మతం మారుస్తున్నారు. ఐతే క్రైస్తవులలో 70 శాతం షెడ్యూల్డ్ కులాలకు చెందినవారేనని, క్రైస్తవులుగా మారినా వారు కుల వివక్షతకి గురవుతూనే ఉన్నారని, క్రైస్తవ విద్యా సంస్థల్లో దళిత క్రైస్తవులకి ఎలాంటి రిజర్వేషన్ సౌకర్యం లేదన్నది పచ్చి నిజం. కనుక క్రైస్తవ మిషనరీలు ప్రవచించే కులరహిత సౌభ్రాతృత్వ భావన వట్టి బూటకమని స్పష్టమవుతోంది.

ఇస్లాం మత మార్పిడుల గురించి ఎంత తక్కువ చెపితే అంత మంచిది. ముస్లిం యువకుడిని పెళ్ళాడే హిందూ యువతి తన మతాన్ని నిలుపుకోగలదా? ముస్లిం మతంలోకి మారి కేవలం బహుభార్యత్వ హక్కు తప్ప హిందు పురుషులు ఏం పొందుతున్నారు? అలాంటి వారికి మెరుగైన జీవనం లభిస్తోందా? మతం మార్చబడిన చాలామంది హిందూ స్త్రీలు దయనీయమైన జీవితాలు గడుపుతున్నారు కదా?

మత మార్పిడులకు పాల్పడేవారు చేస్తున్న మోసాలు, చూపుతున్న ప్రలోభాలను విహెచ్‌పి బయట పెట్టినందుకే వాళ్ళు గగ్గోలు పెడుతున్నారు. మత

మార్పిడులు వ్యక్తులలో అభారతీయ భావాల్ని పెంచుతాయని సాక్షాత్తు బి.ఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు. ఆయన ఇస్లాం మతాన్ని అనుసరించడానికి అంగీకరించలేదు. ఎందుకంటే అక్కడ భ్రాతృత్వ భావన కేవలం ఆ మతస్థులకే పరిమితమై ఉంటుందని, ఇతర మతస్థుల్ని కాఫిర్లుగా పరిగణిస్తారని గ్రహించారు. క్రైస్తవ మతం భారతీయతని నాశనం చేస్తుందని దానిని తిరస్కరించారు. అందుకనే హిందుత్వంలో భాగమైన, కుల వివక్షతని, అస్పృశ్యతని పాటించని బౌద్ధమతాన్ని స్వీకరించారు. హైందవేతరుల జనాభా ఎక్కువగా ఉన్న సరిహద్దు రాష్ట్రాల్లోనే (జమ్మూ కాశ్మీర్, నాగాలాండ్, మిజోరాం) వేర్పాటువాద, జాతి వ్యతిరేక కార్యకలాపాలు వ్యాప్తి చెందడానికి కారణం ఏమిటి? మత మార్పిడులు అభారతీయ ధోరణులను వ్యాప్తి చేస్తాయనడానికి ఇంతకు మించి ఉదాహరణ ఎందుకు?

గిరిజనులు హిందూ సమాజంలో భాగం. బ్రిటీష్ పాలన సమయంలో క్రైస్తవ మిషనరీలు వీరిని హైందవేతరులుగా ప్రకటించాలని కోరారు. ఎందుకంటే అలా ప్రకటిస్తే వారిని మతమార్పిడి చేయవచ్చని భావించారు. ఇలా మోసపూరిత పద్ధతుల ద్వారా ఇస్లాంలోకి, క్రైస్తవంలోకి మతం మార్చబడిన వారిని తిరిగి హిందూ మతంలోకి తీసుకురావడం హిందువుల ప్రథమ కర్తవ్యం. మత మార్పిడులకు పాల్పడడానికి కేవలం క్రైస్తవులు, ముస్లిములకు ప్రత్యేక హక్కు ఏదీ లేదు. ఇతర దేశాల నుండి అందుతున్న డబ్బుతో ఇక్కడ మసీదులు, చర్చిల నిర్మాణం సాగుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లో 30 వేలకు పైగా చర్చిలు ఉన్నాయి. విదేశీ క్రైస్తవ మిషనరీలు ఇక్కడికి ఎందుకు వస్తున్నారు? విద్యని, శాంతిని అందించడం మానవతా దృక్పథం వంటివి అవుతుంది. కాని మత మార్పిడి కోసమైతే అది ఎంతమాత్రం సహింపదగినది కాదు.

రాజ్యాంగం మత ప్రచార హక్కుని కల్పిస్తోందని ఫిలిఫ్ పేర్కొన్నారు. కానీ ఏ ముస్లిం దేశంలోనూ ఇలాంటి హక్కు కనిపించదు. పైగా ఆయా దేశాల్లో మెజారిటీ వర్గానికి చెందినవారు మైనారిటీ వర్గాన్ని, వారు ముస్లిములైనా, కష్టాలపాలు చేస్తున్నారు. పాకిస్తాన్‌లో అహ్మదీయులు, షియాలు (ఆఫ్ఘనిస్థాన్‌లో షియాలు). ఇస్లాం, క్రైస్తవాలు భారత్‌లో విధ్వంసాన్ని సృష్టించాయి. ఇతర మతాల గురించి పూర్తి అవగాహనతో తన ఇష్టానుసారం మతం మారడానికి సిద్ధపడిన వారినే మతం మారడానికి అనుమతించే న్యాయ వ్యవస్థని రూపొందించాలి. అలా కాని ఇతర మత మార్పిడి పద్ధతులను నిషేధించాలి.





# అభారతీయతే సెక్యులరిజమా?

**నవంబరు 9 - 15 , 1998**

కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ఏర్పాటు చేసిన, ప్రధాన మంత్రి ప్రారంభించిన వివిధ రాష్ట్రాల విద్యామంత్రుల సమావేశం నుండి కొందరు మంత్రులు వాకౌట్ చేయడాన్ని పత్రికలు మొదటి పేజీలో విశేషంగా పేర్కొన్నాయి. 'విద్యావిధానం – భారతీయకరణ, జాతీయకరణ, ఆధ్యాత్మీకరణ' అనే అంశంపై చర్చించడానికి ఈ సమావేశం ఏర్పాటైంది. సమావేశ ప్రారంభంలో జరిగిన సరస్వతీ వందనని వ్యతిరేకిస్తూ కొందరు బయటికి వెళ్ళిపోయారు. తమ తీవ్ర వ్యతిరేకతని తెలుపుతూ సమావేశాన్ని బహిష్కరించిన వారిలో కాంగ్రెస్, జనతా, తెలుగుదేశం, అకాలీదళ్, కమ్యూనిస్టు పార్టీకి చెందినవారు ఉన్నారు. ఇంతేకాదు ఆ తరువాత వీళ్ళు సంస్కృత భాషని తప్పనిసరి అంశం చేయటం పట్ల, శాశ్వత మానవ విలువను ప్రవచించే వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలను పాఠ్యాంశాల్లో చేర్చడాన్ని, భారతీయ చరిత్ర విదేశీ దురాక్రమణల చరిత్ర కాదని, విదేశీ దురాక్రమణలను భారతీయులు వీరోచితంగా ఎదిరించాలనే విషయాలను చేర్చాలనే ఆలోచనని వ్యతిరేకించారు. ఇవన్నీ 'కాషాయీకరణ'లో భాగమని, ఆర్.ఎస్.ఎస్ సిద్ధాంతాలను బలవంతంగా రుద్దే ప్రయత్నాలని, 'మైనారిటీల' పై దాడి అని, 'సెక్యులరిజానికి' వ్యతిరేకమని గగ్గోలు పెట్టారు. కొన్ని పత్రికల్లో 'వామపక్ష ప్రజాస్వామ్య, సెక్యులర్, సోషలిస్ట్, మేధావులు, రచయితలు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన 'ప్రముఖ చరిత్రకారులు' వ్యాసాలు వ్రాశారు. అలాంటి వ్రాతల్లో ఒకటైన 'హిందూ ఎజెండా' (హిందుస్థాన్ టైమ్స్, అక్టోబర్ 22, 1998) అనే సంపాదకీయంలోని కొన్ని అంశాలను పరిశీలిద్దాం.

**ఇది హిందూ ఎజెండానా? లేక భారతీయ పునరుజ్జీవనమా?**

ఆ సంపాదకీయంలో 'సున్నితమైన' అంశాలు తప్ప మిగతా అనేక విషయాలు ప్రస్తావించారు. భారతదేశంలోనే కాక బంగ్లాదేశ్, మలేషియా, సూడాన్, లెబనాన్, ఈజిప్ట్, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ మొదలైన దేశాల్లో కూడా మైనారిటీ వర్గాలవారు ఉన్నారు. కానీ ఆ దేశాల్లో జాతీయ వారసత్వ విలువలకు అనుగుణంగా ఇస్లాం, క్రైస్తవ విధానాలు అమలు అవుతున్నాయి కదా? జర్మనీ, ఇటలీలలో క్రిస్టియన్

డెమొక్రాటిక్ పార్టీ పాలన చేసింది. దాని అర్థం ఆ దేశాల్లో మతరాజ్యం ఉండేదని, ఆ దేశాలు ఇతర మతాలకు వ్యతిరేకమనీ అనుకోవచ్చునా? భారతీయ సమాజం, భారతీయ ప్రజానీకం ఎప్పుడూ ఇతర మతాలను గౌరవించారు. అలాంటప్పుడు భారతీయకరణ అనేది ఇతర మతాలకు వ్యతిరేకం ఎలా అవుతుంది? అలా అవదు. అయ్యే అవకాశం లేదు. ప్రస్తుతం మనం అనుసరిస్తున్న విద్యావిధానం 'వేష భాషల వరకే భారతీయులుగా, భావాలకు విదేశీయులుగా భారతీయుల్ని' రూపొందించడానికి మెకాలే 150 సంవత్సరాల క్రితం రూపొందించినది. ఇటువంటి భారత వ్యతిరేకతని, భావదాస్యాన్ని పెంచే విధానాన్ని మార్చడం దేశాభిమానం కలిగిన వారందరి ప్రథమ కర్తవ్యం కాదా?

జ్ఞానానికి ప్రతీక అయిన సరస్వతికి వందనం చేస్తే తప్పేమిటి? వేలాది సంవత్సరాలుగా ఈ దేశంలో అది సంప్రదాయంగా వస్తున్నది. కేవలం కొద్దిమంది వేరేమతం పుచ్చుకున్న వారికి ఇష్టం లేదని 85శాతం ప్రజలు సరస్వతీ వందనం చేయకుండా మానుకోవాలా? మతం మారినవారు కూడా వేలాది సంవత్సరాల తమ వారసత్వాన్ని, పరంపరని ఎందుకు కాలదన్నుకోవాలి? ఇండోనేషియాలో ఎక్కువమంది ఇస్లాంని స్వీకరించినా వారు తమ సాంస్కృతిక వారసత్వాన్ని వదులుకోలేదు. హిందూ పురాణాలను ప్రతీకలను, పేర్లను వాళ్ళు అనుసరిస్తూనే ఉన్నారు. వాళ్ళ మారకద్రవ్యం (కరెన్సీ)పై వినాయకుడి బొమ్మ ఉంటుంది; వారి విమాన సర్వీసు పేరు గరుడ; అలాగే ఇండోనేషియా, వాషింగ్టన్‌లోని ఇంటెల్‌సాట్‌కి బహుకరించిన చిత్రం శ్రీకృష్ణుని గీతోపదేశ దృశ్యం. అందులో నాలుగు తెల్ల గుఱ్ఱాలు ఉన్న రథంపై శ్రీకృష్ణుడు కూర్చుని అర్జునునికి గీతోపదేశం చేస్తున్నట్లు చిత్రించబడి ఉంది. రథంపై కాషాయ ధ్వజం, దానిపై హనుమంతుడు కూడా చిత్రించబడింది. దీనినే సాంస్కృతిక జాతీయత అనవచ్చును. తాము మతపరంగా ముస్లిములే అయినా సంస్కృతి పరంగా హిందువులమేనని ఇండోనేషియా ప్రజలు అంటారు. మరి మన దేశంలోని హైందవేతరులు అలా అనలేరా? తమ వారసత్వాన్నీ, సంస్కృతినీ ప్రతిబింబించే ప్రతీకలను, గీతాలను అగౌరవపరచడం, వ్యతిరేకించడం దేశభక్తి, జాతీయ భావన అవుతుందా? దేశ స్వాతంత్ర్య సమరంలో వేలాదిమందికి ప్రేరణ నిచ్చిన వందేమాతర గీతాన్ని ఇప్పుడు మనం ఆలపించడానికి వీలు లేకుండా పోయింది. కారణం? కొద్దిమంది మతం మార్చుకున్న వారికి ఇష్టం లేదు కనుక!





ఇలా జాతీయ చిహ్నాలను, గీతాలను వ్యతిరేకించే మైనారిటీలను బుజ్జగించే దేశం, ప్రభుత్వం మరొకటి ఎక్కడైనా ఉందా?

వేదాలు, ఉపనిషత్తులు ఒక వర్గానికి చెందినవని అనడం సబబుకాదు. ఇస్లాం, క్రైస్తవాల మాదిరిగా అవి ఏకేశ్వరోపాసనని ప్రవచించవు. అవి అవిశ్వాసులు నరకానికి పోతారని శపించవు. అలాగే విశ్వాసులు ఇతరులపై దాడి చేసి వారిని బానిసలు చేసుకోవాలని శాసించవు. హిందువులు ఏనాడూ ఇతర దేశాలపై దండెత్తలేదు. హిందూ ధర్మం మానవాళి సంతతిని ఒక కుటుంబంగా పరిగణించింది. కొందరిని మనవారని, మరికొందరిని పరాయివారని విభజించడం జరగలేదు. ఇటువంటి ధర్మం ఇతరులకు వ్యతిరేకం ఎలా అవుతుంది? ఇలాంటి ధర్మాన్ని, తత్వచింతనని అందరికీ అందించడంలో తప్పేమిటి? దానివల్ల శాంతికి, సౌభ్రాతృత్వ భావనకి ఆటంకం కలుగుతుందా? 'అవిశ్వాసులను నరక కూపంలోకి తోసివేయి' అనే మత బోధల కంటే సత్ప్రవర్తన, సామాజిక జీవనం, భూతదయలను పెంపొందించే ఇటువంటి తాత్విక అంశాలు బోధించడంలో తప్పు లేదు.

"వేరు వేరు మతాలకు చెందిన వారు ప్రైవేటు సంస్థల ద్వారా తమ మతాన్ని ప్రచారం చేసుకునే హక్కు ఉంది" అని సంపాదకీయంలో పేర్కొన్నారు. కానీ రాజ్యాంగం ప్రకారం (30వ అధికరణం) కేవలం మైనారిటీలకు మాత్రమే విద్యా సంస్థల్ని ప్రారంభించుకునే హక్కు ఉంది. గత అనేక దశాబ్దాలుగా మైనారిటీ విద్యాసంస్థల్లో మత బోధనల కంటే వైద్య, ఇంజనీరింగ్, కంప్యూటర్ విద్యాబోధనే జరుగుతోంది. ఈ విద్యా సంస్థల్లో మైనారిటీ వర్గాల వారు కాక ప్రధానంగా మెజారిటీ వర్గానికి చెందిన వారే అత్యధిక మొత్తంలో ఫీజులు కట్టి చదువుతున్నారు. ఇదేనా మైనారిటీలకు స్వేచ్ఛ, 'సెక్యులరిజం' పరిరక్షణ?

మైనారిటీలకు ఇచ్చిన హక్కుల్ని మెజారిటీ వర్గానికి ఇవ్వని ప్రభుత్వం, రాజ్యాంగం మరొకటి ఏదైనా ఉందా? ఇది హిందువుల పట్ల వివక్షత చూపడం కాదా?

మెకాలే విద్యావిధానం మూలంగా అభారతీయ భావాలు పెరిగిపోవడం వల్ల అనైతికత, వేర్పాటువాదం మొదలైన దోషాలు కలుగుతున్నాయి. హైందవేతరుల పట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టే ఒక్క హిందూ మత గ్రంథాన్ని చూపగలరా? ఇతర మతస్థుల విగ్రహాలను, ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేయమని ఆదేశించే గ్రంథం చూపగలరా?

మరి అలాంటప్పుడు విద్యని భారతీయకరణ చేయడంలో ఆపద ఏముంది? ఇతర మతాలకు చెందిన గ్రంథాలే మానవాళిని విశ్వాసులు, అవిశ్వాసులుగా విభజించి, విశ్వాసులు మతం మార్చాలని పేర్కొంటున్నాయనడం నిజం కాదా? అటువంటి బోధలు పరస్పర సద్భావనని, సామరస్యాన్ని పెంపొందించగలవా?

సంస్కృతం విషయానికి వద్దాం. సంస్కృతం చాలావరకు భారతీయ భాషలకు, కొన్ని యూరోపియన్ భాషలకి మాతృక వంటిది. వేలాది సంవత్సరాల చరిత్ర, తత్వజ్ఞానాలను తనలో ఇముడ్చుకున్న సంస్కృత భాషని భారతీయులు వదిలిపెట్టగలరా? భారతీయ సంస్కృతి, వారసత్వాల గురించి తెలుసుకోవడానికి అరబ్ భాష, లేక పర్షియన్ భాష ఉపకరిస్తాయా? భారతీయులను భారతీయత నుండి దూరం చేయడానికి సంస్కృత భాషని వ్యతిరేకించడం కంటే మరొక సులువైన మార్గం లేదు. మెకాలే ఇదే కోరుకున్నాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మెకాలే మానస పుత్రులు భారతీయ తత్వజ్ఞానం, ఆలోచనా విధానాల నుండి సంస్కృత భాషని వేరు చేయడానికి ప్రయత్నించి, విజయం సాధించారు. భారతదేశంలో బాగా ప్రచారంలో ఉన్న 'సెక్యులరిజాని'కి పాశ్చాత్య ప్రపంచంలోని సెక్యులరిజానికి అసలు పొంతన లేదు. ఇది కూడా స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో ఎక్కడా లేదు. ఆ తరువాత కొందరు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ 'సెక్యులరిజాన్ని' సృష్టించారు. తమకి హిందూ ఓట్లు లభించవనే భయం ఎక్కువైన కొద్దీ సెక్యులరిజం ప్రచారం ఎక్కువగా చేశారు. హిందువుల ఓట్లు లభించకపోతే హైందవేతరుల ఓట్లు మూకుమ్మడిగా సంపాదించుకోవాలనే తాపత్రయంలో రాజ్యాంగాన్ని సైతం సవరించి 'సెక్యులరిజం' అనే మాట అందులో చేర్చారు. కాని 1956లో అప్పటి ప్రధాని పార్లమెంటులో ఒక బిల్లు ప్రవేశపెట్టారు. ప్రభుత్వం (సెక్యులర్ ప్రభుత్వం) ముస్లిముల హజ్‌యాత్రకి సబ్సిడీ సౌకర్యాన్ని కలిగించాలని ఆ బిల్లులో ప్రతిపాదించారు. ఆ తరువాత 11 సంవత్సరాలకి అదే 'సెక్యులర్' పార్టీ, దాని ప్రభుత్వం 'మైనారిటీ వర్గ' స్త్రీల మనోవర్తి హక్కును సుప్రీంకోర్టు తన తీర్పు ద్వారా ధృవీకరిస్తే, కొద్దిమందిని సంతుష్ట పరచేందుకు తీర్పుని వమ్ము చేయడానికి చట్టాన్నే సవరించారు. "తమ దేవుడే నిజమైనవాడు" అని ఒక మత వర్గంవారు రోజుకి ఐదుసార్లు మైకుల్లో ఘోషిస్తున్నా పట్టించుకోని ఈ 'సెక్యులర్' పార్టీలు, నాయకులు సరస్వతీ వందనాన్ని, వందేమాతర గీతాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకించారు. ఇవన్నీ అభారతీయ





'సెక్యులర్' పార్టీలు, ఒక మతవర్గానికి మద్దతుగా, మరొక వర్గానికి వ్యతిరేకంగా సాగిస్తున్న చర్యలు కాదని అనగలమా? ఈనాడు భారతదేశంలో ప్రజాస్వామ్యం, సార్వత్రిక ప్రాథమిక విద్య, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక ప్రగతి మొదలైన వాటికంటే 'సెక్యులరిజం' పరిరక్షణే ప్రధానమైన, ఏకైక అంశం అయింది. ఈ మెకాలే మానస పుత్రులకి "సెక్యులర్" ఫ్రంట్‌ల తాపత్రయం ఎక్కువ. అలాంటి ఫ్రంట్‌లలో అత్యంత అవినీతి పరులు, కులతత్వవాదులు, నేరస్థులు, దేశ వ్యతిరేకులు, వేర్పాటువాదులు, తీవ్రవాదులు ఉన్నా ఫరవాలేదు. ఇలాంటి వేర్పాటువాదులు, నిరంకుశ వాదులు మాత్రం 'సెక్యులర్'. కానీ విద్యావిధానానికి పట్టిన మెకాలే గ్రహణాన్ని వదిలించాలని ప్రయత్నించేవారు, ప్రకృతి పట్ల, జీవరాశుల పట్ల ప్రేమని, దయని పెంపొందించే భారతీయ జీవన విలువల్ని విద్యలో చేర్చాలనుకునే వారు మాత్రం 'మతతత్వ వాదులు, సంకుచితవాదులు, కాషాయవాదులు' అవుతారు. ఇదీ నేటి విచిత్ర పరిస్థితి! ఈ 'సెక్యులర్ వాదులు' సెక్యులరిజం పేరిట హిందూ వ్యతిరేక విధానాలు పాటిస్తే దాని వలన హిందువులలో మత సహనం, విశాల దృక్పథం నశించిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 50 సంవత్సరాల పాటు అభారతీయ, మెకాలే మానసపుత్రులే పరిపాలన సాగించారు. వీరిపాలనలో నిరక్షరాస్యత, 1947కి ముందు ఉన్న స్థితిని పునరుద్ధరించాలనే వాదనలు, మత కలహాలు పెరిగిపోయాయి. ఇదేనా మన స్వాతంత్ర్య నాయకులు ఆశించిన స్వరాజ్యం, సురాజ్యాలు? 'సెక్యులర్' కసరత్తులకి బదులు స్వరాజ్యం, సురాజ్యాల గురించి ఆలోచించవలసిన తరుణం ఆసన్నమైంది.

**తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు**
**దవిలి మృగతృష్ణతో నీరు ద్రావవచ్చు**
**తిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చు**
**చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు**

**భావం:** ప్రయత్నము చేత ఇసుక నుంచి చమురు తీయవచ్చును. ఎండమావి యందు నీరు త్రాగవచ్చును. తిరిగి తిరిగి కుందేటి కొమ్మునైనను సాధింపవచ్చును. కాని మూఢుని మనస్సును మాత్రము సమాధాన పెట్టుట సాద్యము కాదు.

# కమ్యూనిస్టుల వినాశకర ధోరణి

**నవంబరు 16 - 22 , 1998**

'అతి మానుష శక్తి మాత్రమే భారత్‌ని పేదరికంలో ఉంచగలదు' అని ప్రముఖ న్యాయవాది, రాజ్యాంగవేత్త శ్రీ నానీపాల్కివాలా అన్నారు. కాని ఆ అతి మానుష శక్తి మన ప్రభుత్వాధికారులేనని నేను అంటాను. భారతీయ కమ్యూనిస్టులు దేశాన్ని ఎన్ని విధాలుగా బలహీనపరచవచ్చునో, అన్ని విదాలుగా ప్రయత్నించి, దేశాన్ని ముక్కలు ముక్కలు చేయాలని తద్వారా అధికారాన్ని చేజిక్కించుకొని 'ప్రజా ప్రభుత్వాన్ని' ఏర్పరచాలని కలలు కంటున్నారు. ఇందుకోసం వాళ్ళు అనేక దుశ్చర్యలకి పాల్పడ్డారు. ప్రస్తుతం జాతీయ దృక్పథం కలిగిన పార్టీ కేంద్రంలో అధికారం చేపట్టేసరికి వీరి అసహనం పెరిగిపోయింది.

ఈ మధ్య కేరళలోని ఒక సభలో మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నేత శ్రీహరికిషన్‌సింగ్ సూర్జిత్ 'ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం మరికొన్ని రోజులు అధికారంలో కొనసాగితే అనేక జాతులతో కూడిన భారత్ సమైక్యత దెబ్బతింటుంది' అని దేశ ప్రజల్ని హెచ్చరించారు. కానీ 1940లో ముస్లింలీగ్ ఆగడాలు పెచ్చు పెరిగిపోతున్నప్పుడు ఇదే కమ్యూనిస్టుపార్టీ ప్రతి జాతికి స్వయం నిర్ణయాధికారం ఉంటుందనే స్టాలిన్ సిద్ధాంతం ప్రకారం భారత్‌లోని ముస్లిములు మైనారిటీలు కారని, వారు మతపరంగా ఒక జాతి కనుక వారికి స్వయం నిర్ణయాధికారం ఉంటుందని, ప్రత్యేక 'పాకిస్తాన్' ఏర్పాటును కోరే హక్కు వారికి ఉంటుందని వాదించింది. ఇలా మైనారిటీ వర్గాన్ని ఒక జాతిగా అభివర్ణించింది. 'అదృష్టవశాత్తు' ఆనాడు ద్విజాతి సిద్ధాంతాన్నే ప్రచారం చేసింది. కానీ ఈనాడు బహుజాతి సిద్ధాంతాన్ని ప్రచారం చేయాలని ప్రయత్నిస్తున్నారు. కొన్ని నెలల క్రితం సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు యువనేత సీతారాం ఏచూరి కూడా బహుజాతి సిద్ధాంతాన్ని లేవనెత్తాడు. ఇలాంటి సిద్ధాంతం ద్వారా ముందు వివిధ భాషలకు చెందిన ప్రజలను వేరువేరు జాతులుగా గుర్తించాలని చెప్పి, ఆ తరువాత ఆ జాతులకి స్వయం నిర్ణయాధికారం ఉందని వాదించి దేశాన్ని ముక్కలు చేసి చిన్న చిన్న స్వతంత్ర్య, సార్వభౌమాధికారం కలిగిన రాజ్యాలను ఏర్పరచడమే వీరి లక్ష్యం. జమ్మూ కాశ్మీర్‌లోని ముస్లిములు తమ రాష్ట్రానికి మరిన్ని ప్రత్యేక అధికారాలను ఇవ్వాలని, స్వయం ప్రతిపత్తిని





కల్పించాలని కోరుతున్నారు. వీరికి సిపియం తన పూర్తి మద్ధతు తెలుపుతూనే ఉంది. బిజెపి ప్రభుత్వం అధికారంలో కొనసాగితే దేశ సమైక్యత దెబ్బతినాలి అనే ఆకాంక్ష, ఆశ కనిపిస్తున్నాయి. ఈ ప్రచారాన్ని అస్గర్ ఆలీ ఇంజనీర్ వంటి 'సెక్యులర్' ముస్లిములు, ముస్లింలీగ్, మజ్లిస్ ఇత్తెహదుల్ ముస్లిమీన్ వంటి పార్టీలు బాగా ఉపయోగించుకుంటున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో క్రైస్తవులు ఇదే ప్రచారాన్ని చేస్తున్నారు. మతం మార్చుకున్న వారి సంఖ్య ఏ ఏ ప్రాంతాల్లో ఎక్కువగా ఉందో ఆయా ప్రాంతాల్లో వేర్పాటువాదం, స్వయం ప్రతిపత్తికై పోరాటం ఎక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోంది. ఈ వేర్పాటువాదానికి, పోరాటానికి సీతారాం ఏచూరి, హరికిషన్‌సింగ్ సుర్జిత్ వంటి కమ్యూనిస్టు 'నాయకుల' మద్దతు లభిస్తోంది. ఈ 'నాయకులు' ఏనాడూ ఏ ఎన్నికల్లోనూ పోటీ చేసిన పాపాన పోలేదు.

అక్టోబర్‌లో ఝబువాలో (మధ్యప్రదేశ్) కొందరు క్రైస్తవ నన్‌లపై 'అత్యాచారం' జరిగింది. వెంటనే కమ్యూనిస్టు నాయకులంతా దేశంలో మైనారిటీలకి రక్షణ లేకుండా పోయిందని, దీనికి కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమని ప్రకటనలు చేశారు. సెక్యులరిజం పరిరక్షకులుగా ప్రకటించుకునే ముస్లిం లీగ్, ఎం.ఐ.ఎం. వంటి పార్టీలతో కలిసి బిజెపిని, దాని మిత్రపక్షాలను మతతత్వవాదులని విమర్శించారు. కానీ నిజం ఎంతో కాలం దాగదు. కేంద్ర హోంమంత్రి శాఖ ఆదేశం మేరకు మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరిపితే అత్యాచారానికి పాల్పడినవారు గిరిజనులని తేలింది. అంతేకాదు 24 మంది నిందితుల్లో 12 మంది క్రైస్తవులని తేలింది. దీనితో కమ్యూనిస్టులు, సెక్యులరిస్టులు చేస్తున్న ప్రచారం తప్పని, వీరు జాతీయ పార్టీలకి, జాతీయవాదులకి వ్యతిరేకంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని స్పష్టమైపోయింది. ఇలా అబద్ధాలు ప్రచారం చేయడం వారి అలవాటని కూడా తెలిసింది. ఇంత జరిగినా ఏ ఒక్క కమ్యూనిస్టు నాయకుడు బిజెపి పట్ల తాము చేసిన ప్రకటనల్ని వెనక్కి తీసుకోలేదు.

ఇన్‌కంటాక్స్, కస్టమ్స్, ఎక్సైజ్ శాఖల్లోని అధికారులు సమ్మెకు తలపడితే వారికి మొట్టమొదట మద్దతు తెలిపిన పార్టీ సిపిఎం. సిపిఎం అనుబంధ కార్మిక సంస్థ సిఐటియు సమ్మెకి తన పూర్తి మద్దతుని తెలిపింది. ప్రభుత్వాధికారులు ప్రజాసమస్యల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని కమ్యూనిస్టు పార్టీలు

విమర్శిస్తున్నాయి. కాని మరో ప్రక్క ప్రభుత్వాధికారుల సమ్మెకి మద్దతు తెలుపుతున్నాయి. ఇలా సమ్మెకి మద్దతు తెలపడానికి కారణం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులన్నింటిని అంగీకరించడమేనని అంటున్నారు. కానీ ఇన్‌కంటాక్స్ అధికారులు జీతాలు పెంచమని సమ్మె చేయడానికి, ప్రపంచ బ్యాంకు షరతులకి సంబంధం ఏదైనా ఉందా? తమ సహజమైన వినాశకర ధోరణి వల్లనే కమ్యూనిస్టు పార్టీ, సిఐటియు సమ్మెని సమర్థిస్తున్నాయన్నది అసలు నిజం.

అక్టోబర్‌లో జరిగిన వివిధ రాష్ట్రాల విద్యామంత్రుల సమావేశాన్ని సరస్వతీ వందనకి వ్యతిరేకంగా బహిష్కరించినవారిలో త్రిపుర, పశ్చిమబెంగాల్, కేరళ మంత్రులు కూడా ఉన్నారు. ఆ సందర్భంగా వాళ్ళు చేసిన గొడవ, వారి ప్రవర్తన వీధి గూండాలను గుర్తుకు తెచ్చింది కానీ, అసెంబ్లీ సభ్యుల్నీ, విద్యవిధానాన్ని రూపొందించే బాధ్యతాయుత మంత్రుల్ని గుర్తుకుతేలేదు. త్రిపుర, బెంగాల్‌లలో దుర్గాపూజ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు రోజుల తరబడి మూసి ఉంటాయి. రాజకీయ నాయకులంతా దుర్గా పూజోత్సవాలలో తలమునకలై ఉంటారు. దుర్గాపూజకి సెలవు ప్రకటించడం మాత్రం వీరి దృష్టిలో సెక్యులర్ పద్ధతి. కాని సరస్వతీ దేవికి వందనం చేయడం మాత్రం హిందూ మతతత్వం. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజుకి సెలవు ప్రకటించడానికి వీరికి ఏదీ అడ్డురాలేదు. రోజుకి ఐదుసార్లు మసీదుల నుంచి చెవులు చిల్లులు పడే విధంగా వినిపించే 'అజాన్' కొన్ని డెసిబెల్‌కి మించి ఉండకూడదని కోర్టు ఆదేశాలు జారీ చేస్తే వాటిని అమలు పరచే శ్రద్ధ వీరికి లేదు. కలకత్తా హైకోర్టులో ప్రభుత్వం తరపున న్యాయవాదులు ఖురాన్ దేవుడి వాక్యం కనుక దానికి సంబంధించి విచారణ జరిపేందుకు, తీర్పు చెప్పేందుకు మానవ మాత్రులకి అధికారం లేదని వాదించారు! అందులో అవిశ్వాసుల్ని చంపాలి అని ఉన్నా ఎవరూ ప్రశ్నించడానికి వీలు లేదని వాదించారు. దీనిని బట్టి హిందుత్వాన్ని వ్యతిరేకించడం, ముస్లిములను బుజ్జగించడమే వీరి సెక్యులరిజమని స్పష్టమవుతోంది.

వీరికి అవినీతి, అసమర్థ పాలన, కులతత్వం వంటివి సమస్యలే కావు. దేశాభిమానాన్ని, జాతీయ భావనని నాశనం చేయడమే వారి లక్ష్యం. ఇదే అంతర్జాతీయ కమ్యూనిజం లక్షణం.

అందుకనే వీరికి అనేక మంది స్త్రీల (ఉత్తరాంచల్ ఉద్యమకారులు) మరణానికి కారకులైన ములాయంసింగ్, లాలూప్రసాద్ యాదవ్‌లు వీరికి అత్యంత సన్నిహితులు.





వీరందరికి తోడుగా ఈ మధ్యనే దేశ పౌరసత్వాన్ని స్వీకరించిన సోనియా తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకై ప్రయత్నిస్తున్నారు. బిజెపి ప్రభుత్వాన్ని కూలదోయడానికని ఒక కూటమిని తయారుచేయడానికి సూర్జిత్ అన్ని పార్టీల తలుపులు తడుతున్నారు. ఎందుకంటే ఇవన్నీ వంశపారంపర్య పాలనను, ముస్లిం సంతుష్టీకరణను అవలంభించిన కాంగ్రెస్ పార్టీ నుండి పుట్టినవే. బిజెపి ప్రభుత్వాన్ని ఎలాగైనా కూలద్రోయాలన్న కమ్యూనిస్టుల ప్రయత్నాలు వారి వినాశకర ధోరణిని మరోసారి బయటపెడుతున్నాయి.

ఒకప్పుడు కమ్యూనిజాన్ని అనుసరించిన దేశాలు దానిని ఎలా వదిలించుకోవాలో అని ఆలోచనలో పడ్డాయి. ఇప్పటికీ స్టాలిన్ తరహా కమ్యూనిష్టు విధానాన్ని అవలంభిస్తున్న ఉత్తర కొరియాలో గత సంవత్సరానికి పైగా కరువు కాటకాల్లో అల్లల్లాడుతోంది. క్యూబా కూడా ఇదే స్థితిలో ఉంది. ఈ రెండు దేశాలకి అమెరికా ఆహార పదార్థాల్ని అందించవలసి వస్తోంది. ఇక కమ్యూనిస్టుల స్వర్గమైన రష్యాలో పరిస్థితి ఇంతకన్నా భిన్నంగా లేదు. అమెరికా 1.5 మిలియన్ టన్నుల గోధుమలు అందించకపోతే రష్యాలో ఆకలి చావులు సంభవిస్తాయని భయపడుతున్నారు. ఇలా కమ్యూనిస్టులు రాజ్యం చేసిన దేశాలన్నీ కరువు బారిన పడ్డాయి. త్రిపురలోను, 22 సంవత్సరాలుగా పాలన చేస్తున్న బెంగాల్‌లోనూ కమ్యూనిస్టులు ఏదీ సాధించలేకపోయారు. పేదరికం, నిరుద్యోగం అలాగే ఉన్నాయి.

వారు సాధించిన ఏకైక 'ఘనకార్యం' బంగ్లాదేశీ చొరబాటుదారులను సాదరంగా ఆహ్వానించి ఓటర్ల జాబితాలో చేర్చడం. వినాశకర ధోరణి తప్ప మరొకటి తెలియని కమ్యూనిస్టుల మాయాజాలానికి లోనై వారితో కొందరు స్నేహం చేస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

**చెడ్డవాని చెలిమి చేయబోకెన్నడు**
**ముప్పతప్పదెన్నడైన నీకు**
**ఇనుము సమ్మెట సామెతెరిగినదె కదర**
**మంచి మాట వినర మానవుండ !**

# ఫిరాయింపుల ప్రహసనం

**డిసెంబరు 1 - 7 , 1998**

1980వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ టి.అంజయ్య 60 మంది సభ్యులుగల మంత్రివర్గాన్ని ఏర్పరచారు. అంత పెద్ద మంత్రివర్గం అవసరం ఏముందని అడిగినప్పుడు శ్రీ అంజయ్య 'ఆంధ్రప్రదేశ్‌లో 6 కోట్లమంది జనాభా ఉన్నప్పుడు 60 మంది మంత్రులు ఉండకూడదా?' అని సమాధానం ఇచ్చారు. ఇంత పెద్ద మంత్రివర్గం అప్పటి ప్రధానికి, ఆమె కుమారుడైన రాజీవ్‌గాంధీకి ఏ మాత్రం నచ్చలేదు. అందుకనే ముఖ్యమంత్రికి వీధి దారి చూపారు. 60 మంది శాసన సభ్యులు కల నాగాలాండ్‌లో 35 మందితో మంత్రివర్గం ఏర్పరచారు.కేవలం అసమ్మతివాదుల బెడదని ఎదుర్కొనడానికి, వారికి పదవులు కట్టబెట్టడానికి అంత పెద్ద మంత్రి వర్గాన్ని ఏర్పరచారు. కాని ఆ పాచిక కూడా పారలేదు. కీలకమైన పదవుల కోసం కుమ్ములాట జరిగి చివరికి మంత్రివర్గం రద్దు అయ్యింది. 1990లో 50 మందితో జనతాదళ్ నుండి బయటకు వచ్చి కాంగ్రెస్(ఐ) మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పరచిన శ్రీ చంద్రశేఖర్ తనతో వచ్చిన వారందరికీ మంత్రి పదవులు కట్టబెట్టారు. మెజారిటీ సాధించడానికి ఇంకా కొద్ది మంది అవసరం కావడంతో ఇండిపెండెంట్ సభ్యుల్ని, ఇతర పార్టీల నుండి బయటపడిన వారిని కూడా చేర్చుకున్నారు. ఐనా ఎక్కువ కాలం అధికారం నిలబెట్టుకోలేకపోయారు. ఇక ఈ మధ్యనే బీహార్‌లో అవినీతి అమాయక చక్రవర్తి శ్రీ లాలూప్రసాద్ యాదవ్ నాటకీయ రీతిలో తన భార్యని ముఖ్యమంత్రి సింహాసనంపై కూర్చోబెట్టి తాను సిబిఐకి లొంగిపోయారు. రాజకీయ పరిజ్ఞానం బొత్తిగా లేని సాధారణ గృహిణి అయిన ఆయన భార్య 72 మందితో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. అందులో అనేక మంది అవినీతిపరులు, నేరస్థులు ఉన్నారు. ఈ సంఘటన కూడా అనేక మందిని ఆశ్చర్యపరచింది. కానీ ఆ మంత్రివర్గం ఎక్కువకాలం బ్రతికి బట్ట కట్టలేదని సరిపెట్టుకున్నారు. 1980లో ఇందిరాగాంధీ తిరిగి అధికారం చేజిక్కించుకున్నప్పుడు ఫిరాయింపుల రారాజు అయిన భజన్‌లాల్ జనతా పార్టీ పేరుని పూర్తిగా మార్చివేసి కాంగ్రెస్ (ఐ) తీర్థం పుచ్చుకుని ఇందిరాగాంధీ ఆశీస్సులతో హర్యానా అధికారపీఠంపై కొనసాగాడు. ఈ ప్రహసనం వల్ల ఏం తెలుస్తుంది?





1967 నుండి శ్రీమతి ఇందిరాగాంధీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తొలిరోజుల్లో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ నుండి పుట్టిన అనేక చిన్నచిన్న పార్టీలు ఉండేవి. కాని ఈ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు తగిన పదవులు లభించలేదని ప్రభుత్వాలను కూల్చిన సందర్భాలు అనేకం. అనేక మంది ప్రముఖ నాయకులు 'ఏక్ దిన్ కా రాజా'ల మాదిరిగా మారిపోయారు. హర్యానాలో ముఖ్యమంత్రి ఒక రోజు పాటు ఆరుబయట టెంట్ వేయించాడు. ఏ ఎమ్మెల్యే అయినా టెంట్‌లోకి వెళ్ళి ప్రభుత్వానికి మద్దతు తెలిపితే అతడిని గవర్నర్ దగ్గరికి తీసుకువెళ్ళి ప్రమాణ స్వీకారం చేయించాడు. కాని తమకి కావలసిన పదవులు దొరకని వారు వెంటనే రాజీనామాలు కూడా చేశారు. ఈ ప్రహసనం అంతా చూసి స్వర్గీయ యశ్వంత్‌రావ్ చవాన్ ఇలాంటి ఫిరాయింపుదారులకి 'ఆయా రాం గయా రాం' అని పేరు కూడా పెట్టారు.

ఇలా స్వార్థ రాజకీయ ప్రయోజనాలకై పార్టీలను చీల్చే ఘనకార్యం ఇందిరాగాంధీతో ప్రారంభమైంది. తన అధికారానికి, పేరు ప్రతిష్టలకి భంగం వాటిల్లుతోందని అనిపించినప్పుడు పార్టీని చీల్చడానికి ఆమె ఏ మాత్రం వెనుకాడలేదు. 1969కి ముందు సోషలిస్టులు మాత్రమే పార్టీలు చీల్చే పని చేసేవారు. ఎందుకంటే అప్పటి సోషలిస్టు నాయకులంతా వ్యక్తిగతంగా ఎంతో శక్తిసామర్థ్యాలు, రాజకీయ పరిజ్ఞానం, పేరుప్రతిష్టలు కలిగినవారు. కానీ ఎవరికీ తగినంత మంది అనుచరవర్గం ఉండేది కాదు.

పేదరిక నిర్మూలన పేరిట సంక్షేమ పథకాల పేరిట ప్రజాధనాన్ని సొంతం చేసుకునేందుకు నాయకులకి సరికొత్త మార్గాలు దొరికాయి. మంత్రి పదవులు, శాసన సభ్యత్వాలు అధికార కేంద్రాలయ్యాయి. వాటి ద్వారా డబ్బు కూడబెట్టడం సాధారణ విషయం అయిపోయింది. పార్టీలు సొంత ఆస్తులుగా మారిపోయాయి. ఇందిరాగాంధీ తన పార్టీని రెండుసార్లు (1969, 1977) చీల్చిన తరువాత కాంగ్రెస్ (ఐ)ని ఏర్పాటు చేసుకుంది. మిగతా కాంగ్రెస్ వాదులు కాంగ్రెస్ (ఒ)గా ఏర్పడ్డారు. ఆ తరువాత కాంగ్రెస్–బి (బ్రహ్మానందరెడ్డి), కాంగ్రెస్–యు (దేవరాజ్ అర్స్), కాంగ్రెస్–ఎస్(శరద్ పవార్) ఇలా అనేక కాంగ్రెస్‌లు ఏర్పడ్డాయి. 1979లో జనతాదళ్ చీలినప్పుడు జగ్జీవన్‌రామ్ తన పార్టీని జనతాదళ్ (జె) అని పిలుచుకున్నారు. పార్టీకి తన పేరు ఎందుకు పెట్టుకున్నారని అడిగితే జగ్జీవన్‌రామ్ వెంటనే 'ఇందిర తన పేరును పార్టీకి పెట్టుకున్నప్పుడు నేనెందుకు పెట్టుకోకూడదు?' అని సమాధానం ఇచ్చాడు. వ్యక్తుల పేర్లపై కంపెనీలు స్థాపించబడినట్లే నాయకుల పేర్లపై పార్టీలు

స్థాపించడం మొదలయింది. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉన్న టిడిపి (ఎల్.పి) అలాంటిదే. మాజీ పోలీసు డైరెక్టర్ జనరల్ శ్రీభాస్కరరావు పార్టీని స్థాపించి దానికి జీవితకాల అధ్యక్షునిగా తనని తాను నియమించుకున్నారు. మరొక ఇద్దరు సినిమా నటులు కూడా సొంత పార్టీలు స్థాపించే ప్రయత్నంలో ఉన్నారు. ఎవరైనా ఏ పార్టీలోనైనా ఉండవచ్చును. తాను ఆశించినది లభించకపోతే పార్టీ నాయకత్వాన్ని విమర్శించవచ్చును. అవినీతి ఆరోపణలు చేయడం అందులో ప్రధానమైనది. ఉత్తర భారతంలోనైతే ఫిరాయింపుదారులు, చీలికదారులు తమ చర్యల్ని సెక్యులరిజం పరిరక్షణ, మతతత్వ శక్తులతో పోరాటం పేరుతో సమర్థించుకుంటారు. బిజెపి పచ్చి మతతత్వ పార్టీ అని విమర్శించడం, పదవులను కాపాడుకునేందుకు పార్టీలు మార్చి అది 'మతతత్వ బిజెపికి వ్యతిరేకంగా సాగిస్తున పోరాటం' అని చెప్పడం సర్వసాధారణమైపోయింది. లలూప్రసాద్ యాదవ్, శంకర సింగ్ వాఘేలా చీలిక వర్గాలు యునైటెడ్ ఫ్రంట్‌లో కొనసాగుతుండడానికి ఇదే కారణం.

మరి నీతి నియమాలకు కట్టుబడి ఉండే బిజెపి, ఫిరాయింపుదారులను చేర్చుకుని 93 మంది సభ్యులు కల మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేయడం ఏమిటని విమర్శించేవారు ఒక విషయం గుర్తించాలి. మే 1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్(ఐ) పరాజయం పాలయిన తరువాత పధ్నాలుగు పార్టీలు బిజెపికి వ్యతిరేకంగా ఒక కూటమిగా ఏర్పడ్డాయి. ఇవన్నీ ఎన్నికల్లో పరస్పరం వ్యతిరేకంగా పోరాడినవే. తమ ఏకైక శత్రువైన కాంగ్రెస్‌తో పోరాడటానికి వీటిలో చాలా పార్టీలు బిజెపితో, గతంలో జనసంఘ్‌తో పొత్తు పెట్టుకున్నవే. కాని అవే పార్టీలు ఇప్పుడు బిజెపిని అంటరాని పార్టీగా నిర్ధారించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పార్టీ అధికారం చేపట్టకుండా చూడాలని ప్రయత్నిస్తున్నాయి. ఎమ్మెల్యేలను గొర్రెల మందని కాపాడినట్లుగా హోటల్ రూముల్లోనూ, గెస్ట్‌హౌస్‌ల్లోనూ బంధించి వారు పార్టీ వదలిపోకుండా కాపాడుకుంటున్నారు. ఇదంతా సెక్యులరిజం పరిరక్షణ, మతతత్వ శక్తులపై పోరాటం పేరిట సాగిస్తున్నారు. ఇలా పార్లమెంటులో అత్యధిక స్థానాలు సంపాదించుకున్న పార్టీని ప్రభుత్వం ఏర్పరచకుండా అడ్డుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీ ఏజెంటుగా పనిచేసే గవర్నర్ ఇదే ప్రయత్నం చేశాడు. అక్కడ బిజెపి పని అయిపోయిందని అనుకున్నారంతా. ప్రభుత్వం ఏర్పరచడానికి వీలు లేకుండా అన్ని రకాల అవరోధాలు కల్పించబడుతూ ఉంటే ఇక అత్యధిక స్థానాలు గెలుచుకుని లాభం ఏముంది? కనుక బిజెపి అంటరాని పార్టీగా





మిగిలిపోదలుచుకోలేదు. నైతిక విలువలను పాటించగలిగిన పరిస్థితుల్ని ఏర్పరచకుండా కేవలం నీతులు వల్లిస్తూ కూర్చోదలుచుకోలేదు. ఫిరాయింపుదారులు, 15 పార్టీలు అన్ని నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చినప్పుడు, అవినీతికి వ్యతిరేకంగా పోరాడతామని, బోఫర్స్ వంటి లెక్కలేని కుంభకోణాల్లో నిందితుల వివరాలు బయటపెడతామని, వారిని శిక్షిస్తామని చేసిన వాగ్దానాలు నెరవేర్చనప్పుడు, అవినీతిపరులు అందలం ఎక్కి దేశభద్రత, రక్షణలను పట్టించుకోనప్పుడు బిజెపి మాత్రం కేవలం మాటలకే పరిమితం కావాలని, నీతిసూత్రాలు వల్లిస్తూ కూర్చోవాలని అనలేం కదా? నైతిక విలువలు, సిద్ధాంతాల పేరిట అనైతిక చర్యలకు పాల్పడే పార్టీలకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంది.

పార్టీ ఫిరాయింపులు ఎప్పుడూ అభిలషణీయం కాదు. చాల తక్కువ మంది మాత్రమే ఏ పార్టీ టిక్కెట్టు లేకుండా ఎన్నికల్లో గెలవగలుగుతారు. బందిపోటు రాణి పూలన్‌దేవి, ములాయం సింగ్ సమాజ్‌వాది పార్టీ టిక్కెట్టు ఇవ్వకపోతే ఎం.పి. అయ్యే అవకాశం లేనే లేదు. కనుక ఎవరైనా పార్టీ ఫిరాయిస్తే వెంటనే వారి సభ్యత్వం రద్దు చేయాలి. ఐతే అన్ని ఫిరాయింపులు అనైతికమైనవి, దేశ ప్రయోజనాలకి భంగకరమైనవి కాకపోవచ్చును. విప్‌ని ధిక్కరించడం పార్టీ ఫిరాయింపుగా నిర్ణయించాలంటే అటువంటి పార్టీ విప్ పార్టీ సభ్యులందరి ఏకగ్రీవ నిర్ణయం పైననే జారీ చేయబడినదై ఉండాలి. అంతేకాని పార్టీ నిరంకుశత్వానికి సాధనం కారాదు. పార్టీ సభ్యులు ఒక విషయంపై తమ అభిప్రాయాలను పూర్తిగా వెలిబుచ్చడానికి అవకాశం ఇవ్వకుండా నిరంకుశ ధోరణిలో జారీ చేసిన విప్‌ని ధిక్కరిస్తే వారి సభ్యత్వం రద్దు చేయడం సమంజసం కాదు. కొన్ని దేశాలలో పార్టీ నిర్ణయాలను ప్రశ్నించిన సభ్యుడిని పార్టీ నుండి బహిష్కరించడానికి వీలు లేదు. మన దేశంలో కూడా అటువంటి స్వేచ్ఛ ఉండాలి. ఐతే పార్టీ నిర్ణయాలను ప్రశ్నించే వారు నీతివంతులు, నిజాయితీపరులై ఉండాలి. దురదృష్టవశాత్తు అసమ్మతి, ఫిరాయింపు అనేవి మనదేశంలో అవినీతికి ప్రతిరూపాలైపోయాయి. కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ సంస్కృతిని వంటపట్టించుకున్న అనేక ఇతర పార్టీలు, కమ్యూనిస్టులు (వీరి దేశ వ్యతిరేక చర్యలు పదేపదే బయటపడుతున్నాయి), ప్రాంతీయ పార్టీలు, కులతత్వపార్టీలు ప్రజాస్వామ్య పద్ధతులను అవహేళన చేస్తున్నాయి. అనైతిక, అప్రజాస్వామిక పద్ధతులు అనుసరిస్తూ వచ్చిన వారికి తగిన గుణపాఠం నేర్పిన శ్రీ కళ్యాణ్‌సింగ్‌ని అభినందించవలసిందే.

# ఛాందసవాద ప్రమాదాలు

**జనవరి 4 - 10 , 1999**

అమెరికా ప్రజల దృష్టిని అభిశంసన వైపు నుండి మరల్చడానికే ఇరాక్‌పై క్లింటన్ బాంబుల వర్షాన్ని కురిపించారు. ఆయనకు బ్రిటన్ సేనలు తోడయ్యాయి. ఇరువురూ కలిసి ఇరాక్‌పై టార్పిడోల వంటి భయంకరమైన అస్త్రాల్ని ప్రయోగించారు. క్లింటన్ చర్య అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ఆయనే ఇరాక్‌పై బాంబుల వర్షం కురిపించాలని తీసుకున్న నిర్ణయం స్వార్థంతో కూడుకున్నదే. అంటే సద్దాం హుసేన్ అంత పుణ్య పురుషుడని ఇక్కడి మాటల్లో అర్థం కాదు, సద్దాం నియంత ఎన్ని టన్నులు జీవరసాయన ఆయుధాల్ని తయారు చేసిందీ, వాటిలో ఎన్నింటిని ధ్వంసం చేయాలనీ వచ్చిందీ ఐ.రా.స. ఆయుధ తనిఖీ బృందం బయటపెట్టింది. సద్దాం ఇంకా తన విధ్వంస యత్నాల్లో ముమ్మరంగా మునిగి తేలి ఉన్నారు. ఇక్కడో ఆశ్చర్యకరమైన విషయం ఉంది. ఇరాక్ నియంత ఆయుధాల్ని ధ్వంసం చేయాలని పట్టుబడుతున్న అమెరికా, ఇరాక్ నియంతపై నియంత్రణ కోసం గట్టి యత్నాలు చేయడం లేదు. సద్దాం దుష్పరిపాలనపై ఎందరికో కోపతాపాలున్నాయి. పసిపిల్లల పాల డబ్బాల కోసం, రోగిష్టుల మందులకోసం, ఇతరత్రా చమురు అమ్ముకోమంటే అలా అమ్మి వచ్చిన డబ్బుల్ని ఆయుధాల తయారీకి వాడుతున్న సద్దాం పాలన ఆదర్శవంతమైందని ఎవరు చెబుతారు? అయినా అమెరికా దాడి మాత్రం ఎవరినీ మెప్పించలేకపోతోంది.

ప్రపంచంలోని ఇస్లామిక్ వాదులంతా సద్దాం హుస్సేన్‌ను వెనకేసుకొస్తున్నారు. ఇలాంటి ప్రతిస్పందనలు ముస్లిం దేశాల్లో వెలువడితే సరే, అలాకాకుండా బ్రిటన్‌లాంటి ప్రాంతాల్లో ఇస్లామిక్ వాదులు బయటపడటం ఆశ్చర్యకరం. ఇరాక్‌పై అమెరికా ఇంగ్లాండ్ ఉమ్మడి దాడుల్ని నిరసిస్తూ అల్– మొహజిరమ్ అన్న సంస్థ ప్రదర్శన జరిపింది. దీనిలో బ్రిటన్‌లో ఉంటున్న ఇరాక్, సిరియన్, పాకిస్తానీయులు ఉన్నారు. ముస్లిం జనాభా ఉన్న ఏ దేశంలోనైనా ఇస్లామిక్ ప్రతిఘటన సహజంగానే బయటపడుతుందని అల్ మొహజిరమ్ హెచ్చరిస్తోంది. చాందసవాద అల్ మొహజిరమ్ సంస్థ ప్రముఖుడు ఒమర్–ఒక్రీ–మహమ్మద్ ప్రకటన ఆ సంస్థ ఉద్దేశ్యాల్ని బయటపెడుతోంది. ఇరాక్‌పై జరిగిన దాడులకు ప్రతీకారంగా ముందుకు సాగుతామని ఒమర్ ఒక్రీ మహమ్మద్ ప్రకటించారు. ఈ మేరకు సైనిక, భౌతిక,





ఆర్థిక రంగాలన్నింటిలోనూ తమ ప్రతీకారాలు సాగుతాయని ఆయన అంటున్నారు. ఇరాక్‌పై దాడులంటే అది ముస్లింలపై చేసిన దాడేనని చెబుతోంది. అల్–మజ్‌రోన్ సంస్థ. అమెరికా, ఇంగ్లాండ్‌లను వ్యతిరేకిస్తూ ఒక ఫత్వా జారీ చేయాలని ఒమర్ ఒక్రీ మహమ్మద్ డిమాండ్ చేస్తున్నారు. బ్రాడ్‌ఫోర్డ్‌లోనూ ఇదే మోస్తరు దృక్పథం బయటపడింది. అక్కడ 70వేల మంది ముస్లింలు సమావేశమై ఇరాక్ మీద అమెరికా చేసిన వైమానిక దాడుల్ని ఖండించారు.

ఇక్కడ ఒక ఆసక్తికరమైన అంశాన్ని గురించి పునశ్చరణ చేసుకోవాలి. ఇప్పటికి ప్రపంచం మొత్తం మీద పదిహేను ప్రధాన సంఘర్షణలు కన్పిస్తున్నాయి. వీటిలో ఒక్కటి మాత్రం క్రిష్టియన్ మతానికి సంబంధించినది. ఉత్తర ఐర్లాండ్‌లో ప్రొటెస్టంట్ – కేథలిక్‌ల మధ్య ఘర్షణలు ఏర్పడ్డ విషయం తెలిసిందే. మిగతా పద్నాలుగు ఘర్షణలు ముస్లిం, ముస్లిం–ముస్లిమేతర సంకుల సమరాలే. ఆఫ్ఘనిస్తాన్, అల్జీరియా, పాకిస్తాన్ (ముస్లింలకు వ్యతిరేకంగా ముస్లింలు) సైప్రస్, సూడాన్, యుగోస్లోవియాలోని కొసోవా, ఫిలిప్పీన్స్, ఫ్రాన్స్ (క్రిష్టియన్‌లకు వ్యతిరేకంగా ముస్లింలు) ఇజ్రాయిల్, పాలస్తీనా (యూదులకు విరుద్ధంగా ముస్లింలు) చెచెన్యా, బోస్నియా హెర్జ్‌గోవినా, అజర్ బైజాన్ (క్రిష్టియన్‌లు ముస్లింలకు వ్యతిరేకంగా). ఇలా .... సంఘర్షణల స్వరూపం కన్పిస్తోంది. నిజంగా ఇస్లాంలో ఇంతటి హింసా, సంఘర్షణలు ఎందుకన్నది ప్రపంచానికి అంతు చిక్కని అంశం. గతంలో క్రిష్టియన్ మతం కూడా తన ఛాందస వాదాన్ని పదిల పర్చుకుంటూనే వచ్చింది. అయితే సంస్కరణ దృక్పథాలు దానిలో మార్పుల్ని తీసుకొని వచ్చాయి. క్రిష్టియన్ మతం, బౌద్ధా హిందూ ధర్మాల్ని చూసి మరింత మార్పును పొందింది. ఆ మార్పు ఇంకా కొనసాగుతోంది. “సాల్వేషన్” అనేది క్రిష్టియన్ మతం వెలుపల కూడా సాధ్యమేనని కేథలిక్ చర్చి అనగలుగుతోంది. క్రిష్టియానిటీలో సంస్కరణలు రావడానికి దాదాపు 1400 సంవత్సరాలు అవసరమైంది. ఇదే సమయంలో ఇస్లాం అనేది ఒక మిలిటెంట్ రాజకీయ–మత దృక్పథంగా మారింది. క్రిష్టియానిటీలో జరిగినట్టుగానే ఇస్లాంలోనూ సంస్కరణలు ఆరంభం కావచ్చునని కొద్దిమంది మేధావులు విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం కన్పిస్తున్న సంఘర్షణలు, ఉద్రిక్త స్వభావం సంస్కరణలకు ముందు దశ అని వీరంతా అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఇస్లాంను ప్రశ్నించడం భారత ఉపఖండం ముస్లిం ప్రజానీకంలో మొదలవుతోంది. సల్మాన్ రష్దీ (ఇండియా), అన్వర్‌షేక్ (పాకిస్తాన్), తస్లీమా నస్రీన్ (బంగ్లాదేశ్)లు మన ముందు కన్పిస్తున్న ప్రశ్నించే ప్రముఖులు.

# నిజాన్ని కప్పిపుచ్చే ధోరణి

**జనవరి 11 - 17 , 1999**

డిసెంబర్10న బెర్హంపూర్‌లో ఒక మేధావుల సమావేశం జరిగింది. సదస్సులో చర్చనీయాంశం ''మానవ హక్కులు''. సమావేశంలో భిన్న మతాలను అనుసరించేవాళ్ళు, విభిన్న ఆలోచనా ధోరణులకు కట్టుబడినవాళ్ళు ఉన్నారు. "వామపక్ష, ప్రజాస్వామ్య, ప్రగతివాద" బృందాలతోపాటు క్రిష్టియన్ మిషనరీలు, మానవహక్కుల సంఘం ప్రతినిధులు కూడా సమావేశానికి హాజరయ్యారు. వ్యక్తిగత మానవహక్కుల విషయంలో హిందూ మతానికి గొప్ప గౌరవమేమీ లేదని వాళ్ళలో కొందరు వాక్రుచ్చారు. హిందువుల్లో ఇంకా మిగిలి ఉన్న అస్పృశ్యతను కొంతమంది ప్రస్తావిస్తే, మరి కొంతమంది బూటకపు ఎన్‌కౌంటర్లు పోలీసు పాత్రల్ని చర్చిస్తూ మాట్లాడారు.

అటు తర్వాత ఐ.పి.ఎస్. అధికారి నాగేశ్వరరావు ప్రసంగాన్ని ఆరంభించారు. ఆయన బెర్హంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్. ఆయన చరిత్రను, మత విషయాల్ని విపులంగా చదువుకున్నారు. కొన్ని రాజకీయ పక్షాల వారికీ, కొన్ని మతాల వారికీ మానవహక్కుల విషయంలో ఎలాంటి నిమ్న గౌరవం ఉందో తన ప్రసంగంలో విశ్లేషించారు. ఈ మేరకు నాగేశ్వరరావు గారు, ఖురాన్ పాత నిబంధన (ఓల్డ్ టెస్ట్‌మెంట్)ల నుండి ఉదాహరణలు అందించారు. కాఫిర్‌లను మతంలోకి మళ్ళించుకునేందుకు ఖురాన్ చెబుతున్న మార్గాల్ని ఆయన ఎత్తి చూపారు. వెనకట పరాజయం పాలైన భారత రాజ్యాల హిందూ సైనికులు అయితే, మతం మార్చుకోవల్సి రావడమో లేదా మరణానికి సిద్ధం కావడమో జరిగేదని అన్నారు. ఇలాంటి "రికార్డు" ఇప్పటికీ అఫ్ఘనిస్తాన్, ఇరాన్, అల్జీరియా, సౌదీ అరేబియా, పాకిస్తాన్‌లలో కన్పిస్తుందని నాగేశ్వరరావు గారు వివరించారు. మానవహక్కుల విషయంపై ఐ.రా.స. డిక్లరేషన్‌కు ప్రతిగా ఇస్లామిక్ దేశాల కూటమి (OIC) మరో డిక్లరేషన్ రూపొందించిన సంగతిని ఆయన గుర్తు చేశారు. ముస్లింలు అయిన వారికి ఒక రకమైన మానవహక్కులు, అది కాని వారికి మరో రకమైన హక్కులు అవసరమా అని ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

క్రైస్తవం పెట్టిన నిర్భందాల్ని గురించి నాగేశ్వరరావుగారు వివరించారు. తమ మాట విననివారు, చివరకు వాళ్ళు గొప్ప శాస్త్రవేత్తలైనా చర్చి అధికార వర్గం





ముందు హింసలకు లోను కావల్సి వచ్చిందని ఆయన అన్నారు. క్రిష్టియన్, ఇస్లాం అనుయాయుల మధ్య జరిగిన సుధీర్ఘ క్రూసేడుల (యుద్ధాలు) వల్ల రక్తం వరదలై పారిందని నాగేశ్వరరావు చెప్పారు. ఆ మతాల పూర్వ గ్రంథాల్లోని అంశాలు మానవ హక్కుల విషయంలో ఎలాంటి ధోరణిని ప్రదర్శించాయో పేర్కొన్నారు.

మతాల తర్వాత రాజకీయ సిద్ధాంతాల వైపుగా తన ప్రసంగాన్ని కొనసాగించారు నాగేశ్వరరావుగారు. మాజీ సోవియట్ రష్యాలో స్టాలిన్ ఆయన అనుచరగణం ఎలాంటి కమ్యూనిజాన్ని సాధన చేశారో చెప్పారాయన. చుట్టూ, దూరంలోనూ ఉన్న ప్రాంతాల్ని సోవియట్‌లో కలిపేసిన వైనాన్ని గుర్తు చేశారాయన. కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి "ప్రజాశత్రువు" అన్న ముద్రవేస్తే చాలు అతడిని ఖతం జాబితాలో పెట్టిన సోవియట్ తీరును నాగేశ్వరరావు విశ్లేషించారు. కమ్యూనిజం పుణ్యమా అని ప్రజలు తాము జన్మించిన ప్రాంతాల్ని విడిచి పెట్టాల్సి వచ్చింది. 1989లో తియామిన్ స్క్వేర్ సంఘటన చైనా "మానవ హక్కుల " రికార్డును ప్రపంచానికి చాటింది. స్వచ్ఛమైన మతం పేరుతోనో సర్వోత్కృష్టమైన సిద్ధాంతమనే మిష మీదనో ఇప్పటికి రెండు వందల మిలియన్ జనాభా బాధలకు లోనయ్యారని నాగేశ్వరరావుగారు అన్నారు. అటు తర్వాత "వామపక్ష, ప్రజాస్వామ్య, ప్రగతివాద" బృందాల నుండి, క్రిష్టియన్ మిషనరీ ప్రతినిధుల నుండి ఎదురైన అనేక ప్రశ్నలకు నాగేశ్వరరావు జవాబు చెప్పారు.

ఇక అప్పటి నుండీ ఆయనకు ఇబ్బందులెదురయ్యాయి. నాగేశ్వరరావు వ్యవహారాన్ని గురించి ప్రశ్నించాల్సిందిగా కమ్యూనిస్టు పార్టీలు తమ శాసన సభ్యుల్ని పురమాయించాయి. "ఈ పోలీస్ అధికారి ఆర్.ఎస్.ఎస్ సానుభూతిపరుడు. ఇతడు భజరంగదళ్, విశ్వహిందూపరిషత్, భారతీయ జనతాపార్టీల మనిషి, ఇతడొక ఛాందసవాది, లౌకికవాద వ్యతిరేకి. అందువల్ల భారత రాజ్యాంగం పరిధికి లోబడి ప్రవర్తించే అవకాశాలు లేవు. ఇలాంటి పోలీసు అధికారిని ఇక సహించకూడదు. ఆయనపై చర్యలు తీసుకోవాలి" ఇదీ కమ్యూనిస్టు శాసనసభ్యుల గొడవ. కమ్యూనిస్టులూ వారి లౌకికవాద మిత్రులూ ఈ విషయంపై అసెంబ్లీలో కావల్సినంత హడావిడి చేశారు. వెంటనే పర్యవసానాలు బయటకు వచ్చాయి. బెర్హంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ నుండి ఆయనను కటక్ నేర పరిశోధనా విభాగానికి బదిలీ చేశారు. క్రిష్టియన్ మిషనరీలు మరో అడుగు ముందుకేసి సోనియాగాంధీకి

వినతి పత్రాన్ని సమర్పించేందుకు యత్నిస్తున్నారు. దీనితో ఈ పోలీస్ అధికారి భవితవ్యంపై మరిన్ని క్రీనీడలు సోకే అవకాశం ఏర్పడుతోంది.

నాగేశ్వరరావు చట్టాన్ని తు.చ.తప్పకుండా అమలు చేయించే అధికారి. ఒరిస్సాలో అమలవుతున్న చట్టాన్ని అనుసరించి అక్రమ మత పరివర్తనల్ని నిలుపు చేశారాయన. ఒకసారి ఒక గ్రామంలో మత మార్పిడుల కోసం విపరీతమైన ధనాన్ని వెదజల్లుతున్నారన్న ఫిర్యాదు అందుకున్నారాయన. వెంటనే ఆ గ్రామానికి పయనమయ్యారు. ఫిర్యాదులో కావల్సినంత నిజం ఉంది. చట్టం పరిధిలో ఈ మత పరివర్తనల్ని అడ్డుకున్నారాయన. మన కమ్యూనిస్టు సోదరులు ఆయనను హిందుత్వవాది అన్నారు. అయితే అప్పటి ముఖ్యమంత్రికి నాగేశ్వరరావు నిజాయితీ, నిబద్ధతలు తెల్సు. అందుకే ఆయన ఎలాంటి చర్యా తీసుకోలేదు. కానీ ఒత్తిడి పెరగడంతో బదిలీ మాత్రం చేయాల్సి వచ్చింది.

గుజరాత్‌లో క్రిష్టియన్ మిషనరీల మీద దాడులు జరుగుతున్నాయని కథాకథిత లౌకికవాదులు, ఇతర వామపక్షాలు ఘోషలు పెడుతున్నాయి. అక్కడ మిషనరీలు ఎన్నో తప్పుడు ఆశల్ని చూపించి మత మార్పిడుల్ని ప్రోత్సహించాయి. మైనారిటీ ముసుగులో ఎవరి విమర్శలూ రాకుండా తప్పించుకోగలిగాయి మిషనరీలు. ఇదంతా గమనిస్తూ వచ్చిన హిందువులు ఏకమయ్యారు. గుజరాత్ విషయంపై కేంద్రం అంత సున్నితంగా స్పందించాల్సిన అవసరం ఏమాత్రం లేదు. మత పరమైన, రాజకీయ సంబంధమైన "బహుళజాతి" వాదుల ఒత్తిడులకు ప్రభుత్వం లొంగాల్సిన అవసరం లేనే లేదు. వాణిజ్య రంగంలోని బహుళజాతి సంస్థల ముందుగానీ, మత బహుళజాతి వాదుల ముందుగానీ మనం తలవంచాల్సిన అవసరం లేదు. హిందూ మతాన్ని విమర్శిస్తే అది సెక్యులరిజం అవుతోంది. క్రిష్టియన్-ఇస్లాం మతాన్ని దుయ్యబడితే అది మాత్రం సెక్యులర్ వ్యతిరేకత అవుతోంది. బ్రాహ్మణవాదాన్ని గురించి విమర్శలూ, తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయి. ఇదే స్థాయిలో విమర్శల్ని క్రిష్టియన్, ఇస్లామిక్ వర్గాలు, కమ్యూనిస్టు బృందాలు ఎందువల్ల సహించడం లేదు? 'హిందూ వ్యతిరేకతే' సెక్యులరిజంగా మారే అవసరం, అవకాశం రానే రాకూడదు.





# సమాచార సాంకేతిక విజ్ఞానం - పేదరికం

**జనవరి 25 - 31 , 1999**

"ఈనాటి వైజ్ఞానిక సమాజంలో ఇన్ఫర్మేటిక్స్" ("ఇన్ఫర్మేటిక్స్ ఇన్‌ది ఎమర్జింగ్ నాలెడ్జి సొసైటీ") అన్న అంశాన్ని ప్రాతిపదికగా తీసుకొని చెన్నైలో ఉన్న రంగనాథన్ సమాచార అధ్యయనాల కేంద్రం ఒక సెమినార్‌ను నిర్వహించింది. ఈ సెమినార్ జనవరి నాలుగో తేదీన జరిగింది. ఈ సెమినార్‌లో పాల్గొనేందుకు ఎంతోమంది మేధావులు విచ్చేశారు. వీరిలో విశాల దృక్పథంతో ఉన్న వారితోపాటు "వామపక్ష, ప్రజాస్వామ్య, ప్రగతిశీల, లౌకిక, సోషలిస్టు వర్గాలకు" చెందిన మేధావులూ ఉన్నారు. భారతరత్న సి.సుబ్రహ్మణ్యం, సర్ బ్రియాన్ హెల్త్ కూడా సెమినార్‌కు హజరయ్యారు. ఈ సెమినార్‌లో నేను కమ్యూనికేషన్ల రంగంలో వచ్చిన విప్లవం, సమాచార సాంకేతికత (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లపై ప్రసంగించాను. ఒక విస్పష్టమైన లక్ష్యం, సరియైన దృక్పథం ఉంటే రాబోయే శతాబ్దిలో అవి మన దేశానికి ఎలా ఉపయోగపడతాయో వివరించాను. నా తర్వాత వక్త డాక్టర్ విద్యాసాగర్. బెంగుళూరులో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సంస్థకు ఆయన డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన కూడా నేను మాట్లాడిన అంశంపైనే ప్రసంగించారు. "సాఫ్ట్‌వేర్ రంగంలో మనదేశం ఇప్పటికే చక్కని పేరును సంపాదించింది. గట్టిపోటీ దారుగా నిలిచింది. సాఫ్ట్‌వేర్‌తో పాటు ముందుగా, సమాచార సాంకేతికతకు సంబంధించిన మార్కెట్‌లో భారతదేశం తన వంతు భాగస్వామ్యాన్ని సాధించుకునేందుకు కృషి చేయాలి"- అన్నది నా ప్రసంగంలోనూ, డాక్టర్ విద్యాసాగర్ మాటల్లోనూ కన్పించే ఏకరీతి అభిప్రాయం. ఈ దిశలో మనం అన్నిరకాలైన కృషి జరపాల్సి వుంటుంది. అలా అయితేనే, 2000 నాటికి 50 బిలియన్ అమెరికన్ డాలర్లమేరకు మన ఎగుమతుల లక్ష్యం చేరాలన్న ప్రధానమంత్రి ఆశయం వాస్తవ రూపానికి వస్తుంది. సాఫ్ట్‌వేర్ రంగం ఎగుమతులు మన భాగ్యాన్ని పెంచుతాయి. విదేశీమారకం గణనీయంగా ఎదుగుతుంది. ప్రస్తుత వాతావరణంలో మనం తక్షణం కార్యరంగంలోకి దూకాల్సి వుంటుంది. మనతోపోటీ పడుతున్న వారిని తక్కువగా అంచనా వేసేందుకు వీల్లేదు. మనం ఏమాత్రం వెనకబడినా మన అవకాశాల్ని తన్నుకొని పోవడానికి చైనా, ఫిలిప్పీన్స్, ఇజ్రాయిల్, ఐర్లాండ్ సర్వసన్నద్ధంగా ఉన్నాయి. చైనా, ఫిలిప్పీన్స్ ఇంగ్లీషు భాషాపరంగా తమకు ఎదురవుతున్న అవరోధాన్ని అధిగమించేందుకు తీవ్రమైన కృషి చేస్తున్నాయి. అయితే

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వారా వచ్చే భారీ మొత్తాలు ఏవో కొన్ని భారతీయ కంపెనీలకే లాభాలు తెచ్చి పెడతాయి, దీనితో కొద్ది మంది మాత్రమే ధనవంతులవుతారనే అభిప్రాయం లేకపోలేదు. భారతీయ కంపెనీలకు లాభాలు రావడమనేది అవసరమే, అయితే మన ప్రజానీకానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వారా సాధారణ ప్రయోజనాలైనా ఏర్పడటమనేది అంతకన్నా ముఖ్యం. దీనికోసం ఒక చక్కని మార్గం వుంది.

1960 నాటికి ఆరు నుండి పద్నాలుగేళ్లలోపు పిల్లలందరూ పాఠశాలల్లో చేరిపోవాలని రాజ్యాంగ రచనా కాలంలో లక్ష్యంగా పెట్టుకున్నారు. అది జరగనేలేదు. ఏడు పంచవర్ష ప్రణాళికల "సోషలిస్టు నేపథ్యం"లో పరిస్థితులు పెద్దగా మారలేదు. "గరీబీ హటావో" వంటి జనాకర్షక నినాదాల తర్వాత, ఇప్పటికీ దేశంలో అక్షరాస్యత 55శాతం మాత్రమే. అన్ని వర్గాల్లోనూ ఇదే మోస్తరు అక్షరాస్యత లేదు. ముస్లిం మహిళలు, ఆదివాసీ తెగల్లో అక్షరాస్యత పదిహేను శాతాన్ని మించలేదు. అయితే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీవల్ల అక్షరాస్యత వ్యాప్తిని సాధించవచ్చు. అంతేకాదు విద్యా ప్రమాణాల్లో మెరుగుదలను పెంపొందించవచ్చు. ప్రస్తుత పద్ధతుల్ని అనుసరించి పిల్లలకు ఉపాధ్యాయులు చదువు చెబుతున్నారు. అయితే పిల్లలు ఉపాధ్యాయుల బోధనల్ని పూర్తిగా తలకు ఎక్కించుకుంటున్నారా అన్నది అనుమానమే. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయంతో ఈ ధోరణిని మార్చవచ్చు. కంప్యూటర్ డివైజ్‌ను ఊతంగా తీసుకొని విద్యార్థి తనకు తానే నేర్చుకోగలుగుతాడు. ఇంటర్‌నెట్ విధానాన్ని పాఠశాల, కళాశాల, గ్రంథాలయాలతోపాటు ఇళ్ళలో కూడా ఉపయోగించుకోవచ్చు. ఇందుకొరకు పర్సనల్ కంప్యూటర్‌లు, ఇంట్లో కేబుల్ టీవి సౌకర్యం లేదని బాధపడాల్సిన పని లేదు. ఇప్పటి నుండి పబ్లిక్ టెలిఫోన్ బూతుల్ని ప్రభుత్వం "పబ్లిక్ టెలిఇన్ఫర్మేషన్ సెంటర్లు"గా మార్చాలని నిర్ణయించింది. వీటిలో మల్టీమీడియా పర్సనల్ కంప్యూటర్లతో పాటు ఇంటర్‌నెట్ కనెక్షన్ కూడా వుంటుంది. డెస్క్‌టాప్ వీడియో కాన్ఫరెన్సింగ్‌ను సైతం జత చేస్తారు. భారత ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పాలసీని అక్షరాలా పాటించేందుకు ఆంధ్రప్రదేశ్ సర్కార్ యత్నిస్తోంది. అక్షరాస్యత విస్తరణ, విద్యా ప్రమాణాల పెరుగుదల ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రధాన లక్ష్యాలు. సమాచారాన్ని ఎన్నో వాల్యూమ్‌ల రూపంలో సృష్టించడం జరుగుతుంది. దీన్ని ప్రపంచ వ్యాప్తమైన వెబ్ ద్వారా ఇంటర్నెట్‌లో ప్రసారం చేస్తారు. ఇంటర్‌నెట్‌లో ప్రసారమయ్యే విజ్ఞానం దాదాపు అన్నిరకాలైన సైన్స్ జర్నల్స్ నుండి క్రోడీకరించబడి





వుంటుంది. ఎవరు ఎలాంటి సమాచారాన్ని పొందాలన్నా సులువుగా దాన్ని గ్రహించవచ్చు. ఇంటర్‌నెట్ ద్వారా లభించే సమాచారం చాలా తక్కువ ధరలోనే అందాలని భారత ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ మేరకు ఇంటర్నెట్ పై లైసెన్స్ నిబంధనల్ని తొలగించింది.

**ఈ దశలోనే...**

హిందూలో సంపాదకీయాలు రాసే ఇద్దరు "వామపక్ష, ప్రజాస్వామ్య, ప్రగతిశీల, లౌకికవాద, సోషలిస్టు" మేధావులు తమ చర్చను లేవదీశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అన్నది కొన్ని వర్గాల వారికి మాత్రమే అందుబాటులో వుండేదని వాదించారు. అది దేశంలోని సగటు మనిషి సమస్యలను పరిష్కరించడంలో ఏ మాత్రం సహకరించదనేది ఆ ఇద్దరు మేధావుల వాదన. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోసం ప్రభుత్వాలు వెచ్చిస్తున్న సొమ్ము కలవారికీ, లేనివారికీ మధ్య దూరాన్ని పెంచుతుందని ఈ మేధావుల అభిప్రాయం. బాగా డబ్బు ఉన్నవాళ్ళు మాత్రమే ఇంతకుముందు వివరించిన ఇంటర్‌నెట్ పద్ధతి ద్వారా విద్యార్జన చేయగలుగుతారనే అంచనాకు వచ్చారు ఈ మేధావులు ఇద్దరూ. ఈ దశలో నేను జోక్యం చేసుకున్నాను. నా వాదనల్ని బలంగా విన్పించే ప్రయత్నం చేశాను. "స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో మన జనాభా నాలుగు వందల మిలియన్లు. వీరిలో డెబ్భైశాతం మంది పేదలు. వీళ్ళంతా కలిపితే రెండువందల ఎనభై మిలియన్ల దాకావుండవచ్చు. ప్రస్తుతం మన జనాభా వంద మిలియన్లు. ఇందులో నలభై శాతం బీదవాళ్ళే. అంటే స్వాతంత్ర్యం నాటికన్నా ఈ రోజు మన దేశంలోని పేదల జనాభా ఎంతో పెరిగిందన్నమాటే" అన్నాను నేను. 1991 దాకా మనం సోషలిస్టు తరహా పంచవర్ష ప్రణాళికల్ని అమలుపరిచాం. ఇవన్నీ నెహ్రూ మార్గంలో ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకికవాద భావజాలంతో సాగినవే. బీదల పాలిటి పెన్నిధిగా చెప్పుకునే ఇందిరాగాంధీ 1969లో పాత పద్ధతులతో ఉన్న వృద్ధ కాంగ్రెస్ నేతల్ని కాంగ్రెస్ నుండి బయటకు తరిమారు. కొత్త తరహా ప్రగతివాద, సోషలిస్టు విధానాల్ని అమలు పర్చి, భారతదేశం నుండి పేదరికాన్ని తరిమేందుకే పాత ఆలోచనలున్న కాంగ్రెస్ వాదుల్ని పార్టీ నుండి పంపించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చుకున్నారు. బ్యాంకుల్ని జాతీయం చేశారు. రాజభరణాలు రద్దయ్యాయి. అన్నిచోట్లా అట్టహాసంగా అప్పుల జాతరల్ని ఏర్పాటుచేసారు. ఇవన్నీ "వామపక్ష, ప్రగతిశీల, లౌకికవాద, సోషలిస్టు" ఆర్థిక సిద్ధాంతవేత్తలు, మేధావుల

భాగస్వామ్యంతోనే జరిగాయి. సంక్షేమ పథకాలు, సబ్సిడీల వెల్లువలు ఉన్నప్పటికీ, నాలుగున్నర దశాబ్దాల నెహ్రూ, ఇందిరా సామ్యవాద పంచవర్ష ప్రణాళికల కాలంలో పేదల సంఖ్య పెరిగింది. నిరక్షరాస్యతా అలాగే ఎదిగింది. ఇప్పటికీ అప్పటికీ అలాంటి ఆలోచనా ధోరణి ఉన్న వారే మనకు కన్పిస్తున్నారు. వీళ్ళు జనాభా పెరుగుదలను గురించి మాత్రం అసలు ప్రస్తావించరు. ఇది పేదవారిలో మరింతగా కన్పిస్తున్న సంగతిని తెలియజేయరు. వారిలోనే నిరక్షరాస్యత అధికంగా ఉంటోందన్న వాస్తవాన్ని గుర్తించరు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అక్షరాస్యతా వృద్ధికి ఉపకరణంగా పనికొస్తుందనే సత్యాన్ని అంగీకరించరు. నిజానికి ఈ మేధావి వర్గం మన ప్రజానీకానికి అందించే ప్రత్యామ్నాయ వసతులేమిటి? వీళ్ళ ప్రభుత్వం ఇప్పటికీ రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నారా? కొన్ని మిలియన్ల నిరుద్యోగులు ఉన్న నేటి పరిస్థితుల్లో వివాహాలు ప్రభుత్వం వారి ఖర్చుతోనే సాగాలనీ, వృద్ధాప్య పించన్‌లు అమలు చేయాలనీ ఈ తరహా మేధావులు కోరుకుంటున్నారా? ప్రజలు అక్షరాస్యులు కాని చోట, తమ ఉపాధికి స్వయంగా మార్గాలు వెతుక్కోలేని చోట, ఈ తరహా సంక్షేమం వల్ల ఉపయోగాలేమిటి? ముందు ప్రస్తావించిన ఇద్దరు మేధావుల్లాంటి వాళ్ళు మానవ హక్కుల్ని గురించి మాట్లాడుతూ వుంటారు. పని హక్కు, గృహ వసతి, విద్య ఇంకా సమాచార హక్కు, పేదల పట్ల శ్రద్ధ...ఇలా ఎన్నో చెబుతారు. ఈ మేధావుల "తాత్విక ధోరణి" ఒక్కటే. "పేదలారా మీరంతా ఇలా తింటూ కాలం గడపండి. మిమ్మల్ని ప్రజాస్వామ్య వ్యతిరేక, తిరోగమన, లౌకికేతర, సోషలిస్టు వ్యతిరేక, రియాక్షనరీ వర్గాల్ని ఎదుర్కొనే దిశలో మేం ఉపయోగించుకుంటాం" ఇదే వాళ్ళ తాత్విక పునాది. "దేశంలో అక్షరాస్యతా వృద్ధి కోసం మీరు చూపించే సమగ్రమైన కార్యక్రమాలేవి దయచేసి చెప్పండి" అని నేను పై మేధావుల్ని కోరుతున్నాను.. విద్యా ప్రమాణాల ఎదుగుదల కోసం వీళ్ళు చేస్తున్న కృషిని గురించి ప్రశ్నించాల్సి ఉంటుంది. తమ పొట్టపోసుకునే దిశలో ప్రజానీకానికి అవసరమయ్యే విధానాల్ని రూపొందించగలరేమోనని ప్రశ్నించాలి. లేదంటే వీరు పేదరికాన్ని, పేదల్ని గురించి శుష్కవచనాలు పలకడం దండుగ. ప్రభుత్వమే సకల బాధ్యతల్ని స్వీకరించాలని చెప్పే మేధావుల మాటల్లో పసలేదు. పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే అమలయ్యే పథకాల వల్ల అసమర్థత, అవినీతి పెరిగిపోతాయని మన నాలుగున్నర దశాబ్దాల అనుభవాలు స్పష్టం చేశాయి. జనాభా పెరుగుదలను నియంత్రించకపోతే, అక్షరాస్యతను, విద్యా ప్రమాణాల్ని వృద్ధి చేయకపోతే పేదరిక





నిర్మూలన అన్నది సాధ్యంకాదు. "మేధావు"లూ వీరితోపాటు సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు, రాజకీయ నాయకులు, బాధ్యత కలిగిన పౌరులు ఇలా అందరూ నిరక్షరాస్యులైన పేద ప్రజానీకానికి చిన్న కుటుంబాల ఆవశ్యకతను గురించి విశదీకరించాలి. పిల్లల్ని పాఠశాలలకు పంపించే క్రమంలో ప్రోత్సాహాన్ని అందించాలి. అక్కడ పనిచేసే ఉపాధ్యాయుల్లో తామేదో నిరుద్యోగాన్ని దాటుకున్నామనే దిగ్భ్రాంతితోకాక, పిల్లల్ని విద్యావంతుల్ని చేసే ఉద్దేశ్యంతోనే పనిచేస్తున్నామన్న భావనను పెంపొందించాలి.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తక్కువ ఖర్చుతో కూడుకున్నదే. దీనితో వచ్చే ప్రయోజనాలు మాత్రం భారీ స్థాయిలోనే ఉంటాయి. విద్యా ప్రమాణాలు పెరుగుతాయి. పారదర్శకమైన, సమర్థతతో కూడుకున్న, తక్కువ ఖర్చు కాగల సర్కారును నిర్వహించడంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. గతంలో కంప్యూటర్ ప్రవేశాన్ని ఆరంభదశలోనే వ్యతిరేకించిన రైల్వేలు, బ్యాంకుల అనుభవాల్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలి.

మేధావి వర్గం పేదరికాన్ని పేదల సాధక బాధకాల్ని గురించి లీటర్ల కొద్దీ కన్నీరు కార్చే బదులు వారిలో విద్యావ్యాప్తిని, కుటుంబ నియంత్రణపై స్పృహను పెంపొందించడం అవసరం. మేధావి బృందాలు సమర్థతనూ, సాంకేతికతనూ వ్యతిరేకించే సంప్రదాయాన్ని తొందరగా విడిచిపెడితేనే మంచిది.

**ఆ. హరుఁడు గళమునందు హాలాహలము వెట్టఁ**
**గప్ప గలిగి తొడవు కరణి నొప్పె**
**సాధురక్షణంబు సజ్జనునకు నెన్న**
**భూషణంబు గాదె భూవరేంద్ర!**

శ్రీమదాంధ్ర మహాభాగవతం అ.స్క

పరమశివుడు కంఠమందు హాలాహలాన్నుంచుకుంటే చూసేవారికది ఆభరణంలా కన్పిస్తుంది. పరోపకారం చేసే సజ్జనునికి ఆ గుణమే భూషణం కాదా!

# టెలికం అథారిటీ - టెలికం ధరలు

**ఫిబ్రవరి 1 - 7 , 1999**

టెలికం సేవలకు సంబంధించిన అద్దెల్ని, ఇతర ఛార్జీల్నీ పెంచాలని "టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా" (టి.ఆర్.ఏ.ఐ) నిశ్చయించినట్లు కన్పిస్తోంది. ఇలా అథారిటీ నిశ్చయించడానికి ఖర్చులకు తగినట్టు ధరలు ఉండాలన్న సూత్రమే దీని వెనుక పని చేసింది. ఈ విషయం మీద ఎవరికీ సందేహాలు ఉండాల్సిన అవసరం లేదు. కానీ "ఇంతకీ ఆ ఖర్చులు ఏమిటి? ఖర్చులకు ఎవరు కారణం? వీటివల్ల అన్ని రకాలైన టెలిఫోన్ సేవలపై వడ్డింపులు అవసరమేనా?" మనకు స్థిరమైన టెలిఫోన్ పద్ధతులున్నాయి. స్థానిక, దేశీయమైన, దూరప్రాంత, అంతర్జాతీయ టెలిఫోన్ సేవలు ఈ పరిధిలో చేరతాయి. ఇవి కాకుండా మొబైల్ టెలిఫోన్ పద్ధతులున్నాయి. రేడియో పేజర్, ఇంటర్‌నెట్, ట్రంక్ ప్రైవేట్ మొబైల్ రేడియో, గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్ సర్వీస్ (జి.ఎం. పి.సి.ఎస్) తదితర పద్ధతులు మొబైల్ టెలిఫోనింగ్ పరిధిలోనివి. వీటిల్లో చాలా అంశాలు ఒకే రకమైన అంతర్నిర్మాణ వ్యవస్థతో సాగుతాయి. ఎక్కువగా స్విచ్ ట్రాన్సుపోర్టులే పై సర్వీసుల అంతర్నిర్మాణ వ్యవస్థ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)లో వాడతారు. టెలిఫోన్ సర్వీసుల్ని విభిన్న తరహాలకు చెందినవారు వినియోగించుకుంటున్నారు. వ్యాపార-వ్యాపారేతర వర్గాలు, గ్రామీణులు, పట్టణవాసులు, భద్రతా బలగాలు, ఇంకా సామాజిక సంస్థలు, ఇలా ఎందరో వినియోగదారులు ఉన్నారు. సామాజిక అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని పై వర్గాల్లో కొంతమందికి చాలా తక్కువ ఖర్చులోనే టెలిఫోన్ సర్వీసుల్ని అందించాల్సింది. టెలికమ్ విభాగం (డి.ఒ.టి)లో విశేష అనుభవమున్న చాలామంది నిపుణులతో పాటు నేను కూడా ఈ మేరకు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా వారికి విన్నపాలు చేసుకున్నాము. అథారిటీ క్రమం తప్పకుండా చేస్తున్న పొరపాట్లు ఇలా ఉన్నాయి. ఈ జాబితాను చూడండి.

❖టెలికాం సేవలకు ఖర్చు కారకులెవరన్నది పరిశీలించకుండా అందరికీ సమానమైన అద్దెల్ని (రెంటల్స్) వడ్డించాలన్న నిర్ణయం. వ్యాపార రంగంలో టెలికాం వ్యవస్థ ఉపయోగాలు ఎక్కువ. దీనికోసం అంతర్గత నిర్మాణం కూడా పెద్ద మొత్తంలో ఉపకరణాలు కావాలి. అందువల్ల వ్యాపార రంగంలోని వినియోగదారులకు మిగతావారి కన్నా ఎక్కువ అద్దె వసూలు చేయాలి. యావత్ప్రపంచంలోనూ





పాటిస్తున్న పద్ధతి ఇది. ఇంతకీ ఎవరిని వ్యాపార వర్గాలుగా వర్గీకరించాలి? అన్న అనుమానం వస్తే దానికొక కొలమానం పెట్టుకుంటే సరిపోతుంది. 400 టెలిఫోన్ కాల్స్ కన్నా ఎక్కువ (తమ రెండు నెలల బిల్లులో) ఉపయోగించుకునే వారిని వ్యాపార వర్గంలో చేర్చితే సరిపోతుంది.

❖ఛార్జి లేకుండా చేసుకోగలిగే కాల్స్ సంఖ్య 150 నుండి 120కి దించాల్సిన అవసరం లేదు. అలాగే ఛార్జి తీసుకునే కాల్స్ సమయాన్ని ఐదు నిమిషాల నుండి మూడు నిముషాలకు తగ్గించకూడదు. అమెరికా లాంటి కొన్ని దేశాల్లో లోకల్ కాల్స్ విషయంలో ఖచ్చితమైన సమయం అంటూ ఉండదు. అలాగే లోకల్ కాల్స్‌కి ఛార్జీ విధింపు సైతం ఉండదనే నిజాన్ని ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి.

❖గ్రామీణ వినియోగదారుల అద్దెను పెంచాల్సిన అవసరం కూడా లేదు.

❖ఒక్క యూనిట్ కాల్‌కి 1.30 పైసలు చేయడం చాలా ఎక్కువ. ఇది ఒక్క రూపాయి దగ్గరే ఉండాలి.

టెలిఫోన్ సర్వీసులు అన్ని చోట్ల అందేందుకు, వినియోగదారులకు అందుబాటులో ఉండే ఛార్జీలతోనూ ఏర్పడేందుకు "నేషనల్ టెలికం పాలసీ"ని తయారు చేయడం జరిగింది. వినియోగదారుల సౌకార్యార్థం టెలిఫోన్ రంగంలో గుత్త పెత్తనం పోవాలన్నది కూడా పాలసీలో ప్రధానాంశం. ఈ ప్రాథమిక లక్ష్యాల్ని టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా గుర్తుంచుకోవాలి. టెలికం కంపెనీల ఖర్చుల్నీ భర్తీ చేసుకునే ద్రవ్యాన్ని ఎలా సాధించి పెట్టాలో? అన్నది మాత్రమే కాదు, టెలికాం పాలసీ లక్ష్యాన్ని, వినియోగదారుల బాగోగుల్ని కూడా ఆలోచించాలి. ప్రస్తుత టారీఫ్ స్థాయిల్ని బట్టి చూస్తే టెలికాం విభాగానికి 45శాతం అదనపు రెవెన్యూ ఏర్పడుతుంది. ఎస్.టి.డి, ఐ.ఎస్.డి అద్దెల్ని, ఛార్జీల తగ్గింపును తక్షణమే అమలు చేయాలి. గతంలోనే టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఈ విషయాన్ని ప్రతిపాదించింది. ఇలాంటి తగ్గింపులు టెలికాం విభాగానికి చెందిన అదనపు రెవెన్యూ దుర్వినియోగం కాకుండా నిలుపుతాయి. నిజానికి అద్దెల్ని, లోకల్ కాల్స్‌నూ పెంచాలని టెలికాం విభాగం కూడా ఒత్తిడి చేయడం లేదు. ప్రైవేటు టెలికామ్ కంపెనీ (పి-టెల్‌కో) వారు వినియోగదారుల వడ్డింపులతో టెలికాం అథారిటీ చేసిన ప్రతిపాదనలకు సంతోషిస్తాయి. లైసెన్స్ ఫీజుల ఖర్చు కోసం అవి భారీ స్థాయి రేట్లను కోరుతున్నాయి. టెలికాం డిపార్ట్‌మెంట్ (డి.బి.టి) వినియోగదారులకు లేని

ఫీజుల భారం పి.టెల్కో వినిమయదారులు ఎందుకు భరించాలి? అథారిటీ పి.టెల్కో లైసెన్సు ఫీజుల ఖర్చుల్ని అంగీకరించకూడదు. దీనివలన ప్రభుత్వంపై లైసెన్స్ ఫీజు ఇష్యూల మీద ఒత్తిడి పెరుగుతుంది. అథారిటీ వినియోగదారుల ప్రయోజనాల్ని కాపాడాలి. అది ఆపరేటర్ల ప్రయోజనాల్ని మాత్రమే కాపాడేదిగా ఉండకూడదు.

భారతదేశంలోనూ, విదేశాల్లో కూడా టెలికం ఉపకరణాల ధరలు తగ్గుతున్నాయన్న విషయాన్ని టెలికం అథారిటీ ఆఫ్ ఇండియా గుర్తుకు తెచ్చుకోవాలి. ఎలక్ట్రానిక్ స్విచ్‌ల ధరలు సగానికి సగం పడిపోయాయి. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ధరలు 40 శాతం దాకా తగ్గుముఖం పట్టాయి. కాపర్ కండక్టర్ కేబిల్ ధరలైతే 25 శాతం తగ్గాయి. సెల్యూలర్ మొబైల్ ఉపకరణాల ధరలు 30శాతం తగ్గాయి. టెలిక సర్వీసు రంగంలో పోటీ కారణంగా ప్రతి ఏటా ఖర్చులు 10 శాతం నుండి 12 శాతం దాకా తగ్గిపోతున్నాయి. సులువుగా సాధ్యమయ్యే తగ్గింపుల కోసం భారతీయ వినియోగదారు ఎదురు చూస్తున్నాడు. అథారిటీ పుణ్యమా అని, సరళీకరణ, కొత్త టెలికాం విధానాలతో ధరలు పెరిగితే అంతకన్నా హాస్యాస్పదమైన అంశం మరొకటి ఉండదు. టెలికాంలో గుత్త పెత్తనాన్ని నిరోధించాలనుకుంటున్న డి.ఒ.టి చేతులు ముడుచుకొని కూర్చోక తప్పదు. సరళీకరణ వల్ల ఏర్పడుతున్న అధిక ఖర్చుల నుండి తమను తాము రక్షించుకునేందుకు వినియోగదారులు రాజకీయ (పార్లమెంటు) జోక్యాన్ని కోరాల్సి వస్తుంది. పర్మిట్– లైసెన్స్– కోటా జాప్యాల వల్ల కాకుండా కార్పొరేట్ వర్గాల ఆదాయం పన్ను వల్లనే ప్రజా ధనానికి ప్రయోజనం సమకూరాలి.

**ఎంత చదువు చదివి, ఎన్నెన్ని నేర్చినన్**
**కోపముడుగకున్న, అన్ని సున్న**
**ఫణిరాజు శిరమున మణియున్న ఫలమేమి?**
**మంచి మాట వినర మానవుండ!**





# చైనీయుల ఆత్మాభిమాన గర్వం

**ఫిబ్రవరి 8 - 14 , 1999**

అది హవాయిలోని హోనలులు. జనవరి 17 నుండి 20వ తేదీ దాకా అక్కడ పసిఫిక్ టెలికమ్యూనిటీ (పి.టి.సి) వార్షిక సమావేశాలు జరిగాయి. పాల్గొన్న ప్రతినిధుల సంఖ్య 1500. వారంతా ఇంగ్లీషులోనే మాట్లాడారు. అయితే ఒక్కరు మాత్రమే మినహాయింపు. ఆయన చైనా రాజధాని బీజింగ్ మున్సిపల్ సర్కారు వారి సలహాదారైన జెంగ్‌యూ జింగ్. ఆయన చైనా పీపుల్స్ రిపబ్లిక్ ప్రతినిధి హోదాలో హోనలులు సమావేశాల్లో పాల్గొని ప్రసంగించారు. నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే, ఆయన ప్రసంగాని కన్నా కొద్ది నిముషాల ముందే మేమిద్దరం కలిసి ఇంగ్లీషులో పిచ్చాపాటి మాట్లాడుకున్నాం. కానీ వేదిక పైకి వెళ్ళగానే జెంగ్ యూజింగ్ తీరు మారింది. ఆయన తన ప్రక్కనే ఓ ఇంగ్లీషు వ్యాఖ్యాతను పెట్టుకొని మరీ భాషలో మాట్లాడసాగారు. ఎక్కడా తొట్రు పడకుండా, చక్కని విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ సాగింది జెంగ్ యూజింగ్ ఉపన్యాసం. ప్రసంగం చివర ఆయనతో ఇంగ్లీషులో మాట్లాడించాలన్న కుతూహలంతో నేను కొన్ని ప్రశ్నలు వేశాను. అయితే ఆయన వాటిని చైనీస్ భాషలోనే జవాబు చెప్పారు.

టెలికమ్యూనికేషన్స్ రంగంలో గుత్తాధిపత్య విధానాలు సృష్టించే విష ధోరణుల్ని గురించి చెబుతూ దానిలో పోటీతత్వం ఉండాల్సిందేనని గట్టిగా అభిప్రాయ పడ్డారు. ఈ మేరకు ఆయన తన వాదనకు అనుగుణంగా పలు గణాంక వివరాల్ని సైతం అందించారు. చైనాలో టెలికం రంగంలో పోటీ ఉందట. అదే ప్రభుత్వ అధీనంలోని రెండు సంస్థల మధ్యే స్పర్థ నడుస్తోందట. పోటీ సంస్కృతి వచ్చిన తర్వాత టెలికాం రంగంలో నాటకీయమైన ప్రగతి కన్పించిందని అన్నారు జెంగ్‌యూజింగ్. ఇప్పటికీ ఆ దేశంలో వంద మిలియన్ టెలిఫోన్‌లు ఉన్నాయని చెప్పారాయన. ఇది 2001 నాటికి 180 మిలియన్లకు చేరుకుంటుందని అన్నారు జెంగ్. ఈ సంఖ్య ప్రపంచంలోని మరే దేశంలోనూ ఉండదు. అలాగే అక్కడ మొబైల్ టెలిఫోన్ల సంఖ్య ఇప్పటికి ఇరవై మిలియన్లు. ఇది 2001 నాటికి 36 మిలియన్ల దాకా పోతుందట. అక్కడ ఒక ఏడాది క్రితమే ఇంటర్‌నెట్ సర్వీసులకు గుత్తాధిపత్యం నుండి విముక్తిని కలిగించారు. ఈ విభాగంలో గణనీయమైన ఎదుగుదల

కన్పిస్తోందట. ఏడాదిలోనే ఇంటర్‌నెట్‌ను ఉపయోగించే చైనీయుల సంఖ్య పదిరెట్లు పెరిగిందని వివరించారు జెంగ్. అప్పటికే పునాదులతో ఉన్న ప్రభుత్వ రంగ చైనా టెలికాం సంస్థ తన ప్రత్యర్థి లియన్ టెంగ్‌ను వెనక్కి నెట్టేందుకు శత విధాలా యత్నిస్తోందని జెంగ్ వివరించారు. అప్పుడు నాకొక ప్రశ్న అడగాలన్పించింది. “మా భారతదేశంలో ఉన్నట్టు కాకుండా మీ చైనాలో ఏక పార్టీ వ్యవస్థ కొనసాగుతోంది. మీలాంటివారు ప్రైవేటీకరణ, పోటీ వాతావరణం వల్ల సత్ఫలితాలు వస్తాయని భావిస్తే ఈ మేరకు మీరెందుకు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు? పూర్తి స్థాయి ప్రైవేటీకరణ, సరిహద్దులు దాటిన పోటీని మీరెందుకు వ్యతిరేకిస్తున్నట్టు కన్పిస్తారు?’ అని అడిగాను నేను. ఆయన దీనికి సమాధానం చెప్పారు. చైనా కమ్యూనిస్టు పార్టీలో మూడు తరాలకు చెందిన నాయకులున్నారు. వీరిలో వృద్ధ తరం సరళీకరణకు పూర్తి విరుద్ధంగా ఉంటారు. ప్రభుత్వం చెప్పుచేతల్లోనే అన్నీ కొనసాగాలంటారు. ఇక మధ్యంతరం అంటే 1949 తర్వాత జన్మించిన వారు సరళీకరణ కావాలంటారు. అయితే ఈ విషయంపై సకల జాగ్రత్తలు అవసరమని చెబుతూ ఉంటారు. ఇక ముప్పై ఏళ్ళ లోపువారంతా మూడోతరం. అంటే నవతరం. వీళ్ళు సరళీరణ, ప్రైవేటీకరణ, విదేశీ పెట్టుబడుల్ని నెట్‌వర్క్, సర్వీసుల రంగంలోనూ ఆహ్వానిస్తారు. అక్కడ ఒక పార్టీ వ్యవస్థనే చెలామణిలో ఉన్నప్పటికీ మూడు రకాలైన అభిప్రాయాలు ఉంటాయని జెంగ్ విశ్లేషించారు. వాళ్ళలో వాళ్ళకు విభేదాలు ఉండవచ్చు కానీ, వ్యవస్థను అస్థిరపరచే ఎలాంటి చర్యకూ ప్రయత్నించరని జెంగ్ వివరించారు. అందువల్ల “మేం మా అభిప్రాయాల్ని స్వేచ్ఛగా వెల్లడిస్తాం, కానీ ఏకాభిప్రాయ ప్రాతిపదికగానే అందరం కలిసి ముందుకు నడుస్తాం”అని వ్యాఖ్యానించారు జెంగ్. ఇదంతా చైనీస్ భాషలోనే చెప్పారాయన, అయితే ఇంగ్లీషు అనువాదకుడు ఉన్నారనుకోండి, అది వేరే విషయం.

కొద్దిరోజుల తర్వాత నేను విల్మింగటన్‌లో ఉన్న కార్నింగ్ ఫ్యాక్టరీకి వెళ్ళాను. నార్త్ కరోలినా (అమెరికా)లోని ఈ ప్రాంతానికి ఆప్టికల్ ఫైబర్స్‌లో అత్యాధునిక అభివృద్ధిని అధ్యయనం చేసేందుకు వెళ్ళాను. అదేరోజు ఒక చైనీస్ బృందం కూడా విల్మింగ్‌టన్ ఫ్యాక్టరీకి వచ్చింది. అక్కడ సందర్శకుల రిజిస్టర్‌ను ఏర్పాటు చేశారు. నేను ఇంగ్లీషులో సంతకం చేశాను. మా తర్వాత చైనీస్ సంతకాలు చేశారు. వాళ్ళు ఇంగ్లీషులో కాదు తమ స్వభాషలోనే సంతకాలు చేశారు.





నా దేశ ప్రజలకు నేనేందుకు ఇవన్నీ వివరిస్తున్నానంటే, జాతీయ భావన, స్వీయ భాషల పట్ల అనురాగం చెత్త విషయాలు కాదని చెప్పేందుకే. ఇవన్నీ హిందూ మతోన్మాదమో, ఛాందసవాదమో కానే కాదు. చైనీయులు తమ నేలను, భాషనూ, జాతినీ, అది అందించిన వారసత్వాన్ని చూసి గర్విస్తారు. ఎక్కడికెళ్ళినా తమ జాతీయ వైభవాన్ని చెప్పుకునేందుకు ఇష్టపడతారు. “బీదరికం– వెనకబడినతనం” స్వతంత్రమైన గుర్తింపునకూ, దేశభక్తికీ అడ్డంకులు కావు. అమెరికా అధ్యక్షుడు క్లింటన్ భారత పర్యటన జరపలేదు. కానీ వివాదాస్పదమైన మానవహక్కుల రికార్డుతోనూ, ప్రజాస్వామ్యానికి ఆమడల దూరంలోనూ ఉన్న చైనాను మాత్రం సందర్శించాడు. చైనాలో విద్యార్థుల ఊచకోతకు సంబంధించిన తియమిన్ స్క్వేర్ ఘటన జరిగింది, ఇది అందరకీ తెలిసిందే. ఒకప్పటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ చైనా వెళ్ళాడు కానీ అక్కడి అధ్యక్షుడు మావో మాత్రం అమెరికా వెళ్ళనే లేదు. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, తైవాన్ దేశాలు యావత్ చైనాలోనూ తమదే అసలు సిసలైన సర్కారు సాగాలని వాదిస్తాయి. ఇవి రెండూ ఒకదానితో ఒకటి విభిన్నంగా వ్యవహరిస్తాయి. కానీ తాము రెండు విభిన్న దేశాలము కామని మాత్రం చెబుతూ ఉంటాయి. హాంకాంగ్, తైవాన్, మకోవోలు కలిసి ఒకే సమిష్టి ప్రాంతమనీ, తమ దేశం విడిపోగూడదనీ వాంఛిస్తాడు చైనీయుడు. అమెరికాతో సహా ప్రపంచమంతా చైనాను గౌరవిస్తుంది. అదే అమెరికా భారతదేశానికి చెందిన ఇంజనీర్లనూ, శాస్త్రవేత్తల్నీ అలాగే సాఫ్ట్‌వేర్ నిపుణుల్ని, ఆర్థిక శాస్త్రవేత్తల్ని, తత్వవేత్తల్ని ఆదరిస్తుంది. కానీ భారత ప్రభుత్వాన్ని మాత్రం గౌరవించదు. మన జాతి, సంస్కృతి, మతము, నాగరికత– వీటిని గురించి మనమే సిగ్గుపడుతుంటే ఇక మిగతా వారెందుకు మనల్ని గౌరవిస్తారు? మనది పేదదేశం మాత్రమే కాదు, మనం రాజకీయ లేదా సాంస్కృతిక పరమైన రుద్దుబాటు జరపని దేశం కూడా. ఉమ్మడి కమ్యూనిటీకి చెందినవారమని సగర్వంగా ప్రకటించుకునే వారికోసం, వారి ఓటు బ్యాంకు కోసం మనం హిందూ వ్యతిరేక “సెక్యులరిజాన్ని” స్వీకరించాం. చైనాకు 60 బిలియన్ అమెరికా డాలర్ల వాణిజ్య మిగులు ఉంది. చైనాలో తయారైన ఎలాక్ట్రానిక్, ఎలక్ట్రిక్ వస్తువులు అమెరికా సైతం ప్రశంసించే స్థాయిలో ఉంటున్నాయి. అలాగే అక్కడ తయారయ్యే వస్త్రాలు కూడా. అయితే భారతీయ వస్తుసామాగ్రికి అటు నాణ్యత విషయంలో కానీ అటు ధరలపై కానీ సరయైన గుర్తింపు లేదు. అవి అమెరికా మార్కెట్‌లలో అసలు కన్పించవు. భారతదేశపు సంకేతిక, నిర్వహణాపరమైన నిపుణులు

అక్కడ గౌరవాన్ని పొందుతున్నారు. అయితే మన దేశం వారి దృష్టిలో అవినీతి మయమూ, బ్యూరోక్రసీ బంధనాల్లో చిక్కుకుని నిర్ణయ రాహిత్యంగా ఉండే దేశమే. చైనా దృష్టిలో భారతదేశం సైనికపరంగా బలహీనమైనదే. అంతేకాదు, తమ స్వీయ సంస్కృతీ నాగరికతల్ని గౌరవించని దేశంగా కూడా వారు మనల్ని గుర్తిస్తారు. ఒకవేళ మేము భారతదేశం కన్నా పేదరికంలో ఉన్నప్పటికీ, విదేశీ శక్తుల ముందు తలవంచే వాళ్ళము కాదని అంటారు చైనీయులు.

అదే భారతదేశం మాత్రం వేర్పాటు విభజన వాదులతో నిండిపోతోందని అంటుంటారు చైనీయులు. తమ దేశంలో టిబెట్‌లోని బౌద్ధ వేర్పాటువాదుల్ని, నైరుతి చైనాలోని తియాన్ ముస్లింలనూ కఠినంగా అణచివేసిన తీరును గుర్తుకు తెస్తారు చైనీయులు. చైనా మాజీ సోవియట్ యూనియన్‌తో సంఘర్షించింది, అయినా తన పునాదుల్ని పదిలంగా కాపాడుకుంది. చైనా వియత్నాంపై (1976లో) దారుణమైన దాడులు చేసింది. సోవియట్‌కు అనుబంధంగా మారుతున్న వియత్నాం వైఖరి తమను ఆ చర్యకు పురికొల్పిందని చైనా చెబుతుంది. అదే భారతదేశం విషయంలోనైతేనే, మన ఇరుగు పొరుగు దేశాలే మనల్ని అవమానించే ప్రయత్నాలు చేస్తున్నాయి. దానికి కారణం మన చేతకానితనం, ఆత్మవిశ్వాస రాహిత్యం, జాతీయతా భావలేమి, ఇకనైనా మనం పాఠాలు నేర్చుకుంటామా?

**క. అడిగెద నని కడువడిఁ జను,**
**నడిగిన దను మగుడ నుడుగఁ డని నడ యుడుగున్**
**వెడ వెడ సిడిముడి తడఁబడ,**
**నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్**

శ్రీమదాంధ్ర మహాభాగవతం అ.స్క

తన చీరకొంగు చేతపట్టుకొని హడావుడిగా వెళ్తున్న భర్తను ఎక్కడికి, ఎందుకని అడగాలనుకున్నది లక్ష్మీదేవి. మగణ్ణడిగినా చెప్పే స్థితిలో లేడు అడగాలా! వద్దా! అని ఆలోచిస్తున్నది. ముడివేసిన జుట్టు ఊడిపోతున్నది కాళ్ళు తడబడ్తూ అడుగు ముందుకు పడ్డం లేదు. అయినా బలం తెచ్చుకొని అతని వెంట పరుగెత్తుతున్నది ఏమితోచక.





# మహిళకెప్పుడూ ప్రాధాన్యమే

**జాగృతి ప్రత్యేక సంచిక, మార్చి 15 – 21, 1999**

రేడియో, టెలిఫోన్, టివి, ఇటీవల ఇంటర్నెట్, ఉపగ్రహ టెలివిజన్ ప్రసారాలు అభివృద్ధి చెందిన దేశాల సుఖవంతమైన జీవితాన్ని గురించ మనకు విస్పష్టంగా చెబుతున్నాయి.ఇలాంటి పరిచయాలు మనలో ఎన్నో ఆకాంక్షల్ని రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో డబ్బు సంపాతన కోసం తహతహ పెరిగిపోయింది. వెనకటి వలె కాకుండా ఇప్పుడు భార్య భర్త ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇద్దరూ ఉద్యోగాలను వెళ్ళడం వల్ల పిల్లల్ని ఏదో ఒక శిశు సంరక్ష కేంద్రంలో ఉంచడమో లేదా పనివాళ్ళకు అప్పగించడమో జరుగుతుది. వెనకటిలా ఉమ్మడి కుటుంబాలు, పిల్లలకు వృద్ధ తరం నుండి వచ్చే ఆదరణ, పోషణ ఇప్పటి నగర జీవితంలో వెతికినా కన్పించవు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రుల నీడ కరువైన పిల్లలు రేడియో, టీవి, ఇంటర్నెట్‌ల వైపు ఆకర్షితులవుతున్నారు. టీవీల్లో వస్తున్న కార్యక్రమాల్లో వైద్య వైజ్ఞానిక సంబంధమైనవి చాలా తక్కువ. వినోదాల కార్యక్రమాలే ఎక్కువ. క్రమేపీ ఇంట్లోని పడకగదులతో సహా అన్నీ పొద్దస్తమానం ఏకబిగిన నడిచే సినిమా హాళ్ళుగా మారుతున్నాయి. పర్యవసానాలు సామాజిక కుటుంబ జీవనాలపై హెచ్చుగా ఉంటున్నాయి. మన దేశాన్ని అలా ఉంచి, ఆర్థికంగా అత్యున్నత దశకు చేరుకున్న అమెరికా సమాజాన్ని పరిశీలిస్తే, అక్కడ 30 శాతం మంది పిల్లలకి అయితే తల్లి లేదా తండ్రి మాత్రమే ఉన్నారు. కొన్ని సందర్భాలలో వీరికి తల్లీ తండ్రీ ఎవరోకూడా తెలియదు, సగటు అమెరికన్ తన జీవితంలో మూడు నాలుగు పెళ్ళిళ్ళు చేసుకోవడం కన్పిస్తోంది. వివాహం కాకుండా టీనేజ్‌లోనే తల్లులవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికన్ సమాజంలో పిల్లలు ఒక వస్తువులు గానే పరిగణించడం జరుగుతోంది. అక్కడి లైంగిక విశృంఖలతకు అధ్యక్షుడు బిల్‌క్లింటన్ – మోనికా లెవన్‌స్కీల వృత్తాంతమే తాజా నిదర్శనం. అయితే చిత్రమేమిటంటే తమన దేశపు ప్రథమ పౌరుడు చేసిన తప్పిదాన్ని అక్కడి ప్రజానీకం పెద్దగా పట్టించుకోకపోవడం. అదో మామూలు విషయమేనన్నట్లు తీసి పారేశారు అమెరికన్లు. వ్యక్తిగత సుఖలాలసత్వం, అధికార తృష్ణ అమెరికాలో కుటుంబ విలువల్ని పడదోశాయి. కుటుంబం, పరస్పర మమతానురాగాలు ఇవేవి లేకపోతే మనిషికీ – పశువుకు మధ్య బేధం ఉండదు. సమాచార సేకరణ మాత్రమే విద్య కాదు, విద్య మనిషిని

నైతిక మూర్తిగా తీర్చిదిద్దాలి. సమాజ సంక్షేమ దృష్టిలో ఆలోచించే విజ్ఞతను విద్య అందించాలి. దీన్నే భగవద్గీత లోక సంగ్రహమని అంటోంది. విద్య – దాని అవసరాల్ని గూర్చి ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఆలోచించాల్సిందిగా ఈ అంశాల్ని మీముందుంచుతున్నారు. విద్య కోరికలు తీర్చేందుకా, డబ్బు సంపాదనకోసమా లేకుంటే సంఘంలో నైతిక, సాంస్కృతిక విలువలున్న మనిషిగా తీర్చిదిద్దేందుకా అన్నది ఆలోచించాల్సిన విషయం.

సెక్యులరిజం అన్న విదేశీ ఆలోచనను ధర్మనిరపేక్ష పేరుతో అనుకరించి దాన్ని పఠిస్తూ మన ఒమన విద్యా విధానంలోని నైతికమూల్యాలపై అశ్రద్ధ చూపుతున్నాము. మన పూర్వీకులు ఇప్పటి వారి దృష్టిలో నిరక్షరాస్యులే కావచ్చు, అయినా వారు ఏది మంచి? ఏది చెడు? విశాల విశ్వంలో మానవుడి స్థానమేమిటి? –ఇలాంటి అమూల్యాంశాలెన్నింటినో తమ తర్వాత తరాలకు అందించగలిగారు. మహాభారత, రామాయణ, భాగవతాన్ని ఇందుకు సాధనంగా ఉపయోగించుకున్నారు, మన గత తరం పెద్దలు, నైతిక నియమాలపై అవగాహన పెంచుకోకపోతే మన ప్రవర్తన విషమిస్తుంది. మనం రాక్షసులుగా మారిపోతాం. మన దానవ చర్యలతో నిఖిల విశ్వాన్ని సర్వనాశనం చేసేందుకు సన్నద్ధులమవుతాం. కురుక్షేత్ర సమరాన్నే తీసుకోండి, యుద్ధంలో పోరాడిన వ్యూహాత్మక, క్షిపణులెన్నింటినో మహాభారతం వివరించింది. సంఘర్షిస్తున్న ఇరు వర్గాల సంపూర్ణ పతనం కన్పిస్తుంది. బంధు మిత్ర సంపదలేవీ లేని భూఖండాన్ని పాండవులు వారసత్వంగా పొందాల్సి వచ్చింది. నిన్న మొన్నటిదాకా అమెరికా , రష్యాలు ఇలాంటి భయోత్పాతాన్ని ఆధునిక మానవుడి ముందు నిలిపాయి. అదృష్టవశాత్తు అణువంతు వివేకం ఉదయంచడంతో ప్రమాదం తప్పింది. టోటలిటేరియన్ రాజ్యమన్న పాడు దృక్పథం చీకట్లోకి వెళ్ళిపోయింది. ప్రపంచాన్ని నాశనం చేసే క్షిపణులు, వార్‌హెడ్‌లను వాడకూడదని సిటిబిటి (సమగ్ర అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం) తెలుపుతుంది. వెనకటి మహర్షులే వాటిని వాడరాదని పిలుపునిచ్చారు. ఇప్పటి సిటిబిటి దానికి మరో రూపమే. ఇదంతా నేను ఎందుకు చెపుతున్నానంటే, అది రాజనీతిజ్ఞుల్లో ఉన్న సముచితమైన బుద్ధి. భూగోళం నాశనం కాకూడదనుకున్న వివేకం. మంచి చెడ్డల భేదాన్ని తెలిపే వచక్షణను విద్య అందించాలి. నీతి నియమాల్ని విప్పి చెప్పాలి. దివ్యత్వానికి సంబంధించిన సారాంశాల్ని బోధపర్చాలి. నిజమే . మనిషి సుఖ ప్రదమైన జీవనానికి శాస్త్ర





సాంకేతిక ప్రగతి అన్ని విధాలా దోహదం చేస్తుంది. అయితే శాస్త్ర విజ్ఞాన ప్రగతి ప్రకృతిని క్రమరాహిత్యం చేయడానికీ, దాన్ని భ్రష్టుపట్టించేందుకూ దారులు వేయకూడదు. ఈ క్రమంలో ప్రపంచాన్ని కాపాడే విషయంలో మహిళల బాధ్యత గురుతరమైంది. నార్టిక్ దేశాల్లోని (అంటే స్వీడన్, డెన్మార్క్, నార్వే, ఫిన్లాండ్‌లు) పార్లమెంటులో 40 శాతానికి పైగా మహిళలే ఉన్నారు. అందువల్లనే ఈ నార్టిక్ దేశాలేవీ యుద్ధోన్మాద దిశగా పయనాన్ని సాగించలేదు. పైగా నార్వే మహిళా ప్రధాని గ్రో హార్లెమ్ బ్రంట్‌లాండ్ ఐక్యరాజ్యసమితిలో ఒక అధ్యయన బృందానికి సారధ్యం వహించారు. మన ఉమ్మడి భవితవ్యం, పర్యావరణం, అభివృద్ధికై ప్రపంచ కమీషన్ అన్నదే ఆ అధ్యయనం.

మన పవిత్ర ఇతిహాసాలైన మహాభారత, రామాయణ, భాగవతాల్ని అధ్యయనం చేయాల్సిందిగా మిమ్మల్ని కోరుతాన్నాను, ఒకవేళ ఈ ఇతిహాసాల అసలు ప్రతులు లేకపోతే మా వలె ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్న వారు రాసిన పుస్తకాలు చదవండి. రాజాజీ లేదా భారతీయ విద్యాభవన్ వారు ప్రచురించినవి చదవండి. సర్వోత్కృష్టమైన మహిళా పాత్రలు ఈ ఇతిహాసాల్లో ఉన్నాయి. సీత, రుక్మిణి, అనసూయ వంటి స్త్రీ మూర్తులు తమ జీవిత భాగస్వాములకు అసాధారణ ప్రేరణల్ని అందించారు. తమ భర్తల ధార్మిక ప్రస్థానంలో తామూ కదం కలిపారు. ముఖ్యంగా సీతా – రాములు దండ కారణ్యానికి వెళుతున్నప్పుడు అనసూయ సీతతో పలికిన వాక్యాల్ని మాత్రం తప్పక చదవండి.

మహిళలు ఉద్యోగాలు చేయడం ఈ మధ్య తప్పనిసరి అవసరంగా మారింది. అయితే ఇలాంటి ఉద్యోగాల కారణంగా అప్పుడే చిగురిస్తున్న పిల్లల బాల్యం, కుటుంబ జీవనం ఛిన్నాభిన్న కావాలా? పిల్లలు తమ జీవితారంభంలో తల్లిదండ్రులపై ఆధారపడతారు. ఈ దశలో వారిలో తెలివి తేటలు పెరగాలంటే ఎంతో విజ్ఞానం కావాలి. సమాచారం కావాలి. ఈ విజ్ఞానానికి నైతిక విలువలు ఆలంబనగా వుండాలి. నన్ను ఏదో పాతకాలం మనిషి అనుకోకపోతే ఒక విషయాన్ని మీ ముందుంచుతాను. ఉద్యోగం చేసి డబ్బు సంపాదించడం, పిల్లల్ని సరియైన ఆదరణతో పెంచి పెద్దచేయడం అన్న రెండు మార్గాల్లో ఏదో ఒక దాన్ని ఎంచుకోమంటే, నేను రెండవ దానివైపే మొగ్గు చూపుతాను. డబ్బు జీవితానికి అత్యావశ్యకమే అయితే పిల్లల ఎదుగుదల కీలకమైన దశలో ఉన్నప్పుడు వారికి సరియైన ఆలనా పాలనా చేయడం కూడా

ముఖ్యమే. ప్రస్తుతం మానవాళి సమాచార సమాజం వైపుగా పరుగులు తీస్తోంది. అంటే ఇప్పటి నుండే భౌతిక శ్రమకన్నా విజ్ఞానం ద్వారా జరిగే కసరత్తులే ప్రాధాన్యత వహిస్తాయన్నమాట. అంటే వ్యవసాయం లేదా పారిశ్రామిక రంగాల్లో మునుపటిలాగా పని అవసరం ఉండదు. అదృష్టవశాత్తు యావత్తు విజ్ఞానం కంప్యూటర్లలో ఇమిడి పోతోంది. ఇది ఇంటింటా విస్తరిస్తోంది. అఖిల విశ్వాన్ని కలుపుతోంది. ఆధునిక విజ్ఞానం సమయాన్ని, దూరాన్ని బాగా తగ్గించింది. అదువల్ల ఇంట్లోనైనా ఉద్యోగం చేసుకోవచ్చు. ఇప్పటికే అమెరికాలో పదికోట్ల మందిలో మూడుకోట్ల దాకా ఇళ్ళలోనే ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వీరంతా ల్యాప్‌టాప్ కంప్యూటర్‌ల వంటి అత్యాధునిక సంకేతిక విజ్ఞానంతో వారు మత విధుల్ని నిర్వహిస్తున్నారు. ఇలాంటి వాతావరణం ఉద్యోగాలు చేసే మహిళలు ఇంట్లోనే ఉంటూ తమ పిల్లల మంచి చెడ్డల్ని చూసుకునే అవకాశాన్ని కలిగిస్తున్నది. 20వ శతాబ్దంలో రూపుదిద్దుకున్న అత్యాధునిక సాంకేతిక ఇంటర్‌నెట్. దీనిపుణ్యమా అని ఎలాక్ట్రానిక్స్, టెలీకమ్యూనికేషన్స్, సాఫ్ట్‌వేర్, కన్సల్టెంట్, డిజైన్, మార్కెట్ అన్నీ సజావుగా సాగుతున్నాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సాఫ్‌వేర్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న మహిళల సంఖ్య రోజురోజుకు పెరగడాన్ని నేను గమనించాను. వీరు అటు ఉద్యోగాలు చేస్తూనే ఇటు తమ పిల్లలకు అవసరమైన ఆలనా పాలనా చూసుకోగలుగుతున్నారు. అందువల్ల ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీలో ప్రావీణ్యత సంపాదించాల్సిందిగా మిమ్మల్ని నేను కోరుతున్నాను. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ అన్నది ఒక చక్కని ఉపకరణం. దీన్ని ఎన్నో విధాలుగా ఉపయోగించుకోవచ్చు. మానవ ప్రవర్తన, మానవ వికాసాన్ని గురించి అవగాహన లేకుండా అతి ప్రత్యేకీకరణ (ఓవర్ స్పెషలైజేషన్) వైపు మళ్ళడం మనల్ని అమానుషత్వం వైపు నెడుతుంది. అమెరికాలో వలె కుటుంబ జీవన విచ్ఛిత్తి ఏర్పడకూడదనుకుంటే మనం మన నాగరిక, సాంస్కృతిక సూత్రాలపై ఆధారపడాల్సి వుంటుంది. హేతుబద్ధమైన ఆలోచనల్ని, క్రమానుగతమైన వాదనల్ని, వైజ్ఞానిక తృష్ణని భారతదేశం ఏనాటి నుంచో గౌరవిస్తోంది. ఉపనిషత్తులు హుతుబద్ధమైన విజ్ఞాన తృష్ణకు మాత్రమే నిలయాలు కాదు, అవి విజ్ఞానార్జన ఎలా చేయాలన్నదానికి మార్గదర్శకాలు కూడా చక్కని అధ్యయనం చేసి విచక్షణాయుతంగా మీకు మీరు అంచనాకు రావాలని కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో భగవద్గీత చివరి అధ్యాయంలో శ్రీకృష్ణభగవానుడు చెప్పిన ఉపదేశంతో ముగిస్తాను.





ఇతి తే జ్ఞానమాఖ్యాతం, గుహ్యాత్ గుహ్యో తరం మయా
విమ్రిస్య ఏతదా శేఖేన యధేచ్ఛాసి తథాకురు

(అసాధ్యమైన విజ్ఞానాన్ని నీకు అందజేశాను. రహస్య విద్యను చెప్పాను. ఇదంతా విన్న తర్వాత నీ మనసుకు తోచినట్టుగా ఆచరించు.)

ఆచార్య వర్యా!
అందరూ న్యాయాన్ని అనుసరించరనీ
సత్యాన్ని పాలించరనీ మా అబ్బాయికి నేర్పుతారా?
నిజమే.
అయితే ప్రతి మోసగాడితో పాటు ఒక వీరుడుంటాడనీ
ప్రతి స్వార్థరాజకీయవాదితో పాటు ఒక నిస్వార్థ ప్రజానాయకు
డుంటాడనీ బోధించండి.
శత్రువులే కాదు మిత్రులూ ఉంటారనీ,
కష్టపడి సంపాదించిన రూపాయే ఊరికే లభించిన అయిదు
రూపాయల కన్నా గొప్పదనీ.
గెలవటమే కాదు, ఓడటమూ నేర్చుకోవాలి ;
ద్వేషం నుండి దూరంగా ఉండటమూను.
ప్రశాంత మానసికానందానికి అభ్యాసం అవసరమనీ
గూండాలే తేలికగా మట్టి కరుస్తారనీ
పుస్తకాలోక అద్భుత ప్రపంచమనీ సమయముండాలి
నీలాకాశంలో ఆ రెక్కల చప్పుడు ఏమిటనీ,
సీతాకోక చిలుకపై రంగు లెక్కడివనీ,
సూర్యునికి ఆ కాంతి ఎలా వచ్చిందనీ,
హరిత పత్రాల మధ్య అందాల కుసుమాలు ఎలా పుట్టుకొచ్చాయని
ఆలోచించటం నేర్పండి.
చెప్పండి ;
పాఠశాల సరీక్షలో మోసం చేయటం కంటె తప్పటం మేలనీ,
ఎవరు ఏమన్నీ మన అభిప్రాయాలపై మనకు నమ్మకముండాలని.
మృదు స్వభావులతో మృదువుగా,

మొండి వాళ్ళతో కఠినంగా వ్యవహరించాలనీ,
నలుగురితో పాటు నారాయణ అనకుండా
మా వాడికి మనోబలాన్ని అందించండి.
ఎవరు చెప్పినా వింటూ, సత్యాన్ని మాత్రం
జల్లెడతో వడబోయాలని బోధించండి
విషాదంలో చిరుదరహాసాన్ని చిందించడం
నేర్పండి
కన్నీళ్ళు కార్చటం మహాపాపం కాదు
నిత్య శంకితులను నమ్మకూడదనీ
మధురం కూడా అతి పనికి రాదనీ
బోధించండి.
శక్తియుక్తుల్ని అమ్ముకోవచ్చు కానీ
హృదయాన్ని, ఆత్మనూ కాదని
పదుగురాడు మాటలు పట్టించుకోవద్దనీ
నమ్మిన మంచికోసం పోరాడమనీ
చెప్పండి
మావాడ్ని బాగానే చూడండి
కాని గారాబం చేయవద్దు
నిప్పులో మండితే కాని ఉక్కు తయారు కాదు.
గొప్పతనాన్ని చేరుకునే ధైర్యం
ఆ ధైర్యాన్ని ప్రదర్శించే సాహసమూ కావాలి
ఆత్మ విశ్వాసంతో మానవత్వం పట్ల గౌరవం పెరుగుతుంది.
నేను చాలా చెప్పానా?
అయినా ఎంత వీలయితే అంతే సాధిస్తాం
మావాడు మరి ఓ గొప్పవాడు కావాలి కదా!

– అబ్రహం లింకన్.





# జనాభా పెరుగుదల – మత మౌఢ్యం

**మార్చి 22 - 28 , 1999**

పిల్లల్ని పెంచగలిగే స్తోమత లేనివాళ్ళలోనే విపరీతంగా జనాభా పెరుగుతోంది. ఈ జనాభా పెరుగుదల విషయాన్ని మన మేధావులు పట్టించుకోక పోవడం ఆశ్చర్యకరం, బాధాకరమూనూ! విద్యాధికులు, ఆర్థికదన్ను ఉన్నవారు, జీవితంలో పైకెదగాలని అనుకునేవాళ్ళు ఒకరు లేక ఇద్దరు పిల్లలతో సరిపుచ్చుకుంటున్నారన్నది అందరికీ తెలిసిందే. అదే పేదలు, నిరక్షరాస్యులు పిల్లల్ని కనీకనీ తల్లి అలసిపోయేదాకా సంతానాన్ని పెంచుతూనే ఉన్నారు.

ఇటీవల నేను కడపకి వెళ్ళాను. అక్కడ కొంతమంది తమ సంతానం గురించి చెప్పిన కథనాలు విన్నాను. దురదృష్టవశాత్తు నన్ను కలిసిన ముగ్గురూ ముస్లిములే. ఒకాయన మునిసిపల్ ఉద్యోగి. ఆయనకి 21 మంది పిల్లలు! మరొకాయన ఇన్‌కంటాక్స్ ఉద్యోగి. ఆయనకి 20 మంది పిల్లలు మరో చిరువ్యాపారికి 40 మంది పిల్లలు. నలభై మంది పిల్లలున్నారన్న సంగతి విని ఆశ్చర్యం కలిగింది. నలభైమంది పిల్లల్ని కనడం సాధ్యం కాదని అనిపించి, 'నీకు భార్యలెందరు' అని అడిగాను. ఆయనకు నలుగురు భార్యలున్నారని వెల్లడైంది. ఇలా పిల్లల్ని పెంచుకుని, తద్వారా జనాభా శాతాన్ని పెంచుకోవడం వల్ల ఇతరుల్లో ప్రతిక్రియ ఎదురుకాదా అని నేను ముస్లిం మిత్రులను ప్రశ్నించాను. వాళ్ళ మాటల ప్రకారమే కడప నగరంలో ముస్లిం జనాభా 1947లో 20 శాతం వుండేది. అది నేడు 45 శాతం అయింది.

ఇలా జనాభా పెరుగుదల జరగడం వల్లే దేశ విభజన నాటికి 6 శాతం మాత్రమే ఉన్న ముస్లిం జనాభా 12 శాతం లేదా 16 శాతానికి పెరిగిందన్న లెక్కలు వినిపించడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఈ జనగణనలో 20 మిలియన్ల బంగ్లాదేశీ చొరబాటు దారులను లెక్కలోకి తీసుకోలేదు. ముస్లిం నేతల మాటల ప్రకారమే మన దేశంలోని 140 పార్లమెంటరీ స్థానాల్లో గెలుపోటములు ముస్లిం వోటర్లు నిర్ధారిస్తారు.

పశ్చిమబెంగాల్‌లో చాలా అసెంబ్లీ నియోజకవర్గాలు ముస్లిం జనాధిక్య ప్రదేశాలుగా మారిపోయాయి. వోటర్లు కాక, జనాభాని పరిగణలోకి తీసుకుంటే అస్సాం ముస్లిం మెజారిటీ రాష్ట్రం అయిపోయింది.

ఇలా ఒక వర్గం జనాభా మాత్రమే. ఒక పద్ధతి ప్రకారం పెరగడం వల్ల రెండు భయంకరమైన ప్రమాదాలున్నాయని నా అభిప్రాయం. ఒకటి హిందూ సమాజం నుంచి తీవ్రమైన ప్రతిక్రియ వస్తుంది. ముస్లిం జనాధిక్యత ఉన్న ప్రాంతాలను విభజించి వేరే దేశంగా రూపొందించిన చరిత్ర మనకున్నది. మళ్ళీ హిందువులు మైనారిటీలుగా మారిపోయి స్వంత దేశంలోనే కనీస మానవ హక్కులూ లేని మూడో తరగతి పౌరులుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

రెండవ ప్రమాదం – హిందువులు కమ్యూనల్‌గా మారవచ్చు. ఇప్పటికే చాలా మంది సర్వధర్మ సమభావం ఒక ఉదాత్త భావన అని సహనం ఒక సుగుణం అని తాము ఇన్నాళ్ళూ పొరబడుతూ వచ్చామని భావిస్తున్నారు. ప్రలోభనలు, మాయోపాయాలతో సాగుతున్న మత మార్పిడుల విషయంలో హిందువు మౌనం వహించినా, అన్ని మతాలూ దేవుడని ఆరాధించే వివిధ వర్గాలుగా తాము భావించినా, ఇతర మతాలు, అది ముస్లిం మతమైనా, క్రైస్తవమైనా హిందుత్వాన్ని ఒక మతంగా కూడా గుర్తించలేదు. హిందువులందరూ పాపులని, అవిశ్వాసులని, ఈ కాఫిర్లను తమ మతంలోకి మార్చడమే కర్తవ్యమని ముస్లింలు, క్రైస్తవులు భావిస్తున్నారు. 2000 నాటికి ఒక నిర్దిష్ట లక్ష్యం సాధించేందుకు క్రైస్తవ మత మార్పిడులు జోరుజోరున సాగుతున్నాయి. వెనకబడిన మారుమూల గ్రామాల్లో క్రైస్తవ మిషనరీలు పేదలను మతం మారితే ధనసాయం చేస్తామని ఉద్యోగాలు ఇస్తామని విదేశాలకు పంపిస్తామని ప్రలోభపరుస్తున్నారు. మామూలు భూములను భారీ మొత్తం చెల్లించి, కొనుగోలు చేసి, తరువాత చర్చిలు నిర్మిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు అభివృద్ధి చెందిన గ్రామాల్లో కాక మారుమూల గ్రామాల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి.

తాము నిజాలుగా నమ్ముతున్న విషయాలను బహిరంగంగా చెప్పనట్టయితే భారతీయులు తమకు తాము కీడు చేసుకున్న వారవుతారు. ఇద్దరికన్నా ఎక్కువ సంతానం ఉన్న వారికి ఎలాంటి సౌకర్యాలు, సంక్షేమ పథకాలు దక్కకుండా చేయడం అత్యవసరం. కుల, వర్గ మతాలకు అతీతంగా ఇది జరగాలి. మూడో పిల్లవాడు పుట్టగానే తల్లిదండ్రుల ఓటు హక్కును రద్దు చేయాలి. వారికి లభించే సబ్సిడీలను, సేవలను రద్దు చేయాలి. అడ్డు అదుపూ లేని జనాభా పెరుగుదల వల్లే మన దేశంలో నిరక్షరాస్యుల సంఖ్య పెరుగుతోంది. నిరక్షరాస్యుల సంఖ్య పెంచుకున్న ఖ్యాతి మనదేశానికి దక్కింది. నిరక్షరాస్యత, పేదరికం (వనవాసీలతో పాటూ)





ముస్లింలలో ఎక్కువగా ఉందని సర్వేలలో వెల్లడవుతుంది. దారిద్ర్యం వల్ల అవిద్య, అవిద్యవల్ల ఉపాధి అవకాశాలు లేకపోవడం జరుగుతోంది. అందుకే చదువు లేని, కరడుగట్టిన మత వర్గాల్లోని నేర చరిత్రులు, చట్టాన్ని అగౌరవించేవాళ్ళ సంఖ్య ఎక్కువగా ఉందని గణాంక వివరాలు చెబుతున్నాయి. సెక్యులరిజం పేరిట ఇంకా భ్రమలోపడి, కావాలని కొందరు జనాభాను పెంచుతున్న వైనాన్ని మనం విస్మరిస్తే దేశానికి తీరని నష్టం కలుగుతుంది. ఎన్ని విజన్ 2020లు, ఎన్ని పంచవర్ష ప్రణాళికలు వచ్చినా ఎలాంటి ఉపయోగమూ ఉండబోదు. అందుకే సమస్య చేజారిపోయేలోగా సరైన చర్యలు తీసుకోవడమే సముచితం.

**సీ.  సంసారజీమూత సంఘంబు విచ్చునే?**
**చక్రి దాస్యప్రభంజనము లేక**
**తీపత్రయాభీల దావాగ్ను లాఱునే?**
**విష్ణుసేవామృత వృష్టి లేక**
**సర్వంకషా ఘఘౌ జలరాసు లింకునే?**
**హరి మనీషాబడ బాగ్ని లేక**
**ఘన విపద్గాఢాంధకారంబు లణఁగునే**
**పద్మాక్ష నుతి రవిప్రభలు లేక**

**తే.  నిరుపమాపునరావృత్తి నిష్కళంక**
**ముక్తినిధిఁ గానవచ్చునే? ముఖ్యమైన**
**శార్ఙ్గ కోదండ చింతనాంజనము లేక**
**తామరసగర్భునకు నైన దానవేంద్ర!**

శ్రీమదాంధ్ర మహాభాగవతం స.స్క.

ఓ దానవేంద్రా! సంసారమనే చిమ్మచీకట్లు కమ్మిన మేఘాలు తొలగించబడ్తాయా. భగవంతునికి చేసిన సేవ (ప్రభంజనము), అనే గాలి వీచకుండా, తాపత్రయం అనే అడవిని కాలుస్తున్న కార్చిచ్చు ఆరిపోతుందా! విష్ణుసేవ అనే వర్షం లేకుండా, పాపమనే పెద్దజలరాసులు (సముద్రాలు) ఇంకుతాయా? విష్ణు చింతన అనే బడబాగ్ని లేకుండా, గాఢంగా ముసురుకున్న చీకట్లు తొలగుతాయా? భగవంతుని నుతించడం అనే సూర్యకిరణాలు పడకుండా సాటిలేని, కళంకము (మచ్చ) లేని ముక్తి అనే నిధి ఎవరికైనా సులభంగా దొరుకుతుందా?

# టీచర్ల నియామకాలు - చంద్రబాబు వోట్ల రాజకీయాలు

**మార్చి 29 - 4 , 1999**

రాబోయే కొద్ది మాసాల్లో 20,000 మందికి పైగా ఉపాధ్యాయుల్ని నియమించబోతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నిరుద్యోగ పర్వంలో విసిగివేసారి పోయిన వారికి ఇది శుభవార్తలా కన్పించవచ్చు. అలాగే ముఖ్యమంత్రి ప్రకటన అధికార పార్టీకి అదనపు ప్రయోజనాల్ని కలిగించవచ్చు. కానీ ప్రాథమిక విద్యా రంగంలో విలువల పెరుగుదలకు ముఖ్యమంత్రి ప్రకటన కొత్తగా దోహదం చేయదనే చెప్పాలి. సార్వత్రిక ప్రాథమిక విద్యను అందించడంలో స్వతంత్ర భారతం ఘోరవైఫల్యాన్ని చవిచూసింది. మన రాజ్యాంగం అమలులోకి వచ్చిన పదేళ్ళలోపు అంటే 1960 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని ఆనాడు సంకల్పించారు. ఆనాటి సంకల్పం నేటికీ వాస్తవ రూపాన్ని సంతరించుకోలేదు. ఈరోజు మనదేశ పౌరుల్లో 52 శాతం మంది మాత్రమే అక్షరాస్యులు. అదీ ఆంధ్రప్రదేశ్‌లో అయితే 44 శాతం దగ్గరే నిలచిపోయింది. మన తర్వాత స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న మలేషియా, సింగపూర్, చైనా, తైవాన్, ఇండోనేషియాలకన్నా మనం అక్షరాస్యతలో బాగా వెనకబడి ఉన్నాము. ఈ దేశాలన్నీ 85 శాతం నుండి 98 శాతం దాకా అక్షరాస్యతా రేటును సాధించుకున్నాయి. అనేక రంగాల్లో మనకన్నా ముందంజ వేశాయి. మన రాజకీయ నాయకత్వం మానవ వనరుల వికాసంపై చూపించిన శ్రద్ధ తక్కువేనని చెప్పాలి. అందువల్లనే మనదేశం అక్షరాస్యత విషయంలో వెనకబడిన ఉపసహారా ప్రాంత దేశాల సరసనే నిలిచిపోయింది.

ప్రభుత్వ పాఠశాలల్లో కన్పించే ఉత్తీర్ణతా శాతం కొన్నిసార్లు మనల్ని సిగ్గుపడేలా చేస్తోంది. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్ని తీసుకుందాం, ప్రభుత్వ పాఠశాలలు వీటిలో యాభై శాతాన్ని మాత్రమే సాధిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో అయితే ఫలితం గుండు సున్నాగా మారుతుంది. ఇలా చాలా కాలం నుండి సాగుతోంది. ఈ పాఠశాలలకన్నింటికీ ఉపాధ్యాయులున్నారు. వీళ్ళకు చక్కని జీతభత్యాలున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వ పాఠశాలలపై పెడుతున్న ఖర్చు కొంతమేరకు దుర్వినియోగమే అవుతోంది. ఫలితాల్ని సమీక్షిస్తే ఈ చేదునిజం అవగాహనలోకి వస్తుంది. పాఠశాలలపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చులో ఎక్కువ భాగం ఉపాధ్యాయుల





జీతభత్యాలే హరించివేస్తున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టణాల్లో పనిచేసేందుకే ఆసక్తిని చూపుతున్నారు. ప్రభుత్వం నుండి ఎలాగూ జీతభత్యాలు అందుతాయన్న ధీమా ఉపాధ్యాయుల వృత్తి విలువలపై నీలినీడలు వేస్తోంది. ఇక పల్లెటూళ్ళలో ఉపాధ్యాయులు కన్పించరు. వారుతమకు నచ్చిన చోట నిక్షేపంగా ఉండగలుగుతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులకు మారుమూల పల్లెల్లో పోస్టింగ్ ఇస్తే అక్కడికి వెళ్ళడం లేదు. తమ బదులుగా మరెవరినైనా ఏర్పాటు చేస్తున్నారు, దీనికి ఎన్నో ఉదాహరణలు చూపవచ్చు. ఒక్క పోస్టింగ్ సమయంలో మాత్రమే పల్లెటూరు ముఖం చూసే ఉపాధ్యాయులున్నారు. తమతమ ఉపాధ్యాయసంఘాలు నుండి వీరికి రక్షణ దొరుకుతుంది. అందువల్ల ప్రభుత్వ పరమైన క్రమశిక్షణా చర్య వీలుకాదు. ఇలా చెబుతున్నామంటే, అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అధ్యాపకులు ఇలాంటి జాబితా క్రిందికి వస్తాయని కాదు, కానీ చాలా వరకు ఇలాగే కనిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వల్ల తమ పిల్లల్లో జ్ఞానతృష్ణ, సరికొత్త ప్రేరణలు పెంపొందుతున్నాయన్న ఆశ తల్లిదండ్రులకు కలగడం లేదు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలలు ఫలితాల బాటలో వీరవిహారం చేస్తున్నాయి. సంపూర్ణ ఫలితాల్ని సాధిస్తున్న ప్రైవేటు పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అల్పాదాయ కుటుంబాలు సైతం ఎన్నెన్నో కష్టనష్టాల కోర్చి తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. తడిసిమోపెడవుతున్న పిల్లల చదువు ఖర్చుల కోసం తక్కువ ఆదాయాన్ని కలిగిన ప్రభుత్వోద్యోగులు కొన్నిసార్లు అపమార్గాన పయనించినా ఆశ్చర్యం లేదు.

ఈ దశలో మరికొన్ని వేలమంది ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకం నిష్ఫల వ్యయంగానే మారుతుంది. పన్నులు కడుతున్న సగటు మనిషిపై ఇది అదనపు భారంగానే మారుతుంది. ఇంతకన్నా తక్కువ సమయంలో కనిష్ఠస్థాయి వ్యయంతో సార్వత్రిక విద్యావ్యాప్తిని ప్రోత్సహించడం మంచిది. ఇక్కడొక పద్ధతి ఉంది చూడండి, మన పల్లెటూళ్ళలో నిరుద్యోగ పట్టభద్రులు, మెట్రిక్యులేట్లు ఎంతోమంది కన్పిస్తారు. అలాగే పట్టణాల్లోనూ ఇలాంటివారు కోకొల్లలు. తల్లిదండ్రులకు చేయూతగా ఉంటూ పాఠశాల మొగమైనా చూడని పిల్లల సంఖ్య కూడా తక్కువేమీ కాదు. పైన పేర్కొన్న నిరుద్యోగ పట్టభద్రులు లేదా మెట్రిక్యులేట్లు ఇలాంటి పిల్లల్ని గుర్తించాలి. వారికి విద్యా బోధన చేసేందుకు నడుంబిగించాలి. ఒక్కొక్క పిల్లవాడిని ఐదవ తరగతి

పరీక్షలు రాసే వరకు చదువు నేర్పితే నిరుద్యోగ పట్టభద్రులు లేదా మెట్రిక్యులేట్లకు వెయ్యి రూపాయల బహుమతిని ప్రకటించాలి. ఈ మేరకు జీతభత్యాలరూపంలో ప్రభుత్వ వ్యయం తగ్గే అవకాశం కలుగుతుంది. ఇందులో మరో వెసలుబాటు కూడా ఉంది. ఈ తరహా ఉపాధ్యాయులకు నిర్దిష్టమైన సమయపాలన అంటూ ఉండదు. ఇది పేదరికంలో కొట్టుమిట్టాడుతూ తల్లిదండ్రులకు డబ్బు సంపాదనలో తోడ్పడుతున్న పిల్లలకు కూడా ఉపయోగపడుతుంది.

ఈ తరహాలో నిర్వహించే ఐదవ తరగతి పరీక్షా బాధ్యతల్ని ఏ ప్రభుత్వ సంస్థకు అప్పగించకూడదు. ఇలా అప్పగించిన మరుక్షణమే పాతతరహా చీడపీడలు మరోమారు బయటపడతాయి. ఐదవ తరగతి పాఠ్యాంశాలు మరీ అంత అట్టహాసంగా ఉండాల్సిన అవసరం లేదు. ఐదవ తరగతి పరీక్షలు మామూలు పట్టభద్రులు నిర్వహించే స్థాయిలనే ఉండాలి. పదవీ విరమణ చేసిన వారు, లాభాపేక్ష లేకుండా పనిచేసే పెద్దలు పరీక్షను నిర్వహించాలి. వీరు ఐదవ తరగతి పాఠ్యాంశాల్ని అర్థం చేసుకోగలిగితే చాలు. పరీక్ష సంఘంలో ఒకరిద్దరు చక్కని ఉపాధ్యాయుల్ని చేర్చుకున్నా తప్పు లేదు. మండల స్థాయిలో ఈ పరీక్షల్ని ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలి. చివరకు సర్టిఫికెట్‌ను మాత్రం ప్రభుత్వం ద్వారా అందించే ఏర్పాటు చేయాలి. పరీక్షల నిర్వహణలో మెళుకువలన్నింటినీ పాటించటం తప్పనిసరి. ప్రభుత్వ పరమైన ప్రోత్సాహం, పునశ్చరణ క్రమం తప్పక కొనసాగాలి.

శాసనసభ్యులు, దేశభక్తులైన రాజకీయ నాయకులు, పౌరులకూ నాదొక ప్రార్థన. ఎండమావుల్లాంటి ఫలితాలతో ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో కొత్తగా ఉపాధ్యాయ నియామకం జరిపి అనవసర వ్యయం చేయరాదన్నదే నా అభ్యర్థన. కొన్ని వేలమంది నిరుద్యోగ బి.ఇడి.లు ఉన్నట్టు వార్తలు విన్పిస్తున్నాయి. వారందరికీ తమపై తమకు విశ్వాసం ఉంటే స్వయం ఉపాధి విషయంలో వెనుకంజ వేయకూడదు. ప్రభుత్వ ఉద్యోగమంటేనే చాలు బాధ్యతారాహిత్యానికీ, ఫలరాహిత్యానికీ ప్రతిబింబంగా మారుతోంది. ఈ ధోరణి చాలా రోజుల నుండే కన్పిస్తోంది. మానవ శక్తియుక్తుల అభివృద్ధికి దోహదం చేయడమే ప్రభుత్వం నిర్వహించాల్సిన కీలక బాధ్యత. ఇప్పటికే ఫలితాల నివ్వనివిగా తేలిపోయిన వాటిపై ప్రభుత్వం మళ్ళీ ఖర్చులు చేయకూడదు.





# విభజన శక్తుల పట్ల జాగరూకత అవసరం

**ఏప్రిల్ 5 - 11, 1999**

కొన్ని పార్టీల వారు, మరికొన్ని సంస్థలు ఇంకా కొంతమంది పౌరులు దేశాన్ని విభజించి, అస్థిరత పాలు చేయడానికి జరుపుతున్న ప్రయత్నాల్ని చూస్తే నిజంగానే ఆశ్చర్యం కలుగుతుంది. ఈ మధ్య కాలంలో ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీలో ఒక సంఘటన జరిగింది. మదర్సాలని పిలువబడే ముస్లిం మత సంస్థల పాఠశాలల్లో పని చేసే వేలమంది అరబిక్, పర్షియన్ ఉపాధ్యాయులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని కొంతమంది శాసన సభ్యులు గొడవ చేశారు. ఇందులో సోనియా కాంగ్రెస్, సమాజ్‌వాది, బి.ఎస్.పిలకు చెందిన శాసనసభ్యుల పాత్ర ప్రముఖంగా ఉంది. అరబిక్, పర్షియన్ భాషలు భారతదేశానికి చెందినవికావనే నిజాన్ని ఈ శాసన సభ్యులంతా మర్చిపోయినట్టున్నారు. అంతేకాదు, ఈ దేశంపై కరకు కత్తులతో దురాక్రమణ చేసిన నరహంతకుల భాషలు అవేనన్న సంగతి వీరికి గుర్తున్నట్లు లేదు. మదర్సాలన్ని మతపరమైన పాఠశాలలే. ఇవన్నీ మసీదులకు అనుబంధంగా ఉంటాయి. మదర్సాలన్ని ఒక ప్రత్యేక మతానికే చెందిన ముల్లాలు, మౌల్వీలు నిర్వహిస్తూ ఉంటారు. ప్రత్యేకమైన మత సంస్థలతో నిర్వహించబడుతూ కొద్దిమంది మాత్రమే మాట్లాడే భాషల్ని బోధిస్తున్న ఒకానొక మతానికి చెందిన పాఠశాలల ఉపాధ్యాయులకు సెక్యులర్ సర్కారు జీత భత్యాలెందుకు చెల్లించాలి? విభజన వాదులూ, వేర్పాటుతత్వవేత్తలకూ సోనియాకాంగ్రెస్, సమాజ్‌వాది, బి.ఎస్.పిలు ఎలా గొడుగుపడతాయో అందరికీ తెల్సిందే. భారతీయ భాషలన్నింటికీ మాతృమూర్తి లాంటి సంస్కృతం పునరుద్ధరణ కోసం వీరు ఏనాడైనా మాట్లాడారా? వందేమాతర గీతాలాపనకు అభ్యంతరాల్ని వ్యక్తం చేయడం, జ్ఞాన స్వరూపిణి, సకల విద్యాదాయిని అయిన వాగ్దేవి వందనానికి నిరసన తెల్పడం వీళ్ళ ఘనతలకు ఉదాహరణలు!

నిరంతరం అర్థంకాని రీతిలోనే ప్రవర్తించే మార్క్సిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి హరికిషన్‌సింగ్ సూర్జిత్ ఆ పార్టీ మరో అగ్రనేత జ్యోతిబసు ఢిల్లీలోని బిజెపి సంకీర్ణ సర్కారును కూల్చివేయాలని అదేపనిగా పిలుపునిస్తున్నారు. బిజెపి సంకీర్ణం అధికారాన్ని చెపట్టిన మరు నిమిషం నుండే మార్క్సిస్టుల కూల్చివేత ఆరాటం మొదలైంది. తాము చెప్పుకుంటున్న తృతీయ ప్రత్యామ్నాయం గతంలో జరిగిన ప్రయోగమే. అప్పట్లో

ఆయా పార్టీల పెద్దలంతా ఇలాంటి ఫ్రంట్‌లు కట్టి ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో విడిపోయారు. కులతత్వ లాలూప్రసాద్‌యాదవ్ రాష్ట్రీయ జనతాదళ్ బీహార్‌ను ఎలా పాలిస్తున్నదో సకల భారతీయులకూ తెల్సు. అక్కడ ప్రైవేటు సైన్యాలున్నాయి. సాయుధ నక్సలైట్ బృందాలున్నాయి. తాము శత్రువుగా గుర్తించినవారిని అమానుషంగా హతమార్చడమే ఈ శక్తుల పని.

బీహార్‌లో పరిపాలన అన్నది భూతద్దంలో పెట్టి వెతికినా కన్పించదు. ఈ ఆటవిక రాజ్యంలో సాయుధ నక్సలైట్ వర్గాలు తమలో తామే సంకుల సమరాల్ని సాగించుకుంటున్నాయి. దళితులపై లాలూప్రసాద్‌యాదవ్ మొసలి కన్నీరు కారుస్తారు. నానా సానుభూతి వచనాల్ని పలుకుతుంటారు. అయితే రాష్ట్రంలో మాత్రం ఒక్క దళితుడికైనా ప్రైవేట్ సైన్యాల దాడుల నుండి రక్షణ లేదు. లాలూ; ఆయన సతీమణి రబ్రీదేవి కలిసి సాగిస్తున్న కుటుంబ పాలనకు కమ్యూనిస్టులు నిస్సిగ్గుతో మద్ధతు తెల్పుతున్నారు. లాలూకు సంబంధించిన కోట్ల కొద్ది రూపాయల కుంభకోణాల్ని గురించి కమ్యూనిస్టులు మర్చిపోయారు. ఆయనను క్షమించి వదిలేశారు. లాలూప్రసాద్‌యాదవ్‌తో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఓ గొప్ప సంస్కారిని చూశాడు. ఈ వృద్ధ నేత భారతీయ జనతాపార్టీ సారధ్యంలోని సంకీర్ణాన్ని మాత్రం క్రమం తప్పకుండా విమర్శిస్తున్నారు. ఆయన దృష్టిలో బిజెపి సంకీర్ణ సర్కారు "ఆటవిక-అనాగరిక" రీతిలో ఉందట! తన ఆరాధ్య దైవాలైన స్టాలిన్, మావ్‌సేటుంగ్‌లను జ్యోతిబసు ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవడం మంచిది. వీరిద్దరూ మిలియన్ల మంది పౌరుల్ని ప్రజా వ్యతిరేకులన్న పేరుతో వధించారు. పచ్చినెత్తుటి కాలువల్ని సృష్టించారు. వీళ్ళు టోటలి టేరియ నిజాన్ని ఆరంభించారు. ఒకే పార్టీ పెత్తనానికి అంకురార్పణ చేశారు. పైగా ఇలాంటి పద్ధతి ప్రజాస్వామ్య పంథాలో అత్యున్నత మైనదిగా చెప్పుకున్నారు. ప్రపంచంలో ఇప్పటికీ కమ్యూనిజం మినుకు మినుకు మంటోన్న రెండు దేశాల్లో ఒకటి ఉత్తర కొరియా. అక్కడి ప్రజానీకం తినేందుకు గింజ సైతం కరువై అల్లాడిపోతున్నారు. ఇక్కడ మన దేశంలో, కొన్ని కమ్యూనిస్టు వర్గాలు (బీహార్‌లో రెండు, ఆంధ్రప్రదేశ్‌లో ఆరుకు పైగా) ప్రజా వ్యతిరేకుల్ని సంహరించడమే కాదు, తమలో తామే హత్యాకాండకు పూనుకుంటున్నాయి. వీళ్ళంతా మార్క్స్, లెనిన్, స్టాలిన్, మావో వంటి తమ పూర్వీకుల సిద్ధాంతాల్ని చెబుతూ ఇలాంటి వాటికి పాల్పడుతున్నారు. కమ్యూనిస్టుల రక్త చరిత్రల్ని గురించి తెల్సినవారికి జ్యోతిబసు బిజెపి సంకీర్ణంపై "ఆటవిక, అనాగరిక" లాంటి





పదాలతో చేస్తున్న వ్యాఖ్యలు నవ్వును తెప్పిస్తాయి. జ్యోతిబసు వంటి వృద్ధ నాయకుడి మతి భ్రమణానికి, నిస్పృహకు తార్కాణాలు బిజెపి సంకీర్ణంపై చేస్తున్న "ఆటవిక, అనాగరిక" వ్యాఖ్యలు.

కమ్యూనిస్టులు సహకరించని బంద్‌లు లేవు. కమ్యూనిస్టులు వెన్నుదన్నుగా ఉండని రాస్తారోకోలు అసలు కానరావు. కమ్యూనిస్టులు యధోచిత ఆశీస్సులు అందని సమ్మెలు కన్పించవు. ప్రభుత్వాలు అవినీతిమయంగా మారాయన్నది కమ్యూనిస్టులు తరచూ చేసే విమర్శ. అయితే అదే ప్రభుత్వాల్లో అవినీతి పరులైన ఉద్యోగులు సమ్మెకు దిగితే మాత్రం కమ్యూనిస్టులు వారికి బేషరతు మద్దతు పలుకుతారు. ప్రభుత్వంలోని కొన్ని వర్గాల వారికి చక్కని జీత భత్యాలు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తామంటారు కమ్యూనిస్టులు. కానీవారు చెబుతున్న వర్గాలకే చెందిన ఇన్‌కంటాక్స్, కస్టమ్స్ అధికారులు సమ్మెకి దిగితే మాత్రం కమ్యూనిస్టులు వారికి మద్దతు తెలుపుతారు. పనికి ఆటంకం కలిగించి, పౌర జీవనానికి అంతరాయాన్ని సృష్టించే ప్రతి సమ్మెకూ కమ్యూనిస్టుల మద్దతు ఉంటుంది. కార్మికులు మొదలుకొని కర్షకులు, బ్యాంకు మేనేజర్లు, టీచర్లు, ఆక్టర్లు ఇలా ఒక వర్గమేమిటి, అన్ని రకాల సమ్మెలకూ కమ్యూనిస్టుల చేయూత ఉండాల్సిందే!

ఇంతకుముందు వివరించిన కమ్యూనిస్టు, కులతత్వ, విభజనవాద పార్టీలకూ, వ్యక్తులకూ అగ్రగామిగా ఉంటుంది సోనియాకాంగ్రెస్. తన చెప్పుచేతల్లో ఉండే సర్కారు తప్ప మరో ప్రభుత్వం ఢిల్లీ గద్దె మీద ఉండకూడదనేదే సోనియాగాంధీ ఏక సూత్ర కార్యక్రమంగా కన్పిస్తోంది. గతంలో ఆమెపార్టీ, దేవేగౌడ, గుజ్రాల్ ప్రభుత్వాల్ని పతనం చేసింది. ప్రస్తుతం బిజెపి సంకీర్ణ ప్రభుత్వాల్ని కూలదోసేందుకే సోనియా ప్రయత్నం సాగుతోంది. ఇంతకీ ఆమెకు ఏ విషయాలపై ఆసక్తి ఉంటోంది? బీహార్‌లో మాయమైన ప్రభుత్వ యంత్రాంగం, లూటీ చేయబడుతున్న ప్రజాధనం, శాంతి భద్రతల లేమి, స్త్రీ పురుష, శిశు బేధం లేకుండా జరుగుతున్న మానవ హననం సోనియాకు పట్టినట్టు లేవు. లాలూప్రసాద్ వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వ పతనానికి ఊతగా చేసుకోవాలని చూస్తున్నారు సోనియా. నిజానికి అవినీతి అన్నది అంత ప్రధానమైన అంశమే కాదు, ఎందుకంటే ఆమె కుటుంబం యావత్తూ అవినీతి చిట్టాను విప్పితే ఎయిర్‌బస్, ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోళ్ళు, బోఫోర్స్ తుపాకుల, ....డి.డబ్ల్యు. జలాంతర్గాముల వ్యవహారాలు ఎన్నో బయటపడతాయి.

భారత అత్యున్నత న్యాయస్థానం తెల్పిన మార్గదర్శక సూత్రాల్ని అనుకరించి భారతీయ జనతాపార్టీ సంకీర్ణ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ ద్వారా కేంద్ర విజిలెన్స్ కమీషన్ (సి.వి.సి) ని ఏర్పాటు చేసింది. నిప్పులాంటి అధికారి ఎన్. విఠల్ నేతృత్వంలోని సి.వి.సి అవినీతిపై రాజీలేని సమరానికి సిద్ధమవుతోంది. బోఫోర్స్ భోక్తల పేర్లు బయటకు వస్తాయన్న భయంతో కాబోలు సోనియాగాంధీ రాజ్యసభలో సి.వి.సి బిల్లును అవరోధించేందుకు తన పార్టీని సమాయత్తం చేస్తున్నారు. ప్రజా జీవితంలో నిజాయితీ సచ్ఛీలతలను గురించి కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం శ్రద్ధాసక్తులు ఉన్నాయో ఈ పరిణామం తేల్చి చెబుతోంది. బీహార్‌లో రాష్ట్రపతి పాలనకు లోక్‌సభ తన ఆమోదాన్ని తెల్పింది. అయితే రాజ్యసభలో రాష్ట్రపతి పాలన ఆమోదాన్ని పొందకుండా చూడాలని సోనియా నిర్ణయించారు. ఇంతకు కొద్ది రోజుల ముందే బీహార్‌లో దళితుల ఊచకోత, రబ్రీ సర్కార్ నిర్వాకాల్ని గురించి సోనియా విమర్శలు చేశారన్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. రాజ్యసభలో బీహార్ రాష్ట్రపతి పాలన ఆమోదాన్ని పొందకుండా చూసిన సోనియా, అక్కడి అసెంబ్లీలో రబ్రీదేవి బలపరీక్ష సమయాన తమ పార్టీ శాసన సభ్యులు గైర్హాజర్ కావాలని ఆదేశించారు. క్రమశిక్షణా రహితంగా వ్యవహరించిన నావికాదళ ప్రధానాధికారి తొలగింపును ఒక ప్రధానాంశంగా మార్చి రాజ్యసభలో తమ పార్టీ వారితో రభస సృష్టింపజేశారు సోనియా. పర్వాలేదు, ఉభయ సభల్లోని కాంగ్రెస్ దళ నేతలు సంయమనంతో ఉన్నారు. తమ పార్టీ సభ్యులు కుస్తీ వీరులుగానూ, వీధి పోరాటయోధులుగానూ మారకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వం సాగేందుకు అవసరమైన బిల్లు లేవీ రాజ్యసభలో ఆమోదాన్ని పొందలేకపోతున్నాయి. అయితే ప్రభుత్వం కొనసాగడమా? సాగకపోవడమా అన్నది సోనియాకు అంత ఆసక్తికరమైన అంశం కాదు. ఆమె ప్రయత్నం యావత్తూ బోఫోర్స్ తుపాకుల వ్యవహారం బయటపడకుండా చూడటమే. ఒకనాడు మహాత్మాగాంధీ, లోకమాన్య తిలక్, సుభాష్ చంద్రబోస్, అన్నిబిసెంట్, సర్దార్‌పటేల్, రాజేంద్రప్రసాద్ వంటి మహోన్నతులు సారధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీని సమర్థంగా ముందుకు నడిపేందుకు భారత సంతతికి చెందిన ఒక్క నాయకుడు కూడా లేకపోవడం విచారకరం! భారత జాతీయోద్యమం మహోధృతంగా సాగుతున్న రోజుల్లో భారతీయ జనతాపార్టీ నాయకులంతా ఏమైపోయారని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తుంటారు. మన దేశంలో స్వాతంత్ర్యానంతరం పాలించిన వంశంలోని ఒక





వ్యక్తిని పెళ్ళి చేసుకున్న తర్వాతగానీ, క్రిందటి ఏడాది వరకైనా మన జాతి జీవనంలో సోనియాగాంధీ పాత్ర ఏమిటన్నది వీరెవరూ ప్రశ్నించరు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అంబికా సోనీ ఇటీవల బి.బి.సికి ఇంటర్వ్యూ ఇచ్చారు. "అవినీతిమయమైన రాష్ట్రీయ జనతాదళ్ రబ్రీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎందుకు సమర్థించాల్సి వచ్చిందని" ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. అయితే అక్కడ తమ పార్టీ అవినీతి మతతత్వాల మధ్య ఏదో ఒక దాన్ని ఎన్నుకోవల్సి వచ్చిందని అంబికాసోని జవాబిచ్చారు. అంటే అవినీతి అన్నది సర్వ రంగాల్లోనూ ఉంది కనుక ఇకపై సోనియాగాంధీ మతతత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తుందన్న మాట అంబికాసోని పలుకుల్లో ప్రతిధ్వనించింది. ఇలాంటి మహత్తరమైన ఉద్యమాన్ని చేపట్టకపోతే భారతదేశం మరోమారు విభజనను చవిచూడాల్సి వస్తుందని అంబికాసోని ఉవాచ. నిజంగా అంబికాసోని అభిప్రాయాలు ఎంత భయంకరంగా ఉన్నాయి! ఇప్పటికే కాంగ్రెస్ ఆమోదంతో ఒకసారి దేశ విభజన జరిగింది. కొత్తగా ఏర్పడ్డ పొరుగుదేశం అక్కడి ముస్లిమేతరులందరినీ తమ ప్రాంతం నుండి వెళ్ళగొట్టింది.

భారత విచ్ఛిత్తికి సహకరించే శక్తుల పట్ల ప్రజానీకం అప్రమత్తతతో వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వివిధ రకాల శక్తుల అపవిత్ర కలయికపై జాగరూకత ఎంతో అవసరం.

గజేంద్రుడు మొసలి పాలిట పడ్డ వృత్తాంతాన్ని పోతన చెప్తూ –

**క. భిల్లీ భల్ల లులాయక**
**భల్లుక ఫణి ఖడ్గ గవయ బలిముఖ చమరీ**
**ఘిల్లీ హరి శరభక కిటి,**
**మల్లాద్భుత కాక ఘూకమయ మగు నడవిన్**

శ్రీమదాంధ్ర మహాభాగవతం అ.స్క.

పులులతో, సింహాలతో, చిరుతలతో, పాములతో, ఖడ్గమృగాలతో చమరిమృగాలలో అడవి పందులతో కాకులు దూరని కారడవి ఒకటుండెను.

# ఆరవ దశకంలోకి స్వతంత్ర్య ఇజ్రాయిల్

**ఏప్రిల్ 26 - మే 2, 1999**

ఏప్రిల్ 21న ఇజ్రాయిల్ తన 51వ జన్మదినాన్ని జరుపుకుంటోంది. ఇజ్రాయిల్ ఏర్పాటుకు సంబంధించిన డిక్లరేషన్ 1948 మే 14వ తేదీనాడు ఖరారైంది. అంతకుముందు రెండువేల సంవత్సరాలపాటు ఇక్కడి యూదులు ప్రపంచంలో ప్రవాసులుగా గడిపారు. తమ స్వంత గడ్డపై నుండి తరిమివేయబడటం ఇజ్రాయిలీల నిత్యానుభవంగా మారింది. తాము బాబిలోనియా ఆక్రమణలో ఉన్నా, లేదా ఈజిప్ట్ పెద్దరికం క్రింద తల్లడిల్లుతున్నా, ఏదో ఒకనాటికి స్వంత రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న యూదుల కాంక్ష మరణించలేదు. పరాయి ప్రాంతాల్లో యూదులు అనుభవించిన కష్టనష్టాల్ని వర్ణించడానికి మాటలు చాలవు. ఇలా విషాదనుభవాల్ని పొంది యూదు జాతీయులు మొదట అట్టోమాన్ ముర్క్ పాలనలో ఒక్కటయ్యారు. అప్పుడే తమ స్వంత గడ్డమీదికి చేరుకోవడం ఆరంభించారు. అయితే అప్పటికే తమ భూభాగాన్ని అరబ్బులు ఆక్రమించుకున్న వైనం వారికి తెల్సింది.

రెండో ప్రపంచ యుద్ధ పరిసమాప్తి తర్వాతనే నీడను కోల్పోయిన యూదుల దుస్థితి ప్రపంచానికి తెల్సింది. యూరప్‌లోని యూదులంతా హిట్లర్ నాజీ పాలనలో ఊచకోతకు లోనయ్యారు. పోప్‌కు ఈ నరమేధం గురించి ముందే తెలుసునని చెబుతారు. జర్మనీ యూదులపై వివక్షను చూపుతున్నా పోప్ దీన్ని ఖండించలేకపోయారు. స్పానిష్ ఆక్రమణలకు వీలుగా వేలమంది యూదుల నరమేధం జరుగుతున్నా కేథలిక్ చర్చి పట్టించుకోలేదు. యూదులు తమ రాజ్యస్థాపన నేపథ్యంలో అటు అరబ్బులతోనూ, ఇటు బ్రిటీష్ వారితో కూడా పోరాడాల్సి వచ్చింది. అమెరికా, మాజీ సోవియట్‌ల మధ్య ఒక అవగాహన నేర్పరుస్తూ ఐక్యరాజ్యసమితి పాలస్తీనాలో రెండు రాజ్యాలు ఉండాలని తీర్మానించింది. దీనిలో ఒకటి అరబ్బులకు పోగా మిగిలినది యూదులకు. అరబ్బులు మూకుమ్మడిగా యూదులపై విజృంభించారు. ఏడు అరబ్ సేనలు సంఘటితమై దాడి చేసిన సమయంలో యూదులకు స్వంత రక్షణాదులు లేవు. అయినా వారు అరబ్బుల్ని ఓడించి తరిమివేశారు. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి రంగ ప్రవేశం చేసింది. అరబ్బులకు యూదు (ఇజ్రియిలీ)లపై ఆరని పగ. అరబ్బులు 1956, 1967, 1973 సంవత్సరాల్లో ఇజ్రాయిల్‌పై దాడి





చేశారు. ఇదే రోజుల్లోనూ అటు తర్వాత కూడా ఇజ్రాయిల్ లోపలా బయటా హత్యాకాండ, బాంబు పేలుళ్ళు, కిడ్నాపింగ్‌లు జరుగుతూ వచ్చాయి. ఈ సుదీర్ఘ సమరంలో ఎవరికీ అంతిమ విజయం దక్కదనే సత్యాన్ని గుర్తించిన ఇజ్రాయిల్, పాలస్తీనాలు 1994లో ఓస్లో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అయితే ఓస్లో ఒప్పందం పడుతూ లేస్తూ నడుస్తోంది. ఓస్లో ఒప్పంద సాఫల్యానికి ఇరుపక్షాలూ పరస్పరం నిందించుకుంటున్నాయి.

ఎప్పుడూ ఉద్రిక్త సరిహద్దులతో ఉండే ఇజ్రాయిల్, పలు రంగాల్లో సాధించిన గణనీయమైన ప్రగతిని సమీక్షిస్తే.......

- ❖ అమానుషమైన విచక్షణకు లోనైన నాలుగు మిలియన్ల మంది యూదులు (వీళ్ళలో కొందరు అరబ్ ప్రాంతాల్లో ఉన్నవారు) ఒకే చోటికి చేరుకోగలిగారు. 1991లో సోవియట్ దుష్ట రాజ్య పతనానంతరం మరో తొమ్మిది లక్షలమంది ఆయా ప్రాంతాల నుండి ఇజ్రాయిల్‌కు వచ్చేశారు. వీరంతా బాగా చదువుకున్నవాళ్ళు, ఇజ్రాయిల్ ఇంజనీర్లు, శాస్త్రవేత్తల్లో వీళ్ళ సంఖ్య ఎక్కువగా కన్పిస్తోంది.
- ❖బయటనుండి వచ్చిన వారు దాదాపు ముప్ఫై వేర్వేరు భాషల్లో మాట్లాడతారు. అయితే తమ తాతల నాటి హిబ్రూను జాతీయ భాషగా ఏర్పాటు చేసుకున్నది ఇజ్రాయిల్. ఒకవేళ వలస వచ్చినవారు రష్యన్ లేదా ఇంగ్లీషు భాషల్ని నేర్చుకుంటామంటే దానికి సంబంధించిన ఏర్పాట్లు కూడా ఉన్నాయి. ప్రభుత్వ పరంగా జరిగే వ్యవహారాలన్నీ హిబ్రూ, అరబిక్‌లలోనే ఉంటాయి. ఈ నిజాల్ని తెల్సిన తర్వాత మనం మనకు మనమే ఉరిపోసుకోవాలి. ఎందుకంటే, సకల భారతీయ భాషలకూ జనని సంస్కృతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాం కనుక.
- ❖వలస వచ్చిన వారికి ఆవాస విద్యా సౌకర్యాల్ని చక్కగా అందిస్తారు. ఆరోగ్య సదుపాయాలు ఉంటాయి. ఇవన్నీ మంచి స్థాయిలో ఉండటం విశేషం.
- ❖1948లో ఇజ్రాయిల్ తలసరి ఆదాయం 400 అమెరికన్ డాలర్లు. ఇప్పుడది 45 రెట్లు పెరిగి 18000 డాలర్లకు చేరుకున్నది. ఇదే కాలంలో భారత తలసరి ఆదాయం ఏడు రెట్లు మాత్రమే పెరిగింది.
- ❖ఇజ్రాయిల్‌లో అడవులు ఉండేవి కాదు. ఒకరకంగా చెప్పాలంటే పచ్చదనం లేని ఇజ్రాయిల్ ఎడారి భ్రాంతిని కలిగించేది. అయితే ఇలాంటి పరిస్థితుల్ని

చూస్తూ ఇజ్రాయిలీలు కాలక్షేపం చేయలేదు. తిరిగి తమ గడ్డపై పచ్చదనాన్ని సృష్టించారు. పర్వత ప్రాంతాల్లో కొత్త అడవుల్ని తయారు చేసుకున్నారు. ఎడారి లాంటి నేలల్లో పళ్ళూ, కూరగాయల సాగు జరుగుతోంది.

❖ఇజ్రాయిల్ జనాభా అంతా కలిపితే ఆరు మిలియన్లు దాటదు. అయినా ఇక్కడ 10 యూనివర్సిటీలున్నాయి. అంతే కాదు, అత్యున్నత పరిశోధన, అధ్యయన శాల కోసం మరో పది సంస్థలు పనిచేస్తున్నాయి.

❖ప్రపంచంలో పట్టభద్రులైన కార్మిక వర్గం సంఖ్య ఇజ్రాయిల్‌లోనే ఎక్కువ.

❖వేయిమందిలో శాస్త్ర సాంకేతిక నిపుణుల్ని లెక్కగడితే ఇజ్రాయిల్ అగ్రగామిగా ఉంటుంది. పరిశోధనా పత్రాలు కూడా ఇదే నిష్పత్తిలో రూపొందుతున్నాయి.

❖ఎన్ని అలజడులు, ఉద్రిక్తతలు ఏర్పడినా, ఏనాడూ ఎన్నికల వాయిదా జరగలేదు. నైష్పత్తిక ప్రాతినిధ్యం వల్ల దేశంలోని దజనుకు పైగా రాజకీయ పక్షాలు పార్లమెంటులో ప్రవేశించగలిగాయి. అత్యధిక స్థానాలున్న లేబర్, ఎకిడ్ లాంటి పార్టీల సంకీర్ణాలు అధికారంలో కొనసాగాయి.

❖ఇజ్రాయిలీలు తమ రక్షణ రంగంలో ఉల్లేఖనీయమైన ప్రగతిని సాధించుకున్నారు. కొద్ది నిముషాలు పిలుపునిస్తే ఒక మిలియన్ మందితో త్రివిధ దళాలు తయారవుతాయి. ప్రతి మహిళా, ప్రతి పురుషుడూ రెండేళ్ళపాటూ సైనిక శిక్షణ పొందాల్సి ఉంటుంది. వీరిని "రిజర్వ్ ఆర్మీ"గా పరిగణిస్తారు.

❖రక్షణ పరిశోధన, నమూనాల తయారీ, వారి అభివృద్ధిలో ఇజ్రాయిల్ ఎంతో ముందుంది. కొన్ని సందర్భాల్లో అమెరికా సైతం ఇజ్రాయిల్ చేయూతపై ఆధారపడాల్సి వస్తోంది. రక్షణ పరిశోధన, అభివృద్ధిని పౌరసదుపాయాల కోసం వినియోగించుకుంటారు. రేడియో, ఉపగ్రహ కమ్యూనికేషన్ రంగంలో ప్రపంచ మార్కెట్‌ను తనదైన రీతిలో ప్రభావితం చేస్తోంది ఇజ్రాయిల్.

❖అత్యవసరమైన జల వనరుల నిల్ల విషయంలో ఇజ్రాయిల్ సాంకేతిక పరిజ్ఞానం అత్యద్భుతం. శుష్క ప్రాంతాల అభివృద్ధి, భూసార పెంపుదల, రకరకాల శీతోష్ణ స్థితులకు అనుగుణంగా వ్యవసాయాన్ని తీర్చిదిద్దుకోవడం ఇజ్రాయిలీలు నేర్చుకున్నారు.





❖అరబ్, ముస్లిం రాజ్యాల నుండి తనను తాను రక్షించుకునేందుకు పలుదేశాలతో చక్కని స్నేహ సంబంధాలు చేయాల్సి ఉంటుందని ఇజ్రాయిల్‌కు తెలుసు (టర్కీ ఒక మినహాయింపు. అది అరబిక్ రాజ్యం కాదు. అరబ్ దేశం కాదు కనుక ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌తో స్నేహ సంబంధాల్ని ఏర్పర్చుకుంది. అయితే ఖుమేనీ పెత్తనం ఆరంభమైన తర్వాత ఇరాన్ మారిపోయింది) తనకు తెల్సిన భూసార సాంకేతిక విజ్ఞానం, శుష్క ప్రాంతాల్ని పచ్చగా మార్చడం, జలవినియోగం, సౌరశక్తి తయారీలాంటి వాటిని ఆఫ్రికా దేశాలకు అందించి వారితో స్నేహం చేస్తోంది ఇజ్రాయిల్. లెక్కలేనంత మంది విదేశీ విద్యార్థులు విశ్వ విద్యాలయాల్లో చదువుకుంటున్నారు!

జాతీయవాద స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, శత్రువును నిశ్శేషంగా నిర్మూలించ డంలో చూపించాల్సిన త్యాగం, చొరవ, ఇలాంటి అంశాలకు సంబంధించిన పాఠాల్ని ఇజ్రాయిల్ నుండి మనం నేర్చుకోవాల్సి ఉంది. ఇజ్రాయిలీలు తమ అస్తిత్వం కోసం సాగించిన యుద్ధాల్లో చిన్నారి శిశువుల్ని కోల్పోయారు. ఇలా ఇజ్రాయిలీ సంఖ్యలో పసివాళ్ళను పోగొట్టుకున్న దేశం మరొకటి కన్పించదు. ప్రపంచ దేశాల నుండి వచ్చే శుష్క సానుభూతులు, ఇతరేతర అభిమతాలు తమను శత్రు విజృంభణ నుండి కాపాడలేవని ఇజ్రాయలీలకు తెలుసు. అమెరికా వంటి దేశాలు ఎంతటి స్నేహాన్ని ప్రదర్శిస్తున్నా ఒక సమయంలో తమ దేశ రక్షణకు రక్త త్యాగం చేయవని ఇజ్రాయిల్‌లకు తెలుసు. ఇజ్రాయిల్ తన గడ్డపై పుట్టిన సంతానం వల్లనే రక్షింపబడుతుంది. అది తనదైన రీతిలో సంపదల్ని సాధించుకోవాలి. స్వయంగా తాను అనుకున్న లక్ష్యాల్ని పొందలేని స్థితిలో అమెరికా తదితర దేశాల్లోని యూదులవైపు దృష్టిని సారిస్తుంది ఇజ్రాయిల్. ప్రపంచంలో ఏ మూలన ఉన్న యూదుడైనా ఇజ్రాయిల్ పౌరసత్వాన్ని అందించే ఏర్పాట్లు జరిగాయి. వీళ్ళు ఇజ్రాయిల్ ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవచ్చు. మన దేశంలో జన్మించిన వారిలో పదిమిలియన్ల దాకా విదేశాల్లోనే ఉన్నారు. వీరిపట్ల మనం కూడా ఇజ్రాయిల్ తరహాలోనే వ్యవహరించలేమా? విశ్వంలోని యూదులంతా ఇజ్రాయిల్ వికాసానికి పాలుపడేలా వాళ్ళు పద్ధతుల్ని తయారు చేసుకున్నారు. భారత అభివృద్ధి కోసం మనం కూడా అదే విధానాల్ని అనుసరించలేమా? మన పాలకులు వెనకటి

కాలంలో ఇజ్రాయిలతో ప్రాథమిక స్థాయి స్నేహ సంబంధాలకే వెనుకాడేవారు. ఇజ్రాయిల్‌తో స్నేహం మన దేశంలోని కొన్ని వర్గాలవారికి మనోభూతాల్ని గాయపరుస్తుందని మన నాయకత్వం భావించేది. అయితే గత మూడు నాలుగేళ్ళుగా ఈ సంప్రదాయానికి స్వస్తి పలికారు. ముఖ్యంగా 1998 నుండా భారత–ఇజ్రాయిల్ సంబంధాల్లో చక్కని మార్పులు చోటు చేసుకున్నాయి. ఇరు దేశాల మధ్య సహాయ సహకారాలను కోరుతూ ఒప్పందాలు జరిగాయి. శతాబ్దాలు భారతదేశంలో ఆశ్రయాన్ని పొందిన యూదులు తమ గత అనుభవాల్ని నెమరు వేసుకుంటున్నారు. రెండేళ్ళ క్రితం వారు టెల్ అలీవ్‌లో ప్రపంచ మరాఠీ సమ్మేళణాన్ని నిర్వహించారు. శరద్ పవార్‌తో సహా చాలామంది సభ్యులున్న ప్రతినిధి బృందం టెల్ అవివ్ తరలి వెళ్ళింది. సంస్కృతి, నాగరికత, ఆర్థిక, మానవవికాసం లాంటి ఎన్నెన్నో అంశాల్లో భారత–ఇజ్రాయిల్‌ల మధ్య సమన్వయం, పరస్పర సహకారాలకు అవకాశా లున్నాయి.

ఉ. ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాది మధ్య లయుఁ డెవ్వఁడు సర్వముఁ దాన యైన వాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేఁడెదన్

శ్రీమదాంధ్ర మహాభాగవతం అ.స్క

జగత్తంతా ఎవనిచేత సృష్టించబడ్డదో, ఏవనిలో లయింప (నశింప) బడుచున్నదో, ఆ పరమేశ్వరుడు ఈ చరాచర జగత్తుకు మూలకారకుడు ఆది అంతములేనివాడు, జగత్తంతా తానై ఉన్నవాడు ఎవడో అతనిని ఆత్మలో నున్న వానిని, ఈశ్వరుని నేను శరణు వేడుతానన్నాడు గజేంద్రుడు.





# వైరుధ్యాల సుడిగుండంలో కాంగ్రెస్

**మే 7 - 23 , 1999**

శ్రీమతి ఇందిరాగాంధీ రాజకీయాల పుణ్యమా అని 1969లో మొదటిసారి, 1978లో మరోమారు కాంగ్రెస్ చీలిపోయింది. బలహీనపడింది. పార్టీ శ్రీమతి ఇందిరాగాంధీ స్వంత ఆస్తిగా మారిన తరుణంలో ఎందరో అవాంఛనీయ వ్యక్తులు రాజకీయాల్లోకి ప్రవేశించారు. రాజకీయ రంగాన్ని తమ వృత్తిగా మార్చుకున్నారు. ఇలాంటి వాళ్ళలో చాలామందికి మామూలు ఉద్యోగాలు చేసే అర్హత కూడా లేదు. వీళ్ళు రాజకీయాల్లో చేరింది తమ దీపాన్ని చక్కబెట్టుకునేందుకే తప్ప జాతి హితం కోసం కాదు. నెహ్రూ మార్కు సామ్యవాదం వల్ల ప్రభుత్వం లేదా దానికి సంబంధించిన సంస్థలు మాత్రమే అభివృద్ధి కార్యక్రమాలకు వాహికలుగా ఉండాలన్న ఆలోచన మొదలైంది. ఇలా ప్రభుత్వ సంస్థలు అవినీతికి ఆలవాలమయ్యాయి. నాలుగు దశాబ్దాల సామ్యవాదం అందించిన సామాజిక ఉద్రిక్తతలు, పేదరికం, అసమానతలు, నిరుద్యోగం లాంటి సమస్యలు కొత్తగా రాజకీయ రంగప్రవేశం చేసిన వారి పాలిట వరాలయ్యాయి. ప్రభుత్వ యంత్రాంగంలో కనిపించే అవకతవకలు ఇలాంటి నాయకులకు డబ్బు దండుకునే సాధనాలయ్యాయి. ప్రజల సొమ్ముతో జల్సాగా బతికే ఏనాయకమ్మన్యులు అన్నీ పార్టీల్లోనూ ఉన్నా కాంగ్రెస్ దాని నుండి జన్మించిన జనతాదళ్‌లలో ఇలాంటి బాపతు ఎక్కువ. మొత్తానికి ఇలాంటి నేతలకు సోవియట్ పతనం ఒక నినాదాన్ని దూరం చేసింది. సోవియట్ పతనం దాకా ఈ నాయకులకు సోషలిజం పరమ మంత్రంగా ఉండేది. అయితే సోషలిజం పోయినా దాని స్థానంలో ఏదో ఒక జనాకర్షక మహామంత్రం రావాలి కనుక. నాయకులంతా కలసి సెక్యులరిజాన్ని పట్టుకున్నారు. ఇదో విచిత్రమైన అంశం. విభజన వాదులు, మత ఛాందసవాదులతో నిండిన ముస్లిం లీగ్ సెక్యులర్ పార్టీ, ఇందిరాగాంధీ సిక్కు చేతిలో హత్యకు లోనైందనే ఒకే ఒక్క కారణంతో హస్తినలో మూడున్నర వేలమంది సిక్కుల్ని హతమార్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా సెక్యులరిస్టులే. తాము కబ్జా చేసిన లేదా పరిపాలించిన దేశాల్లోని చర్చిల్ని, మసీదుల్ని మూసీవేయించే కమ్యూనిస్టులు కూడా సెక్యులరిస్టులే. జయలలిత, లాలూప్రసాద్ యాదవ్, బోఫోర్స్ కథలో నాయకులు, నాయికలు, యూరియా కుంభకోణవాలాలు, ఎయిర్‌బస్,

ఎయిర్‌క్రాఫ్ట్, హెచ్.డి.డబ్ల్యు జలాంతర్గాములు, గ్యాస్, పెట్రోల్ పంప్, ఇళ్ళ అలాట్‌మెంట్ వ్యవహారాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నవారు, ముడుపులు తీసుకున్న ప్రముఖులు–ఇలా అతివీర భయంకరమైన అవినీతి పరులంతా సెక్యులరిస్టులే. ఇలా ఎవరికి ఇష్టమొచ్చిన రీతిలో వాళ్ళు సెక్యులర్ వ్యాఖ్యానాల్ని పలికించడం బహుశా మన దేశంలో మాత్రమే సాధ్యమేమో. నిన్న మొన్నటిదాకా మన దేశంలో సెక్యులర్ అన్న పదాన్ని వినగానే "హిందుత్వ వ్యతిరేక" దృక్పథం గుర్తుకు వచ్చేది. అది ఇప్పుడు మరింతగా దిగజారిపోయింది. రాజకీయ దళారులు, వంశ పారంపర్య పాలనను ఆరాధించేవారు, విదేశీ ప్రతిభల్ని దిగుమతి చేసే పెద్దలు, వీరంతా "సెక్యులర్" పదంతో జట్టు కట్టారు. వాళ్ళ లీలా విలాసాలకు కొన్ని ఉదాహరణలు చూడండి:

### మానవ వనరుల్లోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి

భారతదేశం 1991లోనే నెహ్రూ తరహా సోషలిస్టు, కేంద్రీకృత ప్రణాళికా ఆర్థిక విధానానికి స్వస్తి చెప్పింది. అప్పటి నుండి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కోసం ఎన్నో విధాన రూపకల్పనలు చేసుకున్నారు. అయితే ఇప్పటిదాకా విదేశీ పెట్టుబడులు భారతీయ పరిశ్రమలకు, వాణిజ్య వర్గాలకు మాత్రమే పరిమితమయ్యాయి. ఇక ఇప్పటి నుండి మానవ వనరుల్ని పెంచేందుకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతోపాటు విదేశీయులు కూడా తోడ్పడతారని మనం నిశ్చయించినట్టే కన్పిస్తోంది. ఇటలీలో జన్మించిన సోనియాగాంధీ ప్రధని కావడంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టబోతున్నాం. దేశంలో జన్మించిన నూరుమిలియన్ల జనాభాలో ఎవరూ దేశ నాయకత్వానికి అర్హులు కాదని అప్పుడే మనం కనిపెట్టేశాం. విదేశీ ప్రత్యక్ష పెట్టబడులు వాణిజ్యాభివృద్ధికి తోడ్పడతాయని ఇప్పటిదాకా తేలిన నిజం. అయితే విదేశీయులు కూడా మన రాజకీయ పార్టీల వికాసాలకు తోడ్పడగలరని ఇక ముందు మనం నిరూపించబోతున్నాం. ఒక విదేశీ వనితను ప్రధానిని చేయడం ద్వారా దీన్ని నిజం చేయబోతున్నాం.

సోనియాగాంధీ కన్నా ప్రతిభావంతులుగా నిరూపించుకున్న విదేశీ నేతలెందరో ఉన్నారు. మార్గరెట్ థాచర్, జిమ్మికార్టర్, మైకెల్ గోర్బచేవ్ ఇలా ఎంతోమందిని పేర్కొనవచ్చు. ఇటీవలే క్లింటన్ సతీమణి హిల్లరీ యు.ఎస్.సెనేట్‌కు పోటీ చేసి రాజకీయ అరంగేట్రాన్ని జరపాలనుకుంటున్నారు. మన రాజకీయ పార్టీలకు





నాయకత్వం వహించమని కోరుతూ క్లింటన్ సతిని ఆహ్వానిస్తే సరి– అన్నట్టు ఏడాదిన్నర ఆగితే క్లింటన్ కూడా అందుబాటులో ఉంటారు. ఆయననూ మనం సాదరంగా ఆహ్వానించుకోవచ్చు. 21వ శతాబ్దంలో భారతదేశాన్ని శరవేగంగా ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రపంచంలోని ప్రతిభావంతులైన నేతల్ని తమ పార్టీ పదవుల్లో భర్తీ చేసుకోవల్సిందిగా వివిధ రాజకీయ పక్షాలకు నా సలహా.

ఇలా విదేశీయుల్ని సమాహ్వానించడం మన సంప్రదాయంలో పృధ్వీరాజు అధ్యాయాన్ని ముగించేందుకు జయచంద్రుడు గతంలో ఘోరీని ఆహ్వానించాడు. ఓ ఉత్తర భారతరాజు తన శత్రు సంహారం కోసం నాదిర్‌షా లాంటి ఆక్రమణదారుకు స్వాగతం పలికాడు. స్వదేశీ శత్రువుల్ని అణగ దొక్కేందుకు చేయూతనివ్వాలని 18,19వ శతాబ్దాల్లోని జమిందార్లు, మహారాజులు విదేశీ ఫ్రెంచి, ఇంగ్లీషు దారుల్ని ఆహ్వానించారు. ఇప్పటికి మన దేశంలో నలభైకి పైగా పార్టీలున్నాయి. వీళ్ళంతా పాత పురాతన రాజకీయ పక్షమైన కాంగ్రెస్ వారి అడుగు జాడల్లోనే నడుస్తూ, తమ పార్టీల్లో విదేశీయుల్ని భర్తీ చేసి, మన విదేశీ మానవ వనరుల సామర్థ్యాన్ని రుచి చూపింతురుగాక!

### రాజకీయ దళారీలు:

కాంగ్రెస్ పతనానంతరం ముఖ్యంగా 1989 తర్వాత మన దేశ రాజకీయాల్లో దళారీల సంఖ్య పెరిగిపోయింది. వీళ్ళల్లో అగ్రసనాధిపత్యం సుబ్రహ్మణ్యం స్వామికే దక్కుతుంది. ఆయనకున్న పలుకుబడి మరీ పరిమితం. అయితే స్వామి బుర్ర మాత్రం చాలా చురుకైంది. అధికారంలో ఉన్నవాళ్ళ బలహీనతల్ని పట్టేసుకొని బ్లాక్‌మెయిలింగ్ క్రీడలు ఆరంభించడం స్వామిపంథా. నలభైమంది ఎంపిల బలంతో చంద్రశేఖర్ ప్రధాని కావడం వెనుక ఉన్నది స్వామి హస్తమే. జయలలిత పరమ అవినీతి పరురాలని ఆరోపిస్తే ఆమెపై గతంలో ఎడతెరిపి లేని పోరాటం చేసింది కూడా ఆయనే. అలాంటి జయలలితకు సుబ్రహ్మణ్యం స్వామి ఈనాడు మిత్రుడు, మార్గదర్శి. కేంద్ర ప్రభుత్వ పతనానికి ఆమెను తెలివిగా ఉపయోగించుకున్నాడు స్వామి. ఇలా రాజకీయ బ్రోకరిజాన్ని నిర్వర్తిస్తూ ప్రభుత్వాల్ని పతనం చేయడం వల్ల సుబ్రహ్మణ్య స్వామికి దక్కే ప్రయోజనాలేమిటన్నది ఇంకా వెలుగులోకి రాని చిదంబర రహస్యం!

ఇవాళ మనముందు కదలాడుతున్న మరో రాజకీయ దళారీ వృద్ధ మార్క్సిస్టు నేత హరికిషన్ సింగ్ సూర్జిత్. గతంలో మార్క్సిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిలో

ఉన్న వారంతా మేధావులు. తమ భావ జాలాన్ని శక్తివంతమైన రచనల ద్వారా బయటపెట్టగలిగినవారు. అయితే సూర్జిత్ మాత్రం అలా కాదు. ఇతనో రాజకీయ దళారీ. జిత్తులమారి రాజకీయాలు నడపడంలో నేర్పరి, కులతత్వ పార్టీల సరసన చేరడంలో సూర్జిత్‌కు ఎలాంటి అభ్యంతరాలు లేవు. గత కొద్దికాలం నుంచి సాగుతున్న ఎన్నికలు – ఓటింగ్ సరళిని పరిశీలిస్తే కమ్యూనిస్టుల ఓట్లలో భారీ తరుగుదల కన్పిస్తోంది. ఈ మేరకు తాము పార్లమెంట్‌లో ఉల్లేఖనీయ సంఖ్యను సాధించడం అసాధ్యమేనన్నది కమ్యూనిస్టులకు స్పష్టంగా అర్థమైంది. ఈ నేపథ్యంలో ఎత్తుగడలు, వ్యూహాల పేరుతో ఆలమెన్స్, ఫ్రంట్ తదితర వర్గాల ఏర్పాటుకు జిత్తులు వేస్తున్నారు సూర్జిత్. ఆయన మార్క్సిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రభుత్వాన్ని పడగొట్టడమో లేదా అస్థిరం పాలు చేయడమో లక్ష్యంగా పెట్టుకున్నారు. తన చెప్పుచేతుల్లో ఉండే ప్రధాన మంత్రులు అధికారంలోకొస్తే బాధ్యతలేని అధికారాన్ని అనుభవించ వచ్చునన్నది సూర్జిత్ ఆశ. పైగా కీలకమైన నియామకాలన్నీ అస్మదీయులకే వడ్డించుకోవచ్చు కూడా.

రాజకీయ దళారులకు సహకరించేవారు బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన కాన్షీరాం, మాయావతి. కులతత్వ పార్టీ ప్రముఖులు ములాయం, లాలూప్రసాద్‌యాదవ్. రాజకీయ దళారీతనంలో తన వంతుగా పాలుపంచుకున్న మరో ప్రముఖ వ్యక్తి, భారతదేశానికి ప్రధాని కావాలని కలలుగని అవి కల్లలుగానే మిగిల్చుకున్న జ్యోతిబసు, ప్రస్తుతం దేశానికి రెండు రకాలైన దుష్టశక్తుల నుండి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఘోరమైన నేరచరిత్ర ఉన్న శాసనసభ్యులు, పార్లమెంటు మెంబర్లు ఒకవైపు, రాజకీయ దళారీలు మరోవైపు మోహరించి ఉన్నారు.

## అవినీతివలయం మధ్య కాంగ్రెస్

ఇటలీ గడ్డపై జన్మించిన సోనియా, నెహ్రూ కుటుంబీకుడిని వివాహం చేసుకున్న సోనియా, తన కాంగ్రెస్ తప్ప మరే పార్టీ పొత్తు లేకుండా ఏర్పడే సర్కారుకు నాయకత్వం వహించాలనుకుంటున్నారు. ఆమె పెట్టుకున్న ఈ లక్ష్యంలో యథేచ్ఛగా సహకరిస్తూ ప్రోత్సహిస్తున్న దెవరు?

ఆ వ్యక్తి మరెవరో కాదు. పరమ అవినీతి కరమూ, అతి నేరమయమూ అయిన రాజకీయ చరిత్ర కల జయలలిత. అక్రమార్జనపై దాఖలైన 46 అవినీతి కేసుల్లో విచారణ నెదుర్కుంటున్న జయలలిత ఈ మార్గానికి ఎన్నో అవరోధాలు





కల్పిస్తున్నారు. ఇక సోనియాను ప్రోత్సహించిన మరో నాయకుడు శ్రీమాన్ లాలూప్రసాద్ యాదవ్. ఆయన ప్రమేయం ఉన్న వెయ్యికోట్ల రూపాయల దాణా కుంభకోణం జగత్ప్రసిద్ధం. జయ, లాలూ ఇద్దరూ గతంలో జైలుకెళ్ళి ప్రస్తుతం బెయిల్ మీద ఉన్నవారే. అనాథగా మారిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని చేట్టిన విదేశీ వనిత సోనియాకు బేషరతు మద్దతును ప్రకటించింది వీరిద్దరే. ఈ ఇద్దరితో పాటు హరికిషన్‌సింగ్ సూర్జిత్ కూడా చేరి కాంగ్రెస్ కోసం బేరసారాలకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నుండి ఒక లోక్‌సభ సభ్యుడిని చీల్చడంలో వీళ్ళు కృతకృత్యులయ్యారు.

## ఎమర్జెన్సీని రుద్దుతున్న సెక్యులరిజం

శ్రీమతి ఇందిరాగాంధీ సర్కారు విధించిన 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలంలో, ప్రధానిని పొగడ్తలతో ముంచెత్తే వారందరికీ కావల్సినంత స్వేచ్ఛ ఉండేది. "ఇండియాయే ఇందిరా; ఇందిరాయే ఇండియా" లాంటి నినాదాలు ఈ నేపథ్యంలోనే పుట్టాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో హాజరీ బాగా కన్పించేది. సామర్థ్యం కూడా నానాటికీ పెరుగుతున్నట్టే కన్పించింది. ఇదంతా శ్రీమతి గాంధీ అసాధారణ నాయకత్వం వల్లనే సాధ్యమైందని భజనలు చేసేవారు. ఇందిరా సర్కారు సెక్యులరిజాన్ని, సోషలిస్టు వైభవాన్ని, గరీబీ హఠావో లాంటి ఆకర్షణీయమైన నినాదాల్ని పొగిడిన వారి సంగతి సరే కానీ, విమర్శిస్తే మాత్రం శ్రీకృష్ణ జన్మస్థానానికి వెళ్ళాల్సి వచ్చేది. అదంతా అప్పటి సంగతి. ఇప్పుడు మరో అత్యవసర పరిస్థితి తెర మీదికి వచ్చింది. అదే సెక్యులర్ ఎమర్జెన్సీ. మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని భేషుగ్గా జరుపుకోవచ్చు మనం. బ్రాహ్మణాధిక్యాన్ని తుత్తునియలు చేసిందనీ, కులతత్వాన్ని రూపుమాపడంలో చురుకైన పాత్ర పోషించిందనీ, భారతీయ సంగీత సాహిత్యాలకు సేవ చేసిందనీ, ఉర్దూను మనకు బహుమతిగా అందించిందనీ, ఇస్లాం మతాన్ని మనం మనసారా పొగుడుకోవచ్చు. హజ్ యాత్రకు వెళ్ళే భారతీయ ముస్లింలకు మరిన్ని రాయితీలు ఇవ్వాలని మరికొందరు వాదించనూవచ్చు. ముస్లింలు ఏ దేశం నుండైనా నిధుల్ని సంపాదించవచ్చు. దేశంలో సరికొత్త మసీదుల్ని నిర్మించుకోనూ వచ్చు. మదర్సాల్ని తయారు చేసి అందులో అరబిక్ భాషనూ, ఖురాన్ బోధనల్ని విస్తృత పర్చుకోవచ్చు. ఉమ్మడి పౌరస్మృతిపై నిరభ్యంతరంగా తమ అభ్యంతరాల్ని వ్యక్తం చేయవచ్చు. వందేమాతరాన్ని పాడనే పాడమని ముస్లింలు భీష్మించుకొని కూర్చోవచ్చు. వాళ్ళకు

పాక్ జెండాల్ని ఎగరేసే స్వేచ్ఛ ఉంటుంది. భారత జట్టుపై పాకిస్తాన్ క్రికెట్ బృందం విజయాన్ని సాధించిన వేళ ముస్లింలు అమితానందాన్ని అనుభవిస్తుంటే ఇదేమిటని మనం అనకూడదు. ముస్లింలు కుటుంబ నియంత్రణను పాటించకున్నా అడిగే అధికారం ఎవరికీ లేదు. దేశ విభజననాటికి ఆరుశాతం మాత్రమే ఉన్న ముస్లిం జనసంఖ్య కాస్తా ఈనాటికి ఇరవై శాతానికి చేరుకున్నది. ఇందిరాగాంధీ అత్యవసరం పరిస్థితి కాలంలో ఉన్నట్లుగానే ఇస్లాం, ముస్లిం విధి విధానాలు, ముస్లింల కార్యకలాపాల్ని గురించి సంస్కారవంతమైన పద్ధతుల్లోనూ అడిగే వీలు లేదు. అలా ప్రశ్నించినవారు సెక్యులరిజానికి శత్రువులనబడతారు. ముస్లింలకు అణావంతు ఇబ్బందిని కలిగించే అంశాన్ని సైతం చర్చించేందుకు వీలు లేదు. ముస్లిం కళాకారులు హిందూ దేవీ దేవతల్ని నగ్నంగా చిత్రించే హక్కును దాఖలు పర్చుకున్నారు. సరస్వతీ వందనాన్ని వీళ్ళు నికార్సుగా వ్యతరేకిస్తారు. ముల్లాలు చెబుతున్న పలుకుల్ని మన్నించినవారే ఈ దేశంలో ప్రగతివాద, లౌకిక, ప్రజాస్వామ్య, సోషలిస్టు మేధావుల దృష్టిలో సెక్యులరిస్టులు. వారితో విభేదించేవారు మాత్రం విభజనవాదులు. ఇలాంటి వారు ఫాసిస్టులుగానూ భారతీయ లౌకిక నిర్మితిని చెడగొట్టేవారుగానూ ప్రచారాన్ని పొందుతారు.

శా. ఇంతిం తై వటుఁ డింత యై మఱియుఁ దా నింతై నభోవీథిపై
నంతై తోయద మండలాభ్రమున కల్లం తై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంత యై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్ధి యై

శ్రీమదాంధ్ర మహాభాగవతం అ.స్క.

ఇంత ఇంత ఇంత ఎదుగుతూ ఆకాశవీధిలో తోయద మండలాగ్రం దగ్గర వరకు కోటి ప్రభలతో ఎదిగిపోయాడు తర్వాత చంద్రమండలం దాటి, ధ్రువ మండలం దాటి సత్యలోకంవైపు ఎదుగుతూ బ్రహ్మాండమంతా నిండి పోయినాడు.





# భారత ఇజ్రాయిలీలకు మైనార్టీల ముప్పు

**మే 31 - జూన్ 6 , 1999**

ఇజ్రాయిల్ ప్రధాని పదవికి మే 17వ తేదీనాడు ఎన్నికలు జరిగాయి. బహుశా ప్రధానమంత్రిని ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకునే సంప్రదాయం ఇజ్రాయిల్‌కు మాత్రమే ఉందేమో. ప్రధానమంత్రిగా ఎన్నిక కావాలంటే ఆ అభ్యర్థి పోలైన ఓట్లలో సగ భాగాన్ని సాధించుకోవాలి. ఇద్దరి కన్నా ఎక్కువమంది అభ్యర్థులు బరిలో ఉంటే, మూడో స్థానంలో ఉన్న వారిని లెక్కింపు నుండి తొలగిస్తూ వస్తారు. ఇజ్రాయిల్ పార్లమెంట్ కెన్‌సెట్‌లో నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం ఉంది. ఇక్కడ డజను కన్నా ఎక్కువ రాజకీయ పక్షాలు ప్రాతినిధ్యం వహిస్తాయి. 1948 నుండి ఈనాటి దాకా ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా స్పష్టమైన మెజారిటీని సాధించలేకపోయింది. ఇజ్రాయిల్‌ను పరిపాలించినవన్నీ సంకీర్ణ ప్రభుత్వాలు. ఇందులో వివిధ పార్టీలు భాగస్వాములుగా ఉండేవి. భాగస్వామ్య పక్షాలకు అంతర్గతమైన కుమ్ములాటలు ఉండవచ్చుకానీ, జాతిహితం వరకు వచ్చేసరికి అందరిదీ ఒకే మాట, ఒకే పాట. జాతీయ భద్రత, యూదు శరణార్థుల ఆవాసంలాంటి అంశాల్లో అందరూ ఒకే వాణిని విన్పిస్తారు. ఇరాన్, సిరియా, లిబియా, సూడాన్ వంటి దేశాల ధన సహాయంతో అరబ్ ఇస్లామిక్ ఛాందసవాదులు హైజాకింగ్, హత్యలు, బాంబుల దాడులు చేస్తూ ఇజ్రాయిల్‌ను చికాకు పెట్టాలనుకున్నారు. అయినా ఇజ్రాయిలీల జీవితాల్లో ఆనందోత్సహాలు అలాగే ఉన్నాయి. జీవన విలువలు బాగా పెరుగుతూ వచ్చాయి. తాజా ఎన్నికల్లో యహుదా బరాక్ ప్రధానిగా గెలుపొందారు. ఆయనకు అరబ్బులతో జరిగిన యుద్ధాల అనుభవం ఉంది. లికుడ్ పార్టీకి చెందిన బెంజమిన్ నెతన్యాహు ఘోర పరాజయం పాలయ్యారు. యహుదా బరాక్ అద్భుతమైన ఆధిక్యాన్ని సాధించారు.

ప్రధాని పదవికోసం ఒక అరబ్ ఇజ్రాయిలీ కూడా బరిలోకి దిగాడు. ఇలా అరబ్ ఇజ్రాయిలీ రంగంలోకి రావడం ఇది మొదటిసారి. 1948 నాటికి ఇజ్రాయిల్ స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న వేళ ఆ దేశ జనాభా ఆరు మిలియన్లు. ఇజ్రాయిల్‌లో మిగిలిన అరబ్ ముస్లింల సంఖ్య నాటికి లక్ష దాకా ఉండేది. ఇప్పుడా సంఖ్య ఏడు లక్షలకు చేరుకున్నది. అదే విధంగా 1948లో ఇజ్రాయిల్‌లో ఉన్న యూదు జనాభా

రెండు మిలియన్లు. ఈ సంఖ్య ఇప్పటికి నాలుగు మిలియన్లకు చేరుకున్నది. అంటే యూదు శరణార్థులు వలస వచ్చినా వాళ్ళ జనాభా రెట్టింపు మాత్రమే అయిందన్నమాట. అరబ్బులు అపరిమిత జనాభా (అంటే పది నుండి పదిహేను దాకా) ఉన్న కుటుంబాల్ని తరలించుకు రావడంతో వారి జనాభా బాగా పెరిగిపోయింది. ఎన్నికల ప్రచార వేళ అరబ్బుల తరపు ప్రధాని అభ్యర్థి నగ్న సత్యాల్ని నిష్కర్షగా చెప్పుకున్నాడు. ఇకముందు ఇజ్రాయిల్‌ను ఎవరు పాలించారో శాసించే దశకు అరబ్బులు చేరుకున్నారని ఆనందపడ్డాడాయన. అంటే అరబ్బులు ఇక ముందు యూదు పార్టీలపై డిమాండ్ల భారంతో ఒత్తిడి పెంచుతారన్న మాట. అరబ్బుల ఓట్లు దక్కకపోతే గెలవలేమనే భయంతో యూదు పార్టీల నాయకులు వారిని బుజ్జగించేందుకు యత్నిస్తారని అర్థమవుతూనే ఉంది. ఒక భయంకరమైన ఒరవడి తమ దేశంలో తల ఎత్తుతోందని ఇజ్రాయిలీలు గుర్తించారు. ఇజ్రాయిల్‌లో ఉన్న కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలతో సహా పలు రాజకీయ పక్షాలు అరబ్ బుజ్జగింపులకు పాల్పడితే దేశ భద్రత ముప్పులో పడుతుంది. ముఖ్యంగా పాలస్తీనా స్వతంత్ర సార్వభౌమిక రాజ్యంగా అవతరించేందుకు సన్నాహాలు చేస్తున్న వేళ, ఇజ్రాయిల్ పార్టీలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

మన భారతదేశంలో దీనికి సమాంతర దృశ్యాల్ని చూస్తాం. ముస్లిం డిమాండ్ మేరకు ఉపఖండ విభజన జరిగి భారత – పాకిస్తాన్‌లు ఏర్పడ్డాయి. దేశ విభజన తర్వాత ఇక్కడి ముస్లింలు అటు పాకిస్తాన్ వైపో లేదా ఇటు బంగ్లాదేశ్ దిక్కుగానో వెళ్ళకుండా భారత్‌లోనే ఉండిపోయారు. భారతీయులు అందులోనూ హిందువులు అత్యంత సహనీయులుగానూ, క్షమించేవారుగానూ, ఆశావాదులుగానూ ఆలోచించారు. ఇక నుండి ముస్లింలు తమ విభజనవాద తత్వాన్ని విడిచిపెట్టి భారత సమగ్రతపై దృష్టి నిలుపుతారని హిందువులు ఆశించారు. కాంగ్రెస్ పార్టీ బలీయంగా ఉన్నంత కాలం అందరి ఆటలు బాగానే సాగాయి. కొంత కాలానికి కాంగ్రెస్ బలహీన పడింది. వివిధ రకాలైన పార్టీలు రంగం మీదికి వచ్చి చేరాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల జయాపజయాల తేడా శాతం బాగా తగ్గిపోయింది. ఐదు శాతం ఓట్లు అటూ ఇటు ఓటు చేసే వర్గాలకు డిమాండు పెరిగింది. ఛాందసవాద, నిరక్షరాస్య, ముల్లాలు, మౌల్వీల మౌలనాల నేతృత్వంలో ముస్లింలంతా ఒకేవైపు ఓటు చేస్తూ వచ్చారు. తొలుత వీరంతా కాంగ్రెస్‌కు ఓటేశారు. అలా చేయకపోతే





హిందూ రాజ్యం ఏర్పడుతుందన్న రీతిలో కాంగ్రెస్ బెదరగొట్టింది. కాంగ్రెస్ బలహీనపడింది. జనతాదళ్, బహుజన సమాజ్‌పార్టీ, ఇతర ప్రాంతీయ పార్టీలు ముస్లిం ఓటు బ్యాంకుకు దగ్గరయ్యాయి. వీరిలో ఎవరు భారతీయ జనతాపార్టీని ఓడించగల్గితే వారు ముస్లింలకు మరింత సన్నిహితులు! 1947 కన్నా ముందు కాంగ్రెస్‌ను హిందూ కాంగ్రెస్ అన్నట్టుగానే, ఇప్పుడు వారు బిజెపిని హిందూ పార్టీ అని పిలుస్తున్నారు. ముస్లిమేతరులు ఎక్కువ సంఖ్యలో ఉన్న భారతదేశాన్ని ముస్లిమేతరులు పరిపాలించడం వారికి ఇష్టం ఉండదు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ముస్లింల పాలనే ఎందుకు సాగాలని ప్రశ్నిస్తే ముస్లింల నుండి ఎలాంటి జవాబు ఉండదు. ఈ దేశాల్లో హిందూ, సిఖ్ఖు, క్రిష్టియన్‌లకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వరన్న ముస్లింల నుండి సరియైన జవాబు రాదు. 140 నియోజక వర్గాల్లో తమ ఓటింగ్ సరళి జయాపజయాల్ని ప్రభావితం చేయగలవని చెబుతున్నారు ముస్లింలు. ఈ సందర్భంలో ఇజ్రాయిల్ అరబ్ ప్రధాన మంత్రిత్వ అభ్యర్థి మాటలు గుర్తుకు వస్తాయి. విపరీతమైన జనాభా పెంపుదలతో భారత, ఇజ్రాయిల్‌ల్లోని ముస్లింలు తమ సంఖ్యను పెంచుకుంటున్నారు. ఇదంతా వాళ్ళు తమ ఇష్ట ప్రకారమే జరుపుతున్నారు. దేశ విభజన సమయంలో భారత ముస్లింల జనాభా ఆరుశాతం. 1991 నాటికి పది శాతానికి పెరిగింది. నిజానికి, ఇప్పటికది 15 – 21 శాతానికి చేరుకున్నదని చెబుతున్నారు. ఇజ్రాయిల్‌లో కూడా ముస్లింల సంఖ్య 16 శాతానికి వచ్చేసింది. ముస్లింలకు ప్రత్యేక ఎలక్టోరేటు, రిజర్వుడు సీట్లు కావాలన్న డిమాండు విన్పిస్తోంది. ఇది ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ప్రచారం చేసిన ముస్లింలీగ్ పూర్వ డిమాండ్‌కు దగ్గరగా ఉన్నాయి. ఇజ్రాయిల్ ఉత్తర ప్రాంతంలో ముస్లిం అరబ్బుల జనాభా ఎక్కువ. ఇలా ఉత్తర ప్రాంతంలో ముస్లిం జనాభా పెరుగుతూ పోతే అది చివరకు అరబ్ ముస్లిం ద్వీపంలా మారుతుందేమోనని ఇజ్రాయిలీలు భయపడుతున్నారు. మన దేశంలోనూ అలాంటి పరిస్థితులున్నాయి. బుజ్జగింపు దారులుగా పేరెన్నికగన్న కమ్యూనిస్టులు అలాంటి ప్రత్యేక ప్రాంతాలకు నాంది పలుకుతున్నారు. కమ్యూనిస్టులు ఏర్పరచిన కేరళలోని మల్లపురం జిల్లా, కాంగ్రెస్ రూపొందించిన హైదరాబాద్‌కు చెందిన కులీకుతుబ్‌షా డెవలప్‌మెంట్ అథారిటీ అలాంటివే. ఒకవేళ భారతీయ జనతాపార్టీ కనుక బలపడితే దేశం మరో మారు విభజన వైపు వెళుతుందని కాంగ్రెస్ బడా లీడర్ గులాం నబీ ఆజాద్ చిలుక పలుకులు చెబుతున్నాడు. పశ్చిమ బెంగాల్‌లో మార్క్సిస్టు ప్రభుత్వం లక్షమంది

బంగ్లాదేశ్ ముస్లింలను దిగుమతి చేసుకున్నది. కలకత్తాతో పాటు మరికొన్ని ఇతర జిల్లాలు ముస్లిం మెజారిటీ ప్రాంతాలుగా మారిపోయాయి. స్వాతంత్ర్యాన్ని పొందిన ఆరవ దశకంలో, భారత, ఇజ్రాయిల్‌లు ఒకే రకమైన సమస్యల్ని ఎదుర్కొనే అవకాశాలున్నాయి. ఈ మేరకు జాతీయ భద్రతా ప్రమాదాల నుండి బయటపడే విషయంలో భారత – ఇజ్రాయిల్ దేశాలు పరస్పరం పాఠాలు నేర్చుకోవాలి.

ఇజ్రాయిల్ సాయుధ దళాల్లో అరబ్ ముస్లింలకు స్థానం లేదు. ఇంకా కొద్ది రోజుల తర్వాత అరబ్బుల ఓటు హక్కును తొలగించేందుకు కూడా ఇజ్రాయిల్ పాలకులు ఆలోచించాల్సి రావచ్చు. ముఫ్పై సెటిల్మెంట్లలో లక్షమంది యూదులున్నారు. ఇదంతా పాలస్తీనా రాజ్యంగా మారబోతోంది. అయితే ఇప్పుడది ఇజ్రాయిల్ ఆధీనంలోనే ఉంది. పాలస్తీనాలోని యూదులకు సరియైన హక్కుల్ని కల్పిస్తేనే, తమ దేశంలో ఉన్న అరబ్ ముస్లింలకు వాటిని అందిస్తామని ఇజ్రాయిల్ స్పష్టం చేసే అవకాశాలున్నాయి. అంతర్గత, బాహ్య భౌగోళిక దురాక్రమణలు జరగకముందే ఈ విషయంలోనూ మన దేశం తగిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

**కూరిమిగల దినములలో**
**నేరము లెన్నడును కలుగనేరవు మరి యా**
**కూరిమి విరసంబైనను**
**నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!**

భావం: పరస్పరము స్నేహమున్న రోజుల్లో తప్పులేవి కన్పించవు. ఈ స్నేహం చెడగానే వారి మాటలు, చేతలు అన్నీ తప్పుగానే కనబడుతాయి. నిజమిది.





# భారత్‌లో పాకిస్తాన్ చొరబాటు కుయుక్తులు

**జూన్ 28 - 4 , 1999**

ఒక్క కాశ్మీర్‌లోనే కాదు భారత ఉపఖండంలో ఉన్న ముస్లింల విషయంలో పాకిస్తాన్ వైఖరి ఏమిటనేది సుస్పష్టం. ముస్లిమేతరులకు భిన్నంగా ముస్లింలు ప్రత్యేక దేశంగా ఏర్పడాలన్న భావనతోనే పాక్ అవతరించింది. పాకిస్తాన్ భారత ఉపఖండంలో ముస్లింల జాతీయ కేంద్రంగా ఏర్పడింది. భారతదేశంలోని యావన్మంది ముస్లింల మద్దతు ముస్లింలీగ్‌కు అందింది. 1946 ప్రాంతీయ సభలకు జరిగిన ఎన్నికల్లో ముస్లింలీగ్ అభ్యర్థులకే ముస్లింలు తమ ఓటు వేసి గెలిపించారు. మౌలానా అబుల్‌కలాం ఆజాద్, రఫీ అహ్మద్ కిద్వాయ్ వంటి కొద్దిమంది ముస్లిం నేతలు ముస్లింలీగ్ వేర్పాటువాద రాజకీయాల పట్ల అసమ్మతిని తెలిపారు. అయితే ఇలాంటి వారికి ముస్లింలలో ఉన్న పలుకుబడి తక్కువ. ప్రస్తుత పాకిస్తాన్ భూభాగంలో ముస్లింలీగ్‌కు ఎలాంటి బలమైన అనుచరగణం ఉండకపోయేది.

దేశ విభజన తర్వాత, ముస్లిం జనాధిక్యత ఉన్న కాశ్మీర్ తమలో విలీనమవుతుందని పాకిస్తాన్ ఊహించింది. కాశ్మీర్ మహారాజును పదవీ భ్రష్టుడిని చేసి యావత్తు జమ్మూ కాశ్మీర్‌ను తనలో కలుపుకోవాలని పాక్ పథకం వేసింది. అందుకే ఆటవిక మూకలతోనూ, తన సైన్యంతోనూ దాడులు చేయించింది. అప్పుడు జమ్మూకాశ్మీర్ భారతదేశంలో విలీనమై పోయింది. భారత సైన్యాలు రంగప్రవేశం చేశాయి. భారత విలీన పత్రంపై కాశ్మీర్ మహారాజే సంతకం చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు షేక్ అబ్దుల్లా దీనికి ఆమోద ముద్ర ఏశారు. అప్పటిదాకా జైలులో ఉన్న అబ్దుల్లా విడుదలయ్యారు. పాక్ దురాక్రమణను గురించి ఐక్యరాజ్యసమితిలో విన్నవించుకున్న సంగతి అందరికీ తెలిసిన చరిత్ర.

1947 నాటి నుండి పాకిస్తాన్‌లో ఉన్న రాజకీయ పార్టీలన్నీ కొత్త వాదన నెత్తుకున్నాయి. కాశ్మీర్ జనాధిక్యత ఉన్న ప్రాంతం కనుక అది తమకే దక్కాలన్నది పాక్ రాజకీయవాదుల కుతర్కం. ఈ మొండి వాదనను పాక్ అలాగే విన్పిస్తూ వచ్చింది. కాశ్మీర్‌లో ఉన్న ముస్లింలు భారత పాలన నుండి విముక్తి పొందేందుకు నైతిక, మతపరమైన చేయూత నిస్తున్నామని పాకిస్తాన్ పదేపదే ప్రకటించింది. పాక్ ధోరణిని గురించి తెలియని భారతీయుడు ఉంటారని నేననుకోను.

1948, 65, 71 యుద్ధాల పరాజయాలు కూడా పాకిస్తాన్ వాదనలో మార్పును తీసుకొని రాలేదు. కాశ్మీర్ సమస్య ఇంకా అలాగే ఉన్నదని చెప్పేందుకు పాక్ ప్రయత్నాలు సాగుతూ వచ్చాయి. కాశ్మీర్ ముస్లిం ప్రాంతం కావడం వల్ల తమకే చెందుతుందన్న పాకిస్తాన్ వాదనలు అలాగే కొనసాగాయి.

కాశ్మీరీయుల్ని భారత్ నుండి దూరం చేసే క్రమంలో పాకిస్తాన్ జరపని ప్రయత్నం లేదు. కాశ్మీరీయులకు ఆయుధాల్ని అందించడం, వాళ్ళు ఒకవేళ సరిగ్గా సమీకరించబడకపోతే సాయుధులైన చొరబాటుదారుల్ని పంపించడం పాక్ చేసిన కుయత్నాలు. ముస్లిం మెజారిటీ ఉన్న కాశ్మీర్ భారత్‌లో కాకుండా పాకిస్తాన్‌లోనే అంతర్భాగం కావాలని ఆ దేశం అనుకుంటున్నన్ని రోజులు ఇలాగే ఉంటుంది. కాశ్మీర్‌ను తనలో కలుపుకోవాలన్న కబ్జాదారు ధోరణిలో పాకిస్తాన్ ఉండటం వల్లనే అసలు ఇబ్బందులన్నీ ఎదురవుతుతున్నాయి.

ఒకవేళ కాశ్మీర్‌ను తమకు అప్పగించకపోతే అక్కడే కాదు దేశంలోని మరెన్నో ప్రాంతాల్లో అలజడులు సృష్టిస్తారని స్పష్టంగా చెబుతోంది. మత కల్లోలాల్ని సృష్టించడం, వేర్పాటు వైఖరుల్ని, తీవ్రవాద ధోరణుల్ని పెంచడం, హత్యాకాండను జరిపించడం, శాంతి భద్రతల సమస్యల సృష్టి, భారత రక్షణకు పెను విఘాతాన్ని కల్పించడం పాకిస్తాన్ లక్ష్యాలు. ముస్లింలు విభిన్న జాతీయులని ప్రచారం చేసేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. వాళ్ళు భారతదేశంలో సురక్షితంగా ఉండలేరని అంటుంది. భారత ముస్లింలు "సెక్యులర్" అని గుర్తించిన వారే పాలించాలని పాకిస్తాన్ ప్రచారం చేయిస్తుంది. ఈ లక్ష్య సాధనకే భారతదేశంలోకి ఐ.ఎస్.ఐ ఏజెంట్లను దింపుతోంది. పలువురు ముస్లింలను తమ అతిథేయులగానూ, సహాయకుల రూపంలోనూ నియమించుకుంది. భారీ మొత్తంలో ఆయుధాల్ని, ఆర్.డి.ఎక్స్ వంటి మందుగుండు సామాగ్రిని సరఫరా చేసింది పాకిస్తాన్. మత కల్లోలాలు, భవనాల విధ్వంసం, హత్యా కాండల్లాంటివన్నీ పాకిస్తాన్ ఐ.ఎస్.ఐ ప్రేరేపణతోనే జరుగుతున్నాయి. ఇది భారతదేశానికి ఆందోళనను కలిగిస్తోంది. "మేం చెప్పిన పద్ధతుల్లో శాంతి, కుదుర్చుకోండి. లేకుంటే మీరు ప్రశాంతంగా ఉండలేరు. మీరు పలు అలజడుల్ని విద్రోహక్రియల్నీ, విచ్ఛిన్న శక్తుల్నీ చూడాల్సి వస్తుంది" అని పాకిస్తాన్ ప్రేలాపన చేస్తున్నట్టు కన్పిస్తోంది. భారత భద్రతా బలగాలు, విపరీతమైన డబ్బు చిన్నస్థాయి శాశ్వత సమరంలో ఖర్చయిపోతున్నాయి.



తమసోమా జ్యోతిర్గమయ

**భారత ప్రతిక్రియ**

కాశ్మీర్‌లో వేర్పాటు, విచ్ఛిన్నకర వాదాలు సరిహద్దుల చొరబాటు ఫలితాలే. అయితే తూర్పు ప్రాంతంలో మాత్రం సమరాలు సాగుతూ వచ్చాయి. పాకిస్తాన్‌తో జరిగిన ప్రతి యుద్ధంలోనూ భారతదేశం విజయాన్ని సాధించింది. పాక్ పెను నష్టాల్ని ఎదుర్కోవల్సి వచ్చింది. అయితే ఈ యుద్ధ విజయాలు అందించాల్సిన ప్రయోజనాలు శాంతి వేదికల దగ్గరికి వచ్చేసరికి నీరుగారిపోయాయి. 1948, 1965 అటు తర్వాత 1971 సంవత్సరాల్లో ఇదే పరంపర కొనసాగుతూ వచ్చింది. ఇది మరోమారు పునరావృతం అయ్యే అవకాశాల్ని కూడా కాదనలేము. ఇజ్రాయిల్ – పాలస్తీనా యుద్ధాల పర్యవసానాలకు ఇది పూర్తి విరుద్ధమైన దిశలో కన్పిస్తుంది. పాలస్తీనా మద్దతుతో అరబ్ దేశాలు ఇజ్రాయిల్‌పై దాడులు చేశాయి. అక్కడ తీవ్రవాదం, హత్యాకాండ, కిడ్నాపింగ్, హైజాక్ చేయడం లాంటి చర్యలకు పాల్పడ్డాయి. తుదకు యుద్ధాలు సాగాయి. 1947–48, 1967, 1973లో ఇలాంటి యుద్ధాలు సంభవించాయి. 1982లోనూ చిన్నపాటి యుద్ధం జరిగింది. అయితే యుద్ధం జరిగిన ప్రతిసారీ ఇజ్రాయిల్ తన ప్రత్యర్థి భూభాగంలోకి చొచ్చుకొని పోయి అక్కడ కావల్సిన స్థాయిలో వీరవిహారం చేసింది. కాశ్మీర్ విషయంలో వలెనే ఇక్కడ కూడా ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుంది. అయితే ఐక్యరాజ్యసమితి రూపొందించే ఎలాంటి ఒప్పందమైనా ఇజ్రాయిల్ ఇష్టాయిష్టాలపైనే ఆధారపడాల్సి వచ్చింది. చివరకు ఇజ్రాయిల్ మాట చెల్లుబాటు అవుతూ పోయింది. తాను ఆక్రమించిన భూభాగాల్ని ఇజ్రాయిల్ తిరిగి ప్రత్యర్థులకు ఇచ్చివేసింది. అయితే అంతకుముందే శత్రువర్గాలకు కొన్ని ఖచ్చితమైన షరతుల్ని చూపింది ఇజ్రాయిల్. భారతదేశం అవలంబిస్తున్న ధోరణికి ఇది పూర్తి భిన్నం.

సమయాన్ని కాచుకొని పాకిస్తాన్ దాడులు చేస్తుంది. ఒకవేళ ఓడిపోతే తనకు పోయేదేమీ లేదని పాకిస్తాన్ అనుకుంటుంది. భారతదేశం తమ భూభాగంలో కొంతమేర ఆక్రమించుకున్నా దాన్ని తిరిగి ఇచ్చివేస్తుందని పాకిస్తాన్ నిశ్చితాభిప్రాయం. మొత్తం మీద యుద్ధ ప్రయత్నింతో పాకిస్తాన్ కోల్పోయేదేమీ లేదన్నమాట. అయితే భారత్ మాత్రం డబ్బునూ, ఆయుధాల్ని, వీర జవాన్లనూ పోగొట్టుకోవల్సిన పరిస్థితి.

## పరిస్థితులు ఇలాగే కొనసాగాల్సిందేనా?

ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగాల్సిందేనా? అన్నది ప్రశ్న. ఇజ్రాయిల్‌ను జయించడం దాదాపు అసాధ్యమని దాని శత్రువర్గాలు స్థిరపర్చుకున్నాయి. అందువల్ల అవి శాంతి ప్రయత్నాలతో ముందుకు వచ్చాయి. ఇలాంటి పరిస్థితులు భారత దేశ విషయంలోనూ సాధ్యమవుతాయా? జయించలేని యుద్ధాలు అదే పనిగా చేసి, నష్టాల పాలుకావడం కన్నా భారతదేశంతో శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే మేలని పాకిస్తాన్ అనుకునే పరిస్థితులు ఏర్పడతాయా?

భారతదేశంలోని పలు నగరాల్లో ఇంటర్ సర్వీసెస్ ఇంటలిజెన్స్ (ఐ.ఎస్.ఐ) ఏజెంట్లు తిష్ఠ వేశారన్న సంగతి అందరికీ తెల్సిందే. ఐ.ఎస్.ఐ ఏజంట్ల ఆయుధ సంపత్తి, ఆర్.డి.ఎక్స్ వంటి ప్రేలుడు సామాగ్రి పలుమార్లు భారత అధికార బృందాల చేతికి చిక్కింది. భారతదేశంలో అలజడులు సృష్టించేందుకు ఐ.ఎస్.ఐ పన్నుతున్న విష వ్యూహాలు అర్థమవుతున్నా వీళ్ళలో కొంతమంది జైలుగోడల మధ్య ఉన్నారు. అయితే ఏజంట్లలో ఎవరికీ ఇప్పటిదాకా తీవ్రమైన శిక్షలు పడలేదు. మైనారిటీల ఓట్ల కోసం తాపత్రయ పడే రాజకీయ పక్షాలు వారి సెంటిమెంట్లకు విఘాతం ఏర్పడుతుందని వాదిస్తూ ఉంటాయి. కనీసం ఇప్పటికైనా ఈ తరహా ధోరణికి చరమగీతాన్ని పాడాలి.

ఐ.ఎస్.ఐ ఏజెంట్ల ఆర్.డి.ఎక్స్ మందుగుండు నిల్వలు, ఇతర ఆయుధ సామాగ్రి లభించిన ప్రాంతాల్ని ప్రభుత్వం ఎందుకు పేల్చివేయకూడదు? ఐ.ఎస్.ఐ ఏజెంట్లకు ఆశ్రయమిచ్చిన వారి పౌరసత్వాన్ని ఎందుకు రద్దు చేయకూడదు? ఈ రకమైన వ్యక్తులందరినీ దేశ ద్రోహులుగానూ, శత్రుదేశాల ఏజెంట్లుగానూ ఎందుకు ప్రకటించకూడదు? దేశంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పాకిస్తాన్ ఏజంట్లు వారి సహాయకులపై కఠినమైన ధోరణిని ప్రదర్శించిన వేళ, ఉద్రిక్తతలు సరిహద్దుల వరకే పరిమితమయ్యే అవకాశం ఉంటుంది.

ఇక్కడ కొన్ని ఆసక్తికరమైన పరిణామాలు జరిగాయి. కమ్యూనిస్టుల ఏలుబడి నాటికన్నా ఇప్పటి రష్యాయే భారతదేశానికి దృఢమైన మద్ధతును పలుకుతోంది. వాస్తవాధీన రేఖ హద్దుల్ని దాటుతూ పాకిస్తాన్ సాగిస్తున్న దుందుడుకు చర్యలన్ని సమర్థించేందుకు చైనా ఆసక్తి చూపడం లేదు. అఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ సేనల దాష్టీకాన్ని కూడా చైనా ఇష్టపడలేదు. కొన్ని పశ్చిమాసియా దేశాల్లో నానాటికీ





పెరుగుతున్న ఛాందసవాదం చైనాను కలవరపెడుతోంది. నైరుతి చైనాలో పెరుగుతున్న ముస్లిం వేర్పాటు వాదం చైనాను భయపెడుతోంది. పాకిస్తాన్‌కు చైనా మద్దతు పలుకకపోవడానికి ఇది కూడా కారణం. కమ్యూనిజం పతనం వల్ల ఇక తాము కమ్యూనిస్టు వ్యతిరేక దేశానికి చేయూతనివ్వాల్సిన అవసరం లేదని అమెరికాకు అర్థమైపోయింది. అందుకే కాశ్మీర్‌లో కానీ, భారతదేశంలోని మరే ప్రాంతంలోనైనా పాకిస్తాన్ చర్యలకు అమెరికా ఆమోదం తెల్పడం లేదు. ఈ నేపథ్యం పాకిస్తాన్ కుతంత్రాల, దుష్ప్రచారాల నిజ స్వరూపాన్ని ప్రపంచానికి చాటేందుకు భారతదేశానికి బలాన్నిచ్చింది. సంతుష్టీకరణ విధానాల్ని అనుసరించక, దృఢంగా నిలిస్తే దేశ ఘన విజయం తథ్యం!

అభివృద్ధి లేమితో దూరమైన కాశ్మీరీల హృదయాల్ని భారతదేశం చూరగొనాలని కొంతమంది అంటూ ఉంటారు. నిజానికి, తలసరి అంచనాల్ని లెక్కిస్తే, చాలా రాష్ట్రాల కన్నా కాశ్మీర్‌పైనే ఎక్కువ ఖర్చు పెట్టడం జరిగింది. బహుశా ఈ మొత్తంలో ఎక్కువ భాగం ప్రభుత్వంలో పెత్తనాన్ని చెలాయించే అవినీతి రాజకీయవేత్తల జేబుల్లోకి వెళ్ళి ఉంటుంది. అభివృద్ధి లేకపోవడం వల్లనే కాశ్మీరీలు వేర్పాటువాదం వైపు మొగ్గు చూపుతున్నారన్న తర్కాన్ని మనం నిర్ద్వంద్వంగా తోసి పుచ్చాల్సి ఉంటుంది. భారత ప్రభుత్వం నుండి అవసరమైనంత సహాయ సహకారాలు తీసుకున్న రాష్ట్రమేదైనా ఉందా? కాశ్మీర్ కన్నా ఒరిస్సా తలసరి ఆదాయం, అభివృద్ధి తక్కువ కాదా? ముస్లిం మెజారిటీ ఉన్నందువల్లనే కాశ్మీర్‌ను నిర్లక్ష్యం చేశారన్నది నిజాయితీ లేని వాదన. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం వరకే తీసుకుందాం. అక్కడ “లే” ప్రాంతం కన్నా కాశ్మీర్ లోయ అభివృద్ధి కోసం ఎక్కువ మొత్తాన్ని ఖర్చు చేయడం జరిగింది.

“లే” స్థితిగతులేమిటి? కాశ్మీర్ లోయలోని ప్రజలకే ఉద్యోగావకాశాలు ఎక్కువ లభిస్తున్నాయా లేకుంటే, జమ్మూవాళ్ళకు ఎక్కువ దొరుకుతున్నాయా? అసమాన అభివృద్ధి, అవినీతి, అభివృద్ధికి సంబంధించిన నిధుల దుర్వినియోగం ఒక్క ప్రత్యేక రాష్ట్రానికే పరిమితమైనవి కావు. అవి ఒక మతం లేదంటే ఒక ప్రాంతం ప్రజలకు సంబంధించి ఉండవు. అయితే అవినీతి సర్కార్లను మనం ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.

వాస్తవాధీన రేఖ గీయనే లేదనీ, ఒకవేళ గీసినా అందులో స్పష్టత లోపించిందనీ పాకిస్తాన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని అమెరికా, ఇంగ్లండ్ పత్రికలు పట్టించుకోలేదు. గతంలో ఈ దేశాల పత్రికలు పాకిస్తాన్ చర్యలకు వత్తాసు పలికేవన్న సంగతి తెల్సిందే. గతంలో ఒకసారి చైనా దేశం మన ప్రాంతంలోని ఆక్సాయ్‌చిన్‌ను ఆక్రమించుకుంది. అక్కడ దర్జాగా రోడ్లను కూడా నిర్మించుకుంది. పదేళ్ళ తర్వాత ఈ వ్యవహారం యావత్తూ బయటపడింది. ఆక్సాయ్‌చిన్ భారతదేశంలో అంతర్భాగమేనని మనం యదార్థాన్ని వాదించాం. అయితే ఆక్సాయ్‌చిన్ భారత ప్రాంతమే అయితే అక్కడ రోడ్లు, వేసిన సంగతి కూడా మీకు తెలియకుండా ఎలా ఉంటుందని చైనా ప్రతివాదనకు దిగింది. ఇదే కథను వాస్తవాధీన రేఖ విషయంలోనూ పునరావృతం చేయాలన్నది పాకిస్తాన్ పన్నాగం. మెల్లగా వాస్తవాధీన రేఖను దాటి భారత భూభాగాల్లో తన మూకల్ని తిష్ట వేయించి, అడ్డదిడ్డమైన వాదాలతో అందిపుచ్చుకోవచ్చునని పాకిస్తాన్ అనుకొంది. ఈ పన్నాగాన్ని మనం ఆలస్యంగా గుర్తించాం. ఇది నిజంగానే మన బలహీనత అని ఒప్పుకోక తప్పదు. నిజానిజాల్ని భారతదేశ జనతకు అటు తర్వాత నిఖిల ప్రపంచానికీ చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. భారత–పాకిస్తాన్‌ల మధ్య జరిగిన ప్రతి శాంతియుత ఒప్పందాన్ని మనవైరి దేశం ఎలా నీరు కార్చిందన్న సంగతిని విస్తృత ప్రచారం ద్వారా తెలియజేయాల్సి ఉంది. ఈ మేరకు అమెరికా, చైనా, జర్మనీ, ఇంగ్లండ్, రష్యా వంటి దేశాల రాజధానుల్లో పాక్ దుష్ప్రచారాలు, నీచవ్యూహాల్ని గురించిన ప్రభావవంతమైన ప్రచారం సాగాలి. నిజమేమిటో మనకు తెలుసు. అయితే ఈ నిజాలేవి పాశ్చాత్య ప్రపంచానికి తెలియవు. పైగా పాశ్చాత్య ప్రపంచంలోని పలు దేశాలు పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయి కూడా.

ప్రభుత్వం గతంలోవలె కాకుండా దృఢంగా స్పష్టమైన ధోరణిలో వ్యవహరిస్తోందన్నది నిఖార్సైన వాస్తవం. ప్రభుత్వం సైనిక బలగాలకు సంపూర్ణమైన స్వేచ్ఛను అందించింది. ఆపరేషన్ విజయ్ పూర్తి కావడానికి భారత వైమానిక దళాలు రంగప్రవేశం చేశాయి. ఈ నేపథ్యంలో ఎదురయ్యే అనేక ఇబ్బందుల్ని గురించి ప్రభుత్వం ఏ మాత్రం జంక లేదు.

నెహ్రూ ఆలోచనలతో పుట్టిన అలీనోద్యమ సభ్యత్వ దేశాల్లో చాలావరకు ప్రస్తుత పరిస్థితులపై మౌనముద్ర దాల్చడాన్ని గురించి భారతదేశం ఆలోచించాల్సి





ఉంటుంది. వామపక్ష ప్రజాస్వామ్య, సెక్యులర్, సోషలిస్టు, అభ్యుదయవాదులు విపరీతంగా ప్రశంసించే అలీనోద్యమం, కమ్యూనిస్టు శిబిరానికి చేరువగా ఉంటూ పాశ్చాత్య ద్వేషాన్ని పెంచుకున్న సంగతి బహిరంగ రహస్యం. చివరకు, నెహ్రూ హయాంలో చైనా మనపై దురాక్రమణ జరిపినపుడు కూడా అలీనోద్యమ దేశాలు నోరు మెదపలేదు. అలీన దేశాలు ఇప్పుడే కాదు, 1965లోనూ, ఆటు తర్వాత 1971లో కూడా పాకిస్తాన్ మనతో కయ్యానికి కాలు దువ్వినపుడు ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయాయి. ఎప్పటికైనా భారతదేశపు స్వీయ శక్తి సామర్థ్యాలే రక్షాకవచాలు. అలీనోద్యమ వేదికలపై అట్టహాసంగా విన్పించే కరతాళ ధ్వనులు, హంగులూ, ఆర్భాటాలు భారత్‌కు అందించ గల చేయూత శూన్యం.

1947, 48 సంవత్సరాల్లో పాక్ వెన్నుదన్నుతో ఆటవిక మూకలు కాశ్మీర్ మీద దాడులు సాగించినపుడు, మన దేశంలోని ఒక్క ముస్లిం సంస్థ అయినా ఈ చర్యను ఖండిస్తూ ముందుకు రాలేదు. ఇదే సమయంలో అప్పటి వైస్రాయ్ మౌంట్‌బాటెన్ ఒత్తిడి మీద ప్రధాని నెహ్రూ కాశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితికి నివేదించారు! సమస్యను అంతర్జాతీయం చేశారు. పాకిస్తాన్ ఏర్పాటైనా అక్కడికి వెళ్ళకుండా ఇక్కడే ఉంటున్న ముస్లింలందరూ భారత్‌కు వెన్నుదన్నుగా నిలవాలని సర్దార్‌పటేల్ పిలుపునిచ్చారు. అరమిలియన్ పౌరులు పాల్గొన్న కలకత్తా మైదాన్ సభలో (1948 జనవరి 3) ఆయన మాట్లాడుతూ “ఒక్క విషయం మాత్రం నిర్వివాదం. ఈ దేశంలో నాలుగున్నర కోట్లమంది ముస్లింలున్నారు. వీళ్ళు పాకిస్తాన్ ఏర్పాటుకు మద్దతు తెలిపారు. ఇలాంటి వాళ్ళు రాత్రికి రాత్రే తమ మనసు మార్చుకుంటారని ఎలా నమ్ముతాం” అన్నారాయన. మరో మూడు రోజుల తర్వాత లక్నోలో ప్రసంగించారు పటేల్. “వాళ్ళు (పాకిస్తాన్ అనుకూలమైన భారత ముస్లింలు) భారత యూనియన్ పట్ల తమ విధేయత వట్టి మాటలతో చెబితే సరిపోదు. ఇలాంటి సందిగ్ధ సయయంలో వట్టి మాటలు పనికిరావు. భారత యూనియన్ పట్ల విధేయత ప్రకటించిన ముస్లింలు అందుకు సరియైన సాక్ష్యాధారాల్ని చూపాలి” అని పేర్కొన్నారు. “సరిహద్దుల్లో పాక్ సహాయ సహకారాల్ని అందుకుంటూ ఆటవిక మూకలు దాడులు చేస్తుంటే మీరంతా దాన్ని ఎందుకు ఖండించలేదని ప్రశ్నిస్తాను నేను” అని అన్నారాయన. “కాశ్మీర్ విషయంపై మీరంతా (ముస్లింలు) ఎందుకు మౌనముద్ర దాల్చారు? అంటూ అఖిల

భారత ముస్లిం కాన్ఫరెన్స్‌లో అడిగాను నేను” అని చెప్పారు పటేల్ (సర్దార్ పటేల ఉపన్యాసాలు, పుట:57,62)

విజయవాడ, ఢిల్లీ నగరాల్లో ఒక నెల క్రితం ముస్లిం సమ్మేళనాలు జరిగాయి. విజయవాడ ముస్లిం సమ్మేళనంలో ఆ మతానికి చెందిన పదమూడు సంస్థలు ఒకే వేదిక మీదికి వచ్చాయి. ప్రత్యేక నియోజక వర్గాలు, ఎలక్టోరేట్‌లను గురించిన డిమాండ్లు వెలువడ్డాయి. అయితే వాళ్ళెవరికీ జమ్మూకాశ్మీర్ సీమలోకి పాకిస్తాన్ పంపుతున్న చొరబాటుదారుల్ని గురించి ఖండించే సమయం లేకపోయింది. న్యూఢిల్లీ ముస్లిం సమ్మేళనంలో కొన్ని సంస్థలు కలిసి ఎన్నికల్లో తాము మొగ్గు చూపాల్సిన ఫ్రంట్ ఏదీ? అన్న విషయాన్ని ఆలోచించాయి. వీళ్ళు కూడా పాకిస్తాన్ చర్యలను ఖండించలేదు. కాశ్మీర్‌లోని ముస్లింల హక్కుల్ని రక్షించడమే తన ధ్యేయమని పాక్ తన దుష్ప్రచారాన్ని సాగిస్తోంది. కాశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తోంది.

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సైన్యంలో చేరిన మేజర్ జనరల్ ఏ.ఏ.రుద్ర స్వతంత్ర భారత్ తొలి రోజుల నాటి రక్షణమంత్రి సర్దార్ బల్‌దేవ్‌సింగ్‌కు మిలిటరీ సెక్రటరీగా ఉండేవాడు. మేజర్ జనరల్ రుద్ర తన జ్ఞాపకాల్ని రాసుకున్నారు. ఆయన 1947 నాటి సంఘటనను గుర్తు చేసుకున్నారు. త్రివిధ దళాధిపతులు కూర్చొని “భారత భద్రతకు ముప్పు” అన్న పత్రాన్ని రూపొందించారట. దీన్ని నెహ్రూకు అందించారు. ఆయన దాన్ని చూసి చిర్రుమన్నారు. “అదంతా రబ్బిష్, మనకు రక్షణ రంగానికి సంబంధించిన పథకాలు అవసరం లేదు. అహింస మన ప్రధాన విధానం. అందువల్ల మనకు సైనిక పరమైన ముప్పు ఏదీ రాబోదు. సైన్యాన్ని రద్దు చేయండి. మన భద్రతాపరమైన అవసరాల్ని తీర్చేందుకు పోలీసులు సరిపోతారు” అని విరుచుకుపడ్డారు నెహ్రూ. భారత సేనావాహినులకు తొలి కమాండర్ ఇన్ ఛీఫ్‌గా వ్యవహరించిన జనరల్ కరియప్ప మన దేశ భద్రతకు చైనా నుండి వచ్చే ముప్పును వివరిస్తూ ఒక నోట్ తయారు చేశారు. దీన్ని నెహ్రూ ముందుంచారాయన. “మేము చైనా గురించిన జాగ్రత్తలు తీసుకుంటాం, మీరు పాకిస్తాన్‌తో అవసరమైన జాగ్రత్తల సంగతిని గురించి ఆలోచించండి” అన్నారు నెహ్రూ. చైనా చివరకు అరలక్ష చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించింది. ఇదీ చైనా విషయంలో నెహ్రూ తీసుకున్న జాగ్రత్తల ఫలితం.





జమ్మూ కాశ్మీర్‌లోకి ప్రవేశించిన చొరబాటుదారులందరినీ భారత సైన్యం తరిమికొడుతున్న వేళ సమస్యను ఐక్యరాజ్యసమితి ముందుంచారు నెహ్రూ. ఐక్యరాజ్యసమితి 1949 జనవరి మొదటి తేదీన కాల్పుల విరమణల్ని పాటించాలని కోరింది. జమ్మూకాశ్మీర్‌లోని 40 శాతం భూభాగాన్ని పాకిస్తాన్‌కు ధారాదత్తం చేయాల్సి వచ్చింది. అయినా సెక్యులర్, అభ్యుదయవాది, సామ్యవాద, ప్రజాస్వామ్యవాద నెహ్రూ తరహా మేధావులు ఆయనను ప్రశంసిస్తూనే ఉన్నారు. ఇలాంటి మేధావి సమూహాలే ప్రస్తుతం భారతదేశంలో వంశ పారంపర్య పాలన కావాలని కోరుకుంటున్నాయి.

**సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**
**సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు**
**శేషశాయికి మ్రొక్కు శిరము శిరము**
**విష్ణు నాకర్ణించు వీనులు వీనులు**
**మధువైరిఁ దవిలిన మనము మనము**
**భగవంతు వలగొను పదములు పదములు**
**పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి**

**తే. దేవదేవునిఁ జింతించు దినము దినము**
**చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు**
**కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు**
**దండ్రి! హరిఁ జేరు మనియెడి తండ్రి తండ్రి**

శ్రీమదాంధ్ర మహాభాగవతం స.స్క.

భగవంతుని సేవించే చేతులే చేతులు; అతణ్ణి వర్ణించే నాలుకు నాలుక. హరిని చూసే చూపులే చూపులు. విష్ణుమూర్తికి మ్రొక్కే తలయే తల; అతని లీలలను వినే చెవులే చెవులు. భగవంతుని యందు చిక్కుకున్న మనసే మనసు. భగవానుని దగ్గరకు తీసుకుపోయే పాదాలే పాదాలు. పురుషోత్తముని మీది బుద్దేబుద్ధి.

దేవదేవుని స్మరించే దినమే దినము. భగవంతుడని ప్రకటించే చదువే చదువు. భగవంతుని చేరేమార్గాన్ని చూపే గురువే గురువు, ఆ మార్గాన వెళ్ళి భగవస్సాక్షాత్కారం పొందుమని తెలిపే తండ్రే తండ్రి.

# విజృంభిస్తున్న 1947 నాటి ముస్లిం లీగ్ మనస్తత్వం

**జులై 12 - 18 , 1999**

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ మధ్యనే "Media and National cohesion, Meeting the threat of Social and Political Disintegration" (ప్రచార మాధ్యమం జాతీయ సమైక్యత – సాంఘీక, రాజకీయ పతన ప్రమాద నివారణ) అనే అంశంపై ఒక గోష్టి జరిగింది. అందులో అదే విశ్వవిద్యాలయంలో రిటైరయిన ఒక ఉపన్యాసకులు డా. రహముద్దీన్ కెమాల్ చాలా గట్టిగా మాట్లాడుతూ భారతదేశం వివిధ జాతీయతలకు, వివిధ భాషలకు, వివిధ సంస్కృతులకు నిలయమని సమైక్యత అంటే ఈ వైవిధ్యానికి చెందిన ప్రజలందరి అస్థిత్వాన్ని నాశనం చేయడమేనని, ఇది ఒక ఫాసిస్టు ఆలోచన అని అన్నారు. వైశ్వీకరణ అంటున్న ఈ యుగంలో 'జాతీయత' అనే పదానికి కాలం చెల్లింది. సమాచార ప్రసారం అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో జాతి సార్వభౌమత్వ అనేది కేవలం ఒక భ్రమ. హిందుత్వాన్ని వరించే రాజకీయ పక్షాలన్నీ వివిధ సంస్కృతులను జాతుల ప్రత్యేకతలను నాశనము చేసి అన్నింటినీ ఒకే మూసలో పోయాలని వాంఛిస్తున్నాయి. దేశంలో ఇది ఈనాటి ప్రమాదం. అందుచేత ఇది జరగరాదు, జరగనీయరాదు అని అన్నారు. డా. రహముద్దీన్ కెమాల్. తరువాత ప్రసంగించిన మరో ప్రొఫెసర్ కూడా భావావేశంతో వారినే సమర్థించారు. అంతేగాక మరొక అడుగు ముందుకు వెళ్ళి భారత సాంప్రదాయమైన సహనము, మిశ్రమ సంస్కృతులు, ద్రావిడ కాలం నుండి వలస వచ్చిన ప్రజల వివిధ జీవన విధానాల ఫలితమేనని అన్నారు. భారతీయ రాజ్యాంగంలో సెక్యులరిజానికి, మైనారిటీలకు ఇచ్చిన హామీల గురించి ఘనంగా ఉపన్యసించారు.

ఆ సమావేశానికి నేను అధ్యక్షత వహించాను. నా ఉపన్యాసంలో భారతీయ ప్రజానీకంలో సమైక్యతా భావాన్ని, మన జాతీయ అస్తిత్వాన్ని , మన దేశాభిమానాన్ని మరింతగా పెంచడానికి ఎలక్ట్రానిక్ మీడియా ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించాను. టీవిలో ఈనాడు ప్రదర్శించబడుతున్న వాటి దుష్ప్రభావాల గురించి ప్రస్తావిస్తూ మనం ప్రైవేట్ టీవి చానళ్ళను అదుపులో పెట్టలేము, ఆఖరికి భారత ప్రజానీకం పన్నుల చేత పోషించబడుతున్న ప్రభుత్వాధిపత్యంలో నడుస్తున్నవి కూడా అనేక పనికిరాని, అసభ్యకరమైన సినిమాలను, పాటల తోటి దిగంబర నృత్యాలను ప్రదర్శిస్తూ యువకులను ఆ కర్కశ స్వరాలతో శృతి కలిపేటట్లు చేస్తున్నాయని అన్నాను.





ఈనాడు 150 మిలియన్ల గృహాలలో ఉన్న రేడియో చాలా ముఖ్యమైన ప్రసార మాధ్యమం. 65 మిలియన్ల ఇండ్లలో టీవీలు ఉన్నాయి. అందులో 26 మిలియన్లకు కేబుల్ టీవి, లేదా శాటిలైట్ డిష్‌లు ఉన్నాయి. 4 మిలియన్ల పి.సి.లలో 3 లక్షలకు ఇంటర్‌నెట్లు ఉన్నాయి. ఆ విధంగా అనేక ఇళ్ళల్లో ఉన్న ప్రపంచంలోని 30 మిలియన్ల వెబ్‌సైట్లతో ఏదో విధమైన సమాచారాన్ని పొందడానికి అవకాశముంది. ఈనాడు ప్రసారంలో ఉన్న 31 మిలియన్ల వార్తాపత్రికల ప్రతుల సర్క్యులేషన్ నిరక్షరాస్యత, దిగజారిన విద్యాస్థాయిని సూచిస్తోంది. భారతదేశం మహోన్నతికి, మరింత ప్రగతి సాధించడానికి, సుసంపన్నం కావడానికి కావలసిన కొన్ని సమాచార మాధ్యమ సాధనాల్ని మనం ఉపయోగించుకోవాలి. కుల, మత భేదాల నుండి ఉత్పన్నమయ్యే చెడులన్నింటినీ తొలగించేది అభివృద్ధి మాత్రమే. ముఖ్యంగా 1969లో ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీని కేవలం తన వ్యక్తిగత అధికార ప్రయోజనాలకై చీల్చినప్పటి నుండి భారతదేశ నాయకులలో నాయకత్వ ప్రమాణాలు దిగజారడం ప్రారంభమయింది. రాజకీయ నాయకులలో అల్పులు, నీచ ప్రవృత్తి గల ఇతరులు కుల విభేదాలను రెచ్చగొట్టి ఒక కులంపై మరొక కులాన్ని పురిగొల్పారు. అదే విధంగా ముస్లింలలోని మతతత్వవాదులు, మత మూకుమ్మడి ఓట్లకై ఎగబడే సెక్యులర్ రాజకీయ నాయకులతో పాటు పార్టీలు, ముస్లింలలోని అమాయకత్వం, నిరక్షరాస్యతను పోషిస్తూ అధిక సంఖ్యాకుల మతోన్మాదం ప్రమాదంగా వారి ముందు పెట్టి తాము వారి రక్షకులంటూ తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలను సాధించుకొంటున్నాయి. ఈ విచ్ఛిన్నకర శక్తులను మేధావి వర్గం తుద ముట్టించాలి.

డా. రహిముద్దీన్, ఇతరుల ప్రసంగాలు నన్ను రెట్టించినట్లయింది. నా భావాలను బట్టబయలు చేయడానికి నేను ఇక సంకోచించదలచుకోలేదు. వారు ప్రస్తావనకు తీసుకొస్తున్న మన పవిత్ర రాజ్యాంగం దేశ విభజన తరువాత ఖరారు చేయబడిన ఈ రాజ్యాంగంలోని ముసాయిదా తయారీ విభజన ప్రస్తావన రాకముందు నుండే ప్రారంభమయిందని నేను అన్నాను. ఈ రాజ్యాంగం భారతదేశానికి ఒక నిర్వచనాన్ని ఇచ్చేసింది. మనం ఒకేజాతి, ఒకే రాజ్యం. ఇందులో ఇంతకుముందు సంస్థానాలుగా పిలువబడి నేడు రాష్ట్రాలుగా పిలువబడుతున్నవన్నిటిని కలిపి ఇండియన్ యూనియన్‌గా పేర్కొనడం జరిగింది. అందుచేత మనది ఒక జాతి కాదని, వివిధ జాతుల సమాఖ్య అనే ప్రసక్తి ఉద్భవించదు. 1947 పూర్వం

రాజకీయవేత్తలు, రాజకీయ పక్షాలు, ప్రజలు ఉన్నారు. అయితే కేవలం ముస్లింలందరూ ఇస్లాం కారణంగా తాము భారత్‌లో ఒక భాగం కాదన్నారు. వారు ఒక ప్రత్యేక జాతి అన్నారు. వారిలో కొందరు ఒక ప్రత్యేక సిద్ధాంతము, జాతీయతకు అతీతులైన ఒక రాజకీయ పార్టీని సృష్టించడంలో సహకరించారు. అదే పార్టీ భారతదేశంలో అనేక జాతులున్నాయని ఇంకా అంటోంది. మహమ్మదాలీ జిన్నా ముస్లింలు అసలు ఇక్కడ మైనారిటీలు కాదు, వారు ఒక ప్రత్యేక జాతి అని నొక్కి చెప్పడమేగాక వారికి ఇతరులతో, ముఖ్యంగా హిందువులతో సమానంగా ప్రత్యేక దేశం కావాలని అన్నాడు. అట్టి ప్రత్యేక వాదాన్ని లేవగొట్టిన ఆ వర్గం భారతదేశాన్ని విభజించారు. ఆ బహుళజాతులు, ద్విజాతి సిద్ధాంతాలను విశ్వసించేవారందరూ దేశ విభజన ద్వారా తాము సృష్టించుకొన్న స్వజాతి దేశానికి స్వేచ్ఛగా వెళ్ళిపోవచ్చు. తాము ప్రత్యేక జాతి అని ఘంటపథంగా చెప్పి, వారికంటూ ఒక ప్రత్యేక సార్వభౌమత్వం గలిగిన దేశాన్ని ఏర్పరచుకొన్నాక కూడా ఇంకా ఇక్కడ కొందరు మిగిలిపోయారంటే, ఆ ఉండిపోయినవారు తమ ద్విజాతి సిద్ధాంతాన్ని వదులుకొన్నారని అందరూ సహజంగా నమ్ముతారు, కాని ఆ గోష్ఠిలో ప్రసంగించిన వారి మాటలు బట్టి చూస్తే అది వాస్తవం కాదనిపిస్తోంది. అంతేగాక ఈ దేశం ఒక జాతి కాదని, రెండు జాతులే కాదు, అనేక జాతుల సమ్మేళనం అనే సిద్ధాంతాన్ని వారు నమ్మడమేగాక బహిరంగంగా ప్రకటించడానికి సాహసిస్తున్నారంటే ఈ దేశంలో అంతకంటే దయనీయ పరిస్థితి మరేముంటుంది? అంతేగాక అసంతృప్తి చెందిన వర్గాలు తాము ప్రత్యేక జాతి అని, రాజ్యాంగం ఆధారంగా అల్ప సంఖ్యాకులు పొందవలసిన రక్షణలు, హక్కులు, లేదా వారికి కూడా ప్రత్యేక దేశము కావాలనే కోరికలకు ఇది అవకాశం కలిగించవచ్చు. ముఖ్యంగా 1969 నుండి 1971 లోగా దేశ రాజకీయాలను నడిపిన కొందరు తుచ్ఛ, రాజకీయ వేత్తలు, వారి సిద్ధాంతాలను సమర్థించే న్యాయ రంగంలోని కొందరు ఒకటైనారు. వారు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడి మైనారిటీలకు హక్కులు, ప్రత్యేక అవకాశాలు, ప్రత్యేక అధికారాలు ఉన్నాయంటూ మన రాజ్యాంగాన్ని అన్వయించారు. అనేక మైనారిటీ వర్గాలకు చెందిన విద్యాసంస్థలు ఒక ప్రక్క 50 శాతం పైగా మెజారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల నుండి పెద్ద పెట్టున ధనాన్ని పిండుతూ, అనేక అక్రమ మార్గాలలో తమ సంస్థలలో చేర్చుకుంటున్నారు. మరోప్రక్క తమ మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు చేరే అవకాశాన్ని తిరస్కరిస్తున్న విషయాన్ని నేను స్పష్టంగా పేర్కొన్నాను.





దేశ సమైక్యతను భగ్నం చేయడానికి, ఇక్కడి ప్రజలను వంచించడానికి, వాళ్ళ నోళ్ళు మూయించడానికి 'మైనారిటీ' అనే శబ్దం ఒక శక్తివంతమైన మంత్రంగా తయారయింది. ముస్లింలు తమ మతం ఒక వర్గం అని వాదించుకుంటూ పోతే హిందువులు కూడా తాము ఒక వర్గమనే విధంగా ఆలోచిస్తూ వ్యవహరించడమేగాక ప్రతి విషయాన్ని హిందు-అహిందూ అనే దృష్టితో చూడడం కూడా పూర్తిగా సమర్థనీయమే అవుతుంది. అటువంటి పరిస్థితులలో ఈ విభిన్న జాతుల సిద్ధాంతకర్తలు ఏమంటారు?

నేటి సాంకేతిక విజ్ఞానం తగినంతగా వికసించని కాలంలో కులవ్యవస్థ ఒక తప్పిదం కాదు. ఆనాటి కులవ్యవస్థ వాణిజ్య, వ్యాపారాలు చాలా తక్కువగా ఉన్న రోజుల్లో జనాభాను వారి స్వస్థలాలలోనే అంటి పెట్టుకొని ఉండేటట్లు చూచింది. స్వావలంబనం, స్వయం సమృద్ధిని సాధించడానికి కారణం అయింది. వారి వృత్తులలో నైపుణ్యానికి, ప్రావీణ్యతకు దోహదం చేసింది. ఉద్యోగ విషయంలో హామీనిచ్చింది. కుటుంబంలో భద్రతను, సంస్కృతీ సాంప్రదాయాలకు అనుకూల వాతావరణాన్ని కలిగించింది. జన జీవనానికి అన్ని కులవృత్తులు అవసరమైనవే. కులాలలో ఏ కులమూ ఒకదానికంటే మరొకటి తక్కువ కాదు. అన్ని సమానమైనవే. అందువల్ల కులాల మధ్య స్పర్థలకు అవకాశం లేదు. కానీ నేటి విజ్ఞానశాస్త్రం, సాంకేతిక శాస్త్రం అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న కాలంలో వృత్తులు మార్చుకొనే అవకాశాలు బాగా పెరుగుతున్నాయి. అందుచేత తమ తల్లిదండ్రుల బట్టి కులం అనే మౌఢ్యం పోవాలి. నన్నే ఉదాహరణగా తీసుకొంటే నేను వ్యవస్యాయ కులానికి చెందిన వాడినైనా పరిపాలనా వ్యవస్థలో ప్రవేశించి క్షత్రియ ధర్మాన్ని స్వీకరించాను. అదే విధంగా నా కుమారుడు ఒక చేపలు పట్టే మర పడవ యాజమాని అవడం వల్ల అతడు ఒక మత్స్యకారుడు. అదే విధంగా Structural fabrication Company నడుపుతున్నందుకు అతడు ఒక కమ్మరి. మరొక కుమారుడు వైద్యవృత్తి స్వీకరించినందువల్ల అతడు వ్యవసాయదారుడు కాకుండా బ్రాహ్మణుడయ్యాడు. ఈ విధమైన పరిణామానికి ఈనాటి విజ్ఞాన సాంకేతిక శాస్త్రాభివృద్ధి, ఆధునిక విద్య, ప్రజాస్వామ్య వ్యవస్థ, వ్యక్తి స్వేచ్ఛలు దోహదం చేసున్నాయి. ఈనాడు పుట్టుక బట్టి కులము అనే పదానికి విలువ ఏ విధంగా పడిపోతున్నదీ, వృత్తి రీత్యా ఏర్పడుతున్న సమాఖ్యలు ఏ విధంగా ఒక నూతన సంస్కృతిని పెంపొదిస్తున్నదీ

వివేకవంతమైన నాయకత్వం, బాద్యతాయుతమైన, దేశభక్తి పూర్వకమైన రాజకీయ వేత్తలు, రాజకీయ పార్టీలు ఈనాడు వివరించవలసిన అవసరమున్నది. అదేవిధంగా కొత్త పోకడలు, కొత్తభద్రతలు, వివాహాది వ్యవహారాలలో నూతన పంథాలు గురించి కూడా తెలియజేయాలి. ఈనాడు ద్విజాతి సిద్ధాంతాలను పట్టుకొని వ్రేలాడుతున్నవారు, జాతీయతా వాదనతో విజృంభిస్తున్న విచ్ఛిన్నకారులు, మోసపూరితమైన రాజాకీయాలు దేశానికి బద్ధ శత్రువులు. ఇస్లాం తమ దేశ జాతీయ మతంగా అంగీకరిస్తూనే 56 ప్రత్యేక దేశాలుగా ఎందుకు ఉన్నట్లు? అవన్నీ కలిసి Organisation of Islamic Counties అంటూ ఒక ప్రత్యేక సంస్థ ఎందుకు? ఈ ప్రశ్నలనే నేను వారిని సూటిగా అడుగుతున్నాను. జాతి అనే పదం అర్థం కోల్పోతే వీరికి మతం ఒక్కటే ఆధారమా? మతాన్నే ఆధారంగా తీసుకొని ఒకే మతానికి చెందినవే జాతీయత దేశాలుగా ఉంటాయా? సహనం, సంస్కృతుల సమాఖ్య గురించి మాట్లాడే అభ్యుదయవాదులను దేశ విభజన వల్ల ఏర్పడిన భారత పాకిస్తాన్‌ల మధ్య అదే సహనం ఎందుకు కొరవడిందని నేను అడుగుతున్నాను? ఆనాటి భారతదేశంలో ఉన్న ప్రజే విభజనానంతరం ఉన్నారు. కానీ ఒక దేశంలో అక్కడి ఒక వర్గాన్ని తుడిచిపెట్టి వేయడానికి వారిని అక్కడి నుండి బైటకు తరిమివేస్తున్నారెందుకు? దేశ విభజన వల్ల ఏర్పడిన ఇస్లాం రాజ్యాలలో విభజనకు పూర్వం ఉన్న ముస్లిమేతరుల విషయంలో ఈ సిద్ధాంతం ఎందుకు తలెత్తడం లేదు? కేవలం భారతదేశంలోనే 'జాతుల సమాఖ్య' అనేది ఎందుకు తలెత్తుతోంది. అయితే ఆ ఇద్దరు ప్రొఫెసర్లు 1947 పూర్వపు ద్విజాతి సిద్ధాంతాన్ని సమర్థించిన ముస్లింలీగ్‌కు, రజాకార్లకు చెందినవారై ఉండాలని నా నమ్మకం.

నేను ఇద్దరు ముస్లిమేతరులతో మాటాడాను. వారు ఈశాన్య భారత్‌లోనూ, మరికొన్ని ప్రాంతాలలోనూ దేశానికి విఘాతం కలిగించే కొన్ని మతపరమైన వర్గాలు నడుపుతున్న కార్యకలాపాల గురించి చాలా ధైర్యంగా చెప్పడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆ సమావేశానంతరం నన్ను కలిసిన ఒక కాంగ్రెస్ నాయకుడు తాను ఆ ఇద్దరు ముస్లిం ప్రొఫెసర్లు మాట్లాడినదానికి తీవ్రంగా స్పందించినట్లు, నాతో ఏకీభవించినట్లు చెప్పాడు. కానీ బాహాటంగా ఆ విషయాన్ని వ్యక్తపరచలేనని అన్నాడు. అక్కడే ఉంది సమస్య. ఇదే ఓట్లవేట, సంతుష్టికరణలు 1920 నుండి నడుస్తున్నాయి. ఇదే దేశ సమైక్యతకు విఘాతం కలిగించింది. అదే ప్రమాదం నేడు





కూడా కొనసాగుతోంది. జాతీయ సమైక్యతను దెబ్బతీసి, విచ్ఛిన్నకారి ప్రవృత్తులను రెచ్చగొట్టే ఈ శక్తులు మొదట ఆందోళన లేవదీయడం, ఆ తరువాత బేరాలు సాగించడం, ప్రత్యేక ప్రాంతాలను సాధించడం చేస్తున్నాయి. దీని ఫలితంగానే కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం మల్లపురం జిల్లాను సృష్టించింది. హైద్రాబాద్‌లో Quli Qutub Shah Development Board Authourity ఏర్పడింది. మొదట దేశాన్ని, తరువాత ప్రాంతాలను, చివరకు నగరాలను విభజించడం ఈనాడు సెక్యులర్ భారత్ సాధిస్తున్న ఘనమైన ప్రగతి. ద్రవిడులు వేరని వాదించేవారు, 1962లో చైనా భారత్‌పై దాడి చేసినప్పుడు దానికి అనుకూలంగా స్పందించిన వారిని దేశభక్తులు, నిజమైన భారతీయులనడం ఎట్లా? డి.ఎం.కే నాయకుడు సి.ఎస్.అన్నదురై ఆ సమయంలో జైలులో ఉన్నాడు. అప్పుడు స్వయం ప్రతిపత్తిగల ప్రత్యేక ద్రవిడునాడు కోర్కెను వదిలి వేస్తున్నట్లు ప్రకటించారు. అంతేగాక డియంకె ఈ దేశ సమైక్యత, సమగ్రతలకు పూర్తిగా కట్టుబడి ఉందని కూడా అన్నారు. అప్పటి నుండే ద్రవిడ పార్టీలు స్వయం ప్రతిపత్తి గల తమిళనాడు గురించి మాట్లాడటం లేదు. కానీ నేడు జమ్మూకాశ్మీర్ ముస్లింల కంటే ఇక్కడి ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ముస్లిం ప్రొఫెసర్ల ధోరణి తీవ్రంగా ఉందనేది స్పష్టంగా మనకు తెలుస్తోంది. దేశాన్ని పట్టుకొని పీడిస్తున్న ఈ విచ్ఛిన్నకారీ మనస్తత్వం వల్ల 1947 నుండి వరుసగా మనం ఎదుర్కొంటున్న ప్రమాదాలు, బాధలు, చెల్లిస్తున్న పరిహారాలు మనకు తెలియనివి కాదు.

**అనగననగ రాగ మతిశయిల్లుచునుండు,**
**తినగ తినగ వేమ తియ్యనుండు;**
**సాధనమున పనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# కార్గిల్ ముందు - అటు తర్వాత...

**జులై 19 - 25 , 1999**

జమ్మూకాశ్మీర్‌లోని కార్గిల్ ప్రాంతంలోకి వస్తున్న పాకిస్తానీ అక్రమ చొరబాటుదారుల సమస్య ఈ క్షణానికి సమసిపోయినట్టే.

ఇలాంటి అక్రమ చొరబాట్లు కొత్తవేమీ కాదు. ఈ పరంపరలో కార్గిల్ వ్యవహారం అంతిమ అధ్యాయం కాబోదు. 1948 నుండి వాస్తవాధీన రేఖను ఉల్లంఘిస్తున్న పాక్ దుందుడుగు చర్యల్ని భారత్ గమనిస్తోంది. భారత్‌పై దాడులు చేయాల్సిన సమయం, ప్రాంతం, దాని ఫలితాల్ని గురించి పాకిస్తాన్ ఎంతో ముందుగానే అంచనావేస్తుంది. అయితే భారత వేఖరి మాత్రం ఆపత్కాలం సంభవించిన క్షణంలోనే తయారవుతుంది. భారత్‌పై పాకిస్తాన్ దురుద్దేశపూర్వకమైన దాడులు అందరికీ కన్పిసున్నవే. అయితే అజ్ఞాతంగా ఉంటూ బయటపడని సమస్యలు ఎన్నెన్నో. కొచ్చి, కోయంబత్తూరు, హైదరాబాద్, ఢిల్లీ లాంటి నగరాల్లో ఇంటర్ సర్వీసెస్ ఇంటలిజెన్స్ (ఐ.ఎస్.ఐ) ఏజెంట్లు, దాని సహ భాగస్వామ్య శక్తులు పేలుడుతో విధ్వంసాల్ని సృష్టించాయి. 1965, 1971 సంవత్సరాల్లో పాక్ దురుద్దేశ పూర్వక దాడులు వాస్తవిక సమరరూపాన్ని సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో తొలుత పాకిస్తాన్‌దే పైచేయిగా కన్పించినా అంతిమ ఘనవిజయం భారత్‌కే దక్కింది. వీర భారత సైనికులు పాక్ బలగాల్ని తరుముతూ పోయి కొత్త ప్రాంతాల్ని ఆక్రమించాయి. 1971లో భారత్ మహత్తర విజయాన్ని సాధించింది. అప్పుడు 90 వేల మంది పాకిస్తానీ సైనికులు మనకు బందీలుగా చిక్కారు. అదనపు భూభాగాల్ని సైతం మన బలగాలు సాధించుకొని వచ్చాయి. అయితే 1948 నుండి మొదలుకొని 1971 దాకా ప్రతి యుద్ధంలోనూ మనం గెల్చుకున్న ప్రాంతాల్ని చర్చల వేదికల దగ్గర త్యాగం చేయాల్సి వచ్చింది. మనం యుద్ధ విజేతలమయ్యాం, కానీ ప్రశాంత వాతావరణాన్ని కోల్పోయాం. సుదీర్ఘమైన యుద్ధానికి సంబంధించిన ప్రవృత్తులు చాలామందికి అసలు తెలియవు. " యుద్ధమనేది ఇతరేతర లక్ష్యాల వలన చేసే రాజకీయం" అంటారు జర్మన్ యుద్ధ రాజకీయాల్లో నిపుణుడైన క్లాస్‌క్లూస్ వెడ్జ్. పాకిస్తాన్ నడుపుతున్నది రాజకీయమనేది భారత రాజాకీయవేత్తల్లో చాలామంది గుర్తించక పోవడం దురదృష్టకరం. తన రాజకీయ లక్ష్యాల్ని సాధించుకునేందుకే





అది యుద్ధాల్ని నడుపుతోంది. ముస్లిం మెజారిటీ ఉన్న ప్రాంతాలు తమ దేశంలో చేరిపోవాలని పాకిస్తాన్ దుష్టవ్యూహాన్ని పన్నుతోంది. భారతదేశంలోని ముస్లింల తరపున వకాల్తా పుచ్చుకునే ప్రయత్నాలు చేస్తోంది. భారతదేశంపై తన ప్రభావాన్ని పెంచుకునే కుటిల యత్నాలు చేస్తోంది.

భౌతిక, ఆర్థిక దృష్టి కోణాలతో పరిశీలిస్తే, ముస్లిం ఆధిక్యత ఉన్న జమ్మూ, కాశ్మీర్‌లు విడిపోవడం వల్ల భారతదేశానికి గొప్ప నష్టమేమి ఉండకపోవచ్చు. ముస్లింలలో తాము ప్రత్యేక జాతికి చెందిన వాళ్ళమన్న భావన మరోమారు మొలకెత్తే ఇలాంటిది జరుగుతుంది. కావాల్సినంతగా స్వయం ప్రతిపత్తి కల్పించినా ఇలా జరిగితే కొత్తగా మరో ప్రశ్న ఉదయిస్తుంది. "భారతదేశంలోని ముస్లింల పట్ల ప్రత్యేక సౌకర్యాల్ని చూపుతూ ప్రత్యేక హక్కుల్ని ఇవ్వడం, అసాధారణమైన శ్రద్ధ కనబర్చడం ఎందుకు" అనే సందేహం ఆరంభమవుతుంది. పాకిస్తాన్ తనది ఇస్లామిక్ రాజ్యమని నచ్చజెప్పుకున్నది. ముస్లిమేతరులకు పౌరసత్వ హక్కులు సైతం ఉండవు. ముస్లింలలోనే కొన్ని తెగలపై వివక్ష ఉంది. వాళ్ళు తమ దేశంలోని హిందువులను అందరినీ దాదాపుగా వెళ్ళగొట్టారు. పాకిస్తాన్‌లో హిందువులకు, సిఖ్ఖులకు చోటు లేనపుడు, భారతదేశంలో ముస్లింలకు ప్రత్యేక హక్కులేమిటి? ప్రజాభిప్రాయం కనుక ఉంటే భారతదేశాన్ని హిందూ రాజ్యంగా ప్రకటిస్తే తప్పేమిటి? జమ్మూకాశ్మీర్‌లో ముస్లిం జనాభా అధికంగా ఉన్నందువల్ల అది పాకిస్తాన్‌లోనే ఉండాలని ప్రపంచంలోని కొన్ని దేశాలు అభిప్రాయపడుతున్నాయి. భారత్‌లో జమ్మూకాశ్మీర్ విలీనానికి అంగీకారం జరిగిన సంగతిని ఇవి గుర్తించడం లేదు. పాకిస్తాన్ ముస్లిం రాజ్య ప్రతిపత్తిని ప్రపంచం అంగీకరిస్తోంది, అలానే భారతదేశం తనకు సైతం హిందూ రాష్ట్రంగా ప్రకటించుకునేందుకు సర్వాధికారాలు ఉన్నాయని చెప్పుకోవాలి.

ఈ మేరకు మన వాణిని బలంగా విన్పించాలి. పాకిస్తాన్, బంగ్లాదేశ్ కాశ్మీర్‌లలో హిందువుల్ని తరిమివేస్తున్న మనం భారత సమగ్రత, సంస్కృతి, సెక్యులర్ సంప్రదాయాల్ని గురించే మాట్లాడుతున్నాం. ముస్లింలకు ప్రత్యేక హక్కుల్ని అందిస్తున్నాం. ఈ నేపథ్యంలో కాశ్మీర్ విషయంపై అంతర్జాతీయ సమాజం అపోహలు ఏర్పర్చుకునే పెను ప్రమాదం ఉంది. ముస్లిం ఆధిక్యత ఉన్న కాశ్మీర్‌లో భారత నైతిక, చట్టబద్ధమైన పరిపాలనపై ప్రశ్నలు పుడతాయి. భారతదేశానికి కాశ్మీర్‌ను పాలించే సకల హక్కులు ఉన్నాయన్న దృష్టితో కాకుండా, భారత – పాకిస్తాన్‌ల

మధ్య అణు యుద్ధ ప్రమాదాన్ని నిలువరించాలన్న ఉద్దేశ్యమే అమెరికా, దాని మిత్ర దేశాల వైఖరుల్లో కన్పిస్తోంది.

కార్గిల్ యుద్ధంలో పోరాడుతున్న, మృతులైన సైనికుల సహాయార్థం నిధుల సేకరణ జరుగుతోంది. కార్గిల్ యుద్ధ నిధిని ఎవరు వసూలు చేస్తున్నారన్నది గమనిస్తే కొన్ని నిజాలు బయటపడతాయి. ఉదాహరణకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కన్పిస్తున్న పేర్లనే చూడండి. ఈ పేర్లలో ఎక్కడా ముస్లిం ఉన్నట్టు లేదు. మరో రోజు, చెన్నైలో ముస్లింలు ఒక బ్రహ్మాండమైన సభను ఏర్పాటు చేశారు. భారత్‌లో ముస్లింలు జీవించే హక్కుకు మద్దతుగా జరిగిన సభ అట ఇది. ఒకవైపు యుద్ధ వాతావరణం నెలకొని ఉంది, కార్గిల్‌లో భారత సరిహద్దుల రక్షణ కోసం వందలాదిమంది వీరసైనికులు తమ ప్రాణాల్ని అర్పిస్తున్నారు. ఇలాంటి సమయంలో చెన్నైలో సమావేశమైన ముస్లింలు తమకు భారత్‌లో జీవించే హక్కు మృగ్యమవుతోందని ఘోషలు పెట్టారు. వీళ్ళ మాటల్ని మించిన అబద్ధాలు మరెక్కడైనా దొరుకుతాయా? వాళ్ళు ఎందుకింత నిర్మొహమాటంగా అబద్ధాలు పలకగలిగారు? చెన్నైలో జరిగిన ముస్లిం సభకు జయలలిత ముఖ్య అతిథి. భారతదేశంలో జీవించే హక్కు మృగ్యమైపోతోందన్న అసత్య ప్రచారాన్ని జయలలిత అంగీకరిస్తున్నట్టు అర్థం చేసుకోవాలి. ముస్లింల అభిప్రాయాలను బలపర్చకపోతే ఆమెకు ముఖ్య అతిథి గౌరవం ఉండకనేపోయేది. జయలలిత వంటి విలువలేని హిందూ నాయకత్వమే దేశాన్ని 1947 నాటి కన్నా ముందు స్తితిలోకి వెళుతోంది. ఇలాంటి వారి ధోరణులే ముస్లింలలో విభజన, వేర్పాటువాద తత్వాలకు ఊతంగా మారుతున్నాయి. ముస్లిం జనాభా దేశంలో ఆరు నుండి పది శాతానికి పెరిగింది. ముస్లింలు ఈ దేశంలో రాష్ట్రపతి మొదలుకొని సకల ఉన్నత పదవుల్ని అందుకున్నారు. అయినా తాము జీవించే హక్కుకు ముప్పు వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. ఇంతకన్నా దారుణమైన అబద్ధం మరొకటి ఉంటుందా? కొద్దివారాల క్రితమే విజయవాడలో కొన్ని ముస్లిం సంస్థలు సమావేశమయ్యాయి. తమకు ప్రత్యేక నియోజక వర్గాల్ని, రిజర్వేషన్ సౌకర్యాల్ని కల్పించాలని ఈ సంస్థలు డిమాండ్ చేశాయి. పాకిస్తాన్‌తో యుద్ధం ఏర్పడుతున్న నేపథ్యంలో జరిగిన సమావేశమే ఇది కూడా.





**మరొక సంఘటనను గమనించండి.**

సినీ నటుడు దిలీప్ కుమార్ (ఆయన పేరు హిందువుగానే ఉన్నప్పటికీ ఆయన ముస్లిం) "నిషాన్-ఎ-పాకిస్తాన్" పురస్కారాన్ని తిరిగి ఇచ్చివేయాల్సిందిగా ముంబాయి నగరవాసులు సలహా ఇచ్చారు. "నిషాన్-ఎ-పాకిస్తాన్" అవార్డును పాక్ ప్రభుత్వం అందజేసింది. ఈ పెద్ద మనిషి తన అవార్డును తొలగించుకునేందుకు భావాత్మకమైన సంసిద్ధతతో లేరు. ఆయన ఈ అంశం మీద భారత ప్రధాని సలహాను కోరుతున్నారు. సంప్రదాయ సెక్యులరిస్టులు, వామపక్షాల వారు, అభ్యుదయ కాముకులు, పాత్రికేయులు దిలీప్‌కుమార్‌కు వత్తాసు పలుకుతున్నారు. గతంలో అంటే తెల్లదొరల పరిపాలనా కాలంలో, బ్రిటీష్ ప్రభుత్వం ప్రదానం చేసిన ఎన్నో సర్కారీ పురస్కారాల్నీ మనవాళ్ళు వాళ్ళ మొహం మీదే పారేశారు. బ్రిటీష్ ప్రభుత్వం భారతీయులపై జరుపుతున్న దమనకాండను నిరసిస్తూ వారు ఇలా తమ బిరుదులను త్యాగం చేశారు. అప్పట్లో వారు ఈ విషయమై వైస్‌రాయ్ సలహాల్ని తీసుకోలేదు. దిలీప్‌కుమార్ అనబడే యాకూబ్‌ఖాన్ తన అవార్డుని తిరిగి ఇచ్చివేసేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారు? మతం పేరుతో యుద్ధానికి దిగిన పాకిస్తాన్ ప్రధానం చేసిన అవార్డును ఆయన ఎందుకు అలాగే ఉంచుకోవాలి? ఇలా అసలు సమస్యల్ని వేలెత్తి చూపితే అది "ఫ్యాషనబుల్"గా ఉండకపోవచ్చు. కానీ ఫ్యాషనబుల్ వ్యవహారశైలి పటిష్టమైన జాతిని మాత్రం తయారు చేయలేదు. జనాకర్షక విధానాలు, ఓట్ల కోసం పడేపాట్లు దేశ అఖండతకు, సమైక్యతకూ గొడ్డలి పెట్టులా మారతాయి.

కార్గిల్ సంఘటన వల్ల మనకు అందిన దీర్ఘకాలిక పాఠాలేమిటి? తమ దేశవాసులు గడ్డి తింటూ ఉన్నా సరే భారత్‌పై వెయ్యి సంవత్సరాల యుద్ధాన్ని ప్రకటిస్తామని పాక్ మాజీ ప్రధాని భుట్టో ఒకసారి అన్నాడు. భారత ఉపఖండంలోని ముస్లిం మనోభావాలు కూడా సరిగ్గా ఇలాగే ఉన్నాయి. క్రమం తప్పకుండా జరిగిన యుద్ధాలు భారత శక్తి యుక్తుల్ని పెంచి అది మరింత దృఢమయ్యేందుకు దోహదం చేయాల్సి ఉంది. 1991వ సంవత్సరానికి ముందు మన రక్షణ వ్యయం జి.డి.పిలో 3.3శాతం. అది 2.2 శాతానికి అంటే మూడింట ఒకవంతు తగ్గించబడింది. ఇది నిజంగా అనాలోచితమైందే. మనం రక్షణ రంగంలో పరిశోధన మరియు అభివృద్ధికి మరింత వెచ్చించాల్సి ఉంది. వినూత్న ఆయుధ సామాగ్రి, క్షిపణుల

రూపకల్పనకై ఇది అవసరం. రక్షణ వ్యయం శాస్త్ర సాంకేతిక రంగాల్లో పలు రకాలైన మైలురాళ్ళను సృష్టించింది.

మరో అంశం. మనం నిజాన్ని నిర్భయంతోనూ ప్రభావవంతంగానూ చెప్పగలిగేందుకు అలవాటు పడాలి. హిందుత్వ దృక్పథం, సంస్కృత భాష, వేద ఉపనిషత్ వాఙ్మయం, ఇతిహాస పౌరాణిక వాఙ్మయం మాత్రమే దేశంలో జాతీయతను పెంచేందుకు ఉపకరిస్తాయన్న నిజాన్ని మనం గట్టిగా చెప్పాల్సి ఉంటుంది. అంటే మనం హిందూ యేతరులను హింసించాలనీ లేదా వారిపై వివక్ష చూపాలని అర్థం చేసుకోకూడదు. మన దేశంలో బలవంతపు మతమార్పిడులు జరుగుతున్నాయి. వీరి అనుయాయులే భారత దేశంలో సమగ్రత సంస్కృతి ఉందని ప్రచారం చేస్తున్నారు. హిందూ మతంపై సెక్యులర్ వ్యతిరేక ముద్ర వేస్తున్నారు. హిందూయేతర సంస్థల కార్యకలాపాలు, వారి మాటలూ, ముచ్చట్లు సెక్యులర్ రంగును సంతరించు కుంటున్నాయి.

**ఇంకో అంశం :**

ఇక్కడ కొంతమంది భారత వ్యతిరేకతనే వ్యసనంగా పెట్టుకున్నవారున్నారు. రకరకాల బ్రాండ్లతో కన్పించే కమ్యూనిస్టులు ఈ కోవలో చేరతారు. పాకిస్తాన్ జిహాద్ తరహాలు, చొరబాటు, కబ్జాలపై భారతదేశం అతిగా స్పందించిందని అశోక్ మిత్రాతోపాటు మరికొందరు మార్క్సిస్టు పార్టీ రాజ్యసభ సభ్యులు అంటున్నారు. "అక్రమ చొరబాటుదారులు ఏవో కొన్ని శిఖర ప్రాంతాల్ని ఆక్రమించుకుంటే పోయేదేమిటి?" ఇలాంటి చర్యల వల్ల మనకు వచ్చిపడే ప్రమాదం ఏమిటి? ఇంతపాటి దానికే భారతదేశం సైనిక, వైమానిక చర్యల్ని భారీ ఎత్తున చేపట్టడం ఎందుకు? అని అంటున్నారు వీళ్ళు? ఇంతకన్నా దివాళాకోరు అభిప్రాయం మరొకటి ఉండదు. అయితే ఇంతకు పూర్వం కూడా ఇలాంటి అభిప్రాయాలే వెలువడ్డాయి. విఖ్యాత సోషలిస్టు భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ తరహా అభిప్రాయాలకు శ్రీకారం చుట్టారు. చైనా దురాక్రమణ సాగుతున్న వేళ, లధక్ ప్రాంతంలో నాలుగువేల చదరపు కిలోమీటర్ల తన భూభాగాన్ని కోల్పోయి కూడా భారత్ ఎలా మిన్నకుంటోంది? అని ప్రశ్నిస్తూ పార్లమెంటు సభ్యులు హెచ్చరికలు జారీ చేశారు. "ఒక్క గడ్డి పరక కూడా మొలకెత్తని శుష్క భూభాగాన్ని గురించి యుద్ధానికి తలపడటం శుద్ధ





దండుగ" అని జవాబు చెప్పారు నెహ్రూ. అంటే, మందీ మార్బలం, ప్రకృతి వనరులు ఏవీలేని లడఖ్‌ను చైనా ఆక్రమించుకున్నా నష్టం లేదన్నది నెహ్రూ అభిప్రాయమన్నమాట. ఇప్పుడు టైగర్‌హిల్స్ వంటి ప్రాంతాల్లోనూ మానవ సంచారం ఉండదు కనుక ఇక్కడ పాకిస్తాన్ బలగాలు తిష్టవేసినా పోయేదేమీ లేదని కమ్యూనిస్టులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలోని సెక్యులర్ గుంపు కమ్యూనిస్టుల విద్రోహ దృక్పథాన్ని ఖండించకపోవడం దురదృష్టకరం. విదేశీ వనితకు భారత ప్రధానమంత్రిత్వాన్ని అప్పగించే క్రమంలో కమ్యూనిస్టుల ఉత్సాహం అమితంగా ఉంది మరి.

ముస్లింలు తాము ముస్లిం మతానికి చెందినవాళ్ళమనీ, క్రిస్టియన్ మతస్తులు తాము క్రైస్తవులమని గర్వంగా చెప్పకుంటున్నప్పుడు హిందువు తన మతాన్ని గురించి ఎందుకు సిగ్గుపడాలి? హిందువు తల ఎత్తుకొని తాను హిందువునని చెప్పుకోవాలి. గత యాభై ఏళ్ళుగా సెక్యులర్ హంసగీతాలాపన నిరంతరాయంగా సాగుతూనే ఉంది. ముస్లింలీగ్ వంటివి లౌకికవాద పార్టీలుగా గుర్తింపబడుతూనే ఉన్నాయి. మజ్లిస్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్ సెక్యులర్, క్రిస్టియన్ మిషనరీలు సెక్యులర్ కానీ, హిందువులు మాత్రమే సెక్యులర్ వాదులు కాదు! హిందువు అనగానే అతడొక ఛాందసవాది లేదా ఫాసిస్టు అవుతున్నాడు! యాభై ఏళ్ళ పాటు సాగిన సెక్యులర్ "చర్చలు" ఇలాంటి పరిణామానికి దారులు వేశాయి. మనం మనలో గూడు కట్టుకుంటున్న విశ్వాస రాహిత్యాన్ని తొలగించుకోవాలి. మనం ఇజ్రాయిల్‌ను చూసి కొన్ని పాఠాలు నేర్చుకోవాలి. మనలాగే ఇజ్రాయిల్ కూడా ఎన్నో దాడుల్ని ఎదుర్కొన్నది. దురాక్రమణలు జరిగాయి. అయినప్పటికీ ఇజ్రాయిల్ అలాంటి వాటిని విజయవంతంగా తిప్పికొట్టింది. అంతేకాదు కబ్జా చేయడానికి వచ్చిన శత్రుదేశం భూభాగాన్ని కూడా చేజిక్కించుకుంది. చిట్టచివరకు ఇజ్రాయిల్ అనుమతి మేరకు జరిగిన శాంతి ఒప్పందాల తర్వాత మాత్రమే ఆయా ప్రాంతాలకు విముక్తి లభించింది. ఇజ్రాయిల్ తన అఖండత, భద్రతలనే కీలకాంశాలుగా ఎన్నుకున్నది. ఇందుకు జోర్డాన్ పశ్చిమ తీర ప్రాంతాన్ని గురించి ఉదహరించాలి. 1967 లో అరబ్-ఇజ్రాయిల్ ఆరు రోజుల యుద్ధం జరిగింది. అరబ్బులు రెచ్చగొట్టడం వల్లనే యుద్ధం అనివార్యంగా మారింది. ఈ నేపథ్యంలో అరబ్ సీమల్లోని ముఖ్య ప్రాంతాల్లో ఇజ్రాయిల్ తన అవాస స్థలాన్ని ఏర్పాటు చేసుకొన్నది. వేలాదిమంది ఇజ్రాయిలీలు

ఇక్కడ నివసించడం ఆరంభమైంది. అప్పటి ఇజ్రాయిలీ అవాస స్థలాల్లో ఉన్న వారంతా ఖాళీ చేయాలని పాలస్తీనా డిమాండ్ చేసింది. అయితే ఇజ్రాయిల్ అందుకు అంగీకరించలేదు. ఏడు లక్షల మంది అరబ్బులు సంపూర్ణ మానవ హక్కులతో తమ దేశంలో బ్రతుకుతున్నపుడు నలభైవేల ఇజ్రాయిలీ జనాభా ముస్లిం అరబ్బుల పాలస్తీనాలో ఎందుకు జీవించజాలదని ఇజ్రాయిల్ అంటోంది. అరబ్ ప్రాంతాల్లోని ఇజ్రాయిల్ జనాభా తమ స్వదేశానికి చేరుకోవాలంటే , ఇదే తర్కం ఇజ్రాయిల్‌లోని ఏడు లక్షల మంది అరబ్బుల విషయంలోనూ వర్తిస్తుంది. అంటే జాతిపరమైన గుర్తింపు ప్రాతిపదికగా జనాభా మార్పిడి జరగాలన్న మాట. "మతం ఆధారంగా దేశ విభజన అయితే జనాభా మార్పిడి అన్నది జరిగి తీరాలి. అంటే పాకిస్తాన్‌లోని హిందువులు భారతదేశానికి వస్తే ఇక్కడి ముస్లిం జనాభా యావత్తూ పాకిస్తాన్‌కు వెళ్ళి తీరాలి" అని చెప్పారు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, సి.రాజగోపాలాచారి వంటి రాజనీతిజ్ఞులు. యాభై ఏళ్ళ చరిత్రలో కొనసాగిన వేర్పాటు, విభజనవాదాలు, హింసా ప్రవృత్తుల్ని గమనిస్తే డాక్టర్ అంబేద్కర్, రాజాజీల అంచనాలు సంపూర్ణ సత్యాలుగా కన్పిస్తాయి.

భారత సరిహద్దుల్లోనే అనేక చోట్లల్లో ఇంకా ఎన్నో 'కార్గిల్'లు ఉన్నాయి. మన దేశంలోని కొన్ని పాత నగరాల్లో అంతకన్నా అధ్వాన్నమైన పరిస్థితులు కన్పిస్తున్నాయి. 1973 నాటికి ఇజ్రాయిల్-అరబ్బు సమరం ముగిసింది. అటు తర్వాత అరబ్ ప్రాంతాల్లో ఇజ్రాయిల్ ఆవాస స్థలాలపై దాడులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఎంతోమంది ఇజ్రాయిల్ సైనికులు, పౌరులు మృతి చెందారు. ఈ సంఖ్య అరబ్-ఇజ్రాయిలీ యుద్ధంలో మరణించిన వారికన్నా ఎంతో ఎక్కువ. గతంలో జరిగిన యుద్ధాలకన్నా (1962-1965,1971) పాక్ ప్రేరేపిత చొరబాటు-తీవ్రవాదుల వల్లనే భారత మృతుల సంఖ్య పెరిగింది. చొరబాటుదారులకు కళ్ళెం వేయాలి. పాక్ గూఢచారి సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్‌కు సహకారాన్ని అందించేవారి భరతం పట్టాలి. ఈ మేరకు ఉక్కు పిడికిలితో దృఢంగా వ్యవహరించాలి. అలా చేసినప్పుడే ముప్పులు తప్పుతాయి. ఐ.ఎస్.ఐకి సహకరించే వారిని వెలివేయాలి. ఆర్.డి.ఎక్స్, ఇతర విస్ఫోటక పదార్థాలు దొరికిన ప్రాంతాల్ని పేల్చివేయాలి. విద్రోహులకు జెర్వా తెగలవారు నివసించే అండమాన్ లాంటి ప్రాంతాల్లో శిక్షలు పడేలా చేయాలి.



తమసోమా జ్యోతిర్గమయ

హిందువుల్ని విమర్శించే వారు, సెక్యులర్ పూజారులు, భారత పాకిస్తాన్ స్నేహ సంబంధాల్ని గురించి అదే పనిగా నొక్కి చెప్పేవారు. వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక, సోషలిస్టు - మత నిరపేక్ష కాంగ్రెస్ నాయకులు, మేధావులు ఒక్కసారి పాకిస్తాన్ పర్యటనకు వెళ్ళి రావాలని భారత ప్రభుత్వం డిమాండ్ చేయాలి. ఈ తరహా పెద్ద మనుషులు పాకిస్తాన్‌లో కొన్ని వారాల పాటు ఉండి పోయి భారత-పాక్‌లో సమ్మిశ్రిత సంస్కృతి వికాసం - ఇత్యాది విషయాల్ని బోధించాలి! మక్కాకు హజ్ యాత్రికుల్ని పంపించినట్టే సర్కారు ఖర్చుతో చైనా, ఉత్తర కొరియా దేశాలకు కొన్ని బృందాల్ని పంపించాలి (ఉత్తర కొరియా ఆయుధ నౌక పాకిస్తాన్ వైపు సాగుతూ పట్టు పడింది). ఆ దేశాలకు మాత్రమే కాదు, క్యూబా, వియత్నాం, ఇరాన్, సౌదీ అరేబియా, కువాయిట్, సూడాన్, ఇరాక్, లిబియాలకు సైతం బృందాల్ని పంపించాలి. ఈ దేశాల్లో, భారతదేశంలో లౌకికవాదం పరిఢవిల్లిన తీరు, ఇస్లాం మతానికి ఇస్తున్న గౌరవాభిమానాల్ని గురించి వివరించాలి. భారత ప్రభుత్వాలు ముస్లిం మతస్తులకు మనస్తాపం కలుగకుండా ఉండేందుకు గతంలో ఎలా వ్యవహరించాయో తెలపాలి. ముస్లిం యాత్రికులు ప్రభుత్వం వారి సబ్సిడీలతో మక్కా యాత్ర సాగిస్తున్న తీరును వెల్లడించాలి. ఇవన్నీ ఇస్లామిక్ పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా లౌకిక భారతదేశానికి ఈ దేశాల మద్దతు సాధించే క్రమంలో చేపట్టాల్సిన ప్రయత్నాలు. ప్రభుత్వాలు చేయగలిగిన ప్రయత్నాల కంటే ఇలాంటి కృషి ఎక్కువ ఫలవంతమవుతుంది.

కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ అధినాయకురాలు శ్రీమతి సోనియామెయినో గాంధీని లాటిన్ అమెరికాకు పంపవచ్చు. అలాగే వాటికన్ తదితర క్రైస్తవ దేశాలకు కూడా వెళ్ళి ఆమె లౌకిక భారతదేశానికి మద్దతు సంపాదిస్తే బాగుంటుంది.

**నిక్కమైన మంచి నీల మొక్కటిచాలు,**
**తళుకు బెళుకు రాలు తట్టెడేల?**
**చదువ పద్యమరయ చాలదా ఒక్కటి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

## "ట్రూత్ అండ్ రికన్సెలియేషన్"

### గతంలో జరిగిన వాటిని మన్నించు; కాని మరిచిపోకు

**ఆగష్టు 2 - 8 , 1999**

ఈ శతాబ్దానికి చెందిన అత్యుత్తమ రాజనీతిజ్ఞుల్లో నెల్సన్ మండేలా ఒకరు. ఆయన జీవితమే ఒక పోరాట గీతం. కేవలం 9 శాతం జనసంఖ్య కలిగిన క్రైస్తవ వర్ణభేదవాదులు శతాబ్దాల తరబడి దక్షిణాఫ్రికాలో నల్లజాతీయుల మీద అణచివేత సాగించారు. ఆయన జాతి వివక్షపై తన పోరాటాన్ని సాగించారు. మండేలాను విచారించింది శ్వేతజాతి సర్కారు. ఆయనను రాబిల్ దీవుల్లో ఖైదు చేశారు. మండేలా 27 సంవత్సరాల సుదీర్ఘ కారాగారవాసాన్ని అనుభవించారు. దక్షిణాఫ్రికాలో స్వాతంత్ర్య సమర జ్వాలల్ని ఆపి ఉంచడం తమ తరం కాదని అక్కడి శ్వేతజాతి దురహంకార ప్రభుత్వం అంచనాకు వచ్చింది. అప్పటికిగానీ ఆయన విడుదల సాధ్యం కాలేదు. 1990లో స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చి చేరారు మండేలా. మండేలా మరో మహాత్ముడు. ఆయన మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ, మిహాయిల్ గోర్బచేవ్ వంటి వారి కోవకు చెందుతారు. మండేలా ఎవరినీ ద్వేషించరు. ఆయనకు ఎవరిపై ప్రతీకారవాంఛ లేదు. ఒకవేళ ఆయనలోనే ద్వేష భావం ఉంటే, దక్షిణాఫ్రికాలో ఉన్న తెల్ల జాతీయులు తట్టాబుట్టా సర్దుకొని చల్లగా జారుకోవల్సి వచ్చేది. నాటి శ్వేత జాతి ప్రభుత్వ అధినేత డిక్లర్క్– ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు నెల్సన్ మండేలాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. పర్యవసానంగా ఒక పౌరుడికి ఒకే ఓటు అన్న సూత్రం ముందుకు వచ్చింది. జాతులకు అతీతంగా, యావన్మందికీ ఇదే సూత్రాన్ని అనువర్తింప జేయాలని నిశ్చయించారు. అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో దక్షిణాఫ్రికా ఎన్నికల్ని జరుపుకున్నది. మండేలా విశాల హృదయం, మానవతా దృక్పథాల వల్లనే నల్ల జాతీయులు తెల్లవారిపై దాడులకు దిగలేదు. మైనారిటీలుగా ఉన్న తెల్లవారిపై మెజారిటీ బలం ఉన్న నల్లజాతీయులు దాడులు చేయడం ఎంతో సులువు. బహు సాంస్కృతిక, భిన్న జాతీయతలు కలిగిన దక్షిణాఫ్రికా ఒకే తాటిపై నిలబడాలంటే, గతంలో అరాచకాలకు పాల్పడినవారు అందరి ముందు నిలబడి తమ దోషాల్ని అంగీకరించాల్సిన అవసరం ఉందని మండేలా భావించారు. ఈ నేపథ్యంలోనే "ట్రూత్ అండ్ రికన్సెలియేషన్ కమీషన్" (టి.ఆర్.సి) ని ఏర్పాటు





చేయడం జరిగింది. ఇదివరకు శ్వేతజాతి ప్రభుత్వ పాలనలో అమానుష కృత్యాలకు పాల్పడిన వారి కథలన్నీ కమీషన్ ముందు వెలుగులోకి వస్తాయి. నేరాలకు పాల్పడిన వారిని పదిమందిలో నిల్చుండబెడతారు. అటు తర్వాత వారికి క్షమాబిక్ష ప్రసాదిస్తారు. మొత్తం మీద గతంలో "ఘనకార్యాలు" చేసిన వారంతా జాతి ముందు తలవంచి నిలబడక తప్పదు. ట్రూత్ అండ్ రికన్సెలియేషన్ ఏర్పాటుకు దారితీసిన కారణాల్ని గురించి మండేలా తాజాగా ఒక వ్యాసం రాశారు. టి.ఆర్.సి ఏర్పాటు కారణంగా తెల్ల–నల్ల జాతీయుల మధ్య విద్వేషాలేమీ పెరగవు. ఈనాడు దక్షిణాఫ్రికాలోని మైనారిటీ తెల్లజాతీయులు సగర్వంగా బ్రతుకుతున్నారు. "మైనారిటీ" పేరుతో వారికి ఎలాంటి ప్రతిపత్తికి ఇవ్వలేదు. కొత్తకొత్త సౌకర్యాల్ని అందించలేదు. ఇది భారత దేశంలోని పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా కన్పిస్తుంది. భారత్‌లో హిందువులపై విదేశీ దురాక్రమణ దారులు మత విద్వేష దాడుల్ని సాగించారు. ద్విజాతి సిద్ధాంతం కారణంగా అఖండ భారత విభజన జరిగింది. దేశ విభజన కోసం అలుపెరుగని పోరాటం చేసిన వారు హిందూ దేశంలోనే తమ స్వీయ స్థానాల్ని ఏర్పాటు చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు (వెనుకటి మతపరమైన వేర్పాటువాదం ప్రాతిపదికగా) వీళ్ళు ప్రత్యేక సదుపాయాలు పెరగాలనీ, మరిన్ని డిమాండ్ చేస్తున్నారు. వీరికి ప్రత్యేక నియోజకవర్గాలు కావాలి, సీట్లలో రిజర్వేషన్లు కావాలి, ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కావాలి. తమ కోరికల్ని ప్రతిపాదిస్తూ ముందుకు వస్తున్నారు వీళ్ళు. ఒకరకంగా చెప్పాలంటే 1906 లో ముస్లింలీగ్ ఏర్పడినప్పటి పరిస్థితులన్నీ అచ్చంగా మనముందు కన్పిస్తున్నాయి.

నెల్సన్ మండేలా ఈ మధ్య రాసిన వ్యాసం పేరు "క్షమించు కానీ విస్మరించబోకు" (FOR GIVE BUT NOT FORGET) పేరుతో ప్రచురణను పొందింది.

ఈ వ్యాసం దేశంలోని ప్రముఖ పత్రికలన్నింటిలోనూ కన్పించింది. మండేలా తన వ్యాసంలో శాంతియుత పరిస్థితులు దక్షిణాఫ్రికాలో వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో ట్రూత్ అండ్ రికన్సెలియేషన్ కమీషన్ ఒక ముఖ్యమైన క్షమాబిక్ష పెడుతుంది. "అనునయం అనే దృక్పథం మన జీవితంలోని ప్రతి దశనూ స్పృశిస్తుంది. అణచివేతకు సంబంధించిన సంకేతాల్ని సాధనాల్ని నిర్వీర్యం చేయాల్సిన అవసరం ఉంది. మనం విభిన్నమైన అనుభవాల్ని, ఒక్క దగ్గరకు తెచ్చుకోవాలి. మన

చరిత్రను పునశ్చరణ చేసుకోవాలి. సమాజంలోని విభజనలు, అందుకు దారి తీసే పరిస్థితుల్ని నివారించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది". అనునయ వైఖరి అన్నదే లక్షలాది మంది ప్రజలు తెల్లజాతి సర్కారుపై పోరాడేందుకు మూలమైంది. జాతి వివక్షలేని, ప్రజాస్వామ్య సమైక్యదేశం; పౌరులందరికీ సాధారణ పౌరసత్వాన్ని అందిస్తుంది, హక్కుల్ని కల్పిస్తుంది. ప్రజల్లోని భిన్నత్వాన్ని గౌరవిస్తుంది". అయితే అనునయం అన్నది మాత్రం తప్పనిసరి, అవసరం. భయంకరమైన మన గతాన్ని ఒకసారి గుర్తుకు తెచ్చుకుందాం. అందువల్ల మనం అలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోగలుగుతాం. ఎక్కడైతే వదిలిపెట్టడం అవసరమనిపిస్తుందో అక్కడ క్షమించి వదిలిపెడతాం. అయినా వదిలి పెట్టడమంటే గతాన్ని మర్చిపోవడం కాదు. అప్పటి సంగతుల్ని గుర్తుకు తెచ్చుకోవడం వల్ల అమానుషకాండ మళ్ళీ జరగకుండా జాగ్రత్త పడతాం, మనం అలాంటి దాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం. జాతి వివక్ష (మన దేశంలో ముస్లిం పెత్తనం. ప్రభుత్వాలు వాళ్ళ చేతుల్లోనే ఉండటంతో జిజియా పన్ను వేయడం, ఆలయ విధ్వంస కాండ కొనసాగించడం లాంటిదన్నమాట) మానవత్వానికే తీరని అపకారం వంటిది. జాతి వివక్ష సరిహద్దుల వెంబడే మన దేశంలోనికి దాపురించింది. అదే దేశంలో విధ్వంస బీజాలు నాటింది (భారత్‌లో కార్గిల్ తరహా) విచ్చిన్న ఘటనలకు ఈ దుష్ట బీజాల ఫలసాయమే కారణం. మానవ హక్కుల్ని ఉల్లంఘించిన వారినీ, అలాంటివారి అనుచరణ గణాల్ని మనతో కలుపుకొని పోవడం వెనుక ఎన్నో అవరోధాలున్నాయి. వీటిని తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. మనం ఇలాంటి వారిని విడిచిపెడతాం, కానీ వాళ్ళను గురించిన మరుపును మాత్రం దరి చేరనీయకూడదు".

నల్లవారిపై మానవత్వానికి మచ్చ తెచ్చే విధంగా కొనసాగిన శ్వేత జాతిపాలకుల చర్యలు, బయటకు వచ్చి, తెల్లవారిలో సత్య స్పృహ ఏర్పడే దాకా దేశంలో మైనారిటీ-మెజారిటీల మధ్య అనునయ వాతావరణం ఏర్పడదని నెల్సన్ మండేలా భావించారు. గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్ వంటి మహా నాయకుల వలెనే కూడా ఆలోచించారు. దక్షిణాఫ్రికాలోనే ఉండాలనుకుంటున్న తెల్లవారిపై నల్లజాతీయులు ప్రతీకార దాడులకు దిగరాదని మండేలా భావించారు.

❄ ❄ ❄ ❄ ❄





జాతి వివక్షను అనుభవించిన చరిత్ర మన భారతదేశానికి కూడా ఉంది. కాకపోతే అది 200 సంవత్సరాలకే పరిమితం కాలేదు. అంతకు నాలుగురెట్లు కాలం పాటు సంఖ్యాధిక్య హిందూ జనత అల్ప సంఖ్యాకులైన ముస్లిం రాజుల పాలనలో జీవితాన్ని వెళ్ళబుచ్చారు. దుర్భరమైన జీవితాన్ని అనుభవించేవారు. ఇస్లాం పేరుతో హిందువులపై వివక్ష చూపారు ముస్లిం పాలకులు. వందలాది ఆలయాలు శిథిలమయ్యాయి. ఆలయాల్ని విధ్వంసం చేసి అదే సామాగ్రితో మసీదుల్ని నిర్మించుకున్నారు. బాబ్రీ మసీదును నిర్మించింది ఒక ముస్లిం సేనాధిపతి. నిజానికి మసీదు పరిసరాల్లో తగినంత ముస్లిం జనాభా లేదు. ఒకవేళ అక్కడి ముస్లింలకు మసీదు అవసరమే అని అనుకున్నా దాన్ని శ్రీరామాలయం నెలకొన్న స్థానంలోనే కట్టాలనే అవసరం లేదు. శ్రీరాముడు మర్యాద పురుషోత్తముడు. ఆయన హిందువుల ఆరాధ్య దైవం. హిందువుల్ని అవమానించేందుకు జరిపిన ప్రయత్నమే ఈ మసీదు నిర్మాణం. ఇస్లామిక్ సేనల నేతృత్వంలో హిందూ పరాజయాన్ని గుర్తు చేసేందుకు జరిపిన ప్రయత్నం మసీదు నిర్మాణం. ముస్లిం పాలనకు చరమగీతం పాడిన తర్వాత హిందూ పాలన ఆరంభమైంది. అయినా హిందువులు ఎటువంటి ప్రతీకార వైఖరిని పాటించలేదు. మరాఠాలు, ఇతర హిందూ ప్రభువులు మసీదుల్ని గౌరవించారు. బ్రిటీష్ పాలనలో హిందువులపై వివక్ష తొలగలేదు. ముస్లింలు ప్రత్యేక ఎలక్టోరేట్ కోసం డిమాండ్ చేశారు. ప్రత్యేక ప్రాతినిధ్యం కావాలని డిమాండ్ చేశారు. ముస్లిం వర్గాల రిజర్వేషన్ డిమాండ్లతో "తాము గతంలో పాలకులమనే" భేషజం ధ్వనిస్తుంది. ఒకవేళ దక్షిణాఫ్రికాలో తెల్లజాతి దురహంకారులు తమకు ప్రత్యేక నియోజక వర్గాలు కావాలని కోరితే మండేలా అందుకు సుతారమూ అంగీకరించరు. తెల్లజాతీయుల దురహంకార చిత్తవృత్తికి దీన్ని మరో నిదర్శనంగా భావిస్తారాయన. కలకత్తాలో నాటి ముస్లిం లీగ్ ప్రభుత్వం హిందువులపై నరమేధాన్ని సాగించింది. పాకిస్తాన్ నుండి హిందువుల్ని తరిమివేశారు. 1947 తర్వాత అధికారంలో ఉన్న మన నేతలు అసలు పరిణామాల్ని సరిగ్గా పసిగట్టలేకపోయారు.

దక్షిణాఫ్రికాలో వలె ఇక్కడ కూడా ఒక ట్రూత్ అండ్ రికన్సెలియేషన్ కమీషన్‌ను ఏర్పాటు చేస్తే బాగుండేది. తాము భారతీయులము కామనీ, తమది ప్రత్యేక దేశమనీ డిమాండ్ చేసిన ముస్లింలకు తమ పొరపాటును గుర్తించే వేదిక దొరికేది. అయితే పాకిస్తాన్‌కు వెళ్ళాలని లేదా తాము ఎన్నుకున్నది వక్రమార్గమనీ

వారు గుర్తించాల్సి వచ్చేది. విభజన వాదం, వేర్పాటుతత్వం, ఎన్నెన్నో డిమాండ్ల ప్రతిపాదనలు తప్పుడు సంగతులేనని వారు అంగీకరించాల్సి వచ్చేది. హిందూ ఆలయాల్ని విధ్వంసాల్ని గురించి ప్రశ్నించే అవకాశం చిక్కేది. మిగతా ఆలయాల సంగతి అలా ఉంచినా, అయోధ్య, మధుర, కాశీల్లో మసీదుల రూపానికి చేరిన మన మహాలయాల్ని గురించి అడిగి వాటిని తిరిగి తీసుకునే అవకాశం దక్కేది. దురదృష్టవశాత్తూ ప్రత్యేక జాతి పేరుతో దేశాన్ని ఏర్పాటు చేసుకున్న ముస్లిం విషయంలో ఏకపక్ష ధోరణిని అవలంభించారు. ప్రత్యేక దేశాన్ని కోరిన ముస్లిం వర్గంలోని ఎక్కువ శాతం మంది భారత్‌లోనే ఉండిపోయారు. వీళ్ళు విభజన, వేర్పాటు వాదాన్ని విడిచిపెడతారని అందరూ అనుకున్నారు. అయితే దేశంలోని ఒకటి రెండు తప్పిస్తే మిగతా “సెక్యులర్” పక్షాలన్నీ భారతీయులు తమ గతాన్ని మర్చిపోవాలని అంటున్నాయి. వీళ్ళలో అందరికన్నా పెద్ద గొంతుతో మాట్లాడేవాళ్ళు వామపక్ష అభ్యుదయవాద, లౌకికవాద, సామ్యవాద, మార్క్సువాదాలకు చెందిన పెద్ద మనుషులే. గతంలో బాధలకు లోనైన వాళ్ళు దాన్ని మర్చిపోవాలన్నది వీళ్ళ ఉవాచ. ఈ నేపథ్యంలో దోషాలు చేసిన వాళ్ళు తాము నిర్దోషులమని భావిస్తున్నారు. మరోవైపు దేశంలో ముస్లింలపై వివక్షణ సాగుతున్నదనే జరిగిపోతోంది. స్వతంత్ర్య భారతం అవతరించే నాటికి దేశంలో ముస్లింల జనాభా ఆరుశాతం. అది ఇప్పుడు మరో పదిశాతం పెరిగింది. దేశంలోని అత్యున్నత స్థాయి పదవులు వాళ్ళను వరించాయి. అయినా ఈ ఏడాది జులైలో “ముస్లింల జీవించే హక్కు” పేరిట చెన్నై నగరంలో ఒక సమావేశాన్ని జరుపుకున్నారు వాళ్ళు. ఈ సమావేశానికి హాజరైన వ్యక్తి దేశంలోనే అత్యంత అవినీతి పరురాలిగా చరితకెక్కిన జయలలిత, కుహనా లౌకికవాదుల జాబితాలో జయలలిత పేరు మొట్టమొదటిదేమీ కాదు. దేశ విభజన కన్నా ముందు కాలంలోనే ముస్లింల అమానుష చర్యల్ని కప్పిపుచ్చేందుకు యత్నించిన నేతలు ఎంతోమంది కన్పిస్తారు. ముస్లింలకు తమ తప్పుల్ని సత్యస్ఫూహతో అంగీకరించే అవకాశాన్ని అందించకపోవడమన్నది పొరపాటుగా తయారైంది. అనునయ వైఖరిని సాధించకపోవడం వల్లనే ఈనాటి భారత రాజకీయాల్లో వింత జాడ్యాలు తయారయ్యాయి. ముస్లింల డిమాండ్ల తయారీ, విభజన, వేర్పాటువాదాలు 1947 కన్నా ముందునాటి వాతావరణాన్ని గుర్తుకు తెస్తున్నాయి. ఐ.ఎస్.ఐ ఏజెంట్లు, ఆర్.డి.ఎక్స్, బాంబులు, మందుగుండు సామాగ్రి, తిష్ఠవేసిన అరబ్బీ, పాక్ జాతీయులు





ముస్లింల ఇళ్ళలోనే కన్పిస్తున్న దృశ్యాలు. హిందువుల ఇళ్ళలో ఇలాంటి దాఖలాలు లేవు. ప్రముఖ తత్వవేత్త జార్జిశాంతాయన చరిత్రపై చేసిన వ్యాఖ్య చాలామందికి తెల్సిందే. నెల్సన్ మండేలా అర్నాల్డ్ టాయన్బీ, జార్జిశాంతాయనల వంటి మేటి తత్వవేత్త కాదు. అయితే ఆయనకు అట్టడగు స్థాయి ప్రజా జీవితం ఉంది. మండేలా పాటించిన వైఖరిని భారత్‌లో కూడా అనుసరించడం అవసరం. స్థానికులపై జరిగిన అకృత్యాలు, తమ వర్గం పెత్తనమే చెలామణి కావాలన్న వారి ధోరణులు బయట పడాలంటే ఇక్కడ కూడా ఒక ట్రూత్ అండ్ రికన్సెలియేషన్ కమీషన్ ఏర్పాటు తప్పనిసరి. దాన్ని ఎప్పుడూ ఆలస్యంగా భావించవద్దు. అసలే జరగని పనికన్నా ఆలస్యంగా సాగే ప్రయత్నం నూరు విధాలుగా నయం.

**జలముల నగ్ని ఛత్రమునఁ జండమ యూఖుని దండ తాడనం**
**బుల వృషగార్ధభంబులను బొల్పగు మత్తకరీంద్రము సృణిం**
**జెలంఁగెడు రోగ మౌషధము చే విషముందగు మంత్రయుక్తిని**
**మ్ములఁదగఁజక్క జేయనగ మూర్ఖుని మూర్ఖత మానవచ్చునే!**

**భావం:** నీటిచే నిప్పును, గొడుగువలన ఎండను, కొట్టుటచే వృషభ గార్ధభములను, శూలముచే మదించిన యేనుగును, ఔషధమువలన రోగమును, మంత్రముచే విషమును నివారింపవచ్చును కాని మూర్ఖుని మూర్ఖత్వమును మాన్పదగినయౌషధము గాని మంత్రములు గాని లేవని చెప్పవచ్చును.

**ఆత్మశుద్ధి గలిగి యధికుల మనబోరు**
**ధీరవృత్తి గలిగి తిరుగబోరు,**
**రూపు కుదురనుంచి రూఢి గావింతురు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

## డైరక్ట్ టు హోమ్ బ్రాడ్ కాస్టింగ్‌పై

## దూరదర్శన్ ఆధిపత్యం ఎందుకు?

**ఆగష్టు 9 - 15 , 1999**

ప్రపంచం మొత్తం మీద, రెండు వందలకు పైగా దేశాలు హైఫ్రీక్వెన్సీని రేడియో, ట్రాన్స్‌మీటర్లు ఉపయోగించి ఇతర దేశాలలోని ప్రజలకు సమాచారం అందించడానికీ, వారి ఆలోచనలను, అభిప్రాయాలను, తమకు అనుకూలంగా ప్రభావితం చేయడానికీ ప్రయత్నిస్తూ ఉంటాయి. సమాచారాన్ని, వార్తలను, అభిప్రాయాలను రేడియో సహాయంతో వివిధ ప్రయోజనాల కోసం వ్యాప్తి చేసే స్వేచ్ఛ అందరికీ ఉంది. కొన్ని సందర్భాలలో తమ దేశ ప్రయోజనాలకు హాని కలుగుతుందనుకున్నప్పుడు అటువంటి విదేశీ కార్యక్రమాలను జామ్ చేయడానికి (సాంకేతికంగా వినడానికి వీలులేకుండా చేయడం) కొన్ని దేశాలు ప్రయత్నాలు చేసి విఫలమవుతు ఉంటాయి. టెలివిజన్ రంగంలోకి వచ్చాక ఆరంభంలో 100 కిలోమీటర్ల దూరానికి మించి ప్రసారం చేయడానికి సాధ్యం అయ్యేది కాదు. ఈ కారణంగా ఏ దేశమూ కూడ, రేడియో ప్రసారాలలాగ, టెలివిజన్ కార్యక్రమాలను ప్రజలకు ప్రసారం చేయలేక పోయేది. ఈ సాంకేతిక పరమైన పరిమితిని (కమ్యూనికేషన్స్, శాటిలైట్స్) సమాచార ఉపగ్రహాలు అధిగమించాయి. ఇప్పుడు ఈ సమాచార ఉపగ్రహాలు ఎంత శక్తివంతంగా, సమర్థవంతంగా రూపొందాయంటే ఈ భూమ్మీద మూడవ వంతు భాగానికి అతి సులువుగా అనేక కార్యక్రమాలను ప్రసారం చేయడం సాధ్యమవుతోంది. ఒకప్పుడు ఒక పెద్ద టేబుల్ పరిమాణంలో ఉండే రేడియో రిసీవర్లు, జేబులో పట్టే స్థాయికి తగ్గాయి. అలాగే ఉపగ్రహాలు ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాలను రిసీవ్ చేసుకునే యాంటిన్నా డిష్‌లు (కొన్ని మీటర్ల వ్యాసంతో ఉండేవి) ఇప్పుడు కేవలం 50 సెంటీమీటర్ల సైజులో లభిస్తున్నాయి. ఈ యాంటిన్నా డిష్‌ల వల్ల దేశ దేశాల కార్యక్రమాలను నేరుగ తెలుసుకోవచ్చు. దీన్నే "డైరక్టు టు హోమ్ బ్రాడ్ కాస్టింగ్" అంటున్నారు. అతి తక్కువ ఖర్చుతో లభించే ఈ సౌకర్యాన్ని ప్రజలకు అందకుండ నిషేధించడంలో అర్థం లేదు. రేడియోల ద్వారా ఒక దేశం కాని, ఒక సంస్థ కాని ఇతర దేశాలలోని ప్రజలకు తమ అభిప్రాయాలను, ఆలోచనలను ప్రసారం చేయడానికి అవకాశం ఉన్నప్పుడు,





అటువంటి వాటిని తెలుసుకునే స్వేచ్ఛ అన్ని దేశాల ప్రజలకు ఉన్నప్పుడు డైరక్ట్ టు హోమ్ కార్యక్రమాలపై ఒక సంస్థకు పూర్తి పెత్తనం, గుత్తాధిపత్యం ఎందుకు? ఈ సౌకర్యం ఉపయోగించుకోవడానికి ప్రజలపై ఆంక్షలెందుకు?

డైరెక్టు టు హోమ్ ప్రసారాలు రెండు విధాలుగా సాగుతున్నాయి. ఒకటి సాధారణమైనది. ఎటువంటి ఆంక్షలు లేనిది. ఈ పద్ధతిలో ప్రసారాన్ని ఎటువంటి ప్రత్యేక సాధన సంపత్తి అవసరం లేకుండా ప్రజలకు అందుతాయి. వీటికి ప్రధాన ఆదాయం వాణిజ్య ప్రకటనలే. రెండో తరహా "కోడెడ్ బ్రాడ్ కాస్టింగ్" పద్ధతిలో ప్రతి రిసీవరుతో ఒక డీకోడర్ కూడా అవసరమవుతుంది. అంటే డీకోడర్ ఉంటేనే మన ఇళ్ళలోని టెలివిజన్ సెట్లు ఈ కార్యక్రమాలను మనకందించ గలుగుతాయి. అందుకు డైరక్ట్ టు హోమ్ ప్రసారం చేసే వారికి కొత్త సబ్‌స్క్రిప్షన్ చెల్లించవలి ఉంటుంది. అప్పుడు ఈ ప్రసారాలు చేసే వారు వాణిజ్య ప్రకటనలపై ఆధారపడి ఉండనవసరము లేదు. ఈ డైరక్ట్ టు హోమ్ ప్రసారాలను మన దేశ ప్రజలకు అందకుండా చెయ్యాలంటే ముందు డీకోడర్ల అమ్మకాలను, వినియోగాన్ని నిషేధించాల్సి ఉంటుంది. దూరదర్శన్ మాత్రమే డికోడర్ల సరఫరా చేసి అనుమతించవలసి వుంటుంది. ఈ నిషేధాలు ఖాతరు చేయనివారిని పట్టుకోవడం కోసం కొందరు ఇనస్పెక్టర్లును నియమించవలసి ఉంటుంది. ఈ సందర్భంలో గతంలో లైసెన్సు లేని రేడియోలను పట్టుకోవడం కోసం, రేడియో ఇన్‌స్పెక్టర్లు, టెలిఫోన్ అక్రమాలను, దుర్వినియోగాలను నివారించడానికి టెలిఫోను ఇనస్పెక్టర్లు ఉండేవారని గుర్తు చేసుకోవాలి. అంటే డైరెక్టు టు హోమ్ సౌకర్యాన్ని , దూరదర్శన్ ద్వారా కాకుండా, ఇతర మార్గాల్లో పొందకుండ అడ్డుకోవాలంటే మళ్ళీ ఇలాంటి ఇనస్పెక్టర్లు అవసరం. ఇనస్పెక్టర్ల తీరు ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే.

ఇటీవల కాలంలో భారత ప్రభుత్వం సరళీకృత విధానాలనే అనుసరిస్తోంది. ఇప్పుడు దేశంలో నుంచి టెలివిజన్ ప్రసారాలను ఇతర దేశాల సాయం లేకుండ ఉపగ్రహాల సాయంతో ప్రసారం చేయడానికి (అప్‌లింక్) అనుమతించింది. ఇంతవరకు హాంగ్‌కాంగ్, కొలంబో, సింగపూర్, వంటి దేశాలకు మన దేశీయ కార్యక్రమాల ప్రసారానికి పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం చెల్లించవలసి వచ్చేది. ఇప్పుడు అది అంతా ఆదా అయింది. అంతేకాక ఉపగ్రహాల ద్వారా ప్రసారాలకు ప్రైవేటు వారిని కూడ అనుమతించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అంటే విదేశీ సంచార్

నిగం (VSNL) జోక్యం ఉండదు. ఇది చాలా అర్థవంతమైన చర్య. ప్రైవేట్ ఇంటర్‌నెట్ సర్వీస్ పాలసీ క్రింద ఇతర దేశాల కార్యక్రమాలను మన దేశంలో ప్రసారం చేయ్యడానికి, మన కార్యక్రమాలను ఇతర దేశాలలో ప్రసారం చేయ్యడానికి అనుమతి ఇస్తోంది. ఇంత సరళీకృత విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వం ఈ డైరక్ట్ టు హోమ్ కార్యక్రమాల విషయంలో దూరదర్శన్‌కు ఐదు ఏళ్ళ పాటు పూర్తి పెత్తనం ఇవ్వడానికి ఎందుకు ఆలోచిస్తోందో అర్థం కావటం లేదు.

ప్రసారాలకు అవసరమైన ఫ్రీక్వెన్సీ కొరత అయితే అర్థం చేసుకోవచ్చు. కాని ఇప్పటికే అనేక విదేశీ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు అన్ని విధాలుగా అన్ని రకాల కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాయి. ఇన్‌శాట్ ఉపగ్రహాలలో అవసరమైనన్ని క్యూ బాండ్ ట్రాన్స్ పాండర్లు ఉన్నాయి. అటువంటప్పుడు ప్రభుత్వం దూరదర్శన్‌కి గుత్తాధిపత్యం కట్టపెట్టడానికి ఇతర సరళ విధానాలకు పొంతన కుదరడం లేదు. దూరదర్శన్‌కు ఐదేళ్ళు పెత్తనం ఇవ్వడంపై ప్రజాభిప్రాయాన్ని సాంకేతికంగా వచ్చే మార్పులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పునరాలోచన చేయాలి. డైరక్ట్ టు హోమ్ ఉత్తర్వులను కొత్త ప్రభుత్వం వచ్చే వరకు నిలిపి వేయాలని ఎన్నికల కమీషన్ ఆదేశించడం విచారించవలసిన విషయం. వాయిదా వేయడం వల్ల దేశ ప్రజలతో బాటు దేశీయ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు మాత్రమే నష్టపోతాయి.

**క. వెడవెడ నడకలు నడచుచు,**
**నెడనెడ నడుగిడఁగ నడరి యిల దిగఁబడఁగన్**
**బుడిబుడి నొడువులు నొడువుచుఁ**
**జిడిముడి తడఁబడఁగ వడుగు సేరెన్ రాజున్**

శ్రీమదాంధ్ర మహాభాగవతం అ.స్క.

చిన్నపిల్లలు నడుస్తునట్లా వామన బ్రహ్మచారి (వెడ్డి, వెడ్డి అడుగులు వేస్తూ) అక్కడక్కడ అడుగు వేస్తూ అడుగు తీస్తూ నేలపై పాదాన్ని ఎత్తి వేస్తూ, ఎగురుతూ బుడి బుడినడకలతో భూమిపై ఎగురుతూ గెంతుతూ తడబడ్తూ బలి చక్రవర్తిని రాజును చేరాడు.





# పరువు తగ్గి పతనమైన కమ్యూనిజం

**ఆగష్టు 16 - 22 , 1999**

1996, 98 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు సెక్యులరిస్టుల ప్రవచనాలకు విలువ లేదని తేల్చి చెప్పాయి. సెక్యులరిజాన్ని గురించి గొంతు చించుకొని చెప్పేవారంతా హిందుత్వ వ్యతిరేకులు అన్నది స్పష్టపడింది. హిందూయేతర ఓటు బ్యాంకును బుజ్జగించేందుకు జరిగే మతపరమైన ప్రయత్నాలే లౌకికవాద ప్రచారాలుగా మారుతున్నాయని మేధావి వర్గం గుర్తించింది. ఇదివరలో భారతీయ జనతా పార్టీని మతతత్వ శక్తిగా విమర్శించిన రాజకీయ పక్షాలన్నీ (కాంగ్రెస్, కమ్యూనిస్టులు మినహా) ప్రస్తుతం ఆ పార్టీతో ఎన్నికల పొత్తు కుదుర్చుకున్నాయి. 1967, 77 సంవత్సరాల్లో జనసంఘ్‌లో స్నేహం చేసే విషయంపై కమ్యూనిస్టులు ఎలాంటి అభ్యంతరాలు తెలుపలేదు. అప్పట్లో మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో జనసంఘ్ భాగస్వామిగా ఉన్న యునైటెడ్ ఫ్రంట్‌లో కమ్యూనిస్టులు కూడా చేరారు. 1996, 1998 లలో హిందుత్వ వ్యతిరేకతను ప్రతిబింబించిన సెక్యులర్ నినాదం అవినీతిపై యుద్ధాన్ని కప్పి పుచ్చింది. ఒకనాడు లౌకికవాదంపై భీషణ ప్రకటనలు ఏసిన జనతాదళ్ ఈ రోజు ముక్కలు చెక్కలైంది. ఇందులో ఒక వర్గం బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్.డి.ఎ)లో చేరేందుకై ఉబలాట పడుతోంది. 1999 లోక్‌సభ ఎన్నికల్లో సెక్యులర్ నినాదాలు, లౌకికవాద ప్రవచనాలు మరింతగా తమ విలువను కోల్పోతాయి. ముస్లింలీగ్, మజ్లిస్ ఇత్తెహదుల్ ముస్లిమీన్ (ఎం.ఐ.ఎం) జగడాదళ్ లేదా జనతాదళ్ గ్రూపులు, ద్రవిడ పార్టీలన్నీ కలిసి సెక్యులరిజం పేరుతో నానా హడావిడి సృష్టించాయి.

ఈ పార్టీల నేతలందరి కన్నా ఎక్కువగా తప్పు పట్టాల్సింది కమ్యూనిస్టుల్ని. వీళ్ళు కాంగ్రెస్, 'అన్న' తెలుగుదేశం పార్టీలతో పొత్తు కోసం సకల యత్నాలు చేస్తున్నారు. అవినీతితో అపఖ్యాతి పాలైన రాష్ట్రీయ జనతాదళ్, అన్నాడిఎంకెలతో పాటు సమాజ్‌వాది, పవార్ చీలిక వర్గం, కాంగ్రెస్, ముస్లింలీగ్‌తో ఎన్నికల అవగాహన కమ్యూనిస్టుల "ఎత్తుగడ"! ఒక్క మన దేశంలోనే కాదు, యావత్ప్రపంచంలోనూ కమ్యూనిస్టులు ఘోరంగా విఫలమవుతున్నారు. కమ్యూనిస్టుల భావజాలం కాలం చెల్లిన సిద్ధాంతాల జాబితాలో చేరిపోయింది. మాజీ సోవియట్ అధినేత నికితా

క్రిశ్చేవ్ పేరు చాలామందికి తెలుసు. ఆయన 1956-1964ల మధ్య సోవియట్‌ను పాలించారు. క్రిశ్చేవ్ కుమారుడు సిర్గేయ్ కృశ్చేవ్ ఆయన వృత్తిరీత్యా ఇంజనీరు. ఆయన అమెరికా పౌరసత్వాన్ని స్వీకరించేందుకు సిద్ధపడుతున్నారు. ఇది కొద్దివారాల క్రితమే బయటపడిన సంగతి. ప్రపంచం యావత్తూ కమ్యూనిజం ఛత్రఛాయల్లోనే ఉండాల్సి వస్తుందని అప్పట్లో నికితా కృశ్చేవ్ అనేవారు. కమ్యూనిజం అందించే సిద్ధాంత బలంతో సోవియట్ దాని మిత్ర దేశాలు అమెరికా పని పడతాయని నికితా కృశ్చేవ్ ఐక్యరాజ్యవసమితిలో ప్రకటించారు. రెండేళ్ళు గడిచిపోయిన తర్వాత నికితా కృశ్చేవ్‌గారు ఇటు సోవియట్ అధినేతృత్వం నుండి అటు కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుండి కూడా ఉద్వాసనకు లోనయ్యారు. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 20 వ కాంగ్రెస్ రహస్య సమావేశాలు నికితా కృశ్చేవ్ హయాంలోనే జరిగాయి. నిజంగా వీటిని నిర్వహించడం కృశ్చేవ్ సాహసమేనని చెప్పాలి! ఎందుకంటే ఈ రహస్య సమావేశాల్లోనే కమ్యూనిస్టులు దైవ సమానంగా ఆరాధించిన స్టాలిన్ కర్కశ నియంతృత్వ చర్యలు బయటపడ్డాయి. కమ్యూనిస్టు పాలనలో ఉన్న లొసుగుల్ని ఎత్తి చూపిన వ్యక్తి నికితా కృశ్చేవ్. ఈ మేరకు ఆయన చేసిన ఉపన్యాసం సోవియట్ బయటి ప్రాంతాల్లోని కమ్యూనిస్టుల ఆలోచనల్ని మరో మార్గంవైపు మళ్ళించింది. కృశ్చేవ్ ఆరంభించాలని అనుకున్న రాజకీయ ఉదారీకరణకు అవరోధాల్ని కల్పించారు బ్రెజ్నేవ్. వ్యవస్థలోని లోప భూయిష్టమైన విధానాల పుణ్యమా అని కమ్యూనిజం, కమ్యూనిస్టు రాజ్యం 1991లో పతనమయ్యాయి. గతంలో సోవియట్ ఆక్రమణ పద్ధతుల ద్వారా తనలో కలుపుకున్న ప్రాంతాలన్నీ స్వేచ్ఛా గీతాల్ని పాడుకునేందుకు ముందుకు సాగాయి. మానవీకరణ, సామాజీకరణ, సమానత్వ సాధనలే లక్ష్యాలుగా చెప్పుకునే కమ్యూనిస్టు సిద్ధాంతాలు సంపూర్ణంగా విఫలమయ్యాయని విశ్వమంతా అంగీకరించింది. అయితే ఉత్తర కొరియా, క్యూబాలతో పాటు భారతదేశంలోని కమ్యూనిస్టులు మాత్రం ఇందుకు మినహాయింపు. చాలా రోజుల క్రితమే స్టాలిన్ కుమార్తె స్వెత్లానా అల్యూలివా భారతదేశానికి పరుగెత్తుకుంటూ వచ్చారు. ఆమె తన తండ్రి స్టాలిన్ కమ్యూనిజం పేరుతో జరుపుతున్న దమనకాండను చూసి తట్టుకోలేకపోయారు. స్టాలిన్ కుమార్తెకు భారత్‌లో ఆశ్రయం ఇస్తే మన దేశానికి - సోవియట్ యూనియన్‌కూ మధ్య ఉన్న సత్సంబంధాలు దెబ్బతింటాయని భయపడ్డారు నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ. మొత్తానికి ఏదో ఒక విధంగా స్వెత్లానాను





భారతదేశం నుండి పంపించి వేశారు. కమ్యూనిజం వైఫల్యానికి మరో నిదర్శనం ఎడ్వర్ట్ షెవర్డ్ నాట్జె. ఆయన గతంలో సోవియట్ విదేశాంగ మంత్రిగా ఉండేవారు. షెవర్డ్ నాట్జె ప్రస్తుతం జార్జియా అధ్యక్షుడు. తమ దేశ సరిహద్దులకు రక్షణకు సహకరించాల్సిందిగా అమెరికాను అభ్యర్థిస్తున్నారు. జార్జియా అధ్యక్షుడు షెవర్డ్ నాట్జె. ఇస్లామిక్ ఛాందసవాదం నుండి తన దేశాలను రక్షించుకునేందుకు అవసరమైన ఆర్థిక వసతి, సాంకేతిక సంపత్తి, ఆయుధ సంపద జార్జియా వద్ద లేవని ఆయన బాధ పడుతున్నారు. కమ్యూనిజం చల్లని నీడలో శాస్త్ర సాంకేతిక రంగాలు అత్యున్నత శిఖరాలకు చేరుకున్నాయన్న ప్రచారంలో అణావంతు నిజం లేదని తేలడం లేదూ! కమ్యూనిస్టు ప్రచారకులు చేసిందంతా పచ్చి అబద్ధం కాదు?

ఇప్పటికీ కమ్యూనిజాన్ని అలాగే పట్టుకొని ఉన్నవి ఉత్తరకొరియా, క్యూబా. ఉత్తర కొరియా ప్రజలు పట్టెడు తిండి కోసం కటకటలాడుతున్నారు. ఆకులు, అలములు, చెట్టు బెరడులు ఏవైతేనేమి, అన్నింటినీ ఆరగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నరమాంస భక్షణ కూడా సాగుతోందన్న వార్తలు విన్పిస్తున్నాయి. తమకు ఆహార పంపిణీ చేయకపోతే క్షిపణి ప్రయోగం జరుపుతానని అమెరికా, దక్షిణ కొరియా దేశాల్ని హెచ్చరిస్తోంది. ఉత్తర కొరియా, క్యూబా అన్నార్తులు అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రానికి వలస పోతున్నారు. ఇలాంటి వలసల్ని ప్రోత్సహిస్తోంది క్యూబా. ఇదిగో, కమ్యూనిస్టు వ్యవస్థలు సాధించిన ఘన విజయాలు ఇవన్నీ! ఒకనాడు కమ్యూనిస్టులు రాజ్యం చేసిన దేశాల్లో నేరమయ ప్రవృత్తి, అవినీతి, అక్రమంగా డబ్బు వసూలు చేయడం, మోసం, దగా, మాదక ద్రవ్యాల రవాణా, వ్యభిచారం అన్ని ఉన్నాయి. రష్యా విదేశీ ఋణం 50 బిలియన్ల అమెరికన్ డాలర్లకు చేరుకున్నది. అమెరికా తన అప్పులో ఎంతో కొంత మేరకు మాఫీ చేయకపోతే రష్యా ఆర్థిక వ్యవస్థ బ్రతికి బట్టకట్టడం కష్టమేనని చెబుతున్నారు విజ్ఞులు.

ఇక భారతదేశంలోని కమ్యూనిస్టుల వైపు వస్తే... ఇంతకాలం నుండి వీళ్ళు చేస్తున్నదేమిటి? వీళ్ళు దేశంలో ఏ మూలన, ఏ వర్గం వారు, ఎలాంటి డిమాండ్లతో సమ్మె చేసినా వారికి మద్దతు పలికారు. హరికిషన్‌సింగ్ సూర్జిత్ వంటి వయోవృద్ధ కామ్రేడ్లు ప్రభుత్వాన్ని పతనం చేసే విషయంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. కొత్తకొత్త ఎన్నికల పొత్తుల్ని కుదుర్చుకున్న కమ్యూనిస్టులు పెద్దగా పేరు, ప్రఖ్యాతులు లేనివారినే దేశ ప్రధాని పదవిపైనా, ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోబెట్టాలని

యత్నించారు. ఇలాంటి వారి వెనుక అసలు అధికారాన్ని తాము అనుభవించాలన్నది కామ్రేడ్ల అసలు వ్యూహం. దేశంలోని ఏకైక జాతీయవాద రాజకీయ పక్షమైన బిజెపిని వ్యతిరేకించే ప్రతి పార్టీతోనూ పొత్తు పెట్టుకున్నారు కమ్యూనిస్టులు. వాళ్ళ దృష్టిలో అవినీతి అన్నది సమస్యే కాదు! కార్గిల్‌లో పాకిస్తానీ అక్రమ చొరబాటుదారుల విషయంలో మన ప్రభుత్వం అతిగా స్పందిస్తోందని అంటున్నారు కమ్యూనిస్టులు. దేశ సరిహద్దుల రక్షణకు ఏ మాత్రం వ్యయం కూడదని వీళ్ళ సిద్ధాంతాలు చెబుతున్నాయి. ఈ మొత్తం యావత్తూ పేదలను పోషించేందుకే వినియోగించాలని కమ్యూనిస్టులు ఘోషిస్తూ ఉంటారు. కమ్యూనిస్టులు చెబుతున్న పేదల జాబితాలో బంగ్లాదేశ్ ముస్లింలు సైతం చోటు చేసుకుంటారు. 1962లో చైనా మనపై దురాక్రమణ చేసినపుడు కలకత్తా నగరంలోని గోడలపై "ఇందిరా యాహ్యా దాందూ వొందే" అని కమ్యూనిస్టులు రాయించిన వ్రాతల్ని మర్చిపోగలమా? 13వ లోక్‌సభ ఎన్నికల్లో కమ్యూనిజాన్ని కోరుకుంటున్న రాజకీయ పార్టీలు, శిబిరాలు ఏవీ లేవు. భారత్ నుండి పాకిస్తాన్ విడిపోవడానికి మద్దతు తెలిపారన్న కృతజ్ఞతతో కాబోలు కమ్యూనిస్టులకు మద్దతు పలుకుతున్నాయి పలు ముస్లిం పార్టీలు, సంస్థలు. ఇదివరలో కమ్యూనిస్టులకు సన్నిహితం కావాలనుకున్న కాంగ్రెస్ ఇప్పుడు ఆ పార్టీలతో దూరాన్ని పెంచుకోవాలనుకుంటోంది. కమ్యూనిస్టుల కుటిల రాజకీయాలు కాంగ్రెస్‌కు తెలియనివి కావు. సెక్యులరిజంలానే మరికొంత కాలానికి కమ్యూనిజం సైతం కాలగర్భంలో కలిసిపోక తప్పదు.

భారత కమ్యూనిస్టులు టోటలిటేరియన్ మార్క్సిస్టు సూత్రాన్ని అలాగే పట్టుకున్నారు. టోటలిటేరియన్ వ్యవస్థలో కమ్యూనిస్టు పార్టీ తప్ప మరో రాజకీయ పక్షం ఉండేందుకు వీల్లేదు. అక్కడ స్వతంత్ర్యంగా వ్యవహరించే వార్తాపత్రికలు ఇతర ప్రచురణ సాధనాలు ఉండకూడదు. చర్చిలు, మసీదులకు గ్రహణం పడుతుంది. ప్రార్థనలు చేసుకునేవారిని తరిమి కొడతారు. భారతదేశ రాజ్యాంగం వ్యక్తిగతమైన హక్కుల్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించింది. కమ్యూనిస్టు రాజ్యాల్లో వీటి ప్రస్తావన ఉండదు. పాలస్తీనా విమోచనా సంస్థ తన విధ్వంస విధానాలకు చరమగీతం పాడేదాకా దానితో ఎలాంటి చర్చలు జరపబోమని ఇజ్రాయిల్ ప్రకటించింది. చివరకు పాలస్తీనా దిగి వచ్చింది. అలానే భారత ప్రభుత్వం కూడా కమ్యూనిస్టుల్ని బహిరంగంగా హామీ ప్రకటించమని కోరాల్సింది. తమకు నియంతృత్వంపై నమ్మకం



తమసోమా జ్యోతిర్గమయ

లేదని వారితో బహిరంగ ప్రకటన చేయించాల్సి ఉండింది. ఇలాగే ముస్లింలీగ్‌తోనూ బహిరంగ ప్రకటన చేయించాల్సి ఉండింది. వారు తమ ద్విజాతి సిద్ధాంతాన్ని విడిచి పెట్టినట్లు వెల్లడించాలని కోరాల్సి ఉండింది. ఈ మేరకు మన దేశం పొరపాటు చేసి ఉంటుందనే నేను అభిప్రాయపడుతున్నాను. ఫాసిస్టు, నాజీయిస్టు, కమ్యూనిస్టు, మత ఛాందసవాద శక్తులు ప్రజాస్వామ్యంలో కలిసి పోవడం ప్రజాస్వామ్య వ్యవస్థల బలహీనత అని ఇటీవల ఒక మేధావి అభిప్రాయ పడ్డారు. ఇలాంటి శక్తులు ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయి. నియంతృత్వాన్ని పాదుకొల్పుతాయి. భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించిన తొలిరోజుల్లో, ఆంధ్ర, తెలంగాణా, పశ్చిమబెంగాల్, కేరళల్లో కమ్యూనిస్టులు సాయుధ పోరాటాల్ని గుర్తుకు తెచ్చుకోవాలి. కమ్యూనిస్టు సానుభూతి పరుడైన నెహ్రూకు సైతం వారి చర్యలు ఆగ్రహాన్ని తెప్పించాయి. "దేశ ప్రగతి, శాంతి, సౌభాగ్యాలకు భారత కమ్యూనిస్టు పార్టీ బద్ధ శత్రువులా పరిణమించింది" అని ఆయన 1949 జులై 14వ తేదీన కలకత్తాలో జరిగిన ఒక సభలో ప్రకటించారు. అప్పటి నుండి నేటిదాకా కమ్యూనిస్టుల పోకడల్లో ఎలాంటి మార్పు లేదు. వారు చీలికల సూత్రధారులుగా, అస్థిరపరిచే శక్తులుగా, కుటిల రాజకీయవేత్తలుగా కీర్తిని పెంచుకున్నారు. భారతీయేతర, హిందూయేతర, జాతి వ్యతిరేక దృక్పథంతోనే సాగుతూ వచ్చారు. 1952లో మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన సి.రాజగోపాలాచారి కమ్యూనిజం తన ప్రథమ శత్రువని ప్రకటించారు. అటు తర్వాత వారితో రాజకీయ అనుబంధాల్ని సంపూర్ణంగా తెగ తెంపులు చేసుకున్నారాయన. అటు తర్వాత అవినీతి ప్రాతిపదికపై పి.డబ్ల్యు.సి తన ద్వితీయ శత్రువని అన్నారు. గతంలో సెక్యులరిస్టుల కుహానా లౌకికవాదాన్ని రథయాత్ర నేపథ్యంలో జాతి జనతకు వివరించారు శ్రీఎల్.కె.అద్వానీ. ప్రస్తుతం "లౌకికవాద" నినాదాల హోరు విన్పించడం లేదు. 1999 లోక్‌సభ ఎన్నికల తర్వాత కమ్యూనిజానికి కూడా ఇదే గతి పడుతుంది. సోవియట్‌లో 1991 నాటికి కమ్యూనిజం పతనమైంది. రాబోయే ఎన్నికల్లో మన దేశంలో ఇదే నిజం మరోమారు పునరావృతమవుతుంది.

# బలపడుతున్న భారతంలో కాంగ్రెస్ వెకిలి చేష్టలు

**ఆగష్టు 30 - సెప్టెంబర్ 5 , 1999**

ఇటీవల సంభవించిన కొన్ని ఉల్లేఖనీయమైన సంఘటనలు, ఎన్నికలకు ఎదురు చూస్తున్న భారత ప్రజలపై ముద్ర వేసే అవకాశాలున్నాయి. రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు శ్రీఎస్.ఆర్.నాథన్. ఆయన సింగపూర్‌లో జన్మించారు. ఆయన సింగపూర్‌లోని భారత సంతతికి చెందినవారు. గతంలో ఫిజీ, మారిషస్, గయానా, సురినామ్, ట్రినిడాడ్, టొబాగో ప్రధానులయ్యారు. ఇలా ప్రపంచలోని పలు దేశాల్లో భారత సంతతికి చెందినవారు అత్యున్నత స్థానాలకు ఎదగడం గర్వించదగింది. వీళ్ళ తాతముత్తాతలు 160 సంవత్సరాల క్రితం భారతదేశాన్ని వదిలివెళ్ళారు. వాళ్ళు బీదసాదాలు, నిరక్షరాస్యులు. అప్పట్లో భారత సమాజంలో వీళ్ళు అధమస్థాయి జీవనాన్ని గడిపేవారు. అయినావాళ్ళు దేశాన్ని విడిచి పెట్టేముందు భారతీయ సహజగుణమైన కఠోర పరిశ్రమను తమ వెంట తీసుకొని వెళ్ళారు. దేవుడిపై విశ్వాసాన్ని నిలుపుకున్నారు. స్వధర్మపై నమ్మకాన్ని పెంచుకున్నారు. తన పనిని తాను చిత్తశుద్ధితో చేసేవాడికి దైవానుగ్రహం ఉంటుందన్న హిందూ తత్వాన్ని నమ్ముకున్నారు. విదేశాలకు పయనమైన నాటి భారతీయ కూలీలు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు. బ్రిటీష్ వలస వాదులు చెరుకు ప్లాంటేషన్లలో ఈ కూలీల్ని నానా అగచాట్లకు గురిచేశారు. భారతదేశం నుండి వలసపోయిన కూలీలు నేలను దున్నారు. పనికిరాని భూముల్ని కొనుక్కొని వాటిని నందన వనాలుగా మార్చారు. వాళ్ళు తమ పరిస్థితుల్ని మెరుగు పర్చుకున్నారు. తమ పిల్లలకు విద్యబుద్ధులు నేర్పించారు. తమలాగే పలు ఇతర దేశాల నుండి వచ్చిన ప్రవాస కూలీల కన్నా ముందంజ వేశారు. ప్రస్తుతం వీరి తలసరి ఆదాయం ఎంతో పెరిగింది. అది భారతీయుల తలసరి ఆదాయంతో పోల్చితే 5 నుండి 20 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. వీళ్ళు నూటికి నూరుశాతం అక్షరాస్యతను సాధించారు. భారతదేశంలో మన గణాంక వివరాలతో పోల్చితే గత కాలపు ప్రవాస కూలీల సంతతి స్థితిగతులు ఎంతో మెరుగ్గా ఉన్నాయి. పైగా వివిధ దేశాల్లో ఉన్న భారతీయ సంతతి ప్రజలు తమ గత వారసత్వాన్ని గర్వంగా భావిస్తారు. ఈ రోజు తాము సంపాదించుకున్న ఆస్తి యావత్తూ తమ తాత ముత్తాతల భారతీయ వారసత్వ





మహోన్నత లక్షణాల వల్లనే వచ్చాయని అభిప్రాయపడ్డారు. వీళ్ళు వివిధ ప్రాంతాల్లో చురుకుగా కన్పిస్తారు. అంతర్జాతీయ వేదికల్లో తమ దేశాలకు ప్రాతనిధ్యం వహిస్తారు. ఇదండీ! ఇవీ గతంలో భారతదేశం నుండి కూలీలుగా వెళ్ళిన నిరుపేదల సంతతి సాధించిన ఘనత, ఇక భారతదేశంలో ఏమవుతోందో చూద్దాం.

మధ్య ఆసియా నుండి వచ్చిపడిన అనాగరిక దురాక్రమణదారుల పాలనను మనం శతాబ్ధాల పాటు అనుభవించాము అటు తర్వాత బ్రిటీష్ వలస పాలన ఆరంభమైంది. ఈ నేపథ్యంలో మనం బాగా వెనుకబడిపోయాము. 19వ శతాబ్ధి చివరలో ఎంతోమంది తత్వవేత్తలు, మేధావులు జాతిని ప్రభావితం చేశారు. స్వామి దయానంద, వివేకానంద, అటు తర్వాత లోకమాన్య బాలగంగాధర్ తిలక్, మదనమోహన్ మాలవ్య, లాలాలజపతిరాయ్ వంటి మహాపురుషులు ఘనమైన భారత గతాన్ని మనకు గుర్తుకు తెచ్చారు. జాతిని జాగృతం చేసేందుకు నడుం బిగించారు. యూరోపియన్ వలస వాదుల పట్టు నుండి భారత మాతృమూర్తిని విడిపించే దిశలో వీరి బోధనలు ప్రేరణాత్మక మంత్రాలయ్యాయి. నిరుపేదలు, నిరక్షరాస్యులు సైతం జాతిని విదేశీ పాలన నుండి విముక్తి చేసేందుకు ముందుకు ఉరికారు. త్యాగాలు చేశారు. మహాపురుషులు జాతికి నిర్భయత్వాన్ని ప్రబోధించారు. మన వారసత్వాన్ని గురించి గర్వించాలని గుర్తు చేశారు. మన సమాజాన్ని సంస్కరించుకోవాల్సిన బాధ్యతను గుర్తుకు తెచ్చారు. 1947 అంటే స్వాతంత్ర్య సిద్ధి నాటికి దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎంతోమంది నాయకులు ఉన్నారు. వీళ్లంతా ఉద్దండులు, ఉన్నత వ్యక్తిత్వాలు ఉన్నవారు. వీరిలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక యూరోపియన్ దేశ ప్రధానమంత్రి పదవిని చేపట్టే అర్హతలు కలిగినవారు. ఈ నాయకులంతా నిస్వార్థపరులు, ధైర్యశీలురు. బాగా చదువుకున్నవారు. ప్రజానీకానికి ప్రేరణ అందించగలిగేవారు. జవహర్‌లాల్ నెహ్రూకు బాధ్యతల్ని అప్పగించి గాంధీ, పటేల్, రాజేంద్రప్రసాద్ వంటివారు కన్నుమూశారు. తదనంతరం నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. భారత ప్రధాని పదవిని అందుకున్నారు. ఆయన భారతీయ గతాన్ని గురించి పట్టించుకోలేదు. కాకతాళీయంగా తాను హిందూ మతంలో జన్మించానని చెప్పుకున్నారాయన. అంతస్సాక్షి దృష్టితో తాను పాశ్చాత్యుడినని అన్నారు. సాంస్కృతికంగా తానొక ముస్లిం అని చెప్పుకున్నారు నెహ్రూ.

ఆయనకు హిందూ మతంపై ఉపేక్ష భావం ఉండేది. ఆయనకు భారత చరిత్రపై అంత గొప్ప ఆసక్తి లేదు. విదేశీ దురాక్రమణ దారులపై భారత వీరులు జరిపిన పోరాటాన్ని ఆయన అంత గొప్పగా పరిగణనలోకి తీసుకోలేదు. ఆయన కుమార్తె తండ్రి దారినే అనుకరించారు. ఒకటిన్నర సంవత్సరాలపాటు కాంగ్రెస్‌లోని వృద్ధ నాయకత్వంతో తిప్పలు పడ్డారు నెహ్రూ పుత్రిక ఇందిరాగాంధీ. ఈ సీనియర్ కాంగ్రెస్ బృందం ఇందిరాగాంధీ పట్ల తమ విధేయతను ప్రకటించ లేదు. ఆమె మార్గానికి అడ్డం వచ్చినవారికి ఇబ్బందులు కలిగించారు ఇందిర. రాష్ట్రాల ముఖ్యమంత్రుల్ని ఎంపిక చేసి నామినేటెడ్ పద్ధతుల్ని సృష్టించారామె. తమ స్వంత రాష్ట్రాల్లో ప్రజా పునాది, పలుకుబడి ఉన్న నాయకుల్ని అణచివేసేందుకు కాంగ్రెస్ చీలికను సృష్టించారు ఇందిర. కమ్యూనిస్టులు ఇందిరకు బాసటగా ఉన్నారు. సర్వరంగాలు అవినీతిమయం కావడానికి తమ వంతు పాత్రను పోషించారు కమ్యూనిస్టులు. ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ రెండూ కూడా ఇందిరాగాంధీ స్వంత ఆస్తిలా మారిపోయాయి. ప్రజా పునాది ఏ మాత్రం లేనివాళ్ళు ముఖ్యమంత్రి పదవుల్లో నియమించబడ్డారు. గవర్నర్లు, రాయబారులుగా వెలిగిపోయారు. హైకోర్టు, అత్యున్నత న్యాయస్థానంలో ఆమె నియమించిన వారే నిండిపోయారు. ఇందిర ప్రవచించిన సోషలిజాన్ని తూచ తప్పకుండా నమ్మేవారే వీరిలో ఎక్కువమంది. రాజ్యం యావత్తూ అవినీతి పంకిలంగా పరిణమించింది. ఎం.ఆర్.టి.పి, ఫెరా, పట్టణ భూపరిమితి చట్టం, "కోఫి పోసా" లాంటి పలు చట్టాలు వెలుగులోకి వచ్చాయి. వీటిని సోషలిజం లక్ష్యంలో భాగాలుగా ప్రచారం చేసుకున్నారు. అయితే ఈ చట్టాల రూపకల్పనలో వెనుక అసలు మతలబు పార్టీ నిధుల్ని దండుకోవడమే. ఇందిర వారసుడు రాజీవ్‌గాంధీ. ఆయన ప్రధాని కాగానే తన చిన్ననాటి స్కూలు మిత్రులతో స్వంత శిబిరాన్ని ఏర్పర్చుకున్నారు.

దేశాన్ని ఒక ప్రైవేటు ఆస్తిగా భావించారు. తన మిత్రుల సలహాలతో స్వతంత్ర ఆలోచనలున్న నాయకుల్ని అణచివేశారు. ముఖ్యమంత్రుల్ని నామినేట్ చేశారు. లంచగొండితనం తారా స్థాయికి చేరుకున్నది. అంతకు ముందు పలు పర్యాయాలు భారత పౌరసత్వాన్ని తీసుకునేందుకు నిరాకరించిన రాజీవ్ సతీమణి సోనియా ఎట్టకేలకు అందుకు అంగీకరించారు. బోఫోర్స్ కుంభకోణంలో ఆమె హితులకు, సన్నిహితులకు సంబంధాలున్నాయన్న వార్తలు గుప్పుమన్నాయి. శ్రీమతి





ఇందిరాగాంధీ, ఆమె కుమారుడు రాజీవ్‌ల హయాంలో పలు శాసనసభల్లో కాంగ్రెస్ పార్టీ బలం ఎంతో ఎక్కువ. అయినా ముఖ్యమంత్రుల మార్పు వార్షిక వ్యవహారంగా మారిపోయాయి. అవినీతి అవధులు దాటిన కారణంగానే 1989, 1991, 1996, 1998 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైంది. రాజీవ్‌గాంధీ మరణానంతరం పార్టీకి సరియైన నాయకుడంటూ దొరకలేదు. ఇందిరాగాంధీ కళాశాల విద్యను మధ్యలోనే మార్చుకున్నారు. ఇందిర ఫిరోజ్‌ను వివాహం చేసుకొని ఇందిరాగాంధీ అయ్యారు. రాజీవ్‌గాంధీ ఇటలీ దేశస్థురాల్ని పెళ్ళి చేసుకున్నారు. ఫాశిస్టు పార్టీ స్థాపకుడు ముస్సోలినీ జన్మస్థానం ఇటలీ. సోనియా కూడా తన భర్త రాజీవ్ గాంధీలానే ఎక్కువగా చదువుకోలేదు. సోనియా సంతానంలో ఒకరు ఆంగ్లో ఇండియన్‌ను పెళ్ళి చేసుకున్నారు. మరొకరు కొలంబియన్‌ను వివాహమాడుతారన్న వార్తలు విన్పిస్తున్నాయి. ఇదీ! భారత చరిత్ర, నాగరికతా సంస్కృతులకు వీరిచ్చే గౌరవం.

అనువంశిక పెత్తనంలో... కాంగ్రెస్ పార్టీ భారీగా దిగజారిపోయింది. అది అసమర్థతకు, క్రియాశూన్యతకు మరోపేరుగా మారిపోయింది. తమలో ఏ ఒక్కరైనా ఆ పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టలేని దశకు చేరుకున్నది కాంగ్రెస్. రాజీవ్‌గాంధీ సతీమణి శ్రీమతి సోనియా మేనియోను పార్టీ పగ్గాల్ని చేపట్టాల్సిందిగా ప్రాధేయపడ్డారు కాంగ్రెస్ నేతలు. తమ నాయకురాలిగా ఉండాలని అభ్యర్థించారు. ఆమె పార్లమెంటు సభ్యురాలు కాదు. అయినా తమ పార్లమెంటరీ పార్టీ నాయకురాలిగా సోనియానే ఎనుకున్నారు కాంగ్రెస్ వాదులు. గతంలో మూడుసార్లు భారత పౌరసత్వాన్ని తీసుకునే విషయంలో ఇష్ట పూర్వకంగానే మిన్నకుండిపోయారు సోనియా. 1977లో సోనియా అత్తగారు శ్రీమతి ఇందిరాగాంధీ ఎన్నికల పరాజయాన్ని ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇందిరపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. ఇలాంటి సమయంలో ఆమె తన భర్తతో సహా ఇటాలియన్ రాయబార కార్యాలయంలో శరణార్థిగా ఉన్నారు. తన భర్త రాజీవ్‌గాంధీ ప్రధాని పదవిని చేపట్టడం ఖాయమని తెలిసిన తర్వాతనే సోనియా భారత పౌరసత్వాన్ని తీసుకున్నారు. ఆమె ఎక్కడ చదువుకున్నారు? ఎంతవరకు చదువుకున్నారన్నది భారతీయులకెవ్వరికీ తెలియదు. భారత భవితవ్యం వర్తమానాలపై సోనియా దృష్టికోణం, ఆలోచనా ధోరణులేమిటో కూడా భారతీయులకు తెలియదు. కాంగ్రెస్ పార్టీలో సోనియాగాంధీ వ్యవహార శైలిని గురించి ప్రశ్నించే సాహసం

చేసేవారు లేరు. కాంగ్రెస్ పార్టీ ఆమె ప్రైవేట్ ఆస్తిలా తయారైంది. నిజానికామె లీడర్ కాదు. వాస్తవంగా చెబితే ఆమె "రీడర్" (పాఠకురాలు) మాత్రమే. ఎవరో రాసిన వారు తయారు చేసిన ఉపన్యాస పాఠాల్ని చదువుతారు సోనియా. విన్సెంట్ జార్జి, గులాంనబీ ఆజాద్, అజీత్‌జోషి, సల్మాన్ ఖుర్షిదీ వంటివారు ఆమె ప్రధాన హితవరులు. సోనియా మైనారిటీల ఓట్ల కోసం అలీమియా నివాసాన్ని కూడా సందర్శించారు. తాను ఎక్కడి నుండి పోటీ చేస్తారన్న విషయాన్ని గుంభనంగా ఉంచుతారు. తన విశ్వసనీయుడైన పార్టీ నాయకుడు వై. సెబాస్టియన్ రాజశేఖర్‌రెడ్డికి కూడా చివరి నిముషం దాకా ఏ సంగతి తెలియదు. ఇదీ విషయం!

వై. సెబాస్టియన్ రాజశేఖర్‌రెడ్డి ఆమెకు విశ్వసనీయుడైన విధేయుడు. ఆయన కడప లోక్‌సభ స్థానానికి ప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా. కడప నుండి సోనియాగాంధీ నిలబడతారన్న ప్రచారం జరిగింది. అయితే నాటకీయ పరిణామాల మధ్య సోనియా బళ్ళారి (కర్ణాటక) నియోజకవర్గం నుండి నామినేషన్ దాఖలు చేశారు. నిజానికి కడపలో సోనియాగాంధీ విజయం కోసం చక్కని యంత్రాంగాన్ని తయారు చేశారు రాజశేఖర్‌రెడ్డి. అయినా నిరంతరం కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపిస్తూ వచ్చిన బళ్ళారి స్థానం తనకు సురక్షితంగా ఉంటుందని చూశారు సోనియా. కాంగ్రెస్ వాదుల భయాలకు, అస్తిమిత ధోరణులకూ బళ్ళారి నామినేషన్ పర్వం ఒక ఉదాహరణ. గొప్పగొప్ప డిగ్రీలు, దశాబ్దాల నాయకత్వ అనుభవం, స్వతంత్ర్యంగా జీవించే సంపద ఉన్న కాంగ్రెస్ వాదులు అనామకులు, పునాదుల సైతం లేని భారతీయ సంతతికి చెందిన కూలీలకన్నా కింది స్థాయికి దిగజారడం విస్మయాన్ని కలిగిస్తుంది. భారతీయ సంతతికి చెందిన కూలీల వారసులు తమ ప్రవాస దేశాల్లో ప్రధాని పదవుల్ని అధిరోహిస్తున్నారు, అధ్యక్షులవుతున్నారు. ఇక్కడ భారత కాంగ్రెస్‌వాదులు మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. వాళ్ళు తమ అర్హతలన్నింటినీ ప్రక్కన పెట్టేశారు. తమ వారసత్వ వైభవాన్ని త్యజించారు. విద్యా సంపదల్ని, నాయకత్వ పటిమను ఒక విదేశీ గడ్డపై జన్మించిన మహిళ పాదాల ముందు ఉంచారు. ఆమె విద్యార్హత లేమిటో కూడా ఎవరికీ తెలియదు. తన భర్త పేరుతో ఏర్పాటైన ఒక ట్రస్టుకు ఆమె ఛైర్మన్‌గా వ్యవహరించారన్నది నిజం. ఈ పదవిలో ఆమె హాయిగానే కూర్చున్నారు. సదరు ట్రస్టుకు కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వ కార్పోరేషన్ల నుండి నిధులు వస్తాయి. ఇప్పటి కాంగ్రెస్ వాదులకూ –





ఒకనాడు పొట్టకూటి కోసం కడుపుచేత బట్టుకొని దూర తీర దేశాలకు వెళ్ళిన వారికీ ఎంత భేదం! బళ్ళారిలో "బహూ" (కోడలు) సోనియాగాంధీ – "బేటి" (కుమార్తె) సుష్మాస్వరాజ్‌ల మధ్య రసవత్తరమైన పోటీ జరుగుతోంది. ఒకవైపు గౌరవాన్ని తృణప్రాయంగా భావించి విలువల్ని పక్కన పెట్టిన వర్గం మోహరించింది. మరో దిక్కున స్వామి దయానంద, వివేకానంద, లోకమాన్య తిలక్, రాజగోపాలచారి, ప్రకాశం పంతులు, సంజీవరెడ్డి వంటి దిగ్గజాల వారసత్వాన్ని, మన సనాతన సంప్రదాయాల్ని గౌరవించే శిబిరం నిలచి ఉంది. ఒకవైపు అధికార భోగభాగ్యాల్ని సంపాదించుకునేవారికి, మరోవైపు భారత పునరుజ్జీవన మహాయజ్ఞాన్ని నిర్వహించాలనే వారికి మధ్య సమరం జరుగుతోంది. ఆత్మగౌరవం, జాతిపై అభిమానం ఉన్న ప్రతి ఒక్క భారతీయుడు బళ్ళారి యుద్ధంలో పాల్గొనాల్సి ఉంది. ఒకవైపు భారతీయ సంతతికి చెందినవారు తమ స్వస్థాలాలపై ఎలా ఉన్నత శిఖరాల్ని అధిరోహిస్తున్నారన్నది మనం గుర్తుకు తెచ్చుకోవాలి. మరో దిక్కు దేశ నాయకత్వానికి తాము అర్హులము కాదంటూ విదేశీ వనితకు నేతృత్వ బాధ్యతల్ని అప్పగిస్తున్న వర్గంవారి వైనాన్ని గమనించాలి. సుష్మా, సోనియాలు రెండు విభిన్న సంస్కృతులకూ, చరిత్రలకూ, దృక్పథాలకూ ప్రతినిధులు. వీటిలో ఏ మార్గం విజయాన్ని చూస్తుందో వేచి చూద్దాం.

అయితే ఇక్కడొక ప్రశ్న రావచ్చు. "భారతీయులు వేరే దేశాలకు అధ్యక్షులుగానూ, ప్రధానమంత్రి పదవికి కూడా ఎన్నికైతే అభినందించేవారు, అదే విదేశీయురాలు భారత ప్రధాని కాకూడదని అడ్డుపడతారేమిటి?" అని ప్రశ్నించవచ్చు. దీనికి సరియైన జవాబు చెప్పడం చాలా సులువు. ఇతర దేశాల్లో రాష్ట్రపతి, ప్రధాని పదవుల్ని చేపడుతున్న వాళ్ళు ఎన్నో తరాల ముందే ఇక్కడి నుండి తరలిపోయిన సంతతికి చెందిన వ్యక్తులు. వాళ్ళు ఆయా దేశాల్లో పుట్టుకతోనే పౌరులుగా ఉన్నవారు. వాళ్ళు భారత పౌరసత్వాన్ని స్వీకరించలేదు. పైగా ఈ అత్యున్నత పదవుల్ని చేపడుతున్న వాళ్ళంతా సమర్థులు, వాళ్ళ వృత్తి వ్యాపారాల్ని గురించి ఆయా దేశాల ప్రజానీకానికి స్పష్టంగా తెలుసు. వాళ్ళ దేశాలు స్వాతంత్ర్యాన్ని సంపాదించే నేపథ్యంలో వీరి తండ్రి తాతలు ఎన్నో త్యాగాలు చేశారు. వీళ్ళు ఆ దేశాల భాషలనే మాట్లాడతారు, అక్కడి ప్రజలతో మమేకమైపోయారు. కానీ రాజీవ్‌గాంధీ అర్థాంగి అయ్యేవరకు సోనియామోనియోగాంధీ సంగతి ఎవరికీ తెలియదు. ఆమె ఇష్టపూర్వకంగానే ఒక

దశాబ్ది కాలంపాటు భారత పౌరసత్వాన్ని స్వీకరించలేదు. ఆమెకు భారతీయ భాషల్లో ఏదీ రాదు. భారత ప్రజా జీవితంలో ఆమె పాలు పంచుకున్న జాడలు లేవు. కొటరీలో ఉండే వారితో తప్ప ఆమె మిగతా వారితో మాట్లాడరు. రబ్రీ, పూలన్‌దేవిల కన్నా సోనియాగాంధీ ప్రజా జీవన, శాసనసభా అనుభవం తక్కువ. ఒక డజను మంది భారతీయులకు తప్ప మిగతా వాళ్ళకెవరికీ ఆమెను గురించి తెలియదు. ఇన్ని భేదాలు సరిపోవా?

మూడవ పాదమెక్కడ పెట్టాలని వామనుడు బలిచక్రవర్తి నడగగా సంతోషంతో తన తల చూపుతూ లోకం తీరు చెప్తాడు –

**సీ. చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు**
**కాంతలు సంసార కారణములు**
**ధనము లస్థిరములు దను పతి చంచల**
**కార్యార్థు లన్యులు గడచు గాల**
**మాయుష్య మైశ్వర్య మతిశీఘ్ర మని కాదె**
**యనఘుండు దమతండ్రి నధికరించి**
**మాతాత సాదుసమ్మతుఁడు ప్రహ్లాదుండు**
**నీపాదకమలంబు నియతి జేరె**

**తే. భద్రు డతనికి మృతిలేని బ్రతుకు గలిగె**
**వైరు లై కాని తొల్లి మావారు గాన**
**రర్థివై వచ్చి నీవు న న్నడుగు టెల్ల**
**బద్మలోచన! నా పుణ్యఫలము గాదె**

శ్రీమదాంధ్ర మహాభాగవతం అ.స్క

లోకంలోని బంధాలన్నీ అశాశ్వతమైనవి. నశించేవి. ఎప్పుడు సంపదకల్గిన అప్పుడు బంధువులు వస్తారు. ఋణానుబంధ రూపేణ భార్యా, పిల్లలు సంసారం. ధనమస్థిరమైంది. ఎవరు మన దగ్గరకు వచ్చినా కార్యార్థులై వారి వారి పనుల కొరకు వస్తారు. ఆయువు, ఐశ్వర్యాదులు శాశ్వతమైనవి కావని, పాపములేనట్టి మా తాత ప్రహ్లాదుడు తన తండ్రిని ధిక్కరించి నీ పాద పద్మాలను ఆశ్రయించాడు. భద్రుడు అతడు అమరుడు. మా పూర్వీకులంతా వైరభక్తితో నిన్ను చేరిన వారే. కావున ఓ పద్మలోచన నీవు నన్నర్థించుట నా పూర్వపుణ్య ఫలము కాదా! అన్నాడు.





# అనువంశిక పాలనలో అవినీతి అవతారాలు

## ఒకటవ భాగం - నెహ్రూకాలం

**సెప్టెంబర్ 13 - 19 , 1999**

"ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్" పేరుతో ఒక ప్రముఖ సంస్థ ఉంది. ఇది ప్రపంచంలోని లంచావతారాల్ని గురించి నిగ్గు తేల్చే సర్వేల్ని నిర్వహిస్తుంది. సదరు సంస్థ భారతదేశాన్ని అత్యంత అవినీతికర దేశాల్లో ఒకటిగా పేర్కొన్నది. మన దేశంలో అవినీతి అన్నది శిఖరాగ్ర స్థాయికి చేరుకున్నదని ఆ సంస్థ తెలియజేసింది. అవినీతి కాస్తా సంస్థాగత స్వభావంగా మారిపోయిందని ట్రాన్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అభిప్రాయపడింది. అవినీతి కార్యకలాపాలు చట్టాన్ని దాటిపోయి మూలమూలల్లో విస్తరిస్తున్నాయన్న వాస్తవం ఇక్కడి ప్రజలకు బాగా తెలుసునని ఆ సంస్థ విశ్లేషించింది. అవినీతి జాడ్యాన్ని పెద్దగా పట్టించుకోవల్సిన అవసరం లేదని స్వర్గీయ ఇందిరాగాంధీ అనేవారు. "ఇది ప్రపంచంలో అంతటా కన్పిస్తున్నదే" అంటూ సర్ది చెప్పేవారు శ్రీమతి గాంధీ. కమ్యూనిస్టులు నేడు అవినీతి పరులైన లాలూప్రసాద్‌యదవ్ – జయలలితలతో ఎన్నికల అవగాహన కుదుర్చుకొని చరిత్ర సృష్టించారు! అవినీతి అన్నది "ఆంగ్లో–అమెరికన్ సామ్రాజ్యవాద ప్రభావంలో భాగం"గా చెప్పుకునేవారు కమ్యూనిస్టులు. వీళ్ళు దీన్ని ఒక ప్రధానమైన సమస్యగా ఏనాడూ పరిగణించలేదు. స్వాతంత్ర్యానంతర భారత రాజకీయ చరిత్రలో అవినీతి కారణంగా పదవీ ఉద్వాసన పొందిన మంత్రి కన్పించదు! బలమైన ఆరోపణలు న్యాయస్థానాల్లో నిజమని తేలేదాకా పదవుల్ని పట్టుకు వేలాడిన వారు ఎంతోమంది! గతంలో అంటే ఎమర్జెన్సీ హయాంలో "కిస్సాకుర్సీకా" చిత్రం రేపిన సంచలనాన్ని గుర్తుకు తెచ్చుకుందాం. ఈ నేపథ్యంలో అమృతలాల్‌నెహతా (ఆ చిత్రానికి సంబందించిన వ్యక్తి) సంజయ్, ఆయన తల్లి ఇందరాగాంధీలకు వ్యతిరేకంగా కేసు వేశారు. ఎమర్జెన్సీ అనంతరం, జనతా ప్రభుత్వ హయాంలో దీనిపై వివాదాలు రేగాయి. విచారణలుసాగాయి. చివరకు శ్రీమతి గాంధీ రూపొందించిన తెలివైన వ్యూహాల కారణంగా కేసు నీరుగారి పోయింది. ప్రస్తుతం అవినీతి అనేది మన దేశంలోని అన్ని రంగాల్లోనూ చోటు చేసుకున్నది. చివరకు అవినీతి అనే వేరు పురుగు మన దేశంలోని సకల వ్యవస్థల్ని ధ్వంసం చేసేందుకు సిద్ధమైంది. అవినీతిపై విస్తృత శోధనలు జరిపి ఒక పుస్తకాన్ని రచించారు శ్రీఎస్.ఎస్.గిల్. ఆ పుస్తకం పేరు "ది పాథాలజీ ఆఫ్ కరప్షన్". గిల్ రిటైర్డు

ఐ.ఎ.ఎస్ అధికారి. అంతేకాదు స్వయం ప్రతిపత్తి గల ప్రసారభారతి బోర్డుకు కొంతకాలం పాటు ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. అత్యున్నత స్థాయిలో జరుగుతున్న అవినీతిని పలు కోణాల నుండి బట్టబయలు చేసే ప్రయత్నం చేశారు గిల్. నెహ్రూ కుటుంబం అంటే జవహర్‌లాల్ – ఇందిరా – రాజీవ్‌ల పాలనలో అవినీతి విలయ తాండవం చేసిందని గిల్ విశ్లేషించారు. తొలి రోజుల్లో అవినీతిపై ఉపేక్షా భావాన్ని ప్రదర్శించిన నెహ్రూ వైఖరిని తప్పుబట్టారు గిల్. నెహ్రూ కుటుంబం వంశ పారంపర్య పాలనలో నాల్గవ పాత్ర రూపంలో రంగప్రవేశం చేసిన సోనియా మేనియోగాంధీకి కూడా తనవంతు అవినీతి చరిత్ర ఉంది. ప్రస్తుతం నేను వ్రాస్తున్న ఈ వ్యాసానికి శ్రీ ఎస్.ఎస్.గిల్ రచనతోపాటు సి.బి.ఐ మాజీ అధిపతి ఎన్.కె.సింగ్ రాసిన "ది నేకెడ్ ట్రూత్"లోని అంశాల్ని కూడా ఆధార భూమికలుగా స్వీకరిస్తున్నాను.

అది 1963. ఇండోర్‌లో కాంగ్రెస్ సభలు జరుగుతున్నాయి. అప్పట్లో ఆ పార్టీ అధ్యక్షులుగా ఉన్నారు శ్రీడి.సంజీవయ్య. తన స్వంత పార్టీలో పెచ్చరిల్లుతున్న అవినీతిపై విరుచుకుపడ్డారు సంజీవయ్య. ఆయన తన ప్రసంగంలో "1947 నాటికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేనివారు ప్రస్తుతం కోటీశ్వరులయ్యారు. వాళ్ళు ఆకాశ హర్మ్యాల్ని నిర్మించుకుంటున్నారు. ఫ్యాక్టరీలు పెట్టుకుంటున్నారు" అని ఆవేదన వెలిబుచ్చారు. ఇదంతా ఎవరికీ అంతు చిక్కని ఆదాయ ఆధారాలతో జరుగుతోందని విస్మయపడ్డారు శ్రీ సంజీవయ్య. శ్రీ కె.హనుమంతయ్య గతంలో కర్ణాటక ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆగస్ట్ 1963లో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సమావేశాలు జరిగాయి. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశాల్లో అవినీతిమయ వాతావరణాన్ని గురించి నిర్మొహమాటంగా వివరించారు హనుమంతయ్య. "కొన్ని లక్షల రూపాయలతో ముఖ్యమంత్రి కాగలిగానన్నారు. ఒక కోటి రూపాయల్ని ఖర్చు చేస్తే ప్రధాని పదవిని చేజిక్కించుకోవడం కష్టమేమీ కాదు" అన్నారాయన. అప్పటి అవినీతి పూరిత చిత్రపటాన్ని గురించి వర్ణించేందుకు సంజీవయ్య, హనుమంతయ్య లాంటి సీనియర్ కాంగ్రెస్ నేతల అభిప్రాయాలు చాలు. కాంగ్రెస్ పార్టీలో వేలాదిమంది కోటీశ్వరులున్నారు. మిగతా పార్టీల్లో ఇలాంటి అపర కుబేరుల సంఖ్య వందల్లో ఉంటుంది. 1993లో పి.వి.నరసింహారావు తన ప్రభుత్వ మనుగడ కోసం పార్లమెంటు సభ్యులకు డబ్బు ఎర చూపిన సంగతి అందరికీ తెల్సిందే. హనుమంతయ్య ముప్పై ఆరేళ్ళ క్రితం చెప్పింది నిజమేనని జార్ఖండ్ ముక్తిమోర్చా ఎం.పీల ముడుపుల భాగోతం నిరూపించింది.





నెహ్రూ సర్కారు 1962లో సంతానం కమిటీని నియమించింది. కమిటీ కొన్ని నిజాల్ని బయటపెట్టింది. "గత పదహారేళ్ళుగా అధికారాన్ని అనుభవిస్తున్న మంత్రిపుంగవులు దొడ్డిదారిన అక్రమార్జనకు పాల్పడ్డారు. డబ్బు, దస్కం కూడగట్టుకున్నారు. బంధు ప్రీతిని ప్రదర్శించారు. తమ పిల్లలకు చక్కని ఉద్యోగాల్ని ఇప్పించుకున్నారు. చుట్ట పక్కాలకు ఆకర్షణీయమైన ఉద్యోగాల్ని దాఖలు పర్చారు. ప్రజా జీవనంలో ఉండాల్సిన విశుద్ధమైన విలువలకు తూట్లు పొడిచారు" అని సంతానం కమిటీ వ్యాఖ్యానించింది. షీలాకౌల్ ఇదివరకు కేంద్రమంత్రిగా ఉండేవారు. ఆమె నెహ్రూ వంశీయురాలు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అనుంగు మిత్రుడు కెప్టెన్ సతీష్ శర్మ కూడా కేంద్రంలో మంత్రి పదవి నిర్వహించారు. వీరిద్దరూ ప్రభుత్వ ప్లాట్లు, గ్యాస్, పెట్రోల్ ఏజన్సీల పంపిణీలో తీవ్రమైన అవినీతికి పాల్పడ్డారు. అవినీతి పరమైన అర్జనతో ఇంద్ర భవనాల్ని, వ్యవసాయ క్షేత్రాల్ని నిర్మించుకున్న సంగతులు ఇటీవలి కాలానికి చెందిన వార్తలు. తొలిరోజుల్లో అంటే స్వాతంత్ర్యానంతరం మొదటి పదిహేను సంవత్సరాలపాటు అవినీతిపై ఉపేక్ష భావం ఉండేది. ఇది అటు తర్వాత అవినీతి విశ్వరూపానికి పునాదిరాళ్ళు వేసింది. తదనంతరం నెహ్రూ వంశీయుల వారసత్వ పాలనలో అవినీతి మరింతగా విజృంభించింది. శ్రీ ఎ.డి.గోర్వాలా ప్రసిద్ధి చెందిన ఐ.పి.ఎస్. అధికారి. ఆయన పాలనా సంస్కరణల కమిటీలో ప్రముఖుడిగా ఉండేవారు. 1951లోనే ఆయన మంత్రుల అవినీతిని గురించి ప్రస్తావించారు. "నెహ్రూ మంత్రివర్గ సభ్యుల్లో కొంతమంది అవినీతిపరులు. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఈ మేరకు అత్యున్నత బాధ్యతల్లో ఉన్న పౌర అధికారులు సదరు చేదు నిజాన్ని నిర్ధారించారు కూడా. ప్రభుత్వం అవినీతి మంత్రుల కొమ్ము కాసేందుకు ప్రయత్నిస్తున్న సంగతి కూడా ఈ నేపథ్యంలో తెలియవచ్చింది" అని అన్నారు గోర్వాలా. ఇవి నెహ్రూ అధికారంలోకి వచ్చిన తొలిరోజుల నాటి నిజాలనే సంగతిని గుర్తు పెట్టుకోవాలి. మన దేశ ప్రజలకే కాదు, సకల ప్రపంచానికి తాను గాంధీ మార్గంలోనే పయనిస్తానని చెప్పుకున్నారు నెహ్రూ. దేశంలో సోషలిజాన్ని పాదుకొల్పుతానని పలికారాయన. అవినీతి మంత్రులను రక్షించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది నెహ్రూయే. కృష్ణమీనన్ నిర్వాకాన్నే ఉదాహరణగా తీసుకుందాం. తొలుత ఆయన లండన్‌లో భారత హై కమీషనర్‌గా ఉండేవారు. ఆయనను ఈ పదవిలో నిలిపింది సాక్షాత్తూ జవహర్‌లాల్ నెహ్రూ. అప్పట్లో పాకిస్తానీ దురాక్రమణదారులు జమ్మూ కాశ్మీర్‌పై దాడులు చేశారు. మన సైన్యానికి జీపుల

అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో 2000 జీపుల కొనుగోలు కోసం ఆర్డర్ చేయాలనుకున్నారు. ఇందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ సలహాల్ని ఏ మాత్రం తాను తీసుకోలేదు. జీపులన్నీ లోపభూయిష్టమైనవి. 1948 డిసెంబర్ నాటికి అవి భారత భూభాగాన్ని చేరుకోవాలి. అప్పటికి 155 జీపులు మాత్రమే మద్రాసు తీరానికి చేరుకున్నాయి. అదీ, మార్చి 1949 నాటికి! అంటే జమ్మూ కాశ్మీర్ వ్యవహారంలో భారత పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ జరిగిన రెండు మాసాల తర్వాత మాత్రమే. తీరా జీపులు పనికిరానివేనని సైన్యం తేల్చి చెప్పింది. ఇకపోతే మిగతా 1800 జీపుల విషయంలో అతీగతీలేదు. అవి రానేలేదు. కానీ జీపుల కోసం చెల్లించాల్సిన డబ్బు ముందుగానే ఇచ్చి వేయడం జరిగింది (ఇటీవలి యూరియా కుంభకోణం అప్పటి జీపుల వ్యవహారాన్ని పునరావృతం చేసింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధానమంత్రి బంధు బృందం నిబంధనల్ని తుంగలో తొక్కారు. 130 కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం పత్తా లేకుండా పోయింది. ఊరు పేరు లేని సంస్థతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని చెప్పుకున్నారు. కానీ ఇంతవరకూ ఒక కిలోగ్రాము యూరియా సరఫరా సైతం జరగలేదు) జీపుల వ్యవహారంపై విచారణ జరిపింది శ్రీ అనంత శయనం అయ్యంగార్ కమిటీ. అయితే అయ్యంగార్ కమిటీ నివేదికలోని అంశాల్ని నెహ్రూ అసలు పట్టించుకోలేదు. 9వ ప్రభుత్వ ఖాతాల కమిటీ మరో సూచన చేసింది. జీపుల వ్యవహారం యావత్తూ హైకోర్టు న్యాయమూర్తుల బృందంతో సమీక్షించబడాలని కమిటీ సిఫార్సు చేసింది. అయితే నెహ్రూ సర్కారు మాత్రం కమిటీ "పునరాలోచన" చేయాలని కోరుకున్నది. అన్నింటికన్నా చిత్రం 1955 సెప్టెంబర్‌లో నెహ్రూ ఒక ప్రకటన చేశారు. జీపుల కుంభకోణం కథకు తెరవేస్తున్నామన్నదే ఆ ప్రకటన సారాంశం. ఇంతటి భారీ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన కృష్ణమీనన్ 1956 ఫిబ్రవరి నాటికి కేంద్రమంత్రి అయ్యారు. ఆయనకు రక్షణ శాఖను కేటాయించారు. దీనితో నెహ్రూ విశుద్ధ పాలనా ప్రచారంపై ప్రజల్లో అపనమ్మకం ఏర్పడింది. అవినీతిని ఉపేక్షించడమేకాదు, అందుకు పాల్పడినవారికి ప్రోత్సాహకాలు సైతం దొరుకుతాయన్న కొత్త నిజం బయటపడింది.

మూర్తీభవించిన గోల్‌మాల్ గోవిందం సిరాజుద్దీన్ హరిదాస్ ముంద్రా. ఈయనను 1990ల నాటి హర్షద్‌మెహతాతో పోల్చవచ్చు. ఆ రోజుల్లో టి.టి. కృష్ణమాచారి ఆర్థిక శాఖామంత్రిగా ఉండేవారు. ప్రధాని నెహ్రూ, ఆర్థిక శాఖ





కార్యదర్శి సి.డి.దేశ్‌ముఖ్, వాణిజ్య శాఖలో కార్యదర్శిగా ఉన్న హెచ్.ఎం.పటేల్ తదితరులకు ముంద్రా చీకటి వ్యవహారాల్ని గురించి తెలుసు. అయినా ముంద్రాపై ఈగవాలలేదు. దానికి కారణం కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించే భారీ విరాళాలు. 1954లో ముంద్రా నష్టాల్లో కూరుకుపోయాడు. ఈ నేపథ్యంలో పనికి మాలిన ముంద్రా షేర్లను కొనే క్రమంలో జీవిత భీమా సంస్థను దుర్వినియోగపర్చారు టి.టి.కృష్ణమాచారి. ముంద్రా కుంభకోణానికి కృష్ణమాచారి కారకుడని జస్టిస్ ఎం.సి.చాగ్లా విచారణా సంఘం తేల్చి చెప్పింది. నెహ్రూగారి మరో మిత్రుడి పేరు శ్రీ కె.డి.మాలవీయ, ఆయనొక సోషలిస్టుగా చెలామణీ అయ్యేవారు, ఈయనగారు గనుల శాఖామంత్రిగా ఉంటూ సిరాజుద్దీన్ అనే వ్యక్తి దగ్గర ముడుపులు స్వీకరించి, ఆయనకు రాయితీల్ని అందించారు. సిరాజుద్దీన్ ఆఫీసులపై సోదాలు జరిగాయి. ఆయన భారీగా ముడుపులు చెల్లించిన సంగతి బయటకు వచ్చింది. కొంతమంది మంత్రులకు పెద్ద పెద్ద బహుమతులు అందించిన వైనం తెలియవచ్చింది. సిరాజుద్దీన్ కాంగ్రెస్ పార్టీకి విరాళాల్ని చెల్లించారనే సత్యం నిగ్గుదేలింది. ఆయన మాలవీయ సతీమణికి బంగారు నగలు పంపించారన్నది బయటపడింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు, పత్రికలు ప్రభుత్వాన్ని నిలదీసి ప్రశ్నించాయి. నెహ్రూ సర్కారుపై ఒత్తిడి పెరిగింది. ఈ మేరకు నెహ్రూ అప్పటి అటార్నీ జనరల్‌ను సంప్రదించారు. మాలవీయ అవినీతి కేసులో ప్రాథమిక సాక్ష్యాధారలు ఉన్నందువల్ల సంపూర్ణ విచారణ అవసరమవుతుందని అటార్నీ జనరల్ సూచించారు. అయితే నెహ్రూ మాత్రం ఒక సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపిస్తే సరిపోతుందని అనుకున్నారు. మాలవీయ వ్యవహారంలో విచారణా నివేదిక బయటకు రానేలేదు. దీనికి వేర్వేరు కారణాలున్నాయని చెబుతారు. మాలవీయ మంత్రి మండలి నుంచి తప్పించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు సిరాజుద్దీన్ భారీ మొత్తంలో ధన సహాయం చేసేవాడని అటు తర్వాత కాలంలో చెప్పుకున్నారు మాలవీయ. మహాత్మాగాంధీ వారసుడైన నెహ్రూగారు మాలవీయ, సిరాజుద్దీన్‌ల వంటి వారిని ఏమీ చేయలేకపోయారు.

ప్రతాప్‌సింగ్ కైరాన్ పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఆయన తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఆయన కుటుంబం మాత్రం అక్రమార్జనలతో అప్రతిష్టపాలైంది. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు మాత్రమే కాదు,

ఆయన స్వంత పార్టీ కాంగ్రెస్ కూడా ఎలుగెత్తి చాటింది. అయితే కైరాన్ కుటుంబంపై వచ్చిన ఆరోపణల్ని బుట్టదాఖలా చేశారు నెహ్రూ. “అసలు ఈ ఆరోపణల్లో నిజం లేదు. ఆవగింజంత వాస్తవం కూడా లేదు” అంటూ క్లీన్‌చిట్ ఇచ్చేశారు నెహ్రూ. ఈ నేపథ్యంలో కైరాన్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్ళారు ఒక సివిల్ సర్జన్. కైరాన్‌పై చేసిన ఆరోపణల్లో నిజం ఉందని తేలింది.

న్యాయస్థానం కైరాన్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. అయినా నెహ్రూ ఆయనను వెనకేసుకొని వచ్చారు. ముఖ్యమంత్రి రాజీనామా వ్యవహారం రాష్ట్ర అసెంబ్లీకి సంబంధించింది. శాసనసభా పక్షం కైరాన్ నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఆయన రాజీనామా సాధ్యంకాదు అని చెప్పుకున్నారు నెహ్రూ. ఇదొరకమైన దారి మళ్ళించే విధానం అంటే, నెహ్రూ అభిప్రాయం ప్రకారం అత్యున్నత న్యాయస్థానం అభిశంసించినా మంత్రి మాత్రం రాజీనామా చేయాల్సిన అవసరం లేదన్నమాట. శాసనసభ పక్షం నిరసించినంత కాలం అతడు తన పదవిలో నిక్షేపంగా కొనసాగవచ్చునన్న మాట. ఇక ఆయన కుమార్తె ఇందిరాగాంధీ తన తండ్రి వలెనే ప్రవర్తించడంలో వింత ఏముంటుంది? ఆమె ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పింది. లోక్‌సభకు ఆమె ఎన్నిక చెల్లనేరదని కోర్టు ప్రకటించింది. ఈ తీర్పును బేఖాతరు చేశారు ఇందిర. ఈ కోర్టులు, పార్లమెంటు ఇవేవీ తనపై తీర్పునివ్వలేవనీ, తనకు ప్రజల తీర్పు ముఖ్యమనీ ప్రకటించుకున్నారామె. ఈ విషయంలో ఆమె తన తండ్రి కన్నా ఒక అడుగుముందుకు వేశారు. సర్దార్‌పటేల్ హోంమంత్రిగా ఉన్నప్పటి విషయాన్ని కొంతమంది చెబుతూ ఉంటారు. నెహ్రూ మంత్రి వర్గంలోని అవినీతి మూర్తులపై ప్రాసిక్యూషన్‌కు ఆజ్ఞలు జారీ చేశారు పటేల్. అయితే పటేల్ మరణానంతరం ఆయన జారీ చేసిన ఆజ్ఞలు గాలిలో కలిసిపోయాయి. అది నెహ్రూ సూచనల మేరకే జరిగిందని అంటారు. తన మంత్రుల అవినీతి విషయంపై నెహ్రూ ఎలాంటి స్పందన కనబర్చేవారు కాదు. పట్టించుకోనట్టే వ్యవహరించేవారు. ఈ విషయంపై విచారణా సంఘాల్ని నియమించాలన్న డిమాండును ఆయన సీరియస్‌గా తీసుకోలేదు. అవినీతి విషయంపై నిర్ణయాధికారం ఒక్క పార్లమెంటుకు మాత్రమే ఉంటుందని ఆయన ఒకానొక పత్రికా విలేకరుల సమావేశంలో అన్నారు. నెహ్రూ అవలంచించిన విధానంతో ప్రయోజనాల్ని పొందినవారు ఆయనను ప్రధాని పదవి నుండి తప్పించేందుకు సాహసించలేదు.





సరిగ్గా ఇదే రకమైన వాతావరణం ఇందిర, రాజీవ్‌గాంధీల హయాంలలోనూ అలుముకున్నది. సోనియాగాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్ని స్వీకరించిన తర్వాత ఆ పార్టీలో అగ్రశ్రేణి నాయకులైపోయారు అవినీతి పర్యవేక్షనేతలు. ఇందిరాగాంధీ ధోరణులు నచ్చక కొంతమంది ఆమెపై తిరుగుబాటు చేశారు. దీనితో కాంగ్రెస్ చీలిపోయింది. వంశ పారంపర్య పాలనను కొనసాగించే దిశలో పార్టీ చీలికకు సహకరించారు ఇందిరాగాంధీ. రాజీవ్ గాంధీ కాలంలో వి.పి.సింగ్ తిరుగుబాటు, దాని నేపథ్యం తెలిసిందే. తాజాగా శరద్ పవార్ వెలుగులోకి వచ్చారు. ఆయన కాంగ్రెస్ అధ్యక్షురాలి నాయకత్వ అర్హతల్ని, వారసత్వ పాలనా మతలబుల్ని ప్రశ్నించారు. ఇంకేముంది, శరద్‌పై బహిష్కరణాస్త్ర ప్రయోగం జరిగింది. తన నాయకత్వాన్ని అంగీకరించని వారంతా కాంగ్రెస్ నుండి నిష్క్రమించాలని సోనియా ఆజ్ఞాపించారు. ఇదండీ! నెహ్రూ నుండి ఇందిర, రాజీవ్‌ల ద్వారా సోనియా వరకు కాంగ్రెస్ సాధించిన ప్రగతి ప్రస్థానం! కాంగ్రెస్ పార్టీ నెహ్రూ వంశీయుల స్వంత ఆస్తిలా మారిపోయింది, భారతదేశ పాలన నెహ్రూ వంశీయుల ఛత్రచాయల్లోనే సాగాలని అనుకుంటున్నారు సోనియామేనియా.

**ఉ.** **నల్లనివాడు పద్మనయనంబులవాడు మహాశుగంబులన్**
**విల్లును దాల్చువాడు గడు విప్పగు వక్షమువాడు మేలు పైఁ**
**జల్లెడువాడు నిక్కిన భుజంబులవాడు యశంబు దిక్కులం**
**జల్లెడువాడు వైన రఘుసత్తముఁ డీవుత మా కభీష్టముల్**

శ్రీమదాంధ్ర మహాభాగవతం న.స్క

నీలమేఘశ్యాముడు, పద్మాలవంటి కన్నులు కలవాడు, ఆజానుబాహుడు కోదండరాముడు, విశాలమైన వక్షస్థలం (ఛాతి) కల్గినవాడు. కీర్తిచంద్రికలను దశదిశల వెదజల్లే రఘువంశోత్తముడు మాకోర్కెలు తీర్చేవాడు.

# అనువంశిక పాలనలో అవినీతి అవతారాలు

## రెండవ భాగం - ఇందిరాగాంధీ హయాం

**సెప్టెంబర్ 13 - 19 , 1999**

కాంగ్రెస్ వాదులు ఇబ్బడి ముబ్బడిగా డబ్బు పోగు చేసుకుంటున్న సంగతి శ్రీమతి ఇందిరాగాంధీకి తెలియని విషయం కాదు. తన తండ్రి నెహ్రూ మంత్రి వర్గ సహచరులు కుబేరులుగా మారుతున్న వైనం కూడా ఆమెకు తెలుసు. జవహర్‌లాల్ నెహ్రూ ఆశీస్సులు, అండదండల పుణ్యమా అని ఆయన కళ్ళ ముందరే కాంగ్రెస్ అధ్యక్షురాలు కాగలిగారు శ్రీమతి గాంధీ. ఈ నేపథ్యంలో ఆమె పలు ఎన్నికల ప్రచార సభలలో పాలుపంచుకోవలసి వచ్చింది. ఎన్నికల రాజకీయాల అసలు సిసలు స్వభావాన్ని ఆమె అర్థంచేసుకున్నారు. ఎన్నికల్లో విజయాన్ని సాధించడానికి డబ్బును మంచి నీళ్ళ ప్రాయంగా ఖర్చు చేయాల్సి వస్తుందని గుర్తించారు శ్రీమతి ఇందిరాగాంధీ. అయితే కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో నిధుల సేకరణ, వాటి వినియోగాలు శ్రీమతిగాంధీ, ఆమె తండ్రి నెహ్రూల చెప్పుచేతల్లో ఉండేవి కావు. ఇలాంటి వ్యవహారాలన్నీ కాంగ్రెస్ సిండికేటుగా పిలుచుకునే ఎస్.కె.పాటిల్, అతుల్య ఘోష్, సంజీవరెడ్డి, కామరాజ్, నిజలింగప్పల కనుసన్నల్లో నడిచేవి. ఇంతలోనే శ్రీమతి గాంధీ ప్రధాని పదవిని అధిష్టించారు. కాంగ్రెస్ జమాఖర్చుల సంగతులన్నీ సిండికేటు సభ్యుల చెప్పుచేతల్లోనే సాగుతున్నాయన్న నిజాన్ని మరోమారు తెలుసుకున్నారు గాంధీ. 1969 లోక్‌సభ ఎన్నికల్లో సిండికేటు తన పెత్తనాన్ని చాటుకుంది. ఈ మేరకు సిండికేటు సభ్యులు తమ అస్మదీయుల్ని పార్లమెంటుకు పంపించగలిగారు. శ్రీమతి ఇందిర నాయకత్వానికి 1969లో తొలి సవాలు ఎదురైంది. అటు తర్వాత ఆమె కాంగ్రెస్ చీలికకు కారణమయ్యారు. అందుకోసం తన ప్రధాని పీఠాన్ని వాడుకున్నారామె. “అభ్యుదయవాది”గా అవతరించిన శ్రీమతి ఇందిరాగాంధీకి మద్దతు పలకాలని కమ్యూనిస్టు పక్షాలు ఉవ్విళ్ళూరాయి. సిండికేటు వర్గీయుల్ని వ్యతిరేకించారు కమ్యూనిస్టులు. ఇక అప్పటి నుండి కొత్త కథ ఆరంభమైంది. పార్టీ కోసం డబ్బును సేకరించేవారు, ఇలా సేకరించిన మొత్తం తన నియంత్రణలోనే ఉండాలని శ్రీమతి గాంధీ భావించారు. జవహర్‌లాల్ నెహ్రూ కాలానికి భిన్నమైన పోకడ ఇది. ఆమె తనను తాను బీదల పాలిటి పెన్నిధిగా చెప్పుకున్నారు. అందువల్ల పారిశ్రామికవేత్తలు, భారీ వాణిజ్య వర్గాలవారు కాంగ్రెస్ పార్టీకి నిధుల్ని ఉదారంగా





అందించడానికి అవరోధాలు ఏర్పడ్డాయి. ఆమె సోషలిజాన్ని ప్రవచించారు. గరీబీ హటావో నినాదాల్ని దిక్కులు పిక్కటిల్లేలా విన్పించారు. సాధారణ భీమా రంగాన్ని, బ్యాంకుల్ని జాతీయం చేశారు. కమ్యూనిస్టుల సలహాలతో సరికొత్త విధాన నిర్ణయాలకు అంకురార్పణ చేశారు శ్రీమతి ఇందిరాగాంధీ. కొత్త చట్టాలు వచ్చి చేరాయి. ఇవి జనరంజక పథకాలకు దారులు వేయడమే కాదు, అపారమైన డబ్బును కూడ బెట్టుకునేందుకు కూడా తమవంతు దోహదం చేశాయి. ధనికులు, వాణిజ్యవేత్తలు, పారిశ్రామిక వర్గాల్ని వ్యతిరేకించే నెపంతో మోనో పోలీస్ రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీసెస్” (ఎంఆర్.టి.సి), ఫారిన్ ఎక్స్ఛేంజి రెగ్యులేషన్ అక్ట్ (ఫెరా), అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యు.ఎల్.సి) వంటి రకరకాల చట్టాల్ని రూపొందించడం జరిగింది. ఈ మూడు చట్టాలు పర్మిట్ – లైసెన్స్ – కోటా రాజ్యానికి బంగారు రహదారుల్ని వేశాయి. దీనితో కార్య నిర్వహణా బృందం, మంత్రిత్వ స్థాయిల్లో అవినీతి ఏర్పడింది. భారీగా డబ్బుల్ని సంపాదించుకునే అవకాశం పెరిగింది. మూడు చట్టాల పుణ్యమా అని బ్యూరోక్రసీ కూడా రాజకీయ అవినీతిలో భాగస్వామిగా మారింది. ఇదివరలో కాంగ్రెస్ పార్టీకి పారిశ్రామికవేత్తలకూ మధ్య ప్రత్యక్ష లావాదేవీలు ఉండేవి. కానీ ఇంతకు ముందు చెప్పిన మూడు చట్టాలు బ్యూరోక్రసిని సైతం రంగంలోకి తెచ్చాయి. దీనితో అపవిత్రమైన కలయికలకు అంకురార్పణ జరిగింది. అవినీతి, నేరమయ పంకిలంలోకి నిబద్ధత గల బ్యూరోక్రట్లు కూడా చేరాల్సి వచ్చింది. నిబద్ధత (వామపక్ష, అభ్యుదయవాద, ప్రజాస్వామ్య, సామ్యవాద, సామాజిక న్యాయాలు...) పేరుతో న్యాయ వ్యవస్థలో కమ్యూనిస్టుల జోక్యం మొదలైంది. అత్యున్నత న్యాయస్థానాల్లో సహా అంతటా కమ్యూనిస్టుల చేరివేత ఆరంభమైంది. ఈ విషయంలో ఇందిరాగాంధీ ముందు తమ పట్టును సాధించుకున్నారు కమ్యూనిస్టులు. సమర్థులైన బ్యూరోక్రట్ల ప్రమోషన్‌కు అవరోధాలు ఎదురయ్యాయి. ప్రతిభ పేరుతో నిజాయితీగల అధికారుల్ని అణచివేయడం జరిగింది. దీనితో అత్యున్నత స్థానాల్లో నీతిమంతులకు చోటు దొరకకుండా పోయింది. అలహాబాద్ హైకోర్టు శ్రీమతి ఇందిరాగాంధీ లోక్‌సభకు ఎన్నిక కావడాన్ని తప్పుబడుతూ తీర్పు చెప్పింది. దీనితో ఆమె అత్యవసర పరిస్థితిని విధించారు. ఈ సమయంలో అవినీతి తారా స్థాయికి చేరుకున్నది. ఆమె కుమారుడు సంజయ్ గాంధీ హైస్కూల్ చదువు మధ్యలోనే మానుకున్న ఘనుడు. ఆయన తెరవెనుక ప్రధానిగా అన్ని పెత్తనాలూ చెలాయించారు. శ్రీమతి గాంధీ మంత్రివర్గ సభ్యులే కాదు యావద్భారత దేశంలోని పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా

సంజయ్‌గాంధీ హుకుంనామాల్ని సుగ్రీవాజ్ఞగా భావింపవలసి వచ్చింది. సంజయ్ అవినీతి లీలల్ని వివరించి, వర్ణించేందుకు ఎన్నో గ్రంథాలు రాయాలి. అందుకని వీటిల్లో కోట్లాది రూపాయలకు సంబంధించిన కొన్ని అంశాల్ని మాత్రం ప్రస్తావించాల్సి ఉంటుంది.

హైస్కూల్ చదువు మధ్యలో మానుకున్న సంజయ్‌గాంధీ తాను స్వయంగా ఒక కారును రూపొందించి, అభివృద్ధి చేసి అమ్మాలనుకున్నాడు. అదే మారుతికారు, దీనికి అవసరమైన పర్మిట్ తీసుకున్నాడు సంజయ్. ఈ విషయంలో నిబంధనలన్నీ తుంగలో కలిసాయి. సంజయ్ కన్నా ఎంతో ముందు నుండి నిరీక్షిస్తున్న పారిశ్రామిక వేత్తలకు పర్మిట్ రాలేదు. కానీ సంజయ్ దాన్ని సాధించుంకోగలిగాడు. మారుతి కార్ల పంపిణీ కోసం దేశ వ్యాప్తంగా పంపిణీదారుల్ని ఎంపిక చేసుకున్నారు. సదరు పంపిణీదారుల నుండి డబ్బు వసూలు చేయడం కూడా జరిగింది. బన్సీలాల్ అప్పట్లో రక్షణమంత్రి పదవిలో ఉండేవారు. ఆయన గుర్‌గావ్ ప్రాంతంలోని 445 ఎకరాల భూమిని కారు చౌకగా అందించారు. ఈ విషయంలో భారత వైమానిక దళం నిరసనల్ని కూడా ఆయన ఖాతరు చేయలేదు. దీన్ని వ్యతిరేకించిన ప్రభుత్వాధికారుల్ని శంకరగిరి మాన్యాలకు పట్టించారు. ప్రాధాన్యత లేని పదవుల్లో నియమించారు. వారిని సిబిఐ వేధింపులకు గురి చేశారు. ఈ విషయంపై పార్లమెంటులో ఎదురయ్యే ప్రశ్నల తాకిడికి అబద్ధాల జవాబుతో సిద్ధంగా ఉండాలని మంత్రులకు తాఖీదులు ఇవ్వబడ్డాయి. భారతరత్న అవార్డును అందుకున్న సి.సుబ్రహ్మణ్యం ఆ రోజుల్లో కేంద్ర పరిశ్రమల శాఖామంత్రిగా ఉండేవారు. కాంగ్రెస్ చీలికవేళ శ్రీమతి ఇందిరాగాంధీ అడుగు జాడల్లో నడిచిన వ్యక్తి సి.సుబ్రహ్మణ్యం. ఆయన 22-12-1972 నాడు పార్లమెంటులో ఒక ప్రకటన చేశారు (అన్నట్టు ఆయన స్వతహాగా ఆటోమొబైల్ ఇంజనీర్ కూడా). తాను మారుతి నమూనాల్ని నిశితంగా పరిశీలించానని చెప్పుకొచ్చారు సుబ్రహ్మణ్యం. "ఇది బారతదేశ ఆటోమొబైల్ రంగ చరిత్రలోనే అత్యంత ఘనమైన విజయం. మన దేశంలోని సాంకేతికతతో ఇలాంటి వాటిని తయారు చేయడం ఎంతో గొప్ప" అన్నట్టు చెప్పారాయన. శ్రీమతి ఇందిరాగాంధీ మంత్రివర్గంలో పరిశ్రమల మంత్రిత్వశాఖను నిర్వహించిన టి.ఏ.పాయ్ 1974లో వ్యాఖ్యానిస్తూ "మారుతి కారు రహదారి పరీక్షలన్నింటిలోనూ నిక్షేపంగా విజయాన్ని సాధించిందని" కితాబునిచ్చారు.





నిజానికి ఇవన్నీ పచ్చి అబద్ధాలు. తన కుమార రత్నం అవినీతి వ్యవహారాలపై శ్రీమతి గాంధీని ప్రశ్నించినప్పుడు ఆమె తీవ్రమైన ఆగ్రహాన్ని ప్రదర్శించారు. ఈ విషయంలో పంజాబ్ ముఖ్యమంత్రిగా అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొన్న ప్రతాప్‌సింగ్ కైరాన్ కాస్త నయం. ఆయన తన కుమారుడు అక్రమార్జన సంగతి తనకు ఏ మాత్రం తెలియదని జస్టిస్‌దాస్ విచారణా సంఘం ముందు విన్నవించుకున్నారు. కుమారుడిపై వచ్చిన అవినీతి ఆరోపణలన్నింటినీ పక్కన పడదోశారు శ్రీమతి ఇందిరాగాంధీ. ఆయన అవినీతిపై విచారణకు కూడా ఆమె అంగీకరించలేదు. ఆమె తన కుమారుడి తప్పుడు కార్యాలన్నింటికీ బాసట ఇచ్చే ప్రయత్నం చేశారు. "నా కుమారుడు ఒక ప్రొఫెసర్‌లా కన్పించకపోతే అందుకు నేనేం చేసేది? ఇదిగో చూడండి, సంజయ్ మేధావి కాదు, అతడు కార్యవాది. నా కుమారుడు రిస్క్ తీసుకుంటానని అంటే అందుకు నేను కాదనలేను. మనం మన (అంటే ఆమె, ఇతరులు కాదు) యువతరాన్ని ప్రోత్సహించాలి" అంటూ కొత్త ఉద్బోధలు పలికారు శ్రీమతి ఇందిరాగాంధీ. "సంజయ్ వ్యతిరేకత కార్ల విషయంలో ఎందుకూ పనికిరాదు. అతను తన నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శించినందువల్లనే ఇదంతా జరిగిందని భావిస్తున్నారు. మారుతి ప్రాజెక్టుపై ప్రభుత్వం పెద్ద పెట్టున వ్యతిరేకత చూపుతోంది, అదే ఒక పెద్ద సమస్య" అని మరో సందర్భంలో వ్యాఖ్యానించారు శ్రీమతి గాంధీ. పాఠశాల చదువును మధ్యలో మానేసిన తన సుపుత్రుడికి అత్యుత్తమ ఇంజనీర్‌గానూ, అత్యున్నత నాయకుడిగా కూడా చూపుతూ ఇందిరాగాంధీ ప్రశంసించిన తీరు భారత రాజకీయవేత్తలకు కొత్త అంశాన్ని స్ఫురింపజేసింది. వాళ్ళు కూడా తమ తమ వారసుల్ని ఆయా ప్రాంతాల్లో వెలుగులోకి తీసుకొని వచ్చారు. పలు ప్రాంతాల్లో వారసత్వ రాజకీయ శకం ఆరంభమైంది. పాపం పాతకాలపు రాజవంశాలవారు వారి వారసులు కాలగర్భంలో కలిసిపోయారు.

కొత్త తరహా వారసత్వ రాజకీయాలు మొదలయ్యాయి ఇప్పుడు! ఎందరో ముఖ్యమంత్రులు, మంత్రులు, శాసనసభ్యులు తమ వాళ్ళను వారసులుగా రంగ ప్రవేశం చేయిస్తున్న సంగతి తెల్సిందే. సామాజిక రంగంలో పేరుకుపోయిన అవినీతిని గురించి చెప్పేందుకు మాటలు చాలవు. ఇది ఆర్థిక అవినీతి కన్నా ప్రమాదకరంగా పరిణమించింది. భారీ ఎత్తున సాగే ఆర్థిక సంబంధమైన అవినీతి కొద్దమందిపై మాత్రమే ప్రభావాన్ని చూపుతుంది. అదే బంధుప్రీతి వంటివైతే ప్రజా జీవితాన్ని,

సామాజిక రంగాన్నే కలుషితం చేస్తాయి. ఇందిరాగాంధీ తన కుమారుడిని ప్రోత్సహించిన తీరును ప్రత్యేకంగా పలు విషయాల్ని చర్చించాలనుకున్న కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులతో "మీరు ముందు సంజయ్‌ని కలిసి రండి" అని చెప్పేవారు ఇందిరాగాంధీ. ఎంతో శక్తి సామర్థ్యాలున్న బ్రహ్మానందరెడ్డి వంటి మంత్రులు జీరోల స్థాయికి దిగిపోయారు. బాగా బలం ఉన్న దిగ్గజాల వంటి మంత్రుల శాఖల్లో తన విధేయుల్ని సహాయ మంత్రులుగా నియమించేవారు ఇందిరాగాంధీ. ఓం మెహతా హోంమంత్రి బ్రహ్మానందరెడ్డికి సహాయమంత్రిగా ఉండేవారు. ఒకసారి హోంమంత్రిత్వ శాఖ పనితీరు ఎలా సాగుతోందని బ్రహ్మానందరెడ్డిని ప్రశ్నించడం జరిగింది. "నాకు హోంమంత్రిత్వ శాఖకు సంబంధించిన వివరాలేమీ పెద్దగా తెలియవు కానీ ఓం మెహతా మాత్రం తన పని తాను చక్కగా చేసుకుంటూ పోతున్నారు" అని జవాబు చెప్పారు బ్రహ్మానందరెడ్డి. ప్రస్తుతం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్న ఆర్.కె.ధావన్ గతంలో ఇందిరాగాంధీ ప్రైవేటు సెక్రటరీగా పనిచేశారు. ఆయనా, ఆయనతోపాటు యశ్‌పాల్ కపూర్, ఎల్.ఎన్.మిశ్రా, ఏ.పి.శర్మా వంటి నిధుల సేకరణలో దిట్టలు ఇందిరాగాంధీ సన్నిహితుల సలహాదారులుగా కొలువు తీరారు.

ఇందిరాగాంధీకి నమ్మినబంటు ఎల్.ఎన్.మిశ్రా. ఆయన పరిశ్రమల శాఖ మంత్రిగా ఉండేవారు. పర్మిట్, లైసెన్స్, కోటాలకు పరిశ్రమల మంత్రిత్వశాఖనే వెన్నెముక లాంటిది. మిశ్రా మిత్రుడి పేరు తుల్‌మోహన్‌రామ్. ఇతడొక ఎం.పి. తుల్ మోహన్‌రామ్ ఎన్నో పరిశ్రమలకు లైసెన్సుల్ని సంపాదించుకున్నాడు. ఇవన్నీ బ్లాక్‌లిస్టులో వేయాల్సినవి. అయినా 21 మంది ఎంపీల సంతకాలతో కూడిన మెమొరాండంలతో తుల్‌మోహన్‌రామ్‌కు లైసెన్స్‌లు దక్కాయి. చివరకు ఇదొక కుంభకోణంగా తయారైంది. ఈ విషయం పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చింది. తీరా అన్ని విషయాల్నీ ఆరా తీస్తే తుల్‌మోహన్‌రామ్ వ్యవహారంలో ఫోర్జరీ పాత్ర బయటపడింది. లైసెన్స్‌ల్ని కోరుతూ మెమొరాండంపై సంతకం చేసిన 21 మంది ఎంపీల సంతకాల్లో ఒకటి మినహా మిగతావన్నీ ఫోర్జరీలేనని తేలింది. మెమొరాండంపై నిజంగా సంతకం చేసిన ఎంపీ తుల్‌మోహనరామ్ ఒక్కరే.

రుస్తోమ్ సొహరాబ్‌నగర్ వాలాది మరోకథ. ఈయన ఆర్మీలో కెప్టెన్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఇంటలిజెన్స్ బ్యూరోలో ఉండేవారు. ఇందిరాగాంధీ పేరుతో





నగర్ వాలా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఫోన్‌చేసి 60 లక్షల రూపాయలు కావాలన్నాడు. బ్యాంక్ ఛీఫ్ క్యాషియర్ ఆ మొత్తాన్ని అప్పగించాడు. ఇదంతా జరిగిన తర్వాత ఛీఫ్ క్యాషియర్ ఇందిరాగాంధీ కార్యాలయానికి వెళ్ళాడు. ఇందిరాగాంధీ అనుచర బృందం టెలిఫోన్ కాల్ వ్యవహారాన్ని కొట్టి పారేశారు. నగర్‌వాలా ఇందిరాగాంధీ గొంతును అనుకరించి డబ్బు కైంకర్యం చేసుకున్నాడని చెప్పుకున్నారు. అంతకుముందు ఎన్ని సందర్భాల్లో, ఏ మొత్తంలో ఛీఫ్ క్యాషియర్ ఇందిరాగాంధీకి డబ్బు అందించారన్నది అంతు చిక్కని మిస్టరీగా మిగిలిపోయింది. నగర్‌వాలాను వెతికి పట్టుకున్నారు. నాలుగు సంవత్సరాల కఠిన కారాగార శిక్షను విధించారు. అయితే కొంతకాలం తర్వాత నగర్‌వాలా తన కేసుపై పునర్విచారణ జరపాలని మొత్తుకున్నాడు. ఇంతలోనే అనుమానాస్పద పరిస్థితుల్లో ఆకస్మికంగా మరణించాడు. ఈ విషయాన్ని గురించి విచారణ జరుపుతున్న పోలీస్ అధికారి కూడా ఆరు నెలలలోపే రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. జనతా ప్రభుత్వ హయాం (1977–1979) లో సి.బి.ఐ డైరెక్టర్‌గా ఉన్న ఎన్.కె.సింగ్; సంజయ్‌గాంధీ మారుతీ కేసుపై విచారణ జరిపారు. ఆయన కూడా వేగంగా వస్తున్న జీపుకింద పడి ప్రాణాలు కోల్పోవల్సిన వారే. అయితే అదృష్టవశాత్తూ బతికి బయటపడ్డారు. ఆయన "ది నేకడ్ ట్రూత్" అనే పుస్తకంలో ఇందిరా, సంజయ్‌ల అవినీతి లీలల్ని గురించి విస్తృతంగా వివరించారు. తప్పుడు కథనాల తయారీలు, ప్రభుత్వ వ్యవహారాలకు సంబంధించిన ఫైళ్ళను మాయం చేయడం, ఎదురు తిరిగిన అధికారులపై బదిలీ వేటుపడ్డ తీరు ఇంకా ఇలాంటి కుటుంబ పాలన గాథల్ని సవివరంగా అందించారు "ది నేకడ్ ట్రూత్" పుస్తకంలో ఎన్.కె.సింగ్.

ఇందిరాగాంధీకి విశ్వాస పాత్రులైన మంత్రులు డబ్బు వసూళ్ళలోనూ, సర్కారును అవినీతి మయం చేయడంలోనూ ఎంతటి చురుకైన పాత్ర పోషించారన్న సంగతిని ఒకటి రెండు సంఘటనలతో అర్థం చేసుకోవచ్చు. 1971 లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఇందిరాగాంధీ తన సీనియర్ మంత్రి వర్గ సహచరుడిని పబ్లిసిటీ ఇన్‌ఛార్జిగా నియమించారు. ప్లాస్టిక్ బ్యాడ్జీల్ని ఒక నిర్ణీతమైన ధరకు అమ్మేందుకు ఒకనొక అమ్మకందారు ఆయన దగ్గరికి వచ్చాడు. ఆ మంత్రిగారు సదరు అమ్మకందారుతో ఉమాశంకర్ దీక్షిత్‌ను కలుసుకోమని చెప్పారు. దీక్షిత్ కాంగ్రెస్ పార్టీ కోశాధికారిగా ఉండేవారు. ఆయన పబ్లిసిటీ ఇన్‌ఛార్జిగా ఉన్న మంత్రిగారికి

ఫోన్ చేసి, బ్యాడ్జీలపై ఇదివరకే యశ్‌పాల్‌కపూర్ (ఇందిరాగాంధీ విధేయ బృందంలో ప్రముఖుడు) బేరం కుదిర్చారని వెల్లడించారు. కపూర్ కుదిర్చిన బేరం రేటు పబ్లిసిటీ ఇన్‌ఛార్జి మంత్రిగారిని కలుసుకున్న అమ్మకందారు చెబుతున్న దానికన్నా మూడురెట్లు ఎక్కువ. అప్పట్లో వారసత్వ పాలనకు విధేయత తెల్పిన కాంగ్రెస్ నేతలు పార్టీ వ్యవహారాల విషయంలో ఎలాంటి బేరసారాలకు దిగారో దానివల్ల మనం అర్థం చేసుకోవచ్చు. ఆ మధ్య టెలికమ్యూనికేషన్ల శాఖ మాజీ మంత్రి సుఖ్‌రాం ఈ పరంపరలో భాగంగానే పార్టీ కోసం డబ్బు వసూలుకు నడుం బిగించారు. ఇందులో ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు!

తన మంత్రి మండలిలోని అవినీతి పరుల గురించి శ్రీమతి ఇందిరాగాంధీకి తెలిసినా ఆమె ఎందుకు ఉపేక్షించారన్న విషయాన్ని ఎస్.ఎస్.గిల్ చెబుతున్నారు. ఆయన ఇలాంటి వ్యవహారాల్ని ప్రత్యక్షంగా గమనించిన వ్యక్తి. ఇది షిప్పింగ్ (నౌకా) వ్యవహారాలకు సంబంధించిన కథ. ఇందులో షిప్పింగ్ ట్రాన్సుపోర్టు మంత్రి; షిప్పింగ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ (అయిన రిటైరైన అడ్మిరల్) నౌకల్ని అమ్మే ఒక విదేశీ సంస్థ పాత్రదారులు. ఇందులో ఉన్న మతలబుల్ని గురించి, చీకటి భాగోతాల్ని గురించి షిప్పింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ ప్రధానికి సవివరంగా తెలియజేశారు. అడ్మిరల్ అంకిత భావాన్ని ప్రశంసించారు ప్రధాని ఇందిరాగాంధీ. అయితే సదరు నౌకల్ని విక్రయించే సంస్థ కాంగ్రెస్ పార్టీకి విరాళాల్ని అందిస్తే అందుకు అడ్డు తగలకూడదని కూడా ఆయనకు సలహా ఇచ్చారామె. అంటే నౌకల కొనుగోలు కోసం ఆ సంస్థకు భారీ మొత్తాన్ని ప్రభుత్వం ముట్టజెబుతుంది. అందులో కొంత భాగాన్ని ఆ సంస్థవారు కాంగ్రెస్ పార్టీకి విరాళంగా అందిస్తారన్నమాట! ఈ సూత్రాన్ని ఇందిరాగాంధీ చెవిలో వేసినవాడు సంజయ్ గాంధి. “ భారతదేశ వాణిజ్యవేత్తల నుండి విరాళాలు తీసుకోవడం ఎందుకు? వాళ్ళు అదే పనిగా ఈ విషయాల్ని గురించి అందరితోనూ చెబుతారు. విదేశీ కంపెనీలకు ఆర్డర్లు ఇస్తే సరి. వాళ్ళ లాభాలు పోను మిగతాది కమీషన్ రూపంలో పార్టీ ఫండ్ కింద ఇచ్చేస్తారు” అని హితబోధ చేశాడు సంజయ్. బోఫోర్స్ శతఘ్నుల విషయంలో 3 నుండి 7 శాతం దాకా కమీషన్లు అందినట్టు చెప్పుకున్నారు. ఇది గతంలో సంజయ్ ప్రబోధించిన సూత్రాలకు అనుగుణంగానే సాగిందని అనుకోవాలి. ఇలాంటి కమీషన్ల పద్ధతులు ఇందిరాగాంధీ హయాంలోనే ప్రారంభమయ్యాయి.





పూర్వపు సోవియట్ యూనియన్‌లో జరిగిన ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోళ్ళ వ్యవహారాన్ని గురించి వివరిస్తున్నారు ఎస్.ఎస్.గిల్. దీన్ని కూడా ఆయన దగ్గరగా చూశారు. కొనుగోలు కాంట్రాక్టుపై సంతకం జరిగిన వెంటనే సోవియట్ సంస్థ ఒక సందేశాన్ని పంపించింది. అక్కడి రాయబారికి (ఆయన ఇందిరాగాంధి బంధువు, ఆమెకు విశ్వాసపాత్రుడైన మిత్రుడు కూడా) కమీషన్‌ను అందజేయాలన్నది సందేశంలోని ముఖ్యాంశం. విదేశీ కాంట్రాక్టుల ద్వారా ముడుపులు సంపాదించి, ఆ మార్గాల్లో వచ్చిన డబ్బును విదేశీ బ్యాంకుల ఖాతాల్లో జమ చేసుకునే సంప్రదాయం ఇందిరాగాంధి హయాంలోనే ఆరంభమైంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక మంత్రిగారు గోవాలో బ్రహ్మాండమైన ఆస్తిపాస్తుల్ని కూడగట్టుకున్నారు. అనంతపురంలో లేదంటే ఆంధ్రప్రదేశ్‌లోనో కాకుండా గోవాలో ఆస్తులు సంపాదించాల్సిన అవసరం ఏమిటని సంజీవరెడ్డి ఆ మంత్రిగారిని ప్రశ్నించారు. ఇక్కడ ఆస్తులు పెంచుకుంటే అవి తనకు సంబంధించినవనే నిజం సులువుగా బయట పడుతుందని తేలికగా జవాబు చెప్పారా మంత్రిగారు. ఒకవేళ తనకు గోవాలో ఆస్తులు ఉంటే వాటి సంగతులు ఎవరికీ తెలిసే అవకాశం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం తనను పేదవాడిగానే పరిగణిస్తారన్నది ఆయన వివరణ. ఇది ఇందిరాగాంధీ హయాంలో అమలులోకి వచ్చిన కొత్త పద్ధతి. అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన డబ్బు సంగతులు భారతదేశంలో ఉంటే తెలిసిపోతాయని వాటిని స్విస్ ఖాతాల్లోకి తరలించడం మొదలైంది. ఈ మేరకు తాజాగా స్విస్ కోర్టులు వెల్లడించిన విషయాలు బోఫోర్స్ వ్యవహారంలో ముడుపుల స్వీకర్తల బ్యాంకు ఖాతా నెంబర్లను బయటపెట్టాయి. చిట్ట చివరకు ఎస్.ఎస్.గిల్ మాటలతోనే ప్రస్తుత వ్యాసానికి ముగింపు పలికే ప్రయత్నం చేస్తాను. గిల్ ఏమని రాస్తారంటే “ఇందిరాగాంధీ అధికారలాలస, నిధుల సేకరణ విషయంలో ఆమె అనుసరించిన శైలి భారత రాజకీయ సంస్కృతిలో రెండు విధ్వంసకరమైన పరిణామాలకు దారితీసింది. వీటిలో మొట్టమొదటగా చెప్పాల్సింది నిర్మొహమాటమైన పద్ధతిలో తన పిల్లలకు రాజకీయ ప్రోత్సాహాన్ని అందించడం. ఇది బంధు ప్రీతి అనే సంస్కృతికి కొత్త రూపును ఇచ్చింది. సంజయగాంధీని తన వారసుడిగా నిర్మించే క్రమంలో ఆమె సకల నిబంధనల్ని, సర్వ సంప్రదాయాల్ని తుంగలో తొక్కారు. సంజయ్ మరణానంతరం ఇందిర తన పెద్ద కుమారుడు రాజీవ్‌గాంధీకి కావల్సినంత ప్రోత్సాహాన్ని అందించారు”, రాజీవ్‌గాంధీ ఆమెకు వారసుడిగా తయారయ్యారు. ప్రస్తుతం ఆయన సతీమణి వారసత్వ రాజకీయాల్ని

నడిపే ప్రయత్నంలో ఉన్నారు. సోనియా తన ప్రచార సభలకు కుమారుడిని, కుమార్తెను వెంట బెట్టుకొని పోతున్నారు. ఎన్నికల ప్రచార సభలకు వచ్చిన ప్రజానీకానికి వారిని పరిచయం చేస్తున్నారు. ఒకవేళ తాను వారసత్వ రాజకీయాల్లోకి రాణించలేకపోయినా, తన కుమారుడు, కుమార్తె వాటిని పదిలంగా రక్షించాలన్నది సోనియా ఉద్దేశ్యం. భారత ప్రభుత్వంపై వీళ్ళ యాజమాన్యం ఏర్పడాలని సోనియా ఆకాంక్ష. శ్రీమతి ఇందిరాగాంధీ బంధుప్రీతిని ప్రభుత్వ విధానం (పబ్లిక్ పాలసీ) స్థాయికి చేర్చారు. అనువంశిక పాలననే తన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆమె కనుసన్నల్లో మెలిగే మంత్రులు, ఇతర అనుచర బృందం కూడా నాయకురాలి మార్గంలోనే నడిచి తమ తమ వారసుల్ని రాజకీయాల్లోకి తీసుకు వచ్చారు అని అభిప్రాయపడ్డారు ఎస్.ఎస్.గిల్. నిధుల సేకరణలో భారీ యత్నాలు చేసిన ఇందిరాగాంధీ రాజకీయ సంస్కృతిలో సంస్థాగత అవినీతిని ప్రతిష్ఠింప జేశారు. అప్పట్లో నిధుల సేకరణపై కథలు గాథలు వెలువడ్డాయి. “ప్రధానమంత్రి సిబ్బంది ఖాళీ సూట్‌కేసుల్ని తిరిగి ఇవ్వరు” అని చమత్కార పూరితంగా వ్యాఖ్యానించారు ఎస్.కె.పాటిల్. దశాబ్దాల తర్వాత కూడా ఇది వాస్తవమేనని అర్థమవుతోంది. సూట్‌కేసు కథతో ప్రఖ్యాతి పొందిన హర్షద్ మెహతా తన అనుభవాల్ని రసవత్తరంగా వెల్లడించారు. హర్షద్‌మెహతా ఆరోపణలపై ఆనాటి ప్రధాని పరువు నష్టం దావా వేయలేదు. వెనుక దాగిన నిజాలెన్నో బయటకు వస్తాయన్న భయమే దీనికి కారణం కావచ్చు. ఇప్పటి కాలంలో ప్రతి “రిక్వెస్టు”నూ కేసు తర్వాత కేసు రూపంలో పరిశీలిస్తున్నాయి. ఇక్కడ కేసులంటే సూట్‌కేసులనే అర్థం చేసుకోవాలి. ఇందిరాగాంధీ హయాంలో సోషలిజం కోసం ఆవిర్భవించిన ఎం.ఆర్.టి.పి., ఫెరా; యు.ఎల్.సి వంటి చట్టాల వల్లనే అవినీతికి సంబంధించిన అంకురాలు రూపుదిద్దుకున్నాయి.

**వేరుపురుగు జేరి వృక్షంబు జెరచును**
**చీడపురుగుచేరి చెట్టు జెరచు,**
**కుచ్చితుండు జేరి గుణవంతు జెరచురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**





# అనువంశిక పాలనలో అవినీతి అవతారాలు

## మూడవ భాగం - రాజీవ్‌గాంధీ, సోనియా హయాం

**అక్టోబర్ 4 - 10, 1999**

కాంగ్రెస్ పార్టీ నేతల డబ్బు వసూళ్ళ సంగతి జవహర్‌లాల్ నెహ్రూకు తెలుసు. అయినా ఆయన వీటన్నింటినీ చూసీ చూడనట్టు ఊరుకున్నారు. ఏది ఏమైనప్పటికీ అవినీతి పరులకు నెహ్రూ మద్దతు దొరికిందన్నది మాత్రం నిజం. ఇక ఇందిరాగాంధీ తన హయాంలో పాతపద్ధతుల్ని మార్చివేశారు. నమ్మకమైన పార్టీ సహచరుల ద్వారా కాంగ్రెస్ పార్టీకి నిధుల సేకరణ కార్యక్రమాన్ని అవలంబించారు శ్రీమతి ఇందిరాగాంధీ. ఇందుకు అనుకూలించే రీతిలో పలు చట్టాల్ని రూపొందించారు. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ధనశక్తి ప్రధాన సహకారిగా ఉంటుందని విశ్వసించారామె. దేశం యావత్తు దాదాపు ఆమె ప్రైవేటు సొత్తుగా మారిపోయింది. 1970లలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు దేవకాంత బారువా. ఆయన కూడా అందరు కాంగ్రెస్ వాదులవలెనే వామపక్ష, ప్రజాస్వామ్య, సామ్యవాద, సెక్యులర్ భావాలు ఉన్నవాడే. దేవకాంత్ బారువా తనదైన పద్ధతిలో ఒక నినాదాన్ని సృష్టించారు. “ఇందిరాయే ఇండియా, ఇండియాయే ఇందిర” అన్నది బారువా తయారు చేసిన నినాదం. మొత్తానికి భారతదేశం యావత్తూ శ్రీమతి ఇందిరాగాంధీ ఆస్తి అని బారువా నినాదం స్పష్టం చేసింది. రాజీవ్‌గాంధీ తన తల్లి మరణానంతరం ప్రధానమంత్రి పదవిని చేపట్టారు. అప్పటికి ఆయన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత రూపంలో లాంఛనంగానైనా ఎన్నిక కాలేదు (ఆ కాలంలో ఆచార్య ఎన్.జి.రంగా కాంగ్రెస్ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్‌గా ఉన్నారు. అంతకు ముందుకాలంలో పార్లమెంటరీ పార్టీ ఉపనేతగా ఉన్న గుల్జారీలాల్ నందా రెండుసార్లు ఆపద్ధర్మ ప్రధానిగా వ్యవహరించారు. పార్లమెంటరీ పార్టీ అధినేత ఎన్నిక జరిగే వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు). రాజీవ్‌గాంధీ ప్రధాని అయిన వెంటనే తన బంధు మిత్రుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. వీళ్ళలో చాలామంది చట్టాల్ని అతిక్రమించి పలు వ్యవహారాలు నడిపినవారు. డబ్బు దస్కం దండిగా కూడగట్టుకున్నవారు. ఆయన హయాంలో జరిగిన కుంభకోణాలు ఎన్నెన్నో. వాటిలో బోఫోర్స్ ముడుపుల వ్యవహారానికి పెద్దపీట వేయాల్సి ఉంటుంది. బోఫోర్స్

రావణకాష్టం ఇంకా మండుతూనే ఉంది. ఆయన కాలంలో బయటపడిన కుంభకోణాల్లో కొన్నింటిని గుర్తుకు తెచ్చుకుంటే........

అమితాబ్ బచ్చన్ ఆయన సోదరుడు అజితాబ్ బచ్చన్‌లు రాజీవ్‌గాంధీ మిత్రబృందంలోనివారే. బచ్చన్ సోదరులకు లెక్కల్లో బయటకి రాని విదేశీ పెట్టుబడులు, మరికొన్ని ఖాతాలు ఉన్నట్టు చెప్పుకున్నారు. అమితాబ్ సోదరుడు జెనీవాలో కొన్ని ఆస్తులు సంపాదించారు. "ఫెరా" నిబంధనల్ని ఉల్లంఘించారు. ఆయన విచారణను ఎదుర్కొన్నారు. స్వతంత్ర్య భారత చరిత్రలో అతి గొప్ప పారిశ్రామికవేత్తగా చెప్పుకునే ధీరూభాయ్ అంబానీ సంగతులు కూడా అలాగే ఉన్నాయి. రాజీవ్‌గాంధీ హయాంలో ఆర్థికమంత్రిగా ఉన్న విశ్వనాథ ప్రతాప్‌సింగ్ ఆర్థిక అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు నడుం బిగించారు. ఆయన తయారు చేసుకున్న జాబితాలో అజితాబ్, ధీరుభాయ్ అంబానీల పేర్లు కూడా ఉన్నాయి. విచారణ కోసం అమెరికాకు చెందిన "ఫెయిర్ ఫాక్స్" సంస్థను ఎంపిక చేసుకున్నారు విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్. బడా పారిశ్రామికవేత్త ఉత్తరాల్ని ఫోర్జరీ చేయించేశారు. ఆ రోజుల్లో సి.బి.ఐ డైరక్టర్‌గా ఉన్నారు మోహన్ ఖత్రో. ఆయన పారిశ్రామికవేత్తల వల్ల భారీ ప్రయోజనాలు పొందిన వ్యక్తి. మోహన్ ఖత్రో ఫోర్జరీ ఉత్తరాల్ని అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీకి అందించారు. విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ తనను పదవీచ్యుతుడిని చేసేందుకు కుట్ర పన్నుతున్నారని రాజీవ్‌గాంధీ అనుమానించారు. దీనితో విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌కు స్థానచలనం కలిగింది. ఆయనను ఆర్థికశాఖ నుంచి తప్పించి రక్షణ మంత్రిగా నియమించారు. ఇది జరిగింది 1987 జనవరి నెలలో. ఇన్ని సంవత్సరాలు గడిచినా ఈ రోజు వరకు కూడా "ఫెరా" ఉల్లంఘనలకు పాల్పడినవారిపై ఎలాంటి చర్య తీసుకోలేదు.

1760 కిలోమీటర్ల హెచ్.బి.జె. గ్యాస్ పైప్‌లైన్ కోట్ల రూపాయలతో ముడిపడిన కాంట్రాక్టు. ఈ కాంట్రాక్టు చేజిక్కించుకోవాలని "స్నామ్ ప్రొగెటీ" (SNAM PROGETTI) అన్న ఇటలీ సంస్థ ప్రయత్నాలు మొదలుపెట్టింది! స్నామ్ ప్రొగెటీ సంస్థకు ఒట్టానో క్వాత్రోచీ భారత ప్రతినిధిగా ఉండేవారు. ఆయన ఇటాలియన్ సోనియా మైనో. రాబర్టో రాజీవ్‌గాంధీలకు సన్నిహిత మిత్రుడు. "స్నామ్ ప్రొగెటీ" ఆశలేమీ చిన్నస్థాయివి కావు. అందుకే రాజీవ్‌గాంధీ స్వయంగా ఇందులో జోక్యం చేసుకున్నారు. క్వాత్రోచీ తరపున కార్యరంగంలోకి దిగారు. ఈ అంశాల్ని విశ్వనాథ





ప్రతాప్‌సింగ్ స్వయంగా పేర్కొన్నారు. "కాంట్రాక్టు విషయాన్ని తిరిగి అంచనా వేయాల్సిందిగా రాజీవ్ నాతో చెప్పారు. ఆర్థికశాఖ కార్యదర్శి క్రింద ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీ కాంట్రాక్టు మొత్తం ఎక్కువ ఖర్చుతో కూడుకొని ఉన్నదని నిర్ధారించింది. అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ కొన్ని అంశాలతో కూడిన తాఖీదును నాకు పంపారు. స్నామ్ ప్రొగెట్టీ"ని ఆయా అంశాల ఆధారంగా అంచనా వేయాలని కోరారు. గతంలో ఒట్టావో క్వాత్రోచీ సంబంధిత మంత్రిత్వ శాఖకు అందించిన అంశాలతో రాజీవ్ పంపించిన పాయింట్లు సరిగ్గా సరిపోయాయి" అని రాసారు విశ్వనాథ ప్రతాప్‌సింగ్. మొత్తానికి తొలి ప్రయత్నాలేవీ ఫలవంతం కాలేదు. ఇక ఆర్థిక శాఖలోని అత్యున్నత అధికార బృందంపై ఒత్తిడి పెరిగింది. ప్రధానమంత్రి కార్యాలయానికి చెందినవారు ఆర్థికశాఖ అధికారులపై ఒత్తిడుల్ని తీవ్రతరం చేశారు. పాత పద్ధతుల్ని మార్గదర్శక సూత్రాల్ని పక్కన బెట్టి కాంట్రాక్టుకు సంబంధించి తాజా అంచనా వేయాలన్నది ఒత్తిడుల సారాంశం. దేశం యావత్తూ తన స్వంత ఆస్తి అని భావించేవారు తప్పితే మరొకరు చేయలేని మంత్రాంగం ఇది. ఇదంతా ఆయన తన మిత్రులకు సహాయం చేసే క్రమంలో జరిపిన ప్రయత్నం. ఇటలీలో జన్మించి తదనంతర కాలంలో ఆయన జీవిత భాగస్వామిని అయిన వ్యక్తికి చెందిన దేశం వారికి సహాయ పడటంలో ఒక భాగం.

అజితాబ్ బచ్చన్ స్విట్జర్లాండ్‌లో ఓ ఖరీదైన ఇంటిని కొన్నారు. ఇది ఫెరా చట్టాల్ని ఉల్లంఘించి జరిపిన కొనుగోలు. 1986లో బోఫోర్స్ కాంట్రాక్టుపై సంతకాలు జరిగిన పది రోజులలోపే అజితాబ్ ఆ ఇంటిని కొనడం గమనించదగ్గ అంశం. అజితాబ్‌ను ప్రోసిక్యూట్ చేయాలని కోరారు వి.పి.సింగ్. ఇలా అజితాబ్ ప్రోసిక్యూషన్ గురించి అడిగిన 20 గంటలలోనే వి.పి.సింగ్‌పై కాంగ్రెస్ బహిష్కరణాస్త్రాన్ని సంధించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ ఆయనను పార్టీ నుండి బయటకు పంపించారు. ఇదంతా ఏ సారాంశాన్ని విడమరిచి చెబుతోంది? మన దేశంలో రూపొందించుకున్న చట్టాల్నే ఉల్లంఘించిన వ్యక్తిని రక్షించేందుకు మన ప్రధాని ప్రయత్నించిన తీరు ఇందులో బయటపడటం లేదూ?

జర్మనీ నుండి కొనుగోలు చేయాలనుకున్న హెచ్.డి.డబ్ల్యు జలాంతర్గాములది మరో కథ. దీనికి సంబంధించిన తొలి ఒప్పందం 1981లో జరిగింది. అప్పుడు ప్రధాని పదవిలో ఉన్నారు శ్రీమతి ఇందిరాగాంధీ. రక్షణశాఖ వ్యవహారాలు కూడా

ఆమె అధీనంలోనే ఉండేవి. 1986లో మరో రెండు జలాంతర్గాముల్ని కొనుగోలు చేయాలని సంకల్పించారు. ఈ మేరకు జలాంతర్గాముల ఖరీదులో తగ్గింపును సంపాదించాల్సిందిగా జర్మనీలో ఉన్న భారత రాయబారికి ఆజ్ఞలు వెళ్ళాయి. అప్పుడు హెచ్.డి.డబ్ల్యు సంస్థ యాజమాన్యం తాము ఇదివరకే 7 శాతం కమీషన్ చెల్లించామని చెప్పింది (అంటే ఇందిరా గాంధీ, ఆమె పార్టీకి చెందినవారికి కమీషన్ చెల్లింపులు జరిగాయన్న మాట). ఇప్పుడు కూడా అదే మొత్తం కమీషన్ పాత వారికే ఇవ్వాలి కనుక ధరల్లో తగ్గింపు సాధ్యం కాదని హెచ్.డి.డబ్ల్యు యాజమాన్యం స్పష్టం చేసింది. రక్షణమంత్రి విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ యావత్తు వ్యవహారంపై విచారణ జరిపించాలని అనుకున్నారు. ఆయన తన ఉద్దేశ్యాన్ని పత్రికల వారికి తెలిపారు. దీనితో రాజీవ్ బృందం కొత్త ప్రచారాన్ని ఆరంభించింది. విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ రాజీవ్ పదవికి ముప్పు తెచ్చే, కుట్రదారుగా అభివర్ణించింది. దీనితో వి.పి.సింగ్ మంత్రివర్గం నుండి నిష్క్రమించారు. 1981లో మొట్టమొదటిసారి హెచ్,డి.డబ్ల్యు జలాంతర్గాముల ఒప్పందం జరిగిన మాట వాస్తవమే. అప్పుడు రక్షణ శాఖ బాధ్యతల్ని ప్రధాని ఇందిరాగాంధీ చేపట్టిన మాట కూడా నిజమే. అయితే జలాంతర్గాముల కొనుగోలుపై అసలు సిసలు వ్యవహారాలు సంజయ్‌గాంధీ హయాంలోనే మొదలయ్యాయి. ఈ విషయమై 1980లోనే జోక్యం చేసుకున్నారు సంజయ్. హిందూజా కుటుంబానికి చెందిన వారికి ఏడు శాతం కమీషన్ ముట్టిందని భావిస్తున్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు హెచ్.డి.డబ్ల్యు. సంస్థను కొమ్ము కాసేందుకు జరిపిన ప్రయత్నాలు కన్పిస్తాయి. ఎన్.కె.సింగ్ 1990లో (అంటే విశ్వనాథ ప్రతాప్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు) తిరిగి సిబిఐ డైరెక్టరయ్యారు. ఆయన హెచ్,డి.డబ్ల్యు. జలాంతర్గాముల కుంభకోణంపై తిరిగి విచారణను ఆరంభించారు. అయినా చిట్ట చివరకు ఎలాంటి ప్రయోజనం దక్కలేదు. భారతదేశపు ప్రజాస్వామ్య రాజాగారి ఆగ్రహావేశాల్ని సింగ్ ద్వయం చవిచూడాల్సి వచ్చింది.

రాజీవ్‌గాంధీ హయాంలో జరిగిన కుంభకోణాల్లో కెల్లా తలమానికమైంది బోఫోర్స్. బోఫోర్స్ శతఘ్నుల కొనుగోళ్ళపై ప్రశ్నల వర్షం కురిసింది. దీనిమీద ఒకసారి అర్ధ సత్యాల్ని చెబుతూ తప్పించుకున్న రాజీవ్‌గాంధీ మరికొన్నిసార్లు అసత్యాల్ని సైతం వల్లె వేశారు. ప్రపంచంలోని ఏ దేశ ప్రజా జీవితంలోని నాయకుడు కూడా ఇలా మాటి మాటికీ మాట మార్చి ఉండరు. బోఫోర్స్ శతఘ్నుల్ని సైనిక దళాలు





ఎంపిక చేయలేదు. అవి ఫ్రింట్ శతఘ్నుల వైపు మొగ్గు చూపాయి. ఇంతలోనే క్వత్రోచీ, మేరియాలు రంగంలోకి దిగారు. వీళ్ళిద్దరూ సోనియాగాంధీకి సన్నిహితులు. కుటుంబ మిత్రులు. ప్రతివారం సోనియా, రాజీవ్‌ల దర్శనం చేసుకునేవారు. క్వత్రోచీ బోఫోర్స్ కాంట్రాక్టుల్ని సంపాదించేందుకు ముందుకు వచ్చారు. దీనిలో మూడుశాతం మేర కమీషన్‌లు చోటు చేసుకున్నాయి. ఇదంతా 1986 మార్చి 31కి ముందునాటి సంగతి. బోఫోర్స్ అంశాల్ని సమర్థవంతంగా బయటపెట్టిన ఎస్.గురుమూర్తి మాటల్ని ఇక్కడ ఉటంకించక తప్పదు. రాజీవ్ గాంధీ సర్కారులో శతఘ్నుల కొనుగోలుకు సంబంధించిన నిర్ణాయకకమిటీ జూన్ 1984 – ఫిబ్రవరి 1986ల మధ్య 17 సార్లు సమావేశమైంది. ఈ నేపథ్యంలో కమిటీ బోఫోర్స్ కన్నా ఫ్రాన్స్‌కు చెందిన “సోఫ్మా” SOFMA శతఘ్నుల్ని కొనడమే మేలని నిర్ణయించింది. ఇంతలోనే కమిటీకి తన నిర్ణయం పనికి రానిది అయిపోయింది! కమిటీ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. 1986 మార్చి 17వ తేదీనాడు బోఫోర్స్ శతఘ్నుల్ని కొనగోలు చేయాలని కమిటీ నిర్ణయించింది. (ఇదీ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కొంతమంది అధికారుల తీరు! కాస్త వంగమంటే చాలు ఏకంగా నేలమీద పడిపోయే తత్వం వీళ్ళది). “రాజీవ్‌గాంధీ 1987 మార్చి 15, 16 తేదీల్లో స్వీడన్ వెళ్ళారు. శతఘ్నుల కంట్రాక్టును బోఫోర్సు కంపెనీకే అందేలా చేస్తానని ఆయన స్వీడిష్ ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. మరో మూడు రోజుల్లోనే పదకొండు మంది అధికారుల సంతకాలు పూర్తయ్యాయి. రాబర్టో రాజీవ్ కూడా సంతకం చేశారు. బోఫోర్సు సంస్థకు కాంట్రాక్టు దక్కింది. క్వత్రోచీ డెడ్‌లైన్ కోసం గ్యారంటీ ఇచ్చిన పదిరోజుల ముందే ఇదంతా అయిపోయింది. అటు తర్వాత స్వీడిష్ సర్కారు వారి రేడియో బోఫోర్స్ ముడుపుల వార్తను బయట పెట్టింది. బోఫోర్స్ సంస్థ స్విస్ బ్యాంకుల ద్వారా సీనియర్ భారత రాజకీయ నాయకులకు ముడుపులు అందించినట్టు స్వీడిష్ రేడియో వార్త సారాంశం. క్వత్రోచీతో పాటు విన్‌చద్దావంటి వారికి కూడా ముడుపుల చెల్లింపులు జరిగాయి. బోఫోర్స్ పై చర్చలు జరుగుతున్నప్పుడు ఢిల్లీలోని స్వీడన్ రాయబార కార్యాలయలోని ఉన్నత స్థాయి దౌత్యాధికారి తన ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. “బోఫోర్స్ చర్చలు జరిగే నేపథ్యంలో రాజీవ్‌గాంధీ పేరు ఖచ్చితంగా ప్రస్తావనకు రావాలన్న ఖచ్చితమైన షరతు ఉండాలని” ఆ అధికారి కోరుకున్నారు. ఆ కాలంలో ఏజా (బోఫోర్స్ కుంభకోణంతో రాజీవ్‌గాంధీకి గల సంబంధాల్ని

తెలియజేస్తూ పుస్తకాన్ని రాసిన మాజీ దౌత్యాధికారి) స్వీడన్‌లో భారత రాయబారిగా ఉండే వారు. బోఫోర్స్ వ్యవహారంలో ఎలాంటి విచారణలు జరపరాదని కోరుతూ భారత ప్రధానమంత్రి కార్యాలయం ఆయనకు ఆదేశాలు జారీ చేసింది! విన్‌చద్దా, క్వత్రోచీలు స్విట్జర్లాండ్ వైపు పరుగులు తీశారు. స్విస్ బ్యాంకు ఖాతాల మతలబుల్ని తెలియజేసే పత్రాలు భారతదేశానికి చేరనివ్వకూడదన్నదే వాళ్ళ లక్ష్యం. అయితే దీనిలో వాళ్ళు విఫలులయ్యారు. క్వత్రోచీకి కాంగ్రెస్ సర్కారు చక్కగా సహాయం చేసింది. ఆయన ఒక నేరస్థుడి స్థాయిలో తప్పించుకు పారిపోయారు. స్విస్ న్యాయస్థానాలు భారతదేశానికి అందించిన పత్రాలు సంచలన సత్యాల్ని బయటపెట్టాయి. సోనియా మైనో కుటుంబ స్నేహితుడైన క్వత్రోచీకి భారీ ముడుపులు అందాయని తేట తెల్లమైపోయింది. క్వత్రోచీ తప్పించుకోవడానికి అన్ని రకాలైన సదుపాయాలు ఏర్పడ్డాయి. క్వత్రోచీ కుంభకోణ పరాక్రమాలపై రాజీవ్‌గాంధీ సర్కారు ఎన్నో ఆరోపణల్ని ఎదుర్కొన్నది. చిట్టచివరకు ఒత్తిడికి తల ఒగ్గిన రాజీవ్‌గాంధీ సర్కారు ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని (జె.పి.సి.) నియమించింది. ఈ సంఘంలో ఎక్కువ మంది కాంగ్రెస్ పార్టీకి చెందినవారే. రాజీవ్ ఆయన సతీమణి, వారి కుటుంబానికి మిత్రుడైన క్వత్రోచీల పేర్లు సంయుక్త పార్లమెంటరీ సంఘం నివేదికలో ప్రస్తావనకు రాకుండా సకల జాగ్రత్తలు తీసుకున్నారు! బోఫోర్సు అధికారుల తాలూకు డైరీల్లో రాజీవ్‌గాంధీ ప్రస్తావన స్పష్టంగా కన్పిస్తుంది. బోఫోర్సు కుంభకోణంలో రాజీవ్, సోనియాలకు ముడుపుల మొత్తాలు అందాయన్నదాన్ని బలపరిచే ఋజువులు ఇంత దాకా కన్పించలేదు. అయితే బోఫోర్సు కుంభకోణంలో చిక్కుకుని ఉక్కిరి బిక్కిరై పోతున్న తన బంధుమిత్ర గణాన్ని రక్షించేందుకు రాజీవ్‌గాంధీ శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశారన్నది మాత్రం నిజం. ఒకవేళ మలేషియాలో ఆశ్రయం పొందుతున్న క్వత్రోచీని పట్టుకొని వచ్చి, సిబిఐతో విచారణ జరపితే మరెన్నో ఆసక్తికరమైన నిజాలు బయటపడే అవకాశం ఉంటుంది.

రాజీవ్‌గాంధీ లేనంత మాత్రాన ఆయన కుటుంబం తాలూకు అవినీతి అంతరించిందని అనుకోలేము. రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ (ఆర్.జి.ఎఫ్) కు శ్రీమతి సోనియమైనోగాంధీ జీవితకాలపు ఛైర్మన్. ఆమె కుమారుడు, కూతురు రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ ట్రస్టీలు. ఫౌండేషన్‌కు అవసరమైన కార్పస్ ఫండ్‌లో అత్యధిక మొత్తాలు భారత ప్రభుత్వం, ప్రభుత్వ కంపెనీల నుండే నేరుగా అందాయి. కాంగ్రెస్ పార్టీ





భవన నిర్మాణం కోసం తొలుత కేటాయించిన స్థలాన్ని రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కి అందించారు. సోనియాగాంధీ ఆమె సంతానం సకల సౌకర్యాలతో కూడిన భవనాల్లో ఉంటున్నారు. సోనియా కుమార్తె ప్రియాంక వివాహితురాలు. ఆమె భర్త బాగానే సంపాదించుకుంటున్న వ్యాపారవేత్త. అయినా వాళ్ళకు మార్కెట్ అద్దె కన్నా తక్కువ మొత్తానికి ప్రభుత్వ భవనాన్ని కేటాయించడం జరిగింది.

రాజీవ్‌గాంధీని వివాహం చేసుకున్న తర్వాత పదిహేనేళ్ళ పాటు భారత పౌరసత్వాన్ని తీసుకోలేదు సోనియా. మారుతి కంపెనీలో డైరెక్టర్ పదవిని స్వీకరించి ఫెరా నిబంధనల్ని ఉల్లంఘించారామె. భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలపై ఆరాధనతో, ఈ దేశానికి సేవ చేయాలని వచ్చారు విదేశీ వనితలైన సిస్టర్ నివేదిత, డాక్టర్ అనీబిసెంట్. అయితే సోనియా మైనోగాంధీ మాత్రం రాజీవ్ వివాహం జరిగిన తర్వాతనే భారత గడ్డపై అడుగుపెట్టారు. ఆమె గత ముప్ఫై ఏళ్ళుగా సామాజిక సేవా రంగాల్లో పాల్గొన్న దాఖలాలు కన్పించవు. ఆమె ఏదైనా కొద్దో గొప్పో కార్యక్రమాలు నిర్వహించారంటే, అవి అన్నీ కూడా తన భర్త రాజీవ్‌గాంధీ స్మృతుల చుట్టూ అల్లుకున్నవే. ప్రస్తుతం సోనియా ఎన్నికల రంగంలో ఉన్నారు. ఆమెకు భారత ప్రధాని పదవిని చేపట్టాలనే ఆకాంక్ష ఉంది. అందుకే ఇదివరలో తనకు 272 మంది లోక్‌సభ సభ్యుల మద్దతు ఉందని చెప్పుకున్నారు సోనియా. ఆమె చదువుతున్న ఉపన్యాసాల్లో తన కుటుంబం చేసిన త్యాగాల్ని గురించిన విషయాలే విన్పిస్తున్నాయి. భారత రాజకీయాల్లో వాళ్ళ వంశీయులు చొప్పించిన బంధుప్రీతి, అవినీతి ప్రజలకు బాగా తెలుసు. నాలుగు తరాలుగా ఆ కుటుంబీకులు అనుభవిస్తున్న సుఖ సౌకర్యాల సంగతి కూడా ప్రజలకు తెలియనిది కాదు.

**ఇనుము విరిగెనేని యిమ్మారు ముమ్మారు**
**కాచి యతుకనేర్చు కమ్మరీడు**
**మనసు విరిగెనేని మరి యంట నేర్చునా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# పదమూడో లోక్‌సభ ఎన్నికలు - ఎన్నికల సంఘం

**అక్టోబర్ 26 - 31 , 1999**

ఈ ఎన్నికల సమరంలో దేశంలోని రాజకీయ పార్టీలన్నీ దేశం ఎదుర్కొంటున్న సమస్యల్ని గురించి ప్రస్తావించనే లేదు. వాటన్నింటికీ దూరంగా ఉన్నాయి. నిజానికి ఇప్పటివరకు జరిగిన ప్రతి లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వంలోనూ ఇదే వరుస కన్పించింది. దేశంలో ఎన్నెన్నో భయంకరమైన సమస్యలున్నాయి. నిరక్షరాస్యత ఉంది. నీటి పారుదల సౌకర్యాలు కావల్సినంతగా లేవు. హైవే, ఓడరేవులు, రైల్వే, విద్యుచ్ఛక్తి, టెలికమ్యూనికేషన్ల వంటి మౌలిక సదుపాయాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. నిరుద్యోగం, శాంతి భద్రతలు, భారతదేశంలోకి చొచ్చుకుని వచ్చిన రెండు కోట్లమంది బంగ్లా ముస్లింలు, పెరిగిపోతున్న ఇంటర్ సర్వీసెస్ ఇంటలిజెన్స్ (ఐ.ఎస్.ఐ) అది సృష్టిస్తున్న అలజడులు..... ఇలా సమస్యలెన్నో, అంతేకాదు...ఈ రోజు ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ వైపు పరుగులు తీస్తోంది. ఈ నేపథ్యంలో భారత బలహీనతలు బయటపడుతున్నాయి. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని రాజకీయ పార్టీలు వీటిలో కొన్నింటినైనా తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చాల్సింది. గంగా కావేరి జలాల అనుసంధానం, నీటి పారుదల వనరుల పెంపుదల, జాతీయ మరియు రాష్ట్ర రవాణా అభివృద్ధి, ప్రమాదాల నివారణ కోసం రైల్వేల్లో ఎలక్ట్రానిక్ సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగుదల, ఫైబర్ ఆధారిత టెలికమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటు, అటవీ ప్రాంత పెరుగుదల కోసం మొక్కల పెంపకం, నిరక్షరాస్యతా నిర్మూలన, నిరుద్యోగ యువతను ఈ కార్యక్రమానికి వినియోగించడం, ఉపాధి కల్పనా అవకాశాలు ఏర్పర్చడం వంటి పలు అంశాల్ని రాజకీయ పార్టీల ప్రణాళికల్లో చేర్చితే బాగుండేది. అయితే ఇలాంటి కీలక అంశాలేవీ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రణాళికల్లో లేనేలేవు. ఇలాంటి కీలకాంశాలు, సమస్యలు ఎన్నికల అంశాలుగా మారలేదు. దీనికి ప్రధాన కారణం ఇటలీలో జన్మించిన సోనియా మోనియో. తన భర్త రాజీవ్‌గాంధీకి సంబంధించిన బోఫోర్స్ కుంభకోణం ముడుపుల వ్యవహారం బయటపడకుండా ఉండేందుకు, రాజీవ్ మిత్రుడైన ఖత్రోచీ నేరాలు లోలోపలే చెల్లుబాటు అయ్యే లక్ష్యంతోనూ సోనియా ప్రధాని పదవిని చేజిక్కించుకోవాలని ఆశ పడ్డారు. ఆమె





రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌ను నిర్వహిస్తున్నారు. "ఇందిరాగాంధీ కళావిషయాలు జాతీయ కేంద్రాన్ని కూడా సోనియా నిర్వహిస్తున్నారట. ఈ సంస్థలకు భారీ మొత్తంలో గ్రాంటులు, విరాళాలు అందుతుంటాయి. ఇదివరలో ప్రభుత్వ రంగసంస్థలు, భారత ప్రభుత్వం తరుపున కూడా ఈ సంస్థలకు నిధులు ముట్టాయి. సదరు నిధుల్ని ఎలా వెచ్చించారో వాటి మతలబులేమిటో తెలియదు.

రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ వ్యవహారాలు ఈ ఎన్నికల్లో చర్చనీయాంశాలు కాలేకపోయాయి. చివరకు సోనియా ఎన్నికల రణరంగంలోకి దిగారు. ఆమె ఓటర్ల ముందు తన వైధవ్యం గురించి దీనంగా చెప్పుకున్నారు. రాజీవ్, ఇందిరాగాంధీల మరణాల్ని గురించి చెప్పుకున్నారు. తరచుగా మహాత్మాగాంధీ పేరును ప్రస్తావించారు.

గతంలో కమ్యూనిస్టు పార్టీలు తమ కార్యక్రమాల్ని వివరించేవి. పేదరికం విదేశాంగ విధానం వంటి విషయాల్ని గురించి ప్రస్తావించేవి. ప్రస్తుతం మార్క్సిస్టు పార్టీకి ఇద్దరు కురువృద్ధులున్నారు. ఒకరు జ్యోతిబసు, మరొకరు హరికిషన్‌సింగ్ సూర్జిత్. వీరిలో జ్యోతిబసు ప్రధాని కావాలన్నది సుర్జిత్ ఆశ. లేదా రాజకీయాల్లో ఏ మాత్రం అనుభవంలోని సోనియాగాంధీ ప్రధాని పదవిపై కూర్చోబెట్టి తాను బాధ్యత లేని అధికారంతో చక్రం తిప్పాలన్నది సూర్జిత్ ఆశ. అక్కడొక ఆసక్తికరమైన నిజాన్ని ప్రస్తావించాలి. ఇప్పటిదాకా ఏ కమ్యూనిస్టు నేతా స్వచ్ఛందంగా తన పదవిని విడిచి పెట్టలేదు. స్టాలిన్, బ్రజ్నేవ్, ఆంద్రోపోవ్, చెర్నెంకో (వీరంతా సోవియట్ పరిపాలకులుగా ఉన్నారు) కిమ్ సంగ్ (ఉత్తర కొరియా), మావోటేసుంగ్, చీఎన్‌లై, హోచిమన్ ఇలా కమ్యూనిస్టు నేతలంతా అధికార పీఠంపైనే మరణించారు. తమ వృద్ధాప్య దశదాకా పదవుల్ని అంటి పెట్టుకున్నారు. ప్రస్తుతం క్యూబా పాలకుడు ఫెడల్ కాస్ట్రో కూడా తన కమ్యూనిస్టు సోదరుల మార్గంలోనే పయనిస్తున్నారు. భారత కమ్యూనిస్టులు నిర్లజ్జాకరమైన రీతిలో వ్యవహరిస్తున్నారు. వీళ్ళు కేరళలో కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తారు. అదే నోటితో తమిళనాడులో వాళ్లను సమర్థిస్తారు. బీహార్‌లో కాంగ్రెస్ వెన్నుకాస్తారు, ఆ రాష్ట్ర సరిహద్దుల్లోనే పశ్చిమబెంగాల్‌లో మాత్రం కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తారు. వీళ్ళ సంగతులన్నీ అర్థమవుతూనే ఉన్నాయి. దేశంలోనే అత్యంత అవినీతి పరులుగా పేరు తెచ్చుకున్న జయలలిత, లాలూప్రసాద్ యాదవ్‌లతో చెట్టాపట్టాలు వేసుకుంటారు కమ్యూనిస్టులు. ముస్లింలీగ్‌లోని కొన్ని వర్గాలతో చెలిమికి వెనుకాడని ఘనులు కమ్యూనిస్టులు. గతంలో సోవియట్ పరిపాలకులు కూడా

అవినీతి ఊబిలో నిలువునా కూరుకుపోయారు. ఇదే భారతీయ కమ్యూనిస్టులకు కూడా అలవాటుగా మారింది. ఇక్కడ మనం మరో అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కేరళలో వందశాతం అక్షరాస్యత నమోదైంది. ఇక్కడి రాజకీయ వేదికపై రెండు ఫ్రంట్‌లు ఉన్నాయి. ఒకటి కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోని లెఫ్ట్‌ఫ్రంట్. మరొకటి కాంగ్రెస్ సారధ్యంలోని యునైటెడ్ ఫ్రంట్. అయితే ఉభయ ఫ్రంటుల్లో ఏదీ రెండో పర్యాయం విజయాన్ని సాధించిన దాఖలాలు లేవు. రాష్ట్రంలోని ఓటర్లు ప్రతి ఎన్నికలోనూ అధికార ఫ్రంట్‌కు గుణపాఠాలు నేర్పుతూనే ఉన్నారు. పశ్చిమబెంగాల్‌లో అక్షరాస్యతా వ్యాప్తిని పెంచడంలో అక్కడి వామపక్ష ప్రభుత్వం విఫలమైంది. నిరక్షరాస్యులైన బెంగాలీలకు బంగ్లాదేశీ చొరబాటు దారులు తోడయ్యారు. ఇది వామపక్షాల ఓటు బ్యాంకుగా తయారైంది. కమ్యూనిస్టు పార్టీ భాగ్యరేఖలు అక్షరాస్యతలో నిర్ధారితమవుతాయని కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు నిరూపిస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కులతత్వ సమాజ్‌వాది, బహుజన్ సమాజ్ పార్టీలు విస్తరిస్తున్నాయి. ఈ పార్టీల తీరు ఆందోళన కలిగించేలా ఉంటోంది. వీరు తమదైన విభజన ధోరణితో ముస్లింల మద్దతుకోసం తాపత్రయ పడుతున్నారు. వేర్పాటువాద ముస్లిం వర్గాలు, సమాజ్‌వాది, బహుజన్ సమాజ్ పార్టీల వైఖరి దేశ ప్రయోజనాలకు పూర్తి భిన్నంగా ఉంది. బి.ఎస్.పి, సమాజ్‌వాది పార్టీల్లో కులపరమైన ఉన్మాద వైఖరి కన్పిస్తోంది. ముస్లిం వేర్పాటువాద వర్గాల్లో ఒకనాటి ముస్లింలీగ్ ఆలోచనా రీతి గోచరిస్తోంది. ముస్లింలీగ్‌లో ఉన్న హిందుత్వ ద్వేషం, ద్విజాతి సిద్ధాంత భావన, మతపరమైన అసహనం ఈ ముస్లిం వేర్పాటు వర్గాల్లో కన్పిస్తోంది. హిందుత్వ వ్యతిరేకతతో ఏ పార్టీ ఒక్కస్థానాన్ని సైతం గెల్చుకోలేదన్న సంగతిని వీరు గుర్తించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. వీళ్లు జాతీయవాద పార్టీల అవకాశాన్ని దెబ్బతీసేందుకు సాధనాలుగా మారుతున్నారు. భారతదేశంలో అస్థిర పరిస్థితులు ఏర్పడటానికి తమ వంతు పని చేస్తున్నారు. యావత్ భారత దేశానికి పనికి వచ్చే ఎజెండా వీళ్ళ దగ్గర లేదు. ఈ నేపథ్యంలో వీరు పోషించే పాత్ర నిర్మాణ రహితంగానే ఉంటుంది. అవరోధాత్మకంగా ఉంటుంది.

లోక్‌సభ ఎన్నికలు ఎంతో వ్యయంతో కూడినవిగా పరిణమించాయి. ప్రభుత్వ పరంగా ఎన్నికల ఖర్చు రోజు రోజుకూ పెరుగుతోంది. 1967లో ఎన్నికల వ్యయం కేవలం 11 కోట్లు. ఇది 1984 నాటికి 84 కోట్ల రూపాయలు చేరుకుంది. 1989





వచ్చేసరికి 154 కోట్లకు ఎగబ్రాకింది. క్రమేపీ 1998 ఎన్నికల్లో ప్రభుత్వ పరంగా జరిగిన ఖర్చు 626 కోట్ల రూపాయల దాకా వచ్చింది. ఈ ఎన్నికల ఖర్చు 800 కోట్ల రూపాయలుగా ఉంటుందని ఒక అంచనా. ఇదిలా ఉంటే ఈ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు చేసే వ్యయాన్ని కలిపితే అది 4000 కోట్ల రూపాయలకు చేరుకున్నది. అంటే ప్రభుత్వానికీ, రాజకీయ పక్షాలకూ కలిపితే 5000 కోట్ల రూపాయల వరకు ఖర్చు అవుతుందని లెక్క తేల్చవచ్చు. దేశంలో అర్థాంతరంగా జరిగిన (1971, 1980, 1991, 1998, 1999) ప్రతి లోక్‌సభ ఎన్నికకూ కాంగ్రెస్‌దే బాధ్యత. ఇలా ఎన్నికల్లో పార్టీలు, వాటి ప్రతినిధులైన అభ్యర్థులు వెచ్చిస్తున్న డబ్బు లెక్కలోకి రాని పద్దుకిందే చెప్పుకోవాలి. మరో మాటలో చెప్పాలంటే ఇదంతా “నల్లధనం”. దీన్ని ప్రతి ఎన్నికల్లోనూ పెంచుకోవడం జరుగుతోంది. నల్లధనాన్ని వెలికితెచ్చి దాన్ని సక్రమ మార్గంలో మళ్ళించేందుకు అవసరమైన చర్యల గురించి ఏ రాజకీయ పార్టీ ప్రస్తావించడం లేదు. రేడియో, టి.వి.ఛానెళ్ళతో ప్రచార చేయడం వల్ల, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్ని వినియోగించడంతోనూ, సమాచార సాంకేతికత ఆధారంగా ఓట్ల రిజిస్ట్రేషన్ జరపడంతోనూ ఎన్నికల వ్యయాన్ని గణనీయంగా అంటే 80 శాతం దాకా తగ్గించవచ్చు. దేశంలో రక్షణ వ్యవస్థ పటిష్ఠత కోసం తక్కువ మొత్తాన్నే ఖర్చు చేయడం జరుగుతోంది. దేశానికి అవసరమైన పలు రకాలైన క్షిపణుల పరిశోధన అభివృద్ధి కోసం స్వల్ప వ్యయమే అవుతోంది. పాకిస్తానీ జాతీయుల ఐ.ఎస్.ఐ ఏజెంట్ల ఏరివేతలపై మరింత కఠినమైన దృక్పథాన్ని అవలంబించాల్సి ఉంది. ఇలాంటి అంశాలపై ఎన్నికల రణ రంగంలో దిగిన ఏ రాజకీయపక్షం చర్చించనేలేదు.

సోనియా వంశ పారంపర్య పాలనకు అలవాటు పడిన వంశానికి చెందినవారు. ఆమె కుటుంబానికి కుంభకోణాలతో సంబంధం ఉంది. ఆమె ఎలాగైనా సరే అధికారాన్ని అంది పుచ్చుకోవాలని తహతహలాడారు. ఆమె అధికార తృష్ణ పుణ్యమా అని అర్థాంతరంగా 13వ లోక్‌సభ ఎన్నికలు వచ్చి పడ్డాయి. ఎన్నికలు ముగిశాయి. ఈ దశలో సురాజ్యం కోసం, దేశ శత్రువుల ఏరివేత కొరకు ప్రయత్నాలు ఆరంభించాల్సి ఉంది. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్.డి.ఎ) అధికారంలోకి వచ్చిన తర్వాత వంశ పారంపర్య పాలకులు పాల్పడిన కుంభకోణాలు, పోగు చేసుకున్న ఆస్తులపై విచారణ జరపాలి. వంశ పారంపర్య పాలకులు తమ అధికార

సాధన కోసం పాల్పడిన అక్రమాల్ని బహిర్గతం చేయాలి. ఈ క్రమంలో రాజీవ్‌గాంధీ ఫౌండేషన్, ఇందిరాగాంధీ కళా విషయాల జాతీయ సంస్థల్ని తక్షణం జాతీయం చేయాలి. గతంలో మారుతి కంపెనీని జాతీయం చేసినట్టే ఈ సంస్థల్ని కూడా చేయాల్సి ఉంటుంది. వంశ పారంపర్య వాదులు తమ పబ్బం గడుపుకోవడానికి మహాత్మాగాంధీ పేరును ఉపయోగించుకుంటున్న వైనం బయటపడాలి. అతి తక్కువ అద్దెతో ప్రభుత్వ భవనాల్లో ఉంటున్న వంశ పారంపర్య పాలకుల్ని గురించి సర్కారు తగు చర్యలు తీసుకోవాలి. వంశ పారంపర్య వాదులను యువరాజులుగానో, యువరాణి హోదాతోనో చూడాల్సిన అవసరం లేదు. అవినీతి అంశంపై జాతీయ ప్రజాస్వామ్య కూటమి ఎంత చురుకుగా వ్యవహరిస్తే అంత మంచిది. దీనితో జాతీయ ప్రజాస్వామ్య కూటమి తన ప్రత్యేకతను చాటుకుంటుంది.

ఈ ఎన్నికల్లో ఎలక్షన్ కమీషన్ అయోమయాన్ని ప్రదర్శిస్తూ పోయింది. భారతీయ జనతాపార్టీని పడగొట్టిన ప్రతిపక్షాలు నిస్సిగ్గుతో ఎన్నికల కమీషన్ ముందుకు వెళ్ళాయి. వీలైనన్ని రోజులపాటు ఎన్నికల్ని వాయిదా వేయాలని కోరాయి. రాజ్యాంగంలో అనుమతించిన గరిష్ఠ పరిమితి ప్రకారం ఆమరునెలల తర్వాత ఎన్నికలు జరిపించాలని అన్నాయి. ఇంతవరకూ పలుమార్లు మధ్యంతర ఎన్నికలు జరగాయి. అయితే గతంలో జరిగిన ఏ మధ్యంతర ఎన్నికలకూ ఇంత వ్యవధి ఇవ్వడం జరగలేదు. ఆపద్ధర్మ ప్రభుత్వం అతి కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశాలు లేవు కనుక, ఎన్నికల ప్రక్రియ తొందరగా పూర్తయితే బాగుంటుందని కమీషన్ భావిస్తే సమంజసంగా ఉండేది. “నేషనల్ టెలికాం పాలసీ 99” పై ప్రతిపక్షాలు అనవసర వివాదాల్ని సృష్టించిన తీరు, దానికి ఎన్నికల కమీషన్ స్పందన తెల్సినవే.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వివిధ జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లు జరపకూడదని ఎన్నికల కమీషన్ ఆదేశించింది. ఇలా టెలికాన్ఫరెన్స్ నిషేధాన్ని విధించడం అనాలోచిత నిర్ణయమే. జిల్లాలో ఉన్న కలెక్టర్‌ను హైదరాబాద్ రప్పించి మరీ మాట్లాడటం మంచిదే కాని, అదే టెలికాన్ఫరెన్స్‌లో అయితే అది ముఖ్యమంత్రి పార్టీ ఎన్నికల విజయావకాశాల్ని ప్రభావితం చేస్తుందట! ఇలాంటి అభిప్రాయంలో ఏ ఔచిత్యం ఉంటుందో అంతుపట్టదు. ఎలక్ట్రానిక్ మీడియాలో పార్టీల ప్రకటనల్ని నిషేధించిన ఎన్నికల కమీషన్ తన అజ్ఞానాన్ని స్వయంగా ప్రకటించుకున్నది. అయితే





ఇదే తరహా ప్రకటనల్ని పత్రికల్లో మాత్రం వేయవచ్చునట! ఇలాంటి నిర్ణయాలు, విధాన వైఖరి ప్రపంచంలో మరెక్కడా కన్పించదు. గతంలో జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఈ అనుభవాలు ఎదురు కాలేదు.

ఎన్నికల తదనంతరం జరిపే ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల సంఘం నిషేధాన్ని విధించింది. ఎగ్జిట్‌పోల్ నిర్వహించిన ఒక సంస్థ ఈ నిషేధాన్ని ధిక్కరించింది. తాను జరిపిన ఎగ్జిట్‌పోల్ ఫలితాల్ని ప్రకటించింది. ఎన్నికల కమీషన్ విధించిన సదరు నిషేధం చెల్లనేరదని చెన్నై ఉన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. పట్టువదలని ఎన్నికల సంఘం అత్యున్నత న్యాయస్థానానికి అప్పీలు చేసుకుంది. అక్కడ కూడా కమీషన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికల కమీషన్ అప్పీలును సుప్రీంకోర్టు కొట్టివేసింది. యావత్తు వ్యవహారాలు ఎన్నికల సంఘం పని తీరును బయటపెట్టాయి. పలువైపుల నుండి విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల ప్రక్రియ నెల రోజులపాటు కొనసాగింది. ఇలాంటి సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియ 1952లోనే జరిగింది. అప్పటికి ఇప్పటి మాదిరి సమాచార ప్రసార సౌకర్యాలు లేవు. దేశంలో సాంకేతిక పురోగతి లేదు. అన్నీ ఉన్న ఈ రోజుల్లోనూ నెల రోజులపాటు ఎన్నికలు సాగడం కమీషన్ “సామర్థ్యాన్ని”కి గీటురాయిగా నిలుస్తోంది. సి.ఇ.సిని సెంట్రల్ ఎలక్షన్ కమీషన్ అని పేర్కొనడం కన్నా కాంగ్రెస్ ఎలక్షన్ కమీషన్ అంటేనే బాగుంటుందని ఒక రాజకీయ విశ్లేషకుడు వ్యాఖ్యానించారు. గతంలో ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్న టి.ఎన్.శేషన్ కొన్ని సందర్భాల్లో అతిగా వ్యవహరించి ఉండవచ్చు. అయితే ఆయన రాజకీయ పక్షాల్లో గుబులు పుట్టించిన మాట వాస్తవం. ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమీషనర్ ఆయన సహచరులు శేషన్‌కు సాటి కాలేకపోయారు. శేషన్ కాలం నాటి సామర్థ్యాన్ని చూపించలేకపోయారు. ఎన్నికల కమీషన్‌లో ఉన్న ఇద్దరు సీనియర్ సభ్యుల్లో ప్రజ్ఞ, హేతుబద్ధవైఖరి, ప్రభావశీలమైన దృక్పథం కన్పించలేదు. వీరిద్దరూ రాజకీయ పక్షాల వారి ఎత్తుగడల పర్యవసానంగా ఎన్నికల కమీషన్‌లో చేరారు. అందుకని పక్షపాత వైఖరితో ప్రవర్తిస్తారన్న అభిప్రాయం బలపడటంలో తప్పులేదు. వారి సామర్థ్యం, పని తీరు పక్షపాత ధోరణితో కూడుకున్నవి మాత్రమే కాదు, అంచనాలకు తక్కువగా ఉందని కూడా ప్రస్తుత పరిణామాలు తేట తెల్లం చేస్తున్నాయి. మొత్తం మీద ఎన్నికల కమీషన్‌లో వయసు మళ్ళినవారు, రిటైరైన ప్రముఖులు ఉండకూడదన్న సత్యం ఒక గుణపాఠంగా తెలిసి వచ్చింది. ఎన్నికల సంఘం సభ్యుల్ని

రాజకీయవేత్తల ద్వారా నియమించే సంప్రదాయం ఉండకూడదు. దీనికి కొత్త సంప్రదాయం ఏర్పడాలి. ప్రభుత్వ ఎన్నికల కమీషన్ కోసం కొంతమంది సభ్యుల పేర్లు ప్రకటించాలి. ఇవి ప్రతిపాదన స్థాయిలో ఉండాలి. ప్రజానీకం ప్రతిపాదిత సభ్యులపై తమకేమైనా అభ్యంతరాలుంటే వాటిని ప్రకటించే అవకాశం ఉండాలి. చివరికి వడపోతలో మిగిలిన సభ్యుల్ని సుప్రీంకోర్టు ధర్మాసనం పరీక్షించి అప్పుడు అత్యున్నత న్యాయస్థానం సిఫార్సు చేసిన వారినే రాష్ట్రపతి ఎన్నికల సంఘంలో సభ్యులుగా నియమించాలి.

దేశంలోని తూర్పు, ఉత్తర రాష్ట్రాల విషయంలో ఎన్నికల సంఘం తగు రీతిలో వ్యవహరించలేకపోతోంది. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘ కాలం పాటు సాగుతుంది. ఈ ప్రాంతాల్లోని రాష్ట్రాల్లో రీపోలింగ్, ఓట్ల లెక్కింపు చాలా రోజులవుతుంది. దక్షిణాది రాష్ట్రాలతో పోల్చితే ఇది సుధీర్ఘ కాలమే. ఎన్నికల ప్రక్రియ ఆరంభమైంది. సెప్టెంబర్ 5వ తేదీన ఇది పూర్తయ్యేసరికి అక్టోబర్ రెండవవారం ఆరంభమైంది. ఐదు వారాల పాటు బ్యాలెట్ బాక్సుల్ని భద్రంగా ఉంచడం ఇబ్బందులతో కూడుకున్నదే.

వచ్చే ఎన్నికల నాటికి సమాచార సాంకేతికతను చక్కగా ఉపయోగించాల్సిన అవకాశం ఉంది. దీనివల్ల ప్రభుత్వం చేసే ఎన్నికల ఖర్చు తగ్గుతుంది. పోటీ చేసే అభ్యర్థుల వ్యయం కూడా తగ్గుతుంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లను వాడటమే కాదు వీటిని కంప్యూటర్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయాలి. ఇంటర్‌నెట్‌ను ఉపయోగించుకోవాలి. ఎన్నికల్లో అత్యున్నత సమాచార సాంకేతికను ఉపయోగించేందుకు మూడు సంవత్సరాల కాల వ్యవధి సరిపోతుంది. అంటే అగామి సహస్రాబ్దిలో తొలి ఎన్నిక ఎలాక్ట్రానిక్ యంత్రాలతో జరగాలన్నమాట. అభ్యర్థుల ప్రచార పర్వం కూడా ఎలక్ట్రానిక్ సాంకేతిక మయంగానే ఉంటుంది.

**మేడిపండు చూడ మేలిమైయుండును**
**పొట్టవిప్పి చూడ పురుగులుండు;**
**బెరుకువాని మదిని బింక మీలాగురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**





# సోనియాగాంధీ కొత్త వ్యూహాలు

**నవంబర్ 15 - 21 , 1999**

సోనియాగాంధీ మన జనావళిని చట్టపరమైన అంశాల నుండి పక్కకు తప్పించే ప్రయత్నాలను చేయడం భారతీయుల్లో ఆలోచనాత్మకత ఉన్నవారు గమనిస్తూనే ఉన్నారు. ఆమె రాజకీయాల్లోకి వచ్చారు. దీనితో నెహ్రూ వంశానికి సంబంధించిన ఎన్నో అంశాలు బయటకు వచ్చాయి. ఈ నేపథ్యంలో నెహ్రూను అమితంగా ఆరాధించే వారు కూడా ఇబ్బందులు పడ్డారు. సోనియాగాంధీ కొన్ని సంస్థలకు సారథ్యం వహించారు – రాజీవ్‌గాంధీ ఫౌండేషన్, ఇందిరాగాంధీ నేషనల్ ఆర్ట్ సెంటర్, జలియన్‌వాలాబాగ్ ట్రస్ట్ వంటివి ఈ సంస్థల్లో కొన్ని. ఈ సంస్థలన్నింటికీ సోనియా జీవిత కాలపు ఛైర్‌పర్సన్. ఈ సంస్థల్లో ఆమె పిల్లలు, మరికొందరు విధేయులు సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సంస్థలకు పలు ప్రైవేటు కంపెనీలు, ప్రభుత్వ నిర్వహణలోని పలు సంస్థలూ, విభాగాలు లక్షల రూపాయల విరాళాల రూపంలో అందించాయి.

సోనియా ఆమె కుమారుడు వివాహమైన కుమార్తె నామ మాత్రమైన అద్దెతో ప్రభుత్వ భవనాల్లో ఉంటున్నారు. మొన్నటి 13వ లోక్‌సభ ఎన్నికల ప్రచార ఘట్టంలో తన కుటుంబ సభ్యులు దేశం కోసం చేసిన త్యాగాల్ని ఏకరువు పెట్టారు. ఈ క్రమంలో మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్, టంగుటూరి ప్రకాశం, రాజేంద్రప్రసాద్, రఫీ అహ్మద్ కిద్వాయి ఇలా కొన్ని వందల మంది జాతీయ నాయకులు చేసిన త్యాగాలు గాలిలో కొట్టుకుపోయాయి. గతంలో త్యాగాలు చేసినందు వల్ల ఈ జాతి జనులు కృతజ్ఞతా సూచకంగా తమ వంశ పారంపర్య పాలనను అంగీకరించాలన్న ధ్వని సోనియా మాటల్లో విన్పించింది. అధికారంలో ఉన్నప్పుడు ప్రాణాల్ని కోల్పోవడం అన్నది ప్రజా జీవితంలో ఒక అసాధారణ త్యాగంగా గుర్తించాలని సోనియా అంటున్నారు.

అమెరికా అధ్యక్షులుగా ఉన్న అబ్రహం లింకన్, కెనడి కూడా హత్యకు లోనయ్యారు. అయితే వారి కుటుంబ సభ్యులు దీన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోలేదు. ఈజిప్ట్‌లో 'సాదాద్' ఇజ్రాయిల్‌లో ఇష్ఠర్, రాబిన్ మొన్న ఆర్మేనియా ప్రధాని ఇలా ప్రపంచంలో నలుమూలలా ఎంతోమంది అధికార

పీఠాలపై ఉన్న సమయాల్లోనే హత్యకు లోనయ్యారు. వారిలో ఏ ఒక్కరి కుటుంబం కూడా ఈ మరణాల్ని తమ అధికార సాధనకు ఉపకరణాలుగా వాడుకోలేదు. అయితే సోనియా మాత్రం దీనికి ఒక సూత్రబద్ధతను ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. భారతీయులు వంశ పారం పర్యమైన పరిపాలనను ఆహ్వానించాలని కోరుకుంటున్నారు.

ఎందరో నాయకులు చరిత్రలో కన్పిస్తారు. వీరిలో వివిధ దేశాల అధ్యక్షులు, రాజనీతిజ్ఞులు కూడా ఉన్నారు. వారిని అయితే జీవిత కాలంలోనూ లేదా మరణానంతరమో విమర్శించే వారు లేరు. 'లెనిన్', 'స్టాలిన్', 'మావో' వంటి నాయకులను వారి జీవితకాలంలో దేవుళ్ళగా పూజించారు. అయితే వారు చనిపోయిన తర్వాత చేసిన ఘనకార్యాలు బయటపడ్డాయి. ఈ అకృత్యాలపై విస్తృతస్థాయిలో ప్రజానీకం యావత్తూ చర్చించింది. ఈ తరహా నాయకుల విగ్రహాలను కొన్నిచోట్ల తొలగించారు. 'స్టాలిన్ గ్రాడ్', 'లెనిన్ గ్రాడ్' వంటి నగరాల పేర్లను మార్చేశారు. వెనకటి పాలకుల ఆకృత్య వారసత్వాన్ని స్వీకరించేందుకు వారి తదనాంతర పాలకులు సిద్దంగా లేరు. అయితే సోనియాగాంధీ మాత్రం తన భర్త అవకతవకల్ని వేలెత్తి చూపకూడదని కోరుతున్నారు. స్వర్గీయ 'రాజీవ్‌గాంధీ' అవినీతి కృత్యాలను చట్టబద్ధమైన విచారణల ద్వారా వెలికి తీయరాదని భావిస్తున్నారు. రాజీవ్‌గాంధీ మెట్రిక్యులేట్ మాత్రమే. ఆయన యూనివర్సిటీ చదువును మధ్యలో నిలిపేసిన వ్యక్తి. పైలట్‌గా పని చేశారు. ఒక అసాధారణ స్థాయి నేతకు ఉండే లక్షణాలేవి ఆయనలో కన్పించలేవు. ఆయనను విమర్శించడం పెద్ద తప్పని అంటున్నారు సోనియా. రాజీవ్ కుంభకోణాలలో 'బోఫోర్స్' ఒక చిన్న అంశం మాత్రమే. ఆయన ఆరంభించిన పద్ధతుల్నీ ఆయన అనుచర గణం కూడా చక్కగా పాటించింది. ఆయన పార్టీకి చెందిన చిన్నస్థాయి నాయకులు కూడా వంశపారంపర్య పద్ధతుల్ని ఆరంభించారు. 'బోఫోర్స్' కుంభకోణాన్ని కప్పి పుచ్చేందుకు రాజీవ్‌గాంధీ సకల యత్నాలు చేశారు. దీనికి ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయి. ఇటాలియన్ 'కాత్రోచీ' ఆయన భార్య బోఫోర్స్ కుంభకోణంలో ప్రధాన పాత్రధారులు. వారు సోనియాగాంధీకి దగ్గరి మిత్రులు. ఇదంతా ఇలా ఉంటే తన భర్త రాజీవ్‌గాంధీపై ఏ భారతీయుడూ నేరాన్ని ఆపాదించలేడని సోనియా అంటున్నారు. తాను, రాజీవ్ నిర్దోషులమని తాను చెబుతున్న మాటల్ని భారత జనత అంగీకరించాలని, సోనియాగాంధీ అంటున్నారు. ఆమె విజ్ఞప్తి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకార యోగ్యం కాదు. ఇలాంటి విజ్ఞప్తుల్ని గతంలో ఏ నాగరిక సమాజంలోనూ





వినియుండలేదు. ఇలాగే అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న జయలలిత, లలూప్రసాద్ యాదవ్, పి.వి.నరసింహారావు, జార్ఖండ్ ముక్తి మోర్చ ఎంపిలు కూడా తామూ అన్నెం, పున్నెం ఎరుగని అమాయకులమని తమపై మోపిన కుంభకోణాలు రాజకీయమైనవని మొరపెట్టుకోవచ్చు. నిజంగా సోనియాగాంధీ అప్రజాస్వామిక ఫాసిస్ట్ ఆలోచనల వైపు వెలుతున్న తీరును చూస్తే... ఆమె తన పార్టీ కార్యకర్తలను ఉద్బోధించిన తీరు ఇదే తత్వాన్ని బయటపెడుతుంది. ఆమె తన పార్టీ కార్యకర్తలను వీధుల్లోకి రావల్సిందిగా పిలుపునిచ్చారు. రాజీవ్ దివ్యనామాన్ని సిబిఐ ఛార్జ్‌షీటులో ఉంచినందుకు నిరసనగా తమ నిరసన వ్యక్తం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఉద్బోధించారు సోనియా. ఇలా అయితే భవిష్యత్తులో లాలూ, జయ లాంటి వాళ్ళు కూడా తమ కార్యకర్తలను పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల ముందు ధర్నా చేయవలసిందిగా పిలుపునిస్తారు. చార్జిషీటులో నుండి వారి పేర్లు తొలగించని పక్షంలో వాళ్ళు కోర్టుల కార్యకలాపాలకు కూడా అడ్డు తగుల్తారు. ఈ మేరకు ఒకసారి సంజయ్‌గాంధి నాటి కథను గుర్తుకు తెచ్చుకోవాలి. ఇందిరాగాంధీ అధికారాన్ని కోల్పోయిన తర్వాత జనతా ప్రభుత్వం ఎమర్జెన్సీ అకృత్యాల విచారణకు కొన్ని కమీషన్‌లను వేసింది. ప్రత్యేక న్యాయస్థానాల్లో సంజయ్, ఇందిరల అధికార దుర్వినియోగాలపై విచారణ జరిగింది. విచారణను అడ్డుకునేందుకు, వేలమంది గూండాలు ప్రోగయ్యేవారు. బెదిరింపులు ఎదురయ్యేవి. బోఫోర్స్ కేసు కోర్టు విచారణకు వచ్చే వేళ అప్పటి సంజయ్‌గాంధీ ఉదంతమే పునరావృతం కాదనే నమ్మకమేమీ లేదు. సోనియా అత్తగారైన ఇందిరాగాంధీ తనకు తాను న్యాయ సమీక్షకు అతీతురాలిగా భావించుకునేవారు. తాను తిరిగి విజయాన్ని సాధించిన తీరును ఘనంగా చెప్పుకునే వారు. న్యాయస్థానాలు జడ్జీలకన్నా కూడా ప్రజలు గట్టి న్యాయమూర్తులని ఆమె అనేవారు. బోఫోర్స్ కేసులో క్రాస్ ఎగ్జామినేషన్ జరిగే దశలో సోనియాగాంధీ తన అత్తగారి సూత్రాన్ని పునర్వచించేందుకు వెనుకాదరు. తనను ప్రజలు ఎన్నుకున్నారు కనుక తాను తన భర్త నిర్దోషులమని ఆమె కొత్తగా వాదించవచ్చు. చరిత్ర, రాజనీతి శాస్త్రాన్ని చదువుకున్న వాళ్ళు ఇటలీ ఫాసిస్టుల్ని గుర్తుకు తెచ్చుకోవాలి. ఇటలీలో జన్మించిన సోనియాకు ఫాసిస్ట్ ప్రక్రియలు పరిచయమే. అందుకని ఆమె ఇందిరా, సంజయ్‌ల కన్నా చక్కగా ఈ విషయంలో వ్యవహరించగలరు!

భారతీయ జనతాపార్టీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం సోనియా ఆమె పార్టీ కార్యకర్తల ఒత్తిడికి లొంగి ఛార్జిషీటు నుండి రాజీవ్‌గాంధీ పేరును తప్పిస్తే అంతకన్నా పొరపాటు మరొకటుండదు. దానికి బదులుగా బిజెపి సహా జాతీయవాద పార్టీలు, వర్గాలు ఒక చోట సమావేశం కావాలి. సోనియాగాంధీ ఫాసిస్ట్ తరహా హెచ్చరికల్ని బయటపెట్టాలి. వంశపారంపర్య పాలనను రుద్దేందుకు జరిగిన ప్రయత్నాల్ని బయటపెట్టాలి. ఆ వంశపారంపర్య వాదుల్లో ఎవరూ ప్రధాని అయ్యేందుకుగానీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టడానికిగానీ అర్హులుకాదన్న సంగతిని తేటతెల్లం చేయించాలి.

**నీరము తప్తలోహమున నిల్చి యనామకమై నశించు నా**
**నీరమె ముత్యమట్లు నళినీదళసంస్థితమైతవచ్చు నా**
**నీరమె శుక్తిలోఁబడి మణిత్వముఁ గాంచు సమంచిత ప్రభం**
**బౌరుషవృత్తు లిట్లధము మధ్యమును త్తముఁగొల్చువారికి.**

**భావం:** కాలిన ఇనుముపై జలము బోసినచో పేరులేకుండ నశించును. ఆ నీరే తామరాకుపైబడి తళతళ ముత్యమువలె ప్రకాశించును, ఆ నీరే ముత్యపు చిప్పలోబడి రత్నరూపము నొందును, ఆ విధముగానే లోకంబున నథముని మధ్యముని ఉత్తముని సేవింపని వారి కధమమధ్యమోత్తమ గుణంబులు పట్టుబడును.

**అప్పు లేనివాడె యధిక సంపన్నుండు,**
**తప్పులేనివాడు ధరను లేడు;**
**గొప్ప లేనిబుద్ది కొంచెమైపోవురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**





# ప్రథమ ప్రధానిగా నెహ్రూ

**డిసెంబర్ 6 - 12, 1999**

సోషలిజం ముసుగుతో చాలాకాలం పాటు చెలామణీ అయిన కమ్యూనిజం తన మాతృభూమి రష్యాలో కుప్పకూలిపోయింది. తూర్పు యూరప్‌లో మట్టికొట్టుకొని పోయింది. చైనాలో సోషలిస్టు వ్యవహారాలన్నీ తన పద్ధతుల్ని మార్చుకున్నాయి. చైనాలో ప్రస్తుతం అమలవుతున్న పద్ధతులన్నీ స్వేచ్ఛా విపణికి, మార్కెట్ ఆర్థిక వ్యవస్థకూ దగ్గరగా ఉన్నాయి. ఏవో ఒకటి రెండు దేశాల్లో తమ ఏకపక్ష పెత్తనాన్ని నిలుపుకునే దిశలో కమ్యూనిస్టులు తంటాలు పడుతున్నారు. ఉత్తర వియత్నాం, క్యూబా దేశాల్లో మాత్రమే స్టాలిన్ తరహా కమ్యూనిజం అమలవుతోంది. ఈ దేశాల్లో కఠినమైన నియంతృత్వం సాగుతోంది. ఇదంతా శ్రామిక నియంతృత్వం పేరుతో నడుస్తోంది. కమ్యూనిస్టు సైద్ధాంతిక పిడివాదంతో కాలం వెళ్ళబుచ్చుతున్న ఈ రెండు దేశాల్లోనూ బీదరికం తాండవిస్తోంది. ఉత్తర కొరియా వాసులకు కనీసస్థాయి స్వాతంత్ర్యం సైతం కరువైపోయింది. అక్కడ ఆకలి కేకలు పెచ్చరిల్లుతున్నాయి. మనుషులు ఒకరినొకరు భక్షించే పరిస్థితులు ఏర్పడ్డాయి. పలు మాజీ కమ్యూనిస్టు దేశాలు తమ పాత సిద్ధాంతానికి ఏనాడో తిలోదకాలిచ్చాయి. అయితే మన దేశంలో కొంతమంది "వామపక్ష, ప్రజాస్వామ్య, అభ్యుదయవాద, సామ్యవాద, లౌకిక" మేధావులు మాత్రం సోషలిస్టు పద్ధతులపై ప్రశంసా గీతాన్ని పాడుతున్నారు. వీళ్ళు జవహర్‌లాల్ నెహ్రూ తదితర కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో తిష్ఠ వేసుకున్నారు. ఈ తరహా మేధావులు సరళీకరణ విధానాలకు బద్ధ వ్యతిరేకులు. ప్రతి అంశమూ ప్రభుత్వ నియంత్రణలోనే ఉండాలన్నది వీళ్ళ భావన. కమ్యూనిస్టు దేశాలు గతంలో ప్రభుత్వ నియంత్రణ భారీగా మారడం వల్ల కుప్పకూలిన సంగతులు బయట పడుతున్నాయి. మితిమీరిన సర్కారీ జోక్యం వల్ల అలసత్వం పెరిగిపోయింది. అసమర్థత, సోమరితనం రాజ్యం చేసింది. సహజ వనరులు దుర్వినియోగమయ్యాయి. గోర్బచేవ్, కృశ్చేవ్‌ల పరిపాలనా కాలంలోని వ్యవహారాలు ఈ పచ్చి నిజాల్ని తేటతెల్లం చేస్తున్నాయి. ప్రస్తుతం మన దేశం రెండవ దశ ఆర్థిక సంస్కరణల కోసం ముందుకు సాగే ప్రయత్నాలు చేస్తోంది. భీమా, బ్యాంకింగ్, టెలికమ్యూనికేషన్లు, విద్య, నగర ఆస్తుల వంటివి రెండవ దశ సంస్కరణల పరిధిలోకి వస్తాయి. ఈ దశ సంస్కరణలకు ప్రబల విరోధులుగా తయారవుతున్నారు భారతీయ కమ్యూనిస్టులు. భారతదేశ

బీదరిక నిర్మూలనకు ఏ మాత్రం సహకరించని సోషలిస్టు తరహాను ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టారు. ఆయన కుమార్తె ఇందిరాగాంధీ అదే విధానాల్ని అనుసరించారు. రాజకీయానుభవం పెద్దగా లేని రాజీవ్‌గాంధీ కూడా తాత, తల్లి మార్గాల్లోనే పయనించారు. అయితే నెహ్రూ సోషలిస్టు ఆలోచనలన్నీ దేశ భవితవ్యాన్ని భ్రష్టు పట్టిస్తాయని భావించిన రాజనీతిజ్ఞులు గతంలోనూ లేకపోలేదు. రాజాజీ, శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ, ఆచార్య ఎన్.జి.రంగా, మినూమసానీ వంటివారు ఇదివరలో నెహ్రూ పద్ధతుల్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఈ మధ్యే నేను ఒక పుస్తకాన్ని చదివాను. దీని రచయిత బ్రిగేడియర్ శర్మ. పుస్తకం పేరు "ఇండియా బెట్రేడ్ – ఎ రోల్ ఆఫ్ జవహర్‌లాల్ నెహ్రూ" (మోసపోయిన భారతం – నెహ్రూ పాత్ర అని దీనిని అనువదించవచ్చు). ఈ పుస్తకంలో నెహ్రూ సోషలిస్టు ఆలోచనల్లోని పలు అంకాల్ని విప్పిచూపడం జరిగింది. సింగపూర్ నవ నిర్మాత లిక్వానోయూనో, భారత పారిశ్రామికవేత్త జె.ఆర్.డి. టాటాలతో జరిపిన సంభాషణల్ని ఇందులో పొందుపర్చారు. టాటాలు సింగపూర్‌లో ఒక సాంకేతిక శిక్షణా సంస్థను స్థాపించారు. సింగపూర్‌కు సహకారాన్ని అందించడమే దీని వెనుక ఉన్న లక్ష్యం. బ్రిగేడియర్ శర్మ పుస్తకంలోని 227 – 233 పుటలు నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్న రోజుల నాటి విషయాన్ని వివరిస్తాయి. వాటిని యధాతథంగా చదవండి.

"భారత ప్రభుత్వానికి ఉక్కు కవచంలా ఉండే ఇండియన్ సివిల్ సర్వీసెస్‌ను తర్వాత కాలంలో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌గా మార్చడం జరిగింది. ఇది భారత ప్రగతి పథానికి ప్రేరణ శక్తిగా మారలేకపోయింది. పలు ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడానికి పూర్తి సహాయ సహకారాల్ని అందించలేక పోయింది. ఇందిరాగాంధీ హయాంలో నిబద్ధ ఉద్యోగి బృందం (కమిటెడ్ బ్యూరోక్రసి) సంగతి కూడా ఇంతే. ఉత్పత్తి రంగంలో ప్రభుత్వ నియంత్రణలు దోషభూయిష్టంగా మారాయి. విద్యుదుత్పాదన, ఉక్కు తయారీ వంటి రంగాల్లో కన్నా మానవ వనరుల అభివృద్ధి, విద్య, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక భద్రత, సంక్షేమ వంటి విషయాలపైనే ప్రభుత్వం శ్రద్ధవహించడం మంచిది. నాలుగు దశాబ్దాల సోషలిస్టు తరహా మనకు నష్టజాతకంగా మారింది. ప్రపంచంలో ద్రవ్యలోటు అత్యధికంగా ఉన్న దేశాల్లో మనది ముందుంది. మన దేశానికి సంబంధించినంతవరకు ఇది చెడ్డ పరిణామం. ఋణాల స్వీకారానికి జవహర్‌లాల్‌నెహ్రూ శ్రీకారం చుట్టారు. ఋణభారం ఇంతింతై





వటుడింతై అన్నతీరుతో పెరిగిపోయింది. ఇంకా జన్మించని శిశువు కూడా ఈ ఋణభారాన్ని భరించాల్సిన దుస్థితి ఏర్పడింది. జాతీయ రెవెన్యూలో ఋణాల బరువు పెరిగిపోయింది. తడిసి మోపెడంత అయిపోయింది. ఉత్పత్తిపై నియంత్రణలు అధికమయ్యాయి. వస్తు సేవల రంగంలో రాజకీయ వేత్తల బ్యూరోక్రాట్ల ప్రాధాన్యం బాగా పెరిగిపోయింది. వీళ్ళు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే రోజులు వచ్చాయి. బీదలకు, అణగారిన వర్గాల వారికి సేవల్ని అందించడమే రాజకీయాల లక్ష్యం కావాలని గాంధీజీ పిలుపునిచ్చారు. పీటర్ డ్రూకర్ అన్నట్టు "హోదాలన్నీ అధికారానికే ఉద్దేశించినవి కావు. అవి బాధ్యతలను కూడా పైన వేస్తాయి" ఈ సూత్రం భారత రాజకీయ వేత్తలకు, బ్యూరోకాట్ల దగ్గరికి వచ్చే వరకు నిష్కామంగానే మారింది. దీన్ని వాళ్ళు అవగాహనలోకి తెచ్చుకోలేకపోయారు. గరీబీ హటావో వంటి శుష్క నినాదాలు రాజకీయవేత్తలు, బ్యూరోక్రాట్లకు వీనుల విందయ్యాయి. దీనితో వాళ్ళు బాగా ప్రయోజనాన్ని పొందారు. బీదలు మరింత బీదలుగా మారిపోయారు. కొంత మంది భాగ్యవంతులు మాత్రం కొత్తగా స్విస్ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. ఇదీ నెహ్రూగారి సోషలిస్టు విధానాల పర్యవసానం. నిజానికి గరీబీ హటావో అంటే బీదరికాన్ని నిర్మూలించడం. కానీ వాస్తవంలో ఇది తలకిందులైపోయింది. గరీబ్ (బీదసాదలు) హటావోగా మారిపోయింది.

నెహ్రూ దేశానికి అవసరమైన పరమ ప్రాధాన్యతల్ని గురించి సరిగ్గా అంచనాకు రాలేదు. జాతీయ క్రమశిక్షణ, దేశీయ శీలసంపద వంటి అంశాలపై నెహ్రూ కంటి తుడుపుగానే వ్యవహరించారు. సింగపూర్ ఒక చిన్న నగర దేశం. సింగపూర్ ఎంతో ఆలస్యంగా తన ఆర్థిక పునర్నిర్మాణాన్ని ఆరంభించింది. సింగపూర్‌కు దీర్ఘకాలం పాటు ప్రధానిగా ఉన్నారు లీక్వాన్‌యు (ఎల్.క్యు.వై). ఆయన ఆ దేశానికి ఎంతోకాలం ప్రధానిగా పని చేసి ప్రస్తుతం సిటిజన్ ఎమరిటస్‌గా ఉన్నారు. ఆయన నెహ్రూవలె ఆకర్షణీయమైన నినాదాల్ని, సూత్రాల్ని ప్రవచించలేదు. స్వప్నాల్లో మాత్రమే సాధ్యమయ్యే లక్ష్యాల్ని ఎంపిక చేసుకోలేదు. నెహ్రూ మరణించిన దశాబ్దం తర్వాత అంటే 1974 మే 18వ తేదీన ఆయన ఆర్థిక పునర్నిర్మాణానికి అంకురార్పణ చేశారు. సింగపూర్‌లో సాంకేతిక శిక్షణా సంస్థను స్థాపించేందుకు ముందుకు వచ్చిన జె.ఆర్.డి.టాటాకు లీక్వాన్‌యూ కృతజ్ఞతలు చెప్పుకున్నారు. సింగపూర్ విజయ రహస్యమేమిటని టాటా అడిగి తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన విషయాలు ఇలా ఉన్నాయి.

"ఎల్.క్యూ.వై. మాది చిన్న దేశమే. అయినా మేము మా ప్రగాఢ ప్రభావాన్ని ప్రసరించగలుగుతున్నాము. విధానాల్లోని స్పష్టత మా పురోగతికి దోహదం చేస్తోంది. మేం చేపట్టిన విధానాలపై విమర్శలు వెలవడుతున్నాయి. అయితే రాజకీయ స్థిరత్వం, కఠినమైన క్రమశిక్షణ అత్యవసరం. శాంతి భద్రతల పరిస్థితి దిగజారితే ఏమవుతుందో 60వ దశకం నాటి అనుభవాలు మాకు తేల్చి చెప్పాయి".

"మాది చిన్న దేశం. అందుకని రిస్క్‌తో కూడిన ప్రయోగాలు చేయలేము. సరళీకరణ విషయానికి ఇదే వర్తిస్తుంది. అందువల్ల క్రమశిక్షణనే మా పురోగతికి జీవ ధాతువుగా ఎంపిక చేసుకున్నాము. ఈ విషయంలో ఎలాంటి ప్రయోగాలకు చోటు లేదు. రాజీలకు వీలులేదు".

"ప్రపంచలోని సాంకేతిక పెట్టుబడి ప్రవాహాలు సింగపూర్ చేరుకునేందుకు అనుమతించారు. మేము విదేశీ సాంకేతికతలు, పెట్టుబడులపై శోధనలు సాగించాల్సి వచ్చింది. అంటే ఈ నేపథ్యంలో సింగపూర్ వాసుల గుర్తింపు క్షీణతను పొందేందుకు వీలు లేదు. మాది బహుజాతి సమాజం. క్రమశిక్షణ మా రాజకీయ ఆర్థిక విలువల్ని పటిష్టంగా మలిచే సాధనంగా రూపొందింది".

నవ సింగపూర్ నిర్మాత ఎల్.కె.వై (లీక్యూన్‌హ్యూ) గారి సందేశం సమాజంలోని మూలమూలలా వ్యాపించింది. ఇది భారతదేశంలో ప్రథమ ప్రధాని నెహ్రూ ఆయన కుమార్తె శ్రీమతి ఇందిరాగాంధీ హయాంలలో జరిగిన దానికి పూర్తి భిన్నం. చివరకు ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి విధించేందుకు కూడా నిశ్చయించారు. ఇక మరోమారు సింగపూర్ పునర్నిర్మాణ అనుభవాల్ని ఎల్.కె.వై ఎలా వివరిస్తున్నారో చదవండి.

"నాయకులు, ఉన్నత స్థాయి అధికారులు, విధాన నిర్ణేతలు తప్పకుండా ఖచ్చితమైన క్రమశిక్షణను పాటించాల్సి ఉండేది. విచారణా వ్యవహారాలు పకడ్బందీగా సాగేవి. సింగపూర్ ప్రజానీకం మావో అవినీతి రాహిత్యాన్ని, నిష్పక్షపాత వైఖరిని చూడాలన్నదే తపనగా ఉండేది. మేము మా అత్యున్నత స్థాయి ఉద్యోగి బృందానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చాము. మేము చైనీయుల "మాండరిన్ సంస్కృతి"ని కూడా కీలకమైన అంశంగానే పరిగణించాము. ఒక రకంగా చెప్పాలంటే మాండరిన్ సంస్కృతి మాకు వెన్నెముకగా నిల్చింది"

"మా దేశంలో సివిల్ సర్వీసుల్లో ఉన్నవారి జీత భత్యాలను ఉత్తమ శ్రేణి ప్రైవేటు కంపెనీల్లో పని చేసే వారి జీతాలతో సమం చేశాము. అంటే, ఈ చర్య





ద్వారా మాత్రమే సామర్థ్యాన్ని విశ్వసనీయ విలువల్ని పెంచుతామని కాదు, అయితే మాకు అవసరమైన ప్రతిభావంతులు అందుబాటులోకి వచ్చేందుకు ఈ చర్య దోహద పడుతుంది. ప్రతిభావంతుల నుండి గరిష్ఠ స్థాయి సామర్థ్యాన్ని విశ్వసనీయ విలువల్ని రాబట్టుకునేందుకు వీలు అవుతుంది"

"ముందుగా రాజకీయ స్థిరత్వానికి పాదులు వేశాము. అటు తర్వాత సమర్థవంతమైన విశ్వసనీయ ఉద్యోగ బృందాన్ని రూపొందించుకున్నాము. అటు తర్వాత మాత్రమే ప్రైవేటు సంస్థలు మా దేశంలో తమ వ్యాపార కార్యకలాపాల్ని నిర్వహించేందుకు అంగీకరించాము"

పై విషయాలన్నింటినీ, జాగ్రత్తగా విస్తృత పరిధిలో వివరించేందుకు అభిలషిస్తున్నాను. సృజనాత్మక సామర్థ్యం ఉన్నవారు మా దేశాన్ని బలోపేతం చేస్తే అందుకు వారికి స్వాగతం పలుకుతాం. కఠోర పరిశ్రమ సాగించే వారికి అవసరమైన ప్రోత్సాహకాలు ఉంటాయి. ఆలోచనల్ని అందించే వారికి కావల్సినంత డిమాండ్ ఉంటుంది. రిస్క్‌లకు ఇష్టపడే వారికి ప్రోత్సాహం అందుతుంది.

"సింగపూర్‌లో ఉన్న భారత సంతతి వారిని చూడండి. వీళ్ళు భారతదేశంలో ఉన్న తమవారి కన్నా పెద్దగా సామర్థ్యమున్న వారని నేను అనుకోను. అయితే సింగపూర్‌లో ఉన్న భారత సంతతి వారు తమ సామర్థ్యాన్ని కఠోర పరిశ్రమను బయటపెట్టేందుకు తగిన వాతావరణం ఉంది. రాజకీయ స్థిరత్వం, చక్కని ఉద్యోగి బృందం, ప్రోత్సాహకాలతో ముడిపడిన ఆర్థికరంగం వారికి మంచి వాతావరణాన్ని అందించాయి. బహుశా ఈ కారణాల వల్లనే సింగపూర్‌లోని భారత సంతతి తమతమ కార్య రంగాల్లో ముందంజ వేశారు".

"సింగపూర్‌లో మా ప్రభుత్వాలు ఆర్థిక రంగాన్ని స్వయంగా నడిపించవు. అయితే ఆ రంగం తనంత తానుగా కదిలేందుకు ప్రయత్నిస్తాయి. అన్ని రంగాల్లోనూ ప్రైవేటీకరణ పనికి రాదు. ఉదాహరణకు గృహ నిర్మాణ రంగమే ఉంది. అక్కడ ప్రభుత్వ ప్రమేయం ఉంటుంది. ఆర్థిక రంగాన్ని నిరోధించే అవకాశాలు, నిబంధనలు లేనే లేవు. సింగపూర్ ప్రభుత్వం కొన్ని సేవా రంగాల్ని, పరిశ్రమల్ని ఆరంభించినా, వాటిని తిరిగి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు మాత్రం వెనకాడబోము".

ఎల్.కె.వై. చెబుతున్న సంగతులన్నీ నెహ్రూ విధానాలకు పూర్తి భిన్నం. నెహ్రూ ఆర్థిక రంగంపై ప్రభుత్వ పెత్తనాన్ని ప్రోత్సహించారు. ఆర్థిక ప్రణాళికల్లో

ఇదే కన్పిస్తుంది. నెహ్రూ "ది డిస్కవరీ ఆఫ్ ఇండియా" రాస్తున్నప్పుడే సోషలిస్టు ఆర్థిక వ్యవస్థకు అవసరమైన బ్లూ ప్రింట్‌ను కూడా రూపొందించారు. అయితే ఎల్.కె.వై. అంచనాలు భారతదేశానికి సైతం పనికి వస్తాయా అని ప్రశ్నించారు జె.ఆర్.డి.టాటా. దీనికి ఎల్.కె.వై జవాబు ఇలా ఉంది.

" మా విధానాలు సింగపూర్‌లో బాగా పనిచేశాయి. మేము పన్నుల ప్రోత్సాహకాల్ని చక్కని ఉదార కొలమానాలతోనే అందిస్తున్నాము. ఏడు నుండి పది సంవత్సరాల పాటు టాక్స్ హాలిడేస్‌ను ప్రకటిస్తున్నాము. మేము ప్రైవేటు సెక్టర్‌పై కొన్ని నియంత్రణల్ని ఏర్పర్చాము. అయితే నియంత్రణలు మాత్రమే పెత్తనాన్ని చెలాయించే పద్ధతులు లేవు. మేము పాటించిన పద్ధతుల వల్ల పన్నుల రూపేణా వచ్చే ఆదాయం పెరుగుతూ పోయింది. దీనితో ప్రతి ఏటా కొత్త ఉద్యోగాల్ని అందించే వెసులుబాటు ఏర్పడింది. బీదలు ఇలాగే ఉద్యోగావకాశాల్ని పొందారు. పేదవారికి సబ్సిడీలు కూడా దక్కాయి".

"సింగపూర్ ప్రభుత్వం ప్రావిడెంట్ ఫండ్ పథకాల్ని ఏర్పాటు చేసింది. దీనివల్ల మా ఉద్యోగులు స్వయంగా పొదుపు చేసుకోవడం సాధ్యమైంది. తాము పని చేసే కంపెనీలు అందించే పొదుపునకు ఇది అదనం. పొదుపు వల్లనే చాలా మందికి స్వంత ఇళ్ళు ఏర్పాటయ్యాయి. తమ భవిష్యత్తు కోసం పొదుపు చేసుకోవడం అలవాటు కావాలి"

"సామాజిక భద్రతను ఏకమొత్తంగా ప్రభుత్వాలే భరించాలన్న దానితో నేను అంగీకరించను. అయితే వ్యక్తిగత పొదుపు గరిష్ఠ స్థాయికి చేరుకునే పరిస్థితుల్ని కల్పించాల్సి ఉంటుంది. ఈ రోజు సింగపూర్ పొదుపు రేటు ప్రపంచ స్థాయిలో అత్యధికంగా ఉంది. మా దేశంలోని కార్మికుల్లో 30 శాతం మంది మాత్రమే అద్దె ఇళ్ళలో ఉంటున్నారు. మరో దశాబ్దానికల్లా 80 శాతం మంది స్వంత ఇళ్ళలో ఉండాలన్నది మా లక్ష్యం"

"ఒక అభివృద్ధి చెందుతున్న దేశం భారీ అభివృద్ధి రేటుతో మునుముందుకు సాగడం సాధ్యమేనా?" అని ప్రశ్నించారు జె.ఆర్.డి.టాటా.

"ఏం, ఎందుకు సాధ్యం కాదు? మీరే చూడండి, కొద్ది రోజుల్లోనే ప్రపంచంలోని దేశాలన్నీ ఒక దాని తర్వాత మరొకటి తమ పెరుగుదల రేటును పెంచుకుంటూ పోతాయి. వాటి జాతీయాదాయం వృద్ధి అవుతుంది" అన్నారు





ఎల్.కె.వై. భారతదేశంలో జనాభా పెరుగుదల ఒక పెను సమస్యగా ఉన్నదని అన్నారు జె.ఆర్.డి.టాటా. దీనికి కూడా ఎల్.కె.వై జవాబు చెప్పారు.

"మీ దేశంలో ఇప్పటికి 3 నుండి 3.5 శాతం మాత్రమే అభివృద్ధి రేటు ఉంది. ఇక మీ జనాభా వృద్ధి రేటు మాత్రం 2.2 శాతంగా కన్పిస్తోంది. ఆగ్నేయాసియా దేశాలు తమ తలసరి ఆదాయాన్ని రెండింతలు చేసుకున్నాయి. దీనికోసం ఈ దేశాల వారికి 9 – 12 సంవత్సరాలు పట్టింది. మీ తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేసుకునేందుకు మీకు 35 – 40 సంవత్సరాలు అవసరమవుతుంది. కాలం ఆగడం లేదు. అది వేగంగా సాగిపోతోంది. మీ దేశంలోని నవ యువత అంతా వలస పోతోంది. మీరు వీరికి అవసరమైన ఆర్థిక సంబంధ వాతావరణాన్ని రూపొందించాల్సి ఉంటుంది. వారు తమ దేశానికి చేతనైన చేయూత నందించేటట్టుగా పరిస్థితుల్ని తీర్చిదిద్దాలి".

"మేం మా విదేశాంగ విధానాన్ని రూపొందించుకున్న సమయంలో మీ దేశంపై భారీ ఆశలు నిలుపుకున్నాం. భారత్ పురోగతిలో శరవేగాన వెళుతుందనీ, ఒక శక్తివంతమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని అనుకున్నాం. చైనా ఆర్థిక వ్యవస్థ చట్రంలో బిగించి ఉన్నవేళ, భారత్ ఆసియాలో జపాన్‌కు పోటీదారుగా అవతరిస్తుందని ఆశించాము".

అయితే భారత్ పరిస్థితులు ఎలా ఉన్నాయని భావిస్తున్నారని ఎల్.కె.వై ని ప్రశ్నించారు జె.ఆర్.డి.టాటా.

"మీ దేశంపై ఏ రకమైన తీర్పునిచ్చే హక్కు నాకు లేదు. అయితే మీ దేశం అంతర్గతంగా ఉన్న ప్రతిభా సంపదల్ని గుర్తించడం లేదు. ప్రతిభా సంపద ఉన్న వారికి సరియైన రివార్డులు దక్కడం లేదు. మీ దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని నాకు తెలుసు. ఇదే సమయంలో మీ దేశం చక్కని సామర్థ్యమున్న దేశమనే సంగతి కూడా నాకు తెలుసు".

"సోదాహరణకు; ప్రస్తుతం మీ దేశంలో సోషలిస్టు తరహా ఆలోచనలు రాజ్యమేలుతున్నాయి. సోషలిజం ఆర్థికాభివృద్ధికి దోహదకారి కాదు. అది బీదరిక నిర్మూలనపై ఎలాంటి ప్రభావాన్ని చూపలేదు. మీ దేశంలోని ఒక రాష్ట్రంలో కొత్త ప్రయోగానికి అంకురార్పణ చేయండి. ఆ రాష్ట్రంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించండి ప్రయోగాత్మక స్థాయిలో అక్కడ విజయాన్ని సాధిస్తే అది యావద్భారత దేశంలోనూ అమలులోకి తేవచ్చు".

ఎల్.కె.వై చెప్పిన మాటలు సర్దార్‌పటేల్ సరిగ్గా తన సోషలిస్టు మిత్రబృందంతో చెప్పినవే. ఒకవైపు సోషలిస్టు వ్యవస్థనూ, మరోవైపు ప్రైవేటు రంగాన్ని ప్రవేశపెట్టి ఏ తరహా అభివృద్ధిని సాధిస్తుందో చూడాలని సూచించారు పటేల్. ఒకచోట జరిగిన ప్రయోగం చక్కని విజయాన్ని సాధిస్తే మిగతా దేశాలు కూడా వాటినే అనుకరిస్తాయని చెబుతున్నారు. ఎల్.కె.వై. నెహ్రూ చెబుతున్న సోషలిజం పునాదులు నియంత్రణల్లో ఉన్నాయని ప్రోత్సాహకాలకు ఇందులో తావు లేదని అభిప్రాయపడ్డారు ఎల్.కె.వై. "ఈ తరహా సోషలిజంలో ఆర్థికరంగంపై రాజకీయ వేత్తలు, బ్యూరోక్రాట్ల పెత్తనం పెరుగుతుంది. ఈ తరహా సోషలిజం ప్రభుత్వ నియంత్రణలకు ద్వారాలు తెరుస్తుంది. సరైన ఆర్థిక వ్యవస్థను, తగిన వాతావరణాన్ని నిర్మించడం ఈ తరహా సోషలిజం ప్రథమ ప్రాధ్యాన్యత కానేకాదు.

"ప్రస్తుత తరహా సోషలింజలో పేదరిక నిర్మూలనను సాధించడం మీ వల్ల కాని పని, పేదలకు ప్రత్యేక పథకాలు అవసరమనే మీ ప్రభుత్వ విధానం సరియైనదే, అయితే రాజకీయవేత్తలు, ఉద్యోగి బృందం పెత్తనం మధ్య వీటిని సాధించడం సాధ్యం కాదు. మీ సోషలిజం ఛాయా చిత్రంలోకి పేదల ప్రవేశం జరగదని మాత్రం నేను చెప్పగలను" అన్నారు ఎల్.కె.వై. "షాప్ ఫ్లోర్ సోషలిజాన్ని" ఆహ్వానించాలని అన్నారాయన. ఈ తరహా సోషలిజం విన్నూత్న గృహాలు, పాఠశాలలు ఏర్పాటయ్యేందుకు దోహదం చేస్తుంది. గణనీయమైన ఆర్థికాభివృద్ధి వల్లనే షాప్ ఫ్లోర్ సోషలిజం వస్తుందని ఎల్.కె.వై అభిప్రాయపడ్డారు. మార్కెట్ శక్తులు బాగా పుంజుకున్న తర్వాత సంపద పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ఏర్పడిన మొత్తం నుండి బీదలకు సబ్సిడీలు (గృహ నిర్మాణం, వైద్యం, విద్య వంటి వాటికి) అందించవచ్చునని అభిప్రాయపడ్డారాయన. ఆర్థికాభివృద్ధి ద్వారానే వనరుల సౌలభ్యం ఏర్పడుతుందనేది ఎల్.కె.వై స్పష్టాభిప్రాయం. ఆర్థిక రంగంపై నియంత్రణలు పెను ప్రమాదాల్ని తెచ్చి పెడతాయని ఆయన నిష్కర్షగా చెప్పారు.

ఆగ్నేయాసియి దేశాలన్నీ శర వేగంతో ముందుకు సాగాయి. అద్భుత ప్రగతిని సాధించుకున్నాయి. "నెహ్రూ సోషలిస్టు క్రమాన్ని" అనుసరించిన భారతదేశం వెనుకడుగువేసింది. 1991 నాటికి మాత్రమే సరళీకరణ ప్రాధాన్యతను భారతదేశం గుర్తించింది. 1956లోనే సరళీకరణ తరహాను అనుసరించిన థాయ్‌లాండ్, మలేసియా లాంటి దేశాలు ఎంతో ప్రగతిని సాధించాయి.





సంపదను సృష్టించని పక్షంలో దరిద్ర్యాన్ని మాత్రమే పంచడం జరుగుతుందని నెహ్రూ విమర్శకులు అంటూ ఉండేవారు. మన ప్రణాళికా లక్ష్యాలు విఫలమయ్యాయి. సామాజిక న్యాయాన్ని అందించడంలోనూ నెహ్రూ విఫలమయ్యారు. బీదలు మరింత బీదలయ్యారు. ఋణాలు తీసుకోవడం పెరిగిపోయింది. వ్యవస్థ యావత్తూ దోపిడీలకు దారి తీసేదిగా తయారైంది. బ్యూరోక్రసి రాజకీయ బంధనాలు పెరిగిపోయాయి. దేశం ఋణాల ఊబిలోకి వెళ్ళిపోయే పరిస్థితులు వచ్చాయి. ప్రణాళికా సంఘం అధినేత బాధ్యతలు కూడా నిర్వహించిన నెహ్రూ కొన్ని కీలకాంశాల్ని అంచనాలోకి తీసుకోలేదు. తలకు మించిన పన్నుల వ్యవస్థ, ప్రణాళికేతర వ్యయం, ప్రభుత్వ వ్యయాల గురించి ఆయన ఆలోచించలేదు. ఈ మేరకు 1957 జూన్ 2వ తేదీనాడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ (భారత ప్రథమ రాష్ట్రపతి) నెహ్రూకు ఒక లేఖ రాశారు.

రెండవ పంచవర్ష ప్రణాళికలో భారీ పథకాలకు రూపకల్పన చేసినా వాటి పర్యవేక్షణకు పటిష్టమైన బృందాలు అవసరమని రాజేంద్రప్రసాద్ సూచించారు. ఇవి రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ఏర్పాటు కావాలని ఆయన అన్నారు. సరియైన ప్రోత్సాహాల్ని అందించి పథకాల నిర్వాహకుల నుండి గరిష్ఠ స్థాయిలో పనిని రాబట్టుకోవాలని కూడా రాజేంద్రప్రసాద్ తన లేఖలో సూచించారు. లేకుంటే భారీ మొత్తంలో కేటాయించిన నిధులు ఏటిపాలు అవుతాయని భారత ప్రథమ రాష్ట్రపతి ఆందోళన వెలిబుచ్చారు.

లీ క్యూన్ హ్యూ (ఎల్.కె.వై) అభిప్రాయాలు విన్న తర్వాత నెహ్రూ అనుసరించిన మార్గంలోనే లోపాలు స్పష్టంగా అవగాహనలోకి వస్తాయి. నెహ్రూ ఆయన వంశీయులు చెప్పిన ఆకర్షణీయమైన నినాదాలకు ప్రతిభావంతులైన భారత జనత మైమరచిన వైనం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. శుష్క నినాదాల్ని ప్రచారం చేయడంలో రేడియో, టీవీ.పత్రికా మాధ్యమాల్ని బాగా వాడుకున్నారు. నెహ్రూ, ఇందిరాగాంధీల పోషణలో ఎదిగిన కమ్యూనిస్టు కుహనా మేధావులు ఈ ప్రచార బాధ్యతల్ని నిర్వమించారు. నెహ్రూ సామ్యవాదం, స్టాలిన్ తరహా ధోరణులకు కాలం చెల్లిపోయింది. శుష్క నినాదాలతో పబ్బం గడిపినవారు అందుకు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ప్రసార భారతి, ఇందిరాగాంధీ నేషనల్ ఆర్ట్ సెంటర్(ఐ.జి.ఎన్.ఎ.సి)ల్లో సంస్కరణలు దీనినే సూచిస్తున్నాయి.

# జవహర్‌లాల్ రోయేగా

**డిసెంబర్ 20 - 26, 1999**

జార్జి వాషింగ్టన్, బెంజమిన్ ఫ్రాంక్లిన్, థామస్ జెఫర్సన్‌లు అమెరికాలో జన్మించిన మహోన్నత నాయకులు. బ్రిటీష్ పాలన నుండి అమెరికా స్వాతంత్ర్యాన్ని సాధించే నేపథ్యంలో ఈ నేతల పాత్ర ఎంతో గొప్పది. పై ముగ్గురూ అమెరికా అధ్యక్ష పదవిని అలంకరించారు. అమెరికా వారు ఈ నాయక త్రయాన్ని సమానంగానే తమ స్మృతి పథాల్లో పదిల పర్చుకున్నారు. అయితే భారత జాతీయోద్యమం తాలూకు స్మృతులు అందుకు భిన్నంగా ఉఆన్నయి. ఇక్కడ స్వాతంత్ర్య సమరంలో ఎందరో పాల్గొన్నారు. అయితే జవహర్‌లాల్ నెహ్రూకు వచ్చిన గుర్తింపు, ప్రచారం మరెవరికీ దక్కలేదు. మిగతా దేశాల్లో శిఖర స్థాయిని చేరుకున్న మహా నాయకులు ప్రధాని పదవిని, రాష్ట్రపతి హోదాని అందుకున్నారు. వీరెవరూ వంశ పారంపర్య పాలన కోసం యత్నించిన దాఖలాలు లేవు. కానీ భారతదేశ దృశ్యం అందుకు భిన్నం. ప్రస్తుతం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేదు. కాంగ్రెస్ ఛాయలు ఏ మాత్రం సోకని రాజకీయ పక్షం నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అందువల్లనే నవభారత సమైక్య కర్త, భారత బిస్మార్క్ స్వర్గీయ సర్దార్ వల్లభాయి పటేల్ స్మృతుల్ని నెమరు వేసుకునే అవకాశం కలుగుతోంది. వంశపారంపర్య పాలనా సంస్కృతికి శ్రీకారం చుట్టిన జవహర్‌లాల్ నెహ్రూ – ఉక్కు మనిషి సర్దార్ పటేల్‌ల మధ్య ఉన్న భేదాల్ని గురించి చర్చించే వీలు చిక్కుతోంది. ఉప్పు సత్యాగ్రహాన్ని విజయవంతంగా నిర్వహించిన దక్షుడు పటేల్. గాంధీ ఆదేశాలపై నిర్వహించబడిన ఈ సత్యాగ్రహం దండిమార్చ్ పేరుతో చరిత్ర పుటల్లో సుస్థిర స్థానాన్ని సాధించుకున్నది. బార్డోలీ రైతాంగం పన్నుల నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నేత సర్దార్ పటేల్. ఆయన రైతాంగం ఉద్యమానికి పిలుపునిచ్చినప్పుడు అందులో ముస్లిం, పార్సీలు కూడా పాల్గొన్నారు. భారత జనతలోని సమైక్యతను చాటి చెప్పారు. 1936లో ప్రాంతీయ అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేసిన సేనాపతి సర్దార్‌పటేల్. స్వాతంత్ర్యానికి పూర్వం సర్దార్‌పటేల్ అహమదాబాద్ మున్సిపాలిటీ ఛైర్మన్‌గా ఉండేవారు. అసాధారణ పరిపాలనా ప్రజ్ఞను చూపించారు పటేల్. భారతీయుడు సమాజంలోని అన్ని





వర్గాల సంక్షేమం కోసం కృషి చేయగల సత్తా ఉన్న వాడని నిరూపించి చూపారాయన. గాంధీకి విశ్వాసపాత్రుడైన కొద్దిమంది సహచరుల్లో సర్దార్ పటేల్ ఒకరు. గాంధీజీ ప్రవచించిన స్వరాజ్య, స్వాభిమాన, స్వావలంబన సిద్ధాంతాల్ని త్రికరణ శుద్ధిగా విశ్వసించారు పటేల్. ఆయనకు దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే ఏకాగ్రత ఎక్కువ. విదేశాల్లో జరుగుతున్న సంఘటనలు, వివిధ భావజాలాలు, కాల్పనిక ప్రపంచం – వీటిల్లో పటేల్ ఏ మాత్రం ఆసక్తిని చూపలేదు. ఈ వ్యాఖ్య చేస్తున్నంత మాత్రాన పటేల్‌కు ఆ విషయాలేవి తెలియదని కాదు. అయితే భారతదేశాన్ని భారతీయులే పునర్నిర్మించుకోవాలన్నది పటేల్ ఆశయంగా ఉండేది. దీనికి భారతీయుల వారసత్వం సాంస్కృతిక సంప్రదాయాలు ఊతంగా ఉండాలని ఆయన ప్రగాఢంగా విశ్వసించారు. స్టాలిన్ రూపొందించే పంచవర్ష ప్రణాళికల కథా కమామిషు, స్పెయిన్ పౌర యుద్ధం కథలు ఇవేవీ పటేల్‌కు ఆసక్తిని కలిగించలేదు. భారత ఏకత, సమైక్యతలు మాత్రమే పటేల్ ముందు ప్రధాన లక్ష్యాల రూపంలో కదలాడేవి. కాంగ్రెస్ పార్టీ మొత్తంలోనూ అందరికీ అందుబాటులో ఉండే ప్రజానేతగా కీర్తిని సాధించారు సర్దార్‌పటేల్. భారత గ్రామీణ ప్రజానీకం పటేల్‌ను ఆరాధించారు, అభిమానించారు. ఆయన గ్రామీణ ప్రజానీకం భాషలోనే మాట్లాడేవారు. ఆయన వారి సమస్యల్ని శ్రద్ధగా ఆలకించేవారు. పటేల్ ఏనాడూ ఒక పండితుడిగానో, యూనివర్సిటీ ఆచార్యుడి తరహాలోనో ప్రవర్తించలేదు. సామాన్యుడిలో ఒకరిగా కలిసిపోయారు.

ద్విజాతి సిద్ధాంతాన్ని పటేల్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. భారతీయ ఏకతలో ప్రగాఢ విశ్వాసాన్ని ప్రదర్శించారు. ఇలాంటి మహా నాయకుడు భారత విభజనకు ఎలా అంగీకరించాడన్నది ప్రజనీకానికి విస్మయాన్ని కలిగించే అంశం. తాత్కాలిక ప్రభుత్వం (1946 – 1947) లో పటేల్ గృహమంత్రి. తాత్కాలిక ప్రభుత్వంలో చేరేందుకు తొలుత ముస్లింలీగ్ నిరాకరించింది. అటు తర్వాత కొద్ది రోజులకు ప్రభుత్వంలో భాగం పంచుకున్నది. లియాకత్ అలీఖాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖను చేపట్టారు. ముస్లిమేతరులు ప్రాధాన్యతను సంతరించుకున్న రంగాల వెన్ను విరిచేందుకు తన అధికారాన్ని ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ మంత్రుల ప్రతిపాదనలకన్నింటికీ లియాకత్ వీటో పాడేవారు. ఆర్థికమంత్రి అనుమతి లేకుండి ఏదీ మంజూరు అయ్యే అవకాశం లేదు. అన్నింటికన్నా మిన్న ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్యా పిలుపు. పశ్చిమ

బెంగాల్‌లో ప్రత్యక్ష చర్యకు పిలుపునిచ్చింది. భారత విభజనకు ఒత్తిడి తెచ్చింది. అప్పట్లో ముస్లింలీగ్ నేత హెచ్.ఎస్.సుహ్రావర్ది పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఆయన 1946 ఆగస్ట్ 15వ తారీఖున ప్రత్యక్ష చర్యా దినంగా ప్రకటించారు. ఆ ఒక్కరోజునే కలకత్తా నగరంలో పదివేలమంది హిందువులు ఊచకోతకు లోనయ్యారు. ప్రత్యక్ష చర్యా దినం సందర్భంగా దేశవ్యాప్త మతకల్లోలాలు మొదలయ్యాయి. శాంతి భద్రతలనేవి రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశాలు. కేంద్ర హోంమంత్రి హోదాలో సర్దార్ పటేల్ ఈ ఊచకోతల ఘట్టాన్ని నివారించేందుకు చేయగలిగేది తక్కువ. ముస్లింలీగ్ పౌర యుద్ధానికి సిద్ధమవుతున్నదనే అంతిమ నిశ్చయానికి వచ్చారు పటేల్. ఈ నేపథ్యంలో భారత పాకిస్తాన్ విభజన తక్కువ ప్రమాధకారి అవుతుందని భావించారాయన. కె.ఎం.మున్షీజీని "అఖండీ" (విభజన వ్యతిరేకవాది) గా పరిగణించేవారు. ఆయన "దేశ విభజన ఏ విధంగా ఉపయోగకారి అవుతుందని" సర్దార్‌పటేల్‌ను ప్రశ్నించారు. "ముస్లింలు ఈ దేశంలో పౌర యుద్ధానికి తయారవుతున్నారు. హిందువులు నిరాయుధులు. హిందువులు స్వీయ రక్షణ కోసం ఆయుధ పాణులుగా మారడాన్ని గాంధీజీ వ్యతిరేకిస్తారు. ప్రస్తుత తరహా పౌర యుద్ధంలో నిరాయుధ హిందువులు అంతిమ విజేతలు కావచ్చు. అయితే దీనికి 20 – 25 సంవత్సరాలు పడుతుంది. అప్పటికి భారతదేశం పరిస్థితి కకావికలమవుతుంది. మన స్వీయరక్షణ కోసం ముస్లింలకు హాని చెయ్యడాన్ని సైతం గాంధీజీ అంగీకరించరు" అని జవాబిచ్చారు పటేల్. విభజన పొందిన భారతంలో సాయుధ ముస్లిం దురాక్రమణ తత్వాన్ని పటేల్ నిలువరించగలరా అన్నది మున్షీజీ వేసిన ప్రశ్న. దీనికి సర్దార్ ఇలా జవాబు చెప్పారని తెలుస్తోంది. "అవిభక్త భారతంలో ఢిల్లీలో ఉన్న గృహమంత్రికి రాష్ట్ర వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారం లేదు. శాంతి భద్రతల పరిరక్షణ రాష్ట్రాల బాధ్యత. విభక్త భారతానికి హోంమంత్రి హోదాలో నేను సైన్యం సహకారాన్ని తీసుకోగలను. మత కల్లోలాన్ని అణచివేసి అందరికీ రక్షణ కలిగిస్తాను" ఇదీ పటేల్ సమాధానం. పటేల్ విభజనపై ఒక అంచనాకు వచ్చారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా విభజన వల్ల తక్కువ నష్టమే ఉంటుంది. కనుక దానికి అంగీకరించారు. కాంగ్రెస్ సమావేశాల్లో తన అభిప్రాయాన్ని ప్రకటించారు. (మౌంట్ బాటన్ ప్రభావంతోనూ) ఇతర కారణాల వల్ల కూడా నెహ్రూ దేశ విభజనకు అంగీకరించారు. దేశ విభజన జరిగింది.





500 కు పైగా ఉన్న సంస్థానాల్ని భారత యూనియన్‌లో విలీనం చేయడం సర్దార్‌పటేల్ మహత్తర ఘనత. భారత దేశాన్ని జాతీయ రాజ్యంగా రూపొందించిన ఘనత సర్దార్‌పటేల్‌కు దక్కుతుంది. ఆయనకు సాటి ఒక బిస్మార్క్ మాత్రమే. 1870లలో బిస్మార్క్ 22 జర్మన్ రాజ్యాల్ని ఏకం చేశారు. ఒక్క ఆస్ట్రియా మాత్రమే అప్పటి ఏకీకృత జర్మనీలో భాగస్వామి కాలేదు.

భారతదేశంలో జమ్మూకాశ్మీర్ కూడా సమస్యాత్మకంగానే పరిణమించింది. దీనికి పటేల్ ఏ మాత్రం కారణం కాదు. అప్పట్లో ట్రావెంకర్, జునాఘర్, హైదరాబాద్ సంస్థానాల విలీనం జటిలమైన సమస్య. లార్డ్‌మౌంట్‌బాటన్, జవహర్‌లాల్ నెహ్రూ వంటివారి సహాయ సహకారాల్ని అందుకోకుండానే ఈ భారీ సంస్థానాల్ని భారత విలీనం చేయించారు పటేల్. అయితే జమ్మూకాశ్మీర్ వ్యవహారంలో సర్దార్ జోక్యం చేసుకోకుండా చేశారు. జమ్మూకాశ్మీర్ విలీన సమస్యను పండిట్ నెహ్రూ తన తల పైకెత్తుకున్నారు. షేక్ అబ్దుల్లా, పండిట్ నెహ్రూలు కలిసి కాశ్మీర్ మహారాజును మోసగించారన్న అభిప్రాయం ఉంది. అబ్దుల్లా, నెహ్రూ సన్నిహిత మిత్రులు. భారత్‌లో కాశ్మీర్ విలీన ప్రక్రియ మందకొడిగా ముందుకుపోయింది. నెహ్రూ కాశ్మీర్ వ్యవహారంపై తీసుకున్న నిర్ణయాల మీద మౌంట్‌బాటన్ నీలినీడలున్నాయి. ప్రజాభిప్రాయ సేకరణ (ప్లెబిసైట్)కు నెహ్రూ మద్దతు తెలిపారు. కాశ్మీర్ మహారాజా అందుకు అంగీకరించలేదు. ఈ మేరకు, షేక్ అబ్దుల్లా సైతం ప్లెబిసైట్‌కై పట్టుబట్టినట్టు లేదు. ప్లెబిసైట్ కనుక జరిగితే దాన్ని పర్యవసానాలు ఎలా ఉంటాయన్నది సర్దార్‌కు బాగా తెలుసు. ముస్లిం జనాధిక్యత ఉన్న కాశ్మీర్‌లో ప్లెబిసైట్ జరిగితే, అయితే పాకిస్తాన్ చేరాలనీ, లేదా స్వతంత్ర్యంగా జీవించాలనే స్థానికులు కోరుకుంటారనేది పటేల్‌కు తెలియని విషయం కాదు. జునాగర్, హైదరాబాద్ వంటి పెద్ద సంస్థానాల్ని భారతదేశంలో విలీనం చేస్తున్నప్పుడు పటేల్ ప్లెబిసైట్ పదాన్ని తన దరి చేరనీయలేదు.

మహారాజా జమ్మూకాశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసిన మరునిముషాన, పరిణామాలు ఎలా మారతాయో పటేల్ ఊహించాడు. అప్పుడిక భారత పాకిస్తాన్‌ల మధ్య తప్పనిసరిగా యుద్ధం జరుగుతుందని ఆయన అంచనావేశారు. నిజమే, ఉభయ దేశాల మధ్య యుద్ధం జరిగితే ఎలా? భారత భూభాగాల నుండి శ్రీనగర్‌కు కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేదు. పఠాన్‌కోట్ – జమ్మూ మార్గం ప్రయాణాలకు అనుకూలించదు. ఈ నేపథ్యంలో సేవల్ని ఉపయోగించుకోవాలనుకున్నారు సర్దార్.

పఠాన్‌కోట్ నుండి జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల దాకా రోడ్డు వేయించారు. ఈ రహదారి రికార్డు సమయంలో అంటే 60 రోజుల్లో పూర్తి అయిపోయింది.

సర్దార్ సలహాల్ని పెడచెవిన పెట్టిన నెహ్రూ కాశ్మీర్ సమస్య అంతర్జాతీయం కావడానికి దోహదకారి అయ్యారు. కాశ్మీర్ వ్యవహారం ఐక్యరాజ్యసమితి గుమ్మంలోకి వెళ్ళింది. కాశ్మీర్ సరిహద్దుల్లోకి చొరబడ్డ పాక్ ముష్కర మూకల్ని భారత సైన్యం తరిమికొట్టింది. కొద్ది రోజుల్లో పాక్ సంపూర్ణ పరాజయాన్ని చవి చూడవల్సి వచ్చేది. ఈ దశలో భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించడం భలే విచిత్రం. భారత వీరకిశోరాల త్యాగాలు వృధా అయ్యాయి. జవహర్‌లాల్ నెహ్రూ, కాశ్మీర్ సమస్యను ఐక్యరాజ్యసమితి ముందు పెట్టారు. నెహ్రూ ఈ నిర్ణయాన్ని తీసుకోవడం వెనుక లార్డ్‌మౌంట్‌బాటన్ తప్పుడు సలహా దాగి ఉంది. అప్పటికి ఐరాసలో ఆంగ్లో – అమెరికన్ శక్తుల ఆధిపత్యం ఏర్పడి ఉంది. కాశ్మీర్ సమస్యను ఐక్యరాజ్యసమితికి నివేదించడం ద్వారా నిఖిల ప్రపంచ ప్రశంసలు పొందాలని నెహ్రూ అనుకున్నారు. ఐరాస వలలో పడిపోయారు నెహ్రూ. గత ఐదు దశాబ్దాలుగా కాశ్మీర్ సమస్య కార్చిచ్చువలె ఆరిపోకుండా మండుతోంది. మరింత స్వయం ప్రతిపత్తిని అందించడం ద్వారా కాశ్మీర్ చిచ్చుకు ఆజ్యం పోశారు నెహ్రూ. 370 అధికరణాన్ని విన్నూత వీరంగా అందించారు. ఒక్క కాశ్మీర్ మాత్రమే కాదు దేశంలోని 500 పైగా స్వదేశీ సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనమయ్యాయి. ఈ సంస్థానాధిపతులకు, ఆయా ప్రాంతాలకు ఎలాంటి తాయిలాల్ని ప్రసాదించలేదు. అలాంటిది కాశ్మీర్‌కు ప్రత్యేక సౌకర్యాల్ని చేకూర్చడం వెనుక మతలబు ఏమిటి? 370 అధికరణాన్ని రాజ్యాంగంలో చేర్చుతున్నప్పుడు తొలిదశలో కాంగ్రెస్ దీన్ని వ్యతిరేకించింది. నెహ్రూ, గోపాలస్వామి అయ్యంగార్‌ను తన మంత్రి వర్గంలోకి చేర్చుకున్నారు. ఆయనకు జమ్మూకాశ్మీర్ వ్యవహారాల్ని అప్పగించారు. నిజానికి సర్దార్‌పటేల్ నేతృత్వంలోని హోంమంత్రిత్వ విభాగమే జమ్మూకాశ్మీర్ అంశాల్ని కూడా పర్యవేక్షించాలి. అయ్యంగార్ వంటి పునాదులు లేని నాయకుడికి బదులుగా సర్దార్ పటేల్‌నే జమ్మూకాశ్మీర్ వ్యవహారల ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తే సరిపోయేది. అయితే జాతీయతను నరనరాన జీర్ణించుకున్న పటేల్ ప్రధాని నెహ్రూ నిర్ణయంపై చింతించలేదు. జమ్మూకాశ్మీర్ స్వయం ప్రతిపత్తిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతున్న వేళ పలువురు నెహ్రూ దృక్పథాన్ని ఖండించారు. పటేల్ చర్చల్లో లేరు. నెహ్రూ నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని గోపాలస్వామి అయ్యంగార్ నిర్ధారించారు. విదేశీ పర్యటనలో





ఉన్న నెహ్రూకు ఆయన ఈ విషయాన్ని నివేదించుకున్నారు. అప్పుడు నెహ్రూ ఈ విషయంలో సర్దార్ పటేల్ సహకారాన్ని తీసుకోవల్సిందిగా అయ్యంగార్‌ను కోరారు. నిజంగా ఇది ఎంతో చాకచక్యంతో వేసిన రాజకీయ ఎత్తుగడ. జవహర్‌లాల్ నెహ్రూతో తాను ఏ విషయంలోనూ విభేదించనని అంతకు చాలాకాలం ముందే గాంధీకి వాగ్దానం చేశారు పటేల్. ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రముఖుల్ని తిరిగి సమావేశపర్చారు. నెహ్రూ అభిమతాన్ని బలపర్చాల్సిన అవసరం గురించి వివరించారు. గోపాలస్వామి అయ్యంగార్ వైపు తిరిగి “జవహర్‌లాల్ రోయేగా” (జవహర్‌లాల్ నెహ్రూ ఏడుస్తారు) అని వ్యాఖ్యానించారు పటేల్. 370 అధికరణం భారతదేశానికి గొప్ప చేటును తెచ్చి పెడుతుందనే సత్యం ఆయనకు బాగా తెలుసు. పటేల్ తొందరలోనే స్వర్గాన్ని చేరుకున్నారు. ఆయన మరణానంతరం సుదీర్ఘ కాలం పాటు నెహ్రూ ప్రధానిగా ఉన్నారు. ప్రధాని నెహ్రూకు 370 అధికరణం పరిణామాలు కన్నీళ్ళు తెప్పించాయి. కాశ్మీర్ వ్యవహారం “ఏక్ దేశ్‌మే దో నిషాన్, దో ప్రధాన్ ఔర్ దో విధాన్”గా మారింది. భారత వ్యతిరేకతను రంగరించుకున్న విదేశీ శక్తుల అండదండలతో షేక్ అబ్దుల్లా కాశ్మీర్ స్వతంత్రాన్ని గురించి మాట్లాడసాగారు. శుక్రవారాల్లో తాను జరిపే మసీదు ప్రసంగాల్లో కాశ్మీర్ వేర్పాటును గురించి నొక్కి చెప్పేవారు అబ్దుల్లా. కాశ్మీర్ స్వాతంత్ర్యాన్ని ఏ శక్తీ అడ్డుకోజాలదని అనే వారు అబ్దుల్లా. చివరకు ఆయనను ఆయన గాఢ స్నేహితుడు జవహర్‌లాల్ నెహ్రూ జైలులో పెట్టాల్సిన పరిస్థితులు వచ్చాయి.

370 అధికరణంలో స్వయం ప్రతిపత్తి అనే ఛత్రచాయ ఏర్పడింది. ఈ నేపథ్యంలో అనేక జాతి వ్యతిరేక కార్యకలాపాలు ముమ్మరమయ్యాయి. కాశ్మీరీలకు రెండు పౌరసత్వాలు పరిణమించాయి. ఒకటేమో కాశ్మీర్ పౌరసత్వం మరొకటి భారత పౌరసత్వం. కాశ్మీరీ దేశంలోని ఏ మారుమూలలోనైనా ఆస్తులు కొనగోలు చేయవచ్చు. కానీ మిగతా భారతదేశంలో నివసించే పౌరుడు మాత్రం కాశ్మీర్‌లో అంగుళం భూమి కొనేందుకు హక్కు లేదు. ముస్లిం ఆధిక్యత ఉన్న కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి ఉంది. అయితే హిందూ మెజారిటీ ఉండే జమ్మూకు మాత్రం అదిలేదు. బౌద్ధుల జనాభా ఎక్కువగా ఉండే లడక్‌లోనూ ఇదే పరిస్థితి. యాభై ఏళ్ళ తర్వాత కూడా ప్రత్యేకత కోరుతున్న మరింత స్వయం ప్రతిపత్తి కావాలని ఆరాటపడుతున్నారు. నిజానికి భారత రాజ్యాంగ రూపకల్పన జరుగుతున్న వేళ 370 అధికరణాన్ని తాత్కాలిక

ఉపకరణంగానే నిర్ణయించారు. పార్లమెంట్‌లో కొందరు ప్రశ్నలు సందించినపుడు 370 అధికరణం క్రమేపి కనుమరుగవుతుందని నెహ్రూ హామీ ఇచ్చారు. జమ్మూకాశ్మీర్, భారత్‌ల మధ్య దూరం ఉండదని ఆయన అన్నారు. అయితే ఈ రోజు మనం చూస్తున్న జమ్మూకాశ్మీర్ దృశ్యం నెహ్రూ వాగ్దానాలకు భిన్నంగా ఉంది. అక్కడ వేర్పాటువాదం రాజ్యమేలుతుంది. తీవ్రవాదం స్వైర విహారం చేస్తుంది. జమ్మూకాశ్మీర్ అభివృద్ధి కోసం కోట్లు ఖర్చు చేసినా ఫలితం గుండు సున్నగా మిగిలింది. ఇప్పుడు అలనాడు పటేల్ పలికిన (జవహర్‌లాల్ రోయేగా) పలుకులు విస్పష్టంగా గుర్తుకు వస్తున్నాయి. 370 అధికరణం ఏర్పాటు కాశ్మీర్ విలీనం విషయంలో నెహ్రూ అనుసరించిన తప్పుడు ఎత్తుగడల కారణంగా ఇప్పుడు యావద్భారత దేశమే రోదించే పరిస్థితులు ఉన్నాయి. అంతర్జాతీయ వ్యవహారాలలో తనకు నైపుణ్యం ఉందని నెహ్రూ ఏనాడూ ప్రశ్నించుకోలేదు. నెహ్రూ మాత్రం అంతర్జాతీయ విషయాలలో తనకు తానే సాటని అనుకునేవారు. భారతదేశంపై చైనా అనుసరిస్తున్న దుష్ట వ్యూహాలను గురించి నెహ్రూకు వివరించారు పటేల్. హితవాక్యాలు పలికారు నెహ్రూ, అయితే పటేల్ సముచిత సలహాను పెడచెవిన పెట్టారు నెహ్రూ, చైనా మనకు మిత్ర దేశం అని అది మనపై దురాక్రమణకు తలపడదనే భ్రమలో ఉండిపోయారు నెహ్రూ. 1962 దురాక్రమణ నెహ్రూ అంచనాలను పటాపంచలు చేసింది.

భారతదేశానికి విధేయత ప్రకటించే ఇక్కడి ముస్లింలందరికీ పటేల్ ఒక నిజమైన మిత్రుడు. అయితే హైందవ వ్యతిరేకతతో ఘనీభవించిన ముస్లింలీగ్ తరహా వేర్పాటువాద ముస్లింలను హెచ్చరించడంలో పటేల్ ఏనాడు వెనకాడలేదు. దేశంలో మరో ముస్లిం రాజ్యం ఏర్పాటు కోసం తాపత్రయపడే శక్తుల్ని ఆయన గట్టిగా హెచ్చరించారు. అయితే భారతదేశానికి విధేయులుగా ఉండాలని లేదా తాము సృష్టించుకున్న మరో దేశానికైనా వెళ్ళిపోవాలని అన్నారాయన. అందరినీ బుజ్జగిస్తూ పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలనే కాంక్ష పటేల్‌లో ఏ కోశానా లేకుండేది. ఆకాశవాణిలో సర్దార్ స్మారకోపన్యాసం చేస్తూ డా॥రఫిక్ జకారియా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. సర్దార్ చక్కని లౌకికవాది అని అన్నారు. జకారియా హిందూ ముస్లింల మధ్య ఎలాంటి పక్షపాతాన్ని చూపని నేతగా సర్దార్‌ను అభివర్ణించారు. జకారియా అయితే నెహ్రూ తరహా ఆలోచనా ధోరణిలో మునిగిపోయిన వామపక్ష,





ప్రజాస్వామ్య, సెక్యులర్ వర్గాలు మాత్రమే పటేల్ పేదల వ్యతిరేకి అని విమర్శిస్తూ వచ్చాయి. ఈ కువిమర్శలు 1940వ దశకం నుండే సాగుతున్నాయి. కాంగ్రెస్ సెక్యులర్, కమ్యూనిస్టు, ముస్లింలీగ్ వర్గాలే నిజానికి నిజమైన మతతత్వవాదుల సమూహాలు. భారత జాతీయ రాజ్యం సర్దార్ పటేల్ నిర్మాణం. ఈ రోసు కాంగ్రెస్ వేళ్ళ నుండి పుట్టని రాజకీయ పక్షాలు పటేల్ ఘనతను గుర్తిస్తున్నాయి. ఈ రోజు హైదరాబాద్ మరో జమ్మూకాశ్మీర్‌లా పరిణమించకపోవడం పటేల్ చేసిన పుణ్యఫలమే. నెహ్రూ వలెనే పటేల్ వంశపారంపర్య పాలన కోసం అర్రులు చాచలేదు. తన వంశీయులు త్యాగాల పేరుతో దేశానిన ఏలేందుకు రంగాన్ని సిద్ధం చేయలేదు. భారత అఖండతను సాధించిన ఈ మహత్తర దేశ భక్తున్ని గురించి భారతీయులు మరింత విస్తృతమైన అధ్యయాన్ని జరపాల్సి ఉంది.

**విద్య నిగూఢగుప్తమగు విత్తము రూపము పూరుషాళికిన్**
**విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశబంధుఁడు**
**విద్య విశిష్ట దైవతము విద్యకు సాటిధనంబు లేదిలన్**
**విద్య నృపాలపూజితము విద్య నెఱుంగనివాఁడు మర్త్యుఁడే.**

**భావం:** మనుజులకు విద్యయే దాచుకొనన ధనము. విద్యయే రూపమును, కీర్తిని దెచ్చును. సుఖింపజేయునది విద్యయే. దివ్య గురువు వంటిది. దేశాంతరముల కేగిన విద్యయే బంధువు. విద్యాధనమునకు దగిన ధనమీ ప్రపంచంలో లేదు. విద్యయున్న దేవుని సహాయమున్నట్లే. పండితులగు రాజులు విద్యను పూజింతురు. ఇటువంటి విద్య నెఱుంగని వాడు ద్విపాద బశువని చెప్పుదురు.

# అమెరికాలో నైతిక విలువల పతనం

**డిసెంబర్ 28 - జనవరి 3 , 2000**

అమెరికా తన జాతి చరిత్రలోనే అత్యంత సంక్లిష్టమైన దశల్లో ఒక దశను ఎదుర్కొంటుంది. అమెరికా సూపర్ పవర్ అనడంలో అనుమానం లేదు. ఆ దేశ సైనిక సామర్థ్యంగాని, ఆర్థిక సౌభాగ్యంగాని ఎవరూ సవాల్ చేయలేనివి. ఒకనాటి అమెరికా శత్రువు రష్యా (పూర్వపు సోవియట్ యూనియన్) తిండికి లేక తల్లడిల్లుతోంది. ఒకవేళ అమెరికా కనుక గోధుమల్ని పంపకపోతే ఈ శీతాకాలంలోనే మిలియన్ల మంది రష్యన్లు ఆకలితో చావడం ఖాయం. రష్యా ఆర్థిక వ్యవస్థ పల్టీలు కొడుతోంది. అమెరికాకు ధీటుకాగలదు అనుకున్న జపాన్ ఆర్థికరంగం సైతం అథోదశలోనే ఉంది. ఇక అమెరికాకు పోటీగా ఎదుగుతాయనుకున్న ఆసియన్ టైగర్లు చతికిలబడిపోయాయి. అక్కడ సామాజిక సంఘర్షణలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం అమెరికా ఆర్థిక, సైనిక భాగ్యాలు పతాక స్థితిలో ఉన్నాయి. (నిరుద్యోగం తక్కువ, ఆర్థిక పరిస్థితి బాగుపడుతుంది. ఈసారి మిగులు బడ్జెట్ కూడా తయారైంది). అయినా దేశాధ్యక్షుడు బిల్ క్లింటన్ అనైతిక ప్రవృత్తిని అమెరికన్లు చూడాల్సి వస్తుంది. రోమ్ నగరం ఇలాగే గతంలో నిండైన సంపదతో తులతూగుతూనే ఒకేసారి కుప్పకూలిపోయింది. దీనికి కారణం నాయకుల అనైతిక ప్రవర్తన. ఈ రోజు అమెరికా నాయకత్వంలో నైతిక మూల్యాల క్షీణతకు బిల్‌క్లింటన్ ఒక సంకేతంగా మారారు. నాగరికతలోని నాణ్యత, దాని సామాజిక, జాతీయ, దృఢతలకు నాయకత్వంలోని గుణగణాలే కారణమౌతుందని చరిత్ర చెబుతోంది. ప్రతినిదుల సభ (అంటే మన లోక్‌సభ లాంటిది) క్లింటన్‌ను ఇప్పటికి అభిశంసించింది.

గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆర్కాన్ సస్ అధికార గృహంలోనూ, ప్రస్తుతం వైట్‌హౌజ్‌లోనూ తనతో పని చేసే అందమైన అమ్మాయిలతో వివాహేతర సంబంధాలు పెట్టుకున్నందువల్లే క్లింటన్ అభిశంసన జరిగిందని చాలామంది అనుకుంటున్నారు. ఇది ఏ మాత్రం నిజం కాదు. చాలామంది అమెరికన్లు వివాహేతర సంబంధాలను గూర్చి అసలు పట్టించుకోరు. వివాహం తర్వాత విడాకులు అక్కడ మామూలు విషయం. అమెరికన్ సమాజంలో భార్యాభర్తలు ఒకరికి తెలియకుండా మరొకరు వివాహేతర సంబంధాలు పెట్టుకోవడం సహజమేనని అందరికీ తెలుసు. అయితే ఇదే విషయం భారతీయుల దృష్టిలో మాత్రం అతి హేయమైన అంశం. ఇలాంటి





సంబంధాలు వివాహ వ్యవస్థను దెబ్బతీస్తాయని భారతీయులు విశ్వసిస్తారు. స్థిరమైన కుటుంబం , ఆరోగ్యకరమైన సమాజానికి అత్యవసరమని భారతీయుల ప్రబల విశ్వాసం. అమెరికన్ పౌరులు దీనికి పూర్తిగా భిన్నం. నిజానికి బిల్‌క్లింటన్‌కి చాలామంది వనితలతో సంబంధం ఉండే ఉంటుంది. వీటిలో కొన్ని మాత్రమే వెలుగులోకి వచ్చాయి. ఒక మహిళ తనపై జరిగిన లైంగిక వేధింపులను గురించి ధైర్యంగా చెప్పడంతో డొంకంతా కదిలింది. ఈ నేపథ్యంలోనే మోనికా లూయిన్‌స్కీ కథ బయటికొచ్చింది. ఈ నిజాల్ని కప్పిపుచ్చేందుకు క్లింటన్ చేయని ప్రయత్నం లేదు. ఈ క్రమంలోనే గ్రాండ్ జూరీ ముందుకొచ్చాడాయన. తనకు మోనికాకు ఎలాంటి సంబంధాల్లేవని జూరీ ముందు సాక్షమిచ్చాడాయన. దీన్ని విచారణ కర్తలు విశ్వసించలేదు. వీళ్ళలో ప్రముఖుడు కెన్నత్ స్టార్. ఆయన రికార్డుల దొంతరల్ని బయటకు తీసి సదరు మోనికాతోనే నిజాన్ని చెప్పించారు. దీనితో క్లింటన్ తప్పుడు సాక్షాల తీరు బట్టబయలైంది.

అమెరికా రాజ్యాంగం ప్రకారం అక్కడి కాంగ్రెస్ అధ్యక్షుడిని మామూలు మెజారిటీతో అభిశంసిచవచ్చు. క్లింటన్ గతి అలాగే అయ్యింది. ఆయన వివాహేతర సంబంధాల కన్నా సత్యాన్ని కప్పి పుచ్చేందుకు చేసిన ప్రయత్నాలే పలువురి విమర్శలకు లోనౌతున్నాయి. ఇక వందమంది సెనేటర్లు, అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో జరపాల్సిన విచారణ మిగిలి ఉంది. అక్కడ క్లింటన్‌ను వ్యతిరేకించే వారికీ, ఆయనను సమర్థించేవారికీ వాదనలు జరుగుతాయి. క్లింటన్ బహుశా పదవీచ్యుతి అనే గండం నుండి బయటపడవచ్చు. కాని క్లింటన్ వ్యవహారం యావత్తు ఎన్నో కొత్త పాఠాల్ని నేర్పుతుంది. ఒక శక్తివంతమైన దేశాధ్యక్షుడు మగువా వ్యసనానికి బానిస. అతను భయంకరమైన అబద్ధాల పుట్ట అని అంటే అమెరికా పౌరులే కాదు, ప్రపంచంలోని యావత్ మిత్రబృందం కూడా తలవంచుకోవల్సి వస్తుంది. ఇటు అభిశంసన నడుస్తూ ఉన్నప్పుడే అటు క్లింటన్ ఇరాక్‌పై బాంబుల వర్షాన్ని కురిపించాడు. అభిశంసన పర్వం నుండి అమెరికా ప్రజల దృష్టిని మరోవైపుకు మళ్ళించడమే క్లింటన్ వ్యూహం. అమెరికా రక్షణ బలగాలు అసత్యాలతో అభిశంసనకు లోనౌతున్న తమ దేశాధ్యక్షుడి ఆజ్ఞల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి! బహుశా సద్దాం హుస్సేన్ అన్న ఓ భయంకరమైన ప్రమాదకారి ముందు తాము చేస్తున్న తప్పులు తక్కువేనని అమెరికా మిత్రబృందం బ్రిటన్ సర్కార్ చెప్పుకుంటాయేమో.